# ప్రభుత్వ విత్త శాస్త్రము

## ఎం. ఏ. - ఎకనామిక్స్, మొదటి సంవత్సరం - మూడవ పేపరు

### రచయితలు


ఆచార్య జి. చంద్రశేఖరరావు, ఎమ్.ఎ, పి.హెచ్.డి.
ఎస్.వి.యు. పిజి సెంటర్,
కావలి

డా॥ ఎల్ క్రిష్ణవేణి, ఎమ్.ఎ, పిహెచ్.డి.
పి.జి. అర్థశాస్త్ర శాఖాధిపతి
సర్ సి.ఆర్. రెడ్డి కాలేజి, ఏలూరు

డా॥ వై. ఇందిరాకుమారి, ఎమ్.ఏ. పిహెచ్.డి.
అర్థశాస్త్ర విభాగాధిపతి
మారిస్ స్టెల్లా కళాశాల, విజయవాడ

సంపాదకులు

ఆచార్య బి. సాంబశివరావు, ఎమ్.ఎ,ఎమ్.ఎ, పి.హెచ్.డి.
అర్థశాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

సమన్వయకర్త :
డా॥ కె.మధుబాబు, య.ఏ.యం.ఫిల్,పిహెచ్.డి.,
అర్థశాస్త్ర విభాగము,
ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయము

*Director*
**Dr. NAGARAJU BATTU**
MBA.,MHRM.,LLM.,MSc.(Psy)MA(Soc).,M.Ed.,M.Phil.,Ph.D

దూర విద్యా కేంద్రము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510

Ph : 0863-2293299,(08645)211023,211024, Cell : 9848285518
E-mail : info@anucde.ac.in
Website : www.anucde.ac.in
www.anucde.info

**MA Economics : Government Finance**

Edition: 2021

No. of Copies : 135

(C) Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of Distance Education, Acharya Nagarjuna University and this book is meant of limited circulation only.

Published by :

**Dr. NAGARAJU BATTU**
Director
Centre for Distance Education
Acharya Nagarjuna University

Printed at :
**Romith Technologies**
Guntur.

# FOREWORD

Acharya Nagarjuna University, since its establishment in 1976, has been moving ahead in the path of academic excellence, offering a variety of courses and research contributions. The University achieved recognition as one of the eminent universities in the country by gaining A grade from the NAAC 2016. At present Acharya Nagarjuna University is offering educational opportunities at the UG, PG levels to students of 447 affiliated colleges spread over the two districts of Guntur and Prakasam.

The University had started the Centre for Distance Education in 2003-04 with the aim to bring Higher education within the reach of all. The Centre has been extending services to those who cannot join in colleges, cannot afford the exorbitant fees as regular students, and to housewives desirous of pursuing higher studies to study B.A., B.Com, and B.Sc., Courses at the Degree level and M.A., M.Com., M.Sc, M.B.A. and LL.M. courses at the PG level.

For better understanding by students, self-instruction materials have been prepared by eminent and experienced teachers. The lessons have been prepared with care and expertise. However constructive ideas and scholarly suggestions are welcome from students and teachers. Such ideas will be incorporated for the greater efficacy of the distance mode of education. For clarification of doubts and feedback, Weekly classes and contact classes are arranged at UG and PG levels respectively.

I wish the students who pursue higher education through Centre for Distance Education will not only be personally benefited by improving their qualifications but also strive for nation's growth by being a member in Knowledge society I hope that in the years to come, the Centre for Distance Education will grow in strength by introducing new courses, catering to the needs of people. I congratulate all the Directors, Academic coordinators, Editors, Lesson - Writers, and Academic Counsellors and Non-teaching staff of the Centre who have been extending their services in these endeavours.

Professor Rajasekhar P.
Vice-Chancellor (FAC)
Acharya Nagarjuna University

# PAPER - III
# GOVERNMENT FINANCE

**1. Introduction**

Nature and Scope of Public Finance - Relation of Public Finance with other subjects - Political and Economic Setting - Choice of policies and their implementation - Principle of Maximum Social Advantage.

**2. Role of Government**

Changing perspective about role of government in organised society - Government in a mixed economy - Public sector and Private sector : Co-operation or competition - Planning for economic development - Budget as a means of operationalising the planning process - Government failures.

**3. Public Revenue**

Sources and classification of Public Revenue - Principles of taxation - Types of Taxes and their impacts on the economy - Benefit and ability to pay principale - Canons of Taxation. Characteristics of a good tax system - Shifting and incidence of Taxation Distribution of Tax Burden - Taxes on Income and commodities.

**4. Public Expenditure :**

Classification and its effects on the Economy - Theory of Social goods.

**5. Public Debt :**

Burden and its repayment - Principles of Public Debt Management - Public Debt and Economic Development

**6. Budget**

Balanced and unbalanced Budgets - The impacts of the size and the content or budgets - Budgetary policy - Its objectives and instruments - Theory of optimum budget - Budgetary trends.

**7. Fiscal Policy**

Objectives and Instruments - Fiscal Policy in a planned developing economy.

**8. Federal Finance**

Principles - Union - State financial relations - Union Finance revenues and Expenditures - State finance : Revenues and Expenditures - Finance Commissions and their working.

**9. Local Finance**

Problems and prospects - Functions - Finances - Taxation

**Reading List :**

1. Richard A Musgrave, Theory Public Finance, 1961.
2. R.A. Musgrave and Musgrave, Public Finance in Theory and Practice, 1980.
3. R.M. Musgrave and C. Shoup (ed) Readings in Economics of Taxation.
4. Raja J. Chellaiah, Fiscal Policy in under - Developed countries, George Allen Unwin, Bombay 1971.
5. Government of India, India Tax Reform, 1971.
6. Government of India, Report of the Taxation Enquiry Commission, 1953-54.
7. W.L. David (ed) : Public Finance : Public and Economic Development Essays in honour of Lady Hicks, 1973.
8. K.V.S. Sastri, Federal State Fiscal relations in India. Oxford University Press, Bombay, 1966.
9. R.N. Tripathi, Fiscal Policy and Economic Development in India 1971.
10. H.Dalton, Principles of Public Finance, 1954.
11. U.K. Hicks : Public Finance, 1967.

**M.A. (Previous) DEGREE EXAMINATION, December 2005.**

First Year

Economics

**Paper III - GOVERNMENT FINANCE**

Time : Three hours

Maximum : 100 marks

**SECTION A** - ( 4 x 5 = 20 marks )

Answer any FOUR questions.

1. Relationship between Public Finance and Political Science.

   ప్రభుత్వ విత్త శాస్త్రమునకు రాజనీతి శాస్త్రమునకు సంబంధమేమి?

2. What is a Mixed Economy?

   మిశ్రమ ఆర్థిక వ్యవస్థ అనగానేమి?

3. Explain the benefit principle of taxation.

   పన్నులకు సంబంధించిన ప్రయోజన సూత్రమును వివరింపుము.

4. Classification of Public Expenditure.

   ప్రభుత్వ వ్యయమును వర్గీకరింపుము.

5. Budget Policy.

   బడ్జెట్ విధానము.

6. What is the concept of Fiscal Policy?

   కోశ విధానము అనగానేమి?

7. Redemption of Public Debt.

   ప్రభుత్వ ఋణ విమోచన.

8. Explain the functions of Local governments.

   స్థానిక సంస్థల విధులను తెలుపుము.

**SECTION B** - ( 5 x 7 = 35 marks )

Answer any FIVE of the following.

9. Canons of taxation.

   పన్నుల నియమాలు.

10. Income tax.

    ఆదాయ పన్ను.

11. Write a note on burdon of public debt.

    ప్రభుత్వ వ్యయ భారమును తెలుపుము.

12. Finance Commission.

    విత్త సంఘము.

13. What are the constitutional provisions for the finances of the State of India?

    రాజ్యాంగ ప్రకారం భారతదేశంలో ఒక రాష్ట్ర విత్తములు ఏవి?

14. Tax paying capacity.

    పన్ను చెల్లింపు సామర్థ్యము.

15. Explain the objectives of Public debt?
ప్రభుత్వ ఋణ ధ్యేయములు ఏవి?

16. Explain the various types of Budget.
వివిధ బడ్జెట్ రకాలను తెలుపుము.

17. What are the similarities of Public finance and Private finance?
ప్రభుత్వ, ప్రైవేటు విత్తముల పోలికలు ఏవి?

18. Zero based budgeting.
శూన్య ఆధార బడ్జెట్.

SECTION C - ( 3 x 15 = 45 marks )

Answer any THREE question.

19. Discuss the merits and demerits of Direct and Indirect taxes.
ప్రత్యక్ష, పరోక్ష పన్నుల సుగుణాలను, లోపాలను చర్చింపుము.

20. Explain the characterisitcs of good tax system.
మంచి పన్నుల విధానమును తెలుపుము.

21. Describe the Wagner's law of increasing the state activities.
వాగ్నర్ సిద్ధాంతమైన పెరుగుచున్న రాష్ట్ర కార్యక్రమాలను తెలుపుము.

22. What is meant by Public debt? Give reasons for the growing public debt in the Modern World.
ప్రభుత్వ ఋణము అనగానేమి? ఆధునిక ప్రపంచములో ప్రభుత్వ ఋణము పెరుగుదలకు కారణాలు తెలుపుము.

23. What are financial resources divided between centre and states in a federal structure?
సమాఖ్య నిర్మాణంలో కేంద్ర రాష్ట్రాల మధ్య విత్త వనరుల విభజన ఏవి?

24. Discuss the objectives of Fiscal Policy in a developing country.
అభివృద్ధి చెందుచున్న దేశాలలో కోశ విధాన ధ్యేయాలను చర్చించుము.

**M.A. (Previous) DEGREE EXAMINATION, May 2006**

First Year

Economics

**PAPER - III : GOVERNMENT FINANCE**

Time : Three hour

Maximum : 100 marks

***Answer any FIVE questions.***

***All questions carry equal marks. (5 x 20 = 100)***

1. Explain the importance of public choice in Democratic Governments.

   ప్రజాస్వామ్య ప్రభుత్వములలో "పబ్లిక్ ఛాయిస్" యొక్క ప్రాముఖ్యతను వివరింపుము.

2. What is budget? How does it help balanced growth?

   బడ్జెట్ అనగానేమి? అది ఒక దేశ సంతులిత వృద్ధికి ఏ విధముగా దోహదపడును?

3. What are the characteristics of good tax system?

   ఒక మంచి పన్ను విధానము యొక్క లక్షణములను వివరించుము.

4. Distinguish between Direct and Indirect Taxes.

   ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నుల మధ్యనగల తారతమ్యములను వివరింపుము.

5. Explain the effects of Public Expenditure on Economic development.

   ఒక దేశ ఆర్థిక అభివృద్ధిమీద ప్రభుత్వ వ్యయము యొక్క పాత్రను వివరింపుము.

6. What are the objectives of budget? Distinguish between balanced and unbalanced budget.

   బడ్జెట్ యొక్క ఆశయములను వివరింపుము. సంతులిత మరియు అసంతులిత బడ్జెట్‌ల మధ్యనగల తేడాలను వివరింపుము.

7. Explain how do Fiscal instruments control inflation and depression.

   ద్రవ్యోల్బణము మరియు ద్రవ్య మాంద్యములను కోశ విధానములు ఏ విధంగా నియంత్రిస్తాయో వివరించుము.

8. Explain the burden of Public debt in developing economies.

   అభివృద్ధి చెందుతున్న దేశములలో ప్రభుత్వ ఋణ భారమును గూర్చి వివరించుము.

9. Explain the reasons for the increase in State Expenditure in recent times.

   ఈ మధ్యన రాష్ట్ర వ్యయము పెరుగుటకుగల కారణములను వివరించుము.

10. Explain the Financial problems of Municipalities and suggest to improve their financial resources.

    పురపాలక సంస్థల విత్త సమస్యలను వివరించుము. వాటి విత్తవనరులను అభివృద్ధి పరచుటకు తగిన సలహాలు సూచించుము.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ప్రభుత్వ విత్త శాస్త్రం - స్వభావం, పరిధి | 1.1 - 1.14 |
| 2. | గరిష్ట సామాజిక ప్రయోజన సిద్ధాంతం | 2.1 - 2.13 |
| 3. | సంఘటిత సమాజములో - మారుతున్న ప్రభుత్వరంగ పాత్ర | 3.1 - 3.17 |
| 4. | ప్రణాళికా విధానాన్ని కొనసాగించుటలో బడ్జెట్ ఒక సాధనం-ప్రభుత్వ వైఫల్యాలు | 4.1 - 4.20 |
| 5. | ప్రభుత్వ రాబడి మార్గాలు మరియు వర్గీకరణ | 5.1 - 5.20 |
| 6. | పన్ను విధింపు - నియమాలు, సిద్ధాంతములు | 6.1 - 6.20 |
| 7. | పన్ను భారం మరియు బదలాయింపు | 7.1 - 7.17 |
| 8. | ప్రభుత్వ వ్యయం-సాంఘిక వస్తువుల సిద్ధాంతం | 8.1 - 8.21 |
| 9. | ప్రభుత్వ ఋణం - భారతదేశ ప్రభుత్వ ఋణం | 9.1 - 9.15 |
| 10. | బడ్జెట్ | 10.1 - 10.22 |
| 11. | కోశ విధానము | 11.1 - 11.18 |
| 12. | ఫెడరల్ విత్త విధాన సూత్రాలు - కేంద్ర రాష్ట్ర ఆర్థిక సంబంధాలు | 12.1 - 12.14 |
| 13. | ఫైనాన్స్ కమీషన్‌ల ప్రతిపాదనలు - ఒక సమీక్ష | 13.1 - 13.14 |
| 14. | కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ వ్యయాలు | 14.1 - 14.19 |
| 15. | స్థానిక విత్తం | 15.1 - 15.15 |
| 16. | కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ విధానము | 16.1 - 16.20 |

పాఠం - 1

# 1. ప్రభుత్వ విత్త శాస్త్రము - స్వభావము - పరిధి

## పాఠ్య నిర్మాణ క్రమం


1.0 ఉద్దేశాలు

1.1 ఉపోద్ఘాతం

1.2 ప్రభుత్వ విత్త శాస్త్రం - నిర్వచనాలు

1.3 ప్రభుత్వ విత్త శాస్త్రం మరియు ముఖ్యాంశాలు

1.4 ప్రభుత్వ విత్తం, ప్రైవేటు విత్తంకుగల పోలికలు, తేడాలు

1.5 ప్రభుత్వ విత్తం - విస్తృత పరిధి

1.6 ప్రభుత్వ విత్త శాస్త్రం ధనాత్మక శాస్త్రమా? లేక ఋణాత్మక శాస్త్రమా?

1.7 ప్రభుత్వ విత్త శాస్త్రం - ఇతర శాస్త్రాలతోగల సంబంధం

1.8 రాజకీయ మరియు ఆర్థిక ఏర్పాటు

1.9 విధానాల ఎంపిక వాటి అమలు తీరు

1.10 సారాంశం

1.11 ముఖ్య పదాలు

1.12 స్వయం సమీక్ష ప్రశ్నలు

1.13 చదవవలసిన పుస్తకాలు


## 1.0 ఉద్దేశాలు

ఈ పాఠ్యభాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది అంశాలను తెలుసుకోగలరు.

ఎ) ప్రభుత్వ విత్త శాస్త్ర నిర్వచనాలు మరియు అందులోగల ముఖ్యాంశాలు, ప్రభుత్వ, ప్రైవేటు విత్తాలకుగల పోలికలు, తేడాలను విశదీకరింపగలగాలి.

బి) ప్రభుత్వ విత్త పరిధి - ప్రభుత్వ విత్త శాస్త్రం ధనాత్మక శాస్త్రమా? లేక రుణాత్మక శాస్త్రమా? ప్రభుత్వ విత్త శాస్త్రానికి ఇతర శాస్త్రాలతోగల సంబంధాన్ని వివరింపగలగాలి.

సి) ప్రభుత్వ విత్త విధానాలలో రాజకీయ మరియు ఆర్థిక ఏర్పాటు, విత్త విధానాల ఎంపిక, అమలు తీరును విశదీకరింపగలగాలి.

## 1.1 ఉపోద్ఘాతం :

ప్రభుత్వం తన విధులు నిర్వర్తించాలంటే ముందుగా కావాల్సింది విత్తం. సమాజంలో ప్రతివ్యక్తి ప్రభుత్వ సేవల వలన ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రయోజనం పొందుతూనే వుంటాడు. కాబట్టి ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం కొన్ని కీలకమైన బాధ్యతలను విధిగా చేపట్టవలసి వుంటుంది. సామాజిక భద్రత, రక్షణ, రైల్వేలు, భారీ ఎలక్ట్రికల్స్, అణుశక్తి, విద్యుఛ్ఛక్తి, నీటి సప్లయి, మొదలగు అంశాలన్నీ ప్రభుత్వమే చేపట్టి ప్రజల అవసరాలను తీర్చాలి. ఇంకా విద్య, ఆరోగ్యం, పారిశుద్యం, వైద్యం, సురక్షిత త్రాగునీరు మొదలగు సామాజిక అవసరాలను తీర్చాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. అందువలన ఈ విధులన్నీ నిర్వర్తించాలంటే ప్రభుత్వానికి సరిపడినంత ఆర్థిక వనరులు కూడా వుండాలి. ప్రభుత్వ విత్త శాస్త్రం స్థూలంగా దేశ అవసరాలన్నింటి గురించి ఆలోచించి, అందుకుగాను ప్రభుత్వం తన విత్త

కార్యకలాపాలను ఏ విధంగా కొనసాగించాలో తెలియచేస్తుంది. వ్యక్తులు లాభాసేక్ష, స్వార్థంతో ఆలోచిస్తారు కాబట్టి కేవలం సూక్ష్మ సమస్యలను గురించే ఆలోచిస్తారు. కానీ ప్రజా సంక్షేమము, దేశ శ్రేయస్సులకై నిరంతరం శ్రమించే ప్రభుత్వాలు మాత్రం స్థూల సమస్యల పరిష్కారమే తమ విధిగా భావిస్తాయి.

ప్రభుత్వ విత్తం ముఖ్యంగా ప్రభుత్వం యొక్క ఆదాయం, మరియు వ్యయాల గురించి చర్చిస్తుంది. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు ఏవిధంగా ఆదాయాలను సమకూర్చుకోవాలి, వారి ఆదాయ మార్గాలయిన పన్నులు, పన్నులేతర అంశాలు కూలంకషంగా చర్చించబడతాయి. సాధారణ, పరిపాలన, సాంఘిక, ఆర్థిక సేవలనందించి ప్రజల దగ్గర నుండి కొంత రాబడిని పొందాలి కాబట్టి ప్రభుత్వం కేవలం పన్నులకే పరిమితం కాకుండా ఫీజులు, ధరల రూపంలో కూడా వసూలు చేస్తుంది. ఇంకా వ్యక్తుల నుండి, సంస్థల నుండి, అంతర్జాతీయ సంస్థల నుండి, విదేశాలనుండి కూడా రుణాలు సేకరించి తద్వారా దేశ ఆర్థిక వనరులలో వచ్చిన కొరతను కూడా పూడ్చుకొని తన విత్త కార్యక్రమాలను నిర్వర్తించాలంటే ప్రభుత్వం అతి కీలకమైన పాత్రను నిర్వహించాలి. రోజు రోజుకు పెరుగుతున్న బాధ్యతలను నిర్వర్తించాలంటే ప్రభుత్వానికి ఆర్థిక వనరులు సరిపోక దేశీయ, అంతర్జాతీయ అప్పులు తీసుకోవటం జరుగుతుంది. ప్రభుత్వం రక్షణ, శాంతి భద్రతలు కాపాడటం వంటి ముఖ్య విధులు నిర్వర్తించాలంటే తగిన ద్రవ్య వనరులను సమీకరించుకోవాల్సిన అవసరం ఎంతైనా వున్నది. ఏఏ మార్గాల ద్వారా ఆదాయం పొందవచ్చు? ఆ మొత్తాన్ని ఏ ఏ అంశాల మీద ఏ విధంగా వ్యయం చేయాలి? వ్యయ నియంత్రణ ఏ విధంగా చేయాలి? ఆదాయ వ్యయాల మధ్య ఏ విధంగా సమన్వయాన్ని తీసుకురావాలి? మొదలగు ప్రశ్నలన్నింటికీ ప్రభుత్వ విత్త శాస్త్రం సమాధానాలిస్తుంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆదాయాన్ని పన్నుల రూపంలో, ఇతర మార్గాలలో ఏ విధంగా పొందవచ్చు, వచ్చిన ఆదాయాన్ని దేశ అవసరాలు, ప్రాధాన్యతల దృష్ట్యా ఏ విధంగా వ్యయ కేటాయింపులు చేయాలి. అనే అంశాలు ప్రభుత్వ విత్త శాస్త్రంలో నిశితంగా చర్చించబడతాయి. ఆర్థిక వనరులు సరిపడినంత లేనపుడు ప్రభుత్వాలు దేశీయ, అంతర్జాతీయ అప్పులు తెచ్చి ప్రభుత్వ విత్త కార్యక్రమాలను నిర్వర్తించాల్సి వుంటుంది. అలాగే అప్పుల భారం పెరగకుండా నిరంతరం రుణయాజమాన్యం కూడా చేసుకోవలసి వుంటుంది. కాబట్టి ప్రభుత్వ విత్త శాస్త్రంలో ముఖ్యంగా ఈ క్రింది అంశాలుంటాయి.

1. ప్రభుత్వ రాబడి లేక ఆదాయం
2. ప్రభుత్వ వ్యయం
3. ప్రభుత్వ రుణాలు
4. ఋణ యాజమాన్యం

## 1.2. ప్రభుత్వ విత్త శాస్త్రము - నిర్వచనాలు

ప్రభుత్వ విత్త శాస్త్రము అతిపురాతనమైనది. అనేకమంది ఆర్థిక వేత్తలు వివిధ రకాలుగా విత్త శాస్త్రాన్ని నిర్వచించారు. వాటిలో ముఖ్యమైన నిర్వచనాలు ఈ క్రింద వివరించబడినాయి.

**డాల్టన్ :** ప్రభుత్వ విత్త శాస్త్రం ప్రభుత్వ ఆదాయ, వ్యయాల గురించి మరియు ఈ రెంటి మధ్యగల పరస్పర పర్దుబాటు గురించి చర్చిస్తుంది.

**ప్రొఫెసర్ లుట్జ్ :** ఆదాయాన్ని కస్టడీలో వుంచి, ప్రభుత్వ బాధ్యతలను నిర్వర్తించేందులకు వనరులను కేటాయింపు చేయటం గురించి ప్రభుత్వ విత్త శాస్త్రం చర్చిస్తుంది.

**కార్ల్ ప్లెన్ :** ప్రభుత్వం తన విధులను సక్రమంగా నిర్వర్తించాలంటే అందుకు కావలసిన వనరులను సంపాదించటం, ఆయా వనరులను కేటాయించటంకు సంబంధించిన కార్యక్రమాల గురించి తెలియజేయుటయే ప్రభుత్వ విత్త శాస్త్రం" అని కార్ల్ ప్లెన్ భావించాడు.

**ప్రొఫెసర్ పిన్లే షిరాస్ :** ప్రభుత్వం వనరులను సమీకరించుకోవటం, వ్యయం చేయటం వంటి కార్యక్రమాలను నిర్ణయించే సిద్ధాంతాల గురించి ప్రభుత్వ విత్త శాస్త్రం అధ్యయనం చేస్తుంది.

**ప్రొఫెసర్ బుచనన్ :** ప్రభుత్వాన్ని ఒకే యూనిట్‌గా' పరిగణించి అధ్యయనం చేయటమే ప్రభుత్వ విత్త శాస్త్రం. ముఖ్యంగా ప్రభుత్వ విత్త శాస్త్రం ప్రభుత్వం తన ఆర్థిక కార్యక్రమాలను నిర్వర్తించటం గురించి అధ్యయనం చేస్తుంది.

**బాస్టబుల్ :** ప్రభుత్వం యొక్క ఆదాయము, వ్యయాన్ని గురించి ప్రభుత్వ విత్త శాస్త్రం చదువుతుంది. ఈ రెంటికిగల సంబంధం, విత్త పాలన మరియు నియంత్రణ గురించి కూడా ప్రభుత్వ విత్త శాస్త్రం చర్చిస్తుంది.

పై నిర్వచనాలు పరిశీలించిన మీదట ప్రభుత్వ విత్తశాస్త్ర పరిధి ఆధునిక అర్థశాస్త్రవేత్తలచే బాగా విస్తృత పరచబడింది అని తెలియుచున్నది. వివిధ అర్థశాస్త్ర వేత్తలు వేరు వేరుగా నిర్వచించినప్పటికీ ప్రభుత్వ విత్త శాస్త్ర పరిధిలో పెద్దగా తేడాలున్నట్లు కనిపించటల్లేదు.

అన్ని నిర్వచనాలు కేంద్ర రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల ఆదాయ వ్యయాల గురించి కేంద్రీకృతమై వున్నాయి. వ్యక్తి చేయని చేయలేని అనేక విధులను ప్రభుత్వమే నిర్వహిస్తుందని కూడా తెలియుచున్నది. కాబట్టి ప్రభుత్వం తన వ్యయానికి సరిపడా ఆదాయాన్ని ఎలా సంపాదిస్తుంది అనే విషయమే ప్రభుత్వ విత్త శాస్త్రం అని భావించబడింది.

## 1.3. ప్రభుత్వ విత్త శాస్త్రం మరియు ముఖ్య అంశాలు :

ప్రభుత్వ విత్త శాస్త్రంలో ముఖ్యంగా మనం అధ్యయనం చేసే అంశాలేమిటో వివరంగా చర్చించాల్సిన అవసరం వున్నది. ప్రభుత్వ విత్త శాస్త్రంలో ఏఏ విభాగాలున్నాయని కూడా తెలుసుకోవాల్సి వున్నది. పై నిర్వచనాల ఆధారంగా ప్రభుత్వ విత్త శాస్త్రాన్ని ఈ క్రింది అయిదు విభాగాలుగా విభజించాల్సియున్నది.

ఎ) ప్రభుత్వ రాబడి లేక ఆదాయం
బి) ప్రభుత్వ వ్యయం
సి) ప్రభుత్వ రుణాలు లేక అప్పులు
డి) విత్త పరిపాలన మరియు నియంత్రణ
ఇ) కోశ విధానం

**ఎ) ప్రభుత్వ రాబడి లేక ఆదాయం :**

ప్రభుత్వం వేరు, వేరు మార్గాలనుండి ఆదాయం పొందే అవకాశం వున్నది. ముఖ్యంగా అధిక రాబడి పన్నుల ద్వారానే పొందుతుంది. ఆదాయాల మీద విధించే ప్రత్యక్ష పన్నులు, వస్తు, సేవలపై విధించే పరోక్ష పన్నుల వలన ప్రభుత్వం అధిక ఆదాయం పొందుతుంది. ఇంకా పన్నులేతర మార్గాల ద్వారా రాబడిపొందే అవకాశంగలదు. అలానే ప్రభుత్వ వ్యయం, రాబడి కంటే ఎక్కువగా వున్నప్పుడు లోటును పూరించేందులకు ప్రభుత్వం స్వదేశీ, విదేశీ రుణాలను కూడా సేకరించవచ్చు. అది కూడా సరిపోకపోతే ప్రభుత్వం రిజర్వు బాంకు సహాయంతో క్రొత్త ద్రవ్యాన్ని సృష్టించి ఆర్థిక వనరులను పెంచుకోవచ్చు. రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలకు లేనటువంటి విస్తృత అధికారాలు కేంద్ర ప్రభుత్వానికి తన ఆర్థిక వనరులు లేక రాబడిని పెంచుకోవటంలో వున్నాయి.

**బి) ప్రభుత్వ వ్యయం :**

ప్రభుత్వం తన విధులను నిర్వర్తించాలంటే కొంత మొత్తాన్ని వ్యయం చేయాల్సి వుంటుంది. కాబట్టి ప్రభుత్వం ముందుగా ఆదాయాన్ని పెంచుకొని, తద్వారా తన విధులను నిర్వర్తించేందులకు అయ్యే వ్యయాన్ని తట్టుకుంటుంది. వ్యక్తులు శ్రద్ధ వహించని, చేపట్టలేని సామాజిక, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వమే చేపట్టాలి. ఏ ఏ రంగం మీద ఎంత వ్యయం చేయాలి? వ్యయ ప్రభావం ఎలా వున్నది? వ్యయ ప్రయోజన విశ్లేషణ, బడ్జెట్‌లో వివిధ రంగాలకు ప్రాధాన్యతా క్రమంలో వ్యయం కేటాయింపు జరుగుతున్నదా? లేదా మొదలగు అంశాలన్నీ ఎప్పటికప్పుడు విశ్లేషణ చేసుకోవాల్సిన అవసరం వున్నది. ప్రభుత్వ వ్యయ ప్రభావం ఉత్పత్తి, వినియోగం, పంపిణీ, ఉద్యోగాలు, ఆదాయం, పెట్టుబడి, ధరల స్థాయిలపై ఎలా వున్నదో ఎప్పటికప్పుడు విశ్లేషించుకొని ఆర్థిక సుస్థిరత ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వ వ్యయం చాలా అవసరం. ప్రజా సంక్షేమాన్ని, దేశ ఆర్థికాభివృద్ధిని పెంచాలంటే ప్రభుత్వ వ్యయం ఒక ముఖ్య సాధనంగా పేర్కొనవచ్చును.

**సి) ప్రభుత్వ ఋణాలు లేక అప్పులు :**

ఆర్థిక వనరుల కొరత వున్నప్పుడు ప్రభుత్వం అప్పుల ద్వారా అదనపు వనరులను పొంది తన విధులను నిర్వర్తించవచ్చును. ఈ అప్పులు దేశీయ, అంతర్జాతీయ మార్గాల ద్వారా పొందవచ్చును. ప్రభుత్వ రుణంలో ముఖ్యంగా ఈ క్రింది అంశాల గురించి అధ్యయనం చేస్తాము.

1) ప్రభుత్వ రుణ పద్ధతులు, లక్ష్యాలు

2) ప్రభుత్వ రుణ యాజమాన్యము

3) ప్రభుత్వ రుణ భారము

ఎ) అంతర్గత రుణ భారము

బి) బహిర్గత రుణ భారము

పెరుగుతున్న ప్రభుత్వ వ్యయాన్ని తట్టుకోవాలంటే ప్రభుత్వం వద్ద సరిపడినంత ఆర్థిక వనరులు వుండకపోవచ్చును. ఈ సందర్భంలో ప్రభుత్వం రుణం ద్వారా అదనపు వనరులను సమకూర్చుకొని ఆర్థిక సుస్థిరతను సాధిస్తుంది. ద్రవ్యోల్బణ సందర్భంలో అంతర్గతంగా ప్రజల నుండి, సంస్థల నుండి, మార్కెట్ నుండి రుణాలు సేకరించి, తద్వారా ప్రజల దగ్గరున్న అధిక ఆర్థిక వనరులను ప్రభుత్వం తన చేతుల్లోకి తెచ్చుకొని సుస్థిరతను సాధించగలుగుతుంది. అలానే ఆర్థిక మాంద్యం సంభవించినపుడు తక్కువ వడ్డీకి ప్రభుత్వమే ప్రజలకు రుణాలిచ్చి ఉత్పత్తి లేక ఉపాధి కార్యక్రమాలు చేపట్టేటట్లు చేస్తుంది. తద్వారా ఆర్థిక మాంద్యం తొలగి ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. ఆర్థిక సుస్థిరత కూడా ఏర్పడుతుంది.

అయితే రుణభారం పడకుండా తక్కువ వడ్డీకి రుణాలు తెచ్చుకొని ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడాలి. షరతులు లేని రుణాలయితే ప్రభుత్వాలకు స్వేచ్ఛ వుంటుంది. రుణాలు తెచ్చిన మొత్తాన్ని వినియోగ అవసరాలను తీర్చేందులకు కాకుండా వుత్పత్తిని, ఉపాధిని పెంచే కార్యక్రమాలమీద వ్యయం చేస్తే రుణ చెల్లింపు భారం కూడా ప్రభుత్వం మీద అధికంగా పడదు.

**డి) విత్తపరిపాలన మరియు నియంత్రణ :**

ప్రభుత్వ విత్త శాస్త్ర పరిధి కేవలం ప్రభుత్వ ఆదాయం, ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ రుణానికే పరిమితం కాలేదు. ఏ విధంగా ఈ సాధనాలనుపయోగించాలి? విత్త పరిపాలనలో ప్రభుత్వం ఏఏ అంశాలకు ప్రాధాన్యత నివ్వాలి? మొదలగు అంశాలకు అధిక ప్రాధాన్యత నివ్వాల్సి వుంటుంది. ముఖ్యంగా ఈ క్రింది అంశాలపై ప్రభుత్వ విత్త పాలన నియంత్రణ కలిగియుండాలి.

ఎ) బడ్జెట్‌లు వాటి పని తీరులను అధ్యయనం చేయాలి :

బి) ఆర్థికాభివృద్ధి, ఆర్థిక సుస్థిరత, పరిపూర్ణ వుద్యోగిత, బలహీన వర్గాల సంక్షేమం, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించేందులకు వీలుగా అవస్థాపనా సదుపాయాలను అభివృద్ధి పరచటం మొదలగు నిర్ణీత లక్ష్య సాధనకు వీలుగా బడ్జెట్ సాధనాన్ని వినియోగించాలి.

సి) ప్రైవేటు పెట్టుబడులను వివిధ కోశ మరియు భౌతిక నియంత్రణల సాధనాల ద్వారా నియంత్రించి, తద్వారా ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్య ప్రభావాలను నిరోధించగలగాలి.

**కోశ విధానం :** ప్రభుత్వ విత్త శాస్త్రంలో అతి ముఖ్యమైన అంశం కోశ విధానంగా పేర్కొనవచ్చును. వ్యాపార చక్రాలగు ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం ఏర్పడినపుడు, ధరల అస్థిరతను తొలగించి, పరిపూర్ణ ఉద్యోగితను సాధించేందుకు, ఆర్థికాభివృద్ధి, ప్రజల సంక్షేమాలను ప్రోత్సహించేందులకు కోశ సాధనాలు బాగా ఉపకరిస్తాయి. పన్నులు, ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ రుణము, ఋణ యాజమాన్యం మొదలగునవి కోశ సాధనాలుగా పేర్కొనవచ్చును. కోశ విధానంలో ప్రత్యేకత ఏమిటంటే ఆర్థిక సుస్థిరతతోపాటు ఆదాయ, సంపదలలో వ్యత్యాసాలు తొలగించి ఆర్థిక సమానత్వాన్ని సాధించటం అని చెప్పవచ్చును.

## 1.4. ప్రభుత్వ విత్తము ప్రైవేటు విత్తంకు గల పోలికలు మరియు తేడాలు

ఎ) ప్రభుత్వ విత్తం దేశ శ్రేయస్సు కోసం పాటు పడితే, ప్రవేటు విత్తం సొంత అవసరాలు, స్వలాభం, స్వార్థం కోసం వినియోగిస్తారు. ఏమైనప్పటికి వ్యక్తైనా, దేశమయినా వస్తు, సేవలను సంపాదించుకోవటమే అంతిమ ధ్యేయంగా భావిస్తాయి.

బి) ప్రైవేటు వ్యక్తులయినా, ప్రభుత్వమయినా కనిష్ట వ్యయంతో గరిష్ట ప్రయోజనం పొందాలని ప్రయత్నిస్తారు. అంతేకాక ప్రభుత్వం తాను చేసే వ్యయం వలన ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూర్చాలని కోరుకుంటుంది.

సి) ప్రభుత్వమయినా, వ్యక్తులయినా ఆర్థిక వనరులు సరిపోనప్పుడు విధిగా అప్పులు తీసుకోవాల్సి వుంటుంది. లోటు బడ్జెట్‌ను అప్పులతో పూడ్చుకోవటం అనేది వ్యక్తులయినా, ప్రభుత్వమైనా చేపట్టక తప్పదు.

డి) ప్రభుత్వ, ప్రైవేటు విత్తాలు రెండు వుత్పత్తి, మూలధన రూపకల్పన, పెట్టుబడి మొదలగు అంశాల గురించి చర్చించుతాయి.

ఇ) వనరుల కొరత ప్రభుత్వం, ప్రైవేటు వ్యక్తులు ఇద్దరూ అనేక సందర్భాలలో ఎదుర్కొనవలసి వస్తుంది.

ఎఫ్) లోటుబడ్జెట్‌లానే మిగులు బడ్జెట్ కూడా ఇద్దరికీ ఎదరువుతుంది.

జి) సంతూలిత బడ్జెట్ ప్రభుత్వానికి, వ్యక్తులకు నిశ్చంతను కల్గిస్తుంది.

హెచ్) పొదుపు, దుబారా నరికట్టడం ప్రభుత్వానికి, ప్రైవేటు వ్యక్తులకు ఇద్దరికీ అవసరమే.

ఐ) ప్రాధాన్యతలను బట్టి వ్యయ కేటాయింపులు, సర్దుబాట్లు చేయబడతాయి.

జె) ఆదాయ, వ్యయాల సర్దుబాటుకు ప్రభుత్వమైనా, ప్రైవేటు వ్యక్తులయినా నిరంతరం కృషి చేస్తారు.

### ప్రభుత్వ ప్రైవేటు విత్తాల మధ్య తేడాలు :

ఎ) ప్రభుత్వ వ్యయాన్ని ముందుగా అంచనావేసి సరిపడ వనరులను వేరు వేరు మార్గాల ద్వారా పొందటం జరుగుతుంది. కాబట్టి వ్యయం ప్రభుత్వ ఆదాయాన్ని నిర్ణయిస్తుంది. 'ముందుగా కోటుకు కొలతలు తెలుసుకొని సరిపడినంత బట్టను కట్ చేయటం జరుగుతుంది. కానీ ప్రైవేటు వ్యక్తుల విషయంలో ఆదాయం వ్యయాన్ని నిర్ణయిస్తుంది. కాబట్టి 'అందుబాటులో వున్న బట్టకు సరిపడా కోటును సర్దుబాటు చేసి కుట్టవలసి వుంటుంది.

బి) వ్యక్తులు స్వప్రయోజనం, ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తాయి.

సి) ప్రైవేటు వ్యక్తుల వనరులు పరిమితం, ప్రభుత్వ వనరులు అపరిమితంగా వుంటాయి.

డి) ప్రభుత్వం అంతర్జాతీయ అప్పులు కూడా తీసుకోవచ్చు. వ్యక్తులు దేశీయ మార్గాల ద్వారానే అప్పు తీసుకోగలరు.

ఇ) ప్రభుత్వం లోటు ద్రవ్య (డెఫిసిట్ ఫైనాన్సింగ్) విధానం ద్వారా అదనపు వనరులను సృష్టించుకోవచ్చు. వ్యక్తులకు ఇలాంటి విస్తృత అధికారాలేవీ లేవు.

ఎఫ్) ప్రభుత్వం ప్రజలపై పన్నులు విధించి ఆదాయాన్ని పొందవచ్చును. వ్యక్తులకు ఆ అవకాశం లేదు.

జి) వ్యక్తులు పొదుపుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. వ్యక్తులు భవిష్యత్ కోసం వర్తమానంలో త్యాగాలు చేస్తారు. ప్రభుత్వం వర్తమాన విషయాలకు భవిష్యత్ కంటే అధిక ప్రాధాన్యత ఇస్తుంది.

హెచ్) వ్యక్తులు పెట్టుబడిపెట్టి వెంటనే ప్రతిఫలం ఆశిస్తారు. ప్రభుత్వం దీర్ఘకాలం వేచి వుంటుంది.

ఐ) ప్రభుత్వ విత్తం వ్యాకోచత్వాన్ని కల్గివుంటే ప్రైవేటు వ్యయం అవ్యాకోచత్వాన్ని కలిగి వుంటుంది.

జె) వ్యక్తుల వ్యయం అలవాట్లు, వ్యక్తిగత అవసరాలు, సాంప్రదాయంచే ప్రభావితమవుతుంది. ప్రభుత్వ వ్యయం ప్రభుత్వ ఆర్థిక విధానాలచే ప్రభావితం అవుతుంది.

పై విశ్లేషణను బట్టి ప్రభుత్వ విత్తం ప్రైవేటు విత్తం కంటే అనేక కోణాలలో విస్తృతమైనదని చెప్పవచ్చును.

## 1.5. ప్రభుత్వ విత్తం - విస్తృత పరిధి :

**సనాతన అర్థశాస్త్రంలో ప్రభుత్వ విత్త పాత్ర మరియు పరిధి :** సనాతన ఆర్థిక శాస్త్రవేత్తలు 'ప్రీతి సప్లయి తన డిమాండును తానే సృష్టించు కుంటుందని' భావించారు. అయినప్పటి ఆర్థిక వ్యవస్థ ఎల్లప్పుడూ పరిపూర్ణ ఉద్యోగితతో, సమతౌల్య స్థితిని కలిగి వుంటుంది. కాబట్టి నిరుద్యోగం, అధిక ఉత్పత్తి, ఉత్పత్తి కొరత మొదలగు సమస్యలేవీ వుండవని భావించారు. అసమానతలు వచ్చినా అవి కేవలం తాత్కాలికం మాత్రమే. దీర్ఘకాలంలో అన్ని అసమానతలు వాటంతటవే ప్రభుత్వ జోక్యం లేకుండానే సర్దుబాటవుతాయి. వ్యక్తులు స్వార్థంతో నిర్ణయాలు తీసుకున్నా, దీర్ఘకాలంలో వారి నిర్ణయాలవలన ఆర్థిక సుస్థిరత దానంతటదే ఏర్పడుతుందని ఆడమ్‌స్మిత్, రికార్డో జె.బి.సే. మొదలగు సనాతన ఆర్థిక వేత్తలు విశ్వసించారు. వారి అభిప్రాయం ప్రకారం ప్రభుత్వం రక్షణ, శాంతి భద్రతలను కాపాడటం ముఖ్యమైన అవస్థాపనా సదుపాయాలను ఏర్పాటు చేయటం మొదలగు ముఖ్య విధులను మాత్రమే నిర్వహిస్తుంది. ఆర్థిక వ్యవస్థ ఎల్లప్పుడూ సంతులిత బడ్జెట్‌ను కలిగి వుంటుందని భావించారు.

అంతేకాక బడ్జెట్ చిన్నగా వుంటే వుత్తమం అని భావించారు. ప్రత్యక్ష పన్నులకన్నా పరోక్ష పన్నులనేవారు మంచిదని నమ్మారు. ప్రతిపన్ను చెడు, ప్రతి ప్రభుత్వ వ్యయం అనుత్పాదకమే' అని సనాతన ఆర్థిక వేత్తల అభిప్రాయం. పన్నులు పొదుపు, వినియోగం, పెట్టుబడులకు హాని కల్గిస్తాయని వారభిప్రాయం. అలానే ప్రభుత్వ వ్యయం అనుత్పాదకమని, కాబట్టి ప్రభుత్వమే కలుగజేసుకొని అన్నింటిపై వ్యయం చేయనవసరం లేదు.

### కీన్స్ - ప్రభుత్వ విత్తంపై అభిప్రాయం :

1930 లో ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఆర్థిక మాంద్యం నుండి బయట పడేందులకు సనాతన ఆర్థిక వేత్తల సిద్ధాంతాలు ఎటువంటి సమాధానాన్ని ఇవ్వలేకపోయాయి. ఆ పరిస్థితులలో కీన్స్ ఉద్యోగితా సిద్ధాంతం ఆర్థిక సుస్థిరతను సాధించేందులకు బాగా ఉపకరించింది. కీన్స్ సిద్ధాంతం "ఒక వ్యక్తి వ్యయం ఇంకొక వ్యక్తికి ఆదాయం అవుతుంది." తద్వారా దేశంలోని ఆర్థిక రుగ్మతలన్నీ తొలగించబడతాయి. వ్యక్తులు తమ ఆదాయాన్నంతా వ్యయం చేయకుండా కొంత ధనాన్ని పొదుపుచేస్తారు. అందువలన సార్థక డిమాండ్ లోపిస్తుంది. సమిష్టి సప్లయి సమిష్టి డిమాండు కంటే అధికమైన ధరలు తగ్గి, ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది. కాబట్టి నిరుద్యోగాన్ని తొలగించాలంటే ప్రభుత్వ జోక్యం విధిగా వుండాలి. నిరుద్యోగం తొలగించి ఆర్థిక వ్యవస్థలో మరలా యధావిధి పరిస్థితి (సుస్థిరత)కి తేవాలంటే ప్రభుత్వం అన్ని విషయాలలో చొరవగా జోక్యం చేసుకోవాలి.

కీన్స్ అభిప్రాయం ప్రకారం వినియోగాన్ని తగ్గిస్తే సార్థక డిమాండ్ లోపించి నిరుద్యోగం, అధికవుత్పత్తి ఏర్పడి ఆర్థిక మాంద్యానికి దారి తీస్తుంది.

కనీస వేతనాల వద్ద అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. మాంద్యంలో వున్న ఆర్థిక వ్యవస్థను యధాస్థానానికి తేవాలంటే పూరక (ఫంక్షనల్) వ్యయం ద్వారా ప్రభుత్వం కొన్ని ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టి తద్వారా ఉద్యోగవకాశాలను కల్పించాలి. అప్పుడు ప్రజల కొనుగోలు శక్తి, వస్తువుల ధరలు, లాభాలు నెమ్మదిగా పెరిగి ఆర్థిక సుస్థిరత స్థానానికి చేరుకోగలమని కీన్స్ భావించాడు. సనాతన ఆర్థిక సిద్ధాంతాలు సమస్యలను పరిష్కరించలేవు అనుకుంటున్న సందర్భంలో కీన్స్ రాక అర్థశాస్త్ర సిద్ధాంతాలకు పరిపూర్ణత చేకూర్చింది.

ఆర్థిక మాంద్యంలో ఉపాధి సదుపాయాలను పెంచేందులకు ప్రభుత్వం లోటు ద్రవ్య విధానం ద్వారా క్రొత్తగా ద్రవ్యాన్ని సృష్టించి ఆదాయాన్ని పొందవచ్చును. ఈ మొత్తాన్ని ప్రజాహిత కార్యక్రమాల మీద వ్యయం చేసి తద్వారా ఉద్యోగావకాశాలను, ఆదాయాలను పెంచి సార్థక డిమాండును కూడా పెంచవచ్చును. తద్వారా ఆర్థికాభివృద్ధి కూడా వేగవంతమవుతుంది. కాబట్టి కీన్స్ పూరక విత్తం ద్వారా ప్రభుత్వం తన కోశ విధులను నిర్వర్తించి సుస్థిరత సాధిస్తుంది. ఈ వివరణ ననుసరించి ప్రభుత్వ విత్త శాస్త్ర పరిధి ఏ విధంగా పెరుగుతూ వచ్చిందో తెలియుచున్నది.

## ప్రభుత్వ విత్త శాస్త్రం - మస్‌గ్రేవ్ అభిప్రాయం

మస్‌గ్రేవ్ ప్రకారం ప్రభుత్వ విత్తం ప్రభుత్వ రంగ ఆర్థిక కార్యకలాపాలగురించి చర్చిస్తుంది. వనరుల కేటాయింపు, ఆదాయ, సంపదల పంపిణీ మొదలగు కార్యకలాపాల గురించి కూడా విస్తృతంగా చర్చిస్తుంది. మార్కెట్ యంత్రాంగం దేశానికి కావలసిన ఆర్థిక విధులన్నీ నిర్వర్తించలేదు. పెట్టుబడిదారులు లాభనష్టాలు బేరీజు వేసుకొని, వారికి అనుకూలమైన కార్యక్రమాల్లోనే చొరవగా పాల్గొంటారు. ఆయా కార్యక్రమాలే చేపడతారు. భారీ వ్యయం, పెద్ద స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం అవసరమైన కార్యక్రమాల్లో వ్యక్తులు ముందుకు రారు. కాబట్టి ఈ లోపాన్ని పూరించి, ఆర్థిక అసమానతలను తొలగించి, సమతౌల్యస్థితిని చేరుకోవాలంటే అది ప్రభుత్వ రంగం ద్వారానే సాధ్యపడుతుంది. ఈ నేపధ్యంలో మస్‌గ్రేవ్ ప్రభుత్వ విధానం ఈ క్రింది భాధ్యతలను నిర్వర్తించాల్సి వుంటుందని పేర్కొన్నాడు.

ఎ) వనరుల కేటాయింపులో సర్దుబాట్లు

బి) ఆదాయ సంపదల పంపిణీలో సర్దుబాట్లు

సి) ఆర్థిక సుస్థిరత మరియు వృద్ధులను సాధించటం

ప్రభుత్వరంగ పాత్ర కేవలం ఈ పై అంశాలకే పరిమితం కాదు. ఆర్థికాభివృద్ధిని సాధించటం, ఆర్థిక సుస్థిరతను ఏర్పాటు చేయడం, ఆదాయ సంపదలను వ్యక్తులందరి మధ్యా సమానంగా పంచటం మొదలగు విధులు కూడా ప్రభుత్వం చేపట్టాల్సి వుంది. కాబట్టి ప్రభుత్వ విత్తశాస్త్ర పరిధి బాగా పెరిగిందని ఈ వివరణ వలన తెలియుచున్నది.

మస్‌గ్రేవ్ అభిప్రాయాన్ని సూక్ష్మంగా చెప్పాలంటే ప్రభుత్వ బడ్జెట్ విధానంలో ఈ క్రింది కోశవిభాగాలుండి నిరంతరం దేశ అభివృద్ధికి కృషిచేయాలి.

1) కేటాయింపు విభాగం

2) పంపిణీ విభాగం

3) సుస్థిరత విభాగం

ఈ పై విభాగాల సహాయంతో ఆధునిక ప్రభుత్వాలు తమ విత్త కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగించవచ్చును.

## 1.6. ప్రభుత్వ విత్త శాస్త్రం ధనాత్మక శాస్త్రమా? లేక ఋణాత్మక శాస్త్రమా?

ఉన్నది ఉన్నట్లుగా తెలియపరచటమే ధనాత్మక శాస్త్రం అని చెప్పవచ్చును. సనాతన ఆర్థిక వేత్తలు స్వేచ్ఛాయుత వ్యవస్థ, మార్కెట్ యంత్రాంగంపై అపార నమ్మకాన్ని చూపారు. అందువల్లనే ప్రభుత్వం కనీస విధులు నిర్వర్తిస్తేచాలు అని భావించారు. ప్రైవేటు రంగం ప్రభుత్వ రంగం కంటే చాలా సమర్థవంతంగా పని చేస్తుందని భావించారు. కాబట్టి ప్రభుత్వం ఏమి చేసినా చెడు మరియు నిష్ప్రయోజనం అని అనుకొని ప్రభుత్వ జోక్యం వీలైనంత తక్కువగా వుండాలని భావించారు. చిన్న బడ్జెట్ ఉన్నతమైన బడ్జెట్‌గా విరాజిల్లుతుందని, కాబట్టి ప్రభుత్వరంగ పరిధి కూడా పరిమితంగానే వుండాలని భావించారు. ప్రొఫెసర్ ప్లెస్ట్ ప్రకారం సనాతన ఆర్థిక వేత్తలు ప్రభుత్వ విత్తశాస్త్ర విషయాన్ని రెవిన్యూ, వ్యయం మరియు అప్పులు అనే మూడు అంశాల క్రింద విడదీశారని తెలియుచున్నది. అర్థశాస్త్ర పితామహుడగు ఆడమ్ స్మిత్ వ్యయానికి, రికార్డో, జె.స్.మిల్ లు రాబడిలేక ఆదాయానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. 'కోశ సమస్య చాలా శుద్ధమైనది, శులభమైనది' అని వారు భావించారు.

నవ్య సాంప్రదాయవేత్తలు ప్రభుత్వ విత్తశాస్త్ర చర్చకు అతి తక్కువ ప్రాధాన్యతనిచ్చారు. మార్షల్, ఎడ్జి వర్త్‌లు ఈ శాస్త్రానికి సంబంధించి అంత కృషి సల్పలేదు. 1892లో బాస్టబుల్ ప్రప్రధమంగా ప్రభుత్వ విత్త శాస్త్రం గురించి విశేష కృషి చేసాడు. 1922లో డాల్టన్ ప్రభుత్వ విత్త శాస్త్రానికి పరిపూర్ణతను చేకూర్చాడు. డాల్టన్‌కు ప్రభుత్వ విత్త శాస్త్రంలో ఒక విశిష్ట స్థానం కల్పించబడింది.

లుట్జ్, కారల్ సి. ప్లెమ్, ప్రొఫెసర్ హరాల్డ్ గ్రూవ్స్ టైలర్ మొదలగు ఆధునిక అర్థశాస్త్రవేత్తలు ప్రభుత్వ విత్త శాస్త్రాన్ని వేరు వేరుగా నిర్వచించారు. వారందరి నిర్వచనాలను బట్టి ప్రభుత్వ విత్త శాస్త్రం ధనాత్మక శాస్త్రమని చెప్పవచ్చును. ప్రభుత్వం ఏ విధంగా వివిధ మార్గాల ద్వారా ఆదాయం పొందుతుంది, ఆ ఆదాయాన్ని ప్రాధాన్యతా క్రమంలో దేనిమీద ఎంత వ్యయం చేసింది. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల సమతుల్యాన్ని ఏర్పాటు చేసేందులకు విత్తపాలన ఏ విధంగా జరగాలి మొదలగు విషయాల గురించి ఈ శాస్త్ర అధ్యయనం జరుగుతుంది.

సనాతన ఆర్థిక వేత్తల అభిప్రాయం ప్రకారం ప్రభుత్వ విత్త శాస్త్రం ధనాత్మకశాస్త్రం. అనగా ఏది ఎలా వుండాలి, అని తెలియజేయటం మాత్రమే ఈ శాస్త్ర పరిధిలోకి వస్తుంది. వారభిప్రాయం ప్రకారం ఈ క్రింది అంశాలు ప్రభుత్వ విత్త శాస్త్ర పరిధిలోకి రావు.

ఎ) వివిధ బడ్జెట్ విధానాలలోని సుగుణాలను నిర్ణయించాలంటే ఏ ప్రాతిపదిక మీద చేయాలి?

బి) పన్నులు, ప్రభుత్వ వ్యయాలలో వచ్చిన కోశ మార్పులకు ప్రైవేటు రంగ స్పందన ఎలా వుంటుంది?

సి) ఇప్పటి కోశ సంస్థలు ఏ సాంఘిక, రాజకీయ, చారిత్రాత్మక శక్తుల వలన ఈ విధంగా రూపుదిద్దుకున్నాయి?

డి) నష్టాన్ని పూడ్చే (ఆర్థిక మాంద్య పరిస్థితులలో) కోశ విధాన ఏర్పాటు ఏ పరిస్థితులలో నిర్ణయించబడింది.

సనాతన ఆర్థిక వేత్తలు ఈ పై అంశాలకు, ప్రశ్నలకు ప్రభుత్వ విత్త శాస్త్రంలో అవకాశం లేదని భావించి అట్టి రుణాత్మక అంశాల గురించి వారు అతి తక్కువ ప్రాధాన్యత నిచ్చారు.

బాస్టబుల్, డాల్టన్, పిగు, కార్ల్.సి.ప్లెయ్, హోరాల్డ్ గ్రూవ్స్, టైలర్ లాంటి ఆధునిక అర్థశాస్త్ర వేత్తలు ప్రభుత్వ విత్తశాస్త్రాన్ని సాంప్రదాయ రీతిలో నిర్వచించినా పైన పేర్కొన్న కోశ అంశాలు ప్రభుత్వ విత్త శాస్త్ర పరిధిలోకి రావని వారు వాదించలేదు. 1930 ప్రపంచ ఆర్థిక మాంద్య పరిస్థితులలో జె.ఎమ్.కీన్స్ ముద్రించిన 'ఉద్యోగితా సిద్ధాంతం' (1936) అనే గ్రంథంలో ప్రభుత్వ కోశ కార్యక్రమాలన్నీ ప్రభుత్వ విత్త శాస్త్ర పరిధిలోకి తేబడినాయి. దీని ప్రభావంవలన పిగు, డాల్టన్‌లు ప్రభుత్వ విత్త శాస్త్రంపై వ్రాసిన గ్రంథాలు (1936 తరువాత) ప్రభుత్వ విత్త శాస్త్రాన్ని ఋణాత్మక శాస్త్రంగా పేర్కొన్నాయి. అయితే వారంతా కోశకార్యక్రమాల ధనాత్మక అంశాలపై ఎక్కువ దృష్టి సారించి రుణాత్మక అంశాల పట్ల అంతగా దృష్టి సారించలేదు.

## ప్రభుత్వ విత్త శాస్త్రం ఋణాత్మక శాస్త్రం

సక్రమం వనరుల కేటాయింపు ఆదాయపంపిణీ, పరిపూర్ణ ఉద్యోగిత, ధరల స్థిరత్వం, ఆర్థిక వృద్ధి మొదలగు లక్ష్యాల సాధనకు కోశకార్యక్రమాలు చేపట్టడతాయని మస్‌గ్రేవ్ భావించాడు. కాబట్టి ఈ లక్ష్యాలన్నీ ప్రభుత్వ విత్త శాస్త్ర పరిధిలోకే వస్తాయి.

కోశ కార్యక్రమాల ప్రభావాలన్నీ ప్రభుత్వ విత్త శాస్త్ర పరిధిలోకే వస్తాయి. ప్రభుత్వ రాబడి పెంచుకునే కార్యక్రమాలు, ప్రభుత్వం వ్యయం చేసే విధానాలు, పంపిణీ మొదలగు అంశాలపై ఏ విధమైన ప్రభావం పడుతుందో చర్చించటం కూడా నేడు ప్రభుత్వ విత్త శాస్త్ర పరిధిలోనే జరుగుతుంది.

బడ్జెటరీ కార్యక్రమాల ప్రభావం ప్రభుత్వ విత్త శాస్త్ర పరిధిలోకే వస్తుంది. ఈ నాలుగు అంశాలపై వ్యయం చేయటం ప్రభుత్వ విత్త శాస్త్రంలో చర్చించబడుతుంది.

ఎ) ప్రజల ఆదాయ, సంపదల పంపిణీ

బి) ఆర్థిక స్థిరత్వం

సి) ఆర్థికాభివృద్ధి

పై విషయాలనను బట్టి ప్రభుత్వ విత్త శాస్త్ర పరిధి ఆధునిక అర్థశాస్త్రవేత్తలంటే విస్తృత పరచబడిందని తెలియుచున్నది. ప్రభుత్వ ఆదాయ, వ్యయాలపై సాంఘిక, ఆర్థిక ప్రభావాలుంటాయని, ఇవన్నీ ప్రభుత్వ విత్త శాస్త్రంలో చర్చించబడతాయి. పన్నులు, నిర్ణయించేటప్పుడు పురోగామి పన్ను విధానం అవలంభించి ధనికుల మీద అధికభారం, పేదల మీద తక్కువ భారం పడేటట్లు చూడాలి. అలానే ధనిక పేద తారతమ్యాలు తొలగించేందుకు పేదవారిపై ఎక్కువవ్యయం, ధనికులపై తక్కువ వ్యయం పెట్టాల్సి వుంటుంది. కాబట్టి విలువలకు ప్రాధాన్యత నిచ్చి ప్రభుత్వం తన విత్త కార్యక్రమాలను నిర్వహించాల్సి వుంటుంది. కోశ కార్యక్రమాల ప్రభావాలను తెలియజేయటమే కాక వాటిలో మంచి, చెడులను కూడా బేరీజు వేయగలగాలి. అందులకే ప్రభుత్వ విత్త శాస్త్రం ఋణాత్మక శాస్త్రంగా కూడా పేర్కొనబడింది. కోశసాధనాలు వ్యాపార చక్రాలను నివారించటం, నిరుద్యోగాన్ని తొలగించటం, సమాజంలో అందరి మధ్య ఆదాయ వ్యత్యాసాలు తొలగించే విధంగా సమాన పంపిణీ చేయటం, మూల ధన కల్పన ప్రోత్సహించటం, ఆర్థిక శాఖ వృద్ధిని ప్రోత్సహించటం, ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించటం, ప్రాంతీయ అసమానతలను తొలగించటం మొదలగు అంశాలన్నీ ప్రభుత్వ విత్త శాస్త్రం రుణాత్మక శాస్త్రమని తెలియజేస్తున్నాయి. ప్రభుత్వ

విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలంటే కొన్ని నియమాలు, సూత్రాలు కూడా అవసరమని గుర్తించబడింది. కాబట్టి ప్రభుత్వ విత్త శాస్త్రము రుణాత్మక శాస్త్రమని కూడా స్పష్టంగా తెలియుచున్నది.

## 1.7. ప్రభుత్వ విత్తశాస్త్రము - ఇతర శాస్త్రాలతో గల సంబంధం

ప్రభుత్వ విత్త శాస్త్రం ఒక కీలకమైన శాస్త్రంగా ఖ్యాతి గాంచింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విత్త శాస్త్రం ఇతర శాస్త్రాలతో ఏ విధమైన సంబంధం కలిగియుందో తెలుసుకోవాల్సిన అవసరం వున్నది.

**ప్రభుత్వ విత్త శాస్త్రము - అర్థశాస్త్రము :** అర్థశాస్త్రము చాలా విస్తృతమైన శాస్త్రం, ప్రభుత్వ విత్త శాస్త్రం అర్థశాస్త్రం కేవలం ఒక భాగం మాత్రమే అని చెప్పవచ్చును. అరుదైన వనరుల, అపరిమితమైన కోరికలకు మధ్యగల సంబంధం గురించి తెలియజేయటమే అర్థశాస్త్రమని చెప్పవచ్చును. అయితే ప్రభుత్వ విత్త శాస్త్రం మాత్రం దేశ ప్రజల కోరికలు సంతృప్తి పరచటమెలా? అనే విషయం గురించి మాత్రమే చర్చిస్తుంది. అర్థశాస్త్ర పరిధి చాలా విస్తృతమైతే, ప్రభుత్వ విత్త శాస్త్ర పరిధి చాలా పరిమితం అని చెప్పవచ్చును.

**ప్రభుత్వ విత్తశాస్త్రం మరియు రాజనీతి శాస్త్రం :** ప్రభుత్వ విత్త శాస్త్రం, రాజనీతి శాస్త్రం రెండు సామాజిక జీవనం గురించే అధ్యయనం చేస్తాయి. డాల్టన్ అభిప్రాయం ప్రకారం ప్రభుత్వ విత్త శాస్త్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వనరులు, వ్యయాల గురించి చర్చిస్తుంది. ప్రభుత్వం ఆర్థిక విధానాలను నిర్ణయించి, అమలు చేయటం వంటి విధులు నిర్వర్తిస్తుంది. విత్త విధానాలు, ఆర్థిక విధానాల మీద ఆధారపడి వుంటాయి. ఆర్థిక విధానాలు ప్రభుత్వాల మీద ఆధారపడి వుంటాయి. ప్రభుత్వం మారినప్పుడెల్లా వారి ఎన్నికల మానిఫెస్టోను అనుసరించి ఆర్థిక విధానాలు కూడా మారుతుంటాయి. మొత్తం మీద విత్త విధానాలు, రాజకీయ విధానాల మీద ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి వుంటాయి.

**ప్రభుత్వ విత్త శాస్త్రము - చరిత్ర :** ప్రభుత్వ విత్త శాస్త్రము చరిత్రతో చాలా సన్నిహిత సంబంధం కలిగియున్నది. ప్రభుత్వ విత్త శాస్త్రానికి ఒక స్వరూపాన్ని తెచ్చింది చరిత్రే అని చెప్పక తప్పదు. చారిత్రాత్మక అనుభవాలను దృష్టిలో వుంచుకునే విత్త విధానాలు తయారు చేయబడతాయి. అలానే ఒక పన్ను విధించాలన్నా చారిత్రాత్మకంగా ఆ పన్ను పరిణామ క్రమాన్ని తెలుసుకోవచ్చు. అందుకు చరిత్ర ఎంతగానో వుపకరిస్తుంది. వాస్తవాలు, గణాంకాలు, వివరణలు తెలుసుకుంటే గానీ ప్రభుత్వ విత్త విధానాలను తయారు చేసుకోలేము. పన్నుల భారం లేక రుణభారం అధికమైతే ఆ ప్రభుత్వాలనే ప్రజలు ఓడించి, క్రొత్త ప్రభుత్వాలను అధికారంలోకి తీసుకు రావచ్చు.

**ప్రభుత్వ విత్త శాస్త్రం - సామాజిక శాస్త్రం :** సాంఘిక సంస్కరణలు తీసుకురావటం, అమలు చేయటం ప్రభుత్వ బాధ్యత. సామాజికాభివృద్ధి కోసం, ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆర్థిక వనరులు అవసరమవుతాయి. సామాజికాభివృద్ధి సాధించినపుడే ఆయా ప్రభుత్వాలు అభివృద్ధి చెందాయని చెప్పగలం. సామాజిక బాధ్యతలు ప్రభుత్వ వ్యయ పరిధిని మారుస్తాయి. సామాజికవేత్తలు నేరాలు అనే పాఠ్యాంశం మాత్రమే చదువుతారు. అయితే నేరస్తుల నుండి ఏ విధంగా రాబడిపొందవచ్చని ప్రభుత్వ విత్త శాస్త్రం చర్చిస్తుంది. ఉదా : పన్ను ఎగవేతదారులు, ఆర్థిక నేరాలకు పాల్పడినవారి నుండి ఏ విధంగా డబ్బు వసూలు చేయాలనే అంశం ప్రభుత్వ విత్త శాస్త్రం చర్చిస్తుంది.

**ప్రభుత్వ విత్త శాస్త్రం - న్యాయ శాస్త్రం :** కోశ విధానాన్ని తయారు చేసేటప్పుడు సమానత్వం, న్యాయం, సమ సమాజం మొదలగు అంశాలను దృష్టిలో వుంచుకొని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుటుంది. పన్నుల ఎగవేత నేరంగా పరిగణింపబడుతుంది. అలానే నల్లధనం, దొంగ వ్యాపారం, నల్లబజారు, అనేక ఆర్థిక నేరాలకు న్యాయశాస్త్రమే తగిన జరిమానాలు, శిక్షలు కూడా నిర్ణయిస్తుంది. కేటాయింపులలో అన్యాయం జరిగినా, ఆదాయం పొందటానికి ప్రభుత్వం తీసుకున్న తొందరపాటు నిర్ణయాలేవైనా వున్నా న్యాయశాస్త్ర సలహాను బట్టి ఒక్కోసారి వీగిపోయే అవకాశం కూడా వున్నది. కాబట్టి ప్రభుత్వం తన ఇష్టానుసారం విత్త నిర్ణయాలు తీసుకోకుండా న్యాయశాస్త్ర సలహా తీసుకొని చేస్తే బావుంటుంది.

**ప్రభుత్వ విత్త శాస్త్రము - నీతి శాస్త్రం :** ఈ రెండు శాస్త్రాలకు అవినాభావ సంబంధం వున్నది. సమానత్వం, న్యాయం అనే పదాలు నిజానికి నీతి శాస్త్రం నుండే ప్రభుత్వ విత్త శాస్త్రం తీసుకున్నది. ధనిక పేద తారతమ్యాన్ని తొలగించి ఆర్థిక సమానత్వం సాధించేందులకు

కోశ సాధనాలకు పన్నులు, ప్రభుత్వ వ్యయం ఎంతగానో వుపకరిస్తాయి. దానికిగాను పురోగామి పన్నుల విధానం, పురోగామి గ్రాంట్లు లేక నిధులను కోశ విధానంలో పొందుపరచి పేద ప్రజలకు సామాజిక న్యాయం చేయాలి. పేదవారికి అధిక సబ్సిడీలిచ్చి పేదరికం నుండి బయటపడేటట్లు చేయాలి. అలానే ఎవరి ఆదాయాలకు తగినట్లు వారు ప్రభుత్వానికి పన్నులు చెల్లించాల్సి వుంటుంది. కాబట్టి ప్రభుత్వం తన కోశ విధానాలను నిర్ణయించేటప్పుడు నీతి శాస్త్రంతో సంబంధాన్ని కల్గియుండాలి.

**ప్రభుత్వ విత్త శాస్త్రము - మనస్తత్వ శాస్త్రము :** ప్రభుత్వ విత్త శాస్త్రము మానసిక శాస్త్రంతో కూడా సంబంధం కలిగియున్నది. మానవ మనస్తత్వాన్ని బట్టి ప్రభుత్వం తన విధానాలను తయారు చేసుకోవాలి. ప్రజల అవసరాలు, సమస్యలు తెలుసుకోకుండా ప్రభుత్వాలు గుడ్డిగా తమ విధానాలను తయారు చేయకూడదు. ఉదా: పన్నుల రేట్లు పెంచాలన్నా, కొంత పన్నులు విధించాలన్నా, ప్రభుత్వం అందించే వస్తు సేవల ధరలు పెంచాలన్నా ప్రభుత్వం ముందుగా ప్రజల నాడిని తెలుసుకొని నిర్ణయాలు తీసుకోవాలి. లేదంటే ప్రజలు ప్రభుత్వ నిర్ణయాలను కూడా తిప్పికొట్టే ప్రమాదం వున్నది. కాబట్టి మానవ ప్రవర్తన, మనస్తత్వాలను దృష్టిలో వుంచుకొని ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలి.

ఈ విశ్లేషణను బట్టి ప్రభుత్వ విత్త శాస్త్రం అనేక సామాజిక శాస్త్రాలతో అవినాభావ సంబంధాన్ని కలిగియున్నదని తెలియజేయుచున్నది.

## 1.8. రాజకీయ మరియు ఆర్థిక ఏర్పాటు :

ప్రభుత్వ విత్తపనితీరు రాజకీయ ఆర్థిక ఏర్పాటు బట్టి వుంటుంది. సనాతన ఆర్థిక వేత్తల అభిప్రాయం ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థ, స్వేచ్ఛా వ్యవస్థ పూర్వకాలంలో ఆచరణలో వుండేది. ప్రభుత్వం కూడా పరిమిత పాత్రనే నిర్వహించేది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగ పాత్ర అంతగా వుండదు. స్వేచ్ఛా విధానం పట్ల సనాతన ఆర్థిక వేత్తలకు అపార నమ్మకం వుండేది.

స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థకు ఆడమ్‌స్మిత్ చాంపియన్‌గా పేరుగాంచాడు. ఆయనకు వ్యక్తిగతవాదం పట్ల అపార నమ్మకంగలదు. అనగా 'మనమే స్వేచ్ఛగా బ్రతుకుదాం' అనే నినాదాన్ని ఆయన ప్రతిపాదించాడు. వ్యక్తి ఆర్థిక జీవితంలో ప్రభుత్వానికి జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు. ప్రతి వ్యక్తి తాను ఏమి కోరుకుంటున్నాడు తనకేమి కావాలి? అనే విషయాలను తనకుతానే నిర్ణయించుకోగలడు. ప్రతి వ్యక్తి తన సంతృప్తి కొరకు, సంక్షేమం కొరకు నిరంతరం శ్రమిస్తాడు. వ్యక్తిగతంగా ప్రతి వ్యక్తికి తానే వస్తువులను ఉత్పత్తి చేయాలి? ఏ వస్తువులను వినియోగించాలి? అని నిర్ణయించుకునే అవకాశం, స్వేచ్ఛ వుంటాయి. ప్రభుత్వ నియమ, నిబంధనలు, నియంత్రణలు ఏవీ వుండవు. ప్రభుత్వం తెలిసి కానీ తెలియకుండాగానీ ప్రజల ఆర్థిక స్వేచ్ఛకు ఎటువంటి ఆటంకాలు కల్పించదు. స్వేచ్ఛాయుత వ్యవస్థలో ప్రభుత్వం నామమాత్రంగానే జోక్యం చేసుకుంటుంది. ప్రభుత్వ ప్రమేయం వ్యక్తుల వ్యక్తిత్వానికి, అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందని భావించబడింది. అలాగని ప్రభుత్వం ఏ విషయంలోను జోక్యం చేసుకోకూడదని కాదు. వ్యక్తుల మనుగడకు సహకరించే విధంగా ప్రభుత్వ జోక్యం వుంటే చాలని సనాతన వేత్తలు భావించారు.

స్వేచ్ఛాయుత వ్యవస్థ సిద్ధాంతం ప్రకారం సమాజంలో సామరస్యం, శాంతి, పురోగాభివృద్ధి మరియు సాధారణ సంక్షేమం వాటంతటవే ఏర్పడతాయి. ప్రతివ్యక్తి వికాసానికి స్వేచ్ఛాయుత వ్యవస్థ మంచిదని సనాతన ఆర్థిక వేత్తలు భావించారు.

వ్యక్తికి మరియు ఆతని సామాజిక శ్రద్ధకు మధ్య సంఘర్షణ వుండకూడదని ఆడమ్ స్మిత్ భావించాడు. ప్రతి వ్యక్తి ప్రభుత్వంచే కాక 'అదృశ్య హస్తం' వలన పాలింపబడతాయని ఆయన అభిప్రాయం. వ్యక్తిగత వినియోగదారులు, ఉత్పత్తి దారులు, శ్రామికులు, వ్యాపార వేత్తలు కూడా అదృశ్య హస్తం చేతనే ప్రభావితులౌతారని ఆడమ్‌స్మిత్ భావించాడు. స్వేచ్ఛాయుత సమాజంలో అదృశ్య హస్తమే సమన్వయ పాత్రను నిర్వహించి అన్ని వర్గాల ప్రజల గరిష్ట సంతృప్తికి, లాభాలకు దారి తీస్తుందని స్మిత్ అభిప్రాయం.

వనరులు సమర్థవంతంగా కేటాయింపబడాలన్నా, పోటీ మార్కెట్‌లో మార్కెట్ యంత్రాంగ సహాయంతో ఏ విధంగా సమతౌల్యాన్ని ఏర్పాటు చేసుకోవచ్చో సనాతన వేత్తలు మార్కెట్ సిద్ధాంతంలో తెలియజేశారు. అదృశ్యహస్తమే పరిపూర్ణ ఉద్యోగితకు కూడా సహకరిస్తుంది.

కాబట్టి ప్రభుత్వ జోక్యం అవసరం లేదని భావించారు. ప్రభుత్వ జోక్యం లేకుండానే వ్యవస్థ దానంతటదే ముందుకు కొనసాగాలంటే స్వేచ్ఛాయుత వ్యవస్థే మంచిదని సనాతన వేత్తల అభిప్రాయం.

సనాతన వేత్తల అభిప్రాయాలు కొన్ని స్థిరమైన ప్రమేయాలమీద ఆధారపడి వున్నాయి.

1. పరిపూర్ణ మార్కెట్
2. పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థ
3. నామమాత్ర ప్రభుత్వ జోక్యం
4. దానంతటదే సర్దుకుపోయే మార్కెట్ యంత్రాంగం
5. పూర్తి ఉద్యోగిత
6. దీర్ఘకాలం
7. స్వేచ్ఛా వ్యాపారం
8. రవాణా వ్యయం వుండదు.
9. వ్యక్తిగత స్వాతంత్ర్యం
10. సంతులిత బడ్జెట్
11. పరిమిత పన్నులు, మిత వ్యయం
12. సమతుల్య పరిస్థితి మొదలగునవి.

అయితే సనాతన సిద్ధాంతాలు పేర్కొన్న పరిస్థితులు నేడు లేవు. 1930లో వచ్చిన ప్రపంచ వ్యాప్త ఆర్థిక మాంద్యం. సనాతన సిద్ధాంతాల వైఫల్యాన్ని తెలియజేసింది. సనాతన సిద్ధాంతాలు మారుతున్న వ్యవస్థకు పనిచేయవనే వాస్తవాన్ని అందరూ గ్రహించారు. అట్టి సమయంలో కీన్స్ రాకతో ఆర్థిక, రాజకీయ ఏర్పాటులో మార్పు వుండాలని, అప్పుడే ఆర్థిక మాంద్యం నుండి బయట పడగలమని అందరూ తెలుసుకున్నారు.

1930లో వచ్చిన ఆర్థిక మాంద్యాన్ని తొలగించటం ప్రభుత్వం కీలకపాత్రను నిర్వహించాలని తెలుసుకున్నాము. పరిపూరక లేక నష్ట పూరక విత్తం ద్వారా ప్రభుత్వం తన ప్రభుత్వ వ్యయాన్ని పెంచి, తద్వారా కొన్ని ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టి నిరుద్యోగ సమస్యను నివారించాలని పేర్కొనబడింది. అప్పుడు ఉద్యోగాలు పెరిగి, ప్రజల ఆదాయాలు, కొనుగోలు శక్తులు పెరుగుతాయి. తద్వారా వస్తువుల ధరలు, లాభాలు పెరుగుతాయి. ఆర్థిక వ్యవస్థలో కూడా మాంద్యం తొలగిపోయి మళ్ళీ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగింపబడతాయి.

ఆర్థిక సమస్యలు నివారించాలంటే రాజకీయంగా ప్రభుత్వం చైతన్యవంతం కావాలి. దేశ సమస్యలను నివారించే విధానాలు తయారు చేసుకోవాలి. ఆర్థిక విధానాలను తయారు చేసేది ప్రజా ప్రతినిధులే కాబట్టి వారు తమ విజ్ఞతనుపయోగించి సమస్యలు నివారించే మార్గాలను చేపట్టాలి. ప్రభుత్వ రంగ పాత్ర చాలా కీలకమైన పాత్రను నిర్వహించి దేశాన్ని అభివృద్ధి మార్గంలోకి తీసుకెళ్ళాల్సి వుంటుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రభుత్వం నామ మాత్రంగానే వుంటుంది. కానీ సామ్యవాద వ్యవస్థలో అన్నీ ప్రభుత్వమే నిర్వహిస్తుంది. కాబట్టి ప్రభుత్వం అత్యంత కీలకమైన పాత్రను నిర్వహిస్తుంది. ఆర్థిక శ్రేయస్సు, సామాజిక న్యాయం ప్రభుత్వ లక్ష్యాలుగా మారాయి.

**రాజకీయ, ఆర్థిక ఏర్పాటులో వచ్చిన మార్పులు :** 1990 లలో ప్రారంభమైన స్వేచ్ఛావాదం, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ నినాదాలతో ప్రపంచ వ్యాప్తంగా కొన్ని కీలకమైన మార్పులు వచ్చాయి. ప్రభుత్వ రంగ ప్రాధాన్యత క్రమేపీ తగ్గించబడుతున్నది. సామాజిక, ఆర్థిక రుగ్మతలను తొలగించేందులకు ప్రభుత్వం ఒక సాధనంగా విశ్వసించిన ప్రపంచంలో నేడు ప్రభుత్వ రంగ పాత్ర కుదించబడుతున్నది. ప్రభుత్వ రంగ సంస్థల మూసివేత, సబ్సిడీల తగ్గింపు, ప్రైవేటీకరణ, నియంత్రణ, ఆంక్షలు తొలగించి స్వేచ్ఛాయుత వ్యవస్థను ఏర్పాటు చేయటం నేడు సర్వదా ఆహ్వానింపబడుతున్నాయి. సనాతన ఆర్థిక సిద్ధాంతాలే మళ్ళీ ప్రాచుర్యంలోకి వచ్చాయి. ప్రభుత్వ విత్త శాస్త్ర ప్రాధాన్యతలు కూడా

తారుమారవుతున్నాయి. పన్నుల విధానంలో కూడా సరళీకృత ధోరణి మొదలయింది. ప్రభుత్వ వ్యయం విపరీతంగా పెరిగిపోతున్న పరిస్థితులలో ఆర్థిక క్రమశిక్షణ పేర అనేక కఠిన నిర్ణయాలు తీసుకొనబడినాయి. రుణభారం పెరగకుండా, లోటు ద్రవ్య విధానాన్ని మోతాదుమించకుండా వాడవలసిన పరిస్థితి నేడు కన్పిస్తున్నది. ఎన్ని రోజులు సామాజిక, ఆర్థిక రుగ్మతలు వచ్చినపుడు ప్రభుత్వం కీలక పాత్రను నిర్వహించేది. కాని నేడు మార్కెట్ యంత్రాంగమే అన్ని సమస్యలకు సమాధానం చెబుతుందని ప్రపంచ వ్యాప్తంగా విశ్వశిస్తున్నారు.

**ప్రభుత్వ విత్త శాస్త్ర విషయాలుకు రాజకీయాలకుగల సంబంధం** : సమాఖ్య రాజ్యాంగంలో కేంద్ర రాష్ట్రప్రభుత్వాల ఆర్థిక సంబంధాలు ప్రభుత్వ విత్త శాస్త్రంలో విస్తృతంగా చర్చించబడతాయి. మన దేశ విత్త సంబంధాలు, వ్యవహారాలు 1990 నుండి గణనీయమైన మార్పులకు లోనయ్యాయి. ఏకపార్టీ వ్యవస్థ నుండి బహుళపార్టీ వ్యవస్థకు నేడు మారాము. నేడు కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నాయి. సంకీర్ణ ప్రభుత్వాలలో సభ్యులైన పార్టీలకు ఎన్నికల మేనిఫెస్టో వేరు వేరుగా వుంటుంది. అయితే అన్ని పార్టీలు కలిపి కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినపుడు ఆర్థిక విధానాలు కూడా పూర్తిగా మార్పులకు గురి కావలసి వస్తున్నది.

నేడు మన కేంద్ర ప్రభుత్వం కొన్ని విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. అందువలన ప్రభుత్వ విత్తంలో గణనీయమైన మార్పులు తీసుకురాబడినాయి. 1991లో అంతర్జాతీయ ద్రవ్య సంస్థ సూచనలు మన దేశ ఆర్థిక విధానంలో కొన్ని విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాయి.

**పెరుగుతున్న ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించాలి :**

ఎ) ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయటం

బి) సబ్సిడీల తగ్గింపు

సి) ప్రైవేటీకరణ

డి) విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించటం

ఇ) బహుళజాతి సంస్థలకు స్వాగతం పలకటం

ఈ పై చర్యల ద్వారా మన దేశంలో 1991 నూతన ఆర్థిక విధానం ప్రారంభించబడింది. రాజకీయ మార్పుల కనుగుణంగా ఆర్థిక విధానాలు కూడా మారుతున్నాయి. ఎన్నికలయి క్రొత్త ప్రభుత్వాలు ఏర్పడినప్పుడెల్లా తరచుగా ఆర్థిక విధానాలు కూడా మారుతున్నాయి. పార్టీ ప్రాధాన్యతలను బట్టి ఆర్థిక విధానాలు కూడా మారుతున్నాయి.

**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విత్త సంబంధాలు :** కేంద్రంలో రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం అధికారంలో వుంటే ఆర్థిక సంబంధాలు పటిష్టంగా వుంటాయి. కేంద్రంలో ఒక ప్రభుత్వం, రాష్ట్రంలో ఒక ప్రభుత్వం వేరువేరు పార్టీలకు చెందితే విత్త సంబంధాలు సజావుగా వుండవు. రాజకీయ ఆర్థిక సర్దుబాటు కూడా వుండదు. తరచూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలు ఏర్పడతాయి. అందువలన దేశ అభివృద్ధి కూడా కుంటుపడుతుంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అయిదేళ్ళపాటు అధికారంలో లేకుండా తరచుగా మధ్యంతర ఎన్నికలు వస్తే విత్త వ్యవహారాలు కూడా దెబ్బతింటాయి. రాజకీయ సుస్థిరత లేకపోతే ఆర్థిక సుస్థిరత కూడా వుండదు. ఆర్థిక వ్యవస్థ ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సజావుగా నడవాలంటే రాజకీయ సుస్థిరత వుండాలి.

ప్రస్తుత మార్కెట్ యంత్రాంగంలో ప్రజలందరికి సామాజిక వస్తు సేవలు అందుబాటులో వుంటాయనే నమ్మకము లేదు. ఆర్థిక విధానాలలో తరచూ అస్థిరతచోటు చేసుకుంటుంది. ఆదాయ, సంపదల పంపిణీలో కూడా అసమానతలు పెరగవచ్చు. లాభాపేక్షగల ప్రైవేటు వ్యక్తులు కొన్ని వస్తు సేవల వుత్పత్తి కార్యక్రమాల్లోనే శ్రద్ధ చూపించి కొన్ని వస్తువులను అశ్రద్ధచేయవచ్చు. సామాజిక అవసరాలు తీరక ప్రజలు ఇబ్బందులకు కూడా గురికావచ్చు. కాబట్టి ప్రభుత్వరంగ ఆవశ్యకతను విస్మరించరాదు. ఏదిఏమైనా రాజకీయ - ఆర్థిక విధానాలమధ్య సమన్వయం కుదిరినప్పుడే విత్తశాస్త్ర సిద్ధాంతాలు కూడ వర్తిస్తాయి.

**ఓటింగ్ విధానం ద్వారా సమర్థవంతమైన నిర్ణయాలు :** వాస్తవిక ప్రపంచంలో ఓటింగ్ విధానం ద్వారా ప్రభుత్వం సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవటం జరుగుతుంది. అయితే ఆర్థిక వ్యవస్థలో వినియోగదారుల అభిరుచులు వేరు వేరుగా వుంటాయి. కాబట్టి కొంతమంది వినియోగదారులకు ప్రభుత్వం ఇచ్చే ప్రాముఖ్యతలు సంతృప్తినివ్వకపోవచ్చును. కాబట్టి ప్రజలందరినీ సంతృప్తి పరిచేందులకు ప్రభుత్వం

ఎప్పటికప్పుడు పాత విధానాలకంటే మెరుగైన విధానాలను అవలంభించాలి. తదనుగుణంగా ద్రవ్య ఆదాయాన్ని సక్రమముగా పంపిణీచేయటం పంపిణీ ప్రాతిపదికమీద వనరులను సమర్థవంతంగా కేటాయించటం మొదలగు చర్యలను ప్రభుత్వం చేపట్టవలసి వుంటుంది.

## 1.9. విధానాల ఎంపిక - వాటి అమలు తీరు :

ప్రభుత్వ విత్త విధానాలు ఆయా కాలానుగుణంగా వుండాలి. దేశ ఆర్థిక, సామాజిక అవసరాలను, వనరులను దృష్టిలో వుంచుకొని విధానాలు ఎంపిక చేసుకోవాలి. సామాజిక, ఆర్థిక రుగ్మతలను తొలగించేందులకు ఏ రకమైన విత్తవిధానాన్ని అవలంభించాలి. ఆయా ప్రభుత్వాలు నిర్ణయించుకోవాలి. విదేశాల అనుభవాలను చూసి మనం కూడా గుడ్డిగా ఆయా విధానాలే అనుసరించాలని లేదు. శాస్త్రీయంగా ఏరకమైన విధానాలు మన పరిస్థితులకు అనుకూలంగా వుంటాయో ఆ విధానాలనే మనం ఎంపిక చేసుకోవాలి. ఇన్నాళ్ళు మిశ్రమ ఆర్థిక వ్యవస్థను అనుసరించిన మన దేశం నేడు ప్రభుత్వ రంగ ప్రాధాన్యతను తగ్గించి అన్నిటికీ ప్రైవేటీకరణే మార్గంగా సూచిస్తున్నది. అత్యధిక జనాభా, పేదరికం, నిరుద్యోగం, అంతంత మాత్రంగానే అభివృద్ధి సాధించిన వివిధ రంగాలుగల దేశంలో ప్రభుత్వ రంగ సహకారం లేకుండా ముందుకు వెళ్ళలేం. అప్పుల భారం తగ్గించుకునేందులకు ప్రభుత్వ వ్యయంలో ముందుగా పొదుపు పాటించాల్సి వుంటుంది. అందుకే సబ్సిడీలకోత, ప్రైవేటీకరణ మొదలగు చర్యలు చేపట్టబడినాయి. అయితే వేరే దేశాల, రాష్ట్రాల అనుభవాలు చూసి మనం కూడా అదే పంథాలో నడవాలని నిర్ణయించుకోవటం కన్నా మన పరిస్థితులకనువైన విధానాలను అనుసరించటం ఉత్తమం.

విధాన నిర్ణయంతోపాటు విధానాల అమలు చేసే తీరు పట్ల కూడా శ్రద్ధ వహించాలి. అమలు తీరులో కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకురావాలి.

### అమలు తీరులో తీసుకోవలసిన జాగ్రత్తలు :

ఎ) విధానాలలో మార్పు ఒక్కసారిగా కాక క్రమ పద్ధతిలో తీసుకురావాలి.

బి) విధానాల ఫలితాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకొని అవసరమైన మార్పులు తీసుకు రావాలి.

సి) అమలు తీరుపై పర్యవేక్షణ అవసరం.

డి) విధాన అమలులోవున్న లోపాలు తెలుసుకొని వాటిని తొలగిస్తే సత్ఫలితాలు పొందే అవకాశం వుంటుంది.

ఇ) విధానాల అమలు తీరును గమనించి, వాటి ప్రభావం వివిధ వర్గాల మీద, దేశ అభివృద్ధిమీద ఎలా వున్నదో గమనించాలి.

ఎఫ్) ముఖ్యంగా విధానాలపట్ల ప్రజలు సంతృప్తికరంగా వున్నారా? అసంతృప్తితో వున్నారా తెలుసుకోవాలి.

జి) ప్రజలు ఆహ్వానించే మార్పులను తేవాలి కానీ అంతర్జాతీయ సంస్థలు సూచించిన మార్పులే మంచివని భావించనవసరం లేదు.

హెచ్) ఆర్థిక, సామాజిక రుగ్మతలను తొలగించగలిగామా? లేదా పర్యవేక్షించాలి.

ఏది ఏమైనా 1991లో ప్రారంభమైన నూతన ఆర్థిక విధానం మనవిత్త విధాన సూత్రాల ప్రవృత్తినే మార్చివేసింది. ప్రభుత్వం కూడా వ్యక్తుల వలే స్వార్థం, లాభాపేక్ష అనే విషయాల గురించి ఆలోచించకుండా దేశ అభివృద్ధి, ప్రజల ఆర్థిక, సామాజిక శ్రేయస్సు కోసం నిరంతరం ఆలోచించి తగు నిర్ణయాలు తీసుకోవాలి.

## 1.10 సారాంశం :

అర్థ శాస్త్రంలో ఒక ముఖ్య విభాగమైన ప్రభుత్వ విత్త శాస్త్రం ప్రభుత్వ పరిపాలనకు మార్గ దర్శకంగా వున్నది. ప్రభుత్వ విత్త శాస్త్రంలో ముఖ్యంగా ప్రభుత్వ రాబడి, ప్రభుత్వ వ్యయము, ప్రభుత్వ రుణము, లోటుద్రవ్య విధానం మొదలగు అంశాల గురించిన వివరంగా చర్చిస్తుంది. ప్రభుత్వ విత్తశాస్త్ర ప్రాధాన్యత సనాతన ఆర్థిక వేత్తలు అంతగా చర్చించకపోయినా కీన్స్ ఉద్యోగితా సిద్ధాంతంలో (1936) విత్త శాస్త్ర ప్రాధాన్యత గురించి విస్తృతంగా చర్చించాడు. ప్రభుత్వ విత్తానికి, ప్రైవేటు విత్తానికి కొన్ని తేడాలున్నా పోలికలు కూడా వున్నాయి. ప్రభుత్వ విత్త శాస్త్రానికి, ఇతర శాస్త్రాలకు గల సంబంధం కూడా చర్చించబడింది. ప్రభుత్వ విత్త విధానంలో రాజకీయ ఆర్థిక ఏర్పాటు ఎలా వున్నది, విధానాల తీరు తెన్నులూ మొదలగు అంశాలు చర్చించబడినాయి. ఈ మధ్య వచ్చిన నూతన ఆర్థిక విధానంలో విత్త విధాన స్వరూప స్వభావాలే పూర్తిగా మార్చబడినాయి. ప్రభుత్వరంగ ప్రాధాన్యత తగ్గించినప్పటికీ ప్రభుత్వ విత్త శాస్త్రం తన ప్రాధాన్యతను కోల్పోదు.

ఈ ఆధునిక యుగంలో ప్రతి ప్రభుత్వం శ్రేయోరాజ్యంగా మారుతున్నది. కాబట్టి వ్యక్తులు చేపట్టని, శ్రద్ధ కనబరచని విషయాలు విధిగా ప్రభుత్వమే చేపట్టి దేశ ఆర్థికాభివృద్ధికి, సుస్థితరతకు, ఆర్థిక సమానత్వానికి నిరంతరం కృషి చేయాలి. ప్రభుత్వ విధానాలు రాజకీయాలతో ఎంతగా ముడిపడి వున్నా విత్తశాస్త్ర పరిధి ఎప్పటికీ విస్తృతంగానే వుంటుంది.

## 1.11 ముఖ్య పదాలు

1. కోశ విధానము - ఆర్థిక సుస్థిరత సాధించి ఆదాయ సంపదల మధ్య వ్యత్యాసాలను తొలగించే విధానము.
2. పూరక విత్తం - ఆర్థిక మాంద్యం వచ్చిన సందర్భంలో సుస్థిరత సాధించేందులకు ప్రభుత్వం వెచ్చించే మొత్తం
3. లోటు ద్రవ్య విధానం - లోటును పూరించుకునేందుకు రిజర్వు బాంకు ద్వారా క్రొత్తగా ద్రవ్యాన్ని సృష్టించటం.

## 1.12. స్వయం సమీక్ష ప్రశ్నలు :

1. ప్రభుత్వ విత్త శాస్త్రాన్ని నిర్వచించి, విత్తశాస్త్ర ముఖ్యాంశాలను వివరింపుము?
2. ప్రభుత్వ విత్త శాస్త్ర పరిధిని వివరించి, ఇతర శాస్త్రాలతోగల సంబంధాన్ని వివరింపుము.
3. విత్త విధానాలలో రాజకీయ, మరియు ఆర్థిక ఏర్పాటు, విత్త విధానాల ఎంపిక, అమలు తీరును విమర్శనాత్మకంగా వివరీకరింపుము.

### అభ్యాసాలు :

1) ప్రభుత్వ విత్త శాస్త్రం - ముఖ్యాంశాలు
2) ప్రభుత్వ రుణాలు లేక అప్పులు
3) ప్రభుత్వ విత్తం మరియు ప్రయివేటు విత్తానికగల పోలికలు, తేడాలు
4) ప్రభుత్వ విత్త శాస్త్రం ధనాత్మకమా? లేక రుణాత్మకమా.
5) ప్రభుత్వ విత్త శాస్త్రం - ఇతర శాస్త్రాలతోగల సంబంధం.
6) ప్రభుత్వ విత్తంపై సనాతన ఆర్థిక వేత్తల అభిప్రాయం
7) కీన్స్ - ప్రభుత్వ విత్తంపై అభిప్రాయాలు
8) విత్త శాస్త్ర విషయాలకు రాజకీయాలకుగల సంబంధం

## 1.13. చదవవలసిన పుస్తకాలు :


1. Dalton : Principles of Public Finance
2. Taylor : Economics of Public Finance
3. Bhargava R.N. : The Theory of Public Finance
4. Mankar Sarma : Public Finance Theory & Practice
5. Alka Guptha : Public Finance and Tax planning


డా॥ ఎల్. క్రిష్ణవేణి

**పాఠం - 2**

# గరిష్ట సామాజిక ప్రయోజన సిద్ధాంతం

పాఠ్య నిర్మాణ క్రమం


2.0 ఉద్దేశాలు

2.1 ఉపోద్ఘాతం

2.2 సనాతన వాదుల అభిప్రాయాలు

2.3 సనాతన వాదుల అభిప్రాయాలు - ఆధునిక యుగం

2.4 సిద్ధాంత వివరణ

2.5 డాల్టన్ సమిష్టి సామాజిక శ్రేయస్సు

2.6 గరిష్ట సామాజిక ప్రయోజనం - మస్ గ్రీవ్ వివరణ

2.7 గరిష్ట సామాజిక ప్రయోజనానికి కావలసిన పరిస్థితులు

2.8 విమర్శలు - సిద్ధాంతా పరిమితులు

2.9 డాల్టన్ సూచించిన సామాజిక ప్రయోజన పరీక్షలు

2.10 సారాంశం

2.11 ముఖ్య పదాలు

2.12 స్వయం సమీక్ష ప్రశ్నలు

2.13 చదవవలసిన పుస్తకాలు


## 2.0 ఉద్దేశాలు

ఈ పాఠ్యభాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది అంశాలను తెలుసుకోగలరు.

ఎ) గరిష్ట సామాజిక ప్రయజన సిద్ధాంతం సనాతన కాలంలో విస్మరించినా ఆధునిక యుగంలో ఏ విధంగా అభివృద్ధి చెందినదీ వివరించగలగాలి.

బి) గరిష్ట సామాజిక ప్రయోజన సిద్ధాంత వివరణ, డాల్టన్ ప్రతిపాదించిన సమిష్టి సామాజిక శ్రేయస్సు, మస్‌గ్రేవ్ సామాజిక సిద్ధాంత వివరణలను వివరింపగలగాలి.

సి) ఈ సిద్ధాంతానికి కావలసిన పరిస్థితులు, విమర్శలు, సిద్ధాంత పరిమితుల పట్ల అవగాహన పెరగాలి.

డి) డాల్టన్ సూచించిన సామాజిక ప్రయోజన పరీక్షలను విశ్లేషించగలగాలి.

## 2.1 ఉపోద్ఘాతం :

ప్రభుత్వ ఆర్థిక రంగంలోని వివిధ కార్యకలాపాలను నిర్వహించేటప్పుడు ప్రభుత్వ లక్ష్యం ఏమై వుండాలి. అనే ప్రశ్నకు సమాధానంగా ఈ గరిష్ట సామాజిక ప్రయోజన సిద్ధాంతం ప్రతిపాదించబడింది. ఈ సిద్ధాంతాన్నే ప్రభుత్వ విత్త సిద్ధాంతమని కూడా పిలుస్తారు. ప్రభుత్వ విత్త శాస్త్ర పితామహుడు డాల్టన్, ప్రొఫెసర్ పిగు కలసి ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

## 2.2. సనాతన వాదుల అభిప్రాయాలు :

సనాతన ఆర్థిక వేత్తలగు ఆడమ్ స్మిత్, రికార్డ్, జె.బి.సే మొదలగు ఆర్థిక వేత్తలు "ప్రభుత్వం విధించే ప్రతి పన్ను చెడు అని, మరియు ప్రతి ప్రభుత్వ వ్యయం అనుత్పాదకమని" భావించారు. ఈ అభిప్రాయం ఏర్పడటానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకోవాలంటే సనాతన ఆర్థిక వేత్తలు అభిప్రాయాలను ప్రమేయాలను నిశిదంగా పరిశీలించాల్సిన అవసరం ఉన్నది.

1. స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థ
2. పెట్టుబడిదారీ విధానం
3. పరిమిత ప్రభుత్వ జోక్యం
4. ఆర్థిక అసమానతలు వాటంతటవే సర్దుబాటు
5. పరిపూర్ణ మార్కెట్
6. సమతౌల్య పరిస్థితి
7. పరిపూర్ణ ఉద్యోగిత
8. దీర్ఘకాలం

పైన పేర్కొన్న ప్రమేయాలపై ఆధారపడి సనాతన ఆర్థిక వేత్తలు వారి సిద్ధాంతాలను రూపొందించారు. ప్రభుత్వ విత్త విధానంలో ప్రభుత్వ జోక్యం అంతగా వుండనవసరం లేదని వారు భావించారు. ప్రభుత్వ విధులు ఈ క్రింద పేర్కొన్న ముఖ్యమైన విధులకే పరిమితం కవాలని సనాతన వేత్తలు భావించారు.

1. జాతీయ, అంతర్జాతీయ దాడుల నుండి ప్రజలను రక్షించే జాతీయ బాధ్యత మాత్రం ప్రభుత్వమే విధిగా చేపట్టాలి. వ్యక్తులు తమ లాభాపేక్షపట్ల చూపిన శ్రద్ధ దేశ సంరక్షణ పట్ల చూపరు. కాబట్టి భారీగా వ్యయంతో కూడిన రక్షణ వ్యవహారాన్ని ప్రభుత్వమే విధిగా చేపట్టాలి. ప్రజల ప్రాణాలను, ఆస్తులను, దేశీయ, అంతర్జాతీయ దాడులనుండి రక్షించే నైతిక బాధ్యత మాత్రం ప్రభుత్వానిదే అని సనాతన ఆర్థిక వేత్తలు పేర్కొన్నారు.
2. దేశంలో శాంతి భద్రతలను, న్యాయాన్ని కాపాడవలసిన బాధ్యత కూడా ప్రభుత్వమే చేపట్టాలని సనాతన వాదులు పేర్కొన్నారు. కుల, మత, వర్గ పోరాటాలు లేకుండా, బలమున్న వాడిదే రాజ్యం అనే న్యాయం కాకుండా అందరికీ న్యాయం జరగాలంటే ప్రభుత్వమే ఈ కార్యక్రమాన్ని తప్పక చేపట్టాలి. పోలీసులు, కోర్టులు ప్రభుత్వ ఆధీనంలో వుండి సామాజిక న్యాయం కోసం కృషి చేయాలి.
3. అతి ముఖ్యమైన ఆర్థిక, సాంఘిక కార్యకలాపాలపై మాత్రమే ప్రభుత్వం వ్యయం చేయాల్సి వుంటుంది. రోడ్లు, విద్యుచ్ఛక్తి, బ్రిడ్జీల నిర్మాణం, రైల్వేలు మొదలగు ఆర్థిక అవస్థాపనా సదుపాయాలపై ప్రజలు ఆసక్తి చూపరు. ఎందుకంటే వీటిపై పెద్ద మొత్తంలో వ్యయం చేయాలి. అలాగే ప్రజలు తమ స్వార్థం కోసం కృషిచేస్తారు. అందరి సామాజిక అవసరాలపట్ల వారికి దృష్టి వుండదు. అందరికీ ఆహారం సురక్షిత త్రాగునీరు, విద్య వైద్యం పారిశుధ్యం మొదలగు అంశాలపట్ల ప్రభుత్వమే శ్రద్ధ కనబరచాలి. వ్యక్తులకు గల వనరులు కూడా పరిమితంగానే ఉంటాయి. కాబట్టి ప్రభుత్వమే సామాజిక శ్రేయస్సు కోసం కృషి చేయాలి.

ఈ పై మూడు విధులు నిర్వహించటం మాత్రం ప్రభుత్వమే చేపట్టాలని సనాతన ఆర్థిక వేత్తల అభిప్రాయం. కాబట్టి ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకోవటం కోసం పన్నులు విధించాలని వారు వక్కాణించలేదు. పైగా పన్నులు విధిస్తే ప్రజల నికర ఆదాయాలు, కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు కూడా తగ్గిపోతాయని వారు భావించి ప్రతి పన్ను చెడుకే దారి తీస్తుందని భావించారు.

అలానే పరిమిత బాధ్యతలు మాత్రమే ప్రభుత్వం చేపడుతుంది. కాబట్టి ప్రభుత్వ వ్యయాన్ని గురించి వారు అంతగా శ్రద్ధ వహించలేదు. అందుకే ఈ ప్రమేయాలకే పరిమితమైన సనాతన ఆర్థిక వేత్తలు ఆర్థిక వ్యవస్థ ఎల్లప్పుడూ సంతులిత బడ్జెట్‌లోనే వుంటుందని పరిపూర్ణ ఉద్యోగిత, సమతౌల్య పరిస్థితులు కలిగి ఉంటాయని కూడా వారు భావించారు. అందుకే వారు జె.బి.సే. చెప్పిన మార్కెట్ సిద్ధాంతాన్ని

బాగా విశ్వసించారు. ప్రతి సప్లయి తన డిమాండును తానే సృష్టించుకుంటుందని, ఒక వేళ సప్లయి, డిమాండుల మధ్య అసమానతలు ఏర్పడినా అవి కేవలం తాత్కాలికమే మరలా దీర్ఘ కాలంలో ప్రభుత్వ జోక్యం లేకుండా ఆర్థిక వ్యవస్థలో సప్లయి, డిమాండుల మధ్య సమతౌల్యం దానంతట అదే ఏర్పడుతుందని జె.బి.సే భావించాడు. అసమానతలు వచ్చినా ఆర్థికపరమైన నిర్ణయాలు ముఖ్యంగా వ్యక్తులకే వదిలివేయబడతాయి. వ్యక్తుల నిర్ణయాలలో వచ్చిన మార్పులవలన దీర్ఘకాలంలో అస్తవ్యస్థ పరిస్థితులు పోయి మరలా ఆర్థిక వ్యవస్థ తనంతట తానే సమతౌల్య పరిస్థితికి చేరుకుంటుందని సనాతన వాదుల అభిప్రాయము. పైగా అసమతౌల్యం కేవలం స్వల్ప కాలమే ఉంటుందని, దీర్ఘ కాలంలో అన్ని ఇబ్బందులు వాటంతటవే సర్దుకుంటాయని జె.బి.సే భావించారు.

## 2.3. సనాతన వాదుల అభిప్రాయాలు-ఆధునిక యుగమా?

ప్రజా సంక్షేమమే ముఖ్య బాధ్యతగా భావించే ప్రభుత్వం పన్నులు విధిస్తే ప్రజల ఆర్థిక నిర్ణయాలకు అవరోధం ఏర్పడుతుందని భావించారు. కానీ సామాజిక ప్రయోజనాన్ని విస్మరించారు. అయితే వాస్తవ దృక్పథంతో చూసినపుడు సిగరెట్లు, మత్తుపానీయాల వంటి హానికర వస్తువులపై పన్ను విధించటంవలన ఎన్నో ఉపయోగాలున్నాయి.

1. పన్నుల వలన ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది.
2. ప్రజల అలవాట్లను మారుస్తుంది.
3. ప్రజలపై పన్నులు విధిస్తే కొన్ని పరిధులకు లోబడే వ్యయం చేస్తారు. కాబట్టి వారు తమ ఆదాయాలనుండి అధిక ప్రయోజనాన్ని పొందగలరు.
4. పన్నుల ద్వారా ఆర్థిక వ్యత్యాసాలు తొలగి ఆర్థిక సమానత్వం ఏర్పడుతుంది.
5. ఏకస్వామ్యాన్ని అరికట్టవచ్చును.
6. పన్నులు విధిస్తే ప్రజలు దుబారా ఖర్చులు తగ్గించుకుంటారు.

'అనుత్పాదక వ్యయం' అనే పదం నేటి ఆధునిక యుగానికి వర్తించదు. ప్రభుత్వం వ్యయం చేస్తే ఆ వ్యయం అనుత్పాదక వ్యయంగా మారుతుందని సనాతన ఆర్థిక వేత్తలు భావించారు. తిరిగి ప్రతి ఫలాలివ్వని వ్యయం అనుత్పాదక వ్యయమని వారి భావన, కానీ ప్రభుత్వం వ్యక్తులవలే స్వార్థంతో ఆలోచించక దేశ సంరక్షణ, నైతిక బాధ్యతల దృష్ట్యా సామాజిక సంక్షేమాన్ని పెంచే కార్యక్రమాల మీద వ్యయం చేయాలి. ఉదా : దేశ ప్రజల, ఆస్తుల రక్షణ నిమిత్తం ప్రభుత్వం రక్షణ బాధ్యత చేపట్టింది. దీనివలన ఆదాయం రాకపోవచ్చు. అంత మాత్రాన అనుత్పాదక వ్యయమని ప్రభుత్వం చేపట్టకుండా వుంటే ప్రజలకు భద్రత ఎలా వుంటుంది? అందుకే వ్యక్తులకు సాధ్యపడని, ఆసక్తిలేని కార్యక్రమాలు ప్రభుత్వమే చేపట్టి వ్యయం చేయాలి. తద్వారా దేశంలోని ప్రజలందరికీ న్యాయం చేయవచ్చు. లాభనష్టాలు బేరీజు వేసుకునేది వ్యక్తులు సామాజిక సంక్షేమం పట్ల శ్రద్ధకనబరచరు. కాబట్టి ఈ ఆధునిక యుగ సంక్షేమ రాజ్యాల్లో పన్నులు విధించాలన్నా, ప్రభుత్వవ్యయాన్ని భారీగా పెంచి సామాజిక శ్రేయస్సును కాపాడలన్నా ప్రభుత్వం తన బాధ్యతలను బాగా విస్తృతపరచుకోవాల్సిన అవసరం ఎంతైనా వున్నది.


**ప్రభుత్వ రంగ పాత్ర - సామాజిక ప్రయోజనం :** నేరుగా ఆర్థికపరమైన అవరోధాలు, ఇబ్బందులు ఏర్పడినపుడు ప్రభుత్వం వాటి నివారణకు చురుకైన పాత్రను నిర్వహించవలిసి వుంటుంది. వ్యాపార చక్రాలవలన ఏర్పడిన ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యాలను అరికట్టి ఆర్థిక సుస్థిరత ఏర్పరచాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే వుంది. అంతేకాక నేడు ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని దేశాలు శ్రేయో రాజ్యాలుగా మారాయి. కాబట్టి ప్రభుత్వ బాధ్యతలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. పెరుగుతున్న బాధ్యతలను నిర్వహించటానికి భారీగా ప్రభుత్వ వ్యయం కావలసియున్నది. కాబట్టి ప్రభుత్వ రాబడిని కూడా పెంచుకోవాల్సిన అవసరం వున్నది. కాబట్టి అన్ని ప్రభుత్వాలు ముఖ్యంగా పన్నుల రాబడి ద్వారా పెరుగుతున్న వ్యయాన్ని తట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే ప్రభుత్వం పన్నుల రాబడివలన ప్రజల ఎంత మేరకు త్యాగం చేస్తున్నారు? ప్రభుత్వ వ్యయం వలన ఏ మేరకు ప్రయోజనం చేకూరుతుంది బేరీజు వేసుకోవాల్సిన అవసరం వున్నది.

ఉపాంత త్యాగాన్ని, ఉపాంత ప్రయోజనాన్ని లెక్కించి ఆ రెండింటిని సమానం చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. అప్పుడే గరిష్ట సామాజిక ప్రయోజనం చేకూరుతుంది.

## 2.4. సిద్ధాంత వివరణ :

ఉపాంత పన్నుల వలన పెరిగే ఉపాంత త్యాగం : ఆదాయాన్ని పెంచుకునే దృష్టిలో ప్రభుత్వం ప్రజలమీద పన్నుల భారాన్ని పెంచుతుంది. అయితే పన్నుల విధింపు ప్రజల మీద వాస్తవిక భారాన్ని మోపుతుంది. పన్నులు చెల్లించాలంటే ప్రజలు తమ కోరికలను, వినియోగాన్ని త్యాగం చేయవలసి ఉంటుంది. డాల్టన్ అభిప్రాయం ప్రకారం ప్రతి ఉపాంత పన్ను ప్రజల మీద అదనపు భారాన్ని మోపుతుంది. కాబట్టి ఉపాంత త్యాగానికి దారి తీస్తుంది. పన్ను చెల్లింపు దారుడు అదనపు పన్నుల మీద అదనంగా చెల్లించే ప్రతి రూపాయివలన ఉపాంత త్యాగం పెరిగిపోతుంది. అందువలన ప్రజలపై అదనపు భారం మోపబడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే "పన్నులు పెరిగే కొలదీ త్యాగం కూడా పెరుగుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే అదనంగా పన్నులు విధించే కొలది ప్రజలు తమ అవసరాలను తీర్చుకోకుండానే ప్రభుత్వానికి అదనంగా చెల్లించాల్సి వుంటుంది. దీనివలన పన్ను చెల్లింపు దారుల ఉపాంత త్యాగం పెరుగుతుంది. ఈ విషయాన్ని ఈ క్రింది రేఖా చిత్రం ద్వారా తెలియజేయవచ్చును.


పెరుగుతున్న ఉపాంత సామాజిక త్యాగం




X అక్షంపై అదనపు పన్ను (రూ.లలో), Y అక్షంపై ఉపాంత సామాజిక త్యాగం (యూనిట్లలో) తీసుకోబడింది. పన్నుల భారం పెంచుకుంటూపోతే ఉపాంత సామాజిక త్యాగం (MSS) కూడా పెరిగిపోతుంది. OM, $OM_1$, $OM_2$ ల మేరకు ప్రజల మీద పన్నులు విధించుకుంటూ పోతే ఉపాంత త్యాగం ML, $ML_1$, $ML_2$ మేరకు పెరుగుతూ పోయింది. కాబట్టి MSS రేఖ ఎడమ నుండి కుడి పైకి లేచియున్నది.

**క్షీణిస్తున్న ఉపాంత సామాజిక ప్రయోజనాలు** MSB : ప్రభుత్వ వ్యయం పెరిగే కొలదీ ప్రజలకు ప్రయోజనాలు చేకూరతాయి. ప్రభుత్వ వ్యయం వలన మొదట్లో వృద్ధి ప్రతిఫలాలు, ఆ తరువాత స్థిర ప్రతిఫలాలు లభిస్తాయి. ఆ తరువాత ప్రభుత్వ వ్యయాన్ని ఇంకా పెంచుకుంటూ పోతే క్షీణ ప్రతిఫలాల వలన ఉపాంత సామాజిక ప్రయోజనం కూడా క్షీణిస్తుంది. కాబట్టి డాల్టన్ ప్రకారం ప్రభుత్వ వ్యయం పెరిగే కొలదీ మొత్తం ప్రయోజనం పెరుగుతుంది. కానీ ఉపాంత ప్రయోజనం మాత్రం తగ్గుతుంది. కాబట్టి ఉపాంత వ్యయం వలన వచ్చే ఉపాంత ప్రయోజనం (MSB) క్షీణిస్తుంది. వ్యయం పెంచే కొలదీ అంతగా ప్రాధాన్యత లేని అంశాలమీద కూడా వ్యయం చేయబడుతుంది. అందువలన ఉపాంత వ్యయం వలన ఉపాంత ప్రయోజనం క్షీణిస్తుందని ఈ క్రింది రేఖాచిత్రం ద్వారా తెలియజేయవచ్చును.

క్షీణిస్తున్న ఉపాంత సామాజిక ప్రయోజనం




వ్యయం మొత్తం (రూ॥లలో)


X అక్షంపై ప్రభుత్వ వ్యయం OM, $OM_1$, $OM_2$, $OM_3$ ల మేరకు పెంచుకుంటూ పోతే ఉపాంత సామాజిక ప్రయోజనం MK, $M_1K_1$, $M_2K_2$, $M_3K_3$ ల మేరకు క్రమేపీ తగ్గిపోతున్నది. MSB రేఖ ఎడమవైపు పై నుండి కుడికి క్రిందికి వాలియున్నది. అనగా వ్యయం పెంచేకొలదీ ప్రయోజనం (ఉపాంత) మాత్రం క్షీణిస్తూవుంటుందని అర్థం.

**MSS మరియు MSB మధ్య సమానత్వం : లేక ఉపాంత సామాజిక త్యాగం మరియు ఉపాంత సామాజిక ప్రయోజనాల మధ్య సమానత్వం :** డాల్టన్ అభిప్రాయం ప్రకారం ప్రభుత్వం పన్నుల విధింపు, ప్రభుత్వ వ్యయము రెండూ పెంచుకుంటూ పోతే ఎక్కడైతే ఉపాంత సామాజిక త్యాగం (MSS), ఉపాంత సామాజిక ప్రయోజనం (MSB) సమానమవుతాయో అక్కడ గరిష్ట సామాజిక ప్రయోజనం చేకూరుతుంది. కాబట్టి MSS మరియు MSB రేఖలు ఖండించుకునే బిందువునే గరిష్ట సామాజిక ప్రయోజన బిందువుగా చెప్పవచ్చును. కాబట్టి గరిష్ట సామాజిక ప్రయోజనాన్ని ఈ క్రింది విధంగా, చెప్పవచ్చును.

గరిష్ట సామాజిక ప్రయోజనం = ఉపాంత సామాజిక త్యాగం

MSS = ఉపాంత సామాజిక ప్రయోజనం MSB

ఈ గరిష్ట సామాజిక ప్రయోజనాన్ని క్రింది రేఖా చిత్రం ద్వారా విశదీకరించవచ్చును.




పన్నులు అండ్ ప్రభుత్వ వ్యయాల మొత్తాలు (రూ॥లలో)


పై రేఖా చిత్రంలో MSS రేఖ, MSB రేఖలు 'Q ' అనే బిందువు వద్ద ఖండించుకున్నాయి. కాబట్టి Q బిందువు వద్ద ప్రభుత్వం పొందిన పన్నుల రాబడి (ON) ప్రభుత్వ వ్యయం (ON) సమానంగా వున్నాయి. అనగా MSS = MSB అని తెలియుచున్నది. ఈ ఖండన బిందువు Q గరిష్ట సామాజిక ప్రయోజనాన్ని తెలియజేస్తుంది.

Q బిందువుకు ఎడమవైపున MSB రేఖ MSS రేఖ కంటే అధికంగా వున్నది. అనగా ప్రభుత్వ వ్యయం వలన పొందే ప్రయోజనం, పన్నుల చెల్లింపువలన ప్రజలు కోల్పోయే త్యాగం కంటే తక్కువగా వున్నది (MSB>MSS ) కాబట్టి ప్రభుత్వం కొంచెం మేరకు పన్నులు విధించే అవకాశం ఉన్నది.

అయితే Q బిందువు వద్ద MSB=MSS కాబట్టి ఈ బిందువు దాటి ప్రభుత్వం పన్నులు విధిస్తే ఉపాంత త్యాగం ఉపాంత వ్యయ ప్రయోజనం కంటే ఎక్కువైపోతుంది. కాబట్టి MSB>MSS గా మారుతుంది. పెరుగుతున్న ప్రభుత్వ వ్యయం వలన వచ్చే ప్రయోజనం కూడా క్షీణించిపోతున్నది. కాబట్టి MSS బిందువును అభిలషనీయ బిందువుగా పరిగణించవచ్చును.

## 2.5. డాల్టన్ - సమిష్టి సామాజిక శ్రేయస్సు :

**సమిష్టి సామాజిక ప్రయోజనం (ASB) మరియు సమిష్టి సామాజిక త్యాగం (ASS) :**




పన్నులు అండ్ ప్రభుత్వ వ్యయాల మొత్తాలు (రూ॥లలో)

డాల్టన్ సామాజిక ప్రయోజన సిద్ధాంతాన్ని సమిష్టి సామాజిక త్యాగం (ASS) మరియు సమిష్టి సామాజిక ప్రయోజనం (ASB) ల రూపంలో కూడా చూపవచ్చును. ప్రభుత్వ విత్త కార్యకలాపాలననుసరించి ASS, ASB రెండూ ప్రారంభంలో పెరుగుతూనే ఉంటాయి. సమిష్టి సామాజిక ప్రయోజనం (ASB) రేఖ క్షీణరేటున పెరుగుతుందని తెలియుచున్నది. అలానే సమిష్టి సామాజిత త్యాగం (ASS) రేఖ వృద్ధి రేటున పెరుగుతుందని తెలియుచున్నది. $T_1T_2$ అనే రెండు స్పర్శ రేఖలను ASB, ASS రేఖలను తాకుతూ సమాంతరంగా గీయాలి. ASB మరియు ASS రేఖల మీద Q, R అనే రెండు బిందువులు గుర్తించబడినాయి. ఈ బిందువులు $T_1T_2$ స్పర్శ రేఖల మధ్యగల అంతరం QR గరిష్ట నికర సామాజిక ప్రయోజనాన్ని తెలియజేస్తుంది. QR బిందువుల మధ్యగల అంతరం అనగా (ASS, ASB రేఖల మధ్యగల తేడా) గరిష్ట స్థాయిని సూచిస్తే ఆ బిందువులకు ముందు, తరువాత కూడా నికర గరిష్ట సామాజిక ప్రయోజనం తక్కువగా వున్నదని చెప్పవచ్చు. ఎందుకంటే ASS, ASB రేఖల మధ్య వ్యత్యాసం తక్కువగా వుండటమే అందుకుగల కారణంగా పేర్కొనవచ్చును. సమిష్టి సామాజిక ప్రయోజనం లేక మొత్తం సామాజిక ప్రయోజనం = QR - QS - RS

QR - గరిష్ట సామాజిక ప్రయోజనం

QS - మొత్తం ప్రయోజనం

RS - మొత్తం త్యాగం

QR గరిష్ట సామాజిక ప్రయోజనాన్ని తెలియజేస్తుంది.

Q బిందువు వద్ద $\frac{\Delta B}{\Delta E}$ = R బిందువు వద్ద $\frac{\Delta S}{\Delta T}$ =

B - ఉపాంత ప్రయోజనం

E - ఉపాంత ప్రభుత్వ వ్యయము

S - ఉపాంత త్యాగము

T - ఉపాంత పన్నుల రాబడి

- పెరుగుదల లేక మార్పు


ఉపాంత ప్రయోజనం = ఉపాంత త్యాగము

కాబట్టి $\frac{\Delta B}{\Delta E} = \frac{\Delta S}{\Delta T}.$

కాబట్టి నికర సామాజిక ప్రయోజనం = NSB = ASS = ADB. ప్రభుత్వ వ్యయం చేసిన చివరి రూపాయి నుండి వచ్చిన ప్రయోజనం పన్నుల రూపంలో వసూలు చేసిన చివరి రూపాయి వలన కోల్పోయిన త్యాగానికి సమానమవుతుంది. ప్రారంభంలో ఉపాంత ప్రభుత్వ వ్యయం వలన వచ్చే ఉపాంత ప్రయోజనం, అదనపు పన్నుల చెల్లింపు ద్వారా కోల్పోయిన వుపాంత త్యాగం కంటే అధికంగా వుంటుంది. కాబట్టి MSB>MSS. ఆ తరువాత ప్రభుత్వం MSB = MSS సమానం అయ్యే వరకు ప్రభుత్వ వ్యయం పెంచవచ్చు. పన్నుల రాబడి కూడా పన్నుల రూపంలో పెంచుకోవచ్చు. అయితే MSS>MSB స్థితికి మాత్రం చేరకుండా చూసుకోవాలి. అనగా పన్నుల చెల్లింపు వలన కోల్పోయిన త్యాగము ఉపాంత వ్యయ ప్రయోజనం కంటే అధికం కాకుండా జాగ్రత్తపడాలి. ప్రజల మీద అధికపన్నుల భారం మోపకూడదు. ప్రభుత్వ వ్యయం వృధాకాకుండా సమర్థవంతంగా వినియోగించుకునేటట్లు ప్రభుత్వం జాగ్రత్త పడాలి. విత్త కార్యకలాపాలు సమర్థవంతంగా వ్యవహరిస్తే గరిష్ట సామాజిక ప్రయోజనం పొందవచ్చు.

## 2.6. గరిష్ట సామాజిక ప్రయోజనం - మస్‌గ్రేవ్ వివరణ :

మస్ గ్రేవ్ గరిష్ట సామాజిక ప్రయోజనం సిద్ధాంతాన్ని ఈ క్రింది రేఖా చిత్రం ద్వారా విశదీకరించినాడు.



పై రేఖా చిత్రంలో x అక్షంపై బడ్జెట్ పరిమాణం చూపబడింది. Y అక్షం పై భాగంలో ఉపాంత సామాజిక ప్రయోజనము (+)ను, అక్షం క్రింది భాగంలో ఉపాంత సామాజిక త్యాగాన్ని (-) సూచించాము. MSB రేఖ క్రిందికి వాలి యుండగా, $Y_1$ అక్షంశంపై MSS రేఖ MSB రేఖకు వ్యతిరేక దిశలో చూపబడింది. nb నికర ప్రయోజన రేఖ MSB నుండి MSS తీసివేయగా మిగిలిన మొత్తాన్ని సూచిస్తుంది. nb = MSB - MSS. nb రేఖ X అక్షాన్ని Q అనే బిందువు వద్ద ఖండిస్తూ క్రింది వాలుతుంది. MSS బిందువు వద్ద ఉపాంత త్యాగం మరియు ఉపాంత ప్రయోజనాలు సమానం (MSS=MSB) కాబట్టి నికర ప్రయోజనం 'O' అవుతుంది. Q బిందువు బడ్జెట్ అభిలషనీయ పరిమాణంలో వున్నదని తెలియుచున్నది. అంతేకాక గరిష్ట సామాజిక ప్రయోజనం కూడా చేకూరింది అని చెప్పవచ్చును.

PQ - ఉపాంత సామాజిక ప్రయోజనం MSS

$P^1Q$ - ఉపాంత సామాజిక త్యాగం MSS

$PQ = P^1Q$ అనగా MSB = MSS

కాబట్టి MSS బిందువు వద్ద ఉపాంత సామాజిక ప్రయోజన ఉపాంత సామాజిక త్యాగానికి సమానమవుతుంది. కాబట్టి ఈ బిందువు వద్ద ప్రభుత్వం పన్నుల విధింపు, వ్యయ కార్యక్రమాలను అదనంగా కొనసాగించకపోవటం శ్రేయస్కరం. R బిందువు వద్ద వున్నది. ప్రయోజనం, త్యాగం S బిందువు వద్ద ఉపాంత ప్రయోజనం త్యాగం కంటే తక్కువగా వున్నది. కాబట్టి Q బిందువు వద్ద గరిష్ట సామాజిక ప్రయోజనం పొందగలిగాము.

**రాబడి మరియు వ్యయాల అభిలషనీయ కేటాయింపు :** పైన వివరించిన సామాజిక ప్రయోజన సిద్ధాంతంలో ప్రత్యామ్నాయ సిద్ధాంతం కూడా కలిపి యున్నది. ప్రభుత్వ వ్యయం వలన వచ్చే ఉపాంత ప్రయోజనం గరిష్టంగాను, పన్నుల వసూలు వలన కోల్పోయే ఉపాంత త్యాగము కనిష్టంగా నున్నపుడు గరిష్ట సామాజిక ప్రయోజనం చేకూరుతుందని తెలియుచున్నది.

వివిధ ప్రభుత్వ కార్యక్రమాల మధ్య ప్రభుత్వ వ్యయం ఖర్చుచేయబడి తద్వారా ప్రతి ప్రభుత్వ వ్యయం నుండి వచ్చే ఉపాంత ప్రయోజనం సమానమయ్యేటట్లు వుండాలని సిద్ధాంత రీత్యా తెలియుచున్నది. అప్పుడే ప్రభుత్వ వ్యయం నుండి వచ్చే సమిష్టి ప్రయోజనం గరిష్టంగా ఉంటుంది. అన్ని రకాల పథకాల మీద చేసే ప్రభుత్వ వ్యయం వలన వచ్చే ఉపాంత ప్రయోజనాలను సమానం చేసుకునేందుకు ప్రభుత్వం ఒక పథకంపై ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించి వేరొక పథకంపై వ్యయం పెంచుకోవటం లాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి చివరకు అన్ని రకాల పథకాల మీద చేసిన ప్రభుత్వ వ్యయాలవలన వచ్చే ఉపాంత ప్రయోజనం సమానమయ్యేటట్లు చేసుకోవాలి.

అదే విధంగా పన్నుల భారం వలన ప్రజలందరి ఉపాంత త్యాగాలు కూడా సమానమయ్యేటట్లు చూసుకోవాలి.

## 2.7. గరిష్ట సామాజిక ప్రయోజనానికి కావలసిన పరిస్థితులు :

1) $$\frac{db}{de} = \frac{ds}{dt}$$

d - స్వల్ప మార్పు రేటు

b - సామాజిక ప్రయోజనం

e - ప్రభుత్వ వ్యయం

s - సామాజిక త్యాగం

t - పన్నులు

2) ప్రతి ప్రభుత్వ కార్యక్రమం మీద చేసే వ్యయం నుండి వచ్చే ఉపాంత సామాజిక ప్రయోజనం సమానంగా వుంటుంది. ఈ విషయాన్నే ఈ క్రింది విధంగా చెప్పవచ్చును.

$$\frac{db_1}{de_1}=\frac{db_2}{de_2}=\frac{db_3}{de_3}=\ldots\ldots\ldots\ldots\frac{db_n}{de_n}$$

(1, 2, 3 .............................. n ప్రభుత్వ వ్యయంతో చేపట్టే వివిధ కార్యక్రమాలు)

3. ప్రతి పన్ను చెల్లింపుదారుని ఉపాంత త్యాగం సమానం కావాలి. దీనినే ఈ క్రింది విధంగా చెప్పవచ్చును.

$$\frac{ds_1}{dt_1}=\frac{ds_2}{dt_2}=\frac{ds_3}{dt_3}=\ldots\ldots\ldots\ldots\frac{ds_n}{dt_n}$$

(1, 2, 3.......................... n వివిధ పన్ను చెల్లింపుదారులు)

బడ్జెట్‌లో ఈ క్రింది విత్త సూత్రాలు పాటించినపుడే దేశంలో గరిష్ట సామాజిక ప్రయోజనం సాధించబడుతుంది.

1. పన్ను చెల్లింపు దారులందరు పన్ను చెల్లింపు ద్వారా కోల్పోయిన ఉపాంత త్యాగం సమానం కావాలి.
2. అన్ని రకాల ప్రభుత్వ కార్యక్రమాల మీద వ్యయం చేసిన ప్రభుత్వ వ్యయాల వల్ల వచ్చే ఉపాంత ప్రయోజనం సమానం కావాలి.
3. ఉపాంత ప్రయోజనాలు మరియు ఉపాంత త్యాగాలు సమానం కావాలి.

రాబడి, వ్యయం అనే రెండు కోశ కార్యక్రమాలు ప్రజల కొనుగోలు శక్తిని పెంచటం, తగ్గించటంపై ప్రభావాన్ని కలుగజేస్తాయి. ఈ కోశ కార్యక్రమాల ద్వారా ప్రజలకొనుగోలు శక్తిలో మార్పు తెచ్చి తద్వారా గరిష్ట సామాజిక ప్రయోజనాన్ని పొందవచ్చునని తెలియుచున్నది. ఈ సిద్ధాంతాన్ని అనుసరించే ప్రభుత్వం తన ఆదాయ, వ్యయ కార్యక్రమాలను నిర్వహించి తద్వారా గరిష్ట సామాజిక ప్రయోజనాన్ని పొందాలని డాల్టన్ పేర్కొన్నాడు.

## 2.8. విమర్శలు - సిద్ధాంత పరిమితులు :

గరిష్ట సామాజిక ప్రయోజన సిద్ధాంతం ప్రభుత్వ కోశ కార్యక్రమాలకు మార్గదర్శకంగా ఉన్నప్పటికీ ఈ క్రింది ప్రాథమిక లోపాలవలన తీవ్ర విమర్శలకు కూడా గురైనది.

**1) సామాజిక ప్రయోజనాలు మరియు త్యాగాన్ని లెక్కించటంలో ఇబ్బందులు :** ఉపాంత ప్రయోజనాలు, త్యాగాలను లెక్కించటం సిద్ధాంత రీత్యాకుదురుతుంది. కానీ ఆచరణలో లెక్కించటం చాలా కష్టం. ఏ దేశం కూడా అన్ని రకాల వ్యయాల వలన వచ్చే వుపాంత ప్రయోజనాలను సమానం చేసుకోలేదు. ఎందుకనగా ప్రయోజనాలు కొన్ని మానసికమైనవి. గుణాత్మకమైనవి కావచ్చు, వాటిని వాస్తవంలో లెక్కించటం చాలా కష్టం. ప్రతి వ్యక్తినీ తీసుకొని అతను ప్రభుత్వ వ్యయం వలన ఎంత ప్రయోజనం పొందాడు? పన్ను చెల్లింపు వలన ఎంత త్యాగం చేశాడు అని లెక్కించటం అసాధ్యం. అలానే సామాజిక వస్తు సేవల వలన ప్రజలు పొందిన ప్రయోజనం వ్యక్తులందరికీ ఒకేలా వుండకపోవచ్చును. అదనపు పన్నుల వలన ఏ వ్యక్తి ఎంత ఉపాంత త్యాగం చేశాడు లేక అసంతృప్తికి గురయ్యాడనేది వాస్తవంలో లెక్కించటం అసాధ్యం. ప్రభుత్వ కార్యకలాపాలు గరిష్ట సామాజిక ప్రయోజన సిద్ధాంత రీత్యాకాక, ఆర్థికేతర అంశాల వలన కూడా ప్రభావితమవుతుంది. వ్యక్తిగత మరియు రాజకీయ అంశాలు కూడా ఒక్కో సందర్భంలో గరిష్ట సామాజిక ప్రయోజనాన్ని ప్రభావితం చేయవచ్చు.

**2) లెక్కింపు విధానంలో అస్థిరత:** పన్ను చెల్లింపువలన ఒక వ్యక్తికి ఎంత అసంతృప్తి కలిగిందనే కేవలం వ్యక్తులకు సంబంధించిన సూక్ష్మ సమస్య. ప్రభుత్వ వ్యయం వలన చేకూరే ప్రయోజనం స్థూల సమస్య కాబట్టి పన్నులవలన కోల్పోయిన ఉపాంత త్యాగం, ప్రభుత్వ వ్యయం వలన వచ్చే వుపాంత ప్రయోజనాల మధ్య సమానత్వాన్ని బేరీజు వేయటం సంక్లిష్ట సమస్యగా చెప్పవచ్చును.

**ప్రభుత్వ రుణాలలో అసంతృప్తి లేకుండుట :** ప్రభుత్వ తన ఆర్థిక అవసరాల నిమిత్తం రుణం తీసుకున్నట్లయితే ప్రజలకు ఎటువంటి అసంతృప్తి వుండదు. అదే పన్ను చెల్లించటానికి అయితే ప్రజలు కొంత అసంతృప్తికి గురవుతారు. కాబట్టి ప్రభుత్వ వ్యయానికి కావలసిన మొత్తాన్ని పన్నుల ద్వారా కాకుండా ప్రభుత్వం అప్పుల ద్వారా కూడా సమీకరించుకోవచ్చును.

**పూరక (ఫంక్షనల్) విత్త విషయంలో ఈ సిద్ధాంతానికి అతి తక్కువ ప్రాధాన్యత :** ఆర్థిక మాంద్యం వున్నప్పుడు ప్రభుత్వం వుపాంత ప్రయోజనాలు వుపాంత త్యాగాలు సమానం కావాలంటూ బేరీజు వేసుకోక ప్రభుత్వ వ్యయాన్ని పెంచుకోవలసి వుంటుంది. కాబట్టి దేశంలో నిరుద్యోగాన్ని తొలగించి ఆర్థిక మాంద్యాన్ని రూపుమాపేందుకే ప్రభుత్వం కృషి చేయాల్సి వుంటుంది. ప్రజాహిత వుపాధికార్యక్రమాలపై ప్రభుత్వం వ్యయం చేసి నిరుద్యోగ సమస్యను తొలగించి తద్వారా సార్థక డిమాండును మెరుగు పరచుకోవాల్సిన అవసరమున్నది. కాబట్టి ఆర్థిక మాంద్యాన్ని నివారించి ఆర్థికాభివృద్ధిని సాధించేందులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది. కాబట్టి గరిష్ట సామాజిక ప్రయోజన సిద్ధాంతం పూర్తిగా విస్మరించి ప్రభుత్వం తన విత్త కార్యక్రమాలను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చును.

పరిపూర్ణ వుద్యోగిత, ఆర్థిక సుస్థిరతవున్న పరిస్థితులకు ఈ సిద్ధాంతం వర్తిస్తుంది కానీ వ్యాపార చక్రాలను నిరోధించి ఆర్థికాభివృద్ధిని సాధించేందులకు ఈ సిద్ధాంతం ఏ విధంగానూ వుపకరించదు.

## 2.9. డాల్టన్ సూచించిన సామాజిక ప్రయోజన పరీక్షలు :

పైన పేర్కొన్న అనేక లోపాలు, విమర్శలు వున్నప్పటికీ సామాజిక ప్రయోజన సిద్ధాంతం ప్రభుత్వ విత్త కార్యక్రమాల్లో అతి ముఖ్యమైన సిద్ధాంతం అని గుర్తించబడింది. ప్రతి బడ్జెట్ తయారీలో గరిష్ట సామాజిక ప్రయోజనానికే ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

సామాజిక ప్రయోజనం లెక్కించటంలోగల ఇబ్బందులను గ్రహించి డాల్టన్ కొన్ని లెక్కించటానికి సాధ్యమయ్యే పరీక్షలను ప్రతిపాదించాడు.

**1. జాతిని కాపాడటం, రక్షించటం :** సమాజం నశించిపోకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి వున్నది. అందుకే రక్షణ వ్యయం, శాంతి భద్రతలను కాపాడేందులకు చట్టాలు, కోర్టులు, పోలీసులపై కూడా ప్రభుత్వం వ్యయం చేస్తుంది. ఇవన్నీ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యాలు కాబట్టి ప్రయోజనం, అప్రయోజనం అంటూ బేరీజువేసుకొని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోదు. విదేశీయుల దాడులు, అంతర్గత వర్గ పోరాటాలు, తీవ్రవాదం, హింసా ధోరణి, ప్రకృతి వైపరీత్యాలు మొదలగు అవాంఛనీయ పరిస్థితులు వచ్చినప్పుడు ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడటం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యంగా భావించాలి.

**2. జాతీయ వుత్పత్తిలో మెరుగుదల :** సామాజిక ప్రయోజనాలకుపకరించే జాతీయ వుత్పత్తిని పెంచుకోవటం, కోశ కార్యక్రమాల ముఖ్య వుద్దేశం. డాల్టన్ ప్రకారం, కోశ కార్యకలాపాలు ఈ క్రింది ప్రభావాలను చూపుతాయి.

1. ఉత్పాదక శక్తి పెరుగుతుంది కాబట్టి కొద్దిపాటి కృషితో తలసరి శ్రామిక వుత్పత్తిని బాగా పెంచవచ్చును.
2. ఉత్పత్తి యాజమాన్యాన్ని మెరుగుపరచుకొని తద్వారా ఆర్థిక వనరుల దుబారాను కనిష్ట స్థాయికి తగ్గించాలి.
3. వస్తువుల వుత్పత్తి తరహాను మార్చి సమాజ అవసరాలను బాగా తీర్చాల్సిన అవసరం వున్నది.

**శ్రామిక వుత్పాదకతలో మెరుగుదల :** శ్రామికుల వుత్పాదకత బాగా పెరిగితే తలసరి ఉత్పత్తి కూడా బాగా పెరుగుతుంది. శ్రామిక సామర్థ్యం కూడా పెరుగుతుంది. తద్వారా వారి జీవన ప్రమాణాలు కూడా పెరుగుతాయి. బడ్జెట్‌లో ఆదాయపన్ను పరిమితిని పెంచాలి. ఇంకా తక్కువ ఆదాయం పొందే వారిపై ప్రత్యక్ష పన్నులు తగ్గించాల్సియున్నది. తద్వారా పెరిగిన వేతనాలు, ఆదాయాలనుండి వుద్యోగుల / శ్రామికుల వ్యయార్హ ఆదాయాలు తగ్గకుండా చూడాలి. తద్వారా శ్రామికుల వుత్పాదక శక్తి కూడా పెరుగుతుంది. అలానే వుచిత విద్య, వైద్య సేవలు, వయోజన విద్య, నిరుద్యోగ భృతి, తక్కువ ఖరీదుకే సప్లయి చేసేందులకు ప్రభుత్వ వ్యయాన్ని వెచ్చించాల్సిన అవసరం కలదు. తద్వారా పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచవచ్చును.

**ఉత్పత్తి యాజమాన్యానికి ప్రోత్సాహకాలు :** పన్నులు అధికంగా విధించి వుత్పత్తి, కష్టపడే మనస్తత్వాన్ని నిరుత్సాహపరచకూడదు. పన్నుల మినహాయింపులు, తగ్గింపులు ఇచ్చి వుత్పత్తిలో నవకల్పనకు, వుత్పత్తి విధానంలో క్రొత్త పంథాను ప్రోత్సహించాలి. అలానే కార్పొరేషన్ పన్నులో కూడా మార్పు తెచ్చి అధిక భారాన్ని తగ్గించి పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి. తద్వారా వుత్పత్తి వనరులను అభిలషనీయ స్థాయిలో వినియోగించి దుబారాను తగ్గించేందుకు వీలుగా ప్రభుత్వ రాబడి మరియు వ్యయాలలో మార్పులు తీసుకురావాలి.

**ఉత్పత్తి తరహా పెరుగుదల :** సామాజిక ప్రయోజనాన్ని పెంచేందులకు ఒక్కో సందర్భంలో కొన్ని వస్తువుల వుత్పత్తి వినియోగాలపై ప్రభుత్వం ఆంక్షలు పెట్టవచ్చు. కొన్ని వస్తువుల వుత్పత్తిని నియంత్రించేందులకు ఒక్కో సందర్భంలో ప్రభుత్వమే ఆయా వస్తువుల వుత్పత్తిని తన ఆధీనంలో వుంచుకొని ఏకస్వామ్య ధోరణి చేపట్టవచ్చు. ఉదా : మనదేశంలో గతంలో నల్లమందుపై ప్రభుత్వమే ఏకస్వామ్యంగా తన ఆధీనంలో వుంచుకున్నది. అలానే ఐరోపా దేశాలలో పొగాకు, అగిపెట్టెలు మరికొన్ని వస్తువుల వుత్పత్తి, పంపిణీలు ప్రభుత్వ ఏకస్వామ్యం క్రిందే జరిగేవి. అలానే ప్రజాహిత సేవలు కూడా ప్రభుత్వ ఆధీనంలోనే వుంచుకొని ప్రజలకు తక్కువ రేటుకు అందజేయటం జరుగుతుంది. ఒక్కోసారి వుత్పత్తి ఖర్చుల కంటే కూడా తక్కువ ధరలకే అందించవచ్చు. ఆ నష్టాన్ని పూడ్చటానికి పన్నుల రాబడిని వినియోగించుకుంటుంది.

**పంపిణీలో మెరుగుదల :** సమాజంలోని ఆదాయ సంపదలను ఏవిధంగా ప్రజలందరికీ సమానంగా పంపిణీ చేయవచ్చు. అనే అంశం గురించి ప్రభుత్వ విత్త శాస్త్రంలో చర్చించి తగిన కోశ కార్యక్రమాలు చేపట్టబడతాయి. ఆ అంశాలు ఈ క్రింది విధంగా వుంటాయి.

1. ఆదాయ సంపదలలోగల అసమానతలను తొలగించటం పట్ల చాలా శ్రద్ధ కనబరచబడుతుంది. అసమానతలు తొలగించి గరిష్ట సామాజిక ప్రయోజనాన్ని కల్గించటమే ప్రభుత్వ కర్తవ్యంగా భావించపడుతుంది. పురోగామి పన్నుల విధానాన్ని అవలంబించటం, ధనికులపై అధికపన్ను విధించటం, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వ వ్యయాన్ని పెంచటంలాంటి కార్యక్రమాలు చేపట్టాలి.

2. ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందులకు సమాజ అభివృద్ధి పథకాలు, సాంఘిక సంక్షేమ పధకాలు చేపట్టాల్సిన అవసరం వున్నది. అందుకనుగుణంగా భారీగా ప్రభుత్వ వ్యయాన్ని పెంచవలసి వున్నది.

**ఆర్థిక స్థిరత్వం :** దేశంలో వ్యాపార చక్రాలను నిరోధించే విధంగా ప్రభుత్వం తన కోశసాధనాలను వుపయోగించి ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకురావాలి. వ్యాపార చక్రాలను నివారిస్తే ఆర్థిక స్థిరత్వం దానంతటదే ఏర్పడుతుంది. పెద్ద మొత్తంలో ప్రభుత్వ రుణాలు సేకరించటం, భారీగా పన్నులు విధించటం ద్వారా ద్రవ్యోల్బణాన్ని అరికట్టే ప్రయత్నం చేయాలి. లోటు ద్రవ్య విధానం ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని పెంచి ఆర్థిక మాంధ్యాన్ని తొలగించేందులకు కృషి చేయాలి.

**ఆర్థిక వృద్ధి మరియు పరిపూర్ణ వుద్యోగిత :** సంక్షేమ రాజ్యంలో ఆర్థిక వృద్ధి, పరిపూర్ణ వుద్యోగితలు ప్రభుత్వ ముఖ్య లక్ష్యాలుగా నిర్ణయించబడతాయి. కాబట్టి ఈ లక్ష్య సాధనకై కోశసాధనాల ద్వారా కృషి చేసి గరిష్ట సామాజిక ప్రయోజనాన్ని ప్రయత్నం చేయాలి.

**భావితరాల కోసం ఏర్పాటు :** దేశం అనేది ఒక శాశ్వత సంస్థ కాబట్టి రాబోయే తరాలను కూడా దృష్టిలో వుంచుకొని కొన్ని ఏర్పాట్లు చేయవలసియున్నది. ప్రస్తుత జనాభాతో పాటు భావి తరాల సంక్షేమం కోసం కూడా ప్రభుత్వం నిరంతర కృషి చేయాలి. సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో వుంచుకొని, కొన్ని దీర్ఘ కాలిక చర్యలను కూడా ప్రభుత్వం చేపట్టాల్సియున్నది. ప్రభుత్వం పన్నులు అధికంగా విధించి పొదుపును బాగా తగ్గిస్తే, భవిష్యత్‌లో భావి తరాల వుత్పాదకశక్తి కూడా తగిపోతుంది. కాబట్టి ఇది సమర్థనీయమైన చర్యకాదు. పెద్ద మొత్తంలో వ్యయం చేసి సామాజిక అవస్థాపనా సదుపాయాలను కలుగజేస్తే భావితరాలలో వుత్పాదకత కూడా పెరుగుతుంది. కాబట్టి అటువంటి చర్యలను చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వున్నది.

పై వివరణననుసరించి సామాజిక ప్రయోజనాన్ని నిరపేక్షంగా కొలవటం చాలా కష్టం. ప్రభుత్వ వ్యయం వలన వచ్చే వుపాంత సామాజిక ప్రయోజనం, పన్నుల విధింపు వలన కోల్పోయే వుపాంత త్యాగం లెక్కించటం సాధ్యపడదు. అలానే వివిధ వ్యక్తులు పొందే ప్రయోజనాలు, అప్రయోజనాలను వేరువేరుగా లెక్కించటం సాధ్యపడదు. గణాంక కొలమానాలేవీ లేనందున ఈ లెక్కింపు అసాధ్యం అని చెప్పవచ్చును. కాబట్టి ప్రభుత్వ విత్త కార్యక్రమాలకు మార్గదర్శకంగా గరిష్ట సామాజిక ప్రయోజన సిద్ధాంతం తన ప్రాధాన్యతను కోల్పోతున్నది.

కొన్ని లోపాలున్నప్పటికీ గరిష్ట సామాజిక ప్రయోజన సిద్ధాంతం ప్రభుత్వ విత్త కార్యకలాపాలకు మార్గదర్శక సూత్రమని చెప్పక తప్పదు. ప్రభుత్వం ఏదైనా ఆర్థిక కార్యక్రమం చేపట్టినపుడు లాభనష్టాలు బేరీజు వేసుకోవటం సాధారణంగా జరుగుతుంది. అయితే ఆర్థిక, ఆర్థికేతర కారకాలవలన కూడా లాభనష్టాలు ప్రభావితం అవుతాయి. కాబట్టి కొంత మేరకు ఊహాగానాలు చేయవలసి వుంటుంది. ప్రభుత్వ వ్యయం ఆదర్శంగా వుండాలంటే ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ఆర్థిక ప్రయోజనాలు కలిగించే పథకాల మీద, కార్యక్రమాల మీద వ్యయం చేయాల్సి వుంటుంది.

ప్రభుత్వ విత్తంలో తీసుకున్న ఏ చర్యనయినా వేరుచేసి లాభనష్టాలను బేరీజువేయలేము. కాబట్టి ప్రభుత్వ విత్తాన్ని ఒక దేశ సాధారణ ఆర్థిక విధానంలో ఒక అంతర్భాగంగానే చూడాల్సి వుంటుంది.

**శ్రీమతి హిక్స్ అభిప్రాయం :** ప్రభుత్వ విత్తంపై రచనలు చేసిన ఆధునిక అర్థశాస్త్ర వేత్తలలో శ్రీమతి హిక్స్ ఒకరు. ఆమె సామాజిక ప్రయోజనాన్ని అభిలషనీయ స్థాయికి పెంచటమే ప్రభుత్వ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నది. దేశంలో ప్రజల కోరికలను తీర్చేందులకు కావలసిన వస్తు సేవలను ఉత్పత్తి చేసేందులకు ప్రభుత్వం కృషిచేయాలి. అప్పుడే ప్రజల ఆర్థిక సంక్షేమం కూడా పెరుగుతుందని భావించారు. "ఒక వస్తూత్పత్తిని పెంచేందులకు, మరొక వస్తూత్పత్తిని తగ్గించకుండా ఉత్పత్తి కారకాలను, కేటాయించటమే అభిలషనీయ వుత్పత్తి" అని శ్రీమతి హిక్స్ పేర్కొన్నారు.

ఇంకోరకంగా చెప్పాలంటే అన్ని ఉత్పత్తి కారకాల వుపాంత ప్రతిఫలాలు సమానం అవ్వాలి. అనగా అభిలషీనియంగా వనరుల కేటాయింపు చేసి ఉత్పత్తి అభిలషనీయ స్థాయికి చేరుకునే విధంగా కృషి చేయాలి.

ప్రజలు కూడా గరిష్ట సంతృప్తిని పొందే విధంగా వుత్పత్తిని అభిలషనీయ స్థాయికి పెంచాలి. ఆదాయ పునఃపంపిణీ ద్వారా సమాజంలో ఏ వ్యక్తి సంక్షేమం తగ్గకుండా అందరి సంక్షేమాన్ని పెంచేందులకు కృషి చేయాలి. అని శ్రీమతి హిక్స్ భావించారు.

## 2.10 సారాంశం :

ప్రభుత్వ విత్త కార్యకలాపాలకు మార్గదర్శకంగా వుండే సిద్ధాంతమే ఈ గరిష్ట సామాజిక సిద్ధాంతం అని పేర్కొనవచ్చును. అందువల్లనే ఈ సిద్ధాంతాన్ని ప్రభుత్వ విత్త సిద్ధాంతం అని కూడా పిలవవచ్చు. ప్రభుత్వం పన్నుల ద్వారా అధిక రాబడిని పొందవచ్చు. కానీ ఆదాయంకోసం పన్నులు పెంచుకుంటూపోతే ఉపాంత త్యాగం పెరిగిపోతుంది. కాబట్టి ప్రజల త్యాగం ప్రభుత్వ వ్యయం వలన ప్రజలు పొందే ప్రయోజనం దృష్టిలో వుంచుకొని ఈ సిద్ధాంతం రూపకల్పన చేయబడింది. సనాతన ఆర్థిక వేత్తలు సిద్ధాంత ప్రాధాన్యత అంతగా గుర్తించలేకపోయినా డాల్టన్, పిగు మహాశయులిద్దరూ ఈ సిద్ధాంతాన్ని రూపొందించారు. ప్రభుత్వం పన్నుల విధింపులో ప్రభుత్వ వ్యయ కార్యక్రమాల్లో ప్రతి స్థాయిలో ఉపాంత త్యాగము, ఉపాంత ప్రయోజనం సమానంచేసి తద్వారా గరిష్ట సామాజిక ప్రయోజనాన్ని పొందేటట్లు చేయాలి. ఈ సిద్ధాంతాన్ని మస్‌గ్రేవ్ కూడా తనదైన శైలిలో చక్కగా వివరించాడు. గరిష్ట సామాజిక ప్రయోజనాన్ని సాధించేందులకు కావలసిన పరిస్థితులు, విమర్శలు, సిద్ధాంత పరిమితులు కూడా చర్చించబడినాయి. డాల్టన్ సూచించిన సామాజిక ప్రయోజన పరీక్షలు కూడా ఈ సందర్భంగా చర్చించబడినాయి. చివరిగా శ్రీమతి హిక్స్ అభిప్రాయం ప్రకారం సామాజిక ప్రయోజనాన్ని ఏ విధంగా అభిలషనీయ స్థాయికి తీసుకువెళ్ళవచ్చు అనే అంశంతో ముగించబడింది.

## 2.11 ముఖ్య పదాలు

1. గరిష్ట సామాజిక ప్రయోజనం :పన్నుల వలన కోల్పోయిన ఉపాంత త్యాగం ప్రభుత్వ వ్యయం వలన పొందిన వుపాంత ప్రయోజనం సమానం కావాలి.
2. సమిష్టి సామాజిక ప్రయోజనం : సమిష్టి ప్రయోజనం, సమిష్టి త్యాగం సమానంగా వుండటం.

## 2.12. స్వయం సమీక్ష ప్రశ్నలు :

1. "గరిష్ట సామాజిక ప్రయోజన సిద్ధాంతం సనాతన ఆర్థిక వేత్తలు విస్మరించినా డాల్టన్, పిగూల చేతిలో పరిపూర్ణత చెందింది" చర్చింపుము?
2. గరిష్ట సామాజిక ప్రయోజన సిద్ధాంతాన్ని విశదీకరించుము.
3. ప్రభుత్వ విత్త సిద్ధాంత పరిమితులు, డాల్టన్ సూచించిన సామాజిక ప్రయోజన పరీక్షలను వివరించండి.

**అభ్యాసాలు :**

1) సనాతన ఆర్థిక వేత్తల అభిప్రాయాలు
2) ఆధునిక యుగంలో ప్రభుత్వ రంగ పాత్ర
3) ఉపాంత త్యాగం పెరుగుతుందా?
4) ఉపాంత ప్రయోజనం క్షీణిస్తుందా?
5) గరిష్ట సామాజిక ప్రయోజనం - మస్ గ్రేవ్ వివరణ
6) సమిష్టి సామాజిక ప్రయోజనం మరియు సమిష్టి సామాజిక త్యాగం
7) గరిష్ట సామాజిక ప్రయోజనానికి కావలసిన పరిస్థితులు
8) డాల్టన్ సామాజిక ప్రయోజన పరీక్షలు
9) శ్రీమతి హిక్స్ అభిప్రాయం

**2.13. చదవవలసిన పుస్తకాలు :**


1. Dalton : Principles of Public Finance
2. Musgrave R.A. : Theory of Public Finance
3. Mankar Sarma : Public Finance Theory & Practice


డా॥ ఎల్. క్రిష్ణవేణి

పాఠం - 3

# సంఘటిత సమాజంలో మారుతున్న ప్రభుత్వ రంగ పాత్ర

## పాఠ్య నిర్మాణ క్రమం


3.0 ఉద్దేశాలు
3.1 ఉపోద్ఘాతం
3.2 మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగ పాత్ర
3.3 ప్రభుత్వ రంగం
3.4 ప్రైవేటు రంగం
3.5 సహకారము లేక పోటీ
3.6 ఆర్థికాభివృద్ధికి ప్రణాళికా విధానం
3.7 సారాంశం
3.8 ముఖ్య పదాలు
3.9 స్వయం సమీక్ష ప్రశ్నలు
3.10 చదవవలసిన పుస్తకాలు


## 3.0 ఉద్దేశాలు

ఈ పాఠ్యభాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది అంశాలను తెలుసుకోగలరు.

ఎ) మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ఆవశ్యకత, లక్షణాలు, మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగ పాత్ర విశ్లేషించగలగాలి.

బి) దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వ రంగం, ప్రైవేటు రంగం నిర్వహించే పాత్రను విశదీకరించగలగాలి.

సి) ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య 'సహకారము లేకపోటీ' దేశ ఆర్థికాభివృద్ధిని ఏ విధంగా ప్రభావితం చేస్తుందీ సమీక్షించగలగాలి.

## 3.1 ఉపోద్ఘాతం :

సంఘటిత సమాజంలో ప్రభుత్వరంగం కీలకమైన పాత్రను నిర్వహించాలని కీన్స్, మస్ గ్రేవ్ లాంటి అర్థశాస్త్ర వేత్తలు వక్కాణించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ, స్వేచ్ఛావాదం మీద పూర్తిగా ఆధారపడిన సనాతన ఆర్థిక వేత్తలు మాత్రమే ప్రైవేటు రంగానికి అత్యధిక ప్రాధాన్యత నిచ్చి ప్రభుత్వం కేవలం పరిమిత బాధ్యతలు మాత్రమే చేపట్టాలని, ప్రభుత్వ జోక్యం ఆర్థికాభివృద్ధిలో నామ మాత్రంగానే వుండాలని భావించారు. ఆర్థిక వ్యవస్థలోని రుగ్మతలన్నీ స్వార్థంతో వ్యక్తులు తీసుకున్న నిర్ణయాల వల్లనే సర్దుబాటవుతాయని కూడా సనాతన ఆర్థిక వేత్తలు పేర్కొన్నారు. మార్కెట్ యంత్రాంగంపై అపారమైన నమ్మకంగల సనాతన ఆర్థిక వేత్తలు, అసమానతలు, అసమతౌల్య స్థితి కేవలం స్వల్పకాలంలో ఏర్పడవచ్చు కానీ దీర్ఘకాలంలో అన్ని సమస్యలు తొలగిపోయి ఆర్థిక వ్యవస్థ తానంతటదే సమతౌల్య స్థితికి చేరుకుంటుందని కూడా విశ్వసించారు.

అయితే 1930లలో వచ్చిన ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని తొలగించటంలో సనాతన ఆర్థిక వేత్తల సిద్ధాంతాలు ఎటువంటి సమాధానాన్ని ఇవ్వలేకపోయాయి. కాబట్టి ప్రభుత్వ రంగం ద్వారానే ఆర్థిక అస్థిరతను తొలగించగలం అనే ఆలోచనకు కీన్స్ బీజం వేశాడు. ఆ తరువాత వచ్చిన ఆర్థిక వేత్తలందరూ ప్రభుత్వ రంగానికి కూడా ప్రైవేటు రంగంతో పాటు అధిక ప్రాధాన్యత నిచ్చారు. దేశ శ్రేయస్సుకు, ఆర్థికాభివృద్ధికి ముఖ్యంగా ప్రభుత్వ రంగం అత్యంత కీలక పాత్రను నిర్వహించాలని వక్కాణించారు.

కొన్ని దేశాలు సామాజిక, ఆర్థికాభివృద్ధికి అవసరమైన అంశాలు, విధులు అన్నీ ప్రభుత్వరంగమే చేపట్టాలని భావించి సామ్యవాద ఆర్థిక వ్యవస్థకు ప్రాధాన్యతనిచ్చారు. ప్రైవేటు రంగమే ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందనే దేశాలు పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను అనుసరిస్తున్నాయి. అయితే మన దేశంలాంటి దేశాలు మాత్రం మధ్యస్తంగా మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ద్వారా ఆర్థికాభివృద్ధి చెందాలని ప్రయత్నిస్తున్నాము. అనగా ప్రభుత్వ ప్రైవేటు రంగాలకు అవకాశం కల్పించి ఆర్థికాభివృద్ధిని సాధించాలని ప్రయత్నిస్తున్నాము.

ప్రపంచ వ్యాప్తంగా కీన్స్‌తో ప్రారంభమైన ప్రభుత్వ రంగం యొక్క కీలకపాత్రను 1990 వరకు చాలా దేశాలు ఆమోదించాయి. అయితే 1991 ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ వరవడిలో దాదాపు అన్ని దేశాల ధోరణి మారిపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలు అనాదిగా వుంటున్నాయి. అయితే సామ్యవాద దేశాల్లో, మిశ్రమ ఆర్థిక వ్యవస్థలలో కూడా ప్రభుత్వ రంగ ప్రాధాన్యత తగ్గించి, ప్రైవేటు రంగానికి అధిక ప్రాధాన్యత నివ్వటం జరిగింది.

మన దేశంలో స్వాతంత్ర్యానంతరం 1951 లో ప్రారంభించిన ప్రణాళికాభివృద్ధి వ్యూహంలో కూడా ప్రభుత్వ రంగం కీలకపాత్రను నిర్వహించటం ప్రారంభమై 1990 వరకు నిరాటంకంగా మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ద్వారానే అభివృద్ధి సాధ్యపడుతుందని భావించాము. అయితే 1991 లో ఒక్కసారిగా మన దేశ అభివృద్ధి వ్యూహంలో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ, అంతర్జాతీయ బ్యాంకులు ఇచ్చిన స్ఫూర్తితో మన దేశం కూడా ప్రపంచీకరణ మార్గాలకే ప్రాధాన్యత ఇచ్చింది.

ఇన్నాళ్ళూ కీలక పాత్రను నిర్వహించిన ప్రభుత్వ రంగం 1991 తరువాత అత్యంత అవసరమని భావించిన కార్యక్రమాల్లో తప్ప, మిగిలిన కార్యక్రమాల్లో తన జోక్యాన్ని క్రమేపీ తగ్గించుకుంటున్నది. ప్రైవేటీకరణకు పెద్ద పీట వేసి, ప్రభుత్వ రంగ పాత్రను క్రమేపి కుదించుకుంటున్నది. సనాతన ఆర్థిక వేత్తలగు ఆడమ్ స్మిత్, రికార్డో, జె.బి.సే, మాల్థస్, నాసు. విలియం సీనియర్‌లు ప్రతిపాదించిన సిద్ధాంతాలకే ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పెరుగుతున్నది. ఇలాంటి పోకడలే మన దేశంలోను కన్పిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో మారుతున్న ప్రభుత్వ రంగ పాత్రను తెలుసుకోవాలంటే ముందుగా మిశ్రమ ఆర్థిక వ్యవస్థలోని మంచీ, చెడులను బేరీజువేసుకోవాలి. ఆ తరువాత ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని సుగుణాలు, దుర్గుణాలు, ప్రభుత్వం పోషించాల్సిన పాత్ర గురించి ఈ పాఠ్యాంశంలో ప్రధానంగా చర్చించబడినాయి. ప్రణాళికాభివృద్ధిలో ప్రభుత్వ రంగం పాత్ర కూడా తదనుగుణంగా మారుతూనే వున్నది. ప్రభుత్వం అన్నీ తానే అయిపూర్తి ఆర్థికాభివృద్ధి బాధ్యతలను నిర్వహించాలా? లేక ప్రైవేటు రంగానికి కొన్ని మార్గదర్శకాలిచ్చి ఆరంగానికే అభివృద్ధి బాధ్యతను అప్పజెప్పాలా అనే అంశాలు వివరంగా చర్చించాల్సిన అవసరం ఉన్నది. ప్రభుత్వం తన పాత్రను కేవలం ప్రేక్షక పాత్రకు, పరిమితమై నిశ్శబ్ద నియంతగా వ్యవహరించాలా? అనే అంశాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం వున్నది. 1991 లో ప్రారంభమైన ఈ మార్పుల ప్రభావం ప్రభుత్వ విత్త శాస్త్రంలో గణనీయమైన మార్పులు తెస్తున్నాయి.

## 3.2. మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం యొక్క పాత్ర :

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ, సామ్యవాద ఆర్థిక వ్యవస్థలు రెండూ ఉత్తర, దక్షిణ ధృవాల్లాంటివి. ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రభుత్వం నామ మాత్రంగానే తన పాత్రను నిర్వహిస్తుంది. సామ్యవాద ఆర్థిక వ్యవస్థ ప్రభుత్వం అన్నీ తానై అభివృద్ధి కార్యక్రమాలను, దేశ అభివృద్ధిని భుజస్కందాలమీద మోస్తుంది. అయితే మన దేశం మాత్రం మధ్యంతర మార్గంగా మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఆలోచనకు బీజం వేసింది. 1956 నుండి 1990 వరకు నిరాటంకంగా ఇదే ధోరణి కొనసాగింది.

నేడు అభివృద్ధి చెందిన దేశాలుగా పేరుగాంచిన అమెరికా, ఇంగ్లాండు, ఇంకా అనేక ఐరోపా దేశాలు ప్రైవేటు రంగం ద్వారా గణణీయమైన అభివృద్ధిని సాధించగల్గాయి. 18వ 19వ శతబ్దాల ఆర్థిక వేత్తలు ప్రతిపాదించిన సిద్ధాంతాలనే వారు పూర్తిగా నమ్మి ప్రైవేటు రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చి, ప్రభుత్వం యొక్క పాత్రను పరిమితం చేశారు. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థలో స్వార్థం, దోపిడి, ఆర్థిక అసమానతలు, పంపిణీలో అవకతవకలు వుంటాయని, చివరికవి పెట్టుబడిదారీ వ్యవస్థ పతనానికి దారితీస్తాయని కారల్‌మార్క్స్ భావించాడు. మార్కెట్ శక్తులయిన సప్లయి, డిమాండులే అసమానతలు, అసమతౌల్య స్థితికి దారితీసాయి. ఆడమ్ స్మిత్ నమ్మిన 'అదృశ్య హస్తం' ఆర్థిక సమస్యలకు పరిష్కారం చూపలేకపోయింది.

**కొద్ది మంది పారిశ్రామిక వేత్తల పెత్తనం :** కార్ల్ మార్క్స్ చెప్పినట్లు పెట్టుబడిదారీ వ్యవస్థలో కొందరు పారిశ్రామిక వేత్తలు మరియు వ్యాపారస్తులు శ్రామికులను దోపిడీ చేస్తారు. లాభార్జన, ఏకస్వామ్య ధోరణి, ఆర్థిక శక్తి కేంద్రీకరణల వలన పెట్టుబడిదారులు ఆర్థిక కార్యక్రమాలపై పెత్తనం చేస్తారు. అందుకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఉద్యమించి అన్ని రకాల ఆర్థిక రుగ్మతలను తొలగించాలని కొందరి వాదన. ఉత్పత్తి కారకాలు, ఉత్పత్తి కార్యక్రమాలు ప్రభుత్వ ఆధీనంలో జరగాలని మార్క్స్ భావించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ధనికులు, పేదవారు లేక పారిశ్రామిక వేత్తలు, శ్రామికుల మధ్య వర్గ పోరాటం ప్రారంభమవుతుంది. చివరకు అది పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ పతనానికి దారి తీస్తుందని మార్క్స్ భావించాడు. స్వార్థీయు, ప్రైవేటు ఆస్తులు కలిగివుండే హక్కు వలన పెట్టుబడిదారులు మరింత ధనికులవుతారు.

కనిష్ట వ్యయంతో గరిష్ట ఉత్పత్తి పొందాలనే దురాలోచనతో శ్రామికుల వేతనాలు తగ్గించటం, ఒక్కసారిగా యంత్రీకరణ చేసి శ్రామికులను పని నుండి తొలగించటం లాంటి చర్యలు చేపట్టి మిగులు విలువను పెంచుకునేందుకు పారిశ్రామిక వేత్తలు నిరంతరం ప్రయత్నిస్తారు.

1930లో వచ్చిన ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని తొలగించటానికి పెట్టుబడిదారీ వ్యవస్థ యంత్రాంగం ఏ విధమైన మార్గాన్ని సూచించలేక పోయింది. ఆ పరిస్థితులలో ప్రభుత్వం కీలక పాత్రను నిర్వహిస్తేనే ఆర్థిక మాంద్యం నుండి బయటపడగలమని పెట్టుబడి దారీ వ్యవస్థననుసరించే దేశాలు సైతం గుర్తించాయి. ఈ పరిస్థితులలో ప్రభుత్వం ద్వారానే అసమతౌల్య పరిస్థితుల నుండి బయటపడగలమని, ఆర్థిక వ్యవస్థను సజావుగా నడపగలమనే నగ్నసత్యాన్ని కీన్స్ మహాశయుడు కూడా ప్రపంచానికి తెలియజేశాడు.

**సామ్యవాదమే సమాధానమా? :** ఈ నేపథ్యంలో కొందరు ఆర్థిక వేత్తలు రష్యా, ఐరోపా దేశాలు, చైనా, వియత్నాం, క్యూబాలాంటి దేశాల ఆర్థిక వ్యవస్థలు అనుసరిస్తున్న సామ్యవాద వ్యవస్థ పట్ల దృష్టిసారించారు. ఉత్పత్తి కారకాలు, ఉత్పత్తి కార్యక్రమాలు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో వుండాలనేది వారి నినాదం. వ్యక్తి స్వేచ్ఛ స్వార్థానికి, దోపిడీకి, లాభార్జనకు, అసమానతలకు దారి తీస్తుంది. కాబట్టి ప్రైవేటు ఆస్తులు వుండకూడదని కూడా సామ్యవాదం నమ్ముతుంది. సామ్యవాదం ద్వారా దోపిడీ లేని సమసమాజ స్థాపన చేయవచ్చు. ప్రైవేటు రంగానికి అసలు స్థానం వుండదు. ప్రభుత్వ రంగమే అన్ని విషయాలలోను కీలక పాత్రను నిర్వహిస్తుంది.

సనాతన ఆర్థిక వేత్తలలో చివరివాడైన పిగు కూడా సామ్యవాద ప్రణాళికా విధానం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ కంటే అన్ని విధానాలలో మెరుగ్గా వుంటుందని భావించాడు.

అయితే కీన్స్ పెట్టుబడిదారీ వ్యవస్థలో కొన్ని లోపాలున్నా, పోటీ తత్వాన్ని పెంచటంలో, ఉత్పత్తిలో సమర్థతను పెంచాలన్నా పెట్టుబడిదారీ వ్యవస్థ చాలా మెరుగైన విధానమని పేర్కొన్నాడు. ఆర్థిక, రాజకీయ విషయాలలో వ్యక్తి స్వేచ్ఛను హరింపజేసే సామ్యవాద వ్యవస్థలో ప్రభుత్వం ఆధిపత్యం నిరంతరం కొనసాగుతుంది. అయితే ఆధునిక వ్యవస్థలో ప్రభుత్వ సూచనలు, నియంత్రణలు తప్పనిసరిగా వుండాలని కూడా కీన్స్ పేర్కొన్నాడు. కాబట్టి ప్రభుత్వ జోక్యం ఒకవైపు, మార్కెట్ శక్తులపై ఆధారపడిన యంత్రాంగం మరొకవైపు కొనసాగుతాయి. కాబట్టి కీన్స్ అభిప్రాయాలను నిశితంగా పరిశీలిస్తే మిశ్రమ ఆర్థిక వ్యవస్థ లక్షణాలు కన్పిస్తాయి.

**మిశ్రమ ఆర్థిక వ్యవస్థ - లక్షణాలు :**

ఎ) ప్రభుత్వ, ప్రైవేటు రంగాలూ కలిసి ఉత్పత్తి, పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తాయి.

బి) ప్రభుత్వ రంగంలో కీలకమైన పరిశ్రమలు, సేవలు నిర్వహింపబడతాయి. దేశ భద్రత దృష్ట్యా, ప్రజా సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వమే కొన్ని సామాజిక బాధ్యతలను నిర్వహించాల్సి వుంటుంది.

సి) భారీవ్యయంతో, పెద్ద స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్న వ్యవహారాలు చేపట్టేందులకు ప్రజలు ముందుకురారు. కాబట్టి విధిగా ప్రభుత్వమే చేపట్టాల్సి వుంటుంది.

డి) వ్యక్తులు లాభార్జన, స్వార్థం లేకుండా ఏ పనులూ చేపట్టరు. కాబట్టి సామాజిక వస్తు, సేవలను తయారు చేసి, పంపిణీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

ఇ) వ్యక్తులు సాధారణంగా వెంటనే ప్రతిఫలాలిచ్చే కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తారు. ప్రభుత్వం దీర్ఘకాలిక ఫలితాలిచ్చే కార్యక్రమాలు కూడా చేపడుతుంది.

ఎఫ్) ప్రైవేటు వ్యక్తులు లాభార్జనతో ఉత్పత్తి, పంపిణీ కార్యక్రమాలు కొనసాగించినా, పరోక్షంగా సామాజిక అవసరాలు కూడా తీరతాయి.

జి) సమర్థత, వనరుల పొదుపు, అజమాయిషీ, పర్యవేక్షణ మొదలగు అంశాలలో ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వం కంటే అన్ని విధాల మెరుగైన స్థానంలో వుంటారు.

హెచ్) దుబారా లేకుండా కనిష్ట వ్యయంతో గరిష్టఉత్పత్తి లేక గరిష్ట సంతృప్తిని పొందాలంటే ప్రైవేటు రంగంలోనే మెరుగ్గా వుంటుంది.

ఐ) అన్ని బాధ్యతలు ప్రభుత్వమే చేపడితే నిధుల కొరత, పర్యవేక్షణ చేయటంలో తలకుమించిన భారం పడుతుంది.

జె) ప్రైవేటు వ్యక్తులకు స్వేచ్ఛనిస్తే వారు లాభాలకోసం కృషిచేసినా పరోక్షంగా పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగవకాశాలు, స్థూల జాతీయోత్పత్తి, జాతీయాదాయాలను పెంచడానికి దోహదపడతారు.

కె) ప్రైవేటు వ్యక్తులలో పొదుపు, పెట్టుబడి, యాజమాన్య ధోరణులను నిరుత్సాహపరచకుండా ఆసక్తి చూపే వారిని చొరవగా ముందుకు వెళ్ళేందులకు దోహదపరచాలి.

ఎల్) అయితే ప్రైవేటు రంగంలో ధరలు ఉత్పత్తి, పంపిణీ, ఎగుమతులు, లాభాలు మొదలగు వాటిపై నియంత్రణలు, పన్నులు వుండాలి.

ఎం) వ్యక్తికి స్వేచ్ఛ ఇచ్చినప్పటికి ఇష్టానుసారం వ్యవహరించకుండా ప్రభుత్వ అనుమతికి లోబడే అన్ని కార్యక్రమాలు నిర్వహించాల్సి వుంటుంది.

ఎన్) రక్షణ, విదేశీ వ్యవహారాలు, రైల్వేలు మొదలగు జాతీయ ప్రాధాన్యతగల అంశాలు మాత్రం విధిగా ప్రభుత్వమే చేపట్టి ప్రజలకు సేవచేయాలి. .

ఓ) లాభాపేక్షతో ప్రైవేటు రంగం, సామాజిక శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వ రంగం ఏకకాలంలో ఎవరి కార్యక్రమాలను వారు నిర్వహిస్తారు.

### 3.3 ప్రభుత్వ రంగం

1947కు ముందు మన దేశంలో ప్రభుత్వ రంగం అనేది వాస్తవంగాలేదు. మొదట్లో రైల్వేలు, పోర్టులు, టెలిగ్రాఫ్‌లు మొదలగు సంస్థలు ప్రభుత్వరంగ ఆధీనంలో వుండేవి. 1951లో పంచవర్ష ప్రణాళికలు మొదలయినప్పటి నుండి ప్రభుత్వ రంగ ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. ముఖ్యంగా 1956 పారిశ్రామిక విధానంతో ప్రభుత్వరంగ పాత్ర క్రమేపీ పెరుగుతూ వచ్చింది.

1956 పారిశ్రామిక విధాన తీర్మానంలో అత్యంత కీలకమైన కార్యక్రమాలన్నింటిలో ప్రభుత్వ రంగ ప్రాధాన్యత వుండాలని నిర్ణయించబడింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వెనుకబడిన, అభివృద్ధి చెందుతున్న మన దేశంలో అనేక రుగ్మతలు బయటపడ్డాయి. వ్యవసాయ ప్రాధాన్యతగల మన దేశంలో పారిశ్రామికాభివృద్ధి అంతంత మాత్రంగానే వున్నది. నిరుద్యోగం, అతితక్కువ పొదుపు రేటు, తక్కువ పెట్టుబడి మరియు పారిశ్రామిక రంగానికి అత్యవసరమైన అవస్థాపనా సదుపాయాలు కూడా తక్కువగా వుండటంతో మనదేశంలో ఈ సమస్యలన్నింటినీ రూపుమాపాలంటే ప్రభుత్వ రంగం కీలకపాత్ర నిర్వహించాలని గుర్తించబడింది. ప్రైవేటు రంగంలో కూడా పెట్టుబడులు అంతంత మాత్రంగానే వుండటం, యాజమాన్య సామర్థ్యం తక్కువగా వుండటం, దీర్ఘకాలం ప్రతిఫలాలకు వేచి యుండాల్సిన పరిస్థితి రావటంతో ప్రైవేటు వ్యక్తులెవ్వరూ ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగం ఆర్థికాభివృద్ధికి ఒక యంత్రంలా సహకరిస్తుందని తద్వారా దేశ వెనుకబాటు తనాన్ని తగ్గించవచ్చని భావించబడింది.

ప్రభుత్వరంగ వ్యాప్తి :

ఎ) కీలక రంగాల వృద్ధిని వేగవంతం చేయటం

బి) రైల్వేలు, టెలీ కమ్యూనికేషన్లు, న్యూక్లియర్ శక్తి, రక్షణ మొదలగు ముఖ్య రంగాలకు కావలసిన అవసరాలన్నీ చూడటం

సి) ప్రైవేటు రంగం ద్వారా ఏర్పడిన ఏకస్వామ్యాలను మరియు కొన్ని రంగాలలో ఏర్పడిన బహుళజాతి సంస్థలను తట్టుకునేందుకులకు విధిగా ప్రభుత్వ రంగం వుండాలని భావించబడింది.

డి) ప్రజల వినియోగానికి అవసరమైన అన్ని రకాల వస్తువుల లభ్యతను పెంచి, ధరలు పెరగకుండా, ప్రజలకు అందుబాటులో వుండేటట్లు చేయటం.

ఇ) నష్టాల్లో వున్న పారిశ్రామిక యూనిట్లను ప్రభుత్వం తీసుకొని ఉద్యోగావకాశాలను తగ్గకుండా చేయాలి.

**కేంద్ర ప్రభుత్వ సంస్థలు :** 1951లో కేవలం 5 సంస్థలు మాత్రమే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో వుండేవి. 1961లో 47కు, 1980లో 179కు, 1990లో 244, 2000లో 240కు, 2001లో 242కు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య పెరిగింది. ఈ సంస్థలలో మొత్తం పెట్టుబడి 1951లో కేవలం రు. 29 కోట్లు మాత్రమే వుండేది. 2001 నాటికి రు. 2, 74,114 కోట్లకు పెరిగింది.

పారిశ్రామికాభివృద్ధి మరియు సంప్రదింపుల సేవలు, రవాణా సేవలు, టెలీ కమ్యూనికేషన్ల సేవలలో కూడా ప్రభుత్వ రంగం కీలక పాత్రను నిర్వహించుచున్నది.

ప్రభుత్వ రంగంలో భారీ పెట్టుబడులు పెట్టి పారిశ్రామికాభివృద్ధికి విశేషంగా కృషిచేసిన ఘనత ప్రభుత్వ రంగానికే దక్కుతుంది. ప్రభుత్వ రంగంలో పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి పారిశ్రామికాభివృద్ధికి పునాది వేసింది. ముఖ్యంగా భారీ మరియు మౌలిక పరిశ్రమల స్థాపనకై ప్రభుత్వ రంగం విశేష కృషి చేస్తున్నది.

**ప్రభుత్వరంగ ధ్యేయాలు :**

ఎ) అవస్థాపనా సదుపాయాలను వృద్ధిపరచి తద్వారా దేశ అభివృద్ధిని వేగవంతం చేయటం

బి) అభివృద్ధికి కావలసిన ఆర్థిక వనరులను సమకూర్చటం

సి) ఆదాయ, సంపదల పునఃపంపిణీని ప్రోత్సహించటం

డి) ఉద్యోగావకాశాలను పెంపొందించుట

ఇ) సంతులిత ప్రాంతీయాభివృద్ధిని సాధించుట.

ఎఫ్) చిన్న తరహా మరియు అనుబంధ పరిశ్రమలను అభివృద్ధి పరచుట

జి) ఎగుమతులను ప్రోత్సహిస్తూ మరొక ప్రక్క దిగుమతి ప్రత్యామ్నాయ విధానాన్ని అవలంబించటం.

**భారత దేశంలో ప్రభుత్వ రంగ పాత్ర :** స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ రంగం విస్తృతమైన పాత్రను నిర్వహిస్తున్నది. ముఖ్యంగా ప్రణాళికలు ప్రారంభించినప్పటి నుండి ప్రభుత్వరంగం తన పరిధిని విపరీతంగా విస్తరించుకున్నది. 1956 పారిశ్రామిక విధాన తీర్మానంలో ప్రభుత్వ రంగ ప్రాధాన్యత ద్వారా సామ్యవాదరీతి సమాజ స్థాపన చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నది.

**ఉద్యోగ అవకాశాలను పెంపొందించటం :** ప్రభుత్వ పరిపాలన, డిఫెన్సు మరియు ఆరోగ్యం, విద్య, పరిశోధన, మరియు ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించే రంగాలలో ఉద్యోగావకాశాలు కల్పించబడినాయి. 2000 సంవత్సరంలో 193.1 లక్షల మందికి ప్రభుత్వ రంగంలో ఉద్యోగావకాశాలు ఏర్పాటుచేయబడినాయి.

**స్థూల జాతీయోత్పత్తితో ప్రభుత్వ రంగం వాటా :** 1950-51లో నికర జాతీయోత్పత్తిలో కేవలం 7.5%, మాత్రమే ప్రభుత్వ రంగం సమకూర్చింది. అయితే 1998-99 నాటికి 23.0%కు పెరిగింది. ప్రభుత్వ రంగ సంస్థలు బాగా విస్తరించటమే దీనికి గల కారణంగా పేర్కొనవచ్చును.

**పొదుపు, మూలధన రూపకల్పనలలో ప్రభుత్వ రంగం వాటా :** 1951-56లో ప్రభుత్వరంగంలో స్థూల జాతీయ మూలధన రూపకల్పన 10.7% నుండి ఎనిమిదవ ప్రణాళికా కాలం నాటికి 24.6%కు పెరిగింది. అదే కాలంలో స్థూల స్వదేశీ పొదుపు 1.77 నుండి 1.4%కు తగ్గింది.

**స్థూల స్థిర మూలధన రూపకల్పనలో ప్రభుత్వరంగ వాటా :** పరిశ్రమలు, భవనాలు, యంత్రాలు, సామగ్రి, పరికరాలు మరియు ఇతర మూలధన వస్తువులపై పెద్ద మొత్తంలో స్థిర మూలధనాన్ని వ్యయం చేయాల్సి వుంటుంది. అంతేకాక ఆర్థిక అవస్థాపనా సదుపాయాలపై కూడా ప్రభుత్వ రంగం పెద్ద మొత్తాన్ని వ్యయం చేసి దేశ అభివృద్ధికి సహాయపడుతున్నది.

ప్రభుత్వ రంగ అమ్మకాలు మరియు ఆదాయాలు : ప్రభుత్వ రంగంలో తయారైన వస్తువ, సేవలను అమ్మటం ద్వారా, లేదా లాభాలు పొందటం ద్వారా ప్రభుత్వ రంగం గణనీయమైన మొత్తాల్లో ఆదాయం పొందుతున్నది.

**బలమైన పారిశ్రామిక పునాది :** విమర్శలు కొన్ని వున్నా పారిశ్రామికాభివృద్ధికి అత్యంత అవసరమైన, కీలకమైన మౌలిక వస్తువులు, మూలధన వస్తువులను తయారు చేయటంలో ప్రభుత్వ రంగం కీలకమైన పాత్రను నిర్వహించింది. ఆయా పరిశ్రమలకవసరమైన మూలధనం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవటం ప్రైవేటురంగానికి సాధ్యపడదు కాబట్టి విధిగా ప్రభుత్వ రంగమే చేపట్టాలి.

**ఎగుమతులు ప్రోత్సహించటంలో ప్రభుత్వరంగ పాత్ర :** మన స్వదేశీ అవసరాలు తీర్చి, మిగులు ఉత్పత్తిని సాధించి తద్వారా ఎగుమతులను ప్రోత్సహించటంలో ప్రభుత్వరంగం కీలకపాత్రను నిర్వహిస్తున్నది. ప్రభుత్వ రంగ ఎగుమతల ద్వారా విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని కూడా సంపాదించగలుగుతున్నాము, 1965-66లో కేవలం రూ. 35 కోట్లు మాత్రమే ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం సంపాదించినా 2000-01 నాటికి ఆ మొత్తం రు. 24,772 కోట్లకు పెరిగింది.

**దిగుమతి ప్రత్యామ్నాయం :** పూర్వం మనం దిగుమతి చేసుకున్న వస్తువులను నేడు మన దేశంలో మనకు మనమే ఆయా వస్తువులకు ప్రత్యామ్నాయ వస్తువులను తయారుచేసుకునే ప్రయత్నం చేస్తున్నాము. దిగుమతి ప్రత్యామ్నాయ విధానాల ద్వారా మనం విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని పొదుపు చేయవచ్చు. స్వావలంబన కూడా సాధించవచ్చు.

**స్వదేశీ వనరులను పెంచటంలో ప్రభుత్వరంగం :** ప్రణాళికాభివృద్ధికే కాక, దేశ అభివృద్ధికి కూడా అవసరమైన వనరులను సమకూర్చటం ప్రభుత్వరంగం కీలకపాత్రను నిర్వహించుచున్నది. 2000-2001లో స్వదేశీ వనరులను రు. 37,802 కోట్ల వరకు ప్రభుత్వ రంగం సాధించగల్గింది. ఇది ఆహ్వానించదగిన పరిణామంగా పేర్కొనవచ్చును.

**ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చటం :** కార్పొరేట్ పన్నులు, ఎక్సైజ్ పన్ను, కస్టమ్స్ సుంకాలు మరియు ఇతర పన్నుల ద్వారా ఖజానాకు ఆదాయం చేకూరుతున్నది. తద్వారా ప్రణాళికా వ్యయాన్ని తట్టుకునేందులకు కావలసిన ఆర్థిక వనరులను ప్రభుత్వ రంగం సమకూర్చుతున్నది.

**ప్రభుత్వరంగ వైఫల్యాలు :**

ఎ) ప్రభుత్వ రంగ సంస్థలు - అనేకం ఖాయిలాపడిన పరిశ్రమలుగా మారాయి.

బి) ఉదార ధరల విధానం అనుసరించి ప్రజలకు, పరిశ్రమలకు చౌకగా వస్తుసేవలనందించటం వలన లాభాలు లేకపోగా నష్టాల్లో నడవవలసివస్తున్నది.

సి) ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లు భారంగా మారాయి.

డి) పర్యవేక్షణ సరిగాలేక ఉత్పత్తి కారకాల దుర్వినియోగం వలన నష్టాలు అధికంగా ఎదుర్కొనవలసి వస్తున్నది.

**ప్రభుత్వ రంగ పాత్ర తగ్గించటం :**

ఎ) 1991 నూతన ఆర్థిక మరియు పారిశ్రామిక విధానాలు ప్రారంభించినప్పటినుండి ప్రభుత్వం ఆంక్షలు తగ్గించింది.

బి) లైసెన్సు విధానం సరళీకృతం చేయబడింది.

సి) చట్టాలన్నింటినీ సరళీకృతం చేసి తద్వారా ప్రభుత్వ నియంత్రణ, అజమాయిషీలను తగ్గించింది.

డి) విదేశీ పెట్టుబడులు, బహుళ జాతి సంస్థలకు స్వాగతం పలికింది. తద్వారా పరోక్షంగా ప్రైవేటీకరణకు ప్రోత్సాహకాలు పెంచింది.

ప్రభుత్వ పరిమిత పాత్ర : ప్రభుత్వం తన ఆధిపత్యాన్ని తగ్గించుకొని ఈ క్రింది ముఖ్యమైన అంశాలనే భవిష్యత్‌లో చేపట్టాలని తీర్మానించింది.

ఎ) అవసరమైన వస్తువులు

బి) చమురు, ఘనుల మొదలగు వాటిపై ఆధిపత్యం

సి) దీర్ఘకాలిక అభివృద్ధికి అవసరమైన సాంకేతికాభివృద్ధిని పెంపొందించటం.

డి) నష్టాల్లో వున్న ప్రభుత్వరంగ సంస్థలను అమ్మాలని 1991లో నిర్ణయించినా నేడు లాభాల బాటలో వున్న ప్రభుత్వ రంగ సంస్థలను సైతం అమ్మజూపింది. ప్రభుత్వ రంగ సంస్థల వాటాల ఉపసంహరణ ద్వారా ప్రభుత్వం తన పాత్రను మరింత పరిమితం చేసుకుంటున్నది.

## 3.4. ప్రైవేటు రంగం :

జపాన్, మరియు అనేక పశ్చిమ దేశాలు అభివృద్ధిలో ప్రైవేటు రంగం కీలక పాత్రను నిర్వహించి అత్యున్నత అభివృద్ధి సాధించటానికి దోహదపడిందని చరిత్ర తెలియజేస్తున్నది. లాభాపేక్ష, స్వార్థంతో ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు వ్యవహరించినా దేశ అభివృద్ధిలో వారి కృషి గణనీయమైనది. నవకల్పనలు చేయటంలో, క్రొత్త ఉత్పత్తి విధానాలలో, క్రొత్త వస్తువులను తయారు చేయటంలో, మార్కెట్ విధానంలో ప్రైవేటు రంగం విప్లవాత్మక మార్పులను తెచ్చి గణనీయ లాభాలను పొందగల్గిందని కూడా తెలియుచున్నది. అందుకే 1951లో ప్రణాళికాభివృద్ధికి శ్రీకారం చుట్టిన మన దేశం ప్రైవేటు రంగానికి కూడా కీలక స్థానాన్ని కల్పించింది.

**ప్రైవేటు రంగం - ఆర్థికాభివృద్ధి :** స్వాతంత్ర్యానికి పూర్వం కూడా మన దేశంలో వస్త్ర పరిశ్రమ, జనపనార పరిశ్రమ, చక్కెర పరిశ్రమ, పేపర్ పరిశ్రమ, వంటనూనెల ఉత్పత్తి మొదలగు వాటిలో ప్రైవేటు రంగం కీలకపాత్రను నిర్వహించినట్లు తెలియుచున్నది. ఇనుము - ఉక్కు పరిశ్రమను స్థాపించిన టాటా కంపెనీ ప్రైవేటు రంగ చొరవకు, అభివృద్ధికి తార్కాణంగా పేర్కొనవచ్చును. స్వాతంత్ర్యానంతరం ప్రైవేటు రంగానికి ప్రభుత్వమే అనేక ప్రోత్సాహకాలను కల్పించింది.

ప్రైవేటు రంగం ఇంటర్మీడియట్ వస్తువులు మరియు వినియోగవస్తువుల తయారీలో చొరవ చూపేందులకు అవకాశాలు కల్పించబడినాయి. రసాయనాలు రంగులు, ప్లాస్టిక్ వస్తువులు, మెషీన్ టూల్సు, ఫెర్రస్, నాన్ ఫెర్రస్ లోహాలు, రబ్బరు మొదలగు అనేక వస్తువులు నేడు ప్రైవేటు రంగంలో తయారు చేయబడినాయి. భారతదేశం నేడు అనేక వినియోగ వస్తువులలో స్వయం సమృద్ధి సాధించగల్గిందంటే ఆ ఘనత ప్రైవేటు రంగానికే దక్కుతుంది. ఇతర మూడవ ప్రపంచ దేశాలకు సైతం నేడు మన ప్రైవేటు రంగం సహాయం చేసే స్థాయికి ఎదిగిందంటే దాని ప్రాధాన్యత ఎంతగా వృద్ధి చెందిందో తెలుసుకోవచ్చును.

**ప్రైవేటు రంగంలో వ్యవసాయం :** ఇప్పటికీ 68% జనాభా వ్యవసాయ రంగం మీదే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రాథమిక రంగంలోని పాల పరిశ్రమ, పశుగణాభివృద్ధి, కోళ్ళ పరిశ్రమ మొదలగు వాటి అభివృద్ధిలో కూడా ప్రైవేటు రంగం అగ్రస్థానంలో వున్నది. ఈ వ్యవసాయ రంగంలో పూర్తిగా ప్రైవేటు యాజమాన్యమే కన్పిస్తుంది. ఈ రంగంలో ఏకస్వామ్య ధోరణి, కేంద్రీకరణలు అంతగా వుండవు.

**ప్రైవేటు రంగంలో వ్యాపార రంగం :** వ్యాపారం, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాలలో ప్రైవేటు రంగం కీలకపాత్రను నిర్వహిస్తుంది. ఈ రకమైన సేవలు చేయటంలో ప్రభుత్వం అంత చొరవ చూపించలేదు. ప్రైవేటు వ్యాపారంలో కల్తీ, బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, వినియోగదారుల దోపిడీ జరిగే అవకాశం వున్నదని భావిస్తే ప్రభుత్వం నిఘా వహించాలి. కాబట్టి ప్రభుత్వం ధరల విధానం, ఉత్పత్తి, ఎగుమతులు, లాభాల తీరు తెన్నులను గమనిస్తూ నిఘా వహించి వినియోగదారులపట్ల శ్రద్ధ తీసుకోవాల్సి వుంటుంది. మొత్తం మీద వ్యాపార రంగంలో ప్రైవేటు రంగం కీలకపాత్రను నిర్వహించాల్సి వుంటుంది.

**భారత ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటు రంగం :** మన దేశంలో జాతీయాదాయం, ఉద్యోగవకాశాలు పెంచటంలో ప్రైవేటు రంగం కీలకమైన పాత్రను నిర్వహిస్తున్నది. 1998-99లో 76.7% ఉత్పత్తి ప్రైవేటు రంగం ద్వారానే నికర స్వదేశీ ఉత్పత్తికి సమకూర్చుతున్నది.

వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, అడవుల పెంపకం, చిన్నతరహా పరిశ్రమలు, రిటైల్ వ్యాపారం, నిర్మాణం, రవాణా (రైల్వేలు తప్ప) మొదలగు వాటిలో ప్రైవేటు రంగం కీలకపాత్రను నిర్వహిస్తున్నది. మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో కూడా ప్రవేటు రంగం తన ప్రత్యేకతను చాటుకుంటున్నది.

**చిన్న తరహా, కుటీర పరిశ్రమల ప్రగతిలో ప్రైవేటురంగం** : పారిశ్రామికాభివృద్ధికి కీలకమైన చిన్న తరహా, కుటీర పరిశ్రమలు ప్రైవేటు రంగంలో అగ్రస్థానంలో విరాజిల్లుతున్నాయి. స్థానిక వనరులను వినియోగించుకోవటంలో, ఉపాధి సదుపాయాలను కల్పించటంలో, ఎగుమతులను పెంచటంలో ఈ చిన్నతరహా మరియు కుటీర పరిశ్రమలు గణనీయమైన పాత్రను నిర్వహిస్తున్నవి. ఈ పరిశ్రమలలో అధిక శాతం ప్రైవేటు రంగంలోనే వున్నాయి. ప్రభుత్వం ప్రైవేటు పెట్టుబడిదారులు లేక పారిశ్రామిక వేత్తలకు కొన్ని ప్రోత్సాహకాలు మాత్రమే కల్పిస్తున్నది. అయినప్పటికి ప్రైవేటురంగంలో పరిశ్రమలు ప్రభుత్వ రంగ పరిశ్రమలకు ధీటుగా తయారైనాయి.

**ప్రైవేటు రంగ పరిమితులు లేక వైఫల్యాలు** : ప్రైవేటు రంగం మన ఆర్థిక వ్యవస్థకు అంతర్గత బలాన్ని చేకూర్చుతున్నది. అయినప్పటికీ ప్రైవేటు రంగంలో కొన్ని బలహీనతలు, లోపాలు కూడా ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి.

ఎ) లాభార్జనే ముఖ్య ధ్యేయం కాబట్టి వినియోగదారులను మోసపుచ్చి అధిక లాభాలు పొందాలని ప్రయత్నిస్తారు.

బి) పారిశ్రామిక సంస్థలు కొన్ని ఏకస్వామ్య ధోరణులను సృష్టిస్తున్నాయి.

సి) ఆర్థికశక్తి కేంద్రీకరణ వలన ధనికపేద తారతమ్యాలు పెరుగుతాయి.

డి) శ్రామికులకు సరయిన వేతనాలివ్వకుండా, పనిగంటలు పెంచవచ్చు.

ఇ) పన్నుల ఎగవేతకు పూనుకోవటం వలన ఖజానాకు రావలసిన ఆదాయం తగ్గిపోతున్నది.

ఎఫ్) అక్రమ వ్యాపార పద్ధతులను అవలంబించి అధిక లాభాలు పొందాలని ప్రయత్నిస్తున్నాయి.

జి) అప్రాధాన్యతా పరిశ్రమలపై ప్రైవేటు రంగం అనవసరంగా శ్రద్ధ కనబరచటం జరుగుతున్నది. సెంట్లు, అలంకరణ సామగ్రి, ఎయిర్ కండిషన్లు ఎక్కువగా తయారుచేస్తున్నాయి.

హెచ్) ధనికులకు కావలసిన వస్తువులనే తయారుచేసి అధికలాభాలు పొందాలని ప్రయత్నిస్తారు కానీ ప్రైవేటు పెట్టుబడి దారులకు సగటు మనిషికి పనికివచ్చే వస్తూత్పత్తి పట్ల దృష్టి వుంచరు.

ఐ) వెంటనే ప్రతిఫలాలు కల్పించే కార్యక్రమాలే చేపబడతారు.

జె) దేశ దీర్ఘకాలిక అవసరాలపట్ల శ్రద్ధ కనబరచరు.

కె) ప్రైవేటు రంగంలో పారిశ్రామిక సంబంధాలు పటిష్టంగా వుండవు. అందువలన విలువైన పనిదినాలు దెబ్బతినవచ్చు. సమ్మెలు, లాకౌట్లు తరచుగా ఏర్పడటం వలన పారిశ్రామిక వివాదాలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా లాకౌట్లు ప్రైవేటు రంగంలోనే ఎక్కువగా ఏర్పడతాయి.

ఎల్) ప్రైవేటు రంగ కార్యకలాపాలలో ఖాయిలాపడిన పరిశ్రమలు అనేకం వుంటున్నాయి. అవి మూసివేసిన సందర్భాల్లో ఉద్యోగులకు ఎటువంటి నష్ట పరిహారం చెల్లించకుండానే ఉద్యోగం నుండి తొలగించబడతారు.

ఎమ్) ఆర్థిక వనరులకొరత పెద్ద తీవ్ర సమస్యగా ప్రైవేటు రంగాన్ని వేధిస్తున్నది.

ఎన్) పరిమాణాలే కానీ ప్రమాణాల పట్ల శ్రద్ధ కనబరచకపోవటం తరచుగా ప్రైవేటు రంగంలో జరుగుతుంది.

**మార్కెట్ యంత్రాంగం వైఫల్యం - ప్రభుత్వ జోక్యం** : మార్కెట్ యంత్రాంగం పోటీ తత్వాన్ని పెంచుతుంది. తద్వారా ఉత్పత్తి ఉత్పాదకత, సమర్థతలు కూడా పెరుగుతాయి. అయితే మార్కెట్ యంత్రాంగం ఒక్కో సందర్భంలో వైఫల్యం చెందవచ్చు. ఈ క్రింది విషయాలలో మార్కెట్ వైఫల్యాన్ని

ఎ) ఏకసామ్యం ఏర్పడి ఉత్పత్తి దారులు అత్యధిక లాభాలు చేసుకుంటునప్పుడు, వినియోగదారుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం జోక్యం చేసుకొని, ధరలు తగ్గించేందులకు తగిన కృషి చేయాలి. తద్వారా ఆర్థిక శక్తి కేంద్రీకరణ కూడా అరికట్టవచ్చును.

బి) విద్య, ఆరోగ్యం వంటి ముఖ్యమైన సేవల విషయంలో కూడా ప్రభుత్వం కలుగజేసుకోవాలి. స్కూళ్ళు, కాలేజీలు, యూనివర్సిటీలు, ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు స్థాపించి పేదవారికి విద్య, వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలి.

సి) ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం లాంటి వ్యాపార చక్రాలు ఏర్పడినపుడు ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రజలందరికి కావాల్సిన వస్తు సేవలను ప్రజాపంపిణీ పథకం ద్వారా అందజేయాలి. నిరుద్యోగం నుండి ప్రజలను రక్షించి అందరికీ కనీస వుపాధిని కల్పించాలి.

డి) నీటిపారుదల, రోడ్లు, రైల్వేలు, పవర్ ప్రాజెక్టులు మొదలగు ఆర్థిక అవస్థాపనా సదుపాయాలు భారీ వ్యయంతో కూడుకున్నవి. పైగా దానివలన వెంటనే ప్రతిఫలాలు కూడా రావు, అయితే సామాజిక అవసరాలను తీర్చాలంటే ఈ అవస్థాపనా కార్యక్రమాలు విధిగా ప్రభుత్వమే చేపట్టాలి.

ఇ) ప్రైవేటు వ్యక్తులు ఆసక్తి చూపని, చొరవగా ముందుకాని అంశాలు విధిగా ప్రభుత్వమే చేపట్టి దేశ శ్రేయస్సు, ప్రజల సంక్షేమానికి కృషి చేయాలి.

ఎఫ్) యుద్ధము, ప్రకృతి వైపరీత్యాలు మొదలగు అత్యవసర పరిస్థితులు ఏర్పడినపుడు ప్రభుత్వమే ప్రజలకు రక్షణ కల్పించాలి. వారి ప్రాణాలను, ఆస్తులను సంరక్షించాలి. అవసరమయిన పునరావాస చర్యలు కూడా చేపట్టాలి. ఈ విషయాలలో విధిగా ప్రభుత్వమే వ్యయంగా జోక్యం చేసుకోవాలి.

జి) కల్లోలాలు ఏర్పడి శాంతి భద్రతలకు నష్టం వాటిల్లినపుడు ప్రభుత్వమే విధిగా కలుగజేసుకొని సాధారణ పరిస్థితులు నెలకొల్పే ప్రయత్నం చేయాలి.

## 3.5. సహకారము లేక పోటీ :

ప్రభుత్వ రంగం, ప్రైవేటు రంగాలతోగల సుగుణాలు, లోపాలుపైన వివరింపబడినాయి. అయితే మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ ప్రైవేటు రంగాలు కలిపి కలిసి పనిచేస్తాయి. దేశ అభివృద్ధికి, సమాజశ్రేయస్సుకు, సంక్షేమానికి అవసరమైన కీలకమైన విధులు ప్రభుత్వమే చేపట్టాలి. ముఖ్యంగా శాంతి భద్రతలు, రక్షణ, సామాజిక అవసరాలను తీర్చే వస్తు సేవలను తయారుచేయటం ప్రభుత్వ రంగ బాధ్యతలు.

అన్ని పనులు ప్రభుత్వమే నిర్వహించలేదు కాబట్టి కొన్ని రకాల వస్తు, సేవల ఉత్పత్తి కార్యక్రమాలను ప్రైవేటు రంగమే చేపట్టవచ్చు. అయితే ప్రయివేటు వ్యక్తులు లాభార్జనకు అవకాశం వున్నది అనుకుంటేనే ముందుకు వస్తారు. రిస్క్ లేకుండా వుండే కార్యక్రమాలు వెంటనే ప్రతిఫలాలు ఇచ్చేవి, అధిక లాభాలునిచ్చేవి అని నమ్మితేనే ప్రయివేటు వ్యక్తులు చేపడతారు.

ఈ రకంగా ప్రభుత్వరంగ విధులు, ప్రైవేటు రంగ విధులు అని విభజన జరిగితే రెండు రంగాల మధ్య పోటీ లేకుండా సహకార వాతావరణంలో పనులు సజావుగా నడిచిపోతాయి. పరిపాలనలో అతిముఖ్యమైన విధులు నిర్వర్తించటంలో ఎటువంటి సంఘర్షణలకు అవకాశం వుండదు.

**ప్రభుత్వ రంగ ప్రత్యేక విధులు - కోశవిధానము** : సామాజికవస్తు సేవలను ప్రజలందరికీ అందించాలంటే ప్రభుత్వ రంగం విధిగా కొన్ని విధులను నిర్వర్తిస్తుంది. అలానే ఆదాయ, అసమానతలను తొలగించటం, వ్యాపార చక్రాలను నిరోధించి ఆర్థిక సుస్థిరతను ఏర్పాటు చేయడం మొదలగు బాధ్యతలు ప్రభుత్వ రంగమే విధిగా చేపట్టాలి. ప్రభుత్వం దేశ అభివృద్ధిని పెంచటానికి, ఆర్థిక సుస్థిరత కోసం, అసమానతలను తొలగించటంకోసం తీసుకునే చర్యలనే కోశ విధానం అంటారు. ప్రభుత్వ బడ్జెట్‌లను రూపొందించేటప్పుడు ముఖ్యంగా ఈ క్రింది విధులు నిర్వర్తించేందులకు ప్రభుత్వం పూనుకొంటుంది.

**కేటాయింపు విధి :** ప్రజల మధ్య వనరుల పంపిణీని బట్టి ప్రభుత్వం కూడా సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకుంటుంది. నిత్యావసర వస్తువులకొరత లేకుండా ప్రభుత్వం వనరులను కేటాయించి ప్రజల సామాజిక అవసరాలను చూడాలి. ప్రజా సంక్షేమం కోసం సామాజిక వస్తు, సేవలను ప్రభుత్వమే విధిగా చేపట్టాలి. అందుకనుగుణంగా బడ్జెట్‌లో కూడా ప్రాధాన్యతా క్రమంలో వనరుల కేటాయింపు జరుగుతుంది. పెద్ద మొత్తంలో స్థిర వ్యయాన్ని పెట్టి, లాభాపేక్ష లేకుండా ప్రజా శ్రేయస్సును పెంచే కార్యక్రమాలు చేపట్టాలి. ఉదా డామ్‌లు కట్టడం, రోడ్లు వేయటం, మొదలగు కార్యక్రమాలు ప్రభుత్వ లాభార్జనకోసం పనిచేయదు కాబట్టి ప్రతిఫలాలు స్వల్పకాలంలో వస్తాయా? లేక దీర్ఘ కాలంలో వస్తాయా అని బేరీజు వేసుకోదు. పేద వర్గానికి కావలసిన వస్తు సేవలను వుత్పత్తిచేయటమే కాక బడుగు వర్గాలకు, వెనుకబడిన ప్రాంతాలు, ఆర్థికాభివృద్ధికి కీలకమైన అన్ని రంగాలకు ప్రభుత్వం కేటాయింపులు చేస్తూ సంతులిత ఆర్థికాభివృద్ధిని సాధించేందులకు కృషిచేయాలి. అదనంగా వనరులు కల్పించటం, సబ్సిడీ లివ్వటం కూడా కేటాయింపు విధిలోని అంతర్భాగాలే.

**పంపిణీ విధి :** ఆదాయ సంపదల పంపిణీపట్ల ప్రభుత్వమే దృష్టి సారించాలి. జాతీయాదాయం స్థూల జాతీయోత్పత్తి, తలసరి ఆదాయాలు పెరిగినంత మాత్రాన ఆదేశం అభివృద్ధి చెందినట్లు కాదు. ఆర్థిక శక్తి కేంద్రీకరణ వున్నపుడు ధనిక, పేద తారతమ్యాలు కూడా అధికంగా వుంటాయి. దేశంలో ప్రజలందరికి కనీస అవసరాలగు తిండి, నిలువనీడ, బట్టలు, విద్య, వైద్యం మొదలగు వాటిని ఏర్పాటు చేయాలి. ఆదాయ సంపదలతో అసమానతలను తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యక్ష పన్నులు, పరోక్ష పన్నులు విధించి ఆదాయ వ్యత్యాసాలను తొలగించాలి. ధనికులపై అధికపన్నులు, పేదలపై అతితక్కువ పన్నులను విధించి ఆర్థిక సమానత్వం తీసుకురావాలి. కొన్ని నిబంధనలు, నియంత్రణలు పెట్టి వ్యత్యాసం పెరగకుండా చూడాలి. పేద ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందులకు ప్రభుత్వం ప్రజా పంపిణీ విధానం ద్వారా, సబ్సిడీల ద్వారా, రిజర్వేషన్ల ద్వారా కృషి చేయాలి. అందుకే మన ఆర్థికాభివృద్ధి లక్ష్యాన్ని 'సామాజిక న్యాయం'తో కూడిన ఆర్థికాభివృద్ధిగా ప్రకటించాము. దేశ అభివృద్ధి కనుగుణంగా వేతన వస్తువుల ఉత్పత్తి పెరగాలని వకీల్, బ్రహ్మానంద అనే ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. దేశ అభివృద్ధితోపాటు 'మానవ సంక్షేమం' కూడా పెరగాలని, అప్పుడే ఆ దేశం నిజమైన అభివృద్ధిని సాధించినట్లని నోబుల్ ప్రైజ్ గ్రహీత అమర్త్యసేన్ కూడా పేర్కొన్నాడు. కాబట్టి పంపిణీ విధిని ప్రభుత్వమే నిర్వర్తించి దేశ అభివృద్ధికి కృషి చేయాలి.

**సుస్థిరత విధి :** ఆర్థికాభివృద్ధిలో అస్థిరత చోటు చేసుకుంటే అనేక ఇబ్బందులనెదుర్కొనవలసి వుంటుంది. ఈ పరిస్థితినే వ్యాపార చక్రాలు అని కూడా అనవచ్చును. ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం రెండూ అస్థిరత పరిస్థితినే తెలియజేస్తాయి. పరిపూర్ణ ఉద్యోగిత, ధరల స్థిరత్వం, జాతీయ ఉత్పత్తిలో పెరుగుదల సాధించాలంటే ఆర్థిక సుస్థిరత చాలా అవసరం. ప్రైవేటు రంగంలో వ్యక్తులు లాభార్జనే ధ్యేయంగా పెట్టుకుంటారు. కాబట్టి ఒక్కోసారి మార్కెట్‌లో కొంత వైఫల్యం ఏర్పడవచ్చును. ద్రవ్యోల్బణ సమయంలో అధికధరలకు వస్తువుల నమ్ముకొని లాభిస్తారు. ఒక్కసారి ధరలు తగ్గటం ప్రారంభిస్తే ఆయా వస్తువుల ఉత్పత్తిని అశ్రద్ధ చేస్తారు. కాబట్టి కొంతకాలం తరువాత మార్కెట్‌లో వస్తువుల కొరత ఏర్పడవచ్చును. ఆయా సందర్భాలలో ప్రభుత్వం కొన్ని నియంత్రణలు, ప్రోత్సాహకాలు కల్పించి ప్రైవేటు పెట్టుబడిదారులను ప్రోత్సహించాలి. అలానే ఆర్థికమాంద్యం ఏర్పడినపుడు ప్రభుత్వం పూరకవిత్తాన్ని వుపయోగించి ఆర్థిక వ్యవస్థను యధావిధిగా నడిపించే ప్రయత్నం చేయాలి. నిరుద్యోగం నిర్మూలించి, ప్రజలందరు తమ కనీస అవసరాలను తీర్చుకునే అవకాశం కల్పించాలి.

**కోశసాధనాలు :** పై విధులను నిర్వర్తించేందులకు ప్రభుత్వం ఈ క్రింది కోశ సాధనాలను వినియోగిస్తుంది.

ఎ) పన్నులు

బి) ప్రభుత్వ వ్యయము

సి) ప్రభుత్వ రుణము

డి) రుణ యాజమాన్యం

ఇ) లోటు ద్రవ్య విధానము

**ద్రవ్య సాధనాలు :** ద్రవ్య విధానం కేంద్రబ్యాంకు అయిన రిజర్వుబాంకు ద్వారా ప్రభుత్వం ప్రకటిస్తుంది. ఆర్థిక సుస్థిరతకోసం ఈ క్రింది సాధనాలను వినియోగించటం జరుగుతుంది. దేశంలో ద్రవ్యోల్బణం ఆర్థిక మాంద్యాలు ఏర్పడినప్పుడు ఆర్థిక సుస్థిరత, పరిపూర్ణ ఉద్యోగితాలను సాధించేందులకు ఈ క్రింది సాధనాలను వినియోగిస్తుంది.

ఎ) బాంకు రేటు

బి) బహిరంగ మార్కెట్ కార్యకలాపాలు

సి) కేష్ రిజర్వు నిష్పత్తులు

ద్రవ్య వ్యహారాలలో వచ్చిన అసమానతలు వాటంతటవే సర్దుబాటు కావు. కాబట్టి ప్రభుత్వమే ఆ వ్యవహారాలను చక్కదిద్దాలని వాల్టర్ బెగెహాట్ అనే ఆర్థికవేత్త శతాబ్ద కాలం క్రిందటే తెలియజేసాడు. ద్రవ్య విధానం ద్వారా ఉదారంగా రుణాచ్చి దేశ అభివృద్ధికి, తద్వారా పరిపూర్ణ ఉద్యోగితకు ప్రయత్నించవచ్చును. కానీ ద్రవ్య విధానంలో కొన్ని పరిమితులు కూడా వున్నాయి.

ఎ) ఆర్థిక అసమానతలు తొలగించటంలో ద్రవ్య విధానం అంతగా వుపకరించదు.

బి) ధనిక, పేద తారతమ్యాలను తొలగించటంలో పన్నులు సహాయపడినంతగా మరే ఇతర సాధనం పనిచేయదు.

సి) ప్రభుత్వ వ్యయాన్ని పేదల అభివృద్ధికి వుపయోగించి తద్వారా బడుగువర్గాల జీవన ప్రమాణాలను పెంచటానికి కూడా అవకాశం వుంటుంది.

పై వివరణననుసరించి ప్రభుత్వ రంగానికి కొన్ని ప్రత్యేక విధులు వున్నాయి. ఈ విధులను నిర్వర్తిస్తూ ప్రైవేటు రంగానికి కూడా అన్ని విధాలా సహకరిస్తుంది.

**ప్రైవేటు రంగానికి ప్రభుత్వ రంగం వలన సహకారం :**

ఎ) ప్రైవేటు వ్యక్తులకు ఉత్పత్తి సేవారంగాల కార్యక్రమాలు చేపట్టేందుకు కావలసిన లైసెన్సు ఇస్తుంది.

బి) తక్కువ రేటుకు రుణ సౌకర్యం కల్పిస్తుంది.

సి) ప్రైవేటు రంగానికి సబ్సిడీలిచ్చి ఆర్థిక ఇబ్బందులను తొలగిస్తుంది.

డి) ముడి పదార్థములను చౌకగా అందిస్తుంది.

ఇ) పన్నుల రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తుంది.

ఎఫ్) ప్రభుత్వమే ముందుకు వచ్చి వారి వస్తువులను కొంటుంది.

జి) గిట్టుబాటు ధరలను ప్రకటిస్తుంది.

ఎఫ్) ప్రైవేటు రంగ కార్యకలాపాలపై నిఘా వహించి ప్రజలకు కూడా న్యాయం జరిగేట్లు చేస్తుంది.

ఐ) ఏకస్వామ్యాన్ని అరికడుతుంది.

**ప్రభుత్వ ప్రైవేటు రంగాలమధ్య సహకారం, సమన్వయం వుండేందులకు ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోవాలి**

ఎ) ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య ఉత్పత్తి, సేవా కార్యక్రమాల విభజన జరగాలి.

బి) ఒకరి పరిధిలోకి ఇంకొకరు ప్రవేశించకుండా ప్రభుత్వ, ప్రైవేటు రంగాలను కట్టుదిట్టం చేయాలి.

సి) కీలకమైన, దేశరక్షణ, శాంతి భద్రతలకు సంబంధించిన అంశాలు విధిగా ప్రభుత్వమే చేపట్టాలి.

డి) ప్రభుత్వరంగం చేపట్టిన వస్తు కేవలలోకి ప్రైవేటు రంగాన్ని అనుమతించకూడదు. అలాగే ప్రైవేటు రంగం చేపట్టిన ఉత్పత్తి సేవా కార్యక్రమాలలోకి ప్రభుత్వ రంగం ప్రవేశించకూడదు.

ప్రభుత్వ రంగానికి - ప్రైవేటు రంగానికి మధ్యపోటీ

ఎ) మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండూ ఏకకాలంలో పని చేస్తాయి. ప్రభుత్వ రంగం లాభ, నష్టాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఖర్చులు గిట్టుబాటు అయ్యే వరకు ఆదాయం వస్తే చాలని సేవాదృక్పథంతో పనిచేస్తుంది. ప్రైవేటు రంగం మాత్రం కనిష్ట వ్యయంతో గరిష్ట ఉత్పత్తి పొందాలని ప్రయత్నిస్తుంది. కాబట్టి లాభార్జనే ముఖ్యధ్యేయంగా వ్యవహరిస్తుంది.

బి) పోటీవుంటే ప్రభుత్వరంగ సంస్థలకు ప్రైవేటు రంగ సంస్థలకు మధ్య నాణ్యత, సమర్థతలకు ఎక్కువ స్థానం కల్పించబడుతుంది.

సి) ప్రైవేటు రంగంలో వనరుల దుర్వినియోగం, దుబారాలు చాలా తక్కువగా వుంటాయి. అందువలన తక్కువ వ్యయంతో సంస్థను సమర్థవంతంగా నడిపించగలరు. అయితే ప్రభుత్వరంగ సంస్థలలో ఉద్యోగుల బాధ్యతారాహిత్యం, ఉద్యోగుల గైరుహాజరు, లంచగొండితనం అధికంగా వుంటుంది.

డి) పర్యవేక్షణ ప్రైవేటు రంగంలో చాలా పెద్ద స్థాయిలో వుంటుంది. ప్రభుత్వ రంగంలో పర్యవేక్షణ, నిఘా చాలా తక్కువగా వుంటుంది.

ఇ) మారుతున్న అవసరాలను బట్టి ప్రైవేటు రంగంలో వుత్పత్తి సేవలలో నవకల్పనలు చేయబడతాయి. తద్వారా వినియోగ దారులు కోరుకుంటున్న వస్తుసేవలను ఆధునికంగా వారి అభిరుచికి తగినట్లు, ఆదాయానికి అందుబాటులో వుండేటట్లు తయారుచేయగల పరిస్థితులు ప్రైవేటు రంగంలో కన్పిస్తున్నాయి.

ఎఫ్) ప్రభుత్వ రంగంలో లోపాలు సవరించాలన్నా, నవ్యత్వం తేవాలన్నా ఉన్నతాధికారుల అనుమతి కోసం సుదీర్ఘ కాలం వేచియుండాల్సి వస్తున్నది. అందువలన పోటీ ప్రపంచంలో ప్రభుత్వరంగ వస్తు సేవలు వినియోగదారులను ఆకర్షించలేకపోతున్నాయి.

జి) ప్రభుత్వ రంగ వస్తువులు ధరలు ఎక్కువ, నాణ్యత తక్కువ అనే ముద్ర వినియోగదారుల మదిలో నిలిచిపోయింది. అందువలన ప్రజలు మెరుగైన వస్తుసేవలు చౌకగా లభించే ప్రైవేటు రంగం నుండే కొనుగోలు చేస్తున్నారు. ఉదా పోస్టల్, టెలిఫోన్, రవాణా విద్యా, వైద్య సేవలలో ప్రైవేటు రంగం పోటీకి ప్రభుత్వ రంగం తట్టుకోలేకపోతున్నది.

హెచ్) మార్కెటింగ్, అమ్మకాలు పెంచుకోవటంలో ప్రైవేటు రంగం విశేష కృషి చేస్తుంది. అందువలన ప్రైవేటు రంగ వస్తు, సేవల పట్ల ప్రజలకు ప్రభుత్వ రంగ వస్తు, సేవల కంటే మెరుగైనవి అనే అపార నమ్మకం ఏర్పడుతున్నది.

ఐ) ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య పోటీలో ప్రభుత్వ రంగం వెనుకబడిపోతున్నది. పైన పేర్కొన్న కారణాలే ముఖ్యమైన అవరోధాలుగా చెప్పవచ్చును. అందుకే నేడు మన దేశంలో అనేక ప్రభుత్వ రంగ సంస్థలు కూడా నష్టాల వూబిలో ఇరుక్కుపోయాయి.

జె) పోటీ ప్రపంచంలో ప్రైవేటు రంగం సమర్థవంతంగా పనిచేస్తుందని అందుకే ప్రైవేటీకరణ ఒక మంచి సాధనంగా భావించి నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలలో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడింది.

ఈ రెండు రంగాల మధ్య పోటీ ఎంతవున్నా సాంఘిక శ్రేయస్సు, సమసమాజ స్థాపన, ఆర్థికాభివృద్ధి, ఆదాయ సంపదల మధ్య సమాన పంపిణీ మొదలగు లక్ష్యాలను సాధించాలంటే ప్రభుత్వ రంగం కీలక పాత్రను నిర్వహించాల్సిన అవసరం వున్నది. ఉత్పత్తి కారకాలకు సొంత దారులు ప్రైవేటు వ్యక్తులే. కాబట్టి వారి సేవలను మార్కెట్‌లో అమ్మి ఆదాయం సంపాదిస్తారు. ప్రైవేటు రంగ ఉత్పత్తి కారకాలను, వారుతయారు చేసిన ఉత్పత్తులను ప్రభుత్వరంగం కొనుగోలుచేసి వాటికి ధరలు చెల్లిస్తుంది. అది ప్రైవేటు రంగానికి ఆదాయం అవుతుంది. ఆ ఆదాయాన్ని ప్రభుత్వానికి పన్నులు చెల్లించేందులకు, మూలధన మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేందులకు వినియోగిస్తారు. ఈ విధంగా ప్రభుత్వ ప్రైవేటు రంగాలు పరస్పరం ఒక దానిపై ఒకటి ఆధారపడి పనిచేస్తాయి.

**ప్రభుత్వ, ప్రైవేటు రంగాల అభివృద్ధి కలయిక :** పెట్టుబడి దారీ వ్యవస్థలోని లోపాలను కీన్స్ వెలుగులోకి తెచ్చాడు. స్వేచ్ఛావాదానికి ముగింపు పలికి, ప్రభుత్వ జోక్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని కీన్స్ పేర్కొన్నాడు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో కూడా ప్రభుత్వం కీలకమైన బాధ్యతలు చేపట్టాల్సి వుంటుంది. అవస్థాపనా సదుపాయాలను మెరుగుపరచేందులకు ఐరోపాలో, అమెరికాలో కూడా ప్రభుత్వ రంగం కీలకపాత్రను నిర్వహించుచున్నది.

సి.హెచ్. హనుమంతరావు అభిప్రాయం ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థ కూడా ఆర్థిక, సాంఘిక సుస్థిరతకు కృషిచేస్తుంది. అయితే ప్రభుత్వ ప్రమేయం కూడా ఉన్నప్పుడే అది సాధ్యపడుతుందని ఆయన భావించాడు.

**చైనాలో మార్కెట్ సామ్యవాదం (సోషలిజం) :** ఇన్నాళ్ళూ కమ్యూనిస్టు దేశంగా పేరుగాంచిన చైనాలో కూడా మార్కెట్ యంత్రాంగానికి అవకాశం ఏర్పడింది. 'మార్కెట్ సోషలిజం' లేక సామ్యవాదం అనే పదాన్ని ప్రొఫెసర్ ఆస్కార్ లాంజ్ 40 ఏళ్ళ తరువాత స్వేచ్ఛావాదానికి ప్రాధాన్యత నిచ్చే చైనీయులు 'మార్కెట్ సోషలిజాన్ని' వినియోగిస్తున్నారు. అనగా సోషలిజం పరిధిలో మార్కెట్ యంత్రాంగాన్ని ప్రైవేటు రంగాన్ని వారి దేశ అభివృద్ధి వ్యూహంలో వినియోగిస్తున్నారు. ఈ విధానం ద్వారా చైనా 1980-93ల మధ్య కాలంలో గణనీయమైన వృద్ధి సాధించింది. సహకార సంస్థల రూపంలో వ్యక్తులు ఆస్తులు కలిగియుండే సాంప్రదాయం నెలకొల్పబడింది. ఈ మార్గంలో చైనా కూడా విదేశీ పెట్టుబడులను, బహుళ జాతి సంస్థలను అనుమతిస్తున్నది. విదేశీ వ్యాపార సంస్థలు ఏర్పాటుచేసే అవకాశం వున్నప్పుడు ప్రత్యేక ఆర్థికజోన్లు పెట్టి వాటిలో కాంట్రాక్టర్లు కార్మికులను నియమించుకునే అవకాశం కల్పించబడింది.

ఇప్పుడీ క్రొత్త వ్యవస్థలో చైనాలో 'నూతన వర్గం' ఏర్పాటయింది. ఈ వర్గం 'త్వరగా ధనికులు కండి' (గెట్-రిచ్, క్విక్‌లీ) అనే తత్వాన్ని నమ్మి తన కార్యక్రమాలు కొనసాగిస్తున్నది. అయితే కొన్ని అవాంఛనీయ పరిస్థితులు కూడా తలెత్తాయి. ప్రధమంగా ప్రాంతీయ అసమానతలు, రైతులపై అధిక పన్నుల భారం అనే ఇబ్బందులు చైనాలో తలెత్తాయి. కాంట్రాక్టు ఉద్యోగాలు వచ్చి ఉద్యోగులలో అభద్రతా భావాన్ని తెచ్చింది. జీన్ డ్రీజ్ మరియు అమర్త్యసేన్‌లు చైనాలో "విద్య, ఆరోగ్య సంరక్షణ, భూ సంస్కరణలు మరియు సాంఘిక మార్పులు సంస్కరణల తరువాత కాలంలో గణనీయమైన అభివృద్ధిని సాధించగలిగింది. తద్వారా ప్రజల జీవిత కాలం కూడా పెరిగింది.

అయితే చైనాలో కూడా ద్రవ్యోల్బణరేటు పెరిగింది. ఆదాయ పంపిణీలో అసమానతలు పెరిగాయి. ధనికులు మరింత ధనికులయ్యారు. కార్మిక వర్గాలకు, చిన్న రైతులకు ఆదాయాలు బాగా తగ్గాయి.

**భారత దేశంలో ప్రభుత్వం పాత్ర :** మన ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం పాత్ర మళ్ళీ నిర్వచించబడింది. మన దేశంలో ఉద్యోగావకాశాలను పెంచటం, ప్రజల సాంఘిక శ్రేయస్సును పెంచటంలో ప్రభుత్వం కీలక పాత్రను నిర్వహించాల్సియున్నది. పేద, బడుగు వర్గాలు మార్కెట్ యంత్రాంగంలో పాల్గొనలేకపోతున్నారు అని అనటంలో వాస్తవం లేదని హనుమంతరావు పేర్కొన్నారు. ఎందుకనగా బాల కార్మికులు సైతం అననుకూల పరిస్థితులలో మార్కెట్‌లో పాల్గొంటున్నారు. మార్కెట్ యంత్రాంగాన్ని తెలివిగా వినియోగించుకోగల్గితే' మంచి సేవకుడుగా లేకపోతే చెడు యజమానిగా తన యిష్టానుసారం ప్రవర్తించే అవకాశం వున్నది.

భూ సంస్కరణలను అమలు చేయటంలో ప్రభుత్వం వైఫల్యం చెందింది. కాబట్టి గ్రామీణ అవస్థాపనా సదుపాయాలు పెంచి, పేద ప్రజలకు తక్కువ వడ్డీ రేటున ఋణాలిచ్చి పేదరిక నిర్మూలనకోసం పాటుపడే ప్రయత్నం చేస్తున్నది.

ప్రైవేటు రంగానికి సాంఘిక, ఆర్థిక అవస్థాపనా సదుపాయాలపట్ల శ్రద్ధ లేదు కాబట్టి ప్రభుత్వమే విశేష కృషిచేయాలి. భారీ వ్యయంతో కూడుకున్న అన్ని కార్యక్రమాలు ప్రభుత్వమే చేపట్టి ప్రజల అభివృద్ధిని పెంచాలి. వీటిలో ప్రభుత్వం శ్రద్ధకనబరచి సామాజిక శ్రేయస్సు పెంచే ప్రయత్నం చేయాలి.

దారిద్ర్యరేఖకు దిగువనున్న 36% ప్రజల (48వ జాతీయ సాంపిల్ సర్వే అంచనా) జీవన ప్రమాణాలను మెరుగుపరచేందులకు ప్రభుత్వం కృషి చేయాలి.

ఆగ్నేయాసియా దేశాల వలే మన దేశంలో కూడా శ్రామిక ఉపాధిని పెంచే కొన్ని పరిశ్రమలను అభివృద్ధి పరచాలి. ఆయా పరిశ్రమల లక్ష్యాలను నిర్ధారించి, సబ్సిడీలిచ్చి ఉత్పత్తి, ఎగుమతులను పెంచే ప్రయత్నం ప్రభుత్వం ద్వారా జరగాలి.

ఉపాధిని పెంచే చిన్నతరహా పరిశ్రమలు ప్రోత్సహించాలి. అసంఘటిత రంగంలో ఉపాధి సదుపాయాలను మెరుగుపరచాలి. ప్రజలతో స్నేహ పూర్వక విధానాలను అవలంబిస్తూ ప్రభుత్వం దేశ అభివృద్ధికి పాటుపడాలి.

ప్రభుత్వ రంగ సంస్థలు సమర్థవంతంగా పనిచేయాలంటే ఆయా సంస్థలకు స్వయం ప్రతిపత్తి కల్పించి త్వరితగతిన నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ కల్పించాలి. తద్వారా ప్రభుత్వ రంగ సంస్థలు సమర్థవంతంగా, నిజాయితీగా పనిచేసే అవకాశం ఏర్పడుతుంది.

అంతగా ప్రాధాన్యతలేని కొన్ని వాణిజ్య సంస్థలను ప్రైవేటు రంగానికి మార్చటం అన్ని విధాలా విజ్ఞత కూడిన విషయంగా చెప్పవచ్చును. అంతేకాని బడ్జెట్‌లోటు పూడ్చుకోవటానికి 5%, 10%, లేక 20% వాటాలు అమ్మేటటువంటి ప్రైవేటీకరణ సాంప్రదాయం అంతమంచిది కాదు. నష్టాల్లో వున్న సంస్థలలో వ్యయం వ్యయం తగ్గించుకునేందులకు యాజమాన్య ప్రమాణాలు పెంచాల్సిన అవసరం వున్నది. అలానే ఉత్పాదకతను బట్టి వేతనాలు నిర్ణయింపబడతాయి.

ప్రపంచ బాంకు రిపోర్టు (1999-2000) 21వ శతాబ్దంలోకి ప్రవేశం అనే హెడ్డింగు క్రింద ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా ప్రభుత్వ రంగం ఈ క్రింది మూడు అంశాలను నిర్వహించాలని తెలియజేసింది.

ఎ) వస్తు సేవలనందించే ఉత్పాదకుడుగా,

బి) వ్యవస్థను నియంత్రించే విధంగా,

సి) విద్య, వైద్యం, సురక్షిత త్రాగునీరు మొదలగు సాంఘిక లేక పబ్లిక్ వస్తువుల నందించే సప్లయర్‌గా.

## 3.6. ఆర్థికాభివృద్ధికి ప్రణాళికా విధానం :

1951 నుండి మన దేశంలో పంచవర్ష ప్రణాళికల ద్వారా అభివృద్ధి సాధించే ప్రయత్నం మొదలైంది. ఇప్పటివరకు తొమ్మిది ప్రణాళికలు ముగిసి పదవ ప్రణాళికలోకి ప్రవేశించాము. త్వరితగతిని దేశాన్ని అభివృద్ధి చెందించాలంటే పంచవర్ష ప్రణాళికల ద్వారానే సాధ్యపడుతుందని భావించబడింది.

ఎ) ఆర్థికాభివృద్ధి సాధించుట

బి) ఉద్యోగావకాశాలు పెంపొందించుట

సి) స్వ-అవలంబనను సాధించుట

డి) సామాజిక న్యాయాన్ని సాధించుట

ఈ పై లక్ష్య సాధనకై మన దేశం పంచవర్ష ప్రణాళికల ద్వారా దేశాన్ని అభివృద్ధి పరచేందులకు ప్రయత్నిస్తున్నది. ప్రణాళికా ధ్యేయాలు నిర్ణయించటం, అమలు చేయటంలో ప్రభుత్వం కీలకమైన పాత్రను నిర్వహిస్తున్నది. మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో కూడా ప్రభుత్వరంగ నాయకత్వం ప్రస్ఫుటంగా కన్పిస్తున్నది.

**ప్రణాళికలలో ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలకు స్థానం :** ప్రభుత్వ మార్గ దర్శకంలో ప్రణాళికా విధానం కొనసాగుతున్నప్పటికీ, మొదటి నుండి ప్రైవేటు రంగానికి కూడా కీలకమైన స్థానాన్ని కల్పించినందున, మన ఆర్థిక వ్యవస్థ మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ద్వారా అభివృద్ధి సాధించేందులకు ప్రయత్నిస్తున్నదని విశదమవుతున్నది.

| ప్రణాళిక | మొత్తం పెట్టుబడి | ప్రైవేటు రంగం వాటా | ప్రభుత్వ రంగం వాటా |
|---|---|---|---|
| 1 | 3,870 | 46.5 | 53.5 |
| 2 | 7,900 | 39.2 | 60.8 |
| 3 | 11,600 | 35.3 | 64.7 |
| 4 | 24,880 | 36.1 | 63.9 |
| 5 | 53,410 | 30.3 | 69.7 |
| 6 | 1,58,710 | 38.6 | 61.4 |
| 7 | 3,48,150 | 48.3 | 51.7 |
| 8 | 8,71,000 | 50.2 | 49.8 |

వివిధ ప్రణాళికలలో పెట్టుబడులు విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా గమనించాల్సిన విషయమేమిటంటే ప్రభుత్వ రంగ పెట్టుబడి వాటానే ప్రైవేటు రంగ పెట్టుబడి వాటాకంటే అధికంగా వున్నట్లు పై పట్టిక తెలియజేస్తున్నది.

ప్రభుత్వం తన వంతు బాధ్యతగా క్రమేపీ పెట్టుబడి పెంచుకుంటూ పోతున్నది. ఒక్కో సందర్భంలో ప్రభుత్వ రంగ పెట్టుబడి అంచనా కంటే ఎక్కువగానే వ్యయం చేస్తున్నది. ప్రభుత్వరంగం ముఖ్యంగా ఈ క్రింది గ్రామీణాభివృద్ధి అంశాలకు ప్రాధాన్యతనిస్తున్నది.

ఎ) వ్యవసాయము అనుబంధ కార్యకలాపాలు

బి) గ్రామీణాభివృద్ధి

సి) ప్రత్యేక ప్రాంతీయ పథకాలు

డి) నీటిపారుదల మరియు వరద నివారణ

ఈ పై అంశాలపై ప్రైవేటు రంగం శ్రద్ధకనబరచదు కాబట్టి ప్రభుత్వమే స్వయంగా చేపట్టి కృషిచేస్తున్నది.

ప్రణాళికలో ఈ క్రింది అంశాలపట్ల కూడా ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కీలక పాత్రమ నిర్వహిస్తున్నాయి.

ఎ) విద్యుశ్చక్తి

బి) పెట్రోలియం

సి) బొగ్గు

డి) సాంప్రదాయేతర ఇంధనాలు

ఇ) పరిశ్రమలు

ఎఫ్) రవాణా మరియు కమ్యూనికేషన్

జి) సాంఘిక మరియు ఇతర సేవలు

కొన్ని కీలకమైన పరిశ్రమలు సైతం ప్రైవేటు రంగానికి అప్పచెప్పబడ్డాయి.

**స్వదేశీ ప్రైవేటు పొదుపు :** ప్రైవేటు రంగంలోని పొదుపు మొత్తాలను సేకరించి మన ప్రణాళికలకు కావలసిన వనరులను సేకరిస్తున్నాము. మార్కెట్ నుండి చిన్న పొదుపు మొత్తాల నుండి ప్రభుత్వం తనకు కావలసిన వనరులను పెద్ద మొత్తంలో సమీకరించుకోగలుగుతున్నది. ప్రజలనుండి కేవలం పన్నులు విధించి తద్వారా ప్రభుత్వం వనరులు సమకూర్చుకుంటే ప్రజలు వ్యతిరేకించ వచ్చు. అందుకని స్వచ్ఛందంగా ప్రజలనుండి పొదుపు మొత్తాలను కూడా సేకరించటం ఒక మంచి సాంప్రదాయంగా చెప్పవచ్చును.

**ప్రణాళికలలో సాధించిన ఫలితాలు :**

1. మన దేశంలో జాతీయ, తలసరి ఆదాయాలను ప్రణాళికా కాలంలో గణనీయంగా పెంచటం
2. అభివృద్ధి రేటు కూడా ఆశించినంత మేరకు లేకపోయినా క్రమేపీ పెరుగుట.
3. వ్యవసాయ రంగంలో గణనీయమైన వృద్ధి సాధించుట.
4. పారిశ్రామిక రంగంలో కూడా గణనీయమైన వృద్ధితోపాటు, ఉత్పత్తి, వుత్పాదకతల గణనీయ పెరుగుదల.
5. ఆర్థిక అవస్థాపనా సదుపాయాల పెరుగుదల.
6. ఎగుమతి, దిగుమతులలో భిన్నత్వం సాధించగల్గుట

7. శాస్త్ర, సాంకేతికాభివృద్ధులలో విశేషమైన అభివృద్ధి సాధించుట.

8. విద్యా విధానంలో విశేషమైన అభివృద్ధి సాదించుట.

**ప్రణాళికా వైఫల్యాలు :** మన దేశంలో ప్రణాళికల ద్వారా గణనీయమైన అభివృద్ధిని సాధించటంతోపాటు కొన్ని వైఫల్యాలను కూడా చవిచూడవలసి వచ్చింది. ప్రొఫెసర్ సుకుమాయ్ చక్రవర్తి ముఖ్యంగా ఈ క్రింది మూడు బలహీనతల గురించి వివరించాడు.

ఎ) ప్రభుత్వ రంగ సంస్థలలో అసమర్థత.

బి) పారిశ్రామిక రంగంలో ఎక్కువ మంది ఉపాధి కల్పించలేకపోవటం, వృత్తుల పోకడలో పెద్ద మార్పు రాకపోవటం.

సి) మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో మహల్‌నోబిస్ ఆశించిన విధంగా వృద్ధి రేటును వేగవంతం చేయలేకపోవటం.

**వైఫల్యాలు :**

ఎ) పేదరిక నిర్మూలన చేయలేకపోవటం

బి) అర్హతగల వారందరికీ ఉద్యోగాలు కల్పించలేకపోవటం

సి) ఆదాయ, సంపదలలో వ్యత్యాసాలు తొలగించలేకపోవటం

డి) నల్లధనాన్ని నిరోధించలేకపోవటం

ఇ) ఆర్థికశక్తి కేంద్రీకరణను అరికట్ట లేకపోవటం

ఎఫ్) భూ సంస్కరణలు అమలు చేయలేకపోవటం

1951 నుండి ప్రణాళికల ద్వారా విశేష కృషిచేయటంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండూ పాల్గొంటున్నా, ప్రణాళికలను తయారు చేయటం, లక్ష్యాలను నిర్దేశించటం, పెట్టుబడులు కేటాయించటం, సమీక్షించటం, లక్ష్యాలకు, సాధించిన ఫలితాలకు మధ్యగల వ్యత్యాసాన్ని అంచనా వేయటం మొదలగు కార్యక్రమాల్లో ప్రభుత్వం కీలకపాత్రను నిర్వహిస్తున్నది. అయితే నూతన ఆర్థిక విధానం ప్రారంభించినప్పటి నుండి ప్రభుత్వరంగం కొన్ని కీలక బాధ్యతలను ప్రైవేటు రంగానికే అప్పజెప్పటం విశేషం. ఒకప్పుడు అన్ని ఆర్థిక, సామాజిక రుగ్మతలకు ప్రైవేటు రంగమే కారణమని భావించిన ప్రభుత్వం జాతీయకరణకు పూనుకున్నది. కానీ నేడు ప్రభుత్వ రంగ సంస్థల రుగ్మతలను తొలగించటంలో వైఫల్యం చెందిన ప్రభుత్వం మళ్ళీ ప్రైవేటీకరణవైపు మొగ్గుచూపటం ప్రభుత్వ దృక్పథంలో వచ్చిన విశేషమైన మార్పు ప్రస్ఫుటమవుతున్నది. అన్నీతానై నడుం కట్టిన ఒకప్పటి ప్రభుత్వం నేడు కేవలం పరిమిత బాధ్యతలకే పరిమితం కావాలనుకుంటున్నది. ప్రపంచీకరణ, అంతర్జాతీయ బాంకులు, ప్రపంచ వాణిజ్య సంస్థల ప్రతిపాదనలననుసరించి మన ప్రభుత్వం తన దృక్పధాన్ని మార్చుకున్నది. దేశీయ, అంతర్జాతీయ వత్తుడులు ప్రభుత్వ దృక్పథంలో విశేషమైన మార్పుకు దారితీసాయి. ఏది ఏమైనా ప్రభుత్వం తన పాత్రను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ, ప్రజల అవసరాలను తీర్చి, దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళే విధంగా రూపొందించుకోవాలి.

## 3.7. సారాంశం :

సనాతన ఆర్థిక వేత్తలగు ఆడమ్‌స్మిత్, రికార్డో, మరియు జె.బి.సే.లు స్వేచ్ఛా వాదానికి, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. వారభిప్రాయం ప్రకారం ప్రభుత్వం పరిమిత విధులను మాత్రమే నిర్వహించి, ఆర్థిక పరమైన విషయాలన్నీ వ్యక్తుల ఇష్టానికి వదిలివేయటం మంచిది. అయితే 1930లలో వచ్చిన "ప్రపంచ ఆర్థిక మాంధ్యం" నివారించటానికి సనాతన ఆర్థిక వేత్తల సిద్ధాంతాలు సమాధానం చెప్పలేకపోయాయి. ఈ పరిస్థితులలో జె.యమ్.కీన్స్ మిశ్రమ ఆర్థిక వ్యవస్థ మంచిదనే అభిప్రాయాన్ని సూచించాడు. ఆర్థిక అసమానతలను, అసమతౌల్యాన్ని తొలగించేందులకు ప్రభుత్వ జోక్యం విధిగా వుండాలని కీన్స్ మస్ గ్రేవ్‌లు భావించారు. అయితే మిశ్రమ ఆర్థిక వ్యవస్థ సామ్యవాద వ్యవస్థలు కూడా ప్రపంచీకరణ, సరళీకృత విధానాల ఒరవడిలో ప్రైవేటు రంగం వైపు మొగ్గు చూపుతున్నాయి.

అయితే ప్రభుత్వ రంగం, ప్రైవేటు రంగాల మధ్య కావలసింది సహకారమా? లేక పోటీ తత్వమా? అనేది ఇప్పుడు చర్చనీయాంశమైనది. ప్రభుత్వ రంగ పాత్ర తగ్గించి, ప్రైవేటీకరణవైపు పయనిస్తున్న మన దేశంలో ప్రభుత్వం పాత్ర ఎలా వుండాలనే అంశం కూడా చర్చించబడింది. ప్రణాళికాభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వ కీలక పాత్రను నిర్వహించాల్సి వుంటుంది. సంఘటిత రంగంలోని ఆర్థిక రుగ్మతలను తొలగించాలంటే దేశాభివృద్ధి, ఆర్థిక సుస్థిరత, ఆర్థిక శ్రేయస్సులకు ప్రాధాన్యత ఇవ్వాల్సి వుంటుంది. ఈ గురుతరమైన బాధ్యతలు నిర్వర్తించాలంటే తప్పని సరిగా ప్రభుత్వానికి ఉన్నత అధికారాలుండాలి. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిజమైన ఆర్థికాభివృద్ధి సాధించబడుతుంది.

## 3.8 ముఖ్య పదాలు

1. సుస్థిరత విధి - వ్యాపార చక్రాలు లేకుండా దేశంలో సమతౌల్య పరిస్థితిని ఏర్పాటు చేయటం.
2. దిగుమతి ప్రత్యామ్నాయం - శాశ్వితంగా దిగుమతుల మీద ఆధారపడకుండా స్వదేశంలో ప్రత్యామ్నాయ వస్తూత్పత్తి చేయటం
3. మార్కెట్ యంత్రాంగం - సప్లయి, డిమాండుల మధ్య ప్రభుత్వ జోక్యం లేకుండా సమతౌల్యం ఏర్పడటం.
4. మార్కెట్ సామ్యవాదం - సామ్యవాద పరిధిలోనే సప్లయి, డిమాండులకు పై నియంత్రణ తొలగించటం

## 3.9 స్వయం సమీక్ష ప్రశ్నలు :

1. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ఆవశ్యకత, లక్షణాలు, ప్రభుత్వ రంగ పాత్రను విశదీకరింపుము.
2. ప్రభుత్వ రంగం - ప్రైవేటు రంగాల మధ్య 'సహకారము లేక పోటీ' విమర్శనాత్మకంగా చర్చించుము.
3. మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో, సామ్యవాద వ్యవస్థలో ప్రభుత్వరంగ పాత్రను తగ్గించటం ఎంతవరకు సమంజసం.

## అభ్యాసాలు :

1) మిశ్రమ ఆర్థిక వ్యవస్థ
2) ప్రభుత్వరంగ ప్రాధాన్యత
3) ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య సహకారం లేకపోటీ
4) మార్కెట్ యంత్రాంగం - వైఫల్యాలు.
5) ఆర్థిక సుస్థిరత విధి
6) మార్కెట్ సోషలిజం
7) ఆర్థికాభివృద్ధికి ప్రణాళికా విధానం
8) ప్రణాళికా ఫలితాలు, వైఫల్యాలు

## 3.10 చదవవలసిన పుస్తకాలు :

1. Misra & Puri : Indian Economy
2. Ruddar Datt & K.P.M. Sundaram : Indian Economy
3. Economic Survey : Govt. of India Various issues

డా॥ ఎల్. క్రిష్ణవేణి

పాఠం - 4

# ప్రణాళికా విధానాన్ని కొనసాగించటంలో బడ్జెట్ ఒకసాధనం - ప్రభుత్వ వైఫల్యాలు

పాఠ్య నిర్మాణ క్రమం


4.0 ఉద్దేశాలు
4.1 ఉపోద్ఘాతం
4.2 పంచవర్ష ప్రణాళికలు - ధ్యేయాలు
4.3 బడ్జెట్ ఒక సాధనంగా వినియోగించుకోవటం
4.4 1950-51 నుండి కేంద్ర బడ్జెట్‌లు
4.5 కేంద్ర ప్రభుత్వ ఆదాయం
4.6 కేంద్ర ప్రభుత్వ వ్యయం
4.7 రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లు
4.8 భారత దేశంలో ప్రభుత్వ రుణం
4.9 లోటు ద్రవ్య విధాన పాత్ర
4.10 ప్రభుత్వ వైఫల్యాలు - కొన్ని సూచనలు
4.11 సారాంశం
4.12 ముఖ్య పదాలు
4.13 స్వయం సమీక్ష ప్రశ్నలు
4.14 చదవవలసిన పుస్తకాలు


## 4.0 ఉద్దేశాలు

ఈ పాఠ్యభాగం చదివిన తరువాత మీకు ఈ క్రింది విషయాలపట్ల అవగాహన పెరగాలి.

ఎ) పంచ వర్ష ప్రణాళికల ధ్యేయాలను సాధించేందులకు బడ్జెట్ ఒక సాధనంగా ఉపకరించ గలగటాన్ని వివరింపగలగాలి.

బి) 1950-51 నుండి భారతదేశంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లలో ఆదాయ, వ్యయ పోకడలను విశదీకరింపకలగాలి.

సి) కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లలో ప్రభుత్వ రుణ విధానం, లోటు ద్రవ్య విధానాల పాత్రను సమీక్షింపకలగాలి.

డి) ప్రణాళికా విధానంలో బడ్జెట్‌ను ఒక సాధనంగా వినియోగించటంలో ప్రభుత్వ వైఫల్యాలను చర్చించి కొన్ని సూచనలివ్వకలగాలి.

## 4.1 ఉపోద్ఘాతం :

1951లో పంచవర్ష ప్రణాళికల ద్వారా మన దేశం ఆర్థికాభివృద్ధిని సాధించాలని నిర్ణయించింది. ప్రణాళికా ధ్యేయాలను సాధించేందులకు వీలుగా ప్రభుత్వం ప్రతి సంవత్సరం బడ్జెట్‌ను ఒక సాధనంగా మలుచుకుంటున్నది. ఈ సందర్భంగా పంచ వర్ష ప్రణాళికా ధ్యేయాలను గురించి ముందుగా కొంత అవగాహనను కలిగియుండాలి. ఆ తరువాత బడ్జెట్‌ను అమలు పరచటంలో 1950-51నుండి మన కేంద్ర ప్రభుత్వ విత్త స్థితిగతులు ఎలా వున్నాయో కూడా సమీక్షించాల్సిన అవసరం గలదు. బడ్జెట్‌లో ముఖ్యమైన రెవిన్యూ ఎకౌంట్, మూలధన ఎకౌంట్‌ల గురించి తెలుసుకొని, కేంద్ర ప్రభుత్వ ఆదాయ వనరులు, ప్రభుత్వ వ్యయం గురించి సవివరంగా చర్చించుకోవాల్సి వున్నది. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ ఆదాయ, వనరులతో స్థానికాభివృద్ధికోసం రాష్ట్ర బడ్జెట్‌లు తయారు

చేసుకుంటున్నాయి. బడ్జెట్‌లో లోటును పూరించుకునేందులకు ప్రభుత్వాలు అంతర్గత, అంతర్జాతీయ రుణాలు తీసుకోవటం కూడా సర్వసాధారణంగా మారిపోయి. బడ్జెట్‌లలో గల వివిధలోటుల గురించి చర్చించి, లోటు ద్రవ్య విధానపాత్ర వివరించబడింది. బడ్జెట్ ఒక శక్తివంతమైన సాధనమైనప్పటికి మన దేశంలో అనేక వైఫల్యాలు కన్పిస్తున్నాయి. ఈ వైఫల్యాలన్నింటికీ ప్రభుత్వమే నైతిక బాధ్యతను నిర్వహించాల్సి ఉంటుంది. బడ్జెట్‌ను తయారు చేయటంలో, అమలు పరచటంలో, లోపాలు సరిదిద్దుకోవటంలో ప్రభుత్వం నిరంతరం నిఘా వహించి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. సమస్యలను తెలుసుకోవటానికి అవసరమైతే మేధావుల కమిటీలను నియమించి వారు ప్రతిపాదించిన సలహా, సూచనలను ఎప్పటికప్పుడు పాటిస్తూ ప్రణాళికా ధ్యేయాలను సాధించేందులకు బడ్జెట్‌ను ఒక శక్తివంతమైన సాధనంగా మలుచుకోవటం మొదలగు కీలక విషయాలగురించి చర్చించుకోవాల్సి వున్నది.

## 4.2. పంచవర్ష ప్రణాళికలు - ధ్యేయాలు :

1951లో మన దేశం పంచవర్ష ప్రణాళికల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని నిర్ణయించినది. ఇప్పటి వరకు తొమ్మిది ప్రణాళికలు ముగిసాయి. పంచవర్ష ప్రణాళికల ద్వారా ఆర్థికాభివృద్ధి, ఉద్యోగిత స్వావలంబన మరియు సామాజిక న్యాయం అనే లక్ష్యాలను సాధించాలనే ప్రయత్నం జరుగుతున్నది.

మన దేశంలో పంచవర్ష ప్రణాళికల ద్వారా కీలకమైన అంశాలపట్ల శ్రద్ధ కనబరచి, తద్వారా దేశ అభివృద్ధికి నాంది పలికాము. మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో ప్రభుత్వం ముఖ్యంగా వ్యవసాయ రంగంపై శ్రద్ధ కనబరచింది. కాందిసీకుల రాక, ఆహార కొరత, ద్రవ్యోల్బణం మొదలగు సమస్యలను మొదటి ప్రణాళికా కాలంలో ఎదుర్కోవలసి వచ్చింది. అంతర్జాతీయ చెల్లింపులలో కూడా అసమతౌల్యాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది. ఈ సమస్యలనధిగమించటానికి వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వబడింది.

రెండవ ప్రణాళికా కాలంలో భారీ మరియు మౌలిక పరిశ్రమలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి తద్వారా దేశ అభివృద్ధిని వేగవంతం చేసే ప్రయత్నం జరిగింది. 1956 పారిశ్రామిక విధానం కూడా సామ్యవాదరీతి సమాజ స్థాపనే మన ఆర్థిక విధాన లక్ష్యంగా ప్రకటించింది. ఇనుము, ఉక్కు, స్టీలు, భారీ రసాయనాలు, నైట్రోజన్ ఎరువులు భారీ ఇంజనీరింగ్ మరియు మెషీన్ బిల్డింగ్ పరిశ్రమల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచింది.

మూడవ ప్రణాళిక స్వావలంబన మరియు స్వపరిపాలనా ఆర్థిక వ్యవస్థకు ప్రాధాన్యత నిచ్చింది. మొదటి రెండు ప్రణాళికలు సంస్థాగత ప్రాధాన్యతలనిచ్చి దేశ అభివృద్ధికి విశేష కృషి చేసాయి. మూడవ ప్రణాళిక వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి విశేష కృషి చేసింది. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత నివ్వటం ద్వారా ఆహారకొరతను నివారించే ప్రయత్నం చేసింది. అయితే 1962లో చైనాతో, 1965లో పాకిస్తాన్‌తోను వచ్చిన యుద్ధం వలన రక్షణ మరియు అభివృద్ధులకు అధిక ప్రాధాన్యత ఇవ్వవలసి వచ్చింది.

నాల్గవ ప్రణాళికా కాలంలో కరువుకాటకాలను ఎదుర్కొనవలసి వచ్చింది. ద్రవ్యోల్బణ పరిస్థితులు కూడా ఎదురయ్యాయి. అంతర్జాతీయ చెల్లింపులలో అసమతౌల్యం (లోటు) ఏర్పడినందున 1966లో రూపాయి విలువ కూడా తగ్గింపబడింది. తద్వారా ఎగుమతులు పెరిగి, దిగుమతులు తగ్గించబడతాయి. కానీ ఈ పరిస్థితుల వలన 1966-69ల మధ్య కాలంలో మూడు సంవత్సరిక ప్రణాళికల కాలంలో ప్రణాళికా సెలవును ప్రకటించవలసి వచ్చెను.

నాల్గవ ప్రణాళిక 'సుస్థిరతతో కూడిన వృద్ధి' మరియు స్వావలంబనలో పురోగతిని సాధించటం ముఖ్య లక్షణాలుగా పేర్కొనవచ్చును. జాతీయాదాయాన్ని పెంచటం, బలహీన వర్గాలకు కనీస స్థాయిలో అన్ని అవసరాలను తీర్చటం ధ్యేయంగా భావించబడింది. 'పేదరిక నిర్మూలన' మరియు 'న్యాయంతో కూడిన వృద్ధి' ముఖ్య లక్ష్యాలుగా నిర్ధారించబడినాయి.

అయిదవ ప్రణాళిక ద్రవ్యోల్బణం వలన తీవ్ర ఆర్థిక ఇబ్బందులనెదుర్కొనే సమయంలో ప్రారంభించబడింది. 1973లో మొట్టమొదటిసారిగా ప్రపంచ వ్యాప్తంగా చమురు ధర పెరగటం వలన ద్రవ్యోల్బణ తీవ్రత పెరిగిపోయింది. అయితే మన ప్రణాళికా వేత్తలు దారిద్ర్య నిర్మూలన, సామాజిక న్యాయంతో కూడిన వృద్ధి అనే లక్ష్యాలకే అధికప్రాధాన్యత నిచ్చారు. తీవ్రంగా వున్న నిరుద్యోగ సమస్యను నివారించటం కూడా ఒక ముఖ్య లక్ష్యంగా తీసుకొనబడింది. అప్పుడే నిజమైన పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని కూడా భావించబడింది.

జనతా ప్రభుత్వం ప్రారంభించిన ఆరవ ప్రణాళిక అంతకు ముందు ప్రణాళికలు సాధించిన అభివృద్ధిని శ్లాఘించినా, నిరుద్యోగ నిర్మూలన పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచింది. అలానే ప్రజల్లో పేదరిక నిర్మూలనపట్ల కూడా శ్రద్ధ కనబరచింది. ఆర్థిక శక్తి కొద్దిమంది వ్యాపారస్తుల చేతిలో కేంద్రీకృతం అవ్వటం ఆదాయ సంపదల్లో వ్యత్యాసాలు పెరిగాయి. పేదరికం కూడా విపరీతంగా పెరిగింది.

జనతా ప్రభుత్వ ఆరవ ప్రణాళిక ఉత్పత్తిని పెంచటం, ఎక్కువమందికి ఉపాధి కల్పించటం పట్ల శ్రద్ధ కనబరచాయి. మిలియన్ల ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువనున్నట్లు కూడా పేర్కొనబడింది. వ్యవసాయ, అనుబంధ రంగాలలో ఉపాధి కల్పించటం, వినియోగ వస్తువులను తయారుచేసే కుటీర పరిశ్రమలను ప్రోత్సహించటం, కనీస అవసరాలను తీర్చే పథకం ద్వారా అల్పాదాయవర్గాల వారి జీవన ప్రమాణాలను పెంచటం లక్ష్యంగా పెట్టుకోబడింది.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన సరిక్రొత్త ఆరవ ప్రణాళిక జనతా ప్రభుత్వ ప్రతిపాదనలను తొలగించి నెహ్రూ ప్రతిపాదించిన వృద్ధి నమూనాను అనుసరించడం ద్వారా పేదరిక సమస్యపై దాడిచేసి తద్వారా దేశ ఆర్థికాభివృద్ధికై కృషి చేయాలని సంకల్పించింది.

ఏడవ ప్రణాళికా కాలంలో దేశంలో గణనీయమైన వృద్ధి సాధించబడింది. ఆర్థికాభివృద్ధిని పెంపొందించేందులకు ఆహార ధాన్యాల ఉత్పత్తి, ఉత్పాదకత, వుద్యోగావకాశాలను పెంపొందించేందులకు కృషి చేసింది.

1990లో ఎనిమిదవ ప్రణాళిక ప్రవేశపెట్టబడింది. కేంద్ర ప్రభుత్వంలో కీలకమైన మార్పులు చేపట్టబడినాయి. అందువలన తరచుగా ప్లానింగ్ కమీషన్లు తిరిగి నియమించాల్సిన అవసరం ఏర్పడింది. చివరికి ఎనిమిదవ ప్రణాళిక నాల్గవ ముసాయిదాను అనుమతించింది. ఆ సమయంలో తీవ్ర వాణిజ్య చెల్లింపుల ఇబ్బందులు ఎదుర్కొనవలసి వచ్చింది. పెరుగుతున్న రుణ భారం, పెరుగుతున్న బడ్జెట్‌లోటు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, మందకొడిగా వున్న పారిశ్రామికాభివృద్ధి మొదలగు సమస్యలు ఆర్థికాభివృద్ధికి అవరోధాలుగా నిలిచాయి. అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు ప్రభుత్వం కోశం సంస్కరణలకు శ్రీకారం చుట్టబడింది. తద్వారా ఆర్థిక వ్యవస్థలో చైతన్యం తీసుకురాబడింది. ఆర్థికాభివృద్ధిని పెంచి తద్వారా సగటు మనిషి జీవన ప్రమాణాలను మెరుగుపరచే ప్రయత్నం జరుగుతున్నది.

తొమ్మిదవ ప్రణాళికను 1998లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం తయారుచేసింది. ముఖ్యంగా నాలుగు ముఖ్యాంశాలపై ప్రభుత్వ విధానం దృష్టి సారించింది. తొమ్మిదవ ప్రణాళిక సామాజికన్యాయం, మరియు సమానత్వంతో వృద్ధి సాధించాలని నిర్ణయించబడింది. ముఖ్యంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, వృద్ధిరేటు పెంచటం, ఆహార సంరక్షన, కనీస అవసరాలను తీర్చేందులకు తగిన సేవలు, జనాభా పెరుగుదలనరికట్టడం, పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరినీ భాగస్వాములు చేయటం, స్త్రీలు, బడుగు వర్గాలలో సాధికరాత సాధించుట, స్థానిక ప్రభుత్వాలలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించటం మొదలగునవి తొమ్మిదవ ప్రణాళికా ధ్యేయాలుగా పేర్కొనబడినాయి.

2002లో ప్రారంభించబడిన పదవ పంచవర్ష ప్రణాళిక ప్రభుత్వ పాత్రకు సరిక్రొత్త నిర్వచనం ఇచ్చింది. ప్రైవేటు రంగంలో పారిశ్రామిక సంస్థలు గణనీయమైన వృద్ధిని సాధించగలదని భావించి, ప్రైవేటు రంగ అభివృద్ధికి తగిన వాతావరణం కల్పించబడింది. ప్రభుత్వ రంగ పాత్రను క్రమేపీ తగ్గించాలని కూడా నిర్ణయించబడింది. ఉద్యోగావకాశాలు పెంచటం, అందరికీ ప్రాథమిక విద్య, జనాభా పెరుగుదల నరికట్టడం, అక్షరాస్యత పెంచటం, శిశు మరణాల రేటు తగ్గించటం, మతా మరణాల రేటును కూడా తగ్గించటం, గ్రామాలన్నింటికీ సురక్షిత త్రాగునీటి సదుపాయం, కలుషితమైన నదులను పరిశుభ్ర పరచటం ముఖ్య ధ్యేయలుగా నిర్ణయింపబడినాయి.

## 4.3. బడ్జెట్‌ను ఒక సాధనంగా వాడుకోవటం :

1951లో ప్రారంభించిన పంచవర్ష ప్రణాళికలను అమలు పరచేందుకు బడ్జెట్‌ను తయారు చేసుకోవాలి. ప్రణాళిక అయిదేళ్ళ అంచనా వేసుకుంటే బడ్జెట్ దాని కనుగుణంగా నిధులను సమకూర్చుకోవటం, వ్యయాన్ని కేటాయించటం, ఆర్థిక సుస్థిరతను ఏర్పాటు చేయటం అనే ముఖ్య విధులను నిర్వర్తించాల్సి వుంటుంది. ఉత్పత్తి కార్యక్రమాలను పెంచి దేశ స్థూల వుత్పత్తిని, జాతీయోత్పత్తిని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచేందులకు బడ్జెట్ ఒక సాధనంగా వుపకరిస్తుంది. అంతేకాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయ, సంపదల మధ్య వ్యత్యాసాలను తొలగించి ప్రజలందరికీ అన్ని అవరాలు తీర్చేందులకు కృషి చేయాలి.

ప్రణాళికలకు ఆర్థిక వనరులు సమకూర్చుకోవటం చాలా క్లిష్టమైన సమస్యగా పేర్కొనవచ్చును. ప్రాధాన్యతలననుసరించి వివిధ లక్ష్యాలను నిర్దేశించుకోవటం తేలికేగానీ, ఆయా లక్ష్య సాధనకవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకోవటం మాత్రం అంత శులభం కాదు. ప్రభుత్వానికి ఆదాయ వనరులను సమీకరించటంలో బడ్జెట్ కీలకమైన పాత్రను నిర్వహిస్తుంది. పన్నుల రాబడి, ప్రజల పొదుపు మొత్తాలు, ప్రజల దగ్గరనుండి, సంస్థల నుండి పొందే అంతర్గత రుణాలు, మరియు బహిర్గత రుణాల ద్వారా పంచవర్ష ప్రణాళికలు తమకు కావలసిన వనరులను సమీకరించుకుంటాయి. ఈ ఆదాయ వనరులను వసూలు చేయటంలో రుణ సేకరణలో బడ్జెట్ కీలకమైన పాత్రను నిర్వహిస్తుంది. కానీ వనరులు సరిపోక పోవటం వలన విధిగా లోటు ద్రవ్య విధానాన్నే అనుసరించవలసి వస్తున్నది. బడ్జెట్ ద్వారా ఈ వనరులను సమీకరించుకోవటమే కాక రిజర్వు బ్యాంకు ద్వారా లోటును పూర్తిచేసుకోవటానికి లోటు ద్రవ్య (డెఫిసిట్‌పై పెన్సింగ్) విధానంను అనుసరించవలసి వుంటుంది.

వనరులను ఈ క్రింది మూడు విధాలుగా విభజించవచ్చును.

ఎ) స్వదేశీ బడ్జెట్ వనరులు

బి) విదేశీ సహాయం

సి) లోటు ద్రవ్య విధానము.

**బడ్జెట్ అర్థము మరియు ప్రాముఖ్యత :** బడ్జెట్ అనే పదము ప్రెంచ్ పదం 'బొగెటీ' నుండి పుట్టినది. అనగా చిన్న సంచి అని అర్థము. ఇంగ్లండులో ప్రభుత్వ ఖజానాకు సంబంధించిన అంశాలుగల పేపర్లు ఒక లెదర్ సంచిలో పెట్టి సీలు చేయబడేవి. ఆ సందర్భంలో బడ్జెట్ అనే పదం వాడబడింది. ఆ తరువాత ప్రభుత్వ ఆదాయ, వ్యయాలకు సంబంధించిన డాక్యుమెంట్లనుంచే సంచినే బడ్జెట్ అని పిలిచారు.

బడ్జెట్ విధానంలో ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలన్నీ ఒక క్రమ పద్ధతిలో పరిపాలించటమే బడ్జెట్ అని పిలవవచ్చును. బడ్జెట్ కేవలం ఆదాయ, వ్యయాల పట్టిక మాత్రమే కాదు. వివిధ సంస్థల కార్యకలాపాలపై ప్రత్యక్ష నియంత్రణే బడ్జెట్ అని, అట్టి బడ్జెట్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడింది.

అర్థశాస్త్ర వేత్త ప్రకారం ఆర్థిక వ్యవస్థను ప్రభావితంచేసే కీలకమైన సాధనమే బడ్జెట్‌గా పేర్కొనవచ్చును. ఆర్థిక వ్యవస్థ దశను, దిశను నిర్ణయించే సాధనమే బడ్జెట్‌గా పేర్కొనవచ్చును. అతి విలువైన ప్రభుత్వ ఆదాయ వనరులను దుర్వినియోగం చేయకుండా ప్రయోజనకరంగా వినియోగించటానికి బడ్జెట్ ఒక పదునైన సాధనంగా పేర్కొనవచ్చును.

**బడ్జెట్‌లో ఏమి వుంటుంది?**

ఎ) ఒక సంస్థను నడిపించేందులకు తీసుకునే నిర్ణయాలు, ప్రతిపాదనలే బడ్జెట్‌లో పొందు పరచబడతాయి.

బి) బడ్జెట్‌లో ఆశించిన ఫలితాలను ముందుగానే అంచనా వేయటం జరుగుతుంది.

సి) పూర్తి ఆర్థిక అధికారాలు గల సాధనం

డి) బడ్జెట్ ఒక కొలమానంగా చెప్పవచ్చును.

**బడ్జెట్‌ను ఈ క్రింది రెండు విధాలుగా విభజించవచ్చును.**

ఎ) రెవెన్యూ బడ్జెట్

బి) మూలధన బడ్జెట్

ఈ రెండు బడ్జెట్‌లలో ఆదాయ వ్యయాలు వేరువేరుగా రాబోయే సంవత్సరానికి ముందుగానే అంచనా వేయబడతాయి.

**బడ్జెట్ తయారీ :**

బడ్జెట్ తయారీలో వేరు వేరు సంస్థలు పాల్గొంటాయి.

ఎ) ఆర్థిక మంత్రి వర్గం

బి) పరిపాలనా మంత్రివర్గాలు

సి) ప్లానింగ్ కమీషన్

డి) కంట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్

బడ్జెట్ తయారు చేయటం రాబోయే ఆర్థిక సంవత్సర ప్రారంభానికి ఆరు లేక ఎనిమిది నెలలకు ముందుగానే ప్రారంభించబడింది. బడ్జెట్ తయారు చేయటంలో ఈ క్రింది గణాంక సమాచారం అవసరం.

ఎ) ముందు సంవత్సరానికి సంబంధించి ఆదాయ వ్యయ వాస్తవాలు

బి) ప్రస్తుత (కరెంటు) సంవత్సరానికి శాంక్షను చేసిన అంచనాలు

సి) ప్రస్తుత సంవత్సరంలో రివైజ్ చేయబడిన అంచనాలు

డి) రాబోయే సంవత్సరానికి తయారు చేయబడిన అంచనాలు

ఇ) ప్రస్తుత సంవత్సరంలో వాస్తవాలు

ఎఫ్) ముందు సంవత్సరానికి సంబంధించిన వాస్తవాలు.

**బడ్జెట్ సమర్పణ మరియు చర్చ :** రాబోయే ఆర్థిక సంవత్సర ప్రారంభానికి ముందే బడ్జెట్ తయారుచేయబడుతుంది. ఫిబ్రవరి చివరి తేదీన ఆర్థిక మంత్రిచే బడ్జెట్ పార్లమెంట్‌కు సమర్పింపబడుతుంది. మార్చి నెలలో గురించి పార్లమెంట్‌లో సవివరణ చర్చ జరుగుతుంది. ఆ చర్చల అనంతరం అవసరమైన మార్పులు, సవరణలు చేసి ఏప్రిల్ ఒకటవ తారీఖునుండి బడ్జెట్ ప్రారంభించబడి రాబోయే సంవత్సరం మార్చి నెలాఖరు వరకూ బడ్జెట్ కాలం కొనసాగుతుంది.

**బడ్జెట్ పాత్ర :**

ఎ) దేశ ఆర్థిక కార్యకలాపాలన్నీ బడ్జెట్‌చే నియంత్రించబడతాయి.

బి) రాబోయే సంవత్సరానికి ముందుగానే ఆదాయ, వ్యయాలు ప్రభుత్వంచే అంచనా వేయబడతాయి.

సి) ప్రభుత్వ పరిపాలనలో సమర్థత, పొదుపులను పాటించాలంటే బడ్జెట్ చాలా వసరం.

డి) ప్రభుత్వ ప్రణాళికలు, విధానాలు, యాజమాన్య చర్యలు, ప్రభుత్వ సామాజిక దృక్పథము మొదలగునవి బడ్జెట్‌లో ప్రతిపాదించబడతాయి.

ఇ) కోశ విధానానికి బడ్జెట్ ఒక ముఖ్య సాధనంగా పేర్కొనవచ్చును.

**బడ్జెట్ సిద్ధాంతాలు :**

గ్లాడ్‌స్టోనియన్ పటిష్ట ఆర్థిక విత్తంలో ఈ క్రింది సిద్ధాంతాలు విధిగా పాటించాల్సి వుంటుంది.

ఎ) బడ్జెట్ ఎల్లప్పుడూ సంతులితంగా వుండాలి.

బి) అంచనాలు ద్రవ్య (కాష్) ప్రాతిపదిక మీద వుంటాయి.

సి) బడ్జెట్‌లో అంశాలన్నీ స్థూలంగా వుంటాయి.

డి) అంచనా లెప్పుడూ గణాంక రూపంలో వుండాలి.

ఇ) అన్ని రకాల ఆర్థిక లావాదేవీలు బడ్జెట్‌లో వుంటాయి.

ఎఫ్) సంవత్సరాని కొకసారి బడ్జెట్ వుంటుంది.

జి) రెవిన్యూ, మూలధన బడ్జెట్‌లు వేరు వేరుగా వుంటాయి.

హెచ్) అంచనాలు వాస్తవానికి దగ్గరగా వుండాలి.

ఐ) డిపార్టుమెంటు ప్రాతిపదిక మీద అంచనాలు తయారు చేయబడతాయి.

## 4.4. 1950-51 నుండి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లు:

మన దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పంచవర్ష ప్రణాళికల ద్వారా దేశంలో ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఆలోచన ప్రారంభమైనది. 1951లో మొట్టమొదటి పంచవర్ష ప్రణాళికను ప్రారంభించటంతో మనదేశంలో ప్రణాళికా యుగానికి నాంది పలకబడింది. ఇప్పటికి తొమ్మిది పంచవర్ష ప్రణాళికలు ముగిసాయి. పదవ పంచవర్ష ప్రణాళిక ఇప్పుడు జరుగుతున్నది.

ప్రణాళిక అయిదు సంవత్సరాలకొకసారి తయారు చేయబడితే, బడ్జెట్ ప్రతి సంవత్సరమూ తయారు చేయబడుతుంది. ఎప్పటికప్పుడు ప్రణాళికా లక్ష్యాలను సాధించేందులకు అనువుగా బడ్జెట్‌ను ఒక సాధనంగా మలుచుకోవాల్సి వుంటుంది.

రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ, వ్యయాలను ముందుగానే అంచనా వేసుకొని వాటిని అమలు చేయటమే బడ్జెట్ యొక్క ముఖ్యవిధి. బడ్జెట్ అనే ముఖ్య సాధనం సహాయంతో ఈ క్రింది మూడు విధులను ముఖ్యంగా నిర్వర్తించాల్సి వుంటుంది.

**ఎ) కేటాయింపు విధి :** ఆర్థికాభివృద్ధికి అవసరమైన అంశాలపై ప్రాధాన్యత గల అంశాలకు, పథకాలకు పెద్ద మొత్తంలో, తక్కువ ప్రాధాన్యతగల అంశాలకు తక్కువ మొత్తంలో ప్రభుత్వ వ్యయం కేటాయించబడుతుంది. ఈ విధంగా వనరుల కేటాయింపుచేసి దేశాన్ని అన్ని రంగాల్లోను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్ళటమే బడ్జెట్ ముఖ్య విధిగా పేర్కొనవచ్చును.

**బి) పంపిణీ విధి :** వివిధ వర్గాల మధ్య ఆదాయ, సంపదలతో వ్యత్యాసాలను తొలగించటమే బడ్జెట్ యొక్క ముఖ్యవిధి. వివిధ రంగాల మధ్య వివిధ ప్రాంతాల మధ్య కూడా సమతుల్యాన్ని ఏర్పరచేందులకు బడ్జెట్ ఒక సాధనంగా వుపకరిస్తుంది. ముఖ్యంగా ఆర్థిక, ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగించటమే బడ్జెట్ యొక్క ముఖ్య విధి అని పేర్కొనవచ్చును. మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో కూడా సామ్యవాదరీతి సమాజస్థాపనే మన ధ్యేయంగా పేర్కొనబడుతుంది.

**సి) సుస్థిరత విధి :** ఆర్థిక వ్యవస్థలో వ్యాపార చక్రాలు లేకుండా నిరోధించి ఆర్థిక సుస్థిరతను, ఏర్పాటుచేయటమే బడ్జెట్ యొక్క ముఖ్యవిధిగా పేర్కొనవచ్చును. తద్వారా ధరలలో స్థిరత్వం, పరిపూర్ణ వుద్యోగిత, సమతౌల్య పరిస్థితిని కూడా నెలకొల్పి వచ్చు. ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం వలన ఆర్థికాభివృద్ధిలో అస్థిరత, నిరుద్యోగం లాంటి సమస్యలు తలెత్తకుండా ఆర్థిక వ్యవస్థలో సుస్థిరతను సాధించాలంటే బడ్జెట్ ఒక కీలకమైన సాధనంగా ఉపయోగపడుతుంది.

మన కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లలో గత 50 సంవత్సరాలుగా ప్రభుత్వ రాబడి, ప్రభుత్వ వ్యయం విపరీతంగా పెరిగాయి. అయినప్పటికీ బడ్జెటరీ లోటు కూడా క్రమేపీ పెరుగుతున్నది. ఈ లోటును పూరించేందులకు అంతర్గహ) బహిర్గత రుణాలు మరియు లోటు ద్రవ్య విధానం (డెఫిసిట్ ఫైనాన్సింగ్) వుపయోగిస్తున్నాము. ఈ సందర్భంగా బడ్జెట్‌లో వచ్చిన ముఖ్యమైన పోకడలు ఈ క్రింద వివరింపబడినాయి.

**డి) ప్రభుత్వ రాబడిలో, రెవెన్యూ వ్యయంలో పెరుగుదల :** రెవిన్యూ బడ్జెట్‌లో రాబడి, వ్యయం రెండు కూడా ప్రణాళికాంతరం గణనీయంగా పెరిగినట్లు తెలియుచున్నది. 1950-51 నుండి 1980-81 వరకు రు. 406 కోట్ల నుండి రు 12,830 కోట్లకు పెరిగినట్లు తెలియుచున్నది. అంటే 30 సంవత్సరాలలో 30 రెట్లు పెరిగినట్లు పెరిగినది. 1981 నుండి 2002 వరకు రెవిన్యూ రాబడి రు 12,830 కోట్లకు పెరిగినట్లు తెలియుచున్నది. అంటే 30 సంవత్సరాలలో 30 రెట్లు పెరిగినట్లు పెరిగినది. 1981 నుండి 2002 వరకు రెవిన్యూ రాబడి రు. 12,830 కోట్ల నుండి రు. 201,450 కోట్లకు పెరిగింది. అనగా 21 సంవత్సరాలలో 16 రెట్లు పెరిగింది. 2003-04 బడ్జెట్ రు. 253,940 కోట్ల మేరకు రెవిన్యూ పెరగవచ్చుని అంచనావేసింది. ఇంతగణనీయంగా రాబడి పెరగటానికిగల కారణాలను ఈ క్రింది విధంగా చెప్పవచ్చును.

ఎ) క్రొత్త పన్నులు విధించటం

బి) పన్నుల రేట్లను పెంచటం

సి) పన్నుల పరిధిలోకి ఎక్కువ వస్తు, సేవలను అన్ని రకాల ఆదాయాలను తీసుకురావటం.

డి) పన్నుల పరిపాలనలో లోపాలను సవరించి సమర్థవంతంగా చేయటం

ఇ) ధరలో పెరుగుదల వలన ఎక్కువ పన్నుల రాబడి రావటం

ఎఫ్) ద్రవ్యోల్బణ పరిస్థితి వలన పన్నుల రాబడిలో పెరుగుదల

కేంద్ర ప్రభుత్వ రెవిన్యూ వ్యయం రెవిన్యూ రాబడి కన్నా చాలా వేగంగా పెరిగింది. రెవిన్యూ వ్యయం 1950-51లో కేవలం రు. 347కోట్లు మాత్రమే వున్నా 1980-81 నాటికి రు. 14,540 కోట్ల వరకు పెరిగింది. 30 సంవత్సరాలలో 40 రెట్లు పెరిగింది. 2001-02 నాటికి రు. 301, 610కు పెరిగింది. 21 సంవత్సరాలలో 21 రెట్ల మేరకు పెరిగింది. ప్రభుత్వ యంత్రాంగంపై, రక్షణ వ్యయంలో పెరుగుదల, కేంద్ర ప్రభుత్వ వుద్యోగులకు జీతాలు, పెన్షన్లు, కరువు భత్యాల పెరుగుదల, జీవన వ్యయం పెరగటం మొదలగు కారణాల వలన రెవిన్యూ వ్యయం విపరీతంగా పెరిగింది.

**రెవిన్యూ ఎకౌంట్‌లో పెరుగుతున్న లోటు :** 1970ల మధ్య వరకు, కరెంటు (వర్థమాన) రాబడి కరెంటు వ్యయం కంటే పెరిగి కొంత మిగులును కూడా సూచించింది. దీనినే రెవిన్యూ మిగులు అంటారు. 1950-51లో రెవెన్యూ మిగులు రు. 59కోట్లు వరకు పెరిగింది. ఈ రెవిన్యూ మిగులు ఆర్థికాభివృద్ధి కోసం వనరులను సమకూర్చగలుగుతుంది.

1970ల మధ్య కాలం నుండి కరెంటు వ్యయం కరెంటు రాబడి కంటే అతి వేగంగా పెరుగుతున్నట్లు తెలియుచున్నది. అందువలన కరెంటు ఎకౌంట్‌లో కూడా లోటు చోటుచేసుకుంటున్నది. 1980-81లో రెవెన్యూలోటు రు. 1710కోట్లు వుండగా 2001-02 నాటికి రు. 100,160 కోట్లకు పెరిగింది.. 2003-04 సంవత్సరానికి రు. 112,280 కోట్లకు చేరవచ్చని అంచనా వేయబడింది.

**బడ్జెట్‌లోని భాగాలు :**

ఎ) రెవిన్యూ బడ్జెట్

బి) మూలధన బడ్జెట్

**ఎ) రెవిన్యూ బడ్జెట్ :** రెవిన్యూ బడ్జెట్ అనగా రెవిన్యూ రాబడి, రెవిన్యూ వ్యయాలగురించి చర్చిస్తుంది. రెవిన్యూ రాబడి అనగా పన్ను రాబడ మరియు పన్నులేరాబడి అని చెప్పవచ్చు. ఈ రెవెన్యూ రాబడిని వివిధ అంశాలను వ్యయం చేయబడుతుంది.

**పన్నుల రాబడి :**

పన్నుల రాబడి ముఖ్యంగా ఈ క్రింది మూడు మార్గాలనుండి వస్తుంది.

ఎ) ఆదాయము మరియు వ్యయం పై పన్నులు

బి) ఆస్తులు మరియు మూలధనం లేదా ఆస్తుల మార్పిడిపై పన్నులు మరియు

సి) వస్తువులు మరియు సేవలపై న్నులు

**పన్నులేతర రాబడి :**

ఎ) కరెన్సీ మరియు నాణాలు

బి) వడ్డీల ద్వారా వచ్చే రాబడి మరియు డివిడెండ్లు

సి) మిగిలిన పన్నులేతర రాబడి

కరెంటు లేక రెవిన్యూ వ్యయం కరెంటు రాబడి నుంచే వ్యయం చేయబడుతుంది.

**రెవిన్యూ వ్యయం :**

ఎ) సాధారణ పరిపాలనా సేవలపై వ్యయం, పోలీసు, జుడిషియరీ, డిఫెన్సు, పన్నుల వసూలు మొదలగువాటిపై చేసే వ్యయం

బి) సాంఘిక మరియు కమ్యూనిటీ సేవలు : విద్య, వైద్యం మరియు ప్రజారోగ్యం, శ్రామికులు మరియు ఉపాధి.

సి) ఆర్థిక సేవలు : వ్యవసాయం, పరిశ్రములు, రవాణా, వాణిజ్యం మొదలగునవి.

**బి) మూల ధన బడ్జెట్ :** ఇందులో కూడా కరెంటు రాబడి మరియు కరెంటు వ్యయం అని రెండురకాలున్నాయి.

**మూలధన రాబడి :**

ఎ) గతంలో రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర పాలిత ప్రాంతాలకు ప్రభుత్వరంగ సంస్థలకిచ్చిన అప్పులు తిరిగి చెల్లించగా వచ్చిన నికర మొత్తం.

బి) మార్కెట్ నుండి తీసుకున్న నికర అప్పులు

సి) నికర చిన్న తరహా పొదుపు మొత్తాలు

డి) ప్రావిడెంట్ ఫండ్స్, ప్రత్యేక డిపాజిట్లు మొదలగు ఇతర మూలధన రాబడి.

**మూలధన వ్యయం :**

ఎ) రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు, ప్రాజెక్టులు లేదా కొన్ని పథకాలు చేపట్టేందులకు ఇచ్చిన రుణాలు లేక అప్పులు

బి) ఆర్థికాభివృద్ధిపై చేసిన మూలధన వ్యయం

సి) సామాజిక మరియు కమ్యూనిటీ అభివృద్ధి మరియు

డి) డిఫెన్సుపై చేసిన మూలధన వ్యయం

రెవిన్యూ బడ్జెట్‌లోటు అనగా ప్రభుత్వం తన వనరులను మించి వ్యయం చేస్తున్నదని అర్థం. అందువలన అప్పులుచేయాల్సిన పరిస్థితి వచ్చిందని అర్థం. మన దేశంలో కేంద్ర ప్రభుత్వ పరిస్థితి దురదృష్టవశాత్తు ఇలానే వుంటున్నది.

**1950-51 నుండి కేంద్ర బడ్జెట్‌లలో లోటు మరియు మిగులు**

ఈ క్రింది పట్టిక ద్వారా లోటు మరియు మిగులును సూచించవచ్చును.

| సంవత్సరం | రెవిన్యూ ఎకౌంటు మిగులు (+) / లోటు (-) | మూలధన ఎకౌంటు మిగులు (+) /లోటు (-) | మొత్తం బడ్జెట్ మిగులు (+)/లోటు (-) |
|---|---|---|---|
| 1950-51 | +50 | -62 | -3 |
| 1960-61 | +50 | +70 | +120 |
| 1970-71 | +160 | -450 | -290 |
| 1980-81 | -1,710 | -860 | -2,570 |
| 1990-91 | -18,560 | -7210 | 11,350 |
| 2001-02 | -1,00,160 | +1,00,160 | నిల్ |
| 2003-04 | -1,12,290 | +1,12,290 | నిల్ |

**మూలధన రాబడి మరియు మూలధన వ్యయం :**

గత 50 సంవత్సరాలుగా కేంద్ర బడ్జెట్ స్పష్టమైన దిశను సూచిస్తున్నది.

ఎ) 1970ల వరకు రెవిన్యూ ఎకౌంట్‌లో మిగులు సూచించబడినది.

బి) 1970ల తరువాత వ్యయం మితిమీరి పెరగటం వలన రెవిన్యూలోటు కన్పిస్తున్నది.

సి) గత నాలుగు దశాబ్దాలుగా రెవిన్యూలోటు పెరిగిపోతున్నది.

మూలధన బడ్జెట్‌లో 1950-51 నుండి ఎటువంటి స్పష్టమైన పోకడలను చూపలేదు. 1990ల తరువాత పెద్ద మొత్తంలో మూలధన ఎకౌంట్‌లో మిగులు సూచించబడింది. వాస్తవానికి మూలధన ఎకౌంట్ మిగులు రెవిన్యూ లోటుకు సమానంగా ఉన్నది. అందువలన మొత్తం బడ్జెట్‌లో మిగులు లేక లోటులేకుండా సమతుల్యాన్ని సూచిస్తున్నది.

కేంద్ర ఆర్థిక మంత్రి వర్గం - బడ్జెట్ మిగులు అనే సనాతన పదానికి తిలోదకాలు : బడ్జెట్ మిగులు అనటాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి వర్గం నిరుపయోగమని పేర్కొన్నది. ఎందుకనగా !

ఎ) మూలధన ఎకౌంటులో మిగులు రెవిన్యూ ఎకౌంట్‌లో లోటు సమానంగా వుంటున్నాయి. అందువలన బడ్జెట్ మొత్తం మీద లోటు వుండదు.

బి) సమానత్వాన్ని తెచ్చేందులకు కేంద్ర ఆర్థిక మంత్రి మండలి మూలధన ఎకౌంట్‌లో మిగులు చూపేందులకు మార్కెట్ రుణాలు, చిన్న పొదుపు మొత్తాలు మరియు ఆర్థిక సంస్థల నుండి రుణాలు, చిన్నపొదుపు మొత్తాలు మరియు ఆర్థిక సంస్థల నుండి రుణాలు తీసుకోవటం మొదలగు చర్యలను చేపడుతున్నది.

పై పట్టికలో చూపినట్లు 2001-02 బడ్జెట్‌లో రెవిన్యూ లోటు రు. 100,160 కోట్లు మేరకే చూపబడి సర్దుబాటు చేయబడింది. కాబట్టి మొత్తం బడ్జెట్‌లో కూడా లోటు లేకుండా చూపబడింది. అదే విధంగా 2003-04 బడ్జెట్‌లో కూడా మూలధన ఎకౌంటులో రు. 112.290 కోట్లు మేరకు మిగులు చూపి రెవిన్యూ ఎకౌంట్‌లోగల అంతే మొత్తం లోటును పూడ్చటం జరిగింది. కాబట్టి మొత్తం బడ్జెట్‌లో లోటును తొలగించగలిగాము.

ఋణాలు సేకరించటం ద్వారా మూలధన ఖాతాలో మిగులు చూపి రెవిన్యూ ఖాతా లోటు పూడ్చటం ఒక కృత్రిమ పద్ధతిగా పేర్కొనవచ్చును. వాస్తవానికి మార్కెట్ నుండి రుణాలు సేకరించటం, చిన్న పొదుపు మొత్తాలను మరియు ఇతర అప్పులను తీసుకోవటం ఆర్థిక వ్యవస్థకు అంత శ్రేయస్కరం కాదు. దీనినే నేడు ఫిస్కల్ లోటు అని పిలుస్తున్నాము.

## 4.5. కేంద్ర ప్రభుత్వ ఆదాయం :

**పన్నుల రాబడి :** కేంద్ర ప్రభుత్వ పన్నుల రాబడిని ఈ క్రింది మూడు విధాలుగా విభజించవచ్చును.

ఎ) ఆదాయాల మీద పన్నులు

బి) ఆస్తులు మరియు మూలధన లావాదేవీలపై పన్నులు

సి) వస్తువులు మరియు సేవలపై పన్నులు

**పన్నులేతర రాబడి :** కేంద్ర ప్రభుత్వ పన్నులేతర రాబడిని ఈ క్రింది విధంగా విభజించవచ్చును.

ఎ) కోశ మరియు ఇతర సేవలు

బి) వడ్డీ చెల్లింపుల ద్వారా ప్రభుత్వానికొచ్చే రాబడి

సి) డివిడెండ్లు మరియు లాభాలు

| | కేంద్ర ప్రభుత్వ రెవిన్యూ ఏకౌంట్ (కోట్ల రూపాయలలో) | | | |
|---|---|---|---|---|
| | 1950-51 | 1980-81 | 2001-02 | 2003-04 |
| ఎ) పన్నుల రాబడి | 357 (88) | 9,300 (73) | 1,33,660 (66) | 1,84,170 (73) |
| బి) పన్నులేతర రాబడి | 49 (12) | 3,440 (27) | 67,790 (34) | 69,770 |
| రెవిన్యూ రిసీట్లు | 406 (100) | 12,810 (100) | 2,01,450 (100) | 2,53,940 |

పై పట్టికలో చూపినట్లు కేంద్ర ప్రభుత్వం మొత్తము రాబడిలో పన్నుల రాబడి వేగముగా పెరుగుతున్నట్లు తెలియుచున్నది. ద్రవ్యోల్బణ రేటు పెరగటం దీనికిగల ముఖ్య కారణముగా పేర్కొనవచ్చును. పన్నుల రాబడి 1950-51లో కేవలం రు. 357 కోట్లు మాత్రమే వున్నప్పటికీ 2001-02లో రు. 1,33,660 కోట్లకు పెరిగినట్లు తెలియుచున్నది. 2003-04లో బడ్జెట్ అంచనా ప్రకారం పన్నుల రాబడి రు. 1,84,170 కోట్లకు పెరగవచ్చని అంచనా వేయబడినది.

పన్నులేతర రాబడిద్వారా 1950-51 నుండి 2001-02ల మధ్య కాలంలో రు. 49 కోట్లనుండి రు. 67,790 కోట్లకు పెరిగినది. 2003-04 బడ్జెట్ సంవత్సరములో రు. 69,770 కోట్ల మేరకు ప్రణాళికేతర రాబడి పెరగవచ్చని అంచనావేయబడినది.

మొత్తము రెవెన్యూ రిసీట్‌లు 1950-51 నుండి 2001-02ల మధ్యకాలంలో రు. 406 కోట్ల నుండి 2,01,450 కోట్లకు పెరిగినట్లు తెలియుచున్నది. 2003-04 సంవత్సరములో ఈ మొత్తం రు. 2,53,940 కోట్లకు పెరగవచ్చుని బడ్జెట్ అంచనా తెలియుజేస్తున్నది.

**కేంద్ర పన్నులు :**

**ఎ) ప్రత్యక్ష పన్నులు :** వీటిలో ముఖ్యమైనది ఆదాయ పన్నుగా పేర్కొనవచ్చును. మన దేశములో వ్యక్తిగత ఆదాయ పన్ను ద్వారా వచ్చేరాబడి గత రెండు దశాబ్దాలుగా క్రమేపీ తగ్గుతున్నట్లు తెలియుచున్నది. ఆదాయ పన్నురేటు అధికముగా వుండటంవలన ఎక్కువ మంది పన్ను చెల్లింపుదారులు పన్ను ఎగవేతకు పూనుకొనుచున్నారు.

కార్పొరేషన్ పన్ను ద్వారా కేంద్ర ప్రభుత్వం చిన్న, పెద్ద కంపెనీలు, స్వదేశీ, విదేశీ కంపెనీల ఆదాయంపై కూడా పన్ను విధించుచున్నది. ఒకప్పుడు ఈ కార్పొరేషన్ పన్ను చాలా అధికంగా ఉండేది. అయితే 1990-91 నుంచి ఈ పన్ను క్రమేపీ తగ్గించబడుతున్నది. స్వదేశీ పరిశ్రమలను ప్రోత్సహించేందులకు, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందులకు అనువైన వాతావరణం ఇప్పుడు కల్పించబడినది.

వాణిజ్య బ్యాంకులు కేంద్ర ప్రభుత్వానికిచ్చే రుణాలపై వచ్చే స్థూల వడ్డీ మొత్తాలపై పన్ను విధించబడుచున్నది. మన దేశంలో హోటల్‌లో వసతి కల్పించినందుకు ఒక వ్యక్తికి రోజుకు రు. 400కు బిల్లు మించితే వారిపై వ్యయ పన్ను విధించబడుచున్నది. కేంద్ర ప్రభుత్వం సంపదలు మరియు మూలధన లావాదేవీలపై కూడా పన్నులు విధించుచున్నది. అయితే ఈ పన్నుల ద్వారా వచ్చే నిఖర రాబడి అంతగణనీయంగా లేదు. ఒక వ్యక్తి తన పూర్వీకులనుండి వారసత్వముగా పొందే ఎస్టేట్‌పై ఎస్టేట్ డ్యూటి విధించబడుచున్నది. తద్వారా వంశ పారంపర్యంగా పెద్ద మొత్తంలో ఆస్తులు పొందిన వారికి వారిపై ఎస్టేట్ డ్యూటి విధించిబడుచున్నది.

బహుమతి పన్ను, సంపద పన్నుల ద్వారా కూడా కేంద్ర ప్రభుత్వం ఆదాయాన్ని పొందుచున్నది. ఈ పన్నులద్వారా ఆదాయ సంపదలలో పెరుగుతున్న వ్యత్యాసాలను తొలగించటానికి అవకాశము ఏర్పడుతుంది.

**బి) పరోక్ష పన్నులు :** కేంద్ర ప్రభుత్వం వస్తువులపై, సేవలపై పన్నులు విధించటం ద్వారా కూడా కొంతరాబడి పొందుతున్నది. వీటిని పరోక్ష పన్నులు అంటారు. ఈ పరోక్ష పన్నులలో ముఖ్యమైనవి ఎక్సైజ్ సుంకాలు, కస్టమ్స్ సుంకాలు అని పేర్కొనవచ్చును. సాధారణముగా ఈ పరోక్ష పన్నులు నిత్యావసర వస్తువులపై తక్కువగానూ, విలాస వస్తువులపై అధికంగానూ విధించబడతాయి.

వీటికి తోడు కేంద్ర ప్రభుత్వం సేవలపై కూడా పరోక్ష పన్నులు విధించుచున్నది. ఉదా : టెలిఫోన్లు, ఇన్సూరెన్స్, బ్రోకరేజి మొదలగునవి. క్రమేపి ఈ సేవలపై పన్ను పరిధిలోకి అనేకరకాల సేవలు కూడా తీసుకురాబడుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వానికి పన్నులేతర మార్గాల ద్వారా కూడా ఆదాయం లభించుచున్నది. కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ ఆర్థిక, సాంఘిక, కమ్యూనిటి సేవల ద్వారా కూడా ప్రభుత్వానికి రాబడి వస్తున్నది.

**కేంద్ర ప్రభుత్వ రాబడిలో కొన్ని పోకడలు :**

ఎ) జాతీయ ఆదాయం, తలసరి ఆదాయం పెరగటంతో కేంద్ర ప్రభుత్వ రాబడి కూడా క్రమేపీ పెరుగుచున్నది.

బి) వ్యక్తిగత ఆదాయపన్ను, కార్పొరేషన్ పన్ను, ఎక్సైజ్ డ్యూటీలు మరియు కస్టమ్స్ డ్యూటీలు ఎక్కువ వుత్పాదకతను, వ్యాకోచత్వమును కలిగియున్నవి.

సి) ప్రభుత్వ రాబడిలోని అంతర్భాగాలు మాత్రం గణనీయమైన మార్పులను చూచిస్తున్నాయి.-మొత్తం పన్నుల రాబడిలో దాదాపు 62% పరోక్ష పన్నుల ద్వారానే సమకూర్చబడుచున్నది. దీనిని బట్టి పన్నుల భారం పేదలు మధ్యతరగతి వర్గాలపై అధికభారం పడుచున్నట్లు తెలియుచున్నది. మిగిలిన మొత్తం ప్రత్యక్ష పన్నుల ద్వారా లభిస్తున్నది. దీనిని బట్టి ధనికులపై తక్కువ పన్నుల భారం, పేదలపై ఎక్కువ పన్నుల భారం పడుతున్నట్లు తెలియుచున్నది.

డి) పన్నులేతర రాబడి ద్వారా కూడా గణనీయమైన మొత్తంలో ఆదాయము లభిస్తున్నట్లు తెలియుచున్నది.

## 4.6. కేంద్ర ప్రభుత్వ వ్యయము :

1950-51లో పంచవర్ష ప్రణాళికలు ప్రారంభించినప్పటినుండి కేంద్ర ప్రభుత్వ వ్యయము గణనీయముగా పెరుగుచున్నది. ముఖ్యముగా రెవెన్యూ వ్యయము మూలధన వ్యయము కంటే ఎక్కువగా పెరుగుతున్నట్లు తెలియుచున్నది.

| కేంద్ర ప్రభుత్వ వ్యయము (కోట్ల రూపాయలలో) | | | |
|---|---|---|---|
| సంవత్సరం | రెవిన్యూ వ్యయం | మూలధన వ్యయం | మొత్తం వ్యయం |
| 1950 - 51 | 350 | 180 | 530 |
| 1980-81 | 14,540 | 9,630 | 24,170 |
| 2001 - 02 | 3,01,610 | 60,840 | 3,62,450 |
| 2003 - 04 | 3,06,230 | 72,570 | 4,38,800 |

పై పట్టికలో చూపిన విధంగా రెవిన్యూ వ్యయం 1950-51లో కేవలం రు. 350 కోట్లు మాత్రమే ఉన్నప్పటికీ, 2003-04 బడ్జెట్ నాటికి రు. 3,06,230 కోట్లకు పెరిగింది. అదే కాలంలో మూలధన వ్యయం రు. 180 కోట్ల నుండి రు. 72,570 కోట్ల వరకు పెరిగినది. మొత్తం వ్యయం 1950-51లో రు. 530 కోట్లు మాత్రమే వున్నా 2003-04 నాటికి రు. 4,38,400 కోట్ల వరకు పెరగవచ్చని అంచనా వేయబడింది. ముఖ్యంగా రెవిన్యూ వ్యయం గణనీయంగా పెరిగినట్లు తెలియుచున్నది.

**1987 -88కి ముందు కేంద్ర ప్రభుత్వ రెవిన్యూ వ్యయం ఈ క్రింది మూడు విధాలుగా విభజించబడింది.**

ఎ) పౌర వ్యయము (సాంఘిక, కమ్యూనిటీ మరియు ఆర్థిక సేవలు)

బి) రక్షణ వ్యయం

సి) రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నిధులు

**అదే కాలంలో కేంద్ర ప్రభుత్వం ఈ క్రింది విధంగా కూడా విభజించబడినది.**

ఎ) అభివృద్ధి వ్యయము

బి) రక్షణ వ్యయము

సి) ఇతర వ్యయము

**1987-88 బడ్జెట్ నుండి కేంద్ర ప్రభుత్వ వ్యయం ఈ క్రింది విధంగా విభజించబడినది.**

ఎ) ప్రణాళికేతర వ్యయము

బి) ప్రణాళికా వ్యయము

| కేంద్ర ప్రభుత్వ వ్యయము (కోట్ల రూపాయలలో) | | |
|---|---|---|
| | 1989-90 | 2003-04 |
| ఎ) ప్రణాళికేతర వ్యయము | 64,500 | 3,17,820 |
| బి) ప్రణాళికా వ్యయం | 28,400 | 1,20,980 |
| మొత్తం వ్యయం | 92,900 | 4,38,800 |

ఎ) ప్రణాళికేతర వ్యయం

పై పట్టికలో చూపిన విధంగా ప్రణాళికేతర వ్యయంలో కూడా రెవిన్యూ వ్యయం మూలధన వ్యయం అని రెండు రకాలుగా విభజించవచ్చును. వడ్డీ చెల్లింపులు, ముఖ్య సబ్సిడీలు, వడ్డీ మరియు ఇతర సబ్సిడీలు, రైతులకు రుణ విముక్తి, పోస్టల్ లోటు పోలీసు, పెన్షన్లు, మిగిలిన సాధారణ సేవలు, విద్య వైద్యం మొదలగు సాంఘిక సేవలు, వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుచ్ఛక్తి, కమ్యూనికేషన్ శాస్త్రీయ మరియు సాంకేతిక పరిజ్ఞానం మొదలగు అంశాలపై రెవిన్యూ వ్యయం చేయబడుతుంది.

మూలధన ప్రణాళికేతర వ్యయం క్రింద రక్షణ మూలధన వ్యయం, ప్రభుత్వ రంగ సంస్థలకు రుణాలు, రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలకు, విదేశీ ప్రభుత్వాలకు రుణాలు ఇవ్వబడతాయి. పై పట్టికలో చూపిన విధంగా ప్రణాళికేతర వ్యయం రు. 64,500 కోట్లు నుండి రు. 3,17,820 కోట్ల మేరకు (1989-90 నుండి 2003-04) పెరిగినట్లు తెలియుచున్నది. అనగా దాదాపు 5రెట్లు పెరిగినట్లు తెలియుచున్నది.

బి) ప్రణాళికా వ్యయం :

కేంద్ర ప్రభుత్వ ప్రణాళికా వ్యయం ఈ క్రింది విధంగా వుంటుంది.

ఎ) వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, వరద నివారణ, శక్తి, పరిశ్రమలు, ఘనులు, రవాణా, సమాచారం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక సేవలపై ప్రణాళికా వ్యయం.

బి) రాష్ట్ర మరియు కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రమందించే సహాయం.

పై పట్టికలో చూపిన విధంగా ప్రణాళికా వ్యయం రు. 28,400 కోట్ల నుండి రు. 1,20,980 కోట్ల మేరకు పెరిగింది. మొత్తం వ్యయం 1989-90లో కేవలం రు. 92,900 కోట్లు వుండగా 2003-04 నాటికి రు. 4,38,800 కోట్లకు పెరిగింది.

**కేంద్ర ప్రభుత్వ వ్యయ పోకడలు :**

మన దేశంలో కేంద్ర ప్రభుత్వ వ్యయం గణనీయంగా పెరుగుతున్నది.

ఎ) ముఖ్యంగా పంచవర్ష ప్రణాళిక కాలంలో వ్యయం విపరీతంగా పెరుగుతున్నది.

బి) కేంద్ర ప్రభుత్వ రక్షణ వ్యయం, పరిపాలనా వ్యయం విపరీతంగా పెరుగుతున్నది.

సి) రెవిన్యూ వ్యయం విపరీతంగా పెరుగుతున్నది.

డి) రక్షణ, రుణ చెల్లింపులు, పరిపాలనా వ్యయం గణనీయంగా పెరగటం వలన అభివృద్ధేతర వ్యయం బాగా పెరుగుతున్నది.

ఇ) పెరుగుతున్న వడ్డీ చెల్లింపులు కూడా ఆందోళన కల్గిస్తున్నాయి.

ఎఫ్) సబ్సిడీలు విపరీతంగా పెరగటం వలన కూడా అభివృద్ధేతర వ్యయం బాగా పెరుగుతున్నది.

## 4.7. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లు :

మన దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ సొంత ఆదాయ, వ్యయాలతో బడ్జెట్‌లు తయారు చేసుకుంటాయి. 1951-52 నుండి బడ్జెటరీ పరిస్థితిని ఈ క్రింది విధంగా సమీక్షించవచ్చును.

**రాష్ట్ర ప్రభుత్వాల కరెంట్ రివెన్యూ :** 1951-52లో రాష్ట్రాల కరెంటు రెవిన్యూ కేవలం రు. 396 కోట్లు మాత్రమే వున్నది. 1980-81లో రు. 16,290 కోట్లకు పెరిగింది. 2002-03 నాటికి రు. 30,6,060 కోట్లుకు పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వాలు పెరుగుతున్న వ్యయాన్ని తట్టుకునేందులకు ఆదాయాన్ని కూడా పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. రాష్ట్రాల వ్యయం పెరగటానికి గల కారణాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చును.

ఎ) పౌర పరిపాలనలో వ్యాప్తి వలన పెరుగుతున్న వ్యయం

బి) పెరుగుతున్న ధరలు, జీవన ప్రమాణం వలన జీత భత్యాలు, వేతనాలు విపరీతంగా పెరుగుతున్నాయి.

సి) విద్య, ప్రజారోగ్యం మొదలగు రూపంలో ప్రభుత్వం అందించే ప్రభుత్వ సేవలపై అధిక మొత్తంలో రాష్ట్రాలు వ్యయం చేయవలసి ఉంటూంది.

డి) 1951-52 నుండి 1980-81 వరకు రాష్ట్రాల రెవిన్యూ ఎకౌంటులో మిగులు సూచించబడినది. అయితే 2001-01 నుండి 2002-03 వరకు లోటు సూచించబడినది.

ఇ) మూలధన ఎకౌంటులో రాబడి 1951-52లో రు. 137 కోట్లు వుండగా 2002-03 నాటికి రు. 118,810 కోట్ల వరకు పెరిగింది. మూలధన ఎకౌంటులో వ్యయం అదే కాలంలో రు. 189 కోట్ల నుండి రు. 75,770 కోట్లకు పెరిగింది.

ఎఫ్) మూలధన ఖాతాలో 1951-52 నుండి 1980-81లో లోటు సూచించగా 2001-02 మరియు 2002-03 సంవత్సరాలలో మిగులును సూచించింది.

జి) మొత్తం రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లలో 2000-01 సంవత్సరంలో తప్ప మొగులు కన్పించటంలేదు. 1951-52లో రు. 48 కోట్లు లోటు వుండగా 2002-03 నాటికి రు. 5,180 కోట్లకు పెరిగింది.

**రాష్ట్రాల ఆదాయవనరులు :**

ఎ) రాష్ట్రాలకు సొంత పన్నుల ద్వారా రాబడి

బి) కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే పన్నుల రాబడిలో వాటా

సి) రాష్ట్రాల పన్నులేతర రాబడి

డి) కేంద్రం నుండి వచ్చే నిధులు మొదలగునవి.

రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యక్ష పన్నుల ద్వారా 1951-52లో 38% పరోక్ష పన్నుల ద్వారా 62% వరకు పన్నుల రాబడి వచ్చినది. 2002-03లో ప్రత్యక్ష పన్నుల ద్వారా 12%, పరోక్ష పన్నుల ద్వారా 88% మేరకు పన్నుల రాబడి రాష్ట్రాలకు సంక్రమిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలకు భూమిసిస్తు, వ్యవసాయాదాయాలపై పన్నులు, రాష్ట్రాల ఎక్సైజ్ సుంకాలు, సేల్సు టాక్సు మొదలగు వాటి ద్వారా ముఖ్యంగా పన్నుల రాబడిని సంపాదిస్తున్నాయి.

**రాష్ట్ర ప్రభుత్వాల వ్యయాలు :**

ఎ) రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి భద్రతలు, విద్య, వైద్యం, ఆరోగ్యం, నీటిపారుదల, వ్యవసాయం మొదలగు స్థానిక అవసరాలను తీర్చాల్సి వుంటుంది.

బి) రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి వ్యయం 1951-52లో కేవలం రు. 196 కోట్లు మాత్రమే వున్నప్పటికీ 2002-03 నాటికి రు. 1,91,070 కోట్లకు పెరిగింది.

సి) అభివృద్ధేతర వ్యయం అదే కాలంలో రు. 196 కోట్ల నుండి 2002-03 నాటికి రు. 1,57,500 కోట్లకు పెరిగింది.

డి) రాష్ట్రాల మొత్తం వ్యయం 1951-52లో రు. 392 కోట్లు నుండి 2002-03లో రు. 3,55,170 కోట్లకు పెరిగింది.

**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు మరియు వ్యయ పోకడలు**

ఇంత వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ, వ్యయాలను విడివిడిగా చర్చించాము. ఇప్పుడు రెంటినీ కలిపి క్రింది పట్టికలో చూపబడినాయి.

| | | 1960-61 | 2002-03 |
|---|---|---|---|
| 1. | అభివృద్ధి వ్యయం | 24,430 | 3,42,130 |
| 2. | అభివృద్ధేతర వ్యయం | 12,420 | 3,13,720 |
| 3. | మొత్తం వ్యయం | 36,850 | 6,55,850 |
| 4. | మొత్తం రాబడి | 24,570 | 4,10,190 |
| 5. | స్థూల కోశ డిఫిసిట్ | 12,280 | 2,45,660 |
| 6. | నికర మూల ధన రాబడి | 8,830 | 2,37,470 |
| 7. | మొత్తం లోటు | 3,450 | 9,190 |

1960-61 నుండి 2001-02 వరకు నాలుగు దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం వ్యయం రు.36,850 కోట్ల నుండి రు. 655,850 కోట్ల వరకు పెరిగింది. అనగా దాదాపు 180 రెట్లు పెరుగుదల సూచించబడింది. మొత్తం వ్యయం రు. 36,850 కోట్ల నుండి రు. 6,55,850 కోట్లకు పెరిగింది. మొత్తం లోటు 1960-61లో 3,450 కోట్లు మాత్రమే వున్నప్పటికీ 2002-03 నాటికి రు. 8,190 కోట్లకు పెరిగింది.

| కేంద్ర రాష్ట్రాల పన్నులు రాబడి | | | | |
|---|---|---|---|---|
| సంవత్సరం | ప్రత్యక్ష పన్నులు | పరోక్ష పన్నులు | మొత్తం పన్నులు | స్థూల జాతీయోత్పత్తిలో మొత్త పన్నుల శాతం |
| 1950-51 | 230 | 430 | 660 | 6 |
| 1960-61 | 420 | 1,040 | 1,460 | 10 |
| 1970-71 | 1,100 | 3,590 | 4,600 | 14 |
| 1980-01 | 3,690 | 16,100 | 19,790 | 17 |
| 2002-03 | 100,970 | 2,89,660 | 390,630 | 17 |

ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రాబడి క్రమేపీ పెరుగుతున్నది. మొత్తం పన్నుల రాబడిలో పరోక్ష పన్నుల రాబడి ప్రత్యక్ష పన్నుల రాబడి కంటే అధికంగా ఉన్నట్లు పై పట్టిక తెలియచేస్తున్నది. స్థూల జాతీయోత్పత్తిలో మొత్తం పన్నుల శాతం క్రమేపీ పెరుగుతున్నది. అయితే 1980-01లో, 2002-03లో మాత్రం 17% వద్ద స్థిరంగానే ఉన్నది.

## 4.8. భారత దేశంలో ప్రభుత్వ రుణము :

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత మేరకు రుణాలు సేకరించటానికి కొంత వరకు అధికారం కలదు. బ్రిటీషువారి హయాములోనే యుద్ధ నిమిత్త రుణాలు సేకరించాల్సిన అవసరం ఉన్నది. అయితే రుణంలో అధిక భాగం వుత్పాదక వ్యయంగానే ఉన్నది. ఆ మొత్తం రైల్వే

నిర్మాణం నీటిపారుదల పనులు మీదే మూలధన వ్యయం చేయబడుతున్నది. 1939లో కేంద్ర ప్రభుత్వ రుణం కేవలం రు. 1200 కోట్లు మాత్రమే ఉన్నది.

స్వాతంత్ర్యానంతరం ముఖ్యంగా పంచవర్ష ప్రణాళికలు ప్రారంభించిన తరువాత ప్రభుత్వ రుణం విపరీతంగా పెరిగిపోచున్నది. పంచవర్ష ప్రణాళికలకు కావలసిన వనరులను సమకూర్చటంలో అంతర్గత, బహిర్గత రుణాలు కీలకమైన పాత్రను నిర్వహిస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వ అంతర్గత రుణాలు 1950-51లో 99% వరకు వుండగా, బహిర్గత రుణాలు 1% వరకు వున్నాయి. 2002-03లో అంతర్గత రుణాలు 96% వుండగా బహిర్గత రుణాలు 4% వరకు వున్నాయి. 1950-51లో మొత్తం రుణాలు రు. 2,860 కోట్లు వుండగా, 2002-03 నాటికి రు. 1,561,570 కోట్లకు పెరిగింది. బహిర్గత రుణాలు షరతులతో కూడిన రుణాలు కాబట్టి ప్రభుత్వ ఆర్థిక విధానాలపై తీవ్ర ప్రభావాన్ని కలుగజేస్తున్నాయి. బహిర్గత రుణాలు ముఖ్యంగా అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు, ఆసియా, అభివృద్ధి బాంకులు, విదేశీ ప్రభుత్వాలు సమకూరుస్తున్నాయి.

1990లలో బహిర్గత రుణాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇంకా చిన్న మొత్తాలు, ప్రావిడెంట్ ఫండ్, నిర్బంధ డిపాజిట్ స్కీములు మొదలగు అంతర్గత మార్గాల ద్వారా కూడా రుణాలు సేకరింప బడుతున్నాయి. రుణభారం పెరగకుండా రుణ యాజమాన్య చర్యలు తీసుకోవలసిన అవసరం చాలా ఉన్నది. షరతులు లేని, అధిక వడ్డీ రేటు లేని రుణాలు తీసుకోవటం అన్ని విధాల శ్రేయస్కరం.

**రాష్ట్రాల అప్పులు** : కేంద్రంలానే రాష్ట్రాలు కూడా రుణ భారతంతో సతమతమవుతున్నాయి. రాష్ట్రాల మొత్తం రుణం 1961లో రు. 2,740 కోట్లు కాగా 1971లో రు. 8,750 కోట్లు, 2003లో రు. 6,83,170 కోట్లకు పెరిగింది. రాష్ట్రాలు రిజర్వుబాంకు నుండి అన్ ఆథరైజ్డ్ ఓవర్ డ్రాఫ్టులు పొందుతున్నాయి. రాష్ట్రాలను తరచు ఆందోళనకు గురిచేస్తున్న ఈ అప్పుల బాధనుండి బయట పడేందులకు కేంద్రం అన్ని విధాల సహాయ, సహకారాల నందించాల్సి ఉన్నది.

## 4.9. లోటు ద్రవ్య విధాన పాత్ర (డెఫిసిట్ ఫైనాన్సింగ్) :

భారత ప్రభుత్వం ఆర్థికాభివృద్ధికి కావలిసిన వనరులను తరచుగా డిఫిసిట్ ఫైనాన్సింగ్ ద్వారా సమకూర్చుకోవలసి వస్తున్నది. సాధారణంగా అత్యవసర పరిస్థితులలో వాడాల్సిన ఈ లోటు ద్రవ్య విధానాన్ని తరచుగా వనరులను పెంచుకోవటానికి వినియోగించాల్సి వస్తున్నది. అనగా రిజర్వు బాంకు ద్వారా అదనపు ద్రవ్యాన్ని సృష్టించటం జరుగుతుంది. అదనంగా ద్రవ్యాన్ని ముద్రించటం రిజర్వు బాంకు దగ్గరున్న కాష్ బ్యాలన్స్‌ను డ్రాచేయటం, మార్కెట్ రుణాలు తీసుకోవటం మొదలైనవి.

**బడ్జెట్‌లలో ఈ క్రింది లోటులు సాధారణంగా కనిపిస్తాయి.**

1) రెవిన్యూ లోటు :

రెవిన్యూలోటు = రెవిన్యూ వ్యయం - రెవిన్యూ రిసీట్లు

2) బడ్జెట్ లోటు :

మొత్తం వ్యయం - మొత్తం రాబడి

3) ఫిస్కల్ లోటు :

రెవిన్యూ రాబడి + మూలధనరాబడి

(తిరిగి చెల్లించబడిన అప్పులు మరియు ఇతర రాబడులు)

- మొత్తం వ్యయం లేదా

బడ్జెట్ లోటు + ప్రభుత్వ మార్కెట్ రుణాలు మరియు అప్పులు

4) ప్రైమరీ డెఫిసిట్

ఫిస్కల్ లోటు - వడ్డీ చెల్లింపులు

| 1990లో లోటు పోకడలు (కోట్ల రూపాయలలో) | | | |
|---|---|---|---|
| సంవత్సరం | రెవిన్యూలోటు | ప్రైమరీ లోటు | ఫిస్కల్‌లోటు |
| 1990-91 | 18,560 | 23,130 | 44,630 |
| 1994-95 | 31,030 | 13,640 | 57,700 |
| 1995-96 | 29,730 | 10,200 | 60,420 |
| 1997-98 | 46,450 | 23,300 | 88,940 |
| 2003-04 | 112,290 | 30,420 | 153,640 |

పెరుగుతున్న అన్ని రకాలలోటులలో ఫిస్కల్ లోటు మరింత ఆందోళన కల్గిస్తున్నది. లోటు పెరిగే కొలదీ పెద్ద మొత్తంలో లోటు ద్రవ్య విధానం పెద్ద మొత్తంలో వాడబడుతున్నది. అయితే లోటు ద్రవ్య విధానం కొన్ని దుష్పరిణామాలకు దారితీస్తున్నది. ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్భణ ప్రభావం కూడా పెరగవచ్చును.

## 4.10 ప్రభుత్వ వైఫల్యాలు - కొన్ని సూచనలు :

1951 నుండి మన దేశంలో కేంద్ర ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికల ద్వారా దేశాన్ని అభివృద్ధి పథకం వైపు తీసుకెళ్ళేందులకు విశ్వ ప్రయత్నం జరుగుతున్నది. 1951 నుండి 1991 వరకు మన ఆర్థిక విధానాలు మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో కొన్ని నియంత్రణలకు లోబడి పనిచేసింది. అయితే 1991-92 పి.వి. నరసింహారావు, మన్‌మోహన్‌లు ప్రకటించిన ఉదార లేక సరళీకృత ఆర్థిక విధానం విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చింది.

పెరుగుతున్న ద్రవ్యోల్బణం అరికట్టడం, అంతర్జాతీయ చెల్లింపుల్లో లోటు తొలగించటం, పెరుగుతున్న ప్రభుత్వ వ్యయానికి సంకెళ్ళువేసి ఆదాయ, వ్యయాలమధ్య వ్యత్యాసాన్ని తొలగించటం, నల్లధనాన్ని వెతికితీయటం, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించటం ఎగుమతులను పెంచటం, ఆర్థికాభివృద్ధికి కావలసిన వనరులను తరలించటం, వ్యవసాయ గ్రామీణాభివృద్ధులను ప్రోత్సహించటం, ఎక్కువ ఉపాధి సదుపాయాలు కల్పించటం, బడుగు వర్గాల అభివృద్ధి, సామాజిక సేవలలో నాణ్యతా ప్రమాణాలను పెంచి, అందరికీ అందుబాటులో సేవలనందించటం మొదలగు అంశాలపట్ల 1991-92 బడ్జెట్ ప్రాధాన్యత చూపింది.

అప్పటి నుండి కేంద్ర ప్రభుత్వాలు మారినా ఆర్థిక విధానాలలో మార్పురాలేదు. 1991 నుండి దాదాపు అన్ని బడ్జెట్‌లు ఇలాంటి పంథాలోనే నడుస్తున్నాయి. అయితే కొన్ని ఫలితాలు సాధించినా ప్రభుత్వ వైఫల్యాలు ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. ముఖ్య వైఫల్యాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చును.

**కేల్కార్ కమిటీ అంశాలు:** పన్నుల విధానంలో అనేక లోపాలున్నట్లు విజయ్ కేల్కార్ (2002) టాస్క్ ఫోర్సు కమిటీ రిపోర్టు తెలియజేసింది.

ఎ) బడ్జెట్ విధానాన్ని మరింత పారదర్శకంగా తీర్చిదిద్దటం.

బి) ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానాన్ని సులభతరం, హేతుబద్ధం చేయటం,

సి) పన్నుల ఎగవేతను అరికట్టటం

డి) పన్ను చెల్లింపు దారులకు మెరుగైన సేవలు చేయటం.

ఈ అంశాలపై దృష్టి సారించి కేల్కార్ టాస్క్ ఫోర్సు కమిటీ కొన్ని విలువైన పన్నుల సంస్కరణలను ప్రతిపాదించింది.

**ఎ) ఆదాయపన్ను:**

ఎ) ఆదాయపన్ను మినహాయింపు పరిమితి రు. 50,000 నుండి రు. 1,00,000 కు పెంచాలని నిర్ణయించటం.

బి) సీనియర్ పౌరులకు రు. 1,50,000 వరకు ఆదాయ పన్ను పరిమితిని పెంచాలని ప్రతిపాదించబడింది.

సి) రు. 4,00,000 ఆదాయం వరకు పన్ను రేటు 20%, రు. 4,50,000కు ఆదాయం మించితే 30% పన్ను రేటు విధించాలని నిర్ణయింపబడింది.

**బి) కార్పొరేషన్ పన్ను :**

ఈ పన్ను రేట్లు అధికంగా ఉన్నవనే ఉద్దేశ్యంతో కొన్ని సంస్కరణలు చేయబడినాయి. కార్పొరేషన్ టాక్సు స్వదేశీ కంపెనీలపై 30%, విదేశీ సంస్థలపై 35% రేటు ఉండాలని కేల్కార్ ప్రతిపాదించాడు.

**సి) పన్నుల పరిపాలన :**

ప్రజలందరికి మరియు ఆర్థిక ఏజంట్లుకు పర్మినెంట్ ఎకౌంట్ నంబర్ వ్యాప్తి చేయాలిన నిర్ణయించబడింది. పన్ను చెల్లింపు దారులు ఇంటర్నేట్ ద్వారా, ఇ -మెయిల్ ద్వారా, టెలిఫైలింగ్, టెలి - రీఫండింగ్ వసతులు పొందవచ్చును.

**డి) పరోక్ష పన్నులు**

**ఎ)** కేంద్ర ఎక్సైజ్ సుంకాలలో (CENVAT) (సెంట్రల్ వాల్యూ యాడెడ్ టాక్స్) ను ప్రవేశపెట్టడం.

**బి)** ప్రాణాన్ని రక్షించే మందులు, సాధనాలు, ఆహార పదార్థాలు మరియు వ్యవసాయ ఉత్పత్తులు మొదలగు వాటిపై ఎక్సైజ్ సుంకాలు సున్నా స్థాయికి తీసుకురావటం.

కేల్కార్ కమిటీ ప్రతిపాదనలు 2003-04 బడ్జెట్‌లో ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది కానీ, దేశవ్యాప్తంగా అనేక తీవ్ర విమర్శలు వచ్చినందువలన బడ్జెట్‌లో ఈ ప్రతిపాదనలను పొందుపరచలేదు.

కేల్కార్ ప్రతిపాదించిన పై అంశాలే కాక మన బడ్జెట్‌ను తీర్చి దిద్దటంలో ఈ క్రింది వైఫల్యాలు కూడా కనిపిస్తున్నాయి.

**సి) భారీగా పన్నుల ఎగవేత :** అక్రమార్జనలకు అలవాటుపడిన ఉద్యోగులు, వ్యాపారస్తులు పన్నులు ఎగవేసేందులకు దొంగ లెక్కలు చూపి ప్రభుత్వ దృష్టిలో పడకుండా జాగ్రత్త పడటం చాలా సందర్భాలలో జరుగుతుంది. అందువలన ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకొని పన్నుల రాబడిని పెంచే ప్రయత్నం చేయాలి.

**డి) వ్యవసాయ ఆదాయాలపై పన్నులు లేక పోవటం :** వ్యవసాయాదాయాలపై పన్నులు లేనందున అక్రమార్జనలున్న వ్యక్తులందరూ పండినా, పండకపోయినా వ్యవసాయ భూములు కొని వ్యవసాయ ఆదాయాలుగా చూపి అక్రమార్జనలపై పన్నులు పడకుండా జాగ్రత్తపడతారు. కాబట్టి ఈ రకమైన అక్రమాలు జరగకుండా వ్యవసాయేతర రంగాలలోని వారి వ్యవసాయాదాయాలపై పన్ను విధించాలి.

**ఇ) ఆదాయ పన్ను మినహాయింపులు ధనికులకే ప్రయోజనకరం :** జీవిత బీమా ఇంకా పన్ను రాయితీల కోసం అనేక పథకాలలో పొదుపుచేసే అవకాశం కల్పించబడింది. అయితే ఈ అవకాశాలవలన కేవలం పన్ను చెల్లింపుదారులలో కూడా ధనికులు మాత్రమే ప్రయోజనం పొందగలరు. మధ్యతరగతికి చెందిన పన్ను చెల్లింపుదార్లకు ఏమీ లాభముండదు.

**ఎఫ్) నల్లధనం పెరిగిపోవటం :** మన దేశంలో పన్నుల ఎగవేతవలన నల్ల ధనం విపరీతంగా పెరిగిపోతున్నది. అయితే గత మూడు, నాలుగు కేంద్ర బడ్జెట్‌లలో నల్లధనాన్ని వెతికితీసేందులకు ఎటువంటి పథకాలు లేకపోవటం పెద్దలోపంగా పేర్కొనవచ్చును.

**జి) ప్రభుత్వ బడ్జెట్‌లలో లోటును తగ్గించటం :** ఫిస్కల్ లోటును తగ్గించేందులకు ముందుగా అంతర్జాతీయ ద్రవ్య సంస్థ సూచించినట్లుగా సబ్సిడీలకోత, ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయటం, విదేశీ పెట్టుబడులకు స్వాగతం పల్కటం, ఉద్యోగుల కుదింపు మొదలగు కఠిన చర్యలు తీసుకోవటం ద్వారా నూతన కోశ విధానం అనేక వ్యయ నియంత్రణా చర్యలు తీసుకున్నది.

**హెచ్) ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునే మార్గాలు :** పన్నుల రాబడి, పన్నులేతర రాబడుల ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆదాయాన్ని మరింతగా పెంచుకునే ప్రయత్నాలు చేయాలి. సేవలపై పన్ను, వ్యయ పన్ను మొదలగు క్రొత్త పన్నుల ద్వారా కూడా ప్రభుత్వం ఆదాయం పొందవచ్చును.

**ఐ) ప్రభుత్వ వ్యయాన్ని అదుపులో వుంచటం :** దుబారా, నిధుల దుర్వినియోగం అరికట్టి పరిపాలనలో పారదర్శకతలను పెంచటం ద్వారా కేంద్ర ప్రభుత్వం అనేక వ్యయనియంత్రణా చర్యలు చేపట్టింది. మొదట్లో నష్టాల్లో వున్న సంస్థలనే మూయాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం నేడు లాభాల బాటలోవున్న ప్రభుత్వ రంగ సంస్థలను మూయటం ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నది. అందకనుగుణంగా ప్రైవేటీకరణను ప్రోత్సహించటం జరుగుతున్నది. ప్రభుత్వ రంగ పాత్ర చాలా వరకు పరిమితం చేయబడుతున్నది.

**జె) ఆర్థిక సుస్థిరతను, పరిపూర్ణ వుద్యోగితను ఏర్పాటు చేయలేక పోవటం :** ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యాలను నివారించి ఆర్థిక సుస్థిరతమ సాధించేందులకు అవిరళ కృషి చేయాల్సి ఉంటుంది. అప్పుడే దేశాన్ని పట్టి పీడిస్తున్న నిరుద్యోగ సమస్యలను కూడా శాశ్వితంగా రూపుమాపవచ్చును. అధికజనాభా నిరుద్యోగంలో బాధపడటం వలన బడ్జెట్ ద్వారా పరిపూర్ణ వుద్యోగిత సాధించే ప్రయత్నం చేయాల్సి వుంటుంది.

**కె) సంతులిత ఆర్థికాభివృద్ధి సాధించలేకపోవటం :** వివిధ రంగాల మధ్య, వివిధ ప్రాంతాల మధ్య, వివిధ వర్గాల మధ్య సంతులిత ఆర్థికాభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉన్నది. అయితే 1951-52 నుండి ప్రణాళికాభివృద్ధి జరుగుతున్న దేశంలో అనేక రకాల అసమానతలు కొనసాగుతూనే వున్నాయి. కాబట్టి బడ్జెట్ ద్వారా సంతులిత ఆర్థికాభివృద్ధిని సాధించాల్సిన అవసరం కలదు.

**ఎల్) అధిక రుణ భారం :** దేశీయ, అంతర్జాతీయ రుణభారం విపరీతంగా పెరుగుతున్నది. వడ్డీ చెల్లింపులకే అధిక ప్రభుత్వ వ్యయం దుర్వినియోగం అవుతున్నది. కాబట్టి సరైన రుణ యాజమాన్య పద్ధతులను అవలంబించి దేశాన్ని రుణగ్రస్త దేశంగా మార్చకుండా ప్రభుత్వం నిరంతరం కృషి చేయాలి. రుణాలను ఉత్పత్తి కార్యక్రమాలకే వినియోగించాలిగానీ వినియోగ కార్యక్రమాలను వాడకూడదు.

**ఎమ్) మోతాదు మించిన లోటు** ద్రవ్య విధానం : పెరుగుతున్న లోటును పూరించేందుకు ప్రభుత్వం మోతాదుకు మించిన (డెఫిసిట్ ఫైనాన్సింగ్) లోటు ద్రవ్య విధానాన్ని అనుసరిస్తున్నది. తద్వారా ద్రవ్య సప్లయి పెరిగి ద్రవ్యోల్బణం రేటు కూడా అదుపులోకి రావటల్లేదు. కాబట్టి అత్యవసర పరిస్థితులలో మాత్రమే లోటు ద్రవ్య విధానాన్ని అనుసరించటం అన్ని విధాల శ్రేయస్కరం.

**ఎన్) ఆర్థిక క్రమశిక్షణా లోపం :** పెరుగుతున్న ప్రభుత్వ వ్యయాన్ని అదుపులో వుంచటం, ప్రభుత్వ ఆదాయవనరులను క్రమేపీ పెంచుకోవటంపై ప్రభుత్వం శ్రద్ధ వహించి. దుబారా నిధుల దుర్వినియోగం, అవినీతిని అరికట్టగల్గితే నిధులను ప్రయోజనకరంగా వాడుకోవచ్చును. కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఆర్థిక క్రమ శిక్షణావసరం చాలా వున్నది.

**ఓ) ఎన్నికలలకోసం జనాకర్షణ బడ్జెట్‌లు :** దేశ అవసరాలననుసరించి ఆదాయ వ్యయస్థితి గతులను బట్టి ప్రభుత్వం బడ్జెట్ తయారుచేసుకోవటం ఎల్లవేళలా శ్రేయస్కరం. అయితే దురదృష్టవశాత్తూ రాబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకొని, ఓటు బాంకును పెంచుకునేందులకు అధిక వ్యయంతో కూడిన జనాకర్షణ పథకాలు చేపట్టడం అంత శ్రేయస్కరం కాదు.

**పి) ఆర్థిక సంవత్సర మధ్యలో పన్నుల వడ్డింపు :** బడ్జెట్‌లో పన్నుల భారం లేకుండా, ఆర్థిక సంవత్సరం మధ్యలో ప్రభుత్వం పన్నులు విధించి ప్రజలపై భారాన్ని మోపబడుతుంది. ముందుగా ప్రజావ్యతిరేకత రాకుండా పన్నుల భారంలేని బడ్జెట్‌లు ఆమోదింపచేసి ప్రజలపై అకస్మాత్తుగా భారాన్ని వేయటం బడ్జెట్ సిద్ధాంతాలకు వ్యతిరేకమని చెప్పవచ్చును.

**క్యూ) ఆదాయ, వ్యయాల అంచనాలు తారుమారు :** బడ్జెట్‌లో అంచనాలు చూపేటప్పుడు వ్యయాలకు సంబంధించి అధికంగా అంచనాలు వేయబడతాయి. అయితే బడ్జెట్ పూర్తయ్యేసరికి వాస్తవాలకు, అంచనాలకు మధ్య పొంతన లేకుండా పోతున్నది.

**ఆర్) పంపిణీ విధివి నిర్వర్తించటంలో వైఫల్యం :** ఆదాయ, సంపదల మధ్య వ్యత్యాసాలను తొలగించి ఆర్థిక సమానత్వాన్ని సాధించేందులకు బడ్జెట్ ఒక సాధనంగా వ్యవహరించాలి. అయితే సమసమాజం సామాజిక న్యాయం, ఆర్థిక సంక్షేమం అనే అంశాలకు దూరంగా వుండటం దురదృష్టకరం.

**ఎఫ్) అవస్థాపనా సదుపాయాలను మెరుగుపరచలేకపోవటం :** దేశ ఆర్థికాభివృద్ధికి అత్యంత కీలకమైన ఆర్థిక, సాంఘిక అవస్థాపనా సదుపాయాలను మెరుగుపరచి తద్వారా దేశ ఆర్థికాభివృద్ధిని సత్వరమే సాధించగల్గే అవకాశాలను మెరుగుపరచాలి.

**టి) మానవ వనరులను పటిష్టం చేయలేకపోవటం :** బడ్జెట్ ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచి తద్వారా అందరినీ ఆహారం, ఆరోగ్యం, విద్య, నీడ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉన్నది. కాబట్టి ఇట్టి ముఖ్యబాధ్యతను విస్మరించకుండా బడ్జెట్ తన ప్రణాళికను తయారుచేసుకోవాల్సి వుంటుంది.

**యు) వ్యవసాయ, గ్రామీణాభివృద్ధులపట్ల అశ్రద్ధ :** మన దేశంలో ఇప్పటికీ 68% ప్రజలు వ్యవసాయ రంగం మీదే ఆధారపడి జీవిస్తున్నారు. కానీ వీరి అవసరాలపట్ల, గ్రామీణాభివృద్ధి పట్ల బడ్జెట్‌లలో కేటాయింపులు తక్కువగా ఉండటం శోచనీయం. కాబట్టి ఈ విషయం పట్ల ప్రభుత్వం శ్రద్ధ వహించాలి.

## 4.11 సారాంశం :

1951లో ప్రారంభించబడిన పంచవర్ష ప్రణాళికలను అమలుపరచి ఫలితాలను పొందాలంటే ఆ ధ్యేయాలనకనుగుణంగా సంవత్సరానికొకసారి వచ్చే బడ్జెట్‌ను తీర్చిదిద్దుకోవాల్సి ఉంటుంది. బడ్జెట్ కేవలం రాబోయే సంవత్సరానికి ఆదాయ వ్యయాల పట్టికగానే మిగలకుండా కేటాయింపు విధి, స్థిరీకరణ విధి, పంపిణీ విధి అని మూడు రకాల విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది. అయితే ఇట్టి పదునైన సాధనాన్ని దేశ అభివృద్ధి కనుగుణంగా వినియోగించటంలో అనేక మెలుకవలు పాటించాల్సిన అవసరం కలదు. కేంద్ర బడ్జెట్, రాష్ట్ర బడ్జెట్‌ల తీరు తెన్నులు కూలంకషంగా చర్చించబడినాయి. అంతేకాక మన దేశంలో ఆశించిన రీతిలో ప్రణాళికాభివృద్ధి జరగకపోవటానికి గల కారణం ప్రభుత్వ వైఫల్యమే అని చెప్పవచ్చును. కాళానుగుణంగా ఎప్పటికప్పుడు లోపాలను తెలుసుకోవటానికి, సూచనలివ్వటానికి కమిటీలు, కమీషన్లు నియమిస్తే సరిపోదు. ఓటు బాంకును దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌లను తయారు చేయటం మానుకొని దేశాభివృద్ధికనుగుణంగా బడ్జెట్‌ను ఒక సమర్థవంతమైన సాధనంగా మరల్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అందుకనుగుణంగా విత్త సంబంధిత వ్యవహారాలలో ప్రభుత్వం కీలక పాత్రను నిర్వహించి నిరంతరం కృషిచేయాల్సి ఉంటుంది.

## 4.12 ముఖ్య పదాలు

1. బడ్జెట్ - రాబోయే ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం వేసిన ఆదాయ, వ్యయాల అంచనాల పట్టిక.
2. ఫిస్కల్‌లోటు - రెవిన్యూ రాబడి + మూలధన రాబడి (తిరిగి చెల్లించబడిన అప్పులు మరియు ఇతర రాబడులు) - మొత్తం వ్యయం
3. నల్లధనం - ప్రభుత్వ కళ్ళు కప్పి అక్రమార్జనలకు పన్నులు చెల్లించకుండా ఎగవేయటం.

## 4.13. స్వయం సమీక్ష ప్రశ్నలు :

1. పంచ వర్ష ప్రణాళికలను ధ్యేయాలను సాధించేందులకు బడ్జెట్ ఒక సాధనంగా ఎలా ఉపకరిస్తుంది?
2. కేంద్ర బడ్జెట్‌లలో ప్రభుత్వ ఆదా, వ్యయపోకడలను నిశితంగా విరింపుము.
3. బడ్జెట్‌లలో ప్రభుత్వ రుణం, లోటు ద్రవ్య విధానాల పాత్రను విమర్శనాత్మకంగా వివరింపుము.
4. ప్రణాళికా విధానంలో బడ్జెట్‌ను ఒక సాధనంగా వినియోగించుకోవటంలో ప్రభుత్వ వైఫల్యాలను చర్చించి తగిన సూచనలను సలంకలను విశదీకరింపుము?

**అభ్యాసాలు :**

1) పంచవర్ష ప్రణాళికలు - ధ్యేయాలు
2) బడ్జెట్ - ముఖ్యాంశాలు
3) కరెంటు ఎకౌంటు, మూలధన ఎకౌంటు
4) ప్రభుత్వ ఆదాయ వనరులు
5) ప్రభుత్వ వ్యయ పోకడలు
6) ప్రభుత్వ రుణం
7) వివిధ రకాల బడ్జెట్ లోటులు
8) బడ్జెట్‌ను తీర్చి దిద్దటంలో, అమలుచేయటంలో ప్రభుత్వ వైఫల్యాలు
9) రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లు
10) కేల్కార్ కమిటీ - పన్నుల సంస్కరణలు

## 4.14. చదవవలసిన పుస్తకాలు :


1. Economic Survey : Government of India various issues
2. Ruddar Datta & K.P.M. Sundaram : Indian Economy
3. R.N. Bhargava : Public Finance


డా॥ ఎల్. క్రిష్ణవేణి

పాఠం - 5

# ప్రభుత్వ రాబడి మార్గాలు మరియు వర్గీకరణ

## విషయ క్రమము

5.1 పరిచయం
5.2 పన్నులు
5.3 పన్నేతర రాబడులు
5.4 ప్రభుత్వ ఆదాయ వనరుల వర్గీకరణ
5.5 పన్నుల వర్గీకరణ
5.6 ప్రత్యక్ష పన్నులు - పరోక్ష పన్నులు
5.7 పరోక్ష పన్నులపై ప్రత్యక్ష పన్నుల ఆధిక్యత - వాక్స్ వివరణ
5.8 పురోగామి పన్నులు
5.9. అనుపాతపు పన్ను
5.10 తిరోగామి పన్నులు
5.11 ముగింపు
5.12 ముఖ్య పదాలు
5.13 స్వీయ అవగాహనకు ప్రశ్నలు
5.14 చదవవలసిన పుస్తకాలు.


## 5.1. పరిచయం :

ఆధునిక ప్రభుత్వాలు సంక్షేమానికి పాటుపడుతున్నాయి. ప్రజా సంక్షేమాన్ని - పెంపొందించడానికి అనేక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రభుత్వ వ్యయం పెరిగిపోతుంది. అందువల్ల ప్రభుత్వ వ్యయానికి సరిపడేంత ఆదాయాన్ని ప్రభుత్వం సమకూర్చుకోవాలి. ఈ అధ్యాయంలో వివిధ ప్రభుత్వ ఆదాయ వనరులు గూర్చి వివరముగా తెలుసుకుందాం. అర్థ శాస్త్రములో ఉత్పత్తికి ఎంత ప్రాముఖ్యము ఉన్నదో ప్రభుత్వ విత్త శాస్త్రములో ప్రభుత్వ రాబడికి అంతే ప్రాముఖ్యత ఉన్నది. ఉత్పత్తి లేనిదే వినియోగం ఉండదు. అదే విధముగా ఆదాయం లేనిదే ప్రభుత్వ వ్యయం లేదు. కోరికలు ఆర్థిక కార్యకలాపాలకు మూల కారణము అయినట్లుగానే ప్రభుత్వ వ్యయమే అందుకు అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తుంది. ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రభుత్వానికి అనేక మార్గాలు ఉన్నవి.

అయితే ప్రభుత్వం తాను తయారు చేసిన ప్రజా వస్తువులకు (Public Goods) ప్రైవేట్ సంస్థలు బాగా లాభం దృష్టితో ధరలను నిర్ణయించలేదు. ఎందుకంటే ప్రభుత్వం - ప్రజా సంక్షేమం ప్రాథమిక లక్ష్యంగా ఎంచుకుంటుంది కాబట్టి. అదే విధముగా దేశ రక్షణ శాంతి భద్రతలు, మొ॥ అంశాలు ప్రజలకు ప్రత్యక్షముగా ప్రయోజనాన్ని కల్పించవు.

కాబట్టి వాటికి ధరలను నిర్ణయించుట వీలుకాదు. కావున ప్రభుత్వ రాబడి మార్గాలకు సంబంధించి ప్రజా సంక్షేమం, ఉత్పత్తి ఉద్యోగితలను పెంపొందించుకోవాలనే లక్ష్యంతో రాబడి మార్గాలను ఎంచుకోవాలి. ఆధునిక ప్రభుత్వాలకు ప్రధానముగా నేడు రాబడి

వసూళ్ళు మరియు రాబడికాని వసూళ్ళు (మూలధన వసూళ్ళు) అను 2 ప్రధాన వర్గీకరణల ద్వారా రాబడి మార్గాలను స్థూలంగా కలిగి ఉన్నాయి. వీటిని సూక్ష్మంగా, పన్నురాబడులు పన్నేతర రాబడులు అని కూడా విభజించవచ్చు. దీనిని ఈ క్రింది వర్గీకరణ ద్వారా వివరించవచ్చు.



ప్రక్కన తెలపబడిన పట్టికలో రాబడులను స్థూలముగా ఈ క్రింది విధముగా తెలుపవచ్చు.

అవి : 1. పన్ను రాబడులు

2. పన్నేతర రాబడులు అని 2 విధాలుగా విభజించారు.

**పన్ను రాబడులు :**

1. ఆదాయం పన్ను
2. కార్పొరేషన్ పన్ను
3. వినియోగ పన్ను
4. ఎస్టేట్ సుంకం
5. వారసత్వ పన్ను
6. సంపద పన్ను
7. బహూదుతి పన్ను
8. అమ్మకపు పన్ను
9. ఎక్సైజ్ పన్నులు
10. ఎగుమతి సుంకం
11. దిగుమతి సుంకం

**పన్నేతర రాబడులు :** దీనిని పన్నేతర రాబడులని మరియు రాబడేతర వసూళ్ళు అని రెండు రకాలుగా విభజించవచ్చు

**పన్నేతర రాబడులు**

1. కరెన్సీ ముద్రణ
2. అడ్వాన్సులు మరియు ఋణాల నుంచి వడ్డీ వసూళ్ళు
3. వాణిజ్యపరమైన లాభాలు
4. ధరలు
5. పరిపాలనా రాబడులు
6. జరిమానాలు మరియు పెనాల్టీలు
7. ప్రత్యేక విధింపులు
8. ఫీజులు
9. గ్రాంట్లు మరియు బహుమతులు
10. ఎస్చీట్లు

**రాబడేతర వసూళ్ళు :**

1. మార్కెట్ ఋణాలు
2. కేంద్రం నుంచి ఋణాలు
3. విదేశాల నుంచి ఋణాలు
4. ఋణాల వసూళ్ళు
5. ప్రావిడెంట్ ఫండ్
6. చిన్న మొత్తాల పొదుపు
7. లోటు ద్రవ్యం

## 5.2. పన్నులు : (Taxes)

ప్రభుత్వ ఆదాయ వనరులలో అత్యంత ప్రభావమైన పన్నులు ప్రభుత్వ ఆదాయంలో ఎక్కువ భాగం పన్నుల ద్వారానే వస్తుంది. ఆధునిక యుగంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే సాధనంగానే కాక కొన్ని ఆర్థిక కార్యకలాపాలను నియంత్రణ చేయడానికి (లేదా) క్రమబద్ధం చేసే సాధనంగా కూడా తోడ్పడుతున్నాయి. పన్నులు అనగా ప్రత్యక్షముగా తాను పొందే ప్రయోజనంతో నిమిత్తం లేకుండా దేశ ప్రజలందరికి ప్రయోజనం కోసం ప్రభుత్వం చేసే వ్యయానికై ప్రతి పౌరుడు ప్రభుత్వానికి నిర్బంధించి చెల్లించే మొత్తాన్ని పన్ను అంటారు. A tax is defined as a compulsury payment to the Governmental authority without any direct benefit ("non Quid pro Quid") పన్నులను ఆర్థిక వేత్తలు అనేక విధాలుగా నిర్వచించినారు. ప్రతిపౌరుడు తన ఆదాయంలో కొంత భాగాన్ని ప్రభుత్వానికి చెల్లించి మిగిలినదాన్ని అనుభవించే అవకాశాన్ని కలిగి ఉన్నప్పుడు ప్రభుత్వానికి చెల్లించే భాగాన్నే పన్ను అని మాంటేస్క్యూ నిర్వచించినాడు.

"తనకు సంక్రమించే ప్రత్యేక సదుపాయాలతో సంబంధం లేకుండా ప్రజలందరి ప్రయోజనం కోసం ప్రభుత్వం చేసే వ్యయానికి ప్రతిపౌరుడూ నిర్బంధంగా చెల్లించేదే పన్ను అని "ఆర్. ఎ. సెలిగ్‌మన్" నిర్వచించినాడు."

"ప్రభుత్వం అందించే సేవల కోసం అయ్యే వ్యయానికై వ్యక్తిగాని, వ్యక్తుల సముదాయముగాని తమ సంపద నుంచి నిర్బంధముగా చెల్లించేది పన్ను" అని 'ఆచార్య బాస్టబుల్' నిర్వచించాడు.

"పన్ను చెల్లించే వ్యక్తికి ప్రభుత్వం వాస్తవంగా అందచేసే సేవలతో నిమిత్తం లేకుండా - నిర్బంధంగా విధించేది పన్ను అంతేగాని చట్ట ఉల్లంఘనకు విధించే జరిమానా కాదు" అని డాల్టన్ నిర్వచించినాడు.

"ప్రభుత్వానికి మద్దతుగా ఉండటానికి పౌరులు చెల్లించే మొత్తమే పన్ను" అని ఆచార్య 'ఆడమ్ స్మిత్' పేర్కొన్నాడు.

" ప్రభుత్వం వసూలు చేసే ఇతర చార్జీలతో పోల్చినప్పుడు పన్నులు చెల్లించేవారికి, ప్రభుత్వానికి మధ్య ఏ విధమైన ప్రత్యక్ష ప్రతిఫలం ఉండదు." అని టాసింగ్ (Taussing) వివరించాడు.

"ఏ విధమైన ప్రత్యక్ష ప్రయోజనాన్ని పన్ను చెల్లింపుదారుడు ఆశించకుండా ప్రభుత్వానికి నిర్బంధముగా చెల్లించే మొత్తాన్ని పన్ను" అని ఆచార్య టేలర్ నిర్వచించినాడు.

పై నిర్వచనాలను బట్టి పన్నుకు కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నట్లు తెలుస్తున్నది.

1. ప్రభుత్వ ఆదాయంలో పన్నులు ముఖ్యమైన ఆదాయవర్గం

2. పన్నుల ద్వారా రాబడి అనేది నిరంతరము మరియు నిశ్చయముగా ఉంటుంది.

3. పన్నులు అనేవి వ్యాకోచ రాబడి స్వభావం కలిగినవి.

4. ఆస్తుల మీద, వస్తువుల మీద, సంపద మీద మొ॥లగు వాటిమీద ప్రభుత్వం పన్ను విధిస్తుంది.

5. ఎవరి మీద పన్ను విధించినప్పటికి ఇది వ్యక్తిగతమై (లేదా) సంస్థాగతమై చివరికి చెల్లించవలసి ఉంటుంది.

6. పన్ను అనేది నిర్బంధ చెల్లింపు మరియు దానికి చట్ట బద్ధతకూడా ఉంటుంది.

7. పన్ను ఎగవేత అనేది శిక్షార్హం.

8. నిర్బంధ చెల్లింపు అయిన ప్రత్యక్ష ప్రయోజనం లేకున్నా ప్రజలందరి సంక్షేమం కోసం అయ్యే వ్యయంలో భాగంగా పన్ను చెల్లించవలసి ఉంటుంది.

9. పన్ను చెల్లింపు వినియోగాన్ని తగ్గిస్తుంది. కాబట్టి ఇందులో త్యాగం ఇమిడి ఉంటుంది.

## 5.3 పన్నేతర రాబడులు

ప్రభుత్వానికి పన్నుల ద్వారానే కాకుండా పన్నుకాని మార్గాల ద్వారా కూడా రాబడిని రాబట్టుకోవచ్చు, కాబట్టే వీటిని పన్నేతర రాబడులు అంటారు. వీటిని ఈ క్రింది విధముగా వివరించవచ్చు.

**ఫీజు :** ప్రజా సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం అందజేసే సేవల వ్యయాన్ని తిరిగి రాబట్టుకొనేందుకు సేవల వల్ల ప్రయోజనం పొందిన వారి నుండి ప్రభుత్వం వసూలు చేసే మొత్తాన్ని "ఫీజు" అంటారు. అనగా ప్రభుత్వ సేవల నుంచి ప్రత్యేక ప్రయోజనం పొందిన వారు, చెల్లించేది ఫీజు. సాధారణముగా ప్రభుత్వమందించే సేవలకయ్యే వ్యయాన్ని ఆధారంగా చేసుకొని ఫీజు మొత్తమును నిర్ణయించడం జరుగుతుంది. కాని ప్రజాశ్రేయస్సు దృష్ట్యా ప్రజల నడవడిని కొన్ని కార్యకలాపాలను క్రమబద్దం చేయడమే ఫీజు ప్రధాన ఉద్దేశ్యం. ఈ విధంగా చేసేటప్పుడు కొందరు ప్రత్యేక ప్రయోజనాన్ని పొందవచ్చు. ఆ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఫీజులను వసూలు చేస్తుందే కాని ఆదాయం సమకూర్చడం ఫీజు ఉద్దేశ్యం కాదు. ఉదా : కోర్టు ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు, విద్యఫీజు మొ॥వి.

**నిర్వచనం :R.A. సెలిగ్‌మన్ :** ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని చేపట్టిన సేవలైనప్పటికి చెల్లించే వారికి ప్రత్యేక ప్రయోజనాన్ని చేకూర్చే సేవల వ్యయం కోసం ప్రభుత్వం వసూలు చేసే మొత్తమే "ఫీజు"

**ప్రత్యేక విధింపులు :** ప్రజా శ్రేయస్సు కై ప్రభుత్వం తలపెట్టిన పన్నులు ఆస్తుల విలువను పెంచినప్పుడు లాభం పొంగి ఆస్తి యజమానుల నుండి వారు పొందిన లాభానికి అనుపాతంలో ఆ పనులకయ్యే ఖర్చును రాబట్టడానికి గాను ఒక్కసారి మాత్ర వసూలు చేసే మొత్తాలు ప్రత్యేక విధింపులు. ఉదాహరణకు : ప్రభుత్వం నీటి పారుదల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టినప్పుడు ఆ ప్రాంతంలోని భూముల విలువ పెరుగుతుంది. లాభం పొందిన భూమి యజమానులనుంచి వారు పొందిన ప్రయోజనం అనుపాతంలో ప్రభుత్వం ప్రత్యేక విధింపుల ద్వారా ఆ ప్రాజెక్ట్ నిర్మాణానికైన వ్యయాన్ని పూర్తిగా కాని, కొంత మేరకు కాని, రాబట్టుకొంటుంది.

**జరిమానాలు, పెనాల్టీలు :** ప్రజలను చట్ట విరుద్ధ చర్యలనుండి మళ్ళించడానికి ప్రజలకు జరిమానాలు విధించబడతాయి. ఎవరైనా ప్రభుత్వ నిభంధనలను అతిక్రమిస్తే జరిమానా విధించబడుతుంది. కొన్ని షరతులకు కట్టుబడి ఉండని ప్రజలపై ప్రభుత్వం పెనాల్టీలు, అపరాధ రుసుము విధిస్తుంది. ఉదా : ఒక కాంట్రాక్టరు సకాలంలో తన పని ముగించకపోతే ప్రభుత్వం అతనిపై పెనాల్టీ విధిస్తుంది. జరిమానాలు, పెనాల్టీలు, అపరాధ రుసుమూ మొలైనవి ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయాన్ని సంపాదించలేవు.

**జప్తులు, డిపాజిట్ మొత్తాలను తీసుకోవడం :** ప్రభుత్వానికి, వ్యక్తులకు మధ్య కుదిరిన ఒప్పందానికి విరుద్ధంగా ప్రవర్తిస్తే ఆ వ్యక్తి డిపాజిట్ చేసిన మొత్తాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్నులు, ఇతర చెల్లింపులను చేయకపోతే వారి ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసి వారు చెల్లించవలసిన బకాయిలను రాబట్టుకుంటుంది.

**ఎస్ఛీట్స్ :** (ఎస్ఛీస్) ఏ వ్యక్తి అయిన వారసులు లేనప్పుడు గాని, లేదా తన ఆస్తి ఎవరికి చెందాలో తెల్పుతూ వీలునామా గాని రాయకుండా మరణించినట్లయితే ఆ ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ఆ విధమైన ఆస్తులను స్వాధీనం చేసుకొనే హక్కు చట్టరీత్యా ప్రభుత్వానికి ఉంటుంది. దీనినే "ఎస్ఛీట్స్" అంటారు.

**అభివృద్ధి విధింపులు లేదా అభివృద్ధి పన్ను : (Betterment Levy)** ప్రభుత్వం నీటిపారుదల పథకాలు, బహుళార్థక సాధక ప్రాజెక్టులు మొదలైనవి చేపట్టినప్పుడు వాటివల్ల లాభం పొందినవారిపై విధించే సుంకాలను అభివృద్ధి పన్ను అంటారు. ప్రజల ప్రమేయము కృషి లేకుండా ప్రభుత్వం ద్వారా వారికి లాభం కలిగినప్పుడు లాభంలో కొంతభాగం ప్రభుత్వం పొందడానికి వారు అంగీకరిస్తారు.

**వాణిజ్య ఆదాయాలు (లేదా) ధరలు** (Commereial revenue's and prices) : ఆధునిక ప్రభుత్వాలు ప్రభుత్వ రంగంలో పరిశ్రమలను, వ్యాపార సంస్థలను నిర్వహిస్తున్నాయి ప్రభుత్వ సంస్థలో ఉత్పత్తి అయిన వస్తుసేవలను విక్రయించగా లభించు ఆదాయాలను వాణిజ్య ఆదాయాలు అంటారు. ఈ వస్తు సేవల వల్ల ప్రజలకు ఆదాయం కలుగుతున్నందువల్ల వారినుండి ప్రభుత్వం ధరలను నిర్ణయించి వసూలు చేస్తుంది. వస్తుసేవలను కొనుగోలు చేసిన వ్యక్తులు పొందే ప్రయోజనము వారు చెల్లించిన ధరకు సమానము అయినప్పుడు ఆ వస్తువులను ప్రభుత్వం తయారు చేసిన (లేదా) ప్రయివేట్ వ్యక్తులు తయారు చేసిన తేడా ఉండదు. అయితే ధరల

నిర్ణయ, విధానములో మాత్రం ప్రభుత్వానికి ప్రయివేట్ ఉత్పత్తి దారునికి తేడా ఉన్నది. ప్రభుత్వం లాభదృష్టితో కాకుండా సంక్షేమ దృష్టితో ఆలోచించినప్పుడు ప్రభుత్వం కొన్ని వస్తువులను వినియోగ వ్యయం కంటే తక్కువ ధరకు విక్రయించి ఆ వస్తువు వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది. కొన్ని సందర్భాలలో ప్రభుత్వం ప్రయివేట్ ఉత్పత్తిని నిషేధించి గుత్తాధిపత్యం సంపాదించి ఎక్కువ లాభం పొందడానికి వీలుగా ధరలను నిర్ణయించవచ్చు. ప్రయివేట్ ఉత్పత్తి దారలు ఉత్పత్తి చేయలేని, (లేదా) ఉత్పత్తి చేయడానికి ఆసక్తి చూపని వస్తువులను ప్రభుత్వం ఉత్పత్తి చేసి విక్రయించవచ్చు, కొన్ని వస్తువులకు అధిక ధరలను నిర్ణయించి వాటి ద్వారా వచ్చిన మిగులును పెట్టుబడిగా ఉపయోగించవచ్చు.

**గ్రాంట్లు మరియు కానుకలు (Grants and Gifts) :** ఒక ప్రభుత్వం మరొక ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చే ద్రవ్యాన్ని గ్రాంటు అంటారు. ఉదా : మనదేశంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకు స్థానిక సంస్థలకు ఉచితంగా అందించే ద్రవ్య సహాయాన్ని గ్రాంటు అంటారు. సాధారణంగా గ్రాంట్లను ఒక ప్రత్యేకమైన పద్ధతిలో పనిని చేయుటకు ఇస్తారు. విద్యాభివృద్ధి కార్యక్రమాలు, ఆరోగ్యాభివృద్ధి కార్యక్రమంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు మొదలైన వాటికి ప్రత్యేక లక్ష్యాన్ని సాధించడానికి ఇచ్చే గ్రాంటును ప్రత్యేక గ్రాంట్లు అంటారు. ఆదాయంలోని లోటును భర్తీ చేయడానికి ఇచ్చే గ్రాంటును సాధారణ గ్రాంట్లు అంటారు. ఒక ప్రభుత్వం మరొక ప్రభుత్వానికి, ప్రజలు ప్రభుత్వానికి స్వచ్ఛంధ సంస్థలు ప్రభుత్వానికి స్వచ్ఛందంగా చెల్లించేవాటిని కానుకలు అంటారు. భూకంపాలు వరదలు, తుఫానులు, అనావృష్టి లాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, యుద్ధ సమయాలలోను ప్రజలు ప్రభుత్వానికి ధనాన్ని కానుకగా యిస్తారు. మాములు పరిస్థితులలో కూడా ఆసుపత్రులు, విద్యాలయాల నిర్మాణానికి, నిర్వహణకు ప్రజలు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి విరాళాలందిస్తారు.

**ప్రభుత్వ ఆస్తుల నుంచి వచ్చే ఆదాయం :** గనులు, అడవులు, నదులు, పర్వతాలు మొదలైన సహజ వనరులను కౌలుకివ్వడం ద్వారా గాని, విక్రయించడం ద్వారా గాని ప్రభుత్వం ఆదాయాన్ని పొందుతుంది.

**కరెన్సీ నోట్లను ముద్రించడం (Printing Currency Notes) :** కొత్తగా కరెన్సీ నోట్లు అచ్చువేయడంద్వారా గూడా ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకుంటుంది. ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోలేనప్పుడు మాత్రమే ప్రభుత్వం అంతిమంగా ఈ మార్గాన్నే అనుసరించాలి. ఈ విధముగా ఆదాయాన్ని సమకూర్చుకోవడం కూడా పన్ను విధించడం లాంటిదేనని కొందరు ఆర్థిక వేత్తలు భావిస్తున్నారు. ఎందుకంటే క్రొత్తగా కరెన్సీ నోట్లు ముద్రించడం వల్ల ద్రవ్య సప్లయ్ పెరిగి ద్రవ్యం విలువ తగ్గిపోయి ధరలు పెరిగినట్లే, పన్నులు విధించినప్పుడు కూడా ధరలు పెరుగుతాయి. కాబట్టి కరెన్సీ నోట్ల ముద్రణకు, పన్ను విధింపుకు తేడా వుండదని కొందరి అభిప్రాయం అయితే పన్ను ప్రధాన లక్షణమైన నిర్బంధం ఇందులో ఉండదు.

పైన వివరించిన వివిధ ప్రభుత్వ ఆదాయ వనరుల మధ్య తేడా స్పష్టమైనది కాదు. పన్నులను ప్రభుత్వ సేవలకు చెల్లించే ధరలుగా కొంతమంది అభివర్ణించారు. అదేవిధముగా స్థానిక సంస్థలు విధించే పన్నులు ధరలను పోలి ఉంటాయి. ప్రభుత్వ ఏకస్వామ్యాలు ఎక్కువ ధరలను వసూలు చేస్తే అవి పన్నులను పోలి ఉంటాయి. పన్నులు, ఫీజులు ప్రత్యేక విధింపులు వాటి వాటి లక్షణాలను పోల్చి చూచినప్పుడు ఎక్కువ తేడా లేనట్లు తెలుస్తున్నది. టాషింగ్ (Taussing) పన్నుకు ఇచ్చిన వివరణ చట్టాన్ని అతిక్రమించేందుకు పెనాల్టీలకు కూడా వర్తిస్తుంది.

ఈ రెండింటికి గల తేడా వాటిని విధించడములో ప్రభుత్వ ఉద్దేశ్యములో ఉన్న తేడా మాత్రమే పెనాల్టీలను క్రమంగా పెంచుకుంటు పోతే అవి పన్నులకు సమానం అవుతాయి. పైన వివరించిన పన్నులు గాని పన్నేతర రాబడులు అనేవి కేవలము రాబడి కోసమే కాక కేటాయింపు ప్రభావం కోసం (Allo–calive effect) ఉపయోగించడం మంచిది. ఎ.పి. లెర్నర్ తన "ప్రమేయ వార్త విధానం" అనే భావనలో పేర్కొన్నాడు. పన్నేతర రాబడుల ద్వారా 1989 - 90 సం॥లో 14,456 కోట్లు లభించినది. ఇది మొత్తం ప్రభువు వసూళ్ళలో 28% గా వున్నది.

## 5.4. ప్రభుత్వ ఆదాయ వనరుల వర్గీకరణ :

(Classification of the Sources of Public Revenue) ప్రభుత్వానికి ఆదాయము ఏయే వనరులనుండి లభిస్తుంది. పన్నుల ద్వారా ఆదాయం లభించక ఆ పన్నుల భారాన్ని అంతిమంగా ఎవరు భరిస్తారు. అంతేగాక ఆయా ప్రభుత్వ ఆదాయ వనరుల ప్రాముఖ్యాన్ని తెలుసుకోవడానికి కూడా ప్రభుత్వ ఆదాయవనరులను తగిన విధంగా వర్గీకరించాలి. వివిధ కోణాల నుంచి పరిశీలించి ఆర్థికవేత్తల ప్రభుత్వ ఆదాయాన్ని అనేక రకాలుగా వర్గీకరించారు. కొన్ని ముఖ్యమైన వర్గీకరణలు క్రింద ఇవ్వడం జరిగినది.

**ఆడమ్ స్మిత్ వర్గీకరణ :** ఆడమ్‌స్మిత్ అభిప్రాయంలో ప్రభుత్వ ఆదాయానికి సంబంధించి ప్రజల ఆధీనంలో ఉన్నా ఆస్తులపైన, దేశ సంపదపైన ఏ మేరకు ప్రభుత్వానికి అదుపు ఉన్నది అనే దానిపై ఆధారపడి ఉంటుంది. దీని ప్రకారము ప్రభుత్వ ఆదాయాన్ని రెండురకాలుగా వర్గీకరించాడు. అవి :

1. ప్రజల నుంచి లభించే ఆదాయం

2. ప్రభుత్వ ఆస్తినుంచి లభించు ఆదాయం

పన్నులు మొదలైన మార్గాల ద్వారా ప్రభుత్వం సమకూర్చుకొనే ఆదాయం మొదటి తరగతికి, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ ఆస్థుల నుంచి లభించే ఆదాయం రెండోతరగతికి చెందుతుంది. ఆడమ్‌స్మిత్ వర్గీకరణ ప్రభుత్వం పోలిసు విధులను నిర్వహించే ప్రాచీన కాలంలో సమంజసంగా ఉండవచ్చు. కాని ఆధునిక ప్రభుత్వాలు ప్రజా శ్రేయస్సు కొరకు అనేక కార్యకలాపాలను చేపట్టి నిర్వహించడం వల్ల ఆడమ్‌స్మిత్ వర్గీకరణ ఆధునిక కాలంలో అసంపూర్ణమైనది.

**సెలిగ్‌మన్ వర్గీకరణ :** ప్రభుత్వ ఆదాయాన్ని సెలిగ్‌మన్ మూడు తరగతులుగా వర్గీకరించాడు.

ఎ) ఉచితంగా వచ్చే ఆదాయం (Gratutions Revenue) ప్రభుత్వానికి, ప్రజలు ఇతర దేశాల ప్రభుత్వాలు ఉచితంగా ఇచ్చే గ్రాంట్లు, కానుకలు, చందాలు మొదలైనవి ఈ తరగతికి చెందిన ఆదాయాలు.

బి) ఒప్పందపు ఆదాయం (Cantracted Revenue) : ప్రభుత్వానికి ప్రజలకు మధ్య కుదిరిన ఒప్పందం వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ఈ తరగతికి చెందుతుంది. ఉదాహరణకు : ప్రభుత్వ భూములు, గనులు, కౌలుకివ్వడం వల్ల వచ్చే బాటకం. ప్రభుత్వ వాణిజ్య కార్యకలాపాల వల్ల వచ్చే ఆదాయం రైల్వేలూ తంతితపాలా శాఖలందించే సేవలకు ప్రతిఫలంగా లభించే ఆదాయాలు ప్రభుత్వ రంగ సంస్థలు ఉత్పత్తులనుండి వచ్చే లాభాలు మొ॥ వి ఈ తరగతికి చెందినవి.

**లుట్జ్ వర్గీకరణ (Lutz's Classification) : లుట్జ్ - ప్రభుత్వ ఆదాయాన్ని**

ఎ) వాణిజ్య ఆదాయాలు

బి) పరిపాలనా సంబంధమైన ఆదాయాలు

సి) పన్నులు

డి) ప్రభుత్వ ఋణాలు

ఇ) గ్రాంట్లు

ఎఫ్) బదిలీ ఆదాయాలు (Book - Keeping Revenue's)

అని ఆరు రకాలుగా వర్గీకరించారు.

**షిరాస్ వర్గీకరణ :** ప్రభుత్వ ఆదాయాన్ని పన్నుల ద్వారా లభించే ఆదాయం, ఇతర ఆదాయము అని 2 విధాలుగా విభజించాడు.

ఎ) పన్నుల ద్వారా లభించే ఆదాయం : పన్నులు, ఫీజులు, ప్రత్యేక విధింపులు వల్ల వచ్చే ఆదాయం ఈ కోవకు చెందినవి.

బి) ఇతర ఆదాయం : ప్రభుత్వ ఋణాల ద్వారా సమకూర్చుకునే ఆదాయం, ఇతరముల ద్వారా లభించే ఆదాయం.

**డాల్టన్ వర్గీకరణ :** ప్రభుత్వ ఆదాయ వనరుల్లో పన్నులు, ధరలు ముఖ్యమైనవి అని డాల్టన్ అభిప్రాయం. ఈ రెండింటిని విపులంగా వివరిస్తూ డాల్టన్ ప్రభుత్వ - ఆదాయాన్ని 12 భాగాలుగా విభజించాడు. ఎ) పన్నులు బి) యుద్ధము వల్ల (లేదా) ఇతర కారణముల వల్ల చెల్లించే కప్పములు సి) నిర్బంధ వసూళ్ళు డి) చట్టాలను ఉల్లంఘించినందుకు న్యాయస్థానాలు విధించే జరిమానాలు

ఈ నాల్గింటిలో కొంతమేరకు పన్ను లక్షణం ఉన్నది.

ఇ) ప్రభుత్వ ఆస్తుల నుంచి వచ్చే ఆదాయం ఎఫ్) ప్రభుత్వ సేవలకు వసూలు చేసే ఫీజు జి) ప్రభుత్వ రంగ సంస్థల లాభాలు హెచ్) స్వచ్ఛంద ఋణాలు ఈ నాల్గింటిలో కొంతమేరకు ధరల లక్షణాలు ఉన్నవి.

ఇవికాక పన్నులలోను, ధరలలోను చేరని నాలుగు ఆదాయ వనరులు ఉన్నాయి. అవి

ఐ) ప్రత్యేక విధింపులు జె) ప్రభుత్వ ఏకస్వామ్యం లో ఉన్న సంస్థలు కె) కరెన్సీ నోట్లను ముద్రించడం ఎల్) స్వచ్ఛంద కానుకలు

**టేలర్ వర్గీకరణ :** ఫిలిప్ ఇ. టేలర్ ప్రభుత్వ ఆదాయాన్ని నాలుగు భాగాలుగా విభజించారు.

ఎ) గ్రాంట్లు, కానుకలు

బి) పరిపాలనా నిర్వహణ ఆదాయాలు

సి) వాణిజ్య ఆదాయాలు

డి) పన్నులు

**ఎ) గ్రాంట్లు, కానుకలు :** ఒక ప్రభుత్వం మరొక ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చే మొత్తమును గ్రాంటు అంటారు ఉదా : కు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకు, రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు గ్రాంట్లను ఇస్తుంటాయి. సాధారణముగా ఈ గ్రాంట్లను ఒక ప్రత్యేక పనిని ఉద్దేశించి ఇవ్వడం జరుగుతుంది. గ్రాంట్లు ప్రధానముగా రెండు రకములు ఎ) సాధారణ గ్రాంట్లు బి) ప్రత్యేక గ్రాంట్లు

**సాధారణ** గ్రాంట్లు అనగా :- ఆదాయంలోని లోటును భర్తీ చేసే గ్రాంట్లు ప్రత్యేక గ్రాంట్లు అనగా రహదారుల నిర్మాణము, విద్యాసదుపాయాల కల్పన లాంటి ప్రత్యేక కార్యక్రమాలకు ఇచ్చే గ్రాంట్లు. ప్రజలూ సంస్థలు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి చెల్లించే మొత్తాలను కానుకలు అంటారు. సాధారణంగా యుద్ధాలు, భూకంపాలు, వరదలు మొదలైన అత్యవసర సమయాల్లో ప్రజలు ప్రభుత్వానికి కానుకలు ఇస్తారు. సాధారణ పరిస్థితులలో కూడా ప్రజలు ప్రభుత్వానికి కానుకలిచ్చినప్పటికీ, ఈ రూపంలో ప్రభుత్వానికి లభించే ఆదాయం చాలా స్వల్పమని చెప్పవచ్చు.

**బి) పరిపాలనా నిర్వహణ ఆదాయాలు :** ప్రత్యేక విధింపులు, అభివృద్ధి విధింపులు, ఫీజులు లైసెన్స్, జరిమానాలు, ఎస్చీట్స్, జప్తులు మొదలైనవి పరిపాలనా నిర్వహణ ద్వారా లభ్యమయ్యే ఆదాయాలు. సాధారణ పరిపాలనా విధులు, ప్రభుత్వం నిర్వర్తించినప్పుడు ఈ ఆదాయాలు లభిస్తాయి. అందుకనే టేలర్ వీటికి పరిపాలనా నిర్వహణ ఆదాయాలని పేరు పెట్టాడు.

**సి) వాణిజ్య ఆదాయాలు :** ప్రభుత్వం ఉత్పత్తి చేసి సప్లయ్ చేసే వస్తువులకు ప్రజలు చెల్లించే ధరలు ద్వారా ప్రభుత్వానికి లభించే ఆదాయాన్ని వాణిజ్య ఆదాయం అంటారు. ప్రభుత్వం పరిశ్రమలను నిర్వహించడానికి ఆదాయము కంటే ప్రజాసంక్షేమమే కారణం. ప్రయివేట్ పెట్టుబడిదారులు, ఉత్పత్తి చేయడానికి ఆసక్తి చూపని వస్తువులను ఉత్పత్తి చేయడం. వస్తువుల ఉత్పత్తిని, పంపిణీని క్రమబద్ధం చేయడం, ప్రవేట్ ఉత్పత్తి దారుల కంటే వస్తువులను చౌకగా అందించడం ప్రభుత్వ ఆశయం. పెట్టుబడులు అత్యధికంగా గల పరిశ్రమలను, ప్రయివేట్ పెట్టుబడిదారులు స్థాపించడానికి ఇష్టపడని పరిశ్రమలను, ఫలనాకాలము అధికంగా గల పరిశ్రమలను ప్రభుత్వమే చేపట్టుతుంది.

సహజ ఏకస్వామ్యాలను, ప్రభుత్వం ప్రయివేట్ ఉద్యమదారులకు వదలి వేయడం - వినియోగ దారులకు క్షేమం కాదు. ఇలాంటి పరిస్థితులలో ప్రయివేట్ వ్యక్తులు స్థాపించిన పరిశ్రమలు, ఉత్పత్తి చేసిన వస్తువులకు సరసమైన ధరలను నిర్ణయించి విక్రయిస్తుంది. ఈ విధంగా ఇచ్చిన ఆదాయమే వాణిజ్య ఆదాయం.

**డి) పన్నులు :** తాను పొందే ప్రయోజనంతో సంబంధం లేకుండా ప్రజలందరి ప్రయోజనం కోసం ప్రభుత్వం చేసే వ్యయానికై ప్రతిపౌరుడూ నిర్భంధముగా చెల్లించే మొత్తాన్ని పన్ను అంటారు. ప్రభుత్వ ఆదాయంలో అధిక భాగం పన్నుల ద్వారానే సమకూరుతుంది. ఆధునిక యుగంలో ఆదాయ సమపార్జనే పన్నుల ముఖ్య ఉద్దేశ్యం కాదు. కొన్ని ఆర్థిక కార్యకలాపాల నియంత్రణకు, సాంఘీక లక్ష్యాల సాధనకు, సాంఘీక న్యాయం చేకూరడానికి కూడా పన్నులు తోడ్పడుతున్నాయి.

**జె.కె. మెహతా వర్గీకరణ :** పన్నుల విధింపులోని ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని అనుసరించి ఆధునిక వర్గీకరణ పేరుతో ప్రభుత్వ ఆదాయాన్ని పన్ను, ఫీజు, డ్యూటీ అని మూడు విధాలుగా వర్గీకరించాడు. వస్తూత్పత్తితో సహ ప్రభుత్వం సేవలందించడానికి కావలసిన ద్రవ్యాన్ని సమకూర్చుకొనే ఆశయంతో ప్రభుత్వం వసూలు చేసే మొత్తాన్ని పన్ను అని, వస్తు సేవల వినియోగాన్ని అదుపు చేసే ఆశయంతో వసూలు చేసేది ఫీజు అని, ప్రయివేట్ సంస్థలు అందించే సేవలను ప్రోత్సహించడం (లేదా) వాటి ఉపయోగాన్ని నిరుత్సాహపరచడానికి ప్రభుత్వం వసూలు చేసే మొత్తాన్ని డ్యూటీ అంటారని జె.కే. మెహతా వివరించాడు.

**ఆర్థిక వర్గీకరణ :** భారత ప్రభుత్వం **1957 - 58** లో ప్రథమంగా తన బడ్జెట్లో ఆర్థిక వర్గీకరణను ప్రవేశపెట్టింది. ఈ వర్గీకరణలో ప్రభుత్వ ఆదాయ వ్యయాల రెండింటిని రెవిన్యూ పద్దు, మూలధన పద్దు అని విభజించడం జరిగింది.

రెవెన్యూపద్దు :- పన్నులు ఇతర మార్గాల ద్వారా అంటే రైల్వేలు, తంతి తపాలా మొ॥లైన ప్రభుత్వ శాఖలు, సంస్థల ద్వారా సమకూర్చుకొనే ఆదాయాన్ని ఈ పద్దు క్రింద చేర్చడం జరిగింది.

మూలధన పద్దు :- మార్కెట్ ఋణాలు, విదేశీ సహాయం, చిన్న పొదుపు మొత్తాలు, భవిష్య నిధులు, ప్రత్యేక డిపాజిట్లు, జాతీయ డిపాజిట్ పథకం, రిజర్వ్ బ్యాంక్ సెక్యూరిటీలు మొదలైన వాటిద్వారా ప్రభుత్వం సమకూర్చుకొనే ఆదాయం ఈ పద్దు క్రిందకు వస్తుంది.

పై వర్గీకరణను బట్టి ప్రభుత్వం అనేక మార్గాల ద్వారా ఆదాయాలను సమకూర్చుకుంటుంది. ప్రభుత్వ ఆదాయాన్ని వివిధ రకాలుగా వర్గీకరించారని మనకు తెలుస్తున్నది. వివిధ వర్గీకరణల ద్వారా ఆయా వనరులకు గల పోలికలు, తేడాలు తెలిశాయి.

ఒక సూత్రాన్ని సాధారణముగా వర్తింపజేసేటప్పుడు అది అన్ని రకాల ఆదాయాలకు వర్తిస్తుందా (లేదా) కొన్నింటికి మాత్రమే వర్తిస్తుందా అనే విషయం కడా తెలుసుకోవాలి. వివిధ ప్రభుత్వ ఆదాయ తొలి, అంతిమ ప్రభావాలు వేరు, వేరుగా ఉంటాయి. వివిధ ప్రభుత్వ ఆదాయ మార్గాలను వాటి వర్గీకరణలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ విషయాలు తెలుస్తాయి.

## 5.5 పన్నుల వర్గీకరణ : (Classification of Taxes)

ప్రభుత్వ ఆదాయ వనరుల పన్నులకు ప్రముఖ స్థానమున్నది. ప్రతివ్యక్తి తాను పొందే ప్రత్యేక, ప్రత్యక్ష ప్రయోజనంలో నిమిత్తం లేకుండా ప్రజలందరి ప్రయోజనము కోసము నిర్భంధముగా ప్రభుత్వము చేసే వ్యయానికై ప్రభుత్వమునకు చెల్లించేది పన్ను. వాటి స్వభావాన్ని బట్టి పన్నులను అనేక రకాలుగా వర్గీకరించవచ్చు. కొన్ని ముఖ్యమైన వర్గీకరణలు క్రింద ఉదహరిచడం జరిగింది.

**తాత్కాలిక పన్ను - శాశ్వత పన్ను :** కొన్ని పన్నులను ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికపై విధిస్తుంది. దేశం క్లిష్ట పరిస్థితులలో ఉన్నప్పుడు, దేశ తాత్కాలిక అవసరాలు తీర్చడానికి విధించే పన్నులు తాత్కాలిక పన్నులు ఉదా॥కు యుద్ధం, కరువు లాంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనడానికి అధిక లాభాలపై విధించే "సర్ చార్జీలు" యుద్ధ అవసరాలకు చేసిన అనుత్పాదక ఋణాలను చెల్లించడానికై విధించే ప్రత్యేక విధింపులు మొ॥వి. శాశ్వత ప్రాతిపదికపై విధించే పన్నులను శాశ్వత పన్నులంటారు. ఉదా॥కు ఆదాయం పన్ను, సంపదపన్ను, అమ్మకం పన్ను మొ॥వి. పన్నులు చెల్లించే వారు ఏ విధంగా ప్రవర్తిస్తారో తెలియజేయడంలో ఈ వర్గీకరణ ప్రాముఖ్యం ఇమిడి ఉన్నది. సాధారణంగా పనిచేయడం, పొదుపు చేయడం, పెట్టుబడి పెట్టడంలో వ్యక్తుల ఆసక్తి పై తాత్కాలిక పన్నుల ప్రభావం పెద్దగా వుండదు.

శాశ్వత పన్నుల ప్రభావం అధికంగా ఉంటుంది. కొన్ని పన్నులు మొదట తాత్కాలిక ప్రాతిపదికపై విధించినప్పటికి ఆ తరువాత శాశ్వితమయ్యే అవకాశం ఉంది. ఉదా॥కు భారతదేశంలో ఆదాయం పన్నును 1860 వ సం॥లో మొదట తాత్కాలిక ప్రాతిపదికపై (1857 లో జరిగిన సిపాయిల తిరుగుబాటును అణిచివేయడానికి అయిన వ్యయాన్ని రాబట్టుకోవడానికి) 5 సం॥రముల వరకే విధించారు. కాని తరువాత 1886 నుంచి ఆదాయపు పన్నును ప్రతి సంవత్సరము విధించడం జరుగుతుంది.

**ఆస్థిపై పన్ను - వస్తువుల పై పన్ను** : ఒక నిర్ణీత గడువులో ఒకేసారి చెల్లించేది ఆస్థిపై పన్ను, ఉదా॥కు మరణ సుంకాలు, ఇంటిపన్ను మొదలగునవి. ఉత్పత్తి (లేదా) అమ్మకం జరిగినప్పుడు చెల్లించవలసిన పన్నులు వస్తువులపై పన్నులు ఉదా॥ ఎక్సైజ్ డ్యూటీలు, అమ్మకం పన్ను, మొ॥నవి ఆస్థిపై విధించే పన్నులు, ప్రత్యక్ష పన్ను అని, వస్తువులపై విధించే పన్నును పరోక్ష పన్నులని కూడా అంటారు.

**మూల్యానుగతమైన పన్నులు - నిర్థిష్టమైన పన్నులు** : వస్తువులపై పన్నులను వాటి విలువలను బట్టికాని, వస్తువుల భౌతిక అంశాలైన పరిమాణం (లేదా) బరువును బట్టిగాని విధించవచ్చు. వస్తువు విలువను బట్టి విధించే పన్నులను విలువను బట్టి విధించే పన్ను (లేదా) మూల్యానుగతమైన పన్ను (Advaloram Tax) అంటారు. వస్తువు బరువు, ఘన పరిమాణమును బట్టి విధించే పన్నును నిర్ధిష్టమైన పన్ను అంటారు. (Specific Tax) విలువలను బట్టి విధించే పన్నులు ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చుతాయి. ముఖ్యంగా ధరలు పెరిగేకాలంలో ఈ పన్నులవల్ల ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయము సమకూరుతుంది.

**ఉత్పత్తి పై పన్ను - వినియోగం పై పన్ను** : వస్తువులపై పన్నులను ఉత్పత్తిని బట్టి వాటి అమ్మకాలను బట్టి కూడా విధించవచ్చు. వస్తువులు ఉత్పత్తి జరిగే స్థానంలో పన్ను విధిస్తే దాన్ని ఎక్సైజ్ సుంకం అంటారు. వస్తువు అమ్మకం జరిగేటప్పుడు పన్ను విధిస్తే దానిని అమ్మకం పన్ను (లేదా) వినియోగం పై పన్ను అని అంటారు.

**ఆదాయంపై పన్ను - మూలధనం పై పన్ను** : ఆస్తినుంచి వచ్చే ఆదాయంపై పన్ను విధిస్తే దాన్ని ఆదాయపు పన్ను అని, ఆస్థి విలువను బట్టి పన్ను విధిస్తే దాన్ని మూలధనముపై పన్ను అని అంటారు. ఆస్థిపై పన్నును విధించేటప్పుడు ఆస్థినుంచి సమకూరే ఆదాయం ఆదారంగా కానీ, (లేదా) ఆస్థి విలువను బట్టి కానీ విధించవచ్చు. సంవత్సరములో ఆస్తినుంచి వచ్చే ఆదాయానికి, ఆస్థి విలువకు గల నిష్పత్తి అన్ని వస్తువులకు ఒకే విధముగా ఉన్నప్పుడు పన్ను రూపములో కొంత ఆదాయాన్ని రాబట్ట దలిస్తే ఆ పద్దతిని అయినా ఉపయోగించవచ్చు. కాని సంవత్సర ఆదాయానికి, ఆస్థి విలువలకు గల నిష్పత్తి స్థిరంగా లేనప్పుడు వేర్వేరు ఆస్తులపై వేర్వేరు రేట్లలో పన్నులు విధించాలి. ఆదాయం పై విధించిన పన్నును, మూలధనంనుంచి గాని మూలధనంపై విధించిన పన్నును ఆదాయం నుంచి చెల్లించే వీలు ఉండదు. అందువల్ల మూలధనము పై భారమైన పన్ను విధించినప్పుడు పన్ను విధింపుకు పన్ను చెల్లింపునకు సన్నిహిత సంబంధం ఉన్నది.

**ప్రత్యక్ష పన్ను - పరోక్ష పన్ను** : పన్నులను చెల్లించే విధానాన్ని బట్టి ప్రత్యక్ష పన్నులు, పరోక్ష పన్నులు అని 2 విధాలుగా విభజించవచ్చు. పన్ను ఎవరిపై విధించడం జరుగుతుందో వారే చెల్లించాలి అనేది ప్రభుత్వ ఉద్దేశము అయితే దానిని ప్రత్యక్ష పన్ను అని, ఇతరులకు బదిలీ చేయాలి అనేది ప్రభుత్వ ఉద్దేశ్యము అయితే దానిని పరోక్ష పన్ను అని అంటారు.

చట్టరీత్యా ఎవరిపై పన్ను విధించడం జరుగుతుందో వారే దానిని చెల్లిస్తే అది ప్రత్యక్ష పన్ను అని, ఒకరిపై విధించిన పన్నులో కొంతభాగం కానీ (లేదా) మొత్తం గానీ మరొకరు చెల్లిస్తే దాన్ని పరోక్ష పన్ను అని అంటారు.

పన్ను తొలి (Impart) అంతిమ (incidence) ప్రభావాలు ఒకే వ్యక్తి మీద ఉన్నట్లు అయితే అది ప్రత్యక్ష పన్ను అనీ, వేర్వేరు వ్యక్తుల మీద ఉన్నట్లు అయితే దానిని పరోక్ష పన్ను అని అంటారు. పన్ను చెల్లించే వారికి, ప్రభుత్వానికి మధ్య ప్రత్యక్ష సంబంధం ఉంటే దానిని ప్రత్యక్ష పన్ను అని అలాంటి సంబంధం లేకపోతే దానిని పరోక్ష పన్ను అని అంటారు. ఆదాయం ఆస్థులపైన విధించే పన్నులను ప్రత్యక్షపన్నులని, వస్తువుల మీద వ్యయం మీద విధించే పన్నులను పరోక్ష పన్నులని అంటారు.

**పురోగామి, తిరోగామి, అనుపాతపు పన్నులు** : ఆదాయం పెరిగే కొద్ది పన్ను రేటు పెరిగితే దానిని పురోగామి పన్ను అని, ఆదాయం పెరిగే కొద్ది పన్నురేటు తగ్గితే దానిని తిరోగామి పన్ను అని, ఆదాయంతో సంబంధం లేకుండా పన్ను రేటు స్థిరంగా ఉంటే దానిని అనుపాతపు పన్ను అని అంటారు.

## 5.6 ప్రత్యక్ష పన్నులు - పరోక్ష పన్నులు :

ప్రభుత్వ ఆదాయ మార్గాలలో ప్రధానమైన మార్గం పన్నులు. ప్రజలందరి ప్రయోజనం కోసం వ్యయం చేయడానికి వ్యక్తులనుండి ప్రభుత్వం నిర్బంధముగా వసూలు చేసే మొత్తాన్ని పన్ను అంటారు. దీనిలో ఏ ఒక్కరికి ప్రత్యక్ష ప్రయోజనం ఉండదు. వీటిని ప్రభుత్వమే విధిస్తుంది. వీటికి చట్ట పరిధి కూడా ఉంటుంది. ఈ లక్షణాలన్ని కలిగిన వాటిని పన్నులు అంటారని ఆచార్య డాల్టన్ పేర్కొన్నాడు. అటువంటి పన్నులను ప్రధానంగా ప్రత్యక్ష, పరోక్ష అను రెండు రకాల పన్నులుగా వర్గీకరించినారు. వీటి అర్థాన్ని ఉద్దేశ్యాన్ని, స్వభావాన్ని బట్టి వాటికి కొన్ని లాభ, నష్టాలు కలవు.

**ప్రత్యక్ష పన్నులు : (Direct Taxes)** డాల్టన్ అను అర్థశాస్త్రవేత్త అభిప్రాయంలో ప్రత్యక్ష పన్నులనగా ఎవరిమీద విధించబడతాయో వారే చెల్లించే పన్నులు అనగా పన్ను విధింపు వలన తొలి, అంతిమ భారాలు ఒకే వ్యక్తి మీద ఉంటే అలాంటి పన్నులను ప్రత్యక్ష పన్నులు అంటారు. ఆర్థికాభివృద్ధి దృష్ట్యాలు ఉత్తమమైన పన్నులు అంటే వీటి ద్వారా రాబడిని పొంది ఉత్పత్తి ఉద్యోగితలను పెంపొందించవచ్చు. అదే విధముగా ఆర్థిక అసమానతలను తగ్గించుటలో కూడా ప్రత్యక్ష పన్నులే తోడ్పడతాయి. ప్రత్యక్ష పన్నులకు ఉదా॥ గా ఆదాయపు పన్ను, సంపదపన్ను, కార్పోరేషన్ పన్ను, ఆస్థి పన్ను మొ॥లగు వాటిని చెప్పవచ్చు.

**ప్రత్యక్ష పన్నులు - సుగుణాలు :** ప్రత్యక్ష పన్నులు ఈ క్రింది సుగుణాలను కలిగి ఉన్నాయి. అవి

1. సమానత్వం
2. స్థిరత్వము
3. వ్యాకోచము
4. ఉత్పాదకత
5. లాభదాయకము
6. ధరల తగ్గుదల
7. పౌర చైతన్యం

**1. సమానత్వం :** ప్రత్యక్ష పన్నులు పన్ను చెల్లింపుదారుడి సామర్థ్యాన్ని బట్టి విధించబడతాయి. కాబట్టి వీటివలన సమానత్వం అనే భావనను సాధించవచ్చును. ఉదా॥కి భారతదేశంలో ఆదాయపు పన్ను ఒక స్థాయి తరువాత విధించబడుతుంది. కాబట్టి ధనికులపై విధించబడి వారి వారి ఆర్థిక శక్తిని తగ్గించి సమానత్వ కల్పనకు తోడ్పడుతుంది.

**2. స్థిరత్వము :** ప్రత్యక్ష పన్ను విధింపు వలన ప్రభుత్వానికి ఖచ్చితంగా ఎంత ఆదాయము వస్తుందో చెప్పవచ్చును. అంతేకాకుండా పన్ను చెల్లింపు దారుడకి, ఎప్పుడు పన్ను చెల్లించాలి, ఎంత మొత్తములో చెల్లించాలి, ఏ పద్దతిలో చెల్లించాలి, అనేది స్పష్టంగా తెలుస్తుంది. కావున ప్రభుత్వానికి చెల్లింపుదారునికి అనుకూలమై ఉంటుంది.

**3. వ్యాకోచత్వము :** ప్రత్యక్ష పన్నులలో వ్యాకోచత్వ నియమము స్పష్టంగా కనబడుతుంది. ప్రభుత్వానికి ప్రత్యక్ష పన్నులద్వారా వచ్చే ఆదాయం సహజంగా పెరుగుతూ ఉంటుంది. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచదలచినప్పుడు పన్నుల రేటును కూడా పెంచుకోవడానికి ఈ పన్నులలో వీలుంటుంది.

**4. ఉత్పాదకత :** ప్రభుత్వ ఆదాయ ఉత్పాదనకు ప్రత్యక్ష పన్నులు దోహదం చేస్తాయి. ప్రభుత్వానికి అవసరం ఏర్పడినప్పుడు ప్రత్యక్ష పన్నుల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చును. అంతేకాకుండా పన్ను మినహాయింపుల ద్వారా పొదుపు, పెట్టుబడి, మూలధనము పెరిగి వస్తూత్పత్తికి దోహదం చేస్తుంది.

**5. లాభదాయకము :** ప్రత్యక్ష పన్నుల విధింపు మరియు వసూళ్ళకు అయ్యేవ్యయం పరోక్ష పన్నులతో పోల్చినట్లుయితే చాలా తక్కువగా ఉంటుంది. ఆదాయం పన్ను, సంపద పన్ను మొ॥ పన్నుల పర్యవేక్షణకు నియమించబడే అధికారులు చాలా తక్కువగా ఉంటారు.

**6. ధరల తగ్గుదల :** ప్రత్యక్ష పన్నులు పెంచడం వలన ప్రజల కొనుగోలు శక్తి తగ్గి తద్వారా డిమాండ్ తగ్గి ధరలు తగ్గుటకు దోహదం చేస్తాయి. కాబట్టి ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంలో ప్రత్యక్ష పన్నులు ఉపయోగపడతాయి.

**7. పౌర చైతన్యం :** ప్రత్యక్ష పన్ను చెల్లింపు బదలాయించుటకు వీలులేదు కాబట్టి భారాన్ని భరించిన వ్యక్తి తాను చెల్లించిన మొత్తం ఉపయోగాన్ని ప్రశ్నించగలడు. ప్రత్యక్షంగా ప్రయోజనం రాకపోయినా పరోక్ష ప్రయోజనాన్ని ఆశించి ప్రభుత్వ కార్యకలపాల పట్ల తన ఆసక్తిని కనబరుస్తారు. అంటే పౌరుల జాగృతి ఈ పన్నులలో కనబడుతుంది.

**5.6.1.2 ప్రత్యక్ష పన్నులు - దోషాలు :** ప్రత్యక్ష పన్నుల వలన క్రింది నష్టాలు కలుగుతాయి.

**పన్ను ఎగవేతకు అవకాశం :** ప్రత్యక్ష పన్నులు బదలాయించుటకు వీలులేదు కాబట్టి పన్నునుంచి తప్పించుకోవడానికి తప్పుడు ఆదాయపు లెక్కలను, సంపద లెక్కలను చూపిస్తాము కాబట్టి ఈ పన్నులలో ఎగవేతకు వీలుంటుంది.

**పన్ను ప్రాతిపధిక తక్కువ :** ప్రత్యక్ష పన్నులు, ఆదాయపరుల మీద, సంపద పరుల మీద ఇట్లా సమాజంలో కొద్దిమంది మీద మాత్రమే విధించబడతాయి. అత్యధిక జనాభా ఈ పన్నుక్రిందకు రాదు. కాబట్టే ప్రత్యక్ష పన్ను చెల్లించే వారి సంఖ్య చాలా తక్కువ.

**ప్రజా వ్యతిరేకత :** ప్రత్యక్ష పన్ను విధింపు వలన కలిగే భారాన్ని బదిలీ చేయుటకు అవకాశం లేదు. కాబట్టి కష్టించి సంపాదించుకున్నా ఆదాయాన్ని పన్నుల రూపములో చెల్లించవలసి ఉండటం చేత చెల్లింపు దారులలో వ్యతిరేకత ఎక్కువగా ఉంటుంది. కావున ప్రత్యక్ష పన్నులు చెల్లింపుదారునికి ఇబ్బందిని కలుగజేస్తాయి.

**చెడు ప్రభావాలు :** ప్రత్యక్ష పన్నులు విధించడం వలన కష్టపడి సంపాదించాలనే మనస్తత్వం నశించి, పొదుపు చేయాలనే కోరిక, పెట్టుబడి పెట్టాలనే కోరిక సామర్థ్యాలు దెబ్బతిని ఉత్పత్తి విధానానికి ప్రోత్సాహకరంగా ఉండదు.

**అనవసర వ్యయం :** ప్రత్యక్ష పన్నుల వసూళ్ళలో వ్యయం తక్కువని చెప్పినప్పటికీ వాస్తవంగా వ్యయం ఎక్కువ అవుతున్నది. ఉదా॥కి పన్ను ఎగవేత ఎక్కువ అయ్యేకొలది ఆ ఎగవేత దారులను గుర్తించి వారిపై దాడులను నిర్వహించడానికి అధిక సిబ్బంది కావలయును.

**అసౌకర్యాలు :** ఆర్థిక సంవత్సరం అంతంలోనే ఒకేసారి పెద్దమొత్తంలో పన్ను చెల్లించవలసి ఉండటం వలన పన్ను చెల్లింపుదారునికి ఇది అసౌకర్యంగాను, ఇబ్బందిగాను ఉంటుంది. అంతేకాకుండా ఆదాయపు లెక్కలు, ఖాతాలను తయారు చేయడానికి అధికశ్రమ వ్యయం అవసరమవుతాయి.

**పరోక్ష పన్నులు :** J.S. Mill అనే ఆర్థిక శాస్త్రవేత్త అభిప్రాయంలో పన్ను తొలి భారం ఒకరిమీద (లేదా) అంతిమభారం ఇతరుల మీద పడుతున్నట్లయితే లేదా అనేకమంది మీద విధించడానికి వీలు ఉంటే అలాంటి పన్నులను పరోక్ష పన్నులు అంటారు. అంటే ఒకరిపై విధించిన పన్ను మరొకరికి మార్పుచేసే ప్రక్రియ ఈ పన్నుల విధానంలో ఉంటుంది. ప్రాథమికంగా ఉత్పత్తి సంస్థలు (లేదా) అమ్మకం దారులు పన్ను భారాన్ని భరించినప్పటికి అంతిమంగా ఈ భారాన్ని వినియోగదారులే భరించవలసి ఉంటుంది. కాబట్టి వినియోగదారుల సంక్షేమం దృష్ట్యా ఈ పన్నులు సమర్థనీయం కాదు. పరోక్ష పన్నులకు ఉదా॥ గా ఎక్సైజ్ సుంఖాలు అమ్మకము పన్ను వినోదం పన్ను మొ॥ పన్నులు పెర్కొనవచ్చు. ఈ పన్నులకు కొన్ని గుణదోషాలు కలవు.

**సుగుణాలు :** పరోక్ష పన్నుల వలన ఈ క్రింది లాభాలు చేకూరుతాయి.

**సౌనుకూలత :** ప్రత్యక్ష పన్నులతో పోలిస్తే పన్నులు పన్ను చెల్లింపు దారునికి అనుకూలంగా ఉంటాయి. కాబట్టి కొద్ది కొద్ది మొత్తాలలో వేరు వేరు సమయాలలో వస్తుధరలలో అంతర్భాగంగా పన్ను చెల్లింపుదారుడికి తెలియకుండానే పన్ను చెల్లిస్తాడు. కాబట్టి చెల్లింపుదారుని దృష్ట్యా ఇది అనుకూలమై ఉంటుంది.

**న్యాయసమ్మతం** : పేదలుకొనే వస్తువులు మీద పన్ను మినహాయింపులు ధనికులు కొనే వస్తువుల మీద ముఖ్యంగా విలాసవస్తువులు మీద, అత్యధికంగా పన్ను విధించడం వలన సమాజానికి న్యాయం చేకూరుతుంది.

**పన్ను ప్రాతిపదిక ఎక్కువ** : దేశంలో అన్నిరకాల ప్రజలు పరోక్ష పన్నుల క్రిందకు వస్తారు అదే ప్రత్యక్ష పన్నుల క్రిందకు పేదవారు రారు. కాని ధనిక వర్గం మధ్యతరగతి వారు పేదవారు అందరూ పన్నులను ఏదోవిధంగా చెల్లించవలసి ఉంటుంది. ఎలాంటి వారు ఐనా వస్తువులు కొన్నప్పుడల్లా ధరలో అంతర్భాగం అయి ఉంటుంది. కాబట్టి పన్ను చెల్లించవలసిందే.

**పన్ను ఎగవేతకు వీలులేదు** : పరోక్ష పన్నులను ఎగవేయడానికి వినియోగదారులకు అవకాశము ఉండదు. పన్ను వస్తువు యొక్క ధరలో అంతర్భాగముగా ఉంటుంది. కావున వస్తువు కొన్నప్పుడల్లా పన్ను చెల్లించవల్సిందే ఒకవేళ పన్నునుండి తప్పించుకోదలిచిన అసలు ఆ వస్తువే లభించదు. కాబట్టి పరోక్ష పన్నులలో ఎగవేతకు వీలు ఉంటుంది.

**దుర్వినియోగం తగ్గుతుంది** : పరోక్ష పన్నులు ఉత్పత్తులు, అమ్మకాలు మీద విధిస్తారు. కాబట్టి అనుత్పాదక వ్యయాన్ని హానికర వస్తువుల వినియోగాన్ని నియంత్రణ చేయవచ్చు. ఉదా॥ మత్తుపానీయాలు, సిగరెట్లు మొ॥ వాటి మీద పన్ను అధికంగా విధించడం వలన ఆరోగ్యానికి హానికరము. అయిన వీటి వినియోగాన్ని తగ్గించవచ్చును.

**వ్యాకోచత్వము** : పరోక్ష పన్నులలో **ఆడమ్‌స్మిత్** వ్యాకోచ నియమము స్పష్టంగా కనబడుతుంది. ప్రభుత్వం తన రాబడిని పెంచుకోదలచినప్పుడు పరోక్ష పన్ను రేటుని అధికం చేయడం వలన ఆదాయాన్ని సేకరించడం చాలా సులభం తత్‌ఫలితంగా ప్రభుత్వం ఆర్థిక స్థిరత్వాన్ని కూడా పెంచుకోగలదు.

**నష్టాలు (లేదా) దోషాలు** : పరోక్ష పన్నులలో ఈ క్రింది దోషాలు కలవు.

**అసమానత** : ధనిక పేద వర్గాలు అనే వ్యత్యాసం లేకుండా పరోక్ష పన్నులు విధించడం వల్ల పేదలు, నిరుపేదలుగాను ధనికులు మరింత ధనికులుగాను మారి వారి మధ్య వున్న వ్యత్యాసాన్ని ఈ పన్నులు మరీ కాస్త పెంచుతాయి.

**అనిశ్చితత్వము** : పరోక్ష పన్నుల ద్వారా ప్రభుత్వానికి ఎంత ఆదాయం వస్తుందని ఖచ్చితంగా చెప్పడానికి వీలులేదు. ప్రజలు వస్తువులు కోసం చేసే డిమాండ్‌ను బట్టి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం నిర్ణయించబడుతుంది. కాబట్టి డిమాండ్‌లో ఉన్నా అనిశ్చితత్వం ప్రభుత్వ రాబడిలో అనిశ్చితత్వానికి కారణం అవుతుంది.


**వ్యయపూరితం** : పరోక్ష పన్నుల విధింపుకు వసూళ్ళకు నియంత్రణ పర్యవేక్షణకు అధిక సిబ్బంది అవసరం. పరోక్ష పన్నుల వలన వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం ఈ వ్యయానికి సరిపోతుంది. కాబట్టి పరోక్ష పన్నులలో మితవ్యయ నియమం తక్కువగా కనిపిస్తుంది.

**ధరల పెరుగుదల** : పరోక్ష పన్నుల ఉత్తర్వుల మీద (లేదా) అమ్మకాల మీద స్థూలంగా వస్తువుల మీద తీస్తారు కాబట్టి పన్నులు రేటు పెరిగేకొద్ది వస్తువుల యొక్క ధరలు కూడా పెరుగుతూ పన్ను చెల్లింపుదారునికి భారాన్ని మోపుతాయి. అంతేకాకుండా ముడి పదార్థాల వ్యయము శ్రామికుల వేతనాలు ఎక్కువై వ్యయ ప్రతిద్రవ్యోల్బణానికి కారణమవుతాయి.

**సమాజానికి నష్టం** : పరోక్ష పన్ను విధింపు వలన వాణిజ్య వేత్తలు, ఉత్పత్తిదారులు లాభపడి సమాజంలోని అత్యధిక పేదవర్గాలు పన్ను భారాన్ని మోసి నష్టాన్ని భరిస్తారు. అంతే కాకుండా వస్తుసేవల వినియోగం తగ్గి ఉత్పత్తి, ఉద్యోగితలు చెడుప్రభావాన్ని చూపిస్తాయి. పైన వివరించిన విధంగా ప్రత్యక్ష, పరోక్ష పన్నులలో అనేక లాభనష్టాలు, లోపాలు ఉన్నాయని ఏ పన్నును తెగించడానికి వీలు లేదు. అన్ని పన్నులు సమతూకాన్ని పాటించడమే పన్నుల ఉత్తమ లక్ష్యం. అప్పుడే దేశం రాబడిలో సుస్థిరతను కలిగి ఆర్థికాభివృద్ధి పట్ల గట్టి ప్రయత్నం చేయగలుగుతుంది. డిమార్కో లాంటి ఆర్థిక వేత్తలు, ప్రత్యక్ష, పరోక్ష పన్నులలోను ఒక దానికొకటి పరస్పర పూరకాలుగా వర్ణించాడు. అదే విధంగా "గ్లాడ్ స్టోన్" కూడా ప్రత్యక్ష పన్నులను ఇద్దరు అందమైన సోదరీమణులతో పోల్చినాడు.

## 5.7. పరోక్ష పన్నులపై ప్రత్యక్ష పన్నుల ఆధిక్యత - హిక్స్ వివరణ :

పరోక్ష పన్నులకంటే ప్రత్యక్ష పన్నుల విషయంలో ప్రజలు తక్కువ త్యాగానికి గురి అవుతారు. కాబట్టి పరోక్ష పన్నులకంటే ప్రత్యక్ష పన్నులే మెరుగైనవి అని హిక్స్ వివరించాడు. ఉదాశీనత వక్రరేఖల సహాయంతో ప్రత్యక్ష, పరోక్ష పన్నుల తారతమ్యాన్ని హిక్స్ వివరించాడు.




రేఖాపటములో చెల్లింపు దారుని వద్దనున్న ఆదాయం OA దీనిలో OB పరిమాణంలో వస్తువులను కొనుగోలు చేస్తున్నాడు. వినియోగదారుడు $IC_3$ రేఖపై G బిందువు వద్ద సమతౌల్యంలో ఉన్నాడు. వస్తువులపై పన్ను విధించడం వల్ల వస్తువుల ధరలు పెరగడంవల్ల OJ పరిమాణంలో మాత్రమే వస్తువులను కొనుగోలు చేయగలడు.

అప్పుడు అతని కొత్త బడ్జెట్ రేఖ AJ అవుతుంది. ఇప్పుడు వినియోగదారుడు పన్ను విధించడానికి ముందు కంటే తక్కువ సంతృప్తిని పొందుతున్నాడు. అనగా ఉదాసీనతా వక్రరేఖ IG పై E బిందువు వద్ద సమతౌల్య స్థితికి చేరుతాడు. $IC_3$ కంటే $IC_1$ తక్కువ సంతృప్తిని ఇచ్చే ఉదాసీనతా వక్రరేఖ E నుండి F వరకు (EF) పరోక్ష పన్ను మొత్తాన్ని - సూచిస్తుంది. ఇప్పుడు అదే పన్ను మొత్తమును (EF)ను ఆదాయపు పన్ను లాంటి ప్రత్యక్ష పన్నుల ద్వారా వసూలు చేస్తే ఏం జరుగుతుందో పరిశీలిద్దాం. పన్ను చెల్లింపు దారుని ఆదాయం OA నుండి OC కి తగ్గిపోతుంది. అప్పుడు క్రొత్త బడ్జెట్ రేఖ CD ఏర్పడుతుంది. ఈ క్రొత్త బడ్జెట్ రేఖ ఉదాశీనతా వక్రరేఖ $IC_2$ కు H బిందువు వద్ద స్పర్శరేఖ గా ఉండటం వల్ల పన్ను చెల్లింపు దారుడు అక్కడ సమతౌల్యాన్ని చేరుతాడు. $IC_1$ కంటే $IC_2$ ఉదాశీనతా వక్రరేఖ అధిక సంతృప్తిని సూచిస్తుంది. E బిందువు కంటే H బిందువు తక్కువ త్యాగాన్ని సూచిస్తుంది.

పరోక్ష పన్నులపై ప్రత్యక్ష పన్నుల ఆధికత్యను పటం ద్వారా నిరూపించగలిగినప్పటికి దీనిని ఖచ్చితంగా ఆమోదించలేము. పరోక్ష పన్నుల కంటే ప్రత్యక్ష పన్నుల ఆధిక్యత విషయములో ఆర్థిక వేత్తల మధ్య ఏకాభిప్రాయము లేదు. పన్ను విధింపును ఉత్పత్తి పంపిణీలపై ప్రభావాల దృష్ట్యా విశ్లేషించాలి. ప్రభుత్వం విధించే ప్రత్యక్ష పన్నులు గానీ పరోక్ష పన్నులు గానీ, ఎంత భారాన్ని కల్గిస్తాయనే విషయాన్ని నిర్ణయించడానికి ప్రభుత్వం వ్యయభావనలను కూడా పరిగణలోనికి తీసుకోవాలి.

## 5.8 పురోగామి పన్నులు (Progressive Taxation) :


పన్ను ఆధారము (ఆదాయము) పెరిగే కొలది పన్నురేటు పెరిగినట్లయితే వాటిని పురోగామి పన్నులు అంటారు. వీటిని పట్టిక రూపములో వివిధ వ్యక్తుల ఆదాయ స్థాయిల ఆధారంగా పురోగామి పన్నును వివరించవచ్చు.

ప్రక్క పట్టికలో A,B,C వ్యక్తుల ఆదాయాలు, పన్నురేటు, పన్ను మొత్తం పన్ను తరువాత ఆదాయాలను పొందుపరచినారు. A వ్యక్తి ఆదాయము 20,000 ఉన్నప్పుడు పన్నురేటు 25% గా ఉన్నది. అప్పుడు పన్ను మొత్తము 5000 రూ॥. పన్ను తరువాత మిగిలిన ఆదాయము 15,000 రూ॥ B వ్యక్తి ఆదాయము 1,00,000 రూ॥

**పురోగామి పన్నులను తెలుపు పట్టిక**

| పన్ను ఆదాయం | పన్నురేటు | పన్నుమొత్తం | పన్నుతరువాత - ఆదాయం |
|---|---|---|---|
| A వ్యక్తి ఆదాయం (20,000) | 25 | 5,000 | 15,000 |
| B వ్యక్తి ఆదాయం (1.00.000) | 40 | 40,000 | 60,000 |
| C వ్యక్తి ఆదాయం (2,00,000) | 50 | 100,000 | 100,000 |

అప్పుడు పన్నురేటు 40 శాతంనకు పెరిగినది. అప్పుడు పన్ను మొత్తం 40,000 రూ॥ పన్ను తరువాత మిగిలిన ఆదాయము 60,000 రూ॥ B వ్యక్తి ఆదాయము A వ్యక్తి ఆదాయము కంటే 5 రెట్లు ఎక్కువగా ఉన్నది. కాని పన్నుతరువాత ఆదాయము 5 రెట్లు కన్నా తక్కువగా ఉన్నది. C వ్యక్తి ఆదాయము 2,00,000 రూ॥ ఇతని ఆదాయము B ఆదాయము కంటే 2 రెట్లు ఎక్కువగా ఉన్నది. కాని పన్ను రేటు 50% గా ఉన్నది. అప్పుడు పన్ను మొత్తము 1,00,000 రూ॥ పన్ను తరువాత మిగిలిన ఆదాయము 1,00,000 రూ॥ B వ్యక్తి ఆదాయము C వ్యక్తి ఆదాయానికి రెండు రెట్లు, కాని పన్ను తరువాత ఆదాయము రెండు రెట్లు కన్నా తక్కువగా ఉన్నది. దీనిని రేఖాపటం ద్వారా తెలియజేయవచ్చు.




పటము 5.2

పై రేఖా చిత్రములో x - అక్షం మీద పన్ను ఆధారం (ఆదాయం) ను, y అక్షం పైన పన్ను రేటును తీసుకున్నాము. పన్ను ఆధారం $Y_0$ నుండి $Y_1$ కు $Y_1$ నుండి $Y_2$ కు పెరిగేకొలది పన్నురేటు $T_0$ నుండి $T_1$ కు $T_2$ కు పెరుగుతుంది. అనగా పన్ను ఆధారం పెరిగితే పన్నురేటు ఇంచుమించు అదేస్థాయిలో పెరుగుతుంది. దీనిని PR రేఖ తెలియజేస్తుంది.

**పురోగామి పన్నుల మంచి లక్షణములు :** పురోగామి పన్నుల విధానము అన్ని పన్నుల విధానము కంటే ఉత్తమమైనదిగా చెప్పవచ్చును. కారణము ఇది సమతా నియమాలను పాటిస్తుంది. అనగా ధనికులు పేదవారి కంటే ఎక్కువ మొత్తాలలో పన్నును చెల్లిస్తారు. ఈ పన్నుల విధానము వ్యాకోచత్వ నియమాన్ని పాటిస్తుంది. అనగా ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యకలాపాలను చేపట్టడం

వల్ల ప్రభుత్వ వ్యయం పెరుగుతుంది. ఆ మేరకు ప్రభుత్వం ప్రజలపై పన్నులు విధించి వసూలు చేస్తుంది. ఆర్థిక దుర్భిక్ష పరిస్థితులలో ప్రజలు తమ అవసరాలకు పోను తక్కువ మొత్తంలో పన్నులు చెల్లిస్తారు. కాని సంపద సమయములో ప్రజలు ఆదాయంలో పెరుగుదల కన్నా అధిక మొత్తంలో పన్నులు చెల్లిస్తారు.

ఆదాయ సంపదలలోని అసమానతలను తగ్గిస్తుంది. అడాల్ఫ్ వాగ్నార్ వివిధ వర్గాల ప్రజల మధ్య ఆదాయ అసమానతలను తగ్గించడానికి ఈ పన్నులు తోడ్పడతాయని వివరించాడు. ఒక వేళ పురోగామి పన్నుల విధానమే లేకపోయినట్లయితే ధనిక పేద వ్యత్యాసం మరికాస్త పెరుగుతుంది. అని వాగ్నార్ అభిప్రాయం. ఆచార్య సెలిగ్‌మన్ ప్రకారం ఒక వ్యక్తి యొక్క పన్ను చెల్లింపు సామర్థ్యం అతని ఆదాయస్థాయి మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి ఈ విధంగా పన్నులను విధించడం మంచిదని వివరించాడు. అరుదైన ఉత్పత్తి వనరులు వృధాకాకుండా చూడడానికి పురోగామి పన్నులు తోడ్పడతాయి. అదే విధముగా పెట్టుబడి దారీ ఆర్థిక వ్యవస్థలో ముఖ్యముగా అభివృద్ధి చెందిన దేశాల ఆర్థికవృద్ధి తరుణంలో ధనికుడు మరింత ధనికుడుగాను పేదవాడు మరింత పేదవాడుగాను ఉంటాడు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజకీయ, సామాజిక కేంద్రీకరణ శక్తి కొద్దిమంది చేతులలో ఉంటుంది. దీనిని తగ్గించాలంటే పురోగామి పన్నులు తోడ్పడతాయి.

అనగా పురోగామి పన్నుల విధానం ద్వారా అధిక పన్నులు విధించి వారి ఆదాయాలను తగ్గించడానికి తత్ఫలితంగా రాజకీయ సామాజిక శక్తుల కేంద్రీకరణను తగ్గించడానికి తోడ్పడతాయి. ధిగుమతులు తమ ఆదాయంలో ఎక్కువ మొత్తాన్ని విలాస వస్తువులపై ఖర్చు పెడతారు. అందువల్ల వనరులను విలాస వస్తువులను తయారు చేయడానికి ఎక్కువగా ఉపయోగిస్తారు. తత్ఫలితంగా వనరులు నిత్యావసర వస్తువుల తయారీకి తక్కువగా ఉంటాయి. కాబట్టి పురోగామి పన్నులు విధానం ద్వారా అధిక మొత్తంలో ధనికులపై పన్నులు విధించడం వల్ల ధనికులు విలాస వస్తువుల వినియోగాన్ని తగ్గిస్తారు. ఉదా॥ కి కార్లు, ఎయిర్ కండిషన్లు మొదలగునవి. ఈ విధంగా చేయడం వల్ల వనరులను నిత్యావసర వస్తువుల తయారీకి ఉపయోగించుకోవచ్చు. ఉదా॥ కి ఆహారధాన్యములు, తక్కువ ఖర్చుతో కూడిన గృహ నిర్మాణము, దుస్తులు మొదలగునవి. వ్యాపార చక్రాలను నివారించి, సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించడానికి పురోగామి పన్నుల విధానం తోడ్పడుతుంది, అని టేలర్ వివరించాడు. ఆర్థిక వ్యవస్థ సౌభాగ్య దశలో ప్రజల వద్ద అధిక స్థాయిలో ఆదాయము ఉంటుంది. అందువల్ల వస్తువులకు డిమాండ్ పెరిగి ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడతాయి. ఈ ద్రవ్యోల్బణ పరిస్థితులను అరికట్టవలెనంటే ప్రభుత్వము అధిక ఆదాయము కల వారిపై అధిక రేటులో పన్నులను విధించడం వలన వారి కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది. అందువల్ల ద్రవ్యోల్బణాన్ని అరికట్టవచ్చు. ఆర్థిక మాంద్య పరిస్థితులలో పన్ను రేటు తగ్గించినట్లయితే సార్థక డిమాండ్ పెరిగి ఆర్థిక మాంద్య పరిస్థితులను తొలగించవచ్చు. ఆదాయం పంపిణీని పేదవారిని అనుకూలంగా మార్చడానికి కూడా పురోగామి పన్నులు తోడ్పడతాయి. అందువల్ల పేద ప్రజల వినియోగ ప్రవృత్తి, సమిష్టి డిమాండ్ పెరిగి సంపూర్ణ ఉద్యోగితను సాధించడానికి పురోగామి పన్నులు తోడ్పడతాయి.

అయితే పురోగామి పన్ను కొంతమేరకు ఆర్థిక వ్యవస్థ మీద ప్రతికూల ప్రభావాన్ని కూడా కలిగిస్తుంది. మూల ధన సంచయనానికి తోడ్పడక అతివ్యయాన్ని ప్రోత్సహిస్తూ పన్ను ఎగవేతతోటి దేశంలో నల్లధన పరిమాణం పెరగడానికి తోడ్పడతాయి. అదేవిధంగా పురోగామి పన్నులు ఏకస్వామ్యాలు ఏర్పడటానికి తోడ్పడతాయని హమ్‌కీ పేర్కొన్నాడు మరియు పారిశ్రామిక అంశమైన ఆదాయ ఉపాంత ప్రయోజనాన్ని సరిగా అంచనా వేయలేం కాబట్టి సక్రమమైన పన్నురేటు నిర్మాణాన్ని రూపొందించే అవకాశం లేదు. అంటే ఆదాయం పెరిగేకొద్ది ఎంత రేటులో పన్ను విధించాలో నిర్ణయించే శాస్త్రబద్ధమైన సూత్రం లేదు. అందువల్ల పన్నురేటు ఖచ్చితంగా ఇంత ఉంటుంది అని చెప్పలేం.


పురోగామి పన్నుల వలన కొన్ని లోపాలు ఉన్నప్పటికి ఆర్థికంగాను, సామాజికంగాను ఎక్కువ ప్రయోజనాలే ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా పురోగామి పన్నుల విధానమే సరి అయినది, అని అందరూ అంగీకరించారు. భారతదేశంలో అన్ని ప్రత్యక్ష పన్నులపై ముఖ్యంగా ఆదాయము, సంపదలపై విధించే పన్నులు అన్ని పురోగామి పన్ను విధానాన్ని అనుసరించి ఉంటాయి.

## 5.9 అనుపాతపు పన్ను (Proportional Taxation) :

పన్ను ఆధారముతో (ఆదాయము) సంబంధం లేకుండా పన్నురేటు స్థిరంగా ఉండే పన్నులను అనుపాతపు పన్ను అంటారు. దీనిని ఈ క్రింది ఉదాహరణ ద్వారా వివరించవచ్చు.

| వ్యక్తులు | పన్నుముందు ఆదాయం | స్థిరమైన పన్ను | పన్నుమొత్తం | పన్నుతరువాత ఆదాయం |
|---|---|---|---|---|
| A | 200 | 10% | 20 | 180 |
| B | 2000 | 10% | 200 | 1800 |
| C | 2,00,000 | 10% | 20,000 | 180,000 |

పై పట్టికను పరిశీలిస్తే A B C వ్యక్తుల ఆదాయాలు వేరు, వేరుగా ఉన్నాయి. A వ్యక్తి ఆదాయానికి 10 రెట్లుగా B వ్యక్తి ఆదాయం ఉన్నది. అయితే పన్ను రేటులో ఎలాంటి తేడా లేదు. స్థిరంగా 10% ఉన్నది. పన్ను తరువాత ఆదాయాలు కూడా A వ్యక్తి ఆదాయానికి 10 రెట్లుగా B వ్యక్తి ఆదాయము B వ్యక్తి ఆదాయానికి 100 రెట్లుగా C వ్యక్తి ఆదాయము ఉన్నది. దీనిని ఈ క్రింది రేఖాపటము ద్వారా వివరించవచ్చు.




పై రేఖా పటములో ఆదాయం 100 కోట్లు ఉన్నప్పుడు పన్నురేటు 5 శాతంగా ఉన్నది. ఆదాయం 100 కోట్లనుండి 300 కోట్లకు, 300 కోట్లనుండి 500 కోట్లకు పెరిగినప్పుడు కూడా పన్నురేటు 5 శాతంగానే ఉన్నది. అనగా పన్ను ఆధారంతో సంబంధం లేకుండా పన్నురేటు స్థిరంగా ఉన్నది. కావున పన్నురేటును తెలిపే రేఖ స్థిరంగా ఉంటూ - అక్షానికి సమాంతరముగా ఉన్నది.

## 5.9 అనుపాతపు పన్నుల - మంచి లక్షణములు :

అనుపాతపు పన్నుల పద్ధతి సులభంగా అర్ధమవుతుంది. అనగా ఆదాయంపై అనుపాతపు పద్ధతిలో పన్ను విధించడం జరిగింది అని చెప్పినట్లు అయితే ప్రతివ్యక్తి సులభంగా అర్థం చేసుకోగలడు. పన్నురేట్లు నిర్మాణంలో పురోగామి పన్నులకంటే అనుపాతపు పన్నులు చాలా సౌలభ్యంతో కూడుకున్నవి.

**అశాస్త్రీయము నిరంకుశము కాదు :** వివిధ ఆదాయ వర్గాల ప్రజలు మధ్య పక్షపాతానికి విచక్షణకు అవకాశం లేని విధంగా పన్నురేటు ఉంటుంది. అంతేగాక పన్నురేట్లు శాస్త్రీయంగా ఉంటాయేకాని, నిరంకుశంగా ఉండవు.

**ఆదాయ పంపిణీలో మార్పు రాదు :** అనుపాతపు పన్నుల విధానం పన్ను చెల్లింపు దారుల సాపేక్ష స్థితిగతులలో ఎలాంటి మార్పు తీసుకురాదు. పన్ను చెల్లించకముందు వ్యక్తుల ఆదాయాలు ఏ నిష్పత్తిలో ఉంటాయో, పన్ను చెల్లించిన తరువాత కూడా అదే నిష్పత్తిలో ఉంటాయి. అంటే పన్ను చెల్లించే వారిమధ్య ఉన్న సాపేక్ష పరిస్థితి పన్ను చెల్లించక ముందు, చెల్లించిన తరువాత ఒకే విధముగా ఉంటుంది.

**ఆర్థిక వ్యవస్థ సాపేక్ష స్థితిగతులలో మార్పు ఉండదు :** వివిధ ఉపయోగాల మధ్య వనరుల పంపిణీపై పన్ను విధింపు ప్రభావం ఏ మాత్రం ఉండదు. అంటే అనుపాతపు పన్నులు సాపేక్ష డిమాండ్ సప్లయ్ పరిస్థితులలో ఏ విధమైన మార్పు తీసుకురాదు. అందువల్ల ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిపై అనుపాతపు పన్నుల ప్రభావం ఉండదు. అయితే ఇది డిమాండ్ సప్లయ్ వ్యాకోచత్వాన్ని అనుసరించి ఉంటుంది.

**ప్రజా వ్యతిరేకత తక్కువ :** అనుపాతపు పన్నులకు ప్రజలనుండి వ్యతిరేకత చాలా తక్కువగా ఉంటుంది. కారణము ఆదాయము పెరిగినా పన్ను రేటు పెరగదు కాబట్టి

**పొదుపుపై ప్రభావము చూపదు :** ప్రజలలో కష్టపడి పనిచేయాలనే కోరికను పెట్టుబడి పెట్టాలనే కోరికను ప్రోత్సహించి దేశంలో ఉత్పత్తి ఉద్యోగిత ఆదాయాల పెరుగుదలకు తోడ్పడటం వల్ల అనుపాతపు పన్నులు ఉత్తమమైనవి అయితే పన్నురేటు ఎక్కువగా ఉండరాదు.

**మెక్‌లాక్ వాదము :** మెక్‌లాక్ అనుపాతపు పన్ను విధింపును భీమా ప్రీమియంతో పోల్చి సమర్థించాడు. భీమా సంస్థలు ప్రీమియంను అనుపాతపు రేటులో వసూలు చేసినట్లే ప్రజా సంక్షేమం కొరకు పాటుపడే ప్రభుత్వం తమకు అవరసమైన ఆదాయాన్ని ప్రజల ఆర్థిక పరిస్థితులను బట్టి అనుపాతపు రేటులో వసూలు చేయాలని మెక్‌లాక్ అభిప్రాయం

**సమర్థనీయం :** ఆదాయంను ఉపాంత ప్రయోజనమును అంచనా వేయడం సాధ్యంకాదు. కాబట్టి అనుపాతపు పన్ను విధానం సమర్థనీయమని కొందరు అభిప్రాయపడుచున్నారు. వివిధ వ్యక్తుల ఆదాయాల నుండి పొందిన ప్రయోజనాలను పోల్చడం కూడా సాధ్యం కాదు. అందువల్ల వేరు వేరు ఆదాయ స్థాయిల వద్ద వేరు, వేరు పన్ను రేట్లను నిర్ణయించవలసిన అవసరం లేకుండా అనుపాతపు పన్ను విధానాన్ని అనుసరించడం ఉత్తమం.

**ధనిక సేకరణే ముఖ్య ఉద్దేశ్యము కాదు :** ప్రభుత్వ అవసరానికి అయిన ధనాన్ని సేకరించడమే పన్ను విధింపు ముఖ్య ఉద్దేశ్యం గాని, పన్నుల విధానం ద్వారా ఆర్థిక వ్యత్యాసాలను తొలగించడానికి ప్రయత్నించరాదని వారించేవారు కూడా అనుపాతపు పన్ను విధానాన్ని సమర్థిస్తున్నారు.

**అనుపాతపు పన్నులు - లోపాలు :** ధనిక పేద తరగతి ప్రజలపై ఒకే రేటులో పన్ను విధించడం వల్ల అనుపాతపు పన్నులు పన్ను చెల్లింపు సామర్థ్యన్ని అతిక్రమిస్తాయి.

**వ్యాకోచత్వము లేదు :** అనుపాతపు పన్నులకు వ్యాకోచత్వము తక్కువ కాబట్టి, ప్రభుత్వ అవసరాలు పెరిగినప్పుడు ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశం ఉండదు.

**పేదవారిపై భారం ఎక్కువ :** ఆదాయస్థాయి మారినప్పటికి, పన్నురేటు మారదు కాబట్టి పన్ను భారం న్యాయబద్ధంగాను, సమానంగాను పంపిణీ కాదు. ధనికుల కంటే పేదవారిపై పన్నుల భారం అధికముగా ఉంటుంది. కాబట్టి అనుపాతపు పన్నులు సమర్థనీయము కాదు.


ఆర్థిక అసమానతలు రూపు మాపబడవు : అనుపాతపు పన్నులు ఆర్థిక అసమానతలను తగ్గించడానికి తొలగించడానికి తోడ్పడవు. అంతేకాక సంపూర్ణ ఉద్యోగిత, ఆర్థికాభివృద్ధి సాధన మొదలైన ఆధునిక ప్రభుత్వాలు ఆశయసాధనకు అనుపాతపు పన్నులు ఎంతమాత్రము అనుకూలముగా ఉండవు.

## 5.10 తిరోగామి పన్నులు (Regressive Taxation)

పన్ను ఆధారం పెరిగే కొలది, పన్నురేటు తగ్గుతున్నట్లయితే వాటిని తిరోగామి పన్నులు అంటారు. దీనిని ఈ క్రింది పట్టికద్వారా వివరించవచ్చు

| వ్యక్తులు | పన్నుముందు ఆదాయం | పన్నురేటు | పన్నుమొత్తం | పన్నుతరువాత ఆదాయం |
|---|---|---|---|---|
| A | 20,000 | 15% | 3,000 | 17,000 |
| B | 2,00,000 | 10% | 20,000 | 1,80,000 |
| C | 10,00,000 | 5% | 50,000 | 9,50,000 |

పై పట్టికను పరిశీలిస్తే A,B,C వ్యక్తుల ఆదాయాలు వేరువేరుగా ఉన్నాయి. A వ్యక్తి ఆదాయము 20,000 రూ॥గా ఉన్నప్పుడు పన్నురేటు 15 శాతంగా ఉన్నది. B ఆదాయము 2,00,000 రూ॥ ఉన్నప్పుడు పన్నురేటు 10 శాతంగా ఉన్నది. అనగా ఆదాయము పెరుగుతున్నప్పుడు పన్నురేటు తగ్గినది. అదేవిధముగా C ఆదాయము 10,00,000 గా ఉన్నప్పుడు పన్నురేటు 5 శాతంగా ఉన్నది B వ్యక్తి ఆదాయము A వ్యక్తి ఆదాయానికి 10 రెట్లుగా ఉన్నది. పన్ను తరువాత B ఆదాయము 10 రెట్లు కన్నా ఎక్కువగా ఉన్నది C వ్యక్తి ఆదాయము 10,00,000 రూ॥ ఇది B వ్యక్తి ఆదాయానికి 5 రెట్లుగా ఉన్నది. పన్ను తరువాత C ఆదాయము B కంటే 5 రెట్లు ఎక్కువగా ఉన్నది. పన్ను విధించక ముందు, విధించిన తరువాత వ్యక్తుల సాపేక్ష ఆదాయంలో మార్పు స్థిరంగా ఉండక మార్పు చెందుతుంది. దీనిని ప్రక్కన ఉన్నా రేఖా పటం ద్వారా వివరించవచ్చు.




పై రేఖాపటమును పరిశీలిస్తే తిరోగామి పన్నురేఖ ఎడమనుండి కుడికి క్రిందికి వాలుతుంది. అనగా ఆదాయము పెరిగేకొలది పన్నురేటు తగ్గుతుంది. అనగా పన్నురేటుకు పన్ను ఆధారంనకు విలోమ సంబంధము ఉన్నది.

## 5.11 ముగింపు :

పై వివరణను బట్టి ప్రభుత్వ రాబడి మార్గాలు అనేకం కలవని విశదమగుచున్నది. ఆధునిక ప్రభుత్వాలు పోలీస్ రాజ్యంనుంచి సంక్షేమ రాజ్యం వైపు మరలడంచే ఎంతో వ్యయం చేయవలసి వస్తుంది. కాబట్టి ప్రభుత్వ ఆదాయ వనరుల విభజనకు ఆవశ్యకత ఏర్పడింది. ప్రభుత్వ రాబడికి సంబంధించి అనేక మంది ఆర్థిక వేత్తలు అనేక రకాలుగా వర్గీకరించారు. డాల్టన్ వర్గీకరణ అందులో ప్రముఖమైనదిగా చెప్పవచ్చును. ప్రభుత్వ బాధ్యతలు నానాటికి పెరుగుతున్న తరుణంలో ప్రభుత్వ రాబడుల గూర్చి విశ్లేషణ, విభజన కూడా తప్పనిసరి.

## 5.12 ముఖ్య పదాలు

Tax - Revenue - పన్ను రాబడులు

Escheats - ఎచ్చీట్స్

Non -Tax Revenue - పన్నేతర రాబడులు

| | | |
|---|---|---|
| Estate - Duty | - | ఎస్టేట్ సుంఖము |
| Death - Duties | - | మరణ సుంఖాలు |
| Special - Assessments | - | ప్రత్యేక విధింపులు |
| Betterment levy | - | అభివృద్ధి - విధింపులు |
| Forfeitures | - | జప్తులు |
| Adveloram Tax | - | మూల్యానుగతమైన పన్ను |
| Progressive Tax | - | పురోగామి పన్ను |
| Proportional Tax | - | అనుపాతపు పన్ను |
| Regressive Tax | - | తిరోగామి పన్ను |

## 5.13 స్వీయ అవగాహనకు ప్రశ్నలు :

ఈ క్రింది ప్రశ్నలకు సమగ్ర సమాధానాలు వివరించండి

1. ప్రభుత్వ ఆదాయ మార్గాలను వివరించండి ?
2. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల గుణదోషాలను వివరించండి ?

ఈ క్రింది వాటికి సంక్షిప్త సమాధానములు వ్రాయండి ?

1. పన్ను కాని ఆదాయాలు
2. ప్రత్యక్ష పన్నులు
3. తిరోగామి పన్నులు
4. ఫీజు
5. ప్రత్యేక విధింపులు
6. ఎచ్చీట్స్

## 5.14 చదవవలసిన పుస్తకాలు

1. B.P. Thyagi - Public Finance
2. H.L. Bhatia - Public Finance
3. R.K. Choudhury - Public Finance & Fiscal Policy

ప్రొ. జి. చంద్రశేఖరరావు

## అధ్యాయం - 6

# పన్ను విధింపు నియమాలు సిద్ధాంతములు

విషయ క్రమం :


6.1 : పరిచయం

6.2 : పన్ను నియమాలు

6.3 : మంచి పన్నుల వ్యవస్థ లక్షణాలు

6.4 : పన్నుల ప్రభావాలు

6.5 : పన్ను విధింపు న్యాయం

6.6 : ముగింపు

6.7 : ముఖ్య పదాలు

6.8 : స్వీయ అవగాహనకు గల ప్రశ్నలు

6.9 : చదవవలసిన గ్రంధాలు


## 6.1 పరిచయం

ప్రభుత్వం ఆదాయం సమకూర్చుకోనే మార్గాలలో పన్నులు అతి ముఖ్యమైనవి. చెల్లింపు దారునికి ప్రత్యక్ష ప్రయోజనం లేకుండా నిర్బందంగా చెల్లించవలసినవి పన్నులు. అయితే పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వం వివిధ కార్యక్రమాలపై వ్యయం చేసినప్పుడు పన్నులు చెల్లించిన వారికి పరోక్షంగా ప్రయోజనం కలుగుతుంది. అయితే పన్నులు ప్రజలకు న్యాయం చేకూర్చి ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి, పంపిణీలపై ప్రతికూల ప్రభావాలు లేకుండా చూడటానికై పన్నుల విధానానికి కొన్ని మంచి లక్షలు ఉండాలి. ప్రభుత్వ వ్యవస్థ స్వభావాన్ని బట్టి, ఆర్థిక కార్యకలాపాలలో ప్రభుత్వ పాత్రను బట్టి పన్నుల వ్యవస్థ లక్షణాలు మారుతూ ఉంటాయి. ఉదాహరణకు 19వ శతాబ్దం వరకు ఉన్న ప్రభుత్వాలను పోలీసు రాజ్యాలుగా చెప్పవచ్చు. అందువల్ల ప్రభుత్వ కార్యకలాపాలు పరిమితంగా ఉండేవి కాని నేడు ఆధునిక ప్రభుత్వాలు శ్రేయోరాజ్యాలు, అందువల్ల ప్రభుత్వాలు అనేక కార్యకలాపాలను చేపట్టవలసిన అవసరం ఉన్నది. కావున ప్రభుత్వ వ్యయం పెరిగినది. అందువల్ల ప్రభుత్వ కార్యకలపాలు విస్తృతమై ప్రభుత్వాలకు నిదుల అవసరం పెరిగింది. ప్రభుత్వ ఆదాయ మార్గాలలో పన్నులు ముఖ్యమైనవి కాబట్టి ప్రభుత్వం విత్త శాస్త్రంలో పన్ను విధింపుకు ప్రాముఖ్యం పెరిగింది. అందువల్ల పన్నుల ప్రాధాన్యతను గుర్తించటంతో బాటుగా పన్నులు విధించే విధానం గురించి కూడా మనం తెలుసుకోవడం అవసరం. పన్నులు ప్రభుత్వానికి కేవలం ఆదాయాన్ని సమకూర్చే సాధనంగానే గాక సుస్థిర ఆర్థికాభివృద్ధిని సాధించటం. ఆర్థిక వ్యత్యాసాల నిర్మూలనం మొదలయిన ఆశయాల సాధనకు కూడా తోడ్పడతాయి. అందువల్ల పన్నులు విధించేటప్పుడు కొన్ని నియమాలు, సూత్రాలను పాటించడం అవసరం. అప్పుడే మంచి పన్నుల విధానం రూపొందుతుంది. ఆర్థిక శాస్త్ర పితామహుడైన ఆడమ్‌స్మిత్ 1776 లోనే పన్నులు విధించడంలో పాటించవలసిన నాలుగు ముఖ్య నియమాలను నిర్దేశించారు. ఆ నియమమే ఈనాటికి అందరి ఆమోదం పొంది ఆచరణ యోగ్యంగా ఉన్నాయి. ఆడమ్ స్మిత్ వివరించిన నియమాలను ముందుగా తెలుసుకుందాం.

## 6.2 పన్ను నియమాలు

**6.2.1 సమతా నియమము (Canon of Equity or Equality) :** ఆడమ్ స్మిత్ వివరించిన నాలుగు పన్ను నియమాలలో ఇది ముఖ్యమైనది. ప్రభుత్వ పాలన క్రింద ఉన్న ప్రజలు వారి సామార్ధ్యాన్ని బట్టి ప్రభుత్వానికి పన్నును సమకూర్చాలి. అంటే ప్రభుత్వ రక్షణ క్రింద వారు సంపాదించిన ఆదాయాల అనుపాతంలో ప్రభుత్వానికి విత్తాన్ని చెల్లించాలని ఆడమ్ స్మిత్ అభిప్రాయం. పన్నులు విధించేటప్పుడు ఆచరించవలసిన న్యాయ ధర్మాలకు ప్రతిరూపంగా ఈ సమాత నియమం లేదా సమాన పరిగణన నియమం పరిగణించడం జరుగుతుంది.

వ్యక్తుల నుండి వారి వారి ఆదాయాలను బట్టి పన్నులు విధించాలని సమతా నియమం వివరిస్తుంది. అయితే పేదవారు, ధనవంతులు సమాన మొత్తంలో పన్నులు చెల్లించవలెను అనడం ఈ నియమమే ఉద్దేశ్యము కాదు. అయితే ఈ నియమం పురోగామి పన్నుల విధానాన్ని సమర్ధిస్తున్నదా? లేక అనుపాతపు పన్నుల విధానాన్ని సమర్ధిస్తున్నాదా అనే విషయంపై ఆర్థిక వేత్తలలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. చాలా మంది ఆర్థిక వేత్తలు 19వ శతాబ్దం వరకు అనుపాతపు పన్నుల విధానాన్నే సమర్థించేవారు. 1870 సం॥ ప్రాంతాల్లో జీవాన్స్, మెజర్, వాల్రజ్ మొదలయిన ఆర్థిక వేత్తలు క్షీణోపాంత ప్రయోజన సిద్ధాంతాన్ని అభివృద్ధి పరచిన తరువాత పురోగామి పన్నుల విధానాన్నే సమర్థించాడేమోనని కొందరు భావించారు. కాని ఆడమ్‌స్మిత్ దేశ సంపద (Wealth of Nation) అనే గ్రంథంలో ఒకానొక సందర్భంలో ధనవంతులు ప్రభుత్వానికి ఇచ్చే సొమ్ము వారి సంపదల అనుపాతంలో కాక కొంత ఎక్కువగా చెల్లించినప్పటికి అన్యాయం కాదు అని వివరించాడు. ఈ కారణంగా ఆడమ్‌స్మిత్ పురోగామి పన్నుల విధానాన్ని సమర్ధించాడని చెప్పవచ్చు. ప్రభుత్వ రక్షణలో ప్రజలు సంపాదించిన ఆదాయాలకు అనుగుణంగా పన్ను చెల్లించాలనడం పన్నుల లాభ సిద్ధాంతాన్ని (Benefit theory of taxation), తమ తమ ఆదాయ సంపదల కనుగుణంగా పన్ను చెల్లించాలనటం పన్నుల సామార్ధ్య సిద్ధాంతాన్ని (Ability theory of taxation) ఆడమ్‌స్మిత్ సమర్ధించినట్లుగా భావించవచ్చు. అనగా స్మిత్ అభిప్రాయం ప్రకారం పన్ను విధింపునకు ప్రభుత్వ రక్షణ ద్వారా కలిగే ప్రయోజనం, వ్యక్తులు పన్ను చెల్లించే సామార్ధ్యం మూలాధారం.

**6.2.2 నిశ్చయతా నియమము (Canon of Certainty) :** ప్రతి వ్యక్తి చెల్లించి తీరవలసిన పన్ను నిశ్చితంగా ఉండవలెను కాని నిరంకుశమైనది గాను స్వచ్ఛందమైనదిగాను ఉండరాదు. చెల్లించవలసిన సమయం చెల్లించే రీతి, చెల్లించవలసిన పన్ను మొత్తం పన్ను చెల్లించే వారికి మిగిలిన ప్రతి ఒకరికి స్పష్టంగా ఉండవలె. అట్లాకాక ఇంకోక రీతిగా ఉన్నట్లు అయితే పన్ను చెల్లింపు దారులు పన్నులు వసూలు చేసేవాడి అధీనంలోకి రావటానికి ఆస్కారమున్నది. అప్పుడు పన్ను చెల్లింపు దారులనుంచి, పన్నులు వసూలు చేసే వారి పన్ను హెచ్చించి కాని లేదా ఎక్కువ చేస్తామని భయపెట్టికాని కొన్ని కానుకలను పొందవచ్చు. పన్నుల విధింపు అనిశ్చితంగా ఉంటే పన్ను వసూలు చేసే వారితో అహంకారం, లంచగొండితనం ఏర్పడవచ్చు. ఆడమ్‌స్మిత్ ఉద్దేశంలో నిశ్చత నియమము అన్నింటికన్న ముఖ్యమయినది. పన్నుల విధింపులో చెప్పుకోదగ్గ అసమానత్వం కన్న కొంచెం కూడ అనిశ్చతంగా ఉండటం ఎంతో చెడ్డది. ఇదే విధంగా పన్నుల విధింపుతో నిశ్చయుత్వం సమానత కోసం ప్రయత్నించడం భ్రమ అని శ్రీ హడ్లే (Hadley) కూడ భావించాడు. అంటే పన్నులకు సంబంధించిన విషయాన్ని కూడ పన్నులు వసూలు చేసేవారి ఇష్టాలకు, నిర్ణయాలకు వదలకూడదని మాట చెల్లింపుదారుకు తను చెల్లించవలసిన మొత్తం ఎందుకు చెల్లించవలెనో స్పష్టంగా తెలిసి వుండవలె.

అందువల్లనే కొందరు బహుకాలగతమైన పన్ను పన్నే కాదని (An old tax is no tax) భావిస్తారు. చాలా కాలంగా విధిస్తున్న పన్నులు అందరికీ బాగా తెలిసి ఉంటాయి. అవి ఎప్పుడు చెల్లించవలెనో ఎందుకు చెల్లించవలెనో తెలుసు కాబట్టి వాటి చెల్లింపు అవసరమైన సర్దుబాట్లు ముందుగానే చేసుకొంటారు. ఇటువంటి పన్నుల చెల్లింపుకు అలవాటు పడి ఉంటారు కనుక అది భారంగా తోచరాదు.

నిశ్చయత నియమము పన్ను చెల్లించే వారికే కాక ప్రభుత్వానికి కూడ ముఖ్యము. ఏ యే పన్నుల వల్ల ఏ యే కాలంలో ఎంత డబ్బు వస్తుందో తెలిస్తే తప్ప, ప్రభుత్వాలు బడ్జెట్ అంచనాలను సాధ్యమైనంత ఖచ్చితంగా చేసుకోవడానికి వీలుండదు.

**6.2.3 సౌకర్య నియమము :** " ప్రతి పన్ను చెల్లింపుదారునకు సౌకర్యమైన సమయంలోను, పద్దతిలోను వసూలు చేయబడాలి"

నిశ్చయతా నియమం వలె ఇదికూడ నిర్వహణ సౌలభ్యం కొరకు ఉద్దేశించబడినదే. ఇది పన్ను చెల్లింపు సమయానికి, పద్దతికి ప్రాధాన్యతను ఇస్తోంది. చెల్లింపుదారునకు సౌకర్యమైన సమయంలోను, పద్దతిలోను పన్నులు వసూలు చేయబడాలి. ఉదా:- కు భూమి

పన్నును రైతుకు ఆదాయం వచ్చే పంట కాలంలో వసూలు చేస్తే అతనికి మిక్కిలి సౌకర్యంగా ఉంటుంది. అలాగే ఉద్యోగస్తులపై విధించిన ఆదాయపు పన్నును వారి జీతం నుంచి మినహాయింపు సులువైన, మేలైన పద్ధతి, పరోక్ష పన్నులు వస్తువుల అమ్మకం సమయంలో ధరతోపాటు వసూలు చేయబడతాయి. ఉదా:- కు వినియోగదారుడు ఒక రేడియోను కొన్నప్పుడు ధరతోపాటు పన్ను కూడా చెల్లిస్తాడు. పన్ను ధరలో కలసి పోవడం వల్ల పన్ను చెల్లిస్తున్నానే భావం లేకుండా వినియోగదారుడు ఆ పన్నును చెల్లిస్తున్నాడు. సౌకర్యనియమాన్ని పాటిస్తే చెల్లింపుదారుల నుండి ప్రతిఘటన రాదు. ప్రభుత్వానికి కూడ పన్ను వసూలు చేయడం సులభం.

**6.2.4 మిత వ్యయం :** ఆడమ్‌స్మిత్ ప్రకారం పన్ను ఆదాయం నిర్వహణ వ్యయం కంటే అధికంలో ఉండాలి. మిత వ్యయ సూత్రం ప్రకారం ప్రతి 'పన్నులోను ప్రభుత్వ ఖజానాకు వచ్చే రాబడి చెల్లింపుదారుల నుండి వసూలు చేయబడి మొత్తానికి గల తేడా ఎక్కువగా ఉండాలి'. పన్ను వసూలు నిర్వహణా యంత్రాంగము క్లిష్టంగాను భలేగాను ఉండరాదని ఈ నియమం చెబుతుంది. నిజానికి స్మిత్ కాలంలో కంటే ఆధునిక కాలంలోనే ఈ నియమానికి అధిక ప్రాధాన్యత గలదు. ఎందుకంటే కొన్ని పన్నుల విషయంలో నిర్వహణా వ్యయం విపరీతంగా పెరుగుతున్నాయి. వేరొక అర్థంలో కూడ ఈ నియమం అన్వయించబడింది. ఆర్థిక వ్యవస్థలో అధికోత్పత్తి స్థాయిలను సాధించడానికి ప్రజల ఉత్పాదకతను పెంచాలి. పన్నుల ఉత్పాదకతను తగ్గించేవిగగా ఉండరాదు. అందుకనే ప్రజల ఉత్పాదకతను తగ్గించే కొన్ని హానికరమైన మందుల వినియోగంపై అధిక పన్నులను విధించబడుతున్నాయి. ప్రభుత్వ ఆదాయాన్నిర పెంచడం గాక మందుల వినియోగాన్ని నిరోధించడమే ఈ పన్నుల లక్ష్యయం. ఇట్టి పన్నుల విషయంలో ఆదాయం కంటే నిర్వహణ వ్యయాలు అధికంగా ఉండే అవకాశం వుంది. కాబట్టి మిత వ్యయ నియమం పన్నుల ఆదాయ, నిర్వహణ వ్యయాలను మాత్రమేగాక ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావాలను కూడా లెక్కలోకి తీసుకుంటుంది. ఉత్పాదకత పెరుగుతున్నంత కాలం ఆదాయ, నిర్వాహణ వ్యయాలతో నిమిత్తం లేకుండానే పన్నులను సమర్ధించవచ్చు.

ఆడమ్‌స్మిత్ వివరించిన పై నాలుగు నియమాలల్లో మొదటి నియమం పన్ను విధింపుకు సంబంధించినది. కాగా మిగిలిన మూడు నియమాలు పరిపాలనా విధానానికి సంబంధించినవి. ఈ నియమాలకనుగుణంగా రూపొందించిన పన్నుల విధానం శ్రేష్ఠమైనది ఖచ్చితంగా చెప్పవచ్చు. అయితే ఆడమ్‌స్మిత్ తరువాత ప్రభుత్వ విత్త శాస్త్రం ఎంతో అభివృద్ధి చెందింది. పన్ను విధింపుకు ఆడమ్‌స్మిత్ నియమాలే సరిపోవు. అందువల్ల ఆధునిక ఆర్థిక వేత్తలు వివరించిన మరికొన్ని నియమాలను గూడ పరిశీలించడం అవసరం. అవి...

**6.2.5 ఉత్పదకతా నియమము (Canon of Productivity) :** ప్రభుత్వం తన విధులను సక్రమంగా నిర్వర్తించడానికి తగినన్ని ద్రవ్యవనరులు అవసరం. కాబట్టి పన్నులు ప్రభుత్వానికి సరిపడేంత ఆదాయాన్ని సమకూర్చేవిగా ఉండాలి. అందువల్ల పన్నులు ఉత్పాదకంగా ఉండాలని బాస్టబుల్ (Bastabol) వివరించాడు. పన్నులు వ్యవస్థ ముఖ్యలక్షణం ప్రభుత్వ నిర్వహణకు అవసరమైన ద్రవ్య వనరులను సమకూర్చడం గనుక ఆర్థికమంత్రి ఒక పన్ను సుగుణాలను అది తెచ్చే ఆదాయాన్ని బట్టి అంచనా వేయవచ్చు అని గ్లాడ్‌స్టోన్ (Gladstone) పేర్కొన్నాడు. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రభుత్వాల విత్త అవసరాలు రోజు, రోజుకి పెరుగుతున్నాయి. కాబట్టి ఈ దేశాల పన్నుల విధానంలో ఈ సూత్రం ముఖ్యమైనది. తక్కువ పరిమాణంలో ఆదాయాన్ని సమకూర్చే పనులను ఎక్కువ సంఖ్యలో విధించే కంటే ఎక్కువ ఆదాయాన్ని రాబట్టి పన్నులను తక్కువ మొత్తంలో విధించడం మంచిది అయితే రాబడి, ఉత్పాదకత కోసం మరి హెచ్చు రేటులో పన్నులు విధించినట్లు అయితే ప్రజలకు పొదుపు, పెట్టుబడి పెట్టాలనే కోరిక, శక్తి తగ్గిపోతుంది. ఫలితంగా మూలధన పెరుగుదల రేటు తగ్గిపోయి దేశ ఆర్థిక ప్రగతి కుంటుపడే ప్రమాదము ఉన్నది.

**6.2.6 సౌలభ్య నియమము (Canon of Simplisity) :** సామాన్య మానవులకు కూడ అర్థమయ్యే విధంగా పన్నుల పద్ధతి సులభంగా ఉండాలి. పన్నుల విధానాన్ని అర్థం చేసుకోవడానికి చెల్లింపుదారులకు ఏ కష్టం ఉండరాదు. లేకపోతే పన్ను చెల్లింపుదారులు అనేక వ్యయ ప్రయాసలకు, ఇబ్బందులకు గురి అవుతారు. ఈ నియమం పన్ను చెల్లింపుదారులకు, పన్నుల పరిపాలనాయంత్రాంగానికి కూడ ముఖ్యమైందే. అందువల్ల పన్ను చట్టాలు సాధారణ ప్రజలకు కూడ సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలి. అయితే ఈ సౌలభ్య నియమం ఇతర పన్ను నియమాలతో ఎంత వరకు సమన్వయించగలదో అంతవరకే దీన్ని అమలు చేయాలి. ఉదా:- కు ఆదాయ పన్నును

సమతా నియమానికి అనుగుణంగా ఉండటానికి వివిధ రకమైన పన్నుల రేట్లు మినహాయింపులు, రాయితీలను ఇస్తున్నారు. అయితే రేట్లు భిన్నమైన కొలది సౌలభ్యం తగ్గిపోతుంది.

**6.2.7 వ్యాకోచ నియమము (Canon of Elasticity) :** ఆధునిక ప్రభుత్వాలు శ్రేయోరాజ్య స్థాపనకు అనేక సంక్షేమ కార్యకలాపాలను చేపట్టవలసి ఉంటుంది. దీనితో ప్రభుత్వ వ్యయం విపరీతంగా పెరిగిపోతుంది. ప్రభుత్వ వ్యయం పెరిగే కొలది ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతూ ఉండాలి. అదే విధంగా జాతీయాదాయం పెరిగే కొలది పన్నుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే రాబడి కూడ పెరగాలి. దానికై పన్నుల్లో వ్యాకోచత్వం ఉండాలి. ఆదాయపు పన్ను, అమ్మకం పన్నులకు వ్యాకోచత్వం అధికం. ఆదాయం పన్ను రేటును స్వల్పంగా పెంచినాగాని, సర్ చార్జీలను విధించినాగాని ఆదాయం పన్ను ద్వారా లభించే రాబడిని ప్రభుత్వం పెంచుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకం పన్నును స్వల్పంగా పెంచినప్పటికి వాటికి ఎంతో ఆదాయం సమకూరుతుంది. మన దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులకు వ్యాకోచత్వం తక్కువగాను, కేంద్ర ప్రభుత్వం విధించే పన్నులకు వ్యాకోచత్వం ఎక్కువగాను ఉన్నట్లు తెలుస్తుంది. ఉత్పదకతా నియమానికి సన్నిహితమైనది ఈ వ్యాకోచత్వ నియమము.

**6.2.8 భిన్నత నియమము (Canon of Diversity) :** ప్రజలందరు ఏదో ఒక పన్ను చెల్లించే విధంగా పన్నుల్లో వైవిధ్యం ఉండాలని ఈ నియమము సూచిస్తున్నది. సామర్థ్యం ఉన్న వారంతా పన్ను చెల్లించేటట్లుగా అనేక రకాల పన్నులు విధించాలి. ప్రభుత్వానికి అవసరమైనంత రాబడిని సమకూర్చడానికి ప్రత్యక్ష, పరోక్ష పన్నులు, పురోగామి, అనుపాతపు పన్నులు, ఆదాయం, సంపద, వినియోగంపై విధించే పన్నులు, మూల్యానుగతమైన పన్నులు మొదలగునవి ఉండాలి. అట్లాగని చాలా రకమైన పన్నులు విధించడం మంచిది కాదు.

**6.2.9 ఆచరణ సాధ్య నియమము (Canon of Enfortibility) :** ఆచరణ సాధ్యమైన, అమలు చేయడానికి వీలైన పన్నులనే విధించాలని ఈ నియమం సారాంశం. ఆచరణ యోగ్యం, సాధ్యంగాని పన్నులను విధిస్తే పన్నుల ఎగవేతకు అవకాశం ఎక్కువగా ఉంటుంది. నిరక్షరాస్యతా ఎక్కువగా ఉన్న దేశాల్లో ఆదాయ, వ్యయ లెక్కలు సక్రమంగా ఉండవు. అందువల్ల అన్ని రకాల పన్నులు విధించి వసూలు చేయడం కష్టమైన పని.

**6.2.10 ఆమోద యోగ్యతా నియమము (Canon of Acceptoubility) :** ప్రభుత్వం విధించిన పన్నులు న్యాయబద్ధమైనవిగాను, ఆమోద యోగ్యమైనవిగాను ఉన్నవని ప్రజలు భావించినప్పుడే వాటి వసూలు సులభంగా ఉంటుంది. పన్నుల ద్వారా వసూలైన ద్రవ్యం ప్రజల అవసరాలకే ఖర్చు చేయడం జరుగుతుందనీ, ప్రజలు తమ సామర్థ్యానికి అనుగుణంగా పన్నులు చెల్లించాలనీ, పన్నులు విశ్వసనీయంగా ఉండాలని, సామాన్యుల మధ్య విచక్షణ చూపరాదని శ్రీమతి హిక్స్ వివరించడం జరిగింది.

అయితే పైన వివరించిన నియమాలకు అనుగుణంగా, ఏ దేశాలలోను, ఏ పన్ను కూడా ఉండడం లేదు. కొన్ని నియమాలు పాటించడం సాధ్యం కాదు. ఈ నియమాల్లో కొన్నింటి మధ్య పరస్పర సంఘర్షణ ఏర్పడే అవకాశమున్నది. కొన్ని సందర్భాలలో మిత, ఉత్పాదకత నియమం మధ్య సంఘర్షణ ఏర్పడుతుంది. రెండు నియమాల మధ్య ఘర్షణ ఏర్పడినప్పుడు ఎక్కువ లక్ష్యాలను సాధించటానికి తోడ్పడే నియమాన్ని ప్రభుత్వం అనుసరించటం మంచిది. అని షిరాష్ సలహా ఇచ్చినాడు.

## 6.3 మంచి పన్నుల వ్యవస్థ లక్షణాలు:-

పైన వివరించిన పన్ను నియమాల్లో ఎక్కువ నియమాలను తృప్తి పరిచే వ్యవస్థను పన్నుల వ్యవస్థ (మంచి) అని అనవచ్చు. పన్నుల నియమాల్లో కొన్ని పరస్పరం ఘర్షణ పడతాయి. కనుక ఏ ఒక్క పన్నుల వ్యవస్థ అన్నీ నియామాలను తృప్తి పరచలేక పోవచ్చు. అందువల్ల మంచి పన్నుల వ్యవస్థ వీలైనన్ని ఎక్కువ నియమాలను, తృప్తి పరిచేదిగా ఉంటే సరిపోతుంది. అంతేగాక ఒక విధమైన పన్ను నియమాలు అన్ని దేశాలకు, అని కాలాలలో వర్తించవు. ఒక దేశ ఆర్థికాభివృద్ధికి అనువైన విధంగా పన్ను నియమాలను రూపొందించుకోవాలి. దీని కోసం

పన్ను విధింపులో ఇమిడియున్న అనేక సమస్యలను వివరంగా పరిశీలించాలి. పన్నుల వ్యవస్థలోని సమస్యలలో కొన్నింటిని నిర్వహణా దృష్టితోను, మరికొన్నింటిని పన్నుల రకాలు, రూపాలు, రేట్లు చెల్లింపు సమయం మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకొని పరిశీలన చేయాలి. మంచి పన్నుల వ్యవస్థ ఉత్తమ ఆర్థిక ప్రభావాలు గరిష్టంగాను, హానికర ఆర్థిక ప్రభావాలు అతి తక్కువ కలిగించేదిగా ఉండాలని డాల్టన్ పేర్కొన్నాడు.

ఒక దేశ పన్నుల వ్యవస్థను విశ్లేషణ చేసేటప్పుడు ఈ క్రింద వివరించిన అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి.

1. పన్నుల వల్ల ఆర్థిక వ్యవస్థపై కలిగే ప్రభావాలను బట్టి పన్నుల వ్యవస్థ గుణదోషాలు నిర్ణయించాలి. ప్రభుత్వ వ్యయం తదితర అంశాలను విస్మరించి పన్నుల వ్యవస్థను మాత్రమే విడిగా పరిశీలించడం మంచిది కాదు. ప్రభుత్వ వ్యయం వల్ల కలిగే ప్రయోజనాలను పరిశీలించడం ద్వారా మాత్రమే ఒక పన్నుల వ్యవస్థ గుణదోషాలను వివరించగలం. అయితే పన్నుల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం ప్రభుత్వ ఋణాలు, బడ్జెట్ లోటు, ఇతర ఆదాయాలు మొదలయిన వాటితో కలిసిపోవడం వల్ల ప్రభుత్వ వ్యయ ప్రయోజనాలను పన్నుల లాభాలతో పోల్చకూడదు. అయితే మిగిలిన విషయాల్లో మార్పు లేదని భావించి పన్నుల రూపాలు రేట్లు, చెల్లింపు సమయం. మొదలైన అంశాలను పరిశీలించవచ్చు. అందువల్ల సాధారణంగా మంచి పన్నుల వ్యవస్థను గూర్చి తెలియజేసేటప్పుడు పన్నుల విధింపును ప్రత్యేకంగా పరిశీలించాలి.

2. అనేక కోణాలనుంచి మంచి పన్నుల వ్యవస్థ విశ్లేషణ జరగాలి. ఒకే మొత్తంలో ఆదాయం లభించే రెండు పన్నులలో తక్కువ హానికరమైన దానికే ప్రాముఖ్యం ఇవ్వాలి. సాంఘిక, ఆర్థిక ప్రభావాల దృష్ట్యా ప్రతి పన్నుల వ్యవస్థలోను మంచి చెడులు, పరస్పర విరుద్ధమైన లక్ష్యాలున్నాయి. కాబట్టి ఏదో ఒక దానిని ఎంచుకొనడం కష్టమైన పని. కాబట్టి ఒక పన్ను వ్యవస్థ గుణదోషాలను, ఇంకొక వ్యవస్థ మంచి, చెడులతో పోల్చి చూచి దేశ ఆర్థికాభివృద్ధి లక్ష్యాల దృష్ట్యా మేలైన దాన్ని ఎంచుకోవాలి. ఈ ఎంపికలో ఏ లక్ష్య సాధనకు ఏ లక్ష్యాన్ని త్యాగం చేయగలమో శ్రద్ధతో నిర్ణయించుకోవాలి.

3. సిద్ధాంత రీత్యా మేలైన పన్నుల వ్యవస్థ ఆచరణలో మంచిది కాకపోవచ్చు. అందువల్ల పన్నులు విధించడంలో ఆచరణలో ఎదురయ్యే సమస్యలను గురించి కూడా ప్రభుత్వం జాగ్రత్త వహించాలి.

4. మంచి పన్నుల వ్యవస్థ గుణగణాలను పరిశీలించేటప్పుడు పన్ను చెల్లింపుదారుని వైఖరికి ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలని కొందరి అభిప్రాయం. ప్రతి పన్ను చెల్లింపుదారుడు పన్నుల భారం తనపై అతి తక్కువ ఉండాలని కోరుకుంటూనే ఇతరులపై ఎంత ఎక్కువగా పన్ను భారం ఉన్నప్పటికి పట్టించుకోడు. అయితే పన్నుల భారం ప్రజలందరిపై సమానంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలి. అన్యాయంగా తనపై ఆర్థిక భారం పడిందని ఎవరూ భరించరాదు. అయితే చెల్లింపుదారుని వైఖరిని ఆర్థికేతర అంశాలు, దేశ రాజకీయ పరిస్థితులు కూడ ప్రభావితం చేస్తాయి. అందువల్ల ఆ పరిస్థితులకు కూడా సరిపోయేటట్లు పన్నుల చట్టాలను రూపొందించాలి.

5. పన్నుల వ్యవస్థలో మార్పులను ఒకేసారి ప్రవేశపెట్టలేం. పాత పన్నును పూర్తిగా రద్దు చేయడం గాని, సవరించడం గాని చేయవచ్చు లేదా కొత్త పన్ను ప్రవేశ పెట్టవచ్చు. అయితే మొత్తం పన్ను వ్యవస్థనంతటిని మార్చుటకు చాలా కాలం పడుతుంది.

పై అంశాలను క్షుణ్ణంగా పరిశీలించడం ద్వారా మాత్రమే ఒక పన్నుల వ్యవస్థను విశ్లేషణ చేయగలం. మంచి పన్నుల వ్యవస్థ ప్రధాన జాతీయ లక్ష్యాలతో సమన్వయం కలిగి వుండాలి. మంచి పన్నుల విధానం పురోగామి సూత్రానికి అను గుణంగా ఉండాలని అనేక మంది ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. జాతీయాదాయ పెరుగుదలకు తగినట్లుగా పన్ను రేటు కూడా పెరగాలి. అప్పుడు పన్నుల భారం ధనవంతులపై అధికంగాను, పేదవారిపై తక్కువగాను ఉంటుంది. నవ్య ఆర్థిక వేత్తలు పరోక్ష పన్నుల కంటే ప్రత్యక్ష పన్నులకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారు. అయితే పన్నుల నియమాలు, ఆశయాలు దృష్ట్యా గూడ ప్రత్యక్ష, పరోక్ష పన్నులను అభిలషణీయమైన పద్ధతిలో సమ్మేళనం చేయాలి. అంతేగాక ఏక పన్ను పద్ధతికి బదులుగా బహుళ పన్నుల పద్ధతిని చాలా మంది ఆర్థికవేత్తలు ప్రతిపాదిస్తున్నారు. ఆధునిక

కాలంలో వివిధ దేశాల్లో ప్రభుత్వ కార్య క్రమాలు విస్తృతమై ప్రభుత్వ వ్యయం పెరిగిపోతున్నది. ఈ పరిస్థితులలో ప్రభుత్వాలు బహుళ పన్నుల పద్ధతి ద్వారా ప్రభుత్వ వ్యయానికి తగిన ఆదాయాన్ని సమకూర్చుకోవాలి. బహుళ పన్నుల పద్ధతి ద్వారా పన్నుల భారాన్ని వివిధ వర్గాల ప్రజల మధ్య న్యాయబద్ధంగా పంపిణీ చేసే అవకాశం కూడ ఉన్నది. అయితే పన్నుల సంఖ్య అధికంగా ఉండాలని దీని అర్థం కాదు.

మంచి పన్నుల వ్యవస్థలో పన్నులు కనిష్ఠ అసౌకర్యాన్ని, కనిష్ఠ త్యాగాన్ని కలుగజేసివిగా వుండాలి. అంటే పన్ను విధింపు భారం వల్ల ఉత్పన్నమయ్యే త్యాగం అతి తక్కువగా ఉన్నదనే భావం పన్ను చెల్లింపు దారులలో కలగాలి.

పై చర్యను బట్టి మంచి పన్నుల పద్ధతికి పై లక్షణాలు ఉండడమే కాక, పన్నుల విధింపులో పన్ను నియామాలను, పన్ను ఆశయాల సాధనకు ప్రయత్నం జరగాలి. ఆర్థిక వ్యవస్థలో ఒడిదుడుకులను తగ్గించి, జాతీయోత్పత్తిని పెంచడం, ఆర్థిక వ్యత్యాసాలను తొలగించడం, ఉద్యోగ అవకాశాలను విస్తృత పరచడం మొదలైన ఆశయాలను సాధించే విధంగా మంచి పన్నుల పద్ధతిని రూపొందించుకోవాలి.

మంచి పన్నుల వ్యవస్థను రూపొందించడానికి ఆర్థిక కార్యకలాపాలలో ప్రభుత్వ జోక్యం తప్పనిసరి అవుతుంది. పన్నుల విధింపు వల్ల కలిగే హానికరమైన ప్రభావాలను తొలగించనట్లు అయితే ప్రభుత్వ ఆర్థిక కార్యకాలాపాలవల్ల సమాజానికి లభించే ప్రయోజనం గరిష్ఠంగా ఉంటుంది. ఇతర ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలవలె పన్నులు కూడా చివరకు సాంఘిక ప్రయోజనంను గరిష్టం చేయాలి.

మంచి పన్నుల వ్యవస్థకు మూడు లక్షణాలుండాలని శ్రీమతి హిక్స్ పేర్కొన్నారు. అవి

1. ప్రభుత్వ వ్యయానికి తగినంత ఆదాయాన్ని సమకూర్చాలి
2. వ్యక్తుల ఆదాయాలను, కుటుంబ పరిస్థితులను పరిగణించి చెల్లించగల శక్తి మేరకు పన్నులు విధించాలి.
3. పన్నులు సార్వజనీనంగా ఉండాలి. అంటే ఎటువంటి విచక్షణ లేకుండా ఒకే పరిస్థితులలో ఉన్న వ్యక్తులపై ఒకే విధమైన పన్ను భారం ఉండాలి.

వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడే విధంగా మంచి పన్నుల వ్యవస్థ ఉండాలని కొందరు ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. ఏదీ ఏమైనప్పటికి మంచి పన్నుల వ్యవస్థ దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడేటట్లుగా ఉండాలి.

పైన వివరించిన వివిధ అంశాల ఆధారంగా మంచి పన్నుల వ్యవస్థ లక్షణాలను క్రింద క్రోడీకరించడమైనది.

1. పన్నుల వ్యవస్థ భిన్నత్వం ఉండాలి. అయితే పన్నుల సంఖ్య మరీ ఎక్కువగా ఉండరాదు.
2. సౌలభ్యత ఉండాలి
3. సమానత్వం ఉండాలి
4. పన్ను ఎగవేతకు గాని, అవినీతికిగాను తావుండరాదు.
5. వ్యాకోచత్వం, బోయాన్సీ (Bhoyancy) ఉండాలి
6. నిర్వహణ వ్యయం అతి తక్కువగా ఉండాలి
7. ఆర్థిక అసమానతలు తగ్గించే విధంగా ఉండాలి
8. వాణిజ్య, పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేటట్లుండాలి.
9. పన్నుల వ్యవస్థ సంఘటితంగా ఉండాలి.

సాధారణంగా మంచి పన్నుల వ్యవస్థకు ఈ క్రింద వివరించిన నాలుగు సూత్రాలను అన్వయించవలసి ఉంటుంది.

A) పన్ను భారం పంపిణీ సమానంగా జరగాలి. అంటే పన్ను భారాన్ని పేదవారి కంటే ధనికులు అధికంగా భరించాలి.

B) పన్నుల వ్యవస్థ ఉత్పాదకంగా ఉండాలి. అంటే ప్రభుత్వ వ్యయానికి అవసరమైనన్ని వనరులు లభించేటట్లుగా పన్నుల వ్యవస్థ ఉండాలి.

C) పన్ను చెల్లింపు దారుల హక్కులను పరిరక్షించి, వారి సమస్యలను పరిగణనలోనికి తీసుకొని వచ్చే విధంగా పన్నుల వ్యవస్థ ఉండాలి.

D) మారుతున్న అవసరాలకు తగినట్లుగా పన్నుల వ్యవస్థకు పరిమాణాత్మకంగా ఉండాలి. ప్రణాళిక లక్ష్యాలు సాధన మంచి పన్నుల వ్యవస్థ ఆశయం. స్థిరత్వంతో కూడిన ఆర్థికాభివృద్ధిని సాధించడానికి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రాముఖ్యం ఇవ్వడం జరుగుతుంది. కాబట్టి పన్నుల వ్యవస్థ సత్వర మూలధన పెరుగుదలకు తోడ్పడి ఆర్థికాభివృద్ధికి పాటుపడాలి. ఆర్థిక వ్యవస్థలోని మిగులు ద్రవ్య వనరులను గుర్తించి వాటిని ఉత్పాదకత పెట్టుబడులకు మళ్లించాలి. ద్రవ్యోల్బణ, ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులను నివారించడానికి పన్నుల వ్యవస్థ తోడ్పడాలి. ఆర్థిక వ్యత్యాసాలు నిర్మూలన మంచి పన్నుల వ్యవస్థ మరొక లక్షణం. పన్నుల ద్వారా సాధించిన ఆదాయ పంపిణి ప్రజల జీవన ప్రమాణానికి మెరుగుపరచడానికి తోడ్పడాలి.

## 6.4 పన్నుల ప్రభావాలు (Effects of Taxation)

విదేశీ దాడుల నుంచి, అంతర్గత పోరాటాల నుంచి దేశాన్ని రక్షించటం లాంటి కొద్ది విధులకే ప్రభుత్వ కార్యకలాపాలు పరిమితమైన రోజుల్లో పన్నులు విధించటం కేవలం ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చటానికేనని భావించేవారు. ఈ అభిప్రాయాన్ని సమర్థించే వారి ఉద్దేశంలో పన్నుల ప్రభావ శూన్యం కలవిగా ఉంటాయి. అంటే పన్నులు తటస్థ వైఖరిని కలిగి ఉండడం మంచి పన్నుల విధానం ముఖ్య లక్షణంగా భావించారు. తటస్థ పన్నుల విధానం ఆర్థిక కార్యకలాపాలుపై అనగా ప్రవేట్ పెట్టుబడి, ఉత్పత్తి, పొదుపు, వినియోగాలపై ఏ విధమైన హానికర ప్రభావాలు కలిగించదు. వనరుల కేటాయింపులో గూడా మార్పు రాదు. అంటే మార్కెట్ శక్తుల వల్ల ఏర్పడిన ఆర్థిక అంశాలు పన్నులు విధించడం వల్ల మార్పు చెందవని అర్థం. మరొక విధంగా చెప్పాలంటే మార్కెట్ శక్తుల ద్వారా జరిగే వనరుల పంపిణీ వల్ల అయ్యే వస్తూత్పత్తి సమాజ అవసరాలను తీరుస్తుంది. కాబట్టి అది అభిలషణీయంగా ఉంటుందని తటస్థ పన్నుల విధాన సారాంశము.

అయితే కాలక్రమేపి పన్నుల విధానంలో తటస్థ వైఖరికి తావులేని విధంగా ఆధునిక పన్నుల వ్యవస్థను విస్తరించడం జరిగింది. వ్యాపార సంస్థలు, వ్యక్తులు, తమ ఆర్థిక పరమైన నిర్ణయాల్లో పన్నుల ప్రభావాలు, వాటి ఫలితాలను గమనించి తగు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆధునిక ప్రభుత్వ కార్యకలాపాలు బాగా విస్తృతమైనవి. ఇందుకు తగిన మొత్తంలో ప్రభుత్వం ఆదాయం సమకూర్చుకోవాలి. పన్నులు విధించడం వల్ల ఉత్పత్తి, వినియోగాలలో మార్పు తీసుకోనే వచ్చే అవకాశం ఉంది. వాస్తవానికి ఆర్థిక కార్యకలాపాల్లో అభిలషణీయమైన మార్పులను తీసుకురావటానికి ప్రభుత్వం అనేక పన్నులను విధిస్తుంది. మార్కెట్ యంత్రాంగంలోని డిమాండ్ సప్లయ్ శక్తులను ప్రభావితం చేస్తాయి. పన్నుల ద్వారా ఉత్పత్తి, వినియోగం, పంపిణీలు ప్రభావితం అవుతాయి. అందువల్ల ఆధునిక ప్రభుత్వాలు మారుతున్న పాత్ర దృష్ట్యా పన్నులు ప్రభుత్వానికి ప్రవేట్‌రంగ అభివృద్ధికి తగిన ప్రోత్సాహాన్ని ఇవ్వడానికి ఉపయోగపడతాయి. అన్ని సందర్భాల్లోను, పన్నులు ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే ఉద్దేశంతోనే విధించడం జరగదు. వాటి ముఖ్య ఉద్దేశం వస్తు వినియోగాన్ని తగ్గించడం కావచ్చు. దీన్ని సమ్‌చురీ పన్నుల విధానం అంటారు. సమ్‌చురి పన్నుల విధానం, తటస్థ పన్ను విధానానికి విరుద్ధమైంది. ందువల్ల తటస్థ లేదా ప్రతిభ శూన్య పన్నుల విధానం నేడు ఆచరణ యోగ్యం కాదని చెప్పవచ్చు.

ఆర్థిక పరమైన దృష్టితో చూసినప్పుడు వీలైనంత వరకు లాభదాయకమైన లేదా అతి తక్కువ హానికరమైన ఆర్థిక ప్రభావాలు కలిగి ఉండేది మంచి పన్నుల వ్యవస్థ అని డాల్టన్ వివరించారు.

( The best system of taxation from the ecomonic print of view in that which has the best or the least economic effects) - Dalton.

మంచి పన్నుల విధానంలో పన్నుజత భార నష్టం ఉండరాదు. పన్నుల వల్ల వినియోగదారునకుగాని, ఉత్పత్తిదారునకుగాని కలిగే అదనపు నష్టాన్ని పన్నుల జత భారనష్టం (Dead weiqht loss of taxation) అంటారు. పన్నుల నిర్మాణంలో అసంపూర్ణత వుంటే జతభార నష్టమేర్పడుతుంది. పన్నుల నిర్మాణం అసంపూర్ణంగా ఉన్నపుడు వనరుల కేటాయింపు అభిలషణీయంగా ఉండదు. వనరుల కేటాయింపు అభిలషణీయంగా ఉంటే ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలంటే పన్నుల జతభార నష్టం తక్కువగా ఉండాలి. కాబట్టి అభిలషనీయమైన కేటాయింపుకు, పని చేసే ప్రయత్నం పొదుపు పెట్టుబడి స్థాయిలు పెరగటానికి జతభారం నష్టం లేని మంచి పన్నుల విధానం రూపొందించటం ఎంతో అవసరం.

పన్నుల విధానం మార్కెట్లలో డిమాండు సప్లయ్ శక్తుల ప్రభావితం చేసే మార్కెట్ల ప్రవర్తనలో కూడా మార్పు తెస్తుందని పిగూ అభిప్రాయపడ్డాడు. ఇతని ఉద్దేశంలో ప్రతి పన్ను ఆర్థిక వ్యవస్థపై రెండు రకాలైన ప్రభావాలను కలిగిస్తుంది. అవి 1) కొనుగోలు శక్తి ప్రభావాలు 2) ప్రకటన ప్రభావాలు.

పన్ను విధించేటప్పుడు పన్ను కొనగోలు శక్తి ప్రభావం నుండి వినియోగానికి పొదుపు. ఉద్దేశించిన ఆదాయాన్ని తగ్గిస్తుంది. జాతీయాదాయం నుండి కొంత ఆదాయం పొదుపు నుంచి, వినియోగం నుంచి వస్తు రూపంలో ప్రభుత్వానికి బదిత అవుతుంది. ఈ పన్ను ప్రభావం కారణంగా ఆర్థిక వ్యవస్థలో వినియోగం పొదుపు నిష్పత్తులు మారిపోతాయి. అదనంగా పెట్టుబడి లాబసాటి కాదనే భావన పెట్టుబడిదారులలో కలుగుతుంది. ఉదా: కు వ్యష్టి ఆదాయపన్ను వ్యయార్హ ఆదాయాన్ని తగ్గిస్తుంది. కాబట్టి అతని కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. కంపెనీలపై విధించే ఆదాయపన్ను కంపెనీల పెట్టుబడి స్థాయిని తగ్గిస్తుంది. కంపెనీలు ఆదాయపు పన్ను వల్ల కలిగే నష్టానికి పరిహారంగా తాము తయారుచేసే వస్తు ధరను పెంచి పన్ను భారాన్ని వినియోగదారులకు బదిలీ చేయడానికి ప్రయత్నించినపుడూ అమ్మకం పన్ను విధించినపుడు కలిగే ప్రభావాలు కలుగుతాయి.

పన్నులు ప్రత్యక్షంగా కొనగోలు శక్తిని తగ్గించే ప్రభావం, ప్రకటన ప్రభావాలు గూడా వున్నాయి. పన్ను విధింపు వల్ల వ్యక్తి ప్రవర్తనలో మార్పు రావచ్చు. వివిధ ఆర్థిక ప్రక్రియలకూ అవసరమైన ప్రోత్సాహాన్ని తగ్గించవచ్చు. ఉదా:- వ్యష్టి ఆదాయపన్ను పని చేయాలనే కోరికల మార్పు తెచ్చి శ్రమ సప్లయ్‌తో మార్పు తెస్తుంది. కార్పోరేట్ ఆదాయపన్ను వ్యాపారాన్ని అభివృద్ధి చేసే ఉత్సాహాన్ని తగ్గిస్తుంది. పెట్టుబడి స్థాయిని తగ్గిస్తుంది. ఎక్సైజ్ సుంకాలు సాపేక్ష వినియోగా పద్ధతులలో మార్పు తెస్తాయి. ఉత్పాదక పన్నులు పై విధించే ఎక్సైజ్ సుంకాలు. ఈ అమ్మకం పన్నులు ఉత్పాదకత రీతులపై ప్రభావాన్ని కలిగిస్తాయి. పన్నులు వల్ల కలిగే ఈ పరోక్ష ప్రభావాలను పిగూ ప్రకటన ప్రభావాలని పేర్కొన్నాడు. ఈ ప్రకటన ప్రభావాలు గురించి తెలుసుకోవచ్చునే గాని వాటిని నిర్ణయించడం కష్టం.

### 6.4.1 ఉత్పత్తి పై పన్నుల ప్రభావం (Effects of taxes on Production)

జాతీయాదాయం, ఉద్యోగిత స్థాయిలపై పన్నుల ప్రభావాన్ని డాల్టన్ పని, పొదుపు, పెట్టుబడి పెట్టాలనే సామార్ధ్యాలపై ప్రభావం అనీ: పని, పొదుపు పెట్టుబడి పెట్టాలనే కోరికలపై ప్రభావం అనీ: ప్రాంతాల పరిశ్రమల మధ్య వనరుల మళ్లింపు పై ప్రభావం మూడు విధాలుగా విశ్లేషించాడు.

#### 6.4.1.1 పని పొదుపు, పెట్టుబడి సామార్ధ్యం పై పన్నుల ప్రభావం

ప్రజలు పని చేయగల సామార్థ్యం వారు తీసుకోనే ఆహారం, వారి ఆరోగ్యం, విద్యా, శిక్షణలపై ఆదారపడి వుంటుంది. పన్నులు చెల్లించే వారి వ్యయార్హ ఆదాయాన్ని తగిస్తుంది. అందువల్ల ఏ పన్నులు ప్రజలు పనిచేసే సామార్ధ్యాన్ని పెంచటానికి లేదా తగ్గించడానికి

తొడ్పడతాయో తెలుసుకోవాలి. పురోగామి పన్నులు అధిక భారం మోపగా అనుపాత పన్నులు పేద ప్రజానీకంపై ఎక్కువ భారాన్ని కలిగి ఉంటాయి. పరోక్ష పన్నులు పేదవారి వినియోగాన్ని తగ్గించి వారి పని చేసే సామార్థ్యాన్ని తగ్గిస్తాయి. పరోక్ష పన్నులు ధనవంతుల వినియోగాన్ని తగ్గించవు. ప్రజల పని చేయగల సామార్థ్యం దెబ్బతినకుండా ఉండాలంటే పురోగామి పన్నుల విధానాన్ని అనుసరించడం ఉత్తమం. సంపన్నుల తమ పొదుపు నుంచి పన్నులు చెల్లించి తమ ఆరోగ్యం సామార్థ్యం దెబ్బతినకుండా చూసుకోంటారు. అంత మాత్రం చేత పరోక్ష పన్నులను పూర్తిగా నిరాకరించాలని అర్థం చేసుకోరాదు. ఆదాయ డిమాండు వ్యాకోచత్వం ఎక్కువగా ఉంటే విలాస వస్తువులపై పన్నులు ఎక్కువగా విధించినప్పటికి వినియోగస్థాయి పడిపోదు. అయితే సామాన్య ప్రజానీకం వినియోగించే వస్తువులపై ఎక్కువగా పన్నులు విధించినట్లు అయితే ప్రజల వినియోగ ప్రమాణం తగ్గిపోయి వారి పని చేసే సామార్థ్యం తగ్గిపోతుంది.

సాదారణంగా ధనవంతులే పొదుపు చేయగలరు. పేద ప్రజలకు పొదుపు చేయటానికి సరివడినంత ఆదాయం వుండదు. పైగా దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందేటప్పుడు పేదవారి కంటే ధనికుల ఆదాయాలు ఎక్కువ రేటులో పెరుగుతాయి. ధనవంతులపై పురోగామి (లేదా) ప్రత్యక్ష పన్నులు విధించినట్లు అయితే పొదుపు పై పన్ను విధించినట్లు అయితే వారి పొదుపు దెబ్బతింటాయి. అందువల్ల పొదుపును ప్రోత్సహించటం ప్రభుత్వ లక్ష్యమైతే పురోగామి పన్నులపై తక్కువగా ఆదారపడాలి. ఈ పరిస్థితులలో ప్రభుత్వ ఆదాయాన్ని సమకూర్చుకోవటానికి పరోక్ష పన్నులపై ఎక్కువ ఆధారపడాలి. అయితే పరోక్ష పన్నులకూ తిరోగామి లక్షణం ఉండటం వల్ల అవి ఆర్థిక అసమానతలను అధికం చేస్తాయి. సాంఘిక న్యాయం, ప్రజాసంక్షేమం దృష్ట్యా ఆదాయ సంపదలోని అసమానతలను తగ్గించటం ఎంతో ప్రాముఖ్యం గల అంశం. అంతేగాక పరోక్ష పన్నులు పనిచేయగల సామర్థ్యాన్ని కూడా తగ్గించి వేస్తాయి. కాబట్టి ప్రభుత్వం ఈ అంశాలన్నింటిని పరిగణించి పైన వివరించిన రెండు లక్ష్యాలను సాధించటానికి తొడ్పడే విధానాన్ని ఎంచుకోవాలి. ఇక్కడ సమస్య ఏమంటే పరోక్ష పన్నులు వినియోగాన్ని, పని చేసే శక్తిని దెబ్బతీయగా ప్రత్యక్ష పన్నులు పొదుపును తద్వారా పెట్టుబడి సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి.

పెట్టుబడి పెట్టే సామర్థ్యం ప్రజల పొదుపు చేయగల సామర్థ్యం పై ఆధారపడి ఉంటుంది. అయితే పొదుపును ప్రోత్సహించే కారణాలు. పెట్టుబడిని ప్రోత్సహించే కారణాలు వేరువేరుగా ఉంటాయి వ్యక్తి దృష్ట్యా పెట్టుబడిని పొదుపు పై ఆధారపడి ఉండవలసిన అవసరం లేదు. పెట్టుబడి కనువు అయిన వాతావరణం ఉంది మంచి లాభాలు వస్తున్నట్లయితే వ్యక్తులు ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సేకరించి పెట్టుబడులు పెట్టవచ్చు. అయితే ఇది ఒక వ్యక్తి విషయాలలో సాధ్యమవుతుంది. మొత్తం ఆర్థిక వ్యవస్థనంతటిని తీసుకుంటే ఇది సాధ్యం కాదు.

బ్యాంకులిచ్చే పరపతికి అనేక పరిమితులు వున్నాయి. తగినన్ని డిపాజిట్లు లేకుంటే బ్యాంకులు పెద్ద మొత్తంలో పరపతిని ఇవ్వలేవు. ఆర్థిక వ్యవస్థ అవసరాలకు మించి బ్యాంకులు సృష్టించే పరపతి ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. ద్రవ్యోల్బణం వల్ల పేదల వినియోగ తగ్గి వారి పని చేయగల సామర్థ్యం తగ్గిపోతుంది. కొన్ని సందర్భలలో ద్రవ్యోల్బణం వినియోగాన్ని తగ్గించి నిర్బంద పొదుపుకు దోహద పడుతుంది. పెట్టుబడి పెట్టగల సమర్థత ఉన్నప్పటికి పరిస్థితులనుకూలనంగా లేకపోయినట్లు అయితే అది కార్యం రూపం దాల్చదు. ఉదా:- కు పెట్టుబడులపై విధించిన పన్నుల పెట్టుబడులను నిరుత్సాహ పరుస్తాయి. అదే విధంగా భవిషత్లో వచ్చే ఆదాయాలపై కూడా పన్ను విధించినట్లు అయితే పెట్టుబడిదారులు, పెట్టుబడి పెట్టటానికి ఆసక్తి చూపరు. పన్నుల రేటు, పన్ను చెల్లింపు పద్ధతి మొదలయినవి కూడా పెట్టుబడి సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయి.

దేశ ఆర్థిక ప్రగతికి పెట్టుబడులు అవసరం కాబట్టి ప్రవేటు పొదుపును ప్రోత్సహించి దాన్ని ప్రభుత్వం పెట్టుబడిగా ఉపయోగించినగాని లేదా పురోగామి పన్నులను తక్కువ రేటులో విధించి ప్రవేటు పెట్టుబడి సామార్థ్యాన్ని ప్రోత్సహించినగాని ఆర్థికాభివృద్దిని సాధించవచ్చు.

**6.4.1.2 పని, పొదుపు పెట్టుబడి కోరికలపై పన్నుల ప్రభావం :** పని, పొదుపు, పెట్టుబడులను పెట్టాలనే కోరికలకు పరిసరాలు ఉత్రేజాన్ని కలిగిస్తాయి. కాబట్టి పన్నులు విధానం ప్రజల పని, పొదుపు పెట్టుబడులు పెట్టాలనే కోరికలను ప్రోత్సహించటానికి అవసరమైన ప్రొత్సాహాలను అందించేదిగా ఉండాలి.

పని చేయ్యాలనే కోరికపై పన్నులుకుండే ప్రభావం పన్ను చెల్లించే వ్యక్తి మనస్తత్వం పైన పన్నులు రేటు పైన, పన్నుల స్వభావం పైన ఆధారపడి వుంటుంది. ఎక్కువ ఆదాయాన్ని సంపాదించటానికి వ్యక్తి పని చేయాలనే కోరిక కలిగి వుంటాడు. ఎక్కువ పని చేసినట్లు అయితే అతని ఆదాయం పెరుగుతుంది. పన్నులు అవి చెల్లించేవారి వ్యయార్హ ఆదాయాన్ని తగ్గిస్తుంది. ఎందుకంటే ఎక్కువ పనిచేసే ఆదాయాన్ని పెంచుకొన్నట్లయితే అందులో అధిక భాగం ఆదాయం పన్ను లాంటి ప్రత్యక్ష పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లించాలని భయం. కాబట్టి ప్రత్యక్ష పన్నులు పని చేయాలనే కోరికను నిరుత్సాహపరుస్తాయి. అయితే ఆకస్మిక లాభాలపై విధించే పన్నులు పని చేయాలనే కోరికను ఏ మాత్రం ప్రభావితం చేయవు. కొన్ని సార్లు పన్ను చెల్లించటం వల్ల తగ్గిపోయిన ఆదాయాన్ని భర్తీ చేసుకోనటానికి ఎక్కువగా పనిచేయాలన్నది కూడా వ్యక్తులు కోరుకుంటారు. పేదవారు ఉపయోగించే వినియోగ వస్తువులపై విధించిన పరోక్ష పన్నులు వారి ప్రస్తుత, వినియోగాన్ని తగ్గిస్తాయి. తమ వినియోగస్థాయిని నిలుపుకోవటానికి వీరు ఎక్కువుగా పనిచేయాలి. ఈ విధంగా చూసినపుడు పని చేయాలనే కోరికను పన్నులు పెంచుతాయి, అని అనిపిస్తుంది. అందువల్ల పన్నుల ప్రభావం అందరిపై ఒకే విధంగా ఉండదు. ఇది వారి ఆదాయానికి గల డిమాండ్ వ్యాకోచత్వంను బట్టి ఉంటుంది. పన్ను చెల్లించే వారి కుటుంబ అవసరాలు పన్ను రేట్లు మొదలనవి కూడా పని చేయాలనే కోరికను ప్రభావితం చేస్తాయి.

పొదుపు చేసే కోరికపైన పన్నులుకుండే ప్రభావం అనే అంశం పొదుపు చేసే సామర్థ్యానికి దగ్గరగా ఉంటుంది. పొదుపు చేయగల సమర్థత ఉన్నప్పటికి కోరిక లేకపోతే పొదుపు మొత్తం ఉండవలసిన దాన్ని కన్న తక్కువగా ఉంటుంది. అన్ని ప్రత్యక్ష పన్నులు, పురోగామి పన్నులు వ్యక్తుల పొదుపు చేసే కోరికను నిరుత్సాహపరుస్తాయని తలచరాదు. ఉదా:- కు పొదుపు చేయాలనే కోరిక. ప్రోత్సహించటానికి ఆదాయం పన్ను కంటే వ్యయంపై పన్ను విధించటం మంచిదని నికోలస్ అభిప్రాయపడ్డాడు. ఒక వ్యక్తి ఎంత పొదుపు చేయాలని కోరుకుంటాడు అనేది మొత్తం పన్ను వ్యవస్థను బట్టి వుంటుంది. ప్రతి పన్ను విడివిడిగా పరిశీలించి మొత్తం పొదుపుపై ఆదాయం పన్నుల ప్రభావం ఎంతగా ఉంటుందో చెప్పటం కష్టం. అందువల్ల వ్యక్తుల పొదుపును పెంచటానికి అవసరమైన ప్రోత్సాహకాలను ప్రభుత్వం కల్పించినట్లు అయితే ప్రజలకు పొదుపు చేయాలనే కోరిక పెరుగుతుంది. లేకపోతే పన్నులు పొదుపు చేయాలన్న కోరికనే గాక ప్రజలు పని చేయాలనే కోరికను కూడా నిరుత్సాహ పరుస్తుంది. పొదుపు పెరగకపోతే పెట్టుబడి క్షీణించి మూలధన కల్పన తగ్గిపొయి ఆర్థికాభివృద్ధి దెబ్బ తింటుంది.

ఈ సందర్భంలో మనం గుర్తించుకోవలసిన మరో విషయం. బ్యాంకులు చెల్లించే వడ్డీరెట్లు ఆకర్షణీయంగా ఉన్నట్లు అయితే ప్రజల్లో పొదుపు చేయాలనే కోరిక పెరుగుతుంది. ప్రభుత్వ బాండ్లు, సెక్యూరిటీ రూపంలో కూడా పొదుపు చేయటానికి ప్రజల ఆసక్తిని చూపిస్తారు. పొదుపు మొత్తం ఆదాయం పైన పెట్టుబడి నుంచి లభించే లాభం రేటు పైన కూడ ఆధారపడి వుంటుంది, అనే విషయాన్ని మనం మరిచిపోకూడదు. పెట్టుబడి పెట్టటానికి పొదుపు జరగాలి. కాబట్టి పొదుపు చేసే కోరిక, పెట్టుబడి పెట్టాలనే కోరిక ఒకదానితో ఒకటి అవినాభవ సంబందం కలిగి ఉంటాయి. పొదుపు స్థాయిని తగ్గించే పన్నులు పెట్టుబడి స్థాయిని కూడా తగ్గిస్తాయి. పెట్టుబడి పెట్టాలనే పెట్టుబడిదారుని కోరికను ప్రత్యక్షంగా తగ్గించి వేస్తాయి. ఉత్పత్తి సాధానాలపై హెచ్చుపన్నులు విధించినట్లు అయితే వాటి ధరలు పెరిగి ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఈ పరిస్థితులలో వస్తు ధరలలో మార్పు లేకపోతే పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టాలనే కోరికలు దెబ్బతింటాయి. వివిధ పెట్టుబడులనుంచి వచ్చే ఆదాయాలను వేరువేరుగా పరిగణించాలి. ఆర్థిక సాంఘిక ప్రయోజనాల దృష్ట్యా అవాంఛనీయ పెట్టుబడుల నుంచి వచ్చే ఆదాయంపై అధిక పన్నులు విధించాలి. అంతేగాక ఏదైన ఒక పరిశ్రమను ప్రోత్సహించటానికి ఆ పరిశ్రమల పెట్టుబడులపైన, ఆ పెట్టుబడుల వుంచి లభించే ఆదాయంల పైన ప్రభుత్వం తక్కువగా పన్నులు విధించాలి. ఏ విధమైన పన్నులైనప్పటికి పన్ను రేటు ఎంత ఉన్నప్పటికి వ్యాపార సంస్థకు వచ్చే లాభాలు తగ్గకుండా ఉంటే పెట్టుబడి తగ్గదు. ఈ విధంగా పెట్టుబడి పెట్టాలనే కోరిక ప్రభుత్వం ప్రస్తుత ప్రోత్సాహకాలపైన గాక దేశంలో పెట్టుబడి వాతావరణాన్ని బట్టి భవిషత్‌లో పెట్టుబడుల నుంచి వచ్చే లాభావకాశాలను బట్టి కూడా ఆధారపడి వుంటుంది.

**6.4.1.3 వనరుల కేటాయింపు పై పన్నుల ప్రభావం :** వనరుల వివిధ ఉపయోగాల మధ్య శ్రేణుల మధ్య, ప్రాంతాల మధ్య తరలింపుకు పన్నులు తొడ్పడతాయి. మంచి పన్నులు విధానం అభిలషణీయమైన వనరుల కేటాయింపుకూ తొడ్పడి ఉత్పత్తి పరిమాణాన్ని,

ఉత్పత్తి రీతులను ప్రభావితం చేస్తుంది. ఉదా:- కు ఆరోగ్యానికి హానికరమైన మత్తు పదార్థాలను విధించే పన్నుల వల్ల వాటి ధరలు పెరిగి వినియోగం తగ్గుతుంది. అందువల్ల ఉత్పత్తి కారకాలను ఆ పరిశ్రమనుండి ఇతర పరిశ్రమలకు మళ్లించడం జరుగుతుంది. పన్నులు ఈ విధమైన వనరులు మళ్లింపుకూ తోడ్పడటానికి లాభదాయకమైన మళ్లింపు అంటారు. అట్లాగాక ప్రజోపయోగ వస్తువులపై పన్నులు విధించినట్లు అయితే, ఉత్పత్తి తగ్గిపోయి వనరులను తక్కువ ఉపయోగకరమైన వస్తూత్పత్తి కార్యక్రమాలనుకు మళ్లించడం జరుగుతుంది. దీన్ని హానికరమైన వనరులు మళ్లింపు అంటారు.

**6.4.2 పంపిణీ పై పన్నుల ప్రభావం (Effects of taxes on Distribution)** : ప్రజల కోనుగోలు శక్తిని పన్నులు ఏ విధంగా ప్రభావితం చేస్తాయో పన్నులు విధింపు వల్లన పేదవారు ఎటువంటి బాధలకు గురి అవుతారో, ధనికుల పై ఎటువంటి ప్రభావం ఉంటుందో మనం తెలుసుకున్నాం. ఇపుడు ఆదాయ సంపదల పంపిణీలపై పన్నుల ప్రభావం పరిశీలిద్దాం.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఎక్కువగా ఉంటే ఆర్థిక వ్యత్యాసాలు తగ్గించటానికి పన్నులు ఎంత వరకు తొడ్పడతాయో దేశంలో ఉత్పత్తి ఏ పంపిణీలను మార్కెటు శక్తులకూ విడిచి పెట్టినట్లు అయితే ఆర్థిక వ్యత్యాసాలు పెరిగిపోయి పేదవారు ఇంకా పేదవారుగా మిగిలిపోతారు. ధనవంతులు, ధనవంతులుగా అవుతారు. కాబట్టి మంచి పన్నుల విధానం ద్వారా ప్రభుత్వం ఈ ఆర్థిక వ్యత్యాసాలను తొలగించటానికి ప్రయత్నించాలి. అంటే సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలు తొలగించాలి, వివిధ వర్గాల ప్రజల మధ్య ఆదాయ పునఃపంపిణీకి పన్నులు ఒక ముఖ్య సాధనంగా తోడ్పడాలి. ఆర్థిక అసమానతల నిర్మూలనకు పన్నులు తొడ్పడాలన్ని జర్మనీ ఆర్థికవేత్త అడాల్ఫ్ వాగ్నర్ మొట్ట మొదట ప్రతిపాదించాడు. ఆర్థిక అసమానతలు నిర్మూలనకు ఆదాయ పునః పంపిణి సాధనకు పురోగామి పన్నులు విధించాలి. ఆదాయపన్ను, సంపదలాంటి ప్రత్యక్షపన్నులు, సమాజంలో ఆర్థిక అసమానతలకు నిర్మూలనకూ తోడ్పడతాయి. పన్నులో పురోగామితత్వం మరీ ఎక్కువగా ఉన్నట్లు అయితే పన్నుల ప్రభావం ధనికులపై ఎక్కువగా వుంది పొదుపు పెట్టుబడులు తగ్గిస్తాయి. పొదుపు చేయాలనే కోరికను నిరుత్సాహపరిచి ఆర్థిక వ్యత్యాసాలు పెరగటానికి తోడ్పడతాయి. అనుపాత పన్నులు ఆదాయ పంపిణి యధాతథంగా ఉండటానికి తోడ్పడతాయేగాని పంపిణి మెరుగుపరచలేవు.

ఆదాయ పునః పంపిణీని స్వల్పకాలిక దృష్టితోను, దీర్ఘకాలిక దృష్టితోను గూడా పరిశీలించాలి. ఆదాయ పునః పంపిణీ సాధనంగా పన్నులను విధించినట్లు అయితే స్వల్పకాలంలో ఉత్పత్తి దెబ్బతినక పోవచ్చు అయితే దీర్ఘకాలంలో ప్రజల ఆదాయం పొదుపులో మార్పు రావచ్చు. అందువల్ల ఆదాయ పునఃపంపిణీని లక్ష్యాన్ని పన్నులు ద్వారా స్వల్ప కాలంలో సాధించలేం. ఇతర పద్ధతుల ద్వారా ఆస్తుల యాజమాన్యంలో తగిన మార్పులు తీసుకొని రాకపోతే ఈ లక్ష్య సాధనలో అనేక సంస్థాగత ఇబ్బందులు ఎదురు అవుతాయి. కేవలం పన్నుల ద్వారానే ఆదాయ పునఃపంపిణీ లక్ష్య సాధనకూ ఎంతోకాలం పట్టవచ్చు. మరో విధంగా చెప్పాలంటే స్వల్పకాలంలో ఆదాయ పంపిణీపై పన్నుల ప్రభావం తక్కువ ప్రాముఖ్యత కలిగి వుంటుంది. ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో ఏర్పడే మిగుళ్ళను గుర్తించి ఆ మిగుళ్లపై పన్నులు విధించాలి. లేకపోతే ఆర్థిక అసమానతలు పెరిగిపోతాయి. పురోగామి పన్నులు చాలా వరకు ఈ లక్ష్య సాధనకు ఉద్దేశించినవే. అయితే ఆదాయ పునఃపంపిణీ ఆర్థిక వ్యత్యాసాలు తగ్గింపునకు పన్నులు విధానం కంటే ప్రభుత్వ వ్యయ విధానం బాగా తోడ్పడుతుందనే అభిప్రాయాన్ని కొంతమంది ఆర్థికవేత్తలు వెలిబుచ్చారు. కానీ అభిలషణీయమైన ఆదాయ పునఃపంపిణీకు పన్నులు. వ్యయ విధానాలు రెండింటిని సమన్వయపరచి అమలు పరచాలి.

ఆర్థిక సుస్థిరత సాధనకూ కూడా పన్నులు తోడ్పడతాయి. ద్రవ్యోల్బణానికి అదుపు చేసి ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధం చేయటానికి పన్నులు తోడ్పడతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో వివిధ ఆర్థికాభివృద్ధి పథకాలపై ప్రభుత్వం చేసే వ్యయం ద్రవ్యోల్బణానికి కారణమవుతుంది. ద్రవ్యోల్బణం ఉత్పత్తి దారులకు లాభం కలిగించగా అల్పాదాయ వర్గాల ప్రజలను దెబ్బతీస్తుంది. ఫలితంగా ఆర్థిక అసమానతలు పెరగటానికి ద్రవ్యోల్బణం తోడ్పడుతుంది. ఈ విధమైన ద్రవ్యోల్బణ పోకడను అరికట్టి ఆర్థిక సుస్థిరతను చేకూర్చటానికి పన్నులు తోడ్పడతాయి.

**6.4.3 పన్నులు ఇతర ప్రభావాలు :** పన్నుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కంటే వాటి వసూలకయ్యే వ్యయం అధికంగా ఉంటే ఉత్పత్తి తగ్గిపోయే అవకాశం వుంటుంది. అంతేగాక పన్ను చెల్లింపుదారులకు కూడా పన్ను చెల్లించటానికి అయ్యే ఖర్చు మితంగా ఉండాలి. పన్నులు శ్రామికుల డిమాండ్‌ను స్థిరపరచి నిరుద్యోగతను తొలగించాలి. అయితే ఇది పన్నులు విధానం పైనేగాక ప్రభుత్వ వ్యయ విధానంపై కూడా ఆధారపడి వుంటుంది. ప్రభుత్వం ఆకస్మికంగా పన్నులు పద్ధతిలో మార్పులు ప్రవేశ పెట్టినట్లుయితే నిరుద్యోగం ప్రబలే అవకాశం వుంటుంది.

పన్నుల విధానాలలో మూలధన సంచయనాన్ని పెట్టుబడులను తగ్గించి ఉత్పత్తి స్థాయిని తగ్గించినట్లు అయితే జాతీయ సంక్షేమం పై పన్నులు హానికరమైన ప్రభావాన్ని కలిగిస్తాయి.

ఈ విధంగా పన్నులు జాతీయోత్పత్తి. ఉద్యోగితలపై అనుకూల ప్రతికూల ప్రభావాలను కలిగి ఉంటాయి. మంచి పన్నుల విధానం ప్రతికూల ప్రభావాలను తగ్గించి ఉత్పత్తిని ప్రోత్సహించేటట్లుగాను ప్రభుత్వానికి గరిష్ఠ ఆదాయాన్ని సమకూర్చేటట్టుగాను, పన్నులు చెల్లించేవారికి కనిష్ఠ భారం కలిగించేవిగాను ఉండాలి.

## 6.5 పన్ను విధింపు న్యాయం (Justuce in taxation) :

సమాన ప్రత్యక్ష ప్రతిఫలం ఆశించకుండా (Quid Proquo) ప్రతి పౌరుడు ప్రభుత్వానికి నిర్బంధంగా చెల్లించవలసి ఉంటుంది పన్ను. ప్రభుత్వానికి తమ పౌరులు నుండి పన్నులు వసూలు చేసే అధికారం ఉంది. అదే విధంగా పన్నులు చెల్లించటం తమ భాధ్యతగా పౌరులు గుర్తిస్తారు.

పన్నులు చెల్లించినపుడు అవి చెల్లించిన వారి వ్యయార్హ ఆదాయం తగ్గిపోతుంది. అంటే పన్నులు చెల్లించేవారిపై బారాన్ని మోపుతున్నాయన్నమాట. పన్ను భారాన్ని ఆర్థికవేత్తలు ద్రవ్య భారమని, వాస్తవ భారమని, ప్రత్యక్ష పరోక్ష భారమన్ని విభజించారు. వివిధ పన్నుల ద్వారా ప్రజలనుండి ప్రభుత్వానికి బదిలీ అయిన ద్రవ్యాన్ని పన్ను ద్రవ్యభారం లేదా ప్రత్యక్ష ద్రవ్యభారం అంటారు. పన్ను చెల్లింపుదారుల నుంచి ప్రభుత్వానికి బదిలీ అయిన ద్రవ్యం విలువను పన్నుల నిజభారం అంటారు. లేదా వాస్తవ భారం అంటారు మొదట పన్ను చెల్లించిన వ్యక్తికి దాన్ని బదిలీ చేయటానికి కొంతకాలం పట్టవచ్చు. అటువంటప్పుడు పన్ను మొత్తంగాక బదిలీ చేయటానికి వచ్చిన కాలానికి వడ్డీని గూడా కలిసి వస్తువు ధరను పెంచుతుంది. దీన్ని పరోక్ష ద్రవ్యభారం అంటారు. పన్నుల వస్తువు ధరలు పెరిగి దాని వినియోగం తగ్గిపోతుంది. ఈ విధంగా వినియోగదారు కోల్పోయిన ప్రయోజనాన్ని పరోక్ష నిజభారం అంటారని డాల్టన్ వివరించాడు. ఈ విధమైన పన్నులభారాన్ని వివిధ వ్యక్తుల మధ్య ఏ విధంగా పంపిణీ చేయాలనే విషయాన్ని ఎవరిపైన, ఎంతమేరకు పన్ను విధించాలనే విషయాన్ని జాగ్రత్తగాను, హేతుబద్ధంగాను, పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలి. అంటే పన్నుభారం పంపిణిలో సమానత్వంను సాధించటానికి ఏ సూత్రాన్ని పాటించాలని పన్ను విధింపు చెల్లింపు విషయంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఎటువంటి సంబంధమున్నది అనేవి ఆధునిక ప్రభుత్వదత్త విత్త శాస్త్రంలో ప్రధాన సమస్య పన్నులు విధింపు పక్షపాతరహితంగాను, న్యాయబద్ధంగాను ఉన్నప్పుడే ప్రభుత్వానికి పన్నులు వసూలు తేలికగాను, శాంతాయుతంగాను ఉంటుంది. అందువల్ల పన్నుల భారాన్ని పంపిణి చేయడంలో సమానత్వాన్ని, న్యాయాన్ని, సాధించటానికి ఆర్థిక వేత్తలు వివిధ పన్నుల సూత్రాలను ప్రతిపాదించారు. వాటిలో లాభ సిద్ధాంతం, సేవా వ్యయాల సిద్ధాంతం, చెల్లింపు సామర్థ్య సిద్ధాంతం ముఖ్యమైనవి. ఈ వివిధ సూత్రాలను గురించి విపులంగా పరిశీలిద్దాం.

**6.5.1 పన్ను విధింపు లాభ సిద్ధాంతం (Benefit theory of taxation)** : ప్రజలకు ప్రభుత్వానికి మధ్యవున్న సంబందాలలో ప్రధానమైనది పన్ను చెల్లించవలసిన బాధ్యత లాభ సిద్ధాంతానికి సంబందించినంత వరకు పన్ను విధించే అధికారం ప్రభుత్వానికి, పన్ను చెల్లింపుదారులకు మధ్య ఒప్పందపు సంబంధం లాంటిదని చెప్పవచ్చు. పన్నుల విధింపు ప్రభుత్వం అందించే సేవలకూ సముచితమైన ధర వస్తువులు చేయడటమనేది సాంఘిక ఒప్పందపు సిద్ధాంతానికి సహజ పరిపూరకమని 17వ, 18వ శతాబ్దలలోన్ని ఆర్థిక రాజకీయవేత్తలు భావించారు. హాక్స్, లాక్, రూసో, లాంటి తత్వవేత్తలు ఫ్రెంచి దేశానికి చెందిన ప్రకృతి ధర్మవాదులు లాభ సిద్ధాంతాన్ని సమర్థించిన వారిలో

ముఖ్యులు. ఆడమ్‌స్మిత్, విలియం పెట్టి లాంటి వారు కూడా ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్నులు ప్రభుత్వం వల్ల ప్రజలు పొందే లాభం మీద, ప్రజల ఆర్థిక సామార్థ్యం మీద ఆధారపడి ఉండాలని భావించారు. ప్రభుత్వ కార్యకాలాపాలు వల్ల వివిధ వస్తు సేవలు పొందుతున్న వ్యక్తులు తాము పొందుతున్న ప్రయోజనాల అనుపాతంలో ప్రభుత్వానికి సహాయం చేయటం వారి భాద్యత అని లాభ సిద్ధాంతం వివరిస్తుంది.

అనగా ప్రభుత్వ సేవల వల్ల దేశ ప్రజలకూ మొత్తం ప్రయోజనంలో ఒక వ్యక్తి ఏ మేరకు ప్రయోజనం పొందుతాడో అదే శాతంలో ప్రభుత్వ వ్యయాన్ని పన్నుల రూపంలో భరించాలని లాభ సిద్ధాంతం సారాంశం. అందువల్లనే, పన్ను చెల్లింపుదారునకూ ప్రభుత్వానికి మధ్యగల సంబందం సమాన ప్రాతిపదికలపై ఆధారపడి వుండాలనీ J.S Mill వివరించాడు. వ్యాపారులు తమ ఉత్పత్తులకూ ఏ విధంగా ధరలను నిర్ణయించి రాబట్టుకుంటారో ప్రభుత్వం కూడా తాను అందించిన వస్తు సేవలకు పన్నులు వసూలు చేయాలి. అంటే ప్రభుత్వం వల్ల ప్రజలకు ప్రయోజనం ఉన్నది కాబట్టి వారు పన్నులు చెల్లించాలి. అంటే ఎక్కువ ప్రయోజనమున్న వస్తువుకూ ఎక్కువ ధర చెల్లించినట్లుగానే ప్రభుత్వ వ్యయం నుంచి ఎక్కువ. ప్రయోజనం పొందినవారు ఎక్కువ మొత్తంలో పన్నులు చెల్లించాలి.

ప్రభుత్వం ప్రజల ఆస్తులకు రక్షణ కలుగచేస్తుంది. ఈ రక్షణ అవసరం ప్రభుత్వం రక్షణ కల్పించిన ఆస్తుల విలువకూ అనుపాతంలో ఉంటుంది. అందువల్ల లాభ సిద్ధాంతాన్ని సమర్ధించినవారు అనుపాత పన్నుల విధానాన్ని బలపరిచినట్లు తెలుస్తున్నది.

కొందరు ఆర్థిక వేత్తలు ఉపాంత ప్రయోజన భావనకు ఆధారంగా తీసుకొని లాభ సిద్ధాంతం పట్ల ఆసక్తి చూపించారు. ఉదా:- కు ప్రతి వినియోగదారుడు ప్రభుత్వసేవల వల్ల లభించిన ఉపాంత ప్రయోజనానికి సమానమైన ధర చెల్లించాలి అని మజ్జోలో అభిప్రాయం ఎమిర్ శాక్సు అనే ఆర్థికవేత్త ప్రభుత్వ సేవలనుంచి లాభం పొందకుంటే ఏ వ్యక్తి మంచి సూచిక అని వివరించాడు. ప్రభుత్వ సేవలకయ్యే వ్యయాన్ని రాబట్టడానికి వ్యక్తుల స్వచ్ఛంద సర్వసమ్మతి చర్యల ఆధారంగా పన్నులు విధించాలని నట్‌విక్సెల్ వివరించాడు.

పన్ను విధింపు లాభ సిద్ధాంతంలో ఈ క్రింది ప్రయోజనాలు ఉన్నాయి.

1) ప్రభుత్వ సేవల వల్ల పొందిన లాభాన్ని బట్టి ప్రజలపై పన్ను విధించటం న్యాయబద్దమనే ప్రమేయంపై లాభ సిద్ధాంతం ఆధారపడి ఉన్నది.

2) ప్రభుత్వ ఆదాయ వ్యయాలు రెండింటికి లాభ సిద్ధాంతం ప్రాముఖ్యమిస్తున్నది. వస్తు సేవలందించటానికి ప్రభుత్వం చేసే వ్యయం వల్ల బడ్జెటులో వ్యయం భాగం. ప్రజలపై పన్నులు విధించినట్లు అయితే బడ్జెటులోని ఆదాయ భాగం ప్రభావితమవుతుంది. ఈ విధంగా పన్నులు విధింపును ప్రభుత్వ వ్యయంతో ముడిపెట్టి వీటిని గురించి ఒకే సమయంలో ఆలోచించేటట్లు చేయడం లాభ సిద్ధాంతంలోని సుగుణం. తాము పొందిన లాభాలను గురించి ప్రజల పన్నులు చెల్లిస్తారు. ప్రభుత్వ వ్యయం వల్లనే ఈ లాభాలు సమకూరుతాయి.

3) ఆర్థిక వ్యవస్థలో పరిమితంగా ఉన్న వనరులను సమర్ధవంతంగా కేటాయించడానికి ప్రజలు చెల్లించే పన్నులు వారు ప్రభుత్వ సేవల వల్ల పొందే లాభానికి అనుగుణంగా ఉండాలని ఈ సిద్ధాంతం తెలియజేస్తుంది.

4) దేశ స్థాయిలో స్థానికంగా గాని స్పష్టంగా గుర్తించటానికి వీలైన వర్గాల ప్రయోజనం కోసం ప్రభుత్వ సేవల సరఫరా జరిగినప్పుడు లాభ సిద్ధాంతాన్ని ఆదారంగా చేసుకొని కొన్ని పన్నులు విధించవచ్చు. ఉదా:- కు ఒక ప్రాజెక్టు నిర్మాణం వల్ల లాభం పొందిన వారే దానికైన వ్యయాన్ని భరించాలి.

అయితే లాభ సిద్ధాంతంలో కొన్ని లోపాలు కూడా ఉన్నవి.

1) లాభ సిద్ధాంతంలో సిద్ధాంతపరమైన, ఆచరణ సంబంధమైన సమస్యలు తలెత్తుతాయి. ప్రభుత్వం నిర్వహించే వివిధ కార్యకలాపాల వల్ల మొత్తం సమాజం ప్రయోజనం అవుతుంది. ప్రభుత్వ సేవల నుంచి ఒక్కొక్క వ్యక్తి పొందిన ప్రయోజనాలను లెక్కించటం సాధ్యంగాదు. అందువల్ల వ్యక్తులు పొందిన ప్రయోజనల అనుపాతంలో పన్నులు వసూలు చేయటం ఆచరణ సాధ్యంగాదు.

2) ప్రభుత్వ వ్యయనికవసరమైన ద్రవ్యాన్ని సమకూర్చే సామూహిక సాధనంగా పన్నులను పరిగణించాలి. కాబట్టి ప్రజలు పొందుతున్న ప్రయోజనాల అనుపాతంలో పన్నులు వసూలు చేయటం సాధ్యంగాని పని. ఎందుకంటే ప్రయోజనాలను వ్యక్తిగతంగా విడదీయలేం.

3. ప్రభుత్వానికి, పన్ను చెల్లించే వారికి మధ్య సమాన ప్రతి ఫలం వుండాలని భావించటం విమర్శకు గురిఅయినది. ప్రాచీన ఆర్థిక వేత్తలు పన్నులు చెల్లింపుదారులకు, ప్రభుత్వానికి మధ్యనున్న సంబంధం ప్రైవేట్ కోరికలను తీర్చుకొనటంతో సమానంగ పరిగణించి పన్నులను ధరతో సమానంగా భావించారు. అయితే ప్రభుత్వం అందిస్తున్న అనేక సేవలు సామూహిక కోరికలను తృప్తిపరిచే, ఆధునిక ప్రభుత్వాలు, అందించే కొన్ని సేవలు మొత్తం సమాజ సంక్షేమానికి ఉద్దేశించినవేగాని వ్యక్తిగత ప్రయోజనానికి ఉద్దేశించినవిగావు అందువల్ల వీటికి సమాన ప్రతిఫలం ఆధారంగా వినిమయ సాధ్యంగాదు.

4) లాభ సిద్ధాంతం ఆర్థిక వ్యత్యాసాలు తొలగింపు. ఆర్థిక సుస్థిరతకు ప్రాధాన్యత ఇవ్వదు. కానీ ఆధునిక కాలంలో అభివృద్ధి ప్రణాళికల ఆశయాల్లో వీటికి ఎంతో ప్రాముఖ్యత ఇవ్వడం జరిగింది.

5)ఆధునిక శ్రేయో రాజ్యాలలో ప్రభుత్వ ఆదాయంలో అధిక భాగం పేదవారి ప్రయోజనానికి ఉపయోగించడం జరుగుతుంది. పేదవారిపై వారు పొందే ప్రయోజనం అనుపాతంలో పన్ను విధించినట్లు అయితే అది తిరోగామి పన్ను విధానం అవుతుంది. అంటే లాభ సిద్ధాంతం సమర్థించే అనుపాత పన్ను విధానం స్వభావికంగా తిరోగామి లక్షణాన్ని కలిగి వుంటుంది.

6) లాభసిద్ధాంతం ఆచరణ సాధ్యం కావాలంటే ప్రభుత్వమందించే సేవలు వ్యాపార సరళిలో వుండాలి. కాని శ్రేయోరాజ్య కార్యకాలాపాలు చాలా వరకు వ్యాపార సరళలో లాభ పేక్షతోను జరగవు. అందువల్ల పన్నులను లాభ సిద్ధాంతాన్ని దృష్టిలో వుంచుకొని విశ్లేషించటంలో హేతుబద్ధత వుండదు.

7) ప్రయోజనాల అనుపాతంలో పన్నులు చెల్లించాలనటం ఒక్కొక్కసారి హాస్యాస్పదంగా ఉంటుంది. ఉదా:- కు నిరుద్యోగ భృతి పొందిన వ్యక్తిని అందుకూ సమానమైన మొత్తాన్ని పన్ను రూపంలో చెల్లించమని కోరటం విచిత్రంగా ఉంటుంది.

ప్రభుత్వ సేవల నుంచి పొందే ప్రయోజనాన్ని అంచనా వేయటం సాధ్యంకాదనీ అందువల్ల లాభ సిద్ధాంతం ఆచరణ యోగ్యమైనదికాదనీ పై విమర్శల నుంచి గ్రహించవచ్చు.

సాధ్యమయినంత వరకు ప్రభుత్వ సేవల వల్ల వ్యక్తులు పొందే ప్రయోజనం లేదా లాభాననుసరించి పన్ను విధించాలని ఇది సాధ్యం కానప్పుడు ప్రజల ఆర్థిక సామర్థ్యాన్ని అనుసరించి పన్నులు విధించాలని ఆడమ్‌స్మిత్ రాజీమార్గాన్ని సూచించాడు.

**6.5.2 సేవా వ్యయాల సిద్ధాంతం (The cost of Sesrcice theory)** సేవా వ్యయాల సిద్ధాంతానికి లాభ సిద్ధాంతానికి దగ్గర సంబంధం మున్నది. ప్రభుత్వ సేవల నుండి తాముపొందే ప్రయోజనాలు అనుపాతంలో వ్యక్తులు పన్నులు చెల్లించాలని లాభ సిద్ధాంతం వివరించగా పన్ను చెల్లింపుదారులకూ ప్రభుత్వం చేసిన సేవలకుగాను ప్రభుత్వానికయ్యే వ్యయం పన్నుల విధింపుకూ ఆధారమని సేవా వ్యయాల సిద్ధాంతం వివరిస్తుంది. సేవా వ్యయ సిద్ధాంతాన్ని అనుసరించి ప్రభుత్వం వాణిజ్య సంస్థలాంటిదని వాన్‌హాక్ అభిప్రాయం.

ప్రభుత్వం అందించిన వస్తు సేవలకయ్యే వ్యయాన్ని వాటిని ఉపయోగించుకున్న వారి నుంచి పన్నుల రూపంలో వసూలు చేసుకోవాలి అని ఈ సిద్ధాంతం వివరిస్తుంది.

ఈ సిద్ధాంతం ప్రకారం ప్రభుత్వం నుంచి ప్రజలు ఎటువంటి ప్రయోజనాలను ఉచితంగా ఆశించరాదు. ప్రభుత్వం నుంచి ఏవరయిన ప్రయోజనం పొందితే అతడు దాని వ్యయాన్ని ప్రభుత్వానికి చెల్లించాలి. ఈ సిద్ధాంతం ప్రభుత్వం ప్రజలకు కల్పించవలసిన రక్షణ, సంక్షేమ విధులకు, ఆదాయపంపిణి సమస్యలకు ప్రాధ్యానత ఇవ్వదు. ఆ సేవా వ్యయాల సిద్ధాంతం సంతులిత బడ్జెట్ విధానాన్ని సమర్థిస్తుంది. ఈ సిద్ధాంతాన్ని అమలు చేసినట్లు అయితే అనేక వాటికి పన్నులు విధింపులో స్థానం ఉండదు. ఉదా:- ఆకస్మిక లాభాలు ఆస్తులు విలువలో పెరుగుదల వల్ల వచ్చిన లాభాలు మొదలైనవి పన్నులు పరిధిలోకిరావు. సేవా వ్యయాల సిద్ధాంతం అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ కార్యకలాపాలను తిరస్కరిస్తుంది.

సేవా వ్యయాల సిద్ధాంతం గూడా హాబ్స్, లాక్, రూసో, వ్యామ్‌ల సాంఘిక ఒప్పంద సిద్ధాంతం మీద ఆధారపడి వున్నది.

ఈ సిద్ధాంతంను అనుసరించి ప్రభుత్వ సేవలను ఉపయోగించుకోవటానికి గాని ప్రజలకు స్వేచ్ఛ ఉన్నదనే భావం కలుగుతున్నది. అయితే ఇది వాస్తవం గాదు ఆధునిక రాజ్యాలలో పౌరసత్వం గూడా వెచ్ఛికమైన విషయం గాదు అంతేగాక దేశ పౌరులందరు ప్రభుత్వ వ్యయాన్ని భరించవలసిన భాద్యత ఉన్నది.

లాభ సిద్ధాంతం లాగానే సేవావ్యయాల సిద్ధాంతం గూడా ఆచరణ యోగ్యమైంది గాదు. దీనిలో కూడ అనేక లోపాలున్నాయి.

1) సేవా వ్యయాన్ని అంచన వేసిన దాన్ని ప్రభుత్వ సేవల నుంచి ప్రయోజనం పొందిన వివిధ వ్యక్తులకూ ఆపాదించటం ఎంతో కష్టం.

2) ప్రభుత్వ సేవల నుంచి ప్రయోజనం పొందటానికి దేశ పౌరులందరు అర్హులే. అనగా ప్రభుత్వ సేవలు ఉపయోగించకుండా ఎవరినీ నిరోధించలేం. అందువల్ల సేవావ్యయాన్ని వివిధ వ్యక్తుల మధ్య పంపిణీ చేయలేం.

3) సాంఘీక రక్షణ పథకాలను ఉచితంగా గాని లేదా తక్కువ ఖరీదుకు గానీ ప్రభుత్వం అందించాలి. కాని ఈ సిద్ధాంతాదన్ని పాటిస్తే ఈ విధమైన సౌకర్యాలను ప్రజలకందించే వీలు లేదు. అందువల్ల ఆధునిక యుగంలో ఈ సిద్ధాంతం ఆచరణ యోగ్యం కాదు.

4) సేవా వ్యయాలు ఖచ్చితంగా అంచనా వేయటం సాధ్యంకాదు. ఉదా:- వనరుల ఉపయోగం అభిలషణీయంగా లేకపోతే సేవా వ్యయాలు ఎక్కువగా ఉంటాయి. ఉత్పత్తి అసమర్ధత వల్ల పెరిగిన వ్యయాన్ని పన్నులు రూపంలో చెల్లించమనటం భావ్యంగా ఉండదు.

5) పన్నులు ప్రభుత్వ నిర్వహణకు నిర్భందంగా చెల్లించేవి. ప్రభుత్వ సేవల నుంచి పొందే ప్రయోజనానికి ప్రత్యక్ష సంబంధం లేకపోవటమే పన్నుల విధింపులో ప్రత్యేక లక్షణం అని టాసింగ్ (Tasing) పేర్కొన్నాడు. చాలా మంది ఆర్థికవేత్తలు కూడా ఇదే అభిప్రాయంలో వున్నారు. అటువంటప్పుడు ప్రభుత్వ సేవా సౌకర్యాలను పొందినవారే వాటికయ్యే ఖర్చు భరించాలనటం అన్ని సందర్భాలలో సమంజసంగా వుండదు.

6) ప్రభుత్వం ఏ విధమైన సేవలను ఎంత మేరకు అందజేయాలనేది ముఖ్యమైన ప్రశ్న. సేవా వ్యయాన్ని, పన్నుల ద్వారా పౌరులు చెల్లించాలన్నప్పుడు ఎటువంటి సేవలను అందించాలనే విషయాన్ని ప్రభుత్వం తనంతట తానుగానే నిర్ణయించటం సక్రమమైన పద్ధతి అనిపించుకోదు. అయితే ప్రభుత్వ సేవలకు పౌరులిచ్చే నిజమైన ప్రాధాన్యతలను తెలుసుకోవటానికి ఆచరణలో ఎన్నో సమస్యలెదురు అవుతాయి.

పైన వివరించిన లోపాలు వున్నప్పటికి కొన్ని సందర్భాలలో సేవా వ్యయాల సిద్ధాంతం ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక సేవను అందించినపుడు దానివల్ల ప్రయోజనం పొందేవారి నుంచి దాని ఖర్చును తిరిగి రాబట్టుకొవటానికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుంది. తంతి తపాల మంచినీటి సప్లయ్, రవాణా సదుపాయాలు, విద్యుచ్ఛక్తి మొదలైనవి. ఉదాహరణలు. అయితే ప్రభుత్వం సప్లయ్ చేసే సాంఘిక వస్తు సేవల విషయాలలోను, సామూహిక వాంఛలను సంతృప్తి పరచటానికి అందజేసే వస్తువుల విషయంలోను సేవా వ్యయాల సిద్ధాంతంను వర్తింపజేయలేం.

సేవా ప్రయోజనాలను వ్యక్తుల మధ్య శాస్త్రీయంగా కేటాయించటానికి వీలులేనప్పుడు గాని ఈ సిద్ధాంతం ఆధారంగా పన్నులు విధించాలనటం అమోదయోగ్యంగా ఉండదు. సమాన ప్రతిఫలం ఆశించకుండానే చేసే నిర్భందపన్ను అనే పన్ను నిర్వచనానికి సేవా వ్యయాల సిద్ధాంతం వ్యతిరేకంగా ఉన్నది.

### 6.5.3 పన్ను చెల్లింపు సామర్థ్య సిద్ధాంతము (Ability to Pay theory of taxation)

పన్ను చెల్లింపు సామర్థ్య సిద్ధాంతం లాభ సిద్ధాంతం కంటే పురాతనమైనది. 16వ శతాబ్దంలోను జాన్ బోటిన్ ప్రజల ఆర్థిక సామర్ధ్యానికి అనుగుణంగా పన్నులు విధించాలని సూచించాడు. 18వ శతాబ్దంలో ఆడమ్‌స్మిత్ కూడా చెల్లించే వారి సామర్ధ్యాన్ని బట్టి పన్ను విధించాలని తెలియజేసాడు. చట్టం దృష్టిలో అందరు సమానులే అన్న సూత్రాన్ని పన్నులు విధింపులో కూడా ననుసరించాలని J.S Mill వివరించాడు. సిజ్‌విక్, ఎజ్‌వర్స్ పిగూ దాదాపు ఇదే అభిప్రాయం చెప్పారు.

పన్ను చెల్లింపు సామార్థ్యాన్ని సిద్ధాంతం పూర్తిగా నిర్వచననుసరించి వుంటుంది. సమాన ప్రతిఫలాన్ని ఆశించకుండా ప్రభుత్వానికి పన్నులు చెల్లించటం పౌరులందరికి సమిష్టి బాధ్యత, పౌరుల మధ్య న్యాయం సమానత్వలను సాధించటానికి పన్ను భారాన్ని పౌరులందరు పంచుకోవాలనే ఆలోచనా సామర్థ్య సిద్ధాంత రూపకల్పనకూ దారితీసింది. చెల్లించే వారి సామర్థ్యాన్ని అనుసరించి పన్నులు విధించాలని సిద్ధాంతం తెలుపుతున్నది. "ప్రతి రాజ్యంలోని పౌరులు వారి శక్తి మేరకు ప్రభుత్వ నిర్వహణాకవసరమైన ద్రవ్యాన్ని చెల్లించాలని ఆడమ్‌స్మిత్ సమతా నియమం గూడా వివరిస్తున్నది.

పన్ను విధింపులో న్యాయం సమతా ఉండాలంటే పన్నులు ఆర్థిక సామార్థ్యాన్ని బట్టి విధించాలనీ సమాన స్థాయిలో ఉన్న వారిని సమానంగా పరిగణించాలని సిద్ధాంత సారాంశం. అయితే ఆర్థిక సామర్థ్యానికి ఎంత సూచికలనే విషయంలో ఆర్థికవేత్తల మధ్య ఏకాభిప్రాయం లేదు. పన్ను విధింపు వల్ల త్యాగం సమానం కావాలని కొందరు దీన్నే "ఆత్మ శ్రయా త్యాగ సిద్ధాంతం" అని అంటారు. పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని సూచించే బహిర్గత సూచికలను ఆధారంగా తీసుకురావాలని మరి కొందరు దీని పరాశ్రయ సూచిక సిద్ధాంతం అని అంటారు.

### 6.5.3.1 పన్ను చెల్లింపు సామర్థ్యం - ఆత్మశ్రయ సూచికలు త్యాగ సిద్ధాంతం

J.S Mill కాలం నుండి చెల్లింపు సామర్థ్యం అంటే సమత్యాగంగా భావించడం జరుగుతున్నది. ఆదాయ ప్రయోజనం అందరికి ఒకే విధంగా ఉంటుందని భావించినట్లు అయితే సమాన ఆదాయాన్ని పొందే వ్యక్తులు సమాన చెల్లింపు సామార్థ్యంను కలిగి వుంటారు. కాబట్టి వారు సమాన మొత్తంలో పన్ను చెల్లించాలన్న సమతా సూత్రాన్ని అర్థం చేసుకోవటానికి క్షితిజ సమాంతర సమత్వం (Horizontal Equity). క్షితిజ లంబ సమత్వం (Vertical Equity) అనే రెండు పరిస్థితులను అర్థం చేసుకోవాలి.

సమాన స్థాయిలో ఉన్న వారందరిపైన సమానంగా పన్నులు విధించాలి అనేది క్షితిజ లంబ సమత్వానికి దారి తీస్తుంది. ఈ రెండింటిలో క్షితిజ సమాంతర సమత్వం తక్కువ విమర్శకు గురైంది. సమానత్వాన్ని సమాన ఆదాయ నష్టం దృష్ట్యా గాకుంటే సమాన ప్రయోజనం దృష్ట్యా అణ్వాయింపు చేసినట్లు అయితే క్షితిజ సమాంతర సమత్వం రెండు ఊహలపై ఆధారపడి ఉంటుంది.

1, ఆదాయ ప్రయోజనాన్ని సంఖ్య రూపంలో అంచనా వేయవచ్చు.

2, ప్రజలందరికి ఆదాయ ప్రయోజన పట్టిక ఒకే విధంగా ఉంటుంది.

అయితే క్షితిజ లంబ సమత్వాన్ని ఏ విధంగా సాధించగలమనేది ఆదాయ ప్రయోజన రేఖ ఆకారాన్ని బట్టి. సమత్యాగ నిర్వచనాన్ని బట్టి వుంటుంది. సమత్యాగాన్ని మూడు విధాలుగా వివరించవచ్చు. అవి 1) సమ నిరపేక్ష త్యాగం 2) సమానుపాత త్యాగం 3) సమోపాంత త్యాగం. ఆదాయలు స్థిర సమానత (constort equility of Incomes) అనే భావన ద్వారా మరొక విధంగా కూడా 'డాల్టన్' సమత్యాగాన్ని నిర్వచించాడు.

అనగా పన్ను చెల్లింపుదారుల సాపేక్ష ఆదాయస్థితి పన్నులు చెల్లించటానికి ముందు పన్ను చెల్లించిన తర్వాత కూడా ఒకే విధంగా ఉండాలన్న అర్థం పన్ను చెల్లించే వ్యక్తి ఆదాయం మారినప్పుడు ఆదాయం ఉపాంత ప్రయోజనాన్ని ఏ విధంగా లెక్కించాలి, అనేది ఒక సమస్య. వ్యక్తుల ఆదాయ ఉపాంత ప్రయోజనాలను పొల్చటం మరింత కష్టం ఆదాయ ఉపాంత ప్రయోజనాన్ని ఏ విధంగా లెక్కించాలనే సమస్యపై ఆర్థిక వేత్తలలో ఏకాభిప్రాయం లోపించినప్పటికి పన్ను చెల్లింపుదారుల ఆదాయ ప్రయోజన పట్టిక ఒకే విధంగా ఉంటుందనే ప్రమేయం అంగీకరించడమైంది. దాని ద్వారా సమాన త్యాగం వివిధ విదరణలను విశ్లేషించవచ్చు. పైన వివరించిన విధంగా మూడు విధాలైన సమత్యాగ వివరణలను మనం ఇప్పుడు తెలుసుకుందాం.

### 6.5.3.2 సమ నిరపేక్ష త్యాగం (Equal Absoluere Saerifice)

సమత్యాగమంటే నిరపేక్ష త్యాగమని మార్షల్ మొదలైనవారు భావించారు. వివిధ పన్ను చెల్లింపుదారుల్లో ప్రయోజనం నష్టం సమానంగా ఉండాలన్న సమనిరపేక్ష త్యాగ సూత్రం వివరిస్తుంది. ఈ సూత్రాననుసరించి సమాజంలోని ప్రతి వ్యక్తి పన్ను రూపంలో కొంత మొత్తాన్ని

చెల్లించాలి. ఎవరికీ మినహాయింపు ఉండదు. ఆదాయ ఉపాంత ప్రయోజనం ఆదాయస్థాయిపై ఆధారపడి ఉంటుంది కాబట్టి వివిధ ఆదాయలున్న పన్ను చెల్లింపుదారులందురు సమానంగాదు. ఎక్కువ ఆదాయాన్ని పొందే వ్యక్తి ఎక్కువ పన్ను చెల్లించాలి. అదే విధంగా తక్కువ ఆదాయం గల వ్యక్తులు తక్కువ పన్ను చెల్లించాలి. అయినప్పటికి పన్ను చెల్లించటం వల్ల చేసిన త్యాగం లేదా ప్రయోజన నష్టం అందరికి ఒకే విధంగా ఉంటుంది.

### 6.5.3.3 సమానుపాత త్యాగము (Equal Proportional Sacrifice)

పన్ను చెల్లించటం వల్ల కోల్పోయిన ప్రయోజనం పన్ను చెల్లింపుదారుల ఆదాయానికి అనుపాతంలో ఉండాలని సమానుపాత త్యాగ సిద్ధాంత సారాంశము "పన్ను చెల్లింపుదారుని మీద పడిన భారం అతడి ఆదాయం నుండి వచ్చే ఆర్థిక ప్రయోజనం అనుపాతంలో ఉండాలని' ' డాల్టన్ పేర్కొన్నాడు. సమానుపాత త్యాగసూత్రం ప్రకారం పన్ను చెల్లింపుదారులు త్యాగం, ఆదాయం, నిష్పత్తి పన్ను చెల్లింపుదారులందరికి సమానంగా ఉండి దీని విలువ ఒకటి అవుతుంది. ఎక్కువ ఆదాయం గల వ్యక్తులు ఎక్కువ మొత్తంలో పన్ను చెల్లించనప్పటికి త్యాగం, ఆదాయాల నిష్పత్తి అందరికి సమానంగానే ఉంటుంది. సమానుపాత త్యాగ సూత్రాన్ని ఈ క్రింది విధంగా చూపవచ్చు. X,Y,Z అనే వ్యక్తులు పొందే తృప్తిని వారి ఆదాయం ద్వారా కొలవచ్చును అనుకుందాం. అపుడు X,Y,Z లపై పన్ను విధింపు ఈ క్రింది వివరించినట్లుగా ఉండాలి.

$$\frac{X\text{త్యాగం}}{Y\text{త్యాగం}} = \frac{Y\text{ త్యాగం}}{Y\text{ త్యాగం}} = \frac{Z\text{ త్యాగం}}{Z\text{ త్యాగం}}$$

అనగా పన్ను చెల్లింపుదారుల త్యాగం, వారి ఆదాయంలో ఒక స్థిర నిష్పత్తిలో ఉండాలని ఈ సూత్రం తెలుపుతుంది. సమానుపాత త్యాగ సూత్రాన్ని అమలు పరిస్తే పన్నురేటు నిర్మాణం ఏ విధంగా ఉంటుందనే ప్రశ్న జనిస్తుంది. ఆదాయ ఉపాంత ప్రయోజనం స్థిరంగా వుంటే ఈ సూత్రం అనుపాత పన్ను విధానానికి దారి తీస్తుంది. కాని ఆదాయ ఉపాంత ప్రయోజనం క్షీణిస్తుంటే ఉపాంత, సగటు ప్రయోజనాల సాపేక్ష బదిలీ శాతాలను తెలుసుకోవాలి. ఉపాంత సగటు ప్రయోజనాల తగ్గుదల రేట్లు సమానంగా వుంటే అనుపాత పద్ధతిని ఈ సూత్రం వివరిస్తుంది. అట్లా గకుండా సగటు ప్రయోజనం కంటే ఉపాంత ప్రయోజనం త్వరగా క్షీణిస్తుంటే ఈ లక్షణాన్ని తృప్తిపరచటానికి పురోగామి పన్ను విధానం తోడ్పడుతుంది. ఆ విధంగానే సగటు ప్రయోజనం కంటే ఉపాంత ప్రయోజనం తక్కువ రేటులో క్షీణిస్తుంటే ఈ సూత్రాన్నే తృప్తిపరచటానికి తిరోగామి పన్నుల విధానం అవసరం.

### 6.5.3.4 సమోపాంత త్యాగం లేదా కనిష్ఠ సమిష్ఠిత్యాగం (Equal Marginal Sacrifice (or) Best Aggregate Sacrifice)

ప్రతి పన్ను చెల్లింపుదారుని ఉపాంత త్యాగం సమానంగా ఉండేటట్లు పన్ను భారాన్ని పంపిణీ చేయాలన్న సమోపాంత త్యాగ సూత్రం వివరిస్తుంది. ఈ విధమైన పన్ను విధానం ప్రజా శ్రేయస్సుకూ తోడ్పడుతుందని ఎడ్జ్‌వర్త్ పిగూలు భావించారు. పన్ను చెల్లింపుదారుల ఉపాంత త్యాగం సమానంగా ఉంటే సమాజం మొత్తం త్యాగం కనిష్ఠంగా ఉంటుంది.

ఉపాంత ఆదాయాల వల్ల వ్యక్తులు పొందే ప్రయోజనం క్షీణిస్తుంది. కాబట్టి వ్యక్తుల ఉపాంత ప్రయోజనాలు సమానమైనప్పుడు అంటే వ్యక్తుల ఆదాయాలు సమానమయినపుడు ప్రజా శ్రేయస్సు గరిష్ఠమవుతుందని ఎడ్జ్‌వర్త్ వివరించాడు. వ్యక్తులందరూ నిర్ణీత ఆదాయం నుంచి నిర్ణీత ఉపాంత ప్రయోజనం పొందగలరనే ప్రమేయం దీనికి ఆధారం.

సమిష్ఠి త్యాగం కనిష్ఠంగా ఉన్నపుడే సమిష్ఠి శ్రేయస్సు గరిష్ఠంగా ఉంటుందని పిగూ వివరించాడు. పన్ను చెల్లించటం వల్ల ప్రజలు చేయవలసిన త్యాగం సాధ్యమయినంత తక్కువగా ఉండేటట్లు ప్రభుత్వం శ్రద్ధ వహించాలి. పన్నులు చెల్లించిన తరువాత వారు పొందే నికర తృప్తి సమానంగా ఉంటుందని చెప్పలేం. అందువల్లనే పిగూ కనిష్ఠ సమిష్ఠి త్యాగ సిద్ధాంతాన్ని ప్రతి పాదించాడు.

పన్ను చెల్లించేవారు నిర్బంధంగా చేయవలసిన ఉపాంత త్యాగం సమానంగా ఉండేటట్లు చర్యలు తీసుకుంటే సమిష్ఠి త్యాగం కనిష్ఠంగాను ఉండాలన్న లక్ష్యం నెరవేరుతుంది ఈ లక్ష్య సాధనకు పురోగామి పన్నులు తోడ్పడతాయి. పన్ను చెల్లింపుదారుల ఉపాంత త్యాగం

సమానంగా ఉంటే సమిష్టి త్యాగం కనిష్ఠంగా ఉంటుంది. ఎక్కువ ఆదాయం ఉన్న వారికి ఆదాయ ఉపాంత ప్రయోజనం తక్కువగా ఉంటుంది. కాబట్టి ఎక్కువ ఆదాయాలు గల వారిపై ఎక్కువ రేటులో పన్ను విధించాలి.

పన్ను రూపంలో చెల్లించిన చివరి రూపాయి వల్ల ఏర్పడిన త్యాగం పన్ను చెల్లింపు దారులందరికి సమానమైనప్పుడు సమిష్టి త్యాగం కనిష్ఠంగా ఉంటుంది. ప్రజలందరిపై పన్ను విధించినప్పుడు ఉండే మొత్తం త్యాగం కంటే ధనవంతులపైన ఎక్కువగా పన్నులు విధించినప్పుడు ఉండే మొత్తం త్యాగం తక్కువగా ఉంటుంది.

ఈ విధంగా సమోపాంత త్యాగసూత్రం సమత కంటే సామర్ధ్యానికి ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఇస్తుంది. త్యాగం మూడు భావనలను డాల్టన్ ఈ విధంగా వివరించాడు. సమత్యాగ సూత్రం ప్రకారం పన్ను చెల్లింపుదారుల నిజభారం సమానంగా ఉండేటట్లు పన్నులు ప్రత్యక్ష ద్రవ్యభారం పంపిణీ జరగాలి. అనుపాత త్యాగ సూత్రం ప్రకారం ప్రతి చెల్లింపుదారుని ప్రత్యక్ష నిజభారం అతడు ఆదాయం నుంచి పొందిన ఆర్థిక శ్రేయస్సు అనుపాతంలో ఉండాలి. కనిష్ఠ త్యాగ సూత్రం ప్రకారం పన్ను చెల్లింపుదారుల పైన ఉండే మొత్తం నిజభారం సాధ్యమయినంత తక్కువగా ఉండాలి.

పైన వివరించిన మూడు రకాల త్యాగ సూత్రాలలోను సమోపాంత త్యాగ సూత్రాన్ని చాలా మంది అంగీకరించారు. అయితే త్యాగం అనేది ఆత్మా శ్రేయమైన భావనవటం వల్ల ఆదాయ ఉపాంత ప్రయోజన రేఖను అంచనా వేయటం కష్టం. పన్ను చెల్లింపు సామర్ధ్యాన్ని త్యాగ రూపంలో తెలిసినపుడూ అది స్పష్టంగా ఉండదు. కనుకనే చెల్లింపు సామార్ధాన్ని పరాశ్రయ పద్ధతిలో వెల్లడించవలసి వచ్చింది.

## 6.5.3.5 చెల్లింపు సామర్ధ్యం - పరాశ్రయ సూచికలు

ఆత్మ శ్రయంశమైన త్యాగాన్ని కొలవటం సాధ్యంగాదు అందువల్ల పన్ను చెల్లింపు సామర్ధ్యాన్ని నిర్ణయించటానికి త్యాగంపై ఆధారపడటం మంచిదిగాదని భావించి పరాశ్రయ సూచికలు లేదా బహిర్గత సూచికలను కొందరు ప్రతిపాదించారు. ప్రాచీన కాలంలో పన్ను చెల్లింపు సామర్ధ్యాన్ని ఆస్థితో ముడిపెట్టాడు. ఎక్కువ ఆస్థిగల వారికి ఎక్కువ పన్ను చెల్లింపు సామర్ధ్యమున్నట్లుగా భావించారు. క్రమేపి సమాజ పురోగతిలో ప్రాధాన్యత ఆస్థి నుంచి ఆదాయం వైపుకూ మారింది. అడమ్‌స్మిత్ ఆదాయం ఆదారంగా పన్ను చెల్లింపు సామర్ధ్య నియమాన్ని సూత్రీకరించాడు. ఇటీవల మరికొందరు ఆర్థిక వేత్తలు వినియోగ వ్యయాన్ని చెల్లింపు సామర్ధ్యానికి సూచికగా భావిస్తున్నారు. పరాశ్రయ సూచికలను గురించి విపులంగా పరిశీలిద్దాం.

**1) ఆస్థి:** పూర్వ కాలం నుంచి వ్యక్తులకూ ఉన్న ఆస్థిని పన్ను చెల్లింపు సామర్ధ్యానికి సూచికగా భావిస్తున్నారు. అయితే ఆస్థి సరైన సూచికగాదు, ఎందుకంటే ఆస్థి విలువను మదింపు వేయటంలో సమస్య లెదురువుతాయి. ఒకే విధమైన ఆస్థికి వివిధ ప్రాంతాలలో ధరలుండవచ్చు. కొన్ని ఆస్తుల వల్ల ఆదాయం ఉండకపోవచ్చు కొంత మందికి ఆదాయమున్నప్పటికి ఆస్తి లేకపోవచ్చు. అతడు ఆస్థి పన్ను పరిధిలోకి రాకూడదు.

**2) ఆదాయం:** పన్ను చెల్లింపు సామర్ధ్యానికి ఆదాయాన్ని సూచికగా తీసుకోవచ్చు మిగిలిన అన్ని పన్నులను రద్దు చేసి ఆదాయం పన్నును మాత్రమే విధిస్తే చాలని హెన్రీ సైమన్సు (Henry Simons) పేర్కొన్నాడు. ఇతర ఆస్తులను విధించినప్పటికి అవి గూడ ఆదాయం నుండి చెల్లించడం జరుగుతుందనీ అడమ్ వివరించాడు. ఆదాయాన్ని పన్ను చెల్లింపు సామర్ధ్యం సూచికగా తీసుకోన్నప్పుడు, జీతాలు, డిబెంచర్ల, ఆస్తుల నుంచి వచ్చే ఆదాయం మొదలయిన అన్ని మార్గాల నుంచి వచ్చే ఆదాయాలను పరిగణలోనికి తీసుకురావాలి. ధనికులపై ఎక్కువ భారాన్ని మోపే పురోగామి పన్నులను అనేక మంది ఆర్థిక వేత్తలు సమర్థించారు. కాని ఈ క్రింది కారణాల వల్ల పన్ను చెల్లింపు సామర్ధ్యం సూచికగా ఆదాయాన్ని తీసుకురాదని కొంతమంది భావిస్తున్నారు.

A) ఆర్జిత ఆదాయానికి, అనార్జిత ఆదాయానికి గల తేడాను తీసుకోవాలి. ఒక వ్యక్తి ఆదాయం ఆస్థినుంచి వచ్చినదో, ఉపాధి నుంచి లభించినదో తెలుసుకోవాలి. పన్నుల విధానంలో సమతను సాధించటానికి ఆస్థినుంచి వచ్చిన ఆదాయంపై ఉపాధి నుంచి వచ్చిన ఆదాయం కంటే ఎక్కువ రేటులో విధించాలి.

B) చెల్లింపు సామర్థ్యంలో ఒక వ్యక్తి కుటుంబ పరిస్థితులను బట్టి గూడా వుంటుంది. ఒక వ్యక్తి ఎక్కువ ఆదాయం వచ్చినప్పటికి అతనిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉండవచ్చు. అంటే కుటుంబంలో ఎక్కువ మంది సభ్యులుగల వానికంటే తక్కువ మంది కుటుంబ సభ్యులు గల వానిపై ఎక్కువ రేటులో విధించాలి.

C) మొత్తం ఆదాయమంతటిపై పన్ను విధించకుండా ప్రస్తుత జీవణ ప్రమాణాన్ని బట్టి కొంత కనీస ఆదాయాన్ని పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలి.

D) పురోగామి సూత్రం ఆదాయం ఆధారంగానే వర్తింప చేసినప్పటికి రేటు నిర్మాణం ఎంతో అసమంజసంగా ఉంటున్నది.

**3) వ్యయం:** నికలస్ కాల్డర్ పన్ను విధింపునకూ వ్యయం సూచికగా ఉండాలని సూచించాడు. పన్ను చెల్లింపు సామర్థ్యానికి ఆదాయం మంచి సూచిక కాదనీ వినియోగ వ్యయం చెల్లింపు సామర్థ్యానికి సరియైన సూచిక అని కాల్డర్ అభిప్రాయం. నిజమైన పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని బట్టి ఆదాయ పన్ను, విధించకపోవటం వల్ల దానిలో అవినీతి, పన్ను ఎగవేత ఉంటుంది. అందువల్ల ఆదాయాన్ని ఆధారంగా తీసుకోరాదని కాల్డర్ వాదన. అంతేగాక ఆదాయపు పన్ను పని, పొదుపును నిరుత్సాహపరిచి ప్రయివేటు మూలధన సంచయనాన్ని దెబ్బ తీస్తుంది. అందువల్ల పన్ను చెల్లింపు సామర్థ్యానికి వినియోగవ్యయాన్ని సూచికగా కాల్డర్ సమర్థించాడు.

అయితే వినియోగ వ్యయాన్ని పన్ను చెల్లింపు సామర్థ్యానికి సూచికగా తీసుకొని వ్యయంపై పన్ను విధిస్తే పన్ను భారం ధనికుల కంటే పేదవారిపైనే ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే వినియోగ ప్రవృత్తి పేదవారికే ఎక్కువగా వుంటుంది. కాబట్టి వ్యయంపై పన్ను తిరోగామి పన్నుగా ఉంటుంది. కుటుంబ పరిస్థితుల వల్ల ఒక వ్యక్తి ఆదాయం తక్కువగా ఉన్నప్పటికి ఎక్కువ వ్యయం చేయవలసి ఉంటుంది. అటువంటప్పుడు అతనికి పన్ను చెల్లింపు సామర్థ్యం ఎక్కువగా ఉన్నదని భావించటం సమంజసం గాదు.

పైన వివరించిన విధంగా పరాశ్రయ సూచికలు గుండా లోపరహితమైనవివేమిగాదు. కనుక పన్నుల వ్యవస్థ నిర్మాణంలో ఆస్థి, ఆదాయం, వినియోగ వ్యయం ఆధారంగా విధించే పన్నులు ఉండాలి. అటువంటి అపుడే సమతా సూత్రాన్ని సంతృప్తి పరిచే పన్నుల విధానం రూపొందుతుంది. పన్ను విధాన్నంతటిని పరగణలోనికి తీసుకోని పన్ను భారాన్ని నిర్ణయించాలిగాని విడిగా ప్రతి పన్నును అసమానత ఇంకోక పన్ను ద్వారా సరిదిద్దవచ్చు. పన్నుల విధానంలో సమానత్వం గురించి అనేక అభిప్రాయాలు ఉన్నాయి. దీన్ని ఆచరించటం కష్టము. అందువల్లనే సమత్వం ఒక క్లిష్టమైన యజమానురాలనీ, వేదాంతము దాన్ని అనుసరించాలి. రాజకీయ నాయకులు మాత్రము దీన్ని జాగ్రత్తగా పరిశీలించాలన్న డాల్టన్ అభిప్రాయంతో మనం ఏకీభవించవలసి ఉంటుంది.

ఏమయినప్పటికి పన్ను చెల్లింపు సామర్థ్యానికి ఆదాయమే మేలైన సూచికగా అనేక దేశాలలో భావిస్తున్నారు. వ్యష్టి ఆదాయపు పన్ను చాలా దేశాలలో న్యాయమైనదిగా భావిస్తున్నారు. ఒక నిర్ణీత ఆదాయ పరిమాణాన్ని, ఆదాయ పన్ను పరిమితి నుంచి మినహాయించడం రేటు నిర్మాణం హేతుబద్ధంగా ఉండటం, పొదుపు, పెట్టుబడులను ప్రోత్సయించడానికి చర్యలు తీసుకోవడం ద్వారా ఆదాయ పన్నులోని లోపాలను తొలగించవచ్చు.

## 6.6 ముగింపు:-

వివిధ కార్యకలాపాలను నిర్వహించటానికి, ప్రభుత్వానికి ద్రవ్య వనరులు అవసరం. ప్రభుత్వ విత్త పరిశ్రమలో పన్నుల విధింపుకు ప్రాధాన్యత కలిగివుంది. ప్రభుత్వ ఆదాయ మార్గాలలో పన్నులు అతి ముఖ్యమైనవి. ఈ సందర్భంలో పన్ను విధింపు నియమాలు దాని యొక్క ప్రభావాలు, సిద్ధాంతాలు ఎంతో ప్రాధాన్యతను అనుకరించుకున్నాయి. అదే విధంగా పన్నుల భారాన్ని ఏ విధంగా పంపిణి చేయాలో తెలియజేయటంతో లాభ సిద్ధాంతం, సేవ వ్యయ సిద్ధాంతం, చెల్లింపు సామర్థ్య సిద్ధాంతం అత్యంత ముఖ్యమైనది. పన్నుల విధానంలోని సమతను గూర్చి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వీటిన్నింటిని ఆచరణలో పెట్టడం కష్టం. అందుకే సమత క్లిష్టమైన యజమానురాలు, వేదాలను అనుసరించాలి. రాజకీయ నాయకులు పరిశీలించాలి అనే డాల్టన్ మాటలు అనుసరించక తప్పదు.

## 6.7 ముఖ్యమైన పదాలు:-

| | | |
|---|---|---|
| Tax Canons | : | పన్ను నియమాలు |
| Canon of Convenience | : | సౌకర్య నియమాలు |
| Effects of taxation | : | పన్ను ప్రభావాలు |
| Ability to Save and the Investment | : | పొదుపు పెట్టుబడుల సామర్థ్యం |
| Desire to work, save and invest | : | పని, పొదుపు, పెట్టుబడి పెట్టాలనే కోరిక |
| Benefit theory | : | లాభ సిద్ధాంతం |
| Taxable capacity | : | పన్ను చెల్లింపు సామర్థ్యం |
| Law of diminishing Utility theory | : | క్షీణోపాంత ప్రయోజన సిద్ధాంతం |
| Elasticity of tax | : | పన్ను వ్యాకోచత్వం |

## 6.8 స్వీయ అవగాహనకు గల ప్రశ్నలు:-

**I. ఈ క్రింది ప్రశ్నలకు సమగ్రమైన సమాధానాలు రాయండి.**

1) ఉత్పత్తి, పంపిణీలపై పన్నులు ప్రభావాలను చర్చించండి?

2) పన్ను విధింపు సిద్ధాంతాలను తెలపండి?

3) పన్ను నియమాలను వివరించండి?

II) ఈ క్రింది ప్రశ్నలకు సంక్షిప్త సమాధానాలు ఇవ్వండి.

1) మంచి పన్నులకు వుండవలసిన లక్షణాలు?

2) సేవ వ్యయ సిద్ధాంతం

3) పన్ను చెల్లింపు సామర్థ్యం

4) ఆడమ్‌స్మిత్ పన్ను నియమాలను తెలపండి?

## 6.9 చదవవలసిన గ్రంథాలు:-

| | | |
|---|---|---|
| 1) B.P. Thyagi | : | Public Finance |
| 2) H.L. Bhatia | : | Public Finance |
| 3) M.C Vaish, H.S. Agarwal | : | Public Finance (Faith Education) |
| 4) Manker. Sarma | : | Public Finance (Theory of Practice) |

ఆచార్య జి. చంద్రశేఖరరావు

పాఠం - 7

# పన్ను భారం మరియు బదలాయింపు

## పాఠ్య నిర్మాణ క్రమం

7.1 పరిచయం

7.2 పన్నుభారానికి నిర్వచనాలు

7.3 సార్థకమైన భారము మరియు వ్యవహారికమైన భారము

7.4 పన్ను తాకిడి మరియు భారం

7.5 పన్నుల బదలాయింపు

7.6 బదలాయింపుకు దోహదం చేసే అంశాలు

7.7 పన్ను మూలధనీకరణ పద్ధతి

7.8 పన్ను బదలాయింపు సిద్ధాంతాలు

7.9 డిమాండ్ సప్లైల వ్యాకోచత్వం

7.10 వ్యయ స్థితి గతులను బట్టి

7.11 మార్కెట్ స్వభావం పన్ను బదలాయింపు

7.12 కొన్ని ముఖ్యమైన పన్నుల భారం బదలాయింపు

7.13 ముగింపు

7.14 ముఖ్య పదాలు

7.15 స్వీయ అవగాహనకు ప్రశ్నలు

7.16 చదవవలసిన గ్రంథాలు.

## 7.1 పరిచయం :

అనేక పన్నులు ఒకరి మీద విధిస్తే పన్ను వారే చెల్లిస్తే అది తరువాత వేరొకరికి బదలాయించుటకు వీలు ఉంటే దానిని పన్ను బదలాయింపు అంటారు. పన్ను విధింపు అనేది సమాజం మీద భారాలను కల్గిస్తుంది. పన్ను బదలాయింపు (ద్రవ్యభారం) ఒకరి మీద నుంచి వేరొకరికి బదలాయిస్తే వారి వ్యయాల ఆదాయం తగ్గుతుంది. అంటే పన్ను విధింపు ఒకరి మీద, చెల్లింపు ఎవరైతే చేస్తారో అంటే వేరొకరికి మీద వారే చిట్టచివరకు పన్నుభారాన్ని భరించవలసి ఉంటుంది. కాబట్టి ప్రాథమిక విధింపుదారుని ఆదాయంలో ఎలాంటి మార్పురాదు. అయితే ఈ బదలాయింపు కొన్ని పరిస్థితులలో వీలు అవుతుంది. ప్రత్యేకించి - పరోక్ష పన్నులలో పన్నుభారము అనగా చిట్టచివరకు ప్రత్యక్ష ద్రవ్యభారాన్ని భరించడం. ఉదా॥ కి రమేష్ అనే వ్యక్తి మీద పన్ను విధిస్తే అంతమేరకు అతని యొక్క వ్యయాల ఆదాయం పన్ను చెల్లింపు రూపంలో తగ్గుతుంది. అంటే పన్ను భారాన్ని రమేష్ భరించాడు. అయితే రమేష్ దాన్ని విజయవంతంగా మహేష్‌కు బదలాయిస్తే మహేష్ ఆ ద్రవ్యభారాన్ని భరిస్తాడు కాబట్టి అంతమేరకు అతని యొక్క వ్యయాల ఆదాయం తక్షణమే తగ్గిపోతుంది కాబట్టి భారాన్ని మహేష్ భరించాడు. అయితే మహేష్ కూడా విజయవంతముగా ఆ భారాన్ని సురేష్‌కి బదలాయిస్తే సురేష్ వ్యయాల ఆదాయం తగ్గిపోతుంది. సహజంగా ఇది పరోక్ష పన్నులలో జరుగుతుంది ఉదా॥ కి ఎక్సైజ్ సుఃఖాలు వస్తువులు మీద విధిస్తే తయారీదారుడు

భరించాలి అయితే చెల్లింపుదారుడు ఆ భారాన్ని టోకువర్తకుడికి అతను చిల్లర వ్యాపారికి బదలాయిస్తాడు. అయితే చిట్టచివరకు వినియోగదారుడు అధిక ధరల రూపములో ద్రవ్యభారాన్ని భరిస్తాడు. కాబట్టి వినియోగదారుని వ్యయర్హా ఆదాయము తగ్గిపోతుంది. అంతేతప్ప టోకు వర్తకుడుకాని చిల్లర వర్తకుడు కాని ఆ ద్రవ్యభారాన్ని భరిస్తాడు.

## 7.2 పన్ను భారానికి నిర్వచనాలు :

ప్రముఖుల నిర్వచనాలు పన్నుల భారానికి సంబంధించి అనేకం ఉన్నవి వాటిలో కొన్ని ముఖ్యమైనవి దిగువ పేర్కొనడమైనది.

డాల్టన్ :- ఎవరైతే పన్ను యొక్క ప్రత్యక్ష ద్రవ్యభారాన్ని చెల్లిస్తారో వారి భరింపునే పన్నుభారం అంటారు అయితే డాల్టన్ ప్రత్యక్ష, పరోక్ష ద్రవ్యభారాలను వివరించాడు.ప్రత్యక్ష ద్రవ్యభారం ఆర్థిక సంక్షేమాన్ని తెలియజేసిందిగాను, పరోక్ష ద్రవ్యభారం వినియోగాన్ని, పన్ను చెల్లింపు తరువాత తగ్గించుటగా వివరించాడు. పన్ను యొక్క తొలి, మలి భారాలను వివరించాడు.

పి.టేలర్ :- పన్ను చెల్లించుటలో ప్రత్యక్ష ఇబ్బందులే (డాలరు మీద రూపములో) పన్నుభారం టేలర్ పన్ను బదలాయింపులో, భారం ఇంకొకరికి కల్గిస్తుందని వివరించెను.

సెలిగ్‌మెన్ :- చిట్టచివరకు పన్ను ప్రత్యక్ష ద్రవ్యభారాన్ని ఎవరైతే భరిస్తారో అదే పన్నుయొక్క భారం అవుతుంది. సెలిగ్‌మన్ పన్నుభారాన్ని వత్తిడిని వేరుచేసి చూపెను. భారము అనేది పన్ను చెల్లింపుదారుని యొక్క చిట్టచివరి ముగింపు అంశం. వత్తిడి అనేది ప్రాథమిక చెల్లింపు దారుడికి భారము అనేది చిట్టచివరి చెల్లింపుదారుడికి సంబందించెనని సెలిగ్‌మెన్ వివరించెను. ॥॥....

## 7.3 వ్యవహారికమైన భారము మరియు సార్థకమైన భారం:

**7.3.1 వ్యవహారికమైన భారము :-** ప్రముఖ ఆర్థికవేత్త అయినటువంటి శ్రీమతి వాక్స్ పన్నుభారాన్ని వ్యవహారికమైన భారము మరియు సాపేక్ష భారముగా వివరించింది. వ్యవహారికమైన భారాన్ని ఆమె డాల్టన్ నిర్వచించిన ప్రత్యక్ష ద్రవ్యభారముగానే వివరించెను. వ్యవహారికమైన భారాన్ని సామూహిక ప్రయోజనాల కోసం ఎవరైతే వస్తుసేవలు అందిస్తారో వారికి అంటే ప్రభుత్వ నిర్వాకులకు ప్రజల ఆదాయలలో నుంచి చెల్లించే మొత్తం. వ్యవహారికమైన భారం ఒక ప్రత్యేకమైన పన్ను నుంచి ఆ పన్ను చెల్లింపు సమూహము నుంచి వారివారి ఆదాయస్థాయిలను బట్టి ప్రభుత్వానికి చెల్లించే మొత్తం. వ్యవహారికమైనటువంటి పన్నుభారపు లెక్కలు సామాజిక ప్రయోజనాన్ని సాధించుటలో ఆదాయపు పంపిణీ, ఆదాయ పునఃపంపిణీకి ఉపయోగకరం. మరియు జాతియోత్పత్తిని ఉన్నతమైన స్థాయిలో ఉంచుటకు ప్రణాళికపరమైన ప్రభుత్వంలో ఇది ఎంతో ప్రాముఖ్యతను కల్గి ఉంది. వినియోగాన్ని నియంత్రించుటలో, పొదుపును తగ్గించుటలో పన్ను విధింపు కల్గించే మార్పులను ఊహిస్తుంది. ఒకవేళ వినియోగదారుడు పన్నుభారాన్ని భరిస్తే అతని వినియోగం తగ్గుతుంది. తద్వారా అతని సంక్షేమం తగ్గుతుంది. అదే విధముగా అభివృద్ధిచెందిన దేశాలలో ఇది వనరుల వినియోగంలో నుంచి ఉద్పాదక వస్తువులకు మళ్ళిస్తుంది. అంతేకాకుండా వ్యవహారికమైన భారం తయారీదారుడు మీద పడుతుంది. అది అతని యొక్క పొదుపును తగ్గించి మూలధన సంచయనానికి తోడ్పడదు. అంటే అది అతని యొక్క తిరిగి పెట్టుబడి పేట్టే సామర్థ్యాన్ని తగ్గించేస్తుంది.

**7.3.2 సార్థకమైన భారము :-** అయితే వ్యవహారికమైన భారము లెక్కలు ప్రత్యక్షముగా చెప్పుకోవడానికి అంటే పన్ను చెల్లింపుదారుడు యొక్క ప్రతిచర్యను మరియు అనేక ప్రభావాలను వివరించలేకపోయింది. కాబట్టి "శ్రీమతి హిక్స్ సార్థకమైన భావన భారాన్ని కూడా అభివృద్ధిపరచినది. పన్ను విధించిన తరువాత పూర్తి ఆర్థిక ప్రభావాలను తెలుసుకోవాలి అంటే మనం రెండు అంశాలను పోల్చుకోవలసి ఉంటుంది. అవి:

1. ఆర్థికపరమైన పన్నువిధింపు ద్వారా

2. ఆర్థికపరమైన ఏర్పాటుపైనే అయితే పన్ను లేనప్పుడు. "శ్రీమతి హిక్స్ పన్నుభారాన్ని, సార్థకపరమైన భారాన్ని ఆర్థికపరమైనటువంటి మార్పులను పన్ను విధించిన తరువాత గుర్తించుటలో ఉపయోగించెను.

అది ఉత్పత్తి విధానాన్ని, వస్తుసేవల డిమాండ్‌ను, వనరుల కేటాయింపును పొదుపు రీతి మొత్తాలను మరియు మూలధన సంచయనాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తుందో వివరిస్తుంది. మార్కెట్ విషయాలను తెలుసుకోవడంలోను దానిమీద పరోక్ష పన్నులు విధించుటలోను ఆదాయ సంపద పంపిణీలను, ఆదాయ అసమానతల స్థాయిని, పారిశ్రామిక స్థాయిని మొదలగు వాటిని తెలుసుకోవడంలో సార్థకమైన పన్నుభారం అవశ్యకత ఉంది. 'మస్‌గ్రేవ్' భారాన్ని ప్రత్యక్షంగా ఉత్పత్తిస్థాయి మీద ఆర్థిక వ్యవస్థలో ఎలా వుంటుందో వివరించెను. అందులో భాగంగా ఐదు ఒకదానితో మరొకటి సంబంధం ఉన్నా ఐదు ప్రత్యేక పన్ను భారాల్ని వివరించెను. అవి:

1. నిశ్చిత పన్ను విధింపు భారం
2. నిశ్చిత పన్నుభారం
3. నిశ్చిత వ్యయభారం
4. విభిన్న వ్యయభారం
5. సమతౌల్య బడ్జెట్‌భారం

**7.3.2.1 నిశ్చిత పన్నువిధింపు భారం :-** దీనిని ఒకవేళ ప్రభుత్వం ఒక ప్రత్యేకమయిన మార్పు పన్నులో కల్గించడం ద్వారా గుర్తించవచ్చు. ఉదా॥కు వ్యక్తిగత ఆదాయపన్నులో మార్పులు వస్తే అది అతని ఉపయోగంలో నుంచి మారుటకు వీలుంటుంది. ఒకవేళ పన్ను రేటు తగ్గిస్తే ప్రభుత్వానికి వచ్చే రాబడి తగ్గుతుంది.

**7.3.2.2 నిశ్చిత పన్నుభారం :-** ఒక ప్రత్యేకమైన పన్ను ఇంకొక పన్నును వినియోగించుకొని రాబడిని రాబట్టుకుంటే దాని ద్వారా ఏర్పడిన ప్రభావం (లేక) ఆదాయపంపిణీలో వచ్చే మార్పులను వ్యవస్థ పన్నుల భారము (లేదా) తారతమ్య పన్నుల భారము అంటారని ఆచార్య "మస్‌గ్రేవ్" వివరించెను.

**7.3.2.3 నిశ్చిత వ్యయభారం :-** ద్రవ్యరూపములో ప్రభుత్వ వ్యయాన్ని పెంచినట్లు ప్రజా ఉపయోగం కొరకు ఉపయోగించే వనరులు బదిలీలో పెరుగుదల ఉంది. తద్వారా ఆదాయపంపిణీలో మార్పులు ఏర్పడి పన్నువిధానంలో మార్పులేకుండా ఉన్నప్పుడు దాని నిశ్చిత వ్యయవిధానం (or) భారం అంటారు. అలాంటప్పుడు ద్రవ్యోల్బణం అదేవిధముగా ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడం ద్వారా ప్రతిద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. కాబట్టి ఈ భావన ద్రవ్యోల్బణ ప్రతి ద్రవ్యోల్బణ భావాలను వివరిస్తుంది.

**7.3.2.4 విభిన్న వ్యయభారం :-** ప్రభుత్వ ద్రవ్య వ్యయంలోని పంపిణీలో ఏర్పడినటువంటి మార్పులను విభిన్న వ్యయభారముగా 'మస్‌గ్రేవ్' పేర్కొన్నాడు. ఇది ద్రవ్యోల్బణ ప్రతి ద్రవ్యోల్బణ రహితంగా ఉంటుంది.

**7.3.2.5 సమతౌల్య బడ్జెట్ భారం :-** సమతౌల్య బడ్జెట్ పద్ధతి నందు వ్యయ విధానంలోని మార్పుల ఫలితంగా పంపిణీలో వచ్చిన మార్పులను 'సమతౌల్య బడ్జెట్ భారం' అంటారు. ఈ 5 రకాలలో మస్‌గ్రేవ్ విభిన్న పన్నుభారం తరవాత సమతౌల్య బడ్జెట్ భారానికి ప్రాముఖ్యత ఇచ్చాడు.

**7.4 పన్ను తాకిడి మరియు భారం :-** పన్ను తాకిడి అనేది పన్ను యొక్క తక్షణ (లేదా) తొలి ద్రవ్యభారముగా చెప్పవచ్చును. ఇవి ఎల్లప్పుడు చట్టప్రకారం పన్ను చెల్లించుటలో తొలి భారంగా వ్యక్తి మీద పడుతుంది. ఉదా॥కి 2,000 రూ॥ ఎక్సైజ్ పన్నుగా కలర్ టీ.వి ఒక్కంటికి నిర్ణయించి దానిని ఉత్పత్తిదారుడు మీద వేస్తే పన్ను తాకిడి అతని మీద ఉందని చెప్పవచ్చు. ఇదే తక్షణ ద్రవ్యభారం, అతను వస్తువును అమ్మకముందే ప్రభుత్వానికి ఆ మొత్తాన్ని ఏర్పాటు చేయాలి. అయితే దాన్ని చెల్లింపు వాయిదా కూడా వేయవచ్చు. ఎట్లా అంటే టీ.వి కొనుగోలుదారుడు నుంచి ఆ మొత్తాన్ని వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లిస్తాడు. పన్ను తొలిప్రభావం (లేదా) తాకిడి అనేది చట్టప్రకారం పన్ను ఎవరి మీద అయితే విధించబడతుందో వారికే వర్తిస్తుంది. పన్నుభారము అనేది తయారీదారుడు చిట్టచివరికి పన్నుభారాన్ని ఎవరి మీదకి అయితే బదలాయిస్తాడో వారికి సంబంధించి ఉంటుంది. ఒకవేళ బదలాయించకపోతే భారము తాకిడి అనేది ఒకరే భరించాల్సి

ఉంటుంది. తాకిడి (ప్రాధమిక భారం) మరియు భారం (చిట్టచివరి వ్యయభారం) అనేటివి ఒకే వ్యక్తి మీద గాని పడితే పన్ను బదలాయించలేదని ఉదా॥కి ఆదాయపు పన్నులో పన్ను తాకిడి భారం ఒకే వ్యక్తి మీద ఉంటాయి. అదే ఎక్సైజ్ పన్నుల్లో అయితే తాకిడి అనేది ఉత్పత్తిదారుడి మీద, భారము అనేది కొనుగోలుదారుడు మీద ఉంటుంది.

**7.5 పన్నుల బదలాయింపు :-** ప్రత్యక్ష ద్రవ్య పన్నుభారాన్ని ఒకవ్యక్తి నుంచి మరోకవ్యక్తికి బదలాయించు ప్రక్రియనే పన్ను బదలాయింపు అంటారు. ఎవరు ఎంత భారాన్ని భరిస్తారు అనేది ఎంత పన్ను ద్రవ్య భారం ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి బదలాయించ బడుతుందో ఆ మొత్తాన్ని బట్టి ఉంటుంది. ఒకవేళ పన్నుభారాన్ని పాక్షికంగా మాత్రమే ప్రాధమిక చెల్లింపుదారుడు. ఇతరులకు బదలాయించి ఉంటే అప్పుడు పన్ను యొక్క భారం ఇద్దరి వ్యక్తుల మీద పంచబడి ఉంటుంది. సెలిగ్‌మెన్'అందుకే పన్ను బదలాయింపు అనేది ప్రాధమికముగా ధర వ్యవహారాలలోనే జరుగుతుందని పేర్కొన్నాడు. ఈ బదలాయింపు ప్రక్రియ ఒకవ్యక్తి నుంచి మరొక వ్యక్తికి జరుగుతూనే ఉంటుంది. ఆ విధముగా చిట్టచివరి వ్యక్తికి పన్నుభారం బదలాయించడానికి వీలులేనంత వరకు పన్నుబదలాయింపు ప్రక్రియ ఉంటుంది. ఉదా॥కి 8000/-రూ చేసే టీ.వి మీద ప్రభుత్వం 2000/- రూ. ఎక్సైజ్ పన్నుని గాని విధించినట్లయితే అప్పడు టి.వి. యొక్క ధర 10,000 రూపాయిలు అవుతుంది. ఆ విధముగా ఉత్పత్తిదారుడు పన్ను బదలాయింపును టీ.వి కొనుగోలుదారులపై బదలాయిస్తారు. అయితే ఒకవేళ టీ.వి ధర 9,000/-రూ॥ అయితే పన్నుభారాన్ని పాక్షికంగా బదలాయించినట్లు అవుతుంది. ఒకవేళ ధర 8,000/-రూ॥ అయినట్లయితే పన్ను బదలాయించబడలేదని మొత్తం పన్నుభారం ఉత్పత్తిదారుడే భరించినట్లు అవుతుంది.

**7.5.1 ఏకబిందు మరియు బహుళబిందు బదలాయింపు :-** ఎప్పుడైతే వస్తు తయారీ దారుడు దగ్గర నుంచి వినియోగదారుడుకి ప్రత్యక్షముగా పన్ను బదలాయింపు జరుగుతుందో దానిని ఏకబిందు బదలాయింపు అంటారు. అట్లాకాకుండా ఉత్పత్తిదారుడు నుంచి టోకు వ్యాపారి దగ్గరకు ఆ టోకు వ్యాపారి చిల్లర వ్యాపారులకు, ఆ చిల్లర వ్యాపారి వినియోగదారులకు. పన్ను బదలాయింపు చేస్తున్నట్లయితే అలాంటి బదలాయింపును బహుళబిందు బదలాయింపు అని అంటారు. ఈ బదలాయింపులు వస్తువు యొక్క ప్రమాణము మరియు పరిమాణాలు కూడా తగ్గవచ్చును.

**7.5.2 పన్ను భారాన్ని ముందుకు వెనుకకు బదిలీ :-** పన్ను భారాన్ని ముందుకుగాని, వెనుకకుగాని, బదలాయించవచ్చు (లేదా) పాక్షిక ముందుకు బదలాయింపు మరియు పాక్షిక వెనుకకు బదలాయింపు చేయవచ్చు.

**7.5.2.1 పన్ను భారాన్ని ముందుకు బదిలీ చేయడం :-** ముందు చెప్పుకున్నట్లుగా వస్తువు యొక్క ధర మార్పు పన్ను బదలాయింపుకు ముఖ్యమైన సాధనంగా ఉంటుంది. పన్ను మొత్తం ఉత్పత్తిదారుడు నుంచి టోకు వ్యాపారస్తుడికి ఆ తరువాత చిల్లర వ్యాపారస్తుడికి చిట్టచివరికి వినియోగదారుడికి బదలీ చేయబడితే దానిని పన్నుభారం ముందుకు బదిలీ చేయడం అంటారు. (Forward shifting) ముందుకు బదిలీ చేసే ప్రక్రియలో ఒక్కొక్కప్పుడు మొత్తం పన్నును బదిలీ చేయుటకు వీలు ఉంటుంది. (లేదా) కొంతభాగమే బదిలీ చేయడానికి కూడా అవకాశం ఉంటుంది. అయితే ఈ ప్రక్రియలో వస్తువు ధర ఖచ్చితంగా పెరుగుతుంది.

**7.5.2.2 పన్నుభారం వెనుకకు బదిలీ చేయడం :-** పన్ను బదలాయింపు ప్రక్రియ వల్ల ఉత్పత్తికారకాల ధరలు మారడం జరిగితే దాన్ని పన్ను భారం వెనుకకు బదిలీ చేయడం అంటారు. (Backward shifting) దీనిని ఒక ఉదా॥ ద్వారా గ్రహించవచ్చు. ఒక పరిశ్రమకు సరఫరా చేయబడిన ముడిసరుకులు వాటిధరలను తగ్గించడం వల్ల శ్రామికుల జీతభత్యాలు తగ్గించడం వలన వడ్డీరేటులు తగ్గింపువలన, బాటకాన్ని తగ్గించడం వలన పన్ను బదలాయింపు చేయవచ్చు. అందుచే పరిశ్రమల మీద పన్ను విధించబడితే అవి అన్ని తగ్గించడం వలన దానిని వెనుకకు బదిలీ చేయడానికి వీలువుంటుంది. అయితే ఈ ముందు వెనుకకు బదిలీ (or) బదలాయింపులు ఈ క్రింది పరిస్థితులను బట్టి జరుగుతూ ఉంటాయి.

## 7.6 బదలాయింపును దోహదం చేసే అంశాలు :-

**7.6.1 ఒకే విధమైన అనేక వస్తువులు ఉన్నప్పుడు :-** ఒకవేళ అన్ని వస్తువులు ఒకే గ్రూపుకు చెంది ఉంటే వాటి మీద పన్ను విధిస్తూ ఉంటే అలాంటప్పుడు పన్ను బదలాయింపు వినియోగదారుడు మీద సులభంగా జరుగుతుంది. అట్లాకాకుండా ఒకే వస్తువు అయినట్లయితే పన్ను బదలాయింపు కష్టమవుతుంది. ఉదా:- కు అనేకరకాల శీతలపానీయాలు మార్కెట్‌లో ఉంటే వాటి మధ్య ఉన్న పన్నుభారాన్ని సులభంగా వినియోగదారుడు మీదకి బదలాయించవచ్చు. అట్లాకాకుండా ఒకే వస్తువు అయితే ఉదా॥ బ్రాంది మీద పన్ను విధిస్తే బదలాయించుట కష్టమవుతుంది ఎందుకంటే బ్రాంది ఉత్పత్తిదారుడు పన్ను విధించిన కారణముగా ధరను పెంచుతాడు అప్పుడు వినియోగదారుడు దానిని కొనవచ్చు (లేక) కొనకపోవచ్చు కనుక పన్నుబదలాయింపు కనుక అనేక వస్తుసముదాయాలు ఉండవలెను.

**7.6.2 వస్తువు యొక్క పరిమాణము :-** పన్ను యొక్క పరిమాణము తులనాత్మకముగా తక్కువగా ఉన్నట్లయితే బదలాయించుట కష్టం అట్లాకాకుండా పన్ను యొక్క మొత్తం ఎక్కువగా ఉన్నట్లయితే బదలాయించవచ్చు. ఉదా॥కి ఒక డజన్ అగ్గిపెట్టెల పెక్ మీద 10 పై॥ పన్ను విధించినట్లయితే ఒక్కొక్క అగ్గిపెట్టెధర 25 పై॥ ధర అనుకున్నట్లయితే సాధారణంగా బదలాయింపబడదు. బదలాయించుట అనేది చాలా కష్టంగా ఉంటుంది ఎందుకంటే ఒక్కపైసా కన్నా తక్కువ పన్నుని అగ్గిపెట్టె ధరలో కలిపి బదలాయింపబడాలి అందుచే పన్ను పరిమాణం తక్కువ అయినట్లయితే బదలాయించుట కష్టం. అట్లాకాకుండా 10,000 రూ॥ విలువ చేసే రెడీమేడ్ సూట్ మీద 10% పన్నువేస్తే 10,000 రూ॥ పన్నుకింద కట్టవలసి ఉంటుంది. కాబట్టి సులభంగా బదలాయించవచ్చు.

**7.6.3 డిమాండ్ సప్లైల వ్యాకోచిత్వం :-** ఒక వస్తువు యొక్క డిమాండ్ సప్లైల వ్యాకోచత్వాన్ని బట్టి కూడా పన్ను బదలాయించవచ్చు. లేదా ఒక వస్తువు యొక్క డిమాండ్ వ్యాకోచత్వం అయినట్లయితే దాని మీద పన్ను బదలాయించడానికి వీలులేదు. ఎందుకంటే డిమాండ్ తగ్గిపోవచ్చు. పన్ను బదలాయించుట కంటే డిమాండ్ తగ్గిపోవుట వలన నష్టం ఎక్కువ ఉండవచ్చు. ఒకవేళ అవ్యాకోచ డిమాండ్ కల్గిన వస్తువుల మీద పన్ను విధించినట్లయితే సులభంగా బదలాయించవచ్చు. ఎందుకంటే పన్ను విధించిన కారణముగా ధర పెరిగినప్పటికి డిమాండ్ పరిమాణంలో అవ్యాకోచ స్వభావం కాబట్టి మార్పురాదు. సప్లై అవ్యాకోచం కల్గిన మస్తువుల మీద పన్ను విధించినట్లయితే పన్ను బదలాయించుట జరగదు. ఒకవేళ సప్లై హ్యాకోచత్వాన్ని కల్గి ఉంటే ఉత్పత్తిదారుడు సప్లై తగ్గించి పన్నుభారాన్ని వినియోగదారునికి బదలాయిస్తాడు.

**7.6.4 పన్ను విధించే బిందువు :-** పన్ను విధించే బిందువు కూడా పన్ను బదలాయింపులో కీలకమౌవుతుంది. వినియోగ వస్తువుల మీద పన్ను విధించినట్లయితే అది అమ్మకపు పన్ను అవుతుంది. అది తిరిగి వినియోగదారుడు బదలాయించుటకు వీలుకాదు. అయితే ఎక్సైజ్ సుంఖము ఉత్పత్తి సంస్థల బిందువు వద్ద విధిస్తారు. కాబట్టి సులభంగా బదలాయించవచ్చు.

**7.6.5 మార్కెట్ నిర్మాణం :-** మార్కెట్ నిర్మాణాన్ని బట్టి కూడా పన్ను బదలాయింపు జరుగుతుంది. ఏకస్వామ్య ఉత్పత్తులు అయినట్లయితే పన్ను బదలాయింపు సులభంగా చేయవచ్చు. అదే సంపూర్ణమైన పోటీ మార్కెట్లో వస్తువులు అయితే పన్ను బదలాయింపు కష్టం అదే విధముగా ఏకస్వామ్యపోటి మార్కెట్‌లో పన్ను బదలాయింపు అనేది వస్తువు యొక్క డిమాండ్ వ్యాకోచత్వాన్ని బట్టి వుంటుంది.

**7.6.6 భౌగోళిక పరమైన వ్యాప్తి :-** స్థానిక ప్రాంతపు వస్తువుల మీద పన్ను విధించబడేటట్లయితే అలాంటి పన్నులను బదలాయించుట కష్టం ఎందుకంటే ఆ వస్తువుల యొక్క ధరలు పెరుగుతాయి. కాబట్టి ప్రజలు అలాంటి పన్నులు లేని ప్రక్కప్రాంతాల నుంచి ఆ వస్తువులను పొందుతారు.

**7.6.7 అలవాటు అయిన ధరలు :-** పన్ను బదలాయింపు కొన్ని రకాల ఉత్పత్తులు అమ్మకాలలో అలవాటు అయిన ధరల విధానం ఉంటే పన్ను బదలాయింపు కష్టం ఉదా॥కి 10 తలనొప్పి మాత్రలు కల్గిన షీటు 10 రూ॥ అనుకుంటే అదేవిధముగా అగ్గిపెట్టె 1 రూపాయి అనుకుంటే ఇలాంటి వాటిలో పన్ను బదలాయించుట కష్టం.

**7.6.8 ప్రభుత్వ విధానం :-** ముందు వెనుకకు పన్ను బదలాయింపులు ఒక్కోసారి చట్టబద్ధంగా నిషేదించబడతాయి. ఉదా॥కి కొన్నిరకాల పన్నులను ఇంటి యజమానులు బాధ్యగకు ఉండేవారి దగ్గర నుంచి వసూలు చేయకుండా వారే చెల్లించాలి కనీస వేతానాలు చట్టం ద్వారా తగ్గించకూడదు.

**7.6.9 శ్రామికులు మరియు ఇతర ఉత్పత్తి కారకాలలో బేరమాడేశక్తి :-** పన్నుభారం వెనుకకు బదలాయింపు అనేది శ్రామికులు మరియు ఉత్పత్తికారకాల బేరమాడే శక్తిని బట్టి కూడా ఆదారపడి వుంటాయి. ఈ బేరమాడే శక్తి తక్కువుగా ఉన్నట్లయితే పన్నుభారం వెనుకకు బదలాయించడం చాలా సులభం. అట్లాకాకుండా శ్రామికులలో బేరమాడే శక్తి ఎక్కువుగా ఉంటే శ్రామిక సంఘాలు ఎక్కువుగా ఉంటే ఉత్పత్తిదారుడు పన్నుమ బదలాయించలేడు. ముందుకు బదలాయించుటలో ధరను పెంచుటను ఎన్నుకుంటాడు.

## 7.7 పన్ను మూలధనీకరణ పద్ధతి :-

పన్ను మూలధనీకరణ పద్ధతి పన్ను భారాన్ని వెనుకకు బదలాయించుటలో ఉపయోగపడే ఒక ప్రత్యేక పద్ధతి. సం॥మంతా స్థిరంగా కొంత ఆదాయాన్నిచ్చే ఆస్తులను అమ్మినప్పుడు కొనుగోలుదారుడు భవిష్యత్‌లో ఆ ఆస్తిపై పడి పన్ను భారాన్ని లెక్కకట్టుకొని పూర్తిగా కాని, దానిలో కొంతభాగాన్ని కాని అనుకూల దారులకు బదిలీ చేయడానికి ప్రయత్నిస్తారు. ఆ విధంగా కొనుగోలు దారులు ఆస్తి విలువను పన్ను మూలధనీకరణ ద్వారా డిస్కౌంట్ చేసి పన్ను చెల్లింపు నుండి తప్పించుకుంటారు. అనగా ఆస్తి విలువను తగ్గించి అంటే తక్కువ ధరకు కొంటారు. దీనిని క్రింద ఉదా॥ ద్వారా కూడా వివరించవచ్చు. ఒక భూస్వామికి ఉన్న భూమి విలువ 1000/- రూ అనుకుంటే దాని ద్వారా సం॥ ఆదాయం 500 రూ॥ అనుకుంటే దానిపై సం॥రానికి చెల్లించవలసిన నిశ్చయన పన్ను 100 రూ॥ అనుకుంటే ఆ భూస్వామికి సాలీనా వచ్చే నికర ఆదాయం 400 రూ॥ అవుతుంది. ఒకవేళ ఆ భూమిపై పన్ను లేకుండా ఉన్నట్లయితే ఆ వచ్చే ఆదాయం దాని విలువలో 5% వుంటుంది. కొనుగోలుదారుడు పన్ను చెల్లించిన తరువాత కూడా ఆస్తి విలువలో 5% ప్రతిఫలం రాబట్టుకోవాలనుకుంటే ఆ భూమిని 8000 రూ॥ కొనుగోలు చేయవలసి వుంటుంది. అలా చేసినప్పుడే భవిష్యత్‌లో చెల్లించవలసిన పన్నులు నుంచి కొనుగోలుదారుడు తప్పించుకోగలడు. పన్ను యొక్క మొత్తం ద్రవ్యభారం 2,000 రూ॥ ఒకేసారి ఆస్తి విలువలో నుంచి తగ్గించబడాలి. పన్ను మూలధనీకరణ కొన్ని పరిస్థితులలో మాత్రమే ఒకేసారి ఆస్తి విలువలో నుంచి తగ్గించబడాలి. పన్ను మూలధనీకరణ కొన్ని పరిస్థితులలో మాత్రమే వీలువుంటుంది. ఆస్తివిలువ అలాగే దాని నుండి వచ్చే సంవత్సరిక ఆదాయం స్థిరంగా ఉండాలి.

**7.7.1 పన్ను మూలధనీకరణకు నిబంధనలు :-** పన్ను మూలధనీకరణ ఈ క్రింది పరిస్థితులలో మాత్రమే వీలు అవుతుంది.

1. పన్ను మూలధనీకరణకు మన్నిక గల్గిన వస్తువులు స్థిరమైనటువంటి వస్తువుల విషయంలో మాత్రమే సాధ్యం అవుతుంది. పన్ను నశ్వర వస్తువుల విషయములో వీలుకాదు.

2. మన్నిక గల్గిన వస్తువులు మరియు స్థిర ఆస్తులు మార్కెట్ విలువను కల్గి ఉండగల్గాలి. ఎందుకంటే మూలధనీకరణలో పన్ను బదలాయించబడాలి అంటే సంవత్సరిక ఆదాయాన్ని పొందుతూ మూలధన విలువను కల్గివుండాలి.

3. మూలధనీకరణ పన్ను విధించుటకు ఆస్తులో (లేదా) వస్తువులు శాశ్వితకాలానికి సంబంధించినవై ఉండాలి. ఒకవేళ స్వల్పకాలానికి చెందినట్టి ఆస్తులు అయితే వాటిమీద మూలధనీకరణ పన్ను విధించుటకు వీలుకాదు.

4. మూలధనీకరణ పన్ను అనేది ప్రత్యేకమైనటువంటిదిగా ఉంటుందే తప్ప సాదరణమైన పన్నుగా దానిని విధించుటకు వీలుకాదు.

## 7.8 పన్ను బదలాయింపు సిద్ధాంతాలు :-

పన్ను బదలాయింపు సిద్ధాంతాలను సాంప్రదాయక సిద్ధాంతం అని ఆధునిక సిద్ధాంతం అని 2 రకాలుగా విభజించవచ్చును. కేంద్రీకరణ మరియు హ్యాప్తి సిద్ధాంతాలను సాంప్రదాయక వ్యాప్తి డిమాండ్ సప్లై సిద్ధాంతాలను ఆధునిక సిద్ధాంతంగా చెప్పవచ్చును.

**7.8.1 కేంద్రీకరణ సిద్ధాంతం :- (Concentration Theory)** 18 వ శతాబ్దంలో ఫ్రాన్స్ దేశానికి చెందిన ప్రకృతి ధర్మవాదులు ఈ సిద్ధాంతాన్ని వివరించిరి. ఈ సిద్ధాంతం ప్రకారం వ్యవసాయమొక్కటే ఉత్పాదకమైనదని అది మిగుళ్ళను కల్గి ఉంటుందని మిగతా ఏ వృత్తులు ఉత్పాదకంకాక మిగుళ్ళను కలిగివుండవని వీరు భావించిరి కాబట్టి వారు భూమిపై విధించే పన్ను తప్ప ఇతర ఏ వృత్తులపైన ఎలాంటి పన్నులు విధించకూడదని పేర్కొన్నారు. ఎందుకంటే ఇతర వృత్తులపై పన్నులు విధించినప్పటికి అవి అంతిమంగా వ్యవసాయదారులకే బదిలీ అవుతాయి. కారణం వ్యవసాయయేతర కార్యకలాపాలు మిగుళ్ళను ఉత్పత్తి చేయలేవు. అలాంటి పరిస్థితులలో మిగులు కల్పించలేని సంస్థలపై పన్నులు విధించినట్లయితే వాటిని చెల్లించలేని స్థితిలో ఆ సంస్థలు ఉంటాయి. కావున పన్నుభారం ఇతరులకు బదిలీచేయడానికి ప్రయత్నిస్తాయి. ఈ విధంగా సహజ ధర్మవాదులు అభిప్రాయంలో పన్నులన్నీ బదిలీచేయబడి వ్యవసాయ బాటకం పై కేంద్రీకరించబడతాయి. కాబట్టి కేంద్రీకరణ సిద్ధాంతంగా దీనిని వారు పేర్కొన్నారు.

విమర్శ :- కేంద్రీకరణ సిద్ధాంతం విమర్శకు గురిఅయినది ఎందుకంటే వ్యవసాయం ఒక్కటి మిగులును కల్గి వుంటుందని అనడం పొరపాటు. వ్యవసాయేతర వృత్తులు కూడా ఉత్పాదకంగాను మిగుళ్ళను కల్గి ఉండే అవకాశం ఉంటుంది. కాబట్టి ఎలాంటి పన్ను అయిన చిట్టచివరికి వ్యవసాయ రంగంపైనే కేంద్రీకరణకు బదలాయించబడుతుంది. అనేటువంటి ప్రమేయం వాస్తవం కాదు. అలాగే ఈ సిద్ధాంతం ఊహించినంత సులభంగా మిగుళ్ళను గుర్తించడం చాలా కష్టం.

**7.8.2 వ్యాప్తి సిద్ధాంతం (Diffusion Theory) :-** ఈ సిద్ధాంతాన్ని ఫ్రాన్స్ దేశానికి చెందిన ఆర్థిక వేత్తలు అయిన "మాన్స్‌ఫీల్డ్' కనార్డ్ అభివృద్ధి పరిచారు. ఈ సిద్ధాతం ప్రకారం పన్నుల అంతిమభారం ఆర్థిక వ్యవస్థ మొత్తానికి వ్యాప్తి చెందుతుంది. అంటే పన్ను తాత్కాలికంగా కొందరిపై విధించినప్పటికి వినిమయ కార్యకలాపాల వల్ల చిట్టచివరికి ప్రజల అందరిపై వ్యాప్తి చెందుతుంది. ఆర్థిక వ్యవస్థలో ఒక కార్యక్రమం ఇంకొక కార్యక్రమంపై ఆధారపడి ఉండటం వల్ల ఎక్కడ పన్ను విధించినప్పటికి సమాజానికంతటకి వ్యాప్తి చెందేవరకు అది బదిలీ చేయబడుతుంది. అని వారి నమ్మకం. మాన్స్‌ఫీల్డ్ అభిప్రాయం ప్రకారం ఒక చెరువులో రాయి విసిరినట్లయితే ఆ రాయిపడిన స్థలం నుండి అలలు ఏర్పడి క్రమంగా అవి చెరువు అంతటికి ఏ విధంగా వ్యాప్తిస్తాయో అదే విధంగా పన్ను ఎక్కడ విధించినప్పటికి సమాజం అంతటికి వ్యాప్తించి చివరకు పన్ను భారాన్ని ప్రజలందరు భరించవలసి ఉంటుంది.

విమర్శ :- ఈ సిద్ధాంతాన్ని డాల్టన్ పన్ను అంతిమ ప్రభావాన్ని కనగొనుటంలో లక్ష్యానికి దూరమైనది ఏమోనని విమర్శించాడు. అదేవిధముగా ఈ వ్యాప్తి సిద్ధాంతం పరిపూర్ణమైన పోటి మార్కెట్ ఉత్పత్తికారకాల గమనశీలత ఉంటుందని భావించింది. అనేక కారణాల వల్ల ఉత్పత్తికారకాల గమనశీలత ఉంటుందని భావించింది. అనేక కారణాల వల్ల ఉత్పత్తికారకాల గమనశీలత తక్కువగా ఉండవచ్చు. మరియు ఆధునిక ప్రపంచములో ఏకస్వామ్యం, ఏకస్వామ్య పోటీ మార్కెట్ పరిమిత స్వామ్యం వంటి అపరిపూర్ణమైన పోటీ మార్కెట్ ఉంటుంది. కావున వ్యాప్తి సిద్ధాంతం ప్రకారం పన్ను బదలాయింపు జరుగకపోవచ్చు.


**7.8.3 ఆధునిక సిద్ధాంతం :- (Modern Theory)** ఇది పన్ను బదలాయింపులో డిమాండ్ సప్లైల విశ్లేషణను ఉపయోగించి అంతిమ ప్రభావాన్ని గూర్చి తెలియజేసే ఆధునిక సిద్ధాంతం. పన్ను బదిలీ ప్రక్రియను తెలుసుకోవాలంటే పన్ను విధింపు వల్ల వస్తుధరలో మార్పు ఎంతవరకు వస్తుందో తెలుసుకోవాలి. పన్ను విధించబడితే వస్తువుధర పెరుగుతుంది. వస్తువుధర పన్ను మొత్తానికి సరిపోయేటంతగా పెరిగితే అంతిమ ప్రభావం పూర్తిగా వినియోగదారునిపై వుంటుంది. ధర పెరగక పోయినట్లయితే అంతిమ ప్రభావం పూర్తిగా ఉత్పత్తిదారునిపై ఉంటుంది. ఈ పన్ను భారం ఎంతవరకు బదిలీ జరుగుతుందనే విషయం డిమాండ్ సప్లైల వ్యాకోచత్వాలపై ఆధారపడి ఉంటుంది. డిమాండ్ సప్లైల వ్యాకోచాలను బట్టి వ్యయస్థితిగతులను బట్టి మరియు మార్కెట్ స్వరూపాన్ని బట్టి పన్ను భారం బదిలీ ఈ క్రింది విధంగా ఉంటుంది.

## 7.9 డిమాండ్ సప్లైల వ్యాకోచిత్వం :-

డిమాండ్ సప్లైల వ్యాకోచత్వం ఈ క్రింది రూపాలలో జరుగుతుంది.

**7.9.1 పూర్తి వ్యాకోచ డిమాండ్ పన్నుల భారం బదిలీ :-** పూర్తి వ్యాకోచ డిమాండ్ గల వస్తువులపై పన్నును విధించినప్పుడు ఆ పన్ను భారాన్ని పూర్తిగా అమ్మకందారుడే భరించాలి. ఒకవేళ ధరను పెంచి పన్నుల భారాన్ని బదిలీ చేయడానికి ప్రయత్నిస్తే డిమాండ్


పూర్తిగా తగ్గిపోతుంది. కాబట్టి పన్నుల భారాన్ని బదిలీ చేయడానికి అవకాశం లేదు. ఈ విషయాన్ని ఈ క్రింది రేఖాపటం ద్వారా గమనించవచ్చు.




పై రేఖాచిత్రములో (o,y) అక్షంపైన వస్తువు యొక్క ధరను (o,x) అక్షంపైన సప్లై మరియు డిమాండ్‌లను తీసుకున్నాము. DD పూర్తి వ్యాకోచ డిమాండ్ రేఖ. SS పన్ను విధించక ముందు సప్లైరేఖ.......


అప్పుడు సమతౌల్య ధర PM. ప్రభుత్వం పన్ను విధించిన తరువాత ఎప్పుడూ నూతన సప్లైరేఖా S+Tax. ఇప్పుడు సమతౌల్యధర $p_1m_1$. అనగా పన్ను విధించకముందు విధించిన తరువాత వస్తువు యొక్క ధరలో ఎలాంటి మార్పులేదు. కావున పన్ను మొత్తమును అమ్మకముదారుడే భరిస్తాడు.

**7.9.2 పూర్తి అవ్యాకోచ డిమాండ్ పన్నుల భారం బదిలీ :-** పూర్తి అవ్యాకోచము గల వస్తువులపై పన్ను భారాన్ని పూర్తిగా కొనుగోలుదారుడు భరించవలసి వుంటుంది. అంటే పన్ను రేటు ఎంత పెరిగినా డిమాండ్ తగ్గదు. కాబట్టి కొనుగోలు దారులకు ఆ ధరను మాత్రం బదిలీ చేయవచ్చు దీన్ని ఈ క్రింది రేఖాచిత్రం ద్వారా కూడా వివరించవచ్చు.




పై రేఖాచిత్రములో పూర్తి అవ్యాకోచత్వం గల డిమాండ్ రేఖను మనం చూడవచ్చు. పన్ను భారాన్ని పూర్తిగా వినియోగదారుడే భరిస్తున్నాడు. $D_1D$ అనేది నిలువుగా వున్న డిమాండ్ రేఖ. SS అనేది సప్లైరేఖ పన్ను విధించిన తరువాత అది ఎడమవైపుకు ($S_1S_1$) జరుగుతుంది. పన్ను విధించక ముందు PD పన్ను విధించిన తరువాత $P_1D$ కి పెరుగుతుంది. డిమాండ్ పూర్తి అవ్యాకోచంగా ఉన్నందువల్ల వినియోగదారుడు పన్ను భారం నుండి తప్పించుకోలేడు. అమ్మకం దారుడు పన్ను భారాన్ని పూర్తిగా వినియోగదారుడికి బదిలీ చేస్తాడు. $P_1P$ అనునది పన్నును తెలియజేస్తుంది.

**7.9.3 పూర్తి వ్యాకోచ సప్లై పన్ను భారం బదిలీ :-** వస్తువు యొక్క సప్లై పూర్తి వ్యాకోచిత్వంగా ఉంటే పన్ను భారాన్ని మొత్తం కొనుగోలుదారులు భరించాలి. ఎందుకంటే సప్లైని తగ్గించి, ధరలను పెంచి పన్ను భారాన్ని అమ్మకం దారులకు బదిలీ చేయడం జరుగుతుంది. దీనిని క్రింది రేఖాచిత్రములో కూడా గమినించవచ్చు.





పై రేఖాచిత్రములో సప్లై పూర్తి వ్యాకోచమైనప్పుడు పన్ను యొక్క భారాన్ని పూర్తిగా కొనుగోలు దారుడు భరించవలసి ఉంటుంది. పై రేఖా చిత్రములో సప్లైరేఖ పూర్తి వ్యాకోచిత్వంగా ఉంది. పన్ను విధింపబడితే అది $S_1S_1$ గా పైకి జరుగుతుంది. అంటే ధర మొదటిస్థాయి PM (లేదా) $KM_1$ నుండి $P_1M_1$ కు పెరుగుతుంది.

**7.9.4 పూర్తి అవ్యాకోచ సప్లై పన్నుభారం బదిలీ :-** వస్తువు యొక్క సప్లై పూర్తి అవ్యాకోచమైనప్పుడు పన్ను యొక్క భారాన్ని పూర్తిగా అమ్మకం దారుడు భరించవలసి ఉంటుంది. ఈ విషయాన్ని క్రింది రేఖాచిత్రం ద్వారా గ్రహించవచ్చు.



పై రేఖాచిత్రములో పన్ను విధించక ముందు సప్లైరేఖ SS డిమాండ్ రేఖ DD ఈ రెండు P బిందువు వద్ద సమానంగా ఉన్నాయి. ధర (OA) పన్ను విధించిన తరువాత కూడా సప్లైరేఖ (S+Tax) పన్ను విధించక ముందు విధించిన తరువాత సప్లైరేఖలో ఎలాంటి మార్పులేదు. కాబట్టి ధర (OA) గానే ఉన్నది. ధరను పెంచడానికి వీలులేదు కాబట్టి ఈ భారాన్ని అమ్మకం దారుడే భరించాలి. కాని ఆచరణలో డిమాండ్ సప్లైరేఖలు పూర్తిగా వ్యాకోచత్వాన్ని కాని, అవ్యాకోచత్వాన్ని కాని పొందవు అందుచే డిమాండ్ సప్లయి రేఖలు సాధారణ పద్ధతిలో ఉంటే అప్పుడు పరిస్థితి ఏమిటి ? సాధారణముగా డిమాండ్ రేఖ ఎడమ నుండి కుడికి పైకి వాలి ఉంటుంది. దీనిని ఈ క్రింది పటం ద్వారా చూడవచ్చు.





పై రేఖాచిత్రములో DD, SS అనేది వస్తువు యొక్క సాదారణ డిమాండ్, సప్లైరేఖలు PM సమతౌల్యధర. పన్ను విధింపబడిన తరువాత సప్లైరేఖలు ఎడమవైపుగా పైకి జరుగుతుంది. $(S_1S_1)$ కొత్త సమతౌల్యధర $P_1M_1$ అనగా వస్తువు ధర $P_1N$ పెరుగుతుంది. SS. $S_1S_1$ ల మధ్య నిలువు దూరం సమానంగా ఉండి యూనిట్‌లోకి విధింపబడి పన్నును ప్రతిబింబిస్తుంది. ఇక్కడనున్న అంతిమ ప్రభావం $P_1K$ ఇది $P_1N$కి సమానం అమ్మకం దారుడు భరించే భాగం NK ఇంకోవిధంగా చెప్పాలంటే పన్ను ద్రవ్యభారం, వినియోగభారం, అమ్మకందారుల మధ్య సప్లై డిమాండ్‌ల వ్యాకోచత్వాల నిష్పత్తిలో పంచబడింది.

## 7.10 వ్యయ స్థితిగతులను బట్టి :-


(పెరుగుతున్న, స్థిర, తగ్గుచున్న వ్యయాలు) విభిన్న వ్యయస్థితిలో పన్నుభారం బధలాయింపు కొనుగోలు దారులు మరియు అమ్మకం దారుల మధ్య బదలాయింపులు ఈ క్రింది విధంగా జరుగుచూ ఉంటాయి.

**7.10.1 పెరుగుతున్న వ్యయస్థితి :-** పెరుగుతున్న వ్యయస్థితి అనగా యూనిట్ ఉత్పత్తి విలువ కన్నా యూనిట్ ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉండటం అంటే ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉంటుంది. అలాంటి పరిస్థితులలో పన్నుభార బదలాయింపు కొద్దిగా అమ్మకం దారులమీద మరికొద్ది భాగం కొనుగోలు దారులమీద ఉంటుంది. పన్ను పెరిగిన కారణముగా వస్తువు యొక్క ధర పెరుగుతుంది. కాబట్టి డిమాండ్ తగ్గుతుంది. కాబట్టి అమ్మకం దారుడు కొద్ది మొత్తాన్ని బదలాయించుటకు ప్రయత్నిస్తాడు. ఎంత మొత్తాన్ని బదలాయిస్తాడు అనేది వస్తువు యొక్క డిమాండ్ వ్యాకోచత్వాన్ని బట్టి ఆదారపడి వుంటుంది. ఈ క్రింది రేఖాచిత్రములో తక్కువ వ్యాకోచత్వం ఉన్నప్పుడు పన్ను బదలాయింపును గమనించవచ్చును.





పై రేఖాచిత్రములో పెరుగుచున్న వ్యయపరిస్థితులలో ఎక్కువ పన్నుభారం కొనుగోలుదారుడు మీద బదలాయించడం వల్ల డిమాండ్ అవ్యాకోచంగా వుంటుంది. అదేవిధముగా డిమాండ్ వ్యాకోచంగా ఉంటే పన్ను బదలాయింపు అనేది ఎక్కువ అమ్మకం దారుడుపై బదలాయించబడుతుంది.

**7.10.2 స్థిర వ్యయ పరిస్థితి :-** స్థిర వ్యయ పరిస్థితులలో స్థిరమైనటువంటి ప్రతిఫలాలు లభిస్తాయి కాబట్టి పన్నుభారం మొత్తాన్ని డిమాండ్ అవ్యాకోచంగా ఉన్నా వ్యాకోచంగా ఉన్నా కొనుగోలు దారుడుపై బదలాయించబడుతుంది. దీనిని ఈ క్రింది రేఖాచిత్రములో చూడవచ్చును.




**7.10.3 తగ్గుతున్న వ్యయ పరిస్థితి :-** తగ్గుతున్న వ్యయ పరిస్థితులలో పన్ను బదలాయింపు అనేది పెరుగుతున్న వ్యయ పరిస్థితులలో మాదిరిగా ఉంటుంది. పన్ను మొత్తం కన్నా ధర ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే డిమాండ్ తగ్గిన కారణముగా సప్లయ్


కూడా తగ్గుతుంది. క్రింది రేఖాచిత్రములో SS సప్లైరేఖ తగ్గుచున్న స్థితిగతులను బట్టి సప్లై తగ్గినట్టు యూనిట్ వ్యయం పెరిగిందని తెలియజేస్తుంది. అలాంటి పరిస్థితులలో వినియోగదారుడు పూర్తి పన్ను మొత్తాన్ని భరించవలసి ఉంటుంది. ($K^T=SS_1$) అంతేకాకుండా సప్లై తగ్గడం చేత ఎక్కువ మొత్తం యూనిట్ వ్యయానికి (TN) చెల్లించవలసి ఉంటుంది. ఇలాంటి తగ్గుచున్న వ్యయస్థితిలో పన్ను బదలాయింపు వల్ల వినియోగదారుని సంక్షేమం తగ్గుతుంది. దీనిని ఈ క్రింది రేఖాచిత్రములో చూడవచ్చును.





## 7.11 మార్కెట్ స్వభావం - పన్ను బదలాయింపు :-

పన్నుల భారం బదిలీ అనేది వస్తు సప్లై డిమాండ్ వ్యాకోచత్వాలను బట్టి, వ్యయపరిస్థితులను బట్టి కాకుండా మార్కెట్ స్వభావాన్ని బట్టి కూడా ఆధారపడి ఉంటుంది. పరిపూర్ణ పోటీ మార్కెట్ అపరిపూర్ణమైన పోటీ మార్కెట్ పరిస్థితుల పన్నుభారం బదిలీ ఏ విధంగా ఉంటుందో ఈ క్రింది విధముగా పరిశీలించవచ్చును.

**7.11.1 సంపూర్ణమైన పోటి మార్కెట్ పన్నుల భారం బదిలీ :-** సంపూర్ణమైన పోటీ మార్కెట్ పరిస్థితులలో అన్ని గడ్డుయైన పరిస్థితులుంటాయి. అంటే అనేకమంది అమ్మకందార్లు, కొనుగోలుదారులు ఉండి మార్కెట్ సమాచారం అందరికి తెలిసి ఉండి, సంస్థలన్నీ సజాతీయమైన వస్తువులను ఉత్పత్తి చేస్తూ ఉంటాయి. అందువలన మార్కెట్ అంతా ఒకే ధర ఉంటుంది. కాబట్టి డిమాండ్‌రేఖ పూర్తి వ్యాకోచత్వాన్ని కల్గి X- అక్షానికి సమాంతరముగా ఉంటుంది. అందువల్ల పరిపూర్ణమైన పోటిలో ధరను పెంచడానికి వీలుకాదు. కాబట్టి పన్నుల భారం ఉత్పత్తిదారుడు, కొనుగోలుదారులకు బదిలీ చేయలేడు. ఇది స్వల్పకాలములో జరుగేటటువంటి ప్రక్రియ. కానీ దీర్ఘకాలములో వస్తుఉత్పత్తిని తగ్గించడం ద్వారా ధరను పెంచవచ్చు. కాబట్టి అమ్మకందారుడు దీర్ఘకాలములో పన్ను బదలాయింపును కొనుగోలుదారులకి విస్తరిస్తాడు. కాబట్టి దీర్ఘకాలములో పన్ను అనేది ఉత్పత్తి వ్యయంగా భావిస్తారు. మరియు ఆ పన్ను మొత్తాన్ని కొనుగోలుదారులకు బదలాయించడం జరుగుతుంది. దీనిని ఈ క్రింది రేఖాచిత్రములో చూడవచ్చును.




**7.11.2 ఏకస్వామ్యంలో పన్ను బదలాయింపు :-** ఏకస్వామ్యదారుడు లాభాలు గరిష్టమయ్యే పద్ధతిలో ఉత్పత్తిని, ధరని నిర్ణయించుకుంటాడు. ఉపాంతవ్యయం MC, ఉపాంతరాబడి MR కి సమానంగా ఉంటే లాభం గరిష్టస్థాయిలో ఉంటుంది. ఒకవేళ ఏకస్వామ్య లాభాలపై పన్ను విధింపబడితే అంతిమ ప్రభావాన్నెవరు భరిస్తారు. పన్ను విధింపబడినప్పుడు కూడా అతడు తన లాభాలను గరిష్టం చేసుకొనేటట్లు ఉత్పత్తిని ధరను నిర్ణయిస్తాడు కావున ఏకస్వామ్యదారుడు అంతిమ ప్రభావాన్ని భరిస్తాడు భారాన్ని వినియోగదారునికి బదిలీ చేయలేడని అనిపిస్తుంది. వస్తువుల అమ్మకం తరువాతనే ఏకస్వామ్యదారుడు లాభాలు గడిస్తాడు. కాబట్టి లాభాలపై విధింపబడిన పన్ను కొనుగోలుదారులకు బదిలీ చెయ్యలేడని విషయం గుర్తించుకోవాలి. పన్ను విధింపు తరువాత ఏకస్వామ్యదారుని లాభాలు తగ్గిపోతాయని గరిష్ట లాభాలను పొందాలనుకున్నప్పుడు ధరను పెంచడం ద్వారా పన్నుభారాన్ని వినియోగదారునికి బదిలీ చేయలేడని "మస్‌గ్రేవ్" పి.బి మస్‌గ్రేవ్‌లు చక్కగా తెలిపారు. పన్ను వల్ల ఏకస్వామ్య లాభాలు తగ్గించుట ఉంటుంది. దీనిని ఈ క్రింది పటం ద్వారా చూడవచ్చు.



పై రేఖాచిత్రములో AR, MR లు క్రిందికి వాలి ఉన్నాయి. పన్నుకు ముందు MC = MR అయిన దగ్గర OM ఉత్పత్తికి OP ఏకస్వామ్యధర CDEP ఏకస్వామ్యదారుడు సంపాదించిన గరిష్టలాభాలు ముందు చెప్పినట్లుగా పన్ను విధింపబడనప్పటికీ అది బదిలీ చేయబడలేదు. కావున మొత్తం లాభం CDEP తగ్గింపబడుతుంది. పన్ను విధింపు తర్వాత కూడా MC = MR, దగ్గరే అతని లాభం గరిష్టమవుతుంది. కాని ఇప్పుడు అతని లాభం $CDE_1P_1$ కి తగ్గించబడింది. అమ్మకాలపై పన్నువిధిస్తే ముందు చెప్పినట్లు సప్లైరేఖ పైకి జరుగుతుంది. పన్ను అంతిమ ప్రభావం ఏకస్వామ్యదారుడు కొనుగోలుదార్ల డిమాండ్ సప్లైల వ్యాకోచత్వ నిష్పత్తిలో పంచబడుతుంది.

**7.11.3 ఏకస్వామ్య పోటీ మార్కెట్‌లో పన్ను బదలాయింపు :-** ఏకస్వామ్య పోటీ మార్కెట్లో అనేక ఉత్పత్తి సంస్థలు ఉంటాయి. అవి ఉత్పాదన భిన్నత్వాన్ని కల్గి ఒక్కొక్క సంస్థ ఒక్కొక్క డిమాండ్ రేఖను కల్గి వుంటుంది. వ్యాకోచత్వము అనేది ఉత్పాదన భిన్నత్వ వ్యాప్తికి ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఉత్పాదనా భిన్నత్వం ఎక్కువుగా ఉన్నట్లయితే ఆ సంస్థ డిమాండ్‌రేఖ అవ్యాకోచంగా ఉంటుంది. అలాంటి పరిస్థితులలో పన్నుభారాన్ని ఎక్కువ మొత్తంలో ధరలు పెంచే రూపంలో బదలాయిస్తుంది. ఒకవేళ ఉత్పాదనా భిన్నత్వం పెద్దగా లేకపోయినట్లయితే ఆ సంస్థ మిగతా సంస్థల పోటీని ఎదుర్కోవలసి ఉంటుంది. అలాంటి పరిస్థితులలో సంస్థ యొక్క డిమాండ్‌రేఖ ఎక్కువ వ్యాకోచత్వాన్ని కల్గి ఉంటుంది. కావున పన్నుభారాన్ని ఎక్కువ మొత్తం తానే భరిస్తూ తక్కువ భారాన్ని కొనుగోలుదారుల మీదకి బదలాయిస్తుంది.

**7.11.4 పరిమిత స్వామ్యంలో పన్ను బదలాయింపు:-** పరిమిత స్వామ్య మార్కెట్లో అమ్మకందార్లు కొద్ది మొత్తంలో ఉంటారు. వారి ఉత్పత్తి ఒకేలాగా (లేదా) కొద్దిపాటి భిన్నత్వం కల్గి ఉండవచ్చు. ప్రవేశాన్ని నిషేధిస్తూ ఏ కొద్దిపాటి తేడా ధరలో వచ్చినట్లయితే దాని ప్రభావం సంస్థపై అధికంగా ఉంటుంది అంటే ఒకరు ధరను పెంచిన మరొకరు ధరను పెంచరు కాబట్టి. ధరను పెంచినవారు నష్టపోవలసి ఉంటుంది కాబట్టి పన్ను బదలాయింపు పరిమిత స్వామ్య మార్కెట్లో అమ్మకం దారుడు పైన ఉంటుంది. ధరల నాయకత్వం ఉంటుంది. కాబట్టి పన్ను బదలాయిస్తే మిగతా సంస్థలు కూడా బదలాయించడానికి ప్రయత్నించవచ్చు.

## 7.12 కొన్ని ముఖ్యమైన పన్నులు భారం బదిలీ :-

**7.12.1 వ్యక్తిగత ఆదాయంపై పన్ను, పన్నుల భారం బదిలీ :-** వ్యక్తి ఆదాయంపై పన్నును ప్రత్యక్ష పన్ను అంటారు. ప్రత్యక్ష పన్నులను బదిలీ చేయడానికి అవకాశం ఉండదు. సాధారణంగా పన్నుల భారం, ధరలు పెరగడం ద్వారా బదిలీచేయవచ్చు. వస్తువుల అమ్మకం అయిన తరువాత వచ్చే ఆదాయం పైన ఆదాయం పన్ను విధించడం జరుగుతుంది. కాబట్టి పన్ను విధించిన తరువాత ధరను పెంచడానికి వీలుండదు. అందువల్ల ఆదాయం పన్నును బదిలీచేయడం కష్టం. ఆదాయం పన్ను ఉత్పత్తి వ్యయంతో కలసి ఉండేదాన్ని బట్టి ఆ పన్ను భారాన్ని బదిలీచేయడానికి అవకాశం లేదని డాల్టన్ అభిప్రాయం. కొంతమంది అభిప్రాయం ప్రకారం ఆదాయం పన్నుభారాన్ని బదిలీచేయడానికి కూడా వీలుంటుంది. వ్యాపార సంస్థలు తాము చెల్లించవలసిన ఆదాయం పన్నును ముందుగా ఊహించి ధరలో పన్ను భారాన్ని చేర్చి పన్నుల భారాన్ని బదిలీచేస్తాయి. శ్రామికులు పొందే వేతనాలపై ఆదాయం పన్ను విధించినప్పుడు శ్రమ సప్లయ్ తగ్గవచ్చు. అందువల్ల పన్నుల భారంలో కొంతభాగాన్ని యజమానికి బదిలీచేయవచ్చు. ఈ బదిలీని పన్నుల భారం వెనుకకు బదిలీ అనవచ్చు. కాని స్వల్పకాలములో వాస్తవముగా స్వల్పకాలములో ఆదాయం మీద విధించిన పన్నుల భారాన్ని బదిలీ చేయడానికి వీలుండదు. పన్ను విధించినవాడే ప్రత్యక్షముగా పన్నులను చెల్లించాలి. కాని దీర్ఘకాలములో ఈ పన్నుల భారాన్ని కొంత మేరకు బదిలీచేయవచ్చు.

**7.12.2 ఆస్తి పన్ను పన్నుల భారం బదిలీ :-** ఆస్తిని వినియోగానికి కాని ఉత్పత్తికి కాని ఉపయోగించవచ్చు. ఆస్తి వినియోగానికి ఉపయోగించబడినప్పుడు దాని యజమానిపై విధించబడిన పన్ను బదిలీచేయబడదు. ఎందుకంటే ముందుకు బదిలీచేయడానికి అవసరమయ్యేధర ఉండదు ఉదా॥కి ఇంటి మీద కాని, నివాస యోగ్యమైన భూమి మీద కాని విధింపబడిన పన్ను బదిలీ చేయబడదు. కొన్ని కొన్ని సార్లు ఇంటిపన్ను పరోక్షముగా బదిలీచేయబడుతుంది. అంటే ఇంటి అద్దెను పెంచడం వల్ల అద్దెకుండే వారిపై ఈ భారం బదిలీ చేయబడుతుంది. ఈ పరిస్థితులలో పన్ను అంతిమ ప్రభావం ఇంటి యజమాని అద్దెకూడా వారి మధ్య డిమాండ్ సప్లైల వ్యాకోచత్వం

ఆధారంగా విభజింపబడుతుంది. ఆస్తి పన్ను విషయములో మూలధనీకరణ వల్ల పన్నుభారాన్ని వెనుకకు బదిలీ చేసే అవకాశం ఉంది. ఆస్తి కొనుగోలుదారు పన్ను చెల్లింపు కోసం దాని విలువను తగ్గిస్తాడు. ఈ విషయం ఇదివరకే విపులీకరించబడింది. ఆస్తి ఉత్పత్తి కోసం ఉపయోగించబడితే పన్ను అంతిమ ప్రభావం ఏమవుతుంది. ఒక భవనం వస్తువులను ఉత్పత్తి చేయడానికి ఉపయోగించబడితే ఆ భవనం పై విధించిన పన్ను భారాన్ని ఆ ఉత్పత్తి కొనుగోలుదారులకు బదిలీచేయడానికి అవకాశం ఉంటుంది. దీనినే పన్ను ముందుకు బదిలీ అంటారు. ఇవి ఉత్పత్తి చేయబడిన వస్తువుల యొక్క డిమాండ్ సప్లైల వ్యాకోచత్వంపై ఆధారపడి ఉంటుంది.

డిమాండ్ సప్లైల వ్యాకోచత్వం ఆధారంగా పన్ను బదిలీ నిర్ణయించబడుతుంది. అంతిమ ప్రభావాన్ని ప్రభావితం చేసే మరికొన్ని కారణాలు కూడా ఉన్నాయి. అవి మార్కెట్‌లో ఉపయోగింపబడే సాధారణ పద్ధతులతో సంబంధం కలిగి ఉంటాయి. ఉదాహరణకు ఉత్పత్తిదారులచే ఒక వస్తువుకు నిర్ణయింపబడిన అసలు ధర వినియోగదారులకు తెలియకపోవచ్చు. ఏదో ఒక అమ్మకందారు పన్ను కూడా కలుపుకొని ధర నిర్ణయించి కొనుగోలుదారుకు భారాన్ని బదిలీచేస్తాడు. కొన్నిసార్లు మార్కెట్ లోపం వల్ల అసలు పన్నుకంటే ఎక్కువుగా ధరను పెంచడానికి అవకాశం ఉంది. ఒక వస్తువు తయారీలో ప్రవేశించి ఉత్పాదకాలపై విధించిన పన్ను వల్ల "కేస్కేడింగ్ ప్రభావం" (Cascading effect) కలగవచ్చు. దీనివల్ల ఒక వస్తువు పన్నుధర పన్నుమొత్తం కంటే కూడా ఎక్కువగా పెరుగుతుంది. కొన్నిసార్లు పన్ను చాలా తక్కువగా ఉంటే వస్తువు ధర పెంచకుండా ఉత్పత్తిదారులు తమంతతామే ఆ పన్నులను భరిస్తాడు. కావున వారు కొనుగోలుదార్ల సదభిప్రాయాన్ని (good will) పోగొట్టుకోకుండా ఉంటారు. ఒక వస్తువుకు ఎక్కువ సంఖ్యలో ప్రత్యామ్నాయాలు ఉంటే పన్ను బదిలీ కష్టమవుతుంది. కొనుగోలుదారు తన వినియోగాన్ని పన్ను విధింపబడిన వస్తువుల నుండి పన్ను విధింపుని (లేక) పన్ను తక్కువుగా నున్న వస్తువులకు మార్చుకుంటాడు.

**7.12.3 ఎగుమతి, దిగుమతి సుంఖాలు పన్నుభారం బదిలీ :-** పన్ను భారం బదిలీ అనునది ఎగుమతిదారుని నుంచి దిగుమతిదారునికి జరుగుతుంది విదేశీ అమ్మకందారుడు నుంచి దిగుమతిదారుడు నుంచి బదలాయింపు అనేది సప్లై డిమాండ్ వ్యాకోచత్వాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. దిగుమతి దేశంలో తన వస్తువుకు పూర్తి వ్యాకోచ డిమాండ్ ఉన్నట్లయితే పన్ను బదలాయింపు విదేశీ అమ్మకందారుడు మీదనే ఉంటుంది. ఒకవేళ తన వస్తువుకు దిగుమతి దేశంలో పూర్తి అవ్యాకోచ డిమాండ్ ఉన్నట్లయితే పన్ను బదలాయింపు మొత్తం దిగుమతి దేశంలో కొనుగోలుదారుని మీద ఉంటుంది. అమ్మకపు దేశంలో ఒక వస్తువు యొక్క సప్లై పూర్తి అవ్యాకోచితమైతే దిగుమతి సుంఖం బదలాయింపు అనేది విదేశంలో ఉన్నా ఎగుమతిదారుడు మీద ఉంటుంది. ఒకవేళ సప్లై వ్యాంకోచం అయినట్లయితే పన్ను బదలాయింపు అనేది దిగుమతి దేశంలో ఆ వస్తువుకున్న డిమాండ్ వ్యాకోచత్వాన్ని బట్టి ఉంటుంది. ఎగుమతి సుంఖాలు అనేవి కూడా సాపేక్ష వ్యాకోచ డిమాండ్‌లను బట్టి ఆధారపడి ఉంటుంది. దిగుమతి దేశంలో వస్తువుకు డిమాండ్ పూర్తి వ్యాయకోచితంగా ఉన్నట్లయితే పన్ను బదలాయింపు మొత్తం పూర్తిగా ఎగుమతిదారుని మీదనే ఉంటుంది. అదేవిధముగా వస్తువులకు డిమాండ్ పూర్తి వ్యాకోచమైనటయితే, మరియు ఎగుమతిదారుడు ప్రపంచంలో ఏకస్వామ్యదారుడుగా ఉన్నట్లయితే పన్ను మొత్తం బదలాయింపు అనేది పూర్తిగా దిగుమతి దేశం మీద పడుతుంది. అదే విధముగా సప్లై విషయానికి వస్తే పూర్తి అవ్యాకోచితమైతే సుంఖం అనేది పూర్తిగా ఎగుమతిదారునికి వ్యాకోచితమైతే ఎగుమతి సుంఖము అనేది దిగుమతి దేశంలో డిమాండ్ వున్నా అవసరతను బట్టి ఉంటుంది.

## 7.13. ముగింపు :-

ఒక వ్యక్తి మరణాంతరం అతని ఆస్తిపై విధించే పన్నునే మరణ సుంఖము అంటారు. పై విధంగా పన్నుల భారాన్ని గూర్చి వివరించవచ్చు. పన్నుల విశ్లేషణలో పన్నుల భారం అనే అంశాన్ని గూర్చి తెలుసుకోవడం కూడా అత్యంత ఉపయోగకరం. పన్నుల భారాన్ని ఎవరు భరిస్తారు అంతిమంగా దాని తాకిడి ఎవరి మీద ఉంటుందన్న విషయాలకు పన్నుభారం విశ్లేషించబడాలి. అందుకే ఫ్రెంచ్ ఆర్థిక శాస్త్రవేత్త అయిన "నికోలస్ ఫ్రాన్సిస్ కానార్డ్" పన్ను విధింపును ఒక నిశ్చలమైన నీటి చెరువులో విసిరిన రాయితో పోల్చవచ్చు అన్నాడు. చెరువులో విసిరిన రాయి వల్ల అలలు బయలుదేరి కొంత కాలానికి నిశ్చలత ఏర్పడుతుంది. అదే విధముగా పన్నులు విధించినప్పుడు ఆ భారం కొంత కాలానికి ఆర్థిక వ్యవస్థలో కలసిపోతుంది. భారం భరించేది ప్రాథమికంగా ఎవరు, చిట్టచివరికి అది ఎలా బదలాయించబడుతుందో

తెలుసుకుంటే పన్నుల ప్రభావాలను గూర్చి తెలుసుకోవచ్చు. తద్వారా జాతీయాభివృద్ధి మంచి ప్రభావాలను కల్గిస్తున్న పన్నులను ఎంచుకొని కొత్త విధానాన్ని రూపొందించుకోవచ్చు.

## 7.14. ముఖ్యమైన పదాలు :-

Tax Incidence :- పన్నుభారం

Tax shiffting :- పన్ను బదలాయింపు

Money Burden :- ద్రవ్యభారం

Disposable Income :- వ్యయార్హా ఆదాయం

Economic Welfare :- ఆర్థిక సంక్షేమం

Formal :- వ్యవహారికమైన

Effective :- సార్థకమైన

Capital Formation :- మూలధన సంచయనం

Balanced Budget :- సమతౌల్య బడ్జెట్

Impact :- తాకిడి, ప్రభావము

Forward shifting :- ముందుకు బదిలీ

Backward shifting :- వెనుకకు బదిలీ

Tax Capitalisation :- పన్ను మూలధనీకరణ

Concentration Theory :- కేంద్రీకరణ సిద్ధాంతం

Diffussion :- వ్యాప్తి

Demand Elasticity :- డిమాండ్ వ్యాకోచిత్వం

Increasing cost :- పెరుగుతున్న వ్యయం

Constant cost :- స్థిర వ్యయం

Decrecsing cost :- తగ్గుచున్న వ్యయం

Perfeet competition :- సంపూర్ణమైన పోటీ

Monopoly :- ఏకస్వామ్యం.

Monopolistic :- ఏకస్వామ్య పోటీ

Oligopoly :- పరిమిత స్వామ్యం

Export duty :- ఎగుమతి పన్ను

Import duty :- దిగుమతి పన్ను

## 7.15 స్వీయ అవగాహన ప్రశ్నలు :

I. ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు ఇవ్వండి.

1. పన్ను బదలాయింపు అనగానేమి? పన్ను బదలాయింపుకు దోహదం చేసే అంశాలను వివరించండి?
2. పన్ను భారానికి నిర్వచనాన్ని తెలుపుతూ పన్ను బదలాయింపు సిద్ధాంతాలను తెల్పండి
3. పన్ను భార బదలాయింపు అనగానేమి? కొన్ని ముఖ్యమైన పన్నుల భారం బదిలీని వివరించండి?

II. ఈ క్రింది ప్రశ్నలకు సంక్షిప్త సమాధానాలు ఇవ్వండి

1. పన్ను మూలధనీకరణ పద్ధతి దానికి గల నిబంధనలు?
2. కేంద్రీకరణ సిద్ధాంతం
3. వ్యాప్తి సిద్ధాంతం
4. ఆధునిక సిద్ధాంతం
5. మార్కెట్ స్వభావం పన్ను బదలాయింపు?
6. ఆస్తి పన్ను పన్నుల భారం బదిలీ

## 7.16 చదవవలసిన గ్రంథాలు :


1. B.P. Tyagi : Public Finance
2. H.L. Bhatia : Public Finance
3. Mus grave R.A : Theory Public Finance
4. R.K Chowdhury : Public Finanle and Fiscal Policy
5. Mankar & Sarme : Public Finance.


ప్రొ. జి. చంద్రశేఖరరావు

పాఠం - 8

# ప్రభుత్వ వ్యయం - సాంఘిక వస్తువుల సిద్ధాంతం

## పాఠ్య నిర్మాణ క్రమం


8.0 ఉద్దేశాలు

8.1 ఉపోద్ఘాతం

8.2 ప్రభుత్వ వ్యయ విభజన లేక వర్గీకరణ

8.3 ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ వ్యయ ప్రభావం

8.4 సాంఘిక వస్తువుల సిద్ధాంతం - కొన్ని ముఖ్య లక్షణాలు

8.5 సారాంశం

8.6 ముఖ్య పదాలు

8.7 స్వయం సమీక్ష ప్రశ్నలు

8.8 చదవవలసిన పుస్తకాలు


## 8.0 ఉద్దేశాలు

ఈ పాఠ్యభాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది అంశాలను తెలుసుకోగలరు.

ఎ) ప్రభుత్వ వ్యయాన్ని వివిధ ఆర్థిక వేత్తలు ఏ విధంగా విభజించిందీ, భారత దేశంలో ప్రభుత్వ వ్యయవర్గీకరణ ఏ విధంగా వున్నదీ వివరింపగలగాలి.

బి) ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ వ్యయ ప్రభావం ఎలా వున్నదీ వివరించి ముఖ్యంగా ఉత్పత్తి, పంపిణీ, ఆర్థిక సుస్థిరతలపై వ్యయ ప్రభావం ఎలా వున్నదీ సమీక్షించగలగాలి.

సి) సాంఘిక వస్తువుల సిద్ధాంతాన్ని వివరించి, సాంఘిక, ప్రైవేటు వస్తువుల మధ్య పోలికలను విశదీకరించగలగాలి.

డి) సాంఘిక వస్తువుల సాధారణ నమూనా లేక శామ్యూల్సన్ సాంఘిక వస్తువుల నమూనాను రేఖా చిత్రం ద్వారా వివరింపగలగాలి.

## 8.1 ఉపోద్ఘాతం :

ప్రజాస్వామ్య దేశాలలో ప్రజల దగ్గరనుండి వసూలు చేయబడిన ప్రభుత్వ ఆదాయాన్ని ప్రజల సంక్షేమం కోసమే వ్యయం చేయాల్సి వుంటుంది. ప్రభుత్వ వ్యయాన్ని దేశ అభివృద్ధి కోసం ప్రభుత్వ రాబడిని అనేక కార్యక్రమాల మీద వ్యయం చేయాల్సి వుటుంది. ప్రభుత్వ వ్యయంలో దుర్వినియోగాన్ని అరికట్టి, ప్రతిఫలాలను పెంచేవిధంగా ఆలోచించి వ్యయం చేయాల్సి వుంటుంది. 19వ శతాబ్దంలో అనేకమంది ఆర్థిక వేత్తలు ప్రభుత్వ వ్యయాన్ని విభజించారు. కానీ ఏ ఇద్దరి విభజన ఒకేలా లేదు. ప్రభుత్వ వ్యయ విభజన సరిగా వుంటే వివిధ కాలాల మధ్య, వివిధ దేశాల మధ్య ప్రభుత్వ వ్యయ పోకడలను పోల్చి చూసుకునే అవకాశం వుంటుంది. అందుకనుగుణంగా ఈ పాఠ్యాంశంలో వివిధ ఆర్థిక వేత్తలు ప్రభుత్వ వ్యయాన్ని ఏ విధంగా విభజించినదీ నిశితంగా పరిశీలించాల్సిన అవసరం వున్నది.

ఈ ఆధునిక యుగంలో ప్రభుత్వ వ్యయం క్రమేపీ పెరుగుతున్నట్లు అన్ని దేశాల అనుభవాలు తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ వ్యయ ప్రభావం ఉత్పత్తి, పంపిణీ, ఆర్థిక సుస్థిరతలపై ఏ విధంగా ఉన్నదీ నిశితంగా పరిశీలించాల్సిన అవసరం వున్నది. దుష్ఫలితాలను నివారించి, సత్ఫలితాలు సాధించేందులకు ఈ విశ్లేషణ ఎంతగానో ఉపయోగపడుతుంది. మొత్తం మీద ప్రభుత్వ వ్యయ ప్రభావం ఆర్థిక వ్యవస్థపై ఎలా వున్నదో ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాల్సిన అవసరం వున్నది.

ప్రజలందరికీ మినహాయింపు లేకుండా అవసరమైన సామాజిక లేక సాంఘిక లేక ప్రభుత్వ వస్తువులుకు బడ్జెట్ ద్వారా వ్యయాన్ని కేటాయించి ప్రభుత్వమే అందించే ప్రయత్నం చేయాలి. ప్రొఫెసర్ మస్‌గ్రేవ్ ప్రకారం సమాజంలో అందరి సామాజిక అవసరాలను సమానంగా తీర్చటమే సాంఘిక వస్తువుల కర్తవ్యము. కాబట్టి ప్రభుత్వమే అందరికీ అవసరమైన సాంఘిక వస్తువుల విషయంలో సమర్థవంతంగా వ్యయ కేటాయింపు చేయాల్సిన అవసరం ఉన్నది. అందుకయ్యే వ్యయం ప్రజలపై పన్నులు విధించటం ద్వారా ప్రభుత్వం సంపాదిస్తుంది. కాబట్టి ప్రజలందరి అవసరాలను తీర్చేందులకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు పాత విధానాలకంటే మెరుగైన విధానాలు అవలంభించాలి. అప్పుడే ప్రభుత్వ వ్యయం సమర్థవంతంగా వినియోగింపబడుతుంది.

## 8.2. ప్రభుత్వ వ్యయ విభజన లేక వర్గీకరణ :

ప్రభుత్వ వ్యయ స్వరూపాన్ని, ప్రభావాన్నీ కూలంకషముగా పరిశీలించాలంటే ప్రభుత్వ వ్యయ విభజన లేక వర్గీకరణ అత్యంత ముఖ్యము. వ్యయాన్ని పోల్చుకోవటానికి, నియంత్రణ చేయటానికి వర్గీకరణ ఎంతో అవసరము.

ప్రొఫెసర్ షిరాస్ అభిప్రాయం ప్రకారము ప్రభుత్వ వ్యయ ఫలితాలను పరిశీలించాలంటే మొత్తం వ్యయాన్ని బట్టికాక ఒక్కొక్క అంశానికి ఎంతెంత కేటాయించాము అనే దానిని బట్టి తెలుస్తుంది. అంతేకాక ప్రజాస్వామ్య దేశాలలో ప్రజలదగ్గరనుండి వసూలు చేయబడిన ప్రభుత్వ రాబడిని దేనిమీద ఎంత ఖర్చు పెట్టినదీ ప్రభుత్వం వివరంగా ప్రజలకు తెలియజేయాలి. అందులకై ప్రభుత్వ వ్యయ వర్గీకరణ ఎంతగానో ఉపకరిస్తుంది.

ప్రభుత్వ రాబడి సద్వినియోగమవుతున్నదీ లేక దుర్వినియోగమవుతున్నదీ కూడ వ్యయ వర్గీకరణను బట్టి తెలుస్తుంది. ప్రభుత్వ వ్యయం ప్రజలందరి ప్రయోజనం కోసం వెచ్చించబడుతున్నదా లేక ఏదైనా ప్రత్యేక వర్గానికి మాత్రమే ప్రయోజనం కల్గిస్తున్నదా అన్ కూడ తెలియజేస్తుంది.

ప్రభుత్వ వ్యయాన్ని అనేక రకాలుగా వర్గీకరించవచ్చు. వర్గీకరణ చేయటంలోని ఉద్దేశాన్ని బట్టి అనేక రకాలుగా విభజించవచ్చు. ప్రొపెసర్ మర్ఫ్ అభిప్రాయం ప్రకారము "19వ శతాబ్దపు కోశ విధాన రచయితలు ప్రభుత్వ వ్యయానికి సరయిన వర్గీకరణ చేసేందుకు విఫల ప్రయత్నాలు జరిపినా ఏ ఇద్దరూ ఒకే రకమైన విభజనను ఉపయోగించలేదు."

అయితే ఆధునిక అర్థశాస్త్ర వేత్తలు ప్రభుత్వ వ్యయ వర్గీకరణలో తమ ప్రయోజనానికి కావలసినన్ని వర్గీకరణలను ఉపయోగిస్తున్నారు. అయినప్పటికి ప్రభుత్వ వ్యయ వర్గీకరణ ప్లెన్, నికోల్సన్, ఆడమ్‌స్మిత్, మిల్, రోచర్, షిరాస్, డాల్టన్ మొదలగు అర్థశాస్త్ర వేత్తలు వివిధ రకాలుగా చేసినారు.

వర్గీకరణ సంతృప్తికరంగా ఉండవలెనంటే కనీసం రెండు నియమాలను పాటించవలసి వుంటుంది.

1. వర్గాలు వేరు వేరుగా వుండవలెను. అలావున్నప్పుడు మాత్రమే ఏ వ్యయాన్నైనా నిస్సందేహంగా ఆయా వర్గములో చర్చించటానికి వీలవుతుంది.

2. వర్గీకరణకు ఆధారంగా తీసుకొన్న లక్షణం, వర్గీకరించే దాని ముఖ్య లక్షణాలలో ఒకటిగా వుండవలెను.

ఈ రెండు నియమాలు పాటించినప్పుడే వర్గీకరణ శాస్త్రీయమైనది అవుతుంది.

**1. ప్రయోజన ప్రాతిపదికగా వ్యయ విభజన :** కోన్, ప్లెన్‌లు ప్రయోజనం ప్రాతిపదికగా తీసుకొని ఈ క్రింది నాలుగు విధములుగా ప్రభుత్వ వ్యయాన్ని విభజించారు.

ఎ) మొత్తం సమాజ ప్రయోజనానికి ఉపకరించే ప్రభుత్వ వ్యయం. ఉదా : రక్షణ, పరిపాలన, విద్య, రోడ్లు, సమాచారం మొదలగునవి.

బి) కొద్దిమందికే ప్రయోజనాన్నిచ్చే ప్రభుత్వ వ్యయం. ఉదా : పేదల సంక్షేమ పథకం, వృద్ధులకిచ్చే ఫించను, స్త్రీ శిశు సంక్షేమ పథకాలు మొదలగునవి.

సి) కొద్ది మందికి మరియు మొత్తం సమాజానికి ప్రయోజనాన్నిచ్చే ప్రభుత్వ వ్యయము.

డి) కొన్ని ప్రత్యేక గ్రూపులకే వుపకరించే ప్రభుత్వ వ్యయము. ఉదా : నష్టాలలో వున్న పరిశ్రమలకిచ్చే సబ్సిడీలు మొదలగునవి. అయితే పైన ఉదహరించిన వ్యయ వర్గీకరణ ఆచరణలో చాలా కష్టతరమైనదని చెప్పవచ్చును.

**2) నికోల్సన్ వ్యయ వర్గీకరణ :** ప్రభుత్వ వ్యయానికి వచ్చే ప్రతి ఫలాన్ని ప్రాతిపదికగా తీసుకొని నికొల్సన్ ఈ క్రింది విధముగా విభజించినాడు.

ఎ) తిరిగి ఆదాయము ఇవ్వని ప్రభుత్వ వ్యయం. ఉదా : యుద్ధ వ్యయం.

బి) ప్రత్యక్ష ప్రతిఫలంకాక పరోక్ష ప్రతిఫలం ఇచ్చే ప్రభుత్వ వ్యయం. ఉదా : విద్యావంతులవలన నేరస్థులకంటే దేశానికి ఎక్కువ ప్రయోజనం వుంటుంది. విద్యా వంతులు ప్రభుత్వ వ్యయంవలన లాభిస్తారు. అంతేకాక ఉత్తమ పౌరులుగా కూడ తయారుతారు.

సి) కొద్ది ప్రత్యక్ష ప్రతి ఫలాలిచ్చే ప్రభుత్వ వ్యయం. ఉదా : విద్యాలయాలలో విద్యార్థులు చెల్లించే ఫీజు.

డి) పూర్తి ప్రతి ఫలాల్ని లేక లాభాల్నిచ్చే ప్రభుత్వ వ్యయము. ఉదా : పోస్టాఫీసు, ప్రభుత్వ రంగ సంస్థలు, రైల్వేలు మొదలగునవి.

**3. ఆడమ్ స్మిత్ వ్యయ వర్గీకరణ :** ఆడమ్ స్మిత్ ప్రభుత్వ వ్యయాన్ని ఈ క్రింది మూడు విధాలుగా ప్రభుత్వం నిర్వర్తించే విధులను బట్టి విభజించినాడు.

ఎ) రక్షణ విధులు నిర్వర్తించేందుకు అయ్యే వ్యయం. ఉదా : రక్షణ, పోలీసు, కోర్టులు మొదలగునవి.

బి) వాణిజ్య విధులు నిర్వర్తించేందుకు అయ్యే వ్యయం, ఉదా : సంతలు, ప్రభుత్వ పారిశ్రామిక ఎగ్జిబిషన్‌లు నిర్వర్తించేందుకు అయ్యే వ్యయం. ఉదా : విద్య, రోడ్లు, రైల్వేలు, వినోదం మొదలగునవి.

అయితే వివిధ ప్రభుత్వ వ్యయాల్ని దేని క్రింద చూపాలి అనే ప్రశ్న వచ్చినప్పుడు వాస్తవంగా వర్గీకరణలో అనేక ఇబ్బందులున్నాయి.

**4) జె.యస్.మిల్. వ్యయ వర్గీకరణ :**

**ఎ) అవసరమైనది లేక తప్పనిసరి అయినది :** గతంలో చేసుకొన్న ఒప్పందాలవలనగానీ, ఇతర చట్ట సంబంధమైన బాధ్యతల వలనగాని ఈ వ్యయాన్ని ఖర్చు చేయవలెనా, లేదా అని ఆలోచించుకొనేందుకు వీలులేక విధిగా ఖర్చు చేయవలసిన వ్యయం. ఉదా : రక్షణ వ్యయం.

**బి) వై కల్పిక వ్యయము :** ప్రభుత్వం వ్యయం చేయటానికిగానీ, చేయక పోవటానికి కానీ వీలున్నది. అంటే వ్యయాన్ని నిర్ణయించుకొనేందుకు పూర్తి స్వేచ్ఛ వున్నవాటిని వైకల్పిక వ్యయం అందురు. ఉదా : పేదల సంక్షేమము, స్త్రీ, శిశు సంక్షేమములపై పెట్టే వ్యయం.

**5) రోశ్చర్ ప్రభుత్వ వ్యయ వర్గీకరణ :**

**ఎ) అవసరమైనది :** తప్పక చేయవలసిన వ్యయం కాబట్టి వాయిదాలు వేయవీలుకానిది.

**బి) ఉపయోగకరమైనది :** అభిలషనీయమైనదైనప్పటికీ వాయిదా వేయ వీలున్నది.

**సి) అలంకార ప్రాయమైనది :** వ్యయం చేయటమా, మానటమా అని ప్రభుత్వం నిర్ణయించుకోవటానికి వీలున్నది.

**6) షిరాస్ వ్యయ విభజన :**

ఎ) ప్రాథమిక విధులను నిర్వర్తించేందుకు ప్రభుత్వానికయ్యే వ్యయం. ఉదా : రక్షణ, శాంతి భద్రతలు,

బి) గౌణమైన విధులను నిర్వర్తించేందుకు ప్రభుత్వానికయ్యే వ్యయం ఉదా : సాంఘిక వ్యయము, ప్రభుత్వ సంస్థలపై వ్యయం.

**7) పిగూ వ్యయ వర్గీకరణ :**

**ఎ) బదలాయింపు వ్యయము :** ఉచితముగా ప్రభుత్వం చెల్లించే మొత్తాలను లేదా ప్రయివేటు వ్యక్తుల ఆస్థులను లేక సేవలను కొన్నప్పుడు చెల్లించే మొత్తాన్ని బదలాయింపు వ్యయముగా పిగూ పేర్కొన్నాడు. ఉదా : సైనికబలము, నావికాదళము, విమానదళము, విద్యాసేవలు, న్యాయశాఖ, తంతి, తపాలా సేవలు.

**బి) ఇతర వ్యయము :** దీనినే నిజమైన వ్యయమని కూడ పిలవవచ్చు. ఉత్పత్తి వనరులను, ప్రస్తుత సేవలను కొనటానికి అయ్యే వ్యయాన్ని ఇతర వ్యయంగా చెప్పవచ్చును. ఉదా.: వడ్డీ చెల్లింపులు, ఫించన్లు, నిరుద్యోగ భృతి మొదలగునవి.

బదలాయింపు వ్యయము వల్ల సాంఘిక ఆదాయము పెరుగుతుంది. దేశంలో ఉత్పత్తి కూడా పెరుగుతుంది. ప్రభుత్వ వనరులను, సేవలను ప్రత్యక్షంగా కొన్నప్పుడు ఆ వ్యయం బదలాయింపు వ్యయమవుతుంది. ప్రభుత్వం బదలాయింపు వ్యయంలో కొంత విదేశాలకు చెల్లించవచ్చు. ఉదా : విదేశీ రుణాలపై వడ్డీ చెల్లింపులు అదే విధముగా మన దేశంలో సబ్సిడీల సహాయముతో తయారైన వస్తువులను విదేశాలకు ఎగుమతిచేసినపుడు బదలాయింపు వ్యయంలో కొంత భాగం విదేశాలకు చెందుతుంది. దీనినే బహిర్గత వ్యయ బదలాయింపు అంటారు.

**8. మెహతా వ్యయ వర్గీకరణ :**

ఎ) స్థిర వ్యయము

బి) చర వ్యయము

ప్రజలకు ఎంత వరకు ఉపయోగపడుతుందనే ప్రమేయము పైకాక విధిగా ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించుకొనేందుకై వెచ్చించే మొత్తమును స్థిర వ్యయమనవచ్చును. ఉదా : రక్షణ వ్యయము.

ప్రజలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రభుత్వం అందించే సేవలకు అయ్యే వ్యయంగా చరవ్యయాన్ని పేర్కొనవచ్చు. ప్రభుత్వ సేవలు పెరిగే కొద్దీ ప్రభుత్వ వ్యయం కూడ పెరుగుతుంది. ఉదా : తంతి తపాలా సేవలు. ఎక్కువ పోస్టాఫీసులు పెట్టి ప్రజలకు సేవలు చేస్తున్నప్పుడు ప్రభుత్వ వ్యయం కూడా పెరుగుతుంది. జనాభా పెరిగినప్పుడు విధిగా ఈ చర్య వ్యయం కూడా పెరుగుతుంది. అయితే ఈ వర్గీకరణ మిగిలిన వారివలె ప్రయోజనం ప్రాతిపదికగా కాక ఖర్చును ప్రాతిపదికగా తీసుకొని చేయటం జరిగినది.

**9. డాల్టన్ వ్యయ వర్గీకరణ :**

ఎ) గ్రాంట్లు, ఉదా : ఉచిత విద్య, వృద్ధాప్యపు ఫించన్లు.

బి) కొనుగోలు ధరలు, ఉదా : వేతనములు, జీతములు

ప్రభుత్వమునుండి ద్రవ్యాన్నిగానీ, దానితో సమానమైన దానినిగాని పొందిన వ్యక్తి దానికి బదులు ప్రత్యక్షంగా ప్రభుత్వానికి వస్తు రూపములోగానీ, సేవ రూపములోగాని బదులు ఇస్తే ప్రభుత్వము చెల్లించిన మొత్తాన్ని కొనుగోలు ధర అంటారు. అలాకాక, ప్రత్యక్షంగా ప్రతిఫలాన్ని బదులు ఇవ్వనట్టి వ్యయాన్ని గ్రాంటు అని చెప్పవచ్చు. గ్రాంట్లు ధన రూపములోగానీ, సేవల రూపములోగానీ వుండవచ్చు.

గ్రాంట్లను ఇచ్చేటప్పుడు ప్రభుత్వం వాటిని అందుకొనేవారికి స్వీకరించగల సామర్థ్యం వుందా, లేదా అని గమనించవలెను. పేద ప్రజలకు గ్రాంట్లను స్వీకరించగల శక్తి ఎక్కువగా వుంటుంది. ఎందుకనగా వారి ఆదాయాలు సహజంగా తక్కువగా వుంటాయి. గ్రాంట్లను రెండు రకాలుగా విభజించవచ్చు.

ఎ) ప్రత్యక్ష గ్రాంట్లు

బి) పరోక్ష గ్రాంట్లు

**ఎ) ప్రత్యక్ష గ్రాంట్లు :** గ్రాంటు పొందిన వ్యక్తి ఆ గ్రాంటువలన పూర్తి ప్రయోజనం పొందినపుడు ప్రత్యక్ష గ్రాంటు అని పిలుస్తాము. ఉదా : వృద్ధాప్యపు ఫించను.

బి) పరోక్షగ్రాంట్లు : గ్రాంటు పొందిన వ్యక్తికాక వేరొక వ్యక్తి పాక్షికంగాకానీ, పూర్తిగా కానీ ప్రయోజనాన్ని పొందినపుడు పరోక్ష గ్రాంటు అందురు. ఉదా : ఒక పరిశ్రమకు ఇచ్చిన సబ్సిడివలన వినియోగదారులకు వస్తువులు తక్కువ ధరకే లభ్యమైనయెడల వినియోగదారుడు కూడ పరోక్షంగా ప్రయోజనము పొందగలడు.

గ్రాంట్లను ఈ క్రింది విధముగా కూడ విభజించవచ్చు.

ఎ) అనుపాత గ్రాంట్లు : ప్రతి వ్యక్తికి ఒకే అనుపాతంలో గ్రాంటు ద్వారా ఆదాయాలు పెరిగితే వాటిని అనుపాతమైన గ్రాంట్లు అనవచ్చు. పొదుపు మొత్తాలు పెరిగినప్పుడు అదే అనుపాతములో గ్రాంట్లను పెంచటం, పొదుపు మొత్తాలు తగ్గినప్పుడు అదే అనుపాతములో గ్రాంట్లను పెంచటం, పొదుపు మొత్తాలు తగ్గినప్పుడు అదే అనుపాతములో గ్రాంట్లను తగ్గించటం చేయాలి.

బి) పురోగామి గ్రాంట్లు : ఆదాయాలు తక్కువైన కొద్దీ ఎక్కువ గ్రాంట్లను ఇవ్వటం. ఉదా : సన్నకారు, చిన్నకారు రైతులకు ఎక్కువ గ్రాంట్లు.

సి) తిరోగామిగ్రాంట్లు : ఆదాయాలు పెరిగే కొద్దీ ఎక్కువ రేట్లతో గ్రాంట్లు ఇవ్వటం, ఆదాయాలు తగ్గేకొద్దీ తక్కువ రేట్లతో గ్రాంట్లనివ్వడం జరుగుతుంది. ఉదా : పెద్ద పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లు.

**ఆర్థిక వర్గీకరణ :**

ప్రభుత్వ వ్యయాన్ని ఆధునిక యుగంలో దేనిమీద ఎంత వ్యయము చేయబడుతున్నదో పూర్తి సమాచారమును తెలియజేసేందుకు ఈ ఆర్థిక వర్గీకరణ ఎంతగానో ఉపకరిస్తుంది. దాదాపు అన్ని అభివృద్ధి చెందిన దేశాలు నేడు ఇదే వర్గీకరణను అవలంబిస్తున్నాయి. ఈ వర్గీకరణవలన ప్రభుత్వ కోశ వ్యవహారాల ప్రభావము ఆర్థిక వ్యవస్థపై ఎట్లా వుంటుందో తెలుసుకోవడానికి వీలవుతుంది. అంతేకాక స్థూల జాతీయోత్పత్తి, ఉపాధి స్థాయి మొదలగు వాటిలో మార్పులు చేయటానికి అవసరమైన కోశ సంబంధ చర్యలను నిర్ణయించుకోవటానికి కూడ ఈ వర్గీకరణ ఎంతగానో ఉపకరిస్తుంది.

ప్రభుత్వ వ్యయాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు.

1. కరెంటు ఖాతా : ఈ ఖాతాలో ప్రభుత్వ వ్యయం ఈ క్రింది విధముగా వుంటుంది.

**ఎ) ప్రభుత్వ పరిపాలనా వ్యయము :**

ప్రభుత్వ పరిపాలనా వ్యయాన్ని వినియోగ వ్యయము మరియు బదిలీ చెల్లింపులని రెండు విధములుగా విభజించవచ్చును.

1) వినియోగ వ్యయము

ఎ) వేతనాలు, జీతాలు

బి) వస్తు సేవలపై వ్యయాలు

2) బదిలీ చెల్లింపులు

ఎ) వడ్డీ

బి) రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు, స్థానిక సంస్థలకు ఇచ్చే గ్రాంట్లు.

సి) ఇతర కరెంటు బదిలీలు (సబ్సిడీలు, పెన్షన్లు మొదలగునవి)

**బి) ప్రభుత్వ శాఖలు నిర్వహించే వాణిజ్య సంస్థలు :**

ఈ సంస్థలపై పెట్టే వ్యయాన్ని ఈ క్రింద పేర్కొనబడిన ఎనిమిది భాగాలుగా విభజించవచ్చు.

1. వేతనాలు, జీతాలు
2. పెన్షన్లు
3. వస్తువులు, సేవలు
4. మరమ్మత్తులు

5. వడ్డీ

6. తరుగుదలకు నిర్దేశించబడినవి

7. ప్రభుత్వ పాలన, కరెంటు ఖాతాకు బదిలీ చేసిన లాభాలు

8) వాణిజ్య సంస్థలు తమవద్దనే మిగుల్చుకొన్న లాభాలు.

**సి) ప్రభుత్వ పాలన, శాఖలు మరియు వాణిజ్య సంస్థలు :**

ఈ ఖాతా ప్రభుత్వ పాలన, ప్రభుత్వ శాఖల, వాణిజ్య సంస్థల మూలధనలావా దేవీలకు సంబంధించినవి ఈఖాతా క్రింద వ్యయాన్ని.

1. స్థూల మూలధన కల్పన ఎ) కట్టడాలు, ఇతర నిర్మాణాలు బి) యంత్రాలు, పరికరాలు.

2. నిలవల పెరుగుదల (ఆహార ధాన్యాల నిల్వలు మొదలగునవి)

3. పెట్టుబడుల బదలాయింపు

**2) మూలధన ఖాతా :**

1. రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు, ఇతరులకు మూలధన కల్పనకోసం ఇచ్చిన గ్రాంట్లు

2. గ్రాట్యుయిటి, పెన్షన్ల మార్పుచేసిన విలువ

3. కాందిశీకులకు చెల్లించిన నష్ట పరిహారము

4. ఇతర మూలధన బదిలీలు

**భారతదేశంలో ప్రభుత్వ వ్యయ వర్గీకరణ : 1987-88** వ సంవత్సరమునకు ముందు మనదేశ కేంద్ర ప్రభుత్వ వ్యయమును ఈ క్రింది మూడు విధములుగా విభజించబడినది.

1. పౌర వ్యయము (జనరల్ సేవలు, సాంఘిక సేవలు, ఆర్థిక సేవలు)

2. రక్షణ వ్యయము

3. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకిచ్చే గ్రాంట్లు.

అదే కాలములో ప్రభుత్వ వ్యయమును ఈ క్రింది విధంగా కూడ విభజించాము.

**1. అభివృద్ధి వ్యయము :** ఉదా : ఎ) సాంఘిక, ఆర్థిక సేవలు బి) అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఇచ్చే అభివృద్ధి నిధులు.

**2. రక్షణ వ్యయము :** ఉదా : ఎ) రిటైర్ అయిన వారికిచ్చే పెన్షన్లు బి) జీతాలు సి) దిగుమతి చేసే రక్షణ సామాగ్రికి చెల్లించే బిల్లు.

**3. ఇతర వ్యయము :** ఉదా : ఎ) పన్నులు, సుంకాల వసూలుకు అయ్యే వ్యయము, బి) పరిపాలనా సేవలు సి) వడ్డీ చెల్లింపులు డి) పెన్షను మరియు ఇతర పదవీ విరమణ భృత్యములు, రక్షణ వ్యయం, ఇతర వ్యయాలను కలిపి అభివృద్ధేతర వ్యయం అందురు.

**సరికొత్త ఆర్థిక విభజన :** 1987-88 బడ్జెట్ నుండి మన కేంద్ర ప్రభుత్వ వ్యయం ఈ క్రింది విధముగా వర్గీకరించబడినది.

1. ప్రణాళికేతర వ్యయము

2. ప్రణాళికా వ్యయము

**1. ప్రణాళికేతర వ్యయము :** దీనిని రెండు విధాలుగా విభజించవచ్చును.

**1) రెవెన్యూ వ్యయం :** సహజంగా పన్నుల ద్వారా వచ్చిన రాబడిని ఈ క్రింది వాటిపై వెచ్చించటాన్నే రెవెన్యూ వ్యయం అందురు.

ఎ) వడ్డీ చెల్లింపులు

బి) రక్షణ వ్యయము

సి) ముఖ్యమైన సబ్సిడీలు (ఆహారం, ఎరువులు, ఎగుమతుల పెంపుకోసం)

డి) వడ్డీ మరియు ఇతర సబ్సిడీలు

ఇ) రైతులను ఋణభారం నుండి విముక్తి కల్గించటం

ఎఫ్) పోస్టల్ తరుగు

జి) పోలీస్

హెచ్) పెన్షన్లు

ఐ) సాంఘిక సేవలు (విద్య, ఆరోగ్యం)

జె) ఆర్థిక సేవలు (వ్యయసాయం, పరిశ్రమలు, శక్తి, రవాణా, సమాచారము, శాస్త్రము, సాంకేతిక పరిజ్ఞానము)

కె) రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లు మరియు ఇతర దేశ ప్రభుత్వాల కిచ్చే గ్రాంట్లు.

**2) మూలధన వ్యయము :** మూలధన వ్యయం సహజంగా ఈ క్రింది వాటిపై వెచ్చించటము జరుగుతుంది.

ఎ) రక్షణ మూలధన వ్యయం

బి) ప్రభుత్వ రంగ సంస్థలకిచ్చే రుణాలు

సి) రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు మరియు విదేశీ ప్రభుత్వాలకిచ్చే రుణాలు

**ప్రణాళికా వ్యయం :** దీనిని ఈ క్రింద నుదహరించిన రెండు విధాలుగా విభజించవచ్చును.

1. ఎ) కేంద్ర ప్రణాళికలు

బి) వ్యవసాయము

సి) గ్రామీణాభివృద్ధి

డి) నీటి పారుదల

ఇ) వరద నివారణ

ఎఫ్) శక్తి

జి) పరిశ్రమ మరియు ఖనిజములు

హెచ్) రవాణా, సమాచారములు

ఐ) శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానము

జె) పర్యావరణము మరియు కొన్ని సాంఘిక సేవలు

2. రాష్ట్ర ప్రభుత్వ మరియు కేంద్ర పాలిత ప్రాంతాల ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వ సహాయం.

పై వర్గీకరణములను బట్టి ప్రభుత్వ వ్యయాన్ని వివిధ రకాలుగా విభజించవచ్చును. ఈ వర్గీకరణ ఎల్లప్పుడు ఒకే విధముగా వుండవలెననే నియమమేమీలేదు. కాలానుగుణముగా మారుతున్న ప్రభుత్వ వ్యయ స్వరూపాన్ని బట్టి ఆయా దేశాలు తమకనుగుణంగా వర్గీకరించుకొనవచ్చు.

## 8.3. ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ వ్యయ ప్రభావము :

ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలలో ప్రభుత్వ వ్యయం ఒక ముఖ్య సాధనంగానేగాక, అనేక సాంఘిక లక్ష్యములను సాధించేందుకు కూడా ఎంతగానో ఉపకరిస్తుంది. అన్ని దేశాలలోనూ ప్రభుత్వ వ్యయం రానురాను పెరుగుతున్నది. ఆర్థికాభివృద్ధి సాధించిన కొలదీ, ప్రజల ఆదాయాలు కూడ పెరిగిన కొలది ప్రభుత్వ వ్యయమును కూడా విధిగా పెంచవలెను సనాతన ఆర్థిక వేత్తల అభిప్రాయం ప్రకారం ప్రభుత్వం వీలైనంత తక్కువగా ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొనాలి. అందువలన సనాతన ఆర్థిక వేత్తలగు ఆడమ్‌స్మిత్, జె.బి.సే మొదలగువారు ప్రతి ప్రభుత్వ వ్యయమూ దుర్వినియోగమని కూడా భావించినారు. అయితే ఆధునిక అర్థశాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, ముఖ్యముగా వాగ్నార్

భావించినట్లు, ప్రభుత్వ వ్యయం దాదాపు అన్ని దేశాలలోనూ పెరుగుతున్నదని చెప్పబడినది. అది తప్పనిసరిగా అన్ని దేశాలలోనూ వాస్తవం కాకపోయినప్పటికి, ఇంగ్లాండులాంటి దేశాలలో ప్రభుత్వ వ్యయం వాగ్నార్ చెప్పినట్లుగా 1890-1995 సంవత్సరముల మధ్య కాలములో స్థూలముగా పెరిగింది. దానివల్లనే ఆ దేశం సత్వర అభివృద్ధిని సాధించగలిగిందనీ పీకాక్-వైజ్‌మన్‌ల పరిశోధనా ఫలితంగా తెల్పినది.

కాబట్టి పెరుగుతున్న వ్యయం వలన అనేక ఆర్థికాభివృద్ధి ఫలితాలను వేగంగా సాధించగలమని అనేక ఆర్థిక వ్యవస్థల చరిత్రల ద్వారా తెలియుచున్నది. దుర్వినియోగం కాని ప్రతి ప్రభుత్వ వ్యయం ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని, దాని ప్రభావం వలన ఉత్పత్తి, పంపిణీలు కూడా మెరుగుకాగలవని కూడా తెలియుచున్నది.

ప్రభుత్వ వ్యయ ప్రభావం ఆర్థిక వ్యవస్థపై అనేకరకాలుగా వుంటుంది. ప్రభుత్వ వ్యయం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు ఉత్పత్తిని పెంచేందుకు, ఆదాయ సంపదల, పంపిణీలోని వ్యత్యాసాలను తొలగించేందుకు, సాంఘిక న్యాయాన్ని సాధించేందుకు, ఆర్థిక సుస్థిరత నేర్పరచేందుకూ ఎంతగానో సహాయపడుతుంది.

**ఉత్పత్తిపై ప్రభుత్వ వ్యయ ప్రభావము :** ఆర్థికాభివృద్ధికి ఉత్పత్తిలో పెరుగుదల అత్యంత అవసరము. అభివృద్ధి చెందుతున్న దశలో నిరుపయోగంగా వున్న ఆర్థిక వనరులను సక్రమముగా వినియోగించుకొనేందులకు వ్యయం అత్యవసరం. సహజంగా ప్రైవేటు వ్యక్తులు లాభార్జనే ధ్యేయంగా భావిస్తారు. కాబట్టి బాగా లాభించని రంగాలలో ప్రవేశించరు. అయితే ప్రభుత్వానికి సామాజిక అవసరాలను తీర్చవలసిన బాధ్యత వున్నది. కాబట్టి ప్రైవేటు వ్యక్తులు చేపట్టని ఉత్పత్తి కార్యక్రమాలను విధిగా చేపట్టాలి. అలానే కీలకమైన సేవలనందించటము కూడా ప్రభుత్వరంగ బాధ్యతేకాబట్టి తప్పని సరిగా ప్రభుత్వ వ్యయం పెరుగుతుంది. ఉదా : రైళ్ళు, విమానాల ద్వారా రవాణా సౌకర్యాలను, తంతి, తపాలా, సమాచార సేవలను విధిగా ప్రభుత్వమే నిర్వర్తించాలి.

ప్రభుత్వ వ్యయం ద్వారా ఉత్పత్తిని వీలైనంతవరకు పెంచి, తద్వారా ఆర్థికాభివృద్ధికి సంబంధించి అనేక ఫలితాలను సాధించేందుకు ప్రభుత్వ వ్యయం ఎంతగానో అవసరమగుతుంది. పెరుగుతున్న ప్రతి ప్రభుత్వ వ్యయము ఉత్పత్తిని పెంచగలదా? అనే ప్రశ్న వుదయించవచ్చు. ప్రభుత్వ వ్యయం పెరిగిన కొద్దీ దుర్వినియోగం, దుబారా కూడా అధికంగా వుంటుంది. కాబట్టి వాటిని తగ్గించి మంచి ఫలితాలను పొందేటట్లుగా జాగ్రత్తపడాలి. జె.బి.సే. అభిప్రాయం ప్రకారం "విత్తానికి సంబంధించిన అన్ని పథకాలలో ఏ పథకం వల్ల ఖర్చు తక్కువ అవుతుందో, అది శ్రేష్టమైనది." ఈ అభిప్రాయంలో వాస్తవం కూడా వున్నది. కాబట్టి ప్రభుత్వమెప్పుడూ కనిష్ట వ్యయంతో గరిష్ట ప్రయోజనాన్ని పొందేందుకు ప్రయత్నించాలి.

డాల్టన్ ప్రభుత్వ వ్యయ ప్రభావం ఉత్పత్తిపై ఎంత వరకు వున్నది అని తెలుసుకునేందుకు ఈ క్రింది అంశాలను గురించి వివరించారు.

**1. పనిచేయటం, పొదుపు చేయటం, పెట్టుబడి పెట్టగల శక్తిపై ప్రభుత్వ వ్యయ ప్రభావము :** ప్రభుత్వ వ్యయం విద్య, వైద్య సేవలు, చౌకగా గృహవసతి, రవాణా, సమాచారము మొదలగు సౌకర్యాలపై వెచ్చించినపుడు ప్రజలలో శక్తి సామర్థ్యాలు ఇనుమడిస్తాయి. ప్రజలలో విద్యార్హతలు పెంచటం, శారీరక సామర్థ్యం పెంచటం, ఉద్యోగావకాశములు కల్పించటం, ఆర్థిక సామర్థ్యం పెంచటం మొదలగు అంశాలు ఉత్పత్తిపై ఎంత వరకు ప్రభావం కలిగివున్నాయో తెలుసుకోవాలి. దానిని బట్టి పెరుగుతున్న ప్రభుత్వ వ్యయం ఉత్పత్తిలో పెరుగుదలకు దోహదపడుతున్నదా లేదా అని తెలిసికొనవచ్చును.

సామాజిక అవసరాలపైనే ప్రభుత్వ వ్యయం ఖర్చుచేసి, అనవసరమైన అంశాలపై వ్యయం తగ్గించాలి. ఉదా : మత్తు పానీయాలు, సిగరెట్‌లాంటి వస్తువుల ఉత్పత్తిని నిరుత్సాహపరచాలి. తద్వారా ప్రజలకు అవసరమయ్యే వస్తువుల మీదే ఎక్కువ వ్యయం ఖర్చుచేసి ఉత్పత్తిని పెంచుకొనేందుకు కృషి సలపాలి. కాబట్టి ప్రతి ప్రభుత్వ వ్యయమూ ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగా గానీ ఉత్పత్తిని పెంచే విధముగా ఉండాలి.

**2. పనిచేయటం, పొదుపుచేయటం, పెట్టుబడి పెట్టటంపై ప్రజలకుగల ఇష్టత :** ప్రభుత్వం వ్యయం ఏ విధమైన అంశాలమీద ఖర్చు పెడుతున్నది అనే దానిని బట్టి ప్రజలకు ఉత్పత్తి కార్యక్రమాలపై ఇష్టత కలుగుతుంది. ఉదా : వృద్ధాప్యపు పింఛను, ప్రావిడెంట్ ఫండ్ వలన ప్రయోజనము, అనారోగ్యము, ప్రమాదాలు వాటిల్లినప్పుడు కలిగించే భీమా సౌకర్యము మొదలగు వాటిపై ఖర్చుచేసే ప్రభుత్వ వ్యయం ప్రజలకు రక్షణ, భద్రత కల్పిస్తుంది. అందువలన ప్రజలలో పని యెడల ఉత్సాహం కలిగి, ఉత్పత్తిని పెంచేందులకు కూడా ఎంతగానో

సహకరిస్తారు. కష్ట సమయాలలో ప్రభుత్వం ఆదుకొని రక్షిస్తుందనే నమ్మకం ప్రజలకు, ముఖ్యముగా శ్రామికులకు, కుదిరినపుడు, ఉత్పత్తిలో శ్రద్ధ కనబరుస్తారు. ప్రభుత్వ వ్యయం బోనస్‌లు, కార్మిక ఉద్యోగ సంక్షేమాలపై వెచ్చించినపుడు కూడా ఉత్పత్తి పెరిగే అవకాశం కలదు.

**3. వనరుల వినియోగంకై ప్రభుత్వ వ్యయం - ఉత్పత్తిపై ప్రభావం :** సహజంగా ప్రభుత్వ వ్యయం వలన వచ్చే ఉపాంత ప్రయోజనం బాగా ఉండేటట్లు చూడాలి. ప్రభుత్వ పథకాలపై వనరులను వెచ్చించేటప్పుడు కూడా ఉపాంత ప్రయోజనం అన్ని చోట్ల వీలైనంత వరకు సమానముగా వుండేటట్లు చూచుకొనవలసిన బాధ్యత ప్రభుత్వంపై వుంది. గ్రామీణాభివృద్ధికై ప్రభుత్వం వ్యయాన్ని వెచ్చించటం ద్వారా వ్యసాయ రంగం నుండి సత్ఫలితాలు పొందవచ్చు. తత్ఫలితముగా పట్టణ ప్రాంతాలకు కొంతవరకు వనరులను తగ్గించవచ్చును.

అవస్థాపనా కార్యక్రమాలగు రోడ్లు, రైల్వేలు, నీటి పారుదల మొదలగు పథకాల ద్వారా ఆర్థికాభివృద్ధిని త్వరితగతిన సాధించవచ్చు. కాబట్టి ప్రభుత్వ వ్యయం, ఈ కార్యక్రమాలకు ఆర్థిక వనరులను పెంచి ఉత్పత్తిని పెంచుకునేందుకు దోహదపడాలి. అదే విధముగా సబ్సిడీలు, సాంఘికావసరాలగు విద్య, శిక్షణ, భద్రత మొదలగు పథకాల మీద ప్రభుత్వ వ్యయం పెంచినప్పుడు మానవశక్తి సామర్థ్యాలు ఇనుమడించి ఆర్థికాభివృద్ధి జరుగుతుంది.

**పంపిణీపై ప్రభుత్వ వ్యయ ప్రభావం :** ఆదాయ సంపదలలోని వ్యత్యాసాలను తొలగించి ఆర్థిక సమానత్వం తీసుకువచ్చేందుకు ప్రభుత్వ వ్యయం ఎంతగానో ఉపకరిస్తుంది. ఆర్థిక అసమానతలు సహజ సిద్ధంగా ఏర్పడినవి కాక ప్రభుత్వ చట్టాలవలన కూడా ఏర్పడినవి. ఆదాయ సంపదల వ్యత్యాసాలకు ప్రభుత్వమే కారణమని వాగ్నార్ కూడా అభిప్రాయపడినాడు. కాబట్టి వ్యత్యాసాలను తొలగించవలసిన బాధ్యత కూడా ప్రభుత్వమే చేపట్టాలి. అందుకుగాను ప్రభుత్వ వ్యయాన్ని పెంచి పేదవారి జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రయత్నించాలి. అయితే వాగ్నార్ చెప్పినట్లు కేవలం ప్రభుత్వం వల్ల మాత్రమే ఆర్థిక అసమానతలు ఏర్పడలేదు. ప్రైవేటు ఆస్తులు, వంశపారంపర్య హక్కు ద్వారా పూర్వీకుల నుండి వస్తున్న స్థిరాస్తులు మొదలగువాటివలన కొందరు సర్వ భోగాలు అనుభవిస్తుంటే, మరో ప్రక్క పేదవారు పేదరికంతోనే అలమటిస్తున్నారు. కాబట్టి ఇలాంటి వ్యత్యాసాలు తొలగించి ప్రజలందరికి ఆదాయ సంపదలను పంచి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలి. అలానే ఏకస్వామ్యంవలన కూడా కొందరు ఉత్పత్తి దారులు మరింత లాభాలు పొంది, అధిక సంపదను ఆర్జించుకొనుచున్నారు.

డాల్టన్ ప్రకారం పంపిణీకై ప్రభుత్వం వెచ్చించే వ్యయాన్ని ఈ క్రింది విధముగా విభజించవచ్చు.

ఎ) పురోగామి గ్రాంట్లు

బి) తిరోగామి గ్రాంట్లు

సి) అనుపాతమైన గ్రాంట్లు

**ఎ) పురోగామి గ్రాంట్లు :** ఆదాయాలు పెరిగిన కొద్దీ గ్రాంట్లు తగ్గించటం లేక ఆదాయాలు తగ్గినకొద్దీ గ్రాంట్లు పెంచటం జరుగుతుంది. అంటే గ్రాంట్లు ఇవ్వటం ప్రజలు పుచ్చుకొనేశక్తి మీద ఆధారపడి వుంటుంది. ఉదా : చిన్న తరహా పరిశ్రమలకు ఎక్కువ సబ్సిడీలు, పెద్ద తరహా పరిశ్రమలకు తక్కువ సబ్సిడీలు. ధన రూపములో ఇచ్చే గ్రాంట్లు, వస్తు సేవలను ఉచితముగా లేక చౌకగా ప్రభుత్వ సప్లయి చేయటం మొదలగునవి.

**బి) తిరోగామి గ్రాంట్లు :** ఆదాయం పెరిగిన కొద్దీ ఎక్కువ గ్రాంట్ల ఇవ్వటం. ఆదాయము తగ్గిన కొద్దీ గ్రాంట్లు తగ్గించటం జరుగుతుంది.

**సి) అనుపాతమైన గ్రాంట్లు :** ప్రతి వ్యక్తికి ఒకే అనుపాతంలో గ్రాంట్లు ద్వారా ఆదాయము పెరిగితే వాటిని అనుపాతమైన గ్రాంట్లు అంటారు. ఉదా : ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రతి ఇంటికి ఒకే మొత్తంలో ప్రభుత్వ నిధుల నివ్వటం. ధనిక, పేద వ్యత్యాసాలు లేకుండా ప్రతి మనిషికి సమాన పరిమాణములో ఇచ్చే నిత్యావసర వస్తువులు. ప్రభుత్వ వ్యయ ప్రభావం ఉత్పత్తి, పంపిణీలపై ఎలా వుంటుందో ఈ క్రింది విధముగా సమీక్షింపవచ్చును.

**ఆర్థిక సుస్థిరతపై ప్రభుత్వ వ్యయ ప్రభావము :** ఆర్థిక సుస్థిరత అనగా ఆర్థిక వ్యవస్థ పూర్తి ఉద్యోగితను సాధించి సమతౌల్య స్థితిని చేరుట. సుస్థిరత వున్నప్పుడు సహజంగా ధరలు కూడ నిలకడగా వుంటాయి. సనాతన శాస్త్రవేత్తలు ఈ విధముగా సుస్థిరతను తెలియజేస్తే జె.ఎమ్.కీన్స్ ఈ క్రింది విధముగా ఆర్థిక సుస్థిరతను వివరించాడు.

కీన్స్ ప్రకారం సమతౌల్య పరిస్థితిలో

మొత్తము ఆదాయము (Y) = వినియోగవస్తువులపై వ్యయము (C) + మూల ధన వస్తువులపై వ్యయము (I)

ఆదాయములో పెరుగుదల వచ్చినపుడు వినియోగంపై వెచ్చింవచ్చు. లేదా పొదుపు (S) కూడా చేయవచ్చు.

అందువలన Y = C+S గా కూడా చూచించవచ్చు

$Y = C + I, Y = C+S$

$C+I = C+S$

$\not{C} + I = \not{C} + S$

$I = S$

పెట్టుబడి (Investment) = పొదుపు (Savings)

కాబట్టి సమతౌల్య పరిస్థితిలో కీన్స్ ప్రకారం ఈ క్రింది సమానతలు విధిగా ఉండాలి.

పెట్టుబడి (I) = పొదుపు (S)

సమిష్టి సప్లయి = సమిష్టి డిమాండు

సమిష్టి సప్లయి, సమిష్టి డిమాండులు సమానముగా ఉన్నప్పుడు సార్థక డిమాండు కూడా వుండి పూర్తి ఉద్యోగత ఏర్పడుతుంది.

**ఆర్థిక అస్థిరత :** ఆర్థిక అస్థిరత అనగా ఆర్థిక మాంధ్యముగానీ, ద్రవ్యోల్బణంగానీ ఏర్పడినపుడు ఆర్థిక వ్యవస్థలో సమతౌల్య పరిస్థితి చెదరి అస్థిరత ఏర్పడుతుంది. ఆర్థిక వ్యవస్థలో వ్యక్తుల ఆదాయం బాగా పెరిగినపుడు వినియోగంపై వ్యయం ఆదాయంతోపాటు సమానంగా పెరగదు. ఒక స్థాయి దాటిన తరువాత ప్రజలు పొదుపు చేయటం ప్రారంభిస్తారు. అప్పుడు పొదుపు పెట్టుబడికంటే వేగముగా పెరిగి (S>I) అసమతౌల్య పరిస్థితి ఏర్పడుతుంది. దానిని కీన్స్ ఆర్థిక మాంధ్యము అని పిలిచినాడు. ఈ ఆర్థిక మాంధ్యము వచ్చి సుస్థిరత లోపించినపుడు ఆర్థిక వ్యవస్థను మరల మామూలు స్థితికి తీసుకువచ్చేందుకై ప్రభుత్వము విధిగా కొంత ప్రభుత్వ వ్యయమును ఖర్చు చేయాలి. దానినే నష్ట పరిహార విత్తము అని కానీ లేక పరిపూరక విత్తము అని కానీ పిలవవచ్చు.

ఆర్థిక మాంధ్యము ఏర్పడినపుడు నిరుద్యోగం నిర్మూలించి, స్థంభించిపోయిన ఆర్థిక కార్యక్రమాలన్నిటినీ పునరుద్ధరించి ఆర్థిక సుస్థిరతను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ప్రజాహిత కార్యక్రమాలమీద వ్యయం పెంచి ముందుగా ప్రజలకు ఉద్యోగావకాశములను పెంచాలి. తద్వారా నిరుద్యోగం నిర్మూలించబడి, ప్రజల ఆదాయాలు పెరిగి, వస్తువులను కొనుగోలు చేసే శక్తి పెరుగుతుంది. తద్వారా వస్తువులకు డిమాండు పెరిగి మరలా ఉత్పత్తి కార్యక్రమాలు మొదలవుతాయి. చివరకు ఆర్థిక మాంధ్యాన్ని తొలగించి ఆర్థిక సుస్థిరతను ఏర్పాటు చేయవచ్చు.

**ద్రవ్యోల్బణ సమయంలో ప్రభుత్వ వ్యయ ప్రభావం :** ద్రవ్యోల్బణ సమయంలో పెట్టుబడి పొదుపుకంటె ఎక్కువ (I>S) గా వుంటుంది. అందువలన వస్తువులకు మార్కెట్‌లో అధిక డిమాండు ఏర్పడి సప్లయి డిమాండు కంటె బాగా తగ్గిపోతుంది. కాబట్టి వస్తువుల కొరత ఏర్పడి ధరలు విపరీతంగా పెరుగతాయి. ఆ సమయంలో ప్రభుత్వం ప్రభుత్వ వ్యయాన్ని మితంగా ఈ క్రింది అంశాలమీద మాత్రమే వ్యయం చేసి ఆర్థిక సుస్థిరత తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలి.

1) పెరుగుతున్న ధరల నరికట్టేందుకు వీలైనంత వేగంగా కొరతగా వున్న వస్తువుల వుత్పత్తిని పెంచాలి. ముఖ్యంగా నిత్యావసర వస్తువుల వుత్పత్తిని పెంచాలి. ముఖ్యంగా నిత్యావసర వస్తువుల కొరతను నివారించేందుకు తగినంతగా ప్రభుత్వ వ్యయాన్ని పెంచాలి. కొరతను నివారించేందుకు అవసరమైతే ఆ వస్తువులను విదేశాల నుండి దిగుమతి చేసుకోవాలి. తద్వారా పెరుగుతున్న ధరలను సాధారణ స్థాయికి తీసుకురావచ్చు.

2) ప్రభుత్వ పంపిణీ పథకం ద్వారా మధ్యతరగతి ప్రజలకు, పేద ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులను సప్లయి చేసే ప్రయత్నం చేయాలి.

3) పెరుగుతున్న ధరలను తట్టుకుని ప్రజల జీవన స్థాయిని యధావిధిగా వుంచేందులకు ప్రభుత్వం విధిగా వుద్యోగుల జీతభత్యాలను పెంచవలసి వస్తున్నది.

**ఆర్థికాభివృద్ధి మరియు ఆర్థిక వృద్ధిలపై ప్రభుత్వ వ్యయ ప్రభావం :** శ్రీమతి ఉర్సులా హిక్స్ అభిప్రాయం ప్రకారము 'ఆర్థికాభివృద్ధి' వెనుకబడిన దేశాలకు, 'ఆర్థిక వృద్ధి' అభివృద్ధి చెందిన దేశాలకు సంబంధించిన పదాలు. వెనుకబడిన దేశాలలో వనరులుండి సద్వినియోగ పరుచుకోలేరు. అభివృద్ధి చెందిన దేశాలలో వనరులను వినియోగించుకొన్నప్పటికీ ఆర్థిక సుస్థిరతను సాధించలేకపోవటం జరుగుతుంది.

కాబట్టి వెనుకబడిన దేశాలలో వనరుల సద్వినియోగం మరియు శీఘ్రగతిన ఆర్థికాభివృద్ధి సాధించటం కోసం ప్రభుత్వ వ్యయం అవసరమైతే, అభివృద్ధి చెందిన దేశాలలో ఆర్థిక సుస్థిరతను ఏర్పాటు చేసేందుకై ముఖ్యంగా ఆర్థిక మాంద్యమును నివారించేందుకు ప్రభుత్వ వ్యయం అవసరమవుతున్నది.

అభివృద్ధి చెందిన, వెనకబడిన దేశాలలో సహజంగా ఈ క్రింది అంశాలమీద వ్యయం చేయవలసి వుంటుంది.

**1. పెట్టుబడిని పెంచుట :** ఆర్థిక మాంద్యము వలన స్థంబించిన కార్యక్రమాలను పునరుద్ధరించేందుకు అభివృద్ధి చెందిన దేశాలలో ప్రభుత్వ వ్యయం పెట్టి తద్వారా పెట్టుబడి, ఉత్పత్తులను మెరుగుపరచాలని అలానే వెనుకబడిన దేశాలలో కూడా పూర్తిగా వనరులను సద్వినియోగ పరచుకొనేందుకు అవసరమైన పెట్టుబడి ప్రభుత్వమే పెట్టాలి. తద్వారా నిధుల కొరతను నివారించటమేకాక వనరులను పూర్తిగా వినియోగించుకొని, ఉత్పత్తిని పెంచుకొనవచ్చు. తద్వారా ఉద్యోగావకాశములను, ప్రజల కొనుగోలు శక్తిని కూడా మెరుగుపరచుకొన వచ్చును.

**2. భారీ పరిశ్రమల స్థాపన :** ఈ భారీ పరిశ్రమల స్థాపనకై అధిక వ్యయం ఖర్చుచేసి ప్రతిఫలాలను పొందేందుకు దీర్ఘ కాలం వేచివుండవలసి వస్తుంది. లాభార్జనకు కూడా అవకాశాలు తక్కువగా వుంటాయి. ప్రైవేటు వ్యక్తులు ఈ భారీ పరిశ్రమల స్థాపనయెడల శ్రద్ధాశక్తులు కనబరచరు. అందువలన ఆర్థికాభివృద్ధికి అత్యంత కీలకమైన భారీ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ వ్యయం అత్యంత అవసరము.

**3. అవస్థాపనా కార్యక్రమాలు :** ఆర్థికాభివృద్ధికి అవసరమగు ఆర్థిక, సాంఘిక అవస్థాపనా కార్యక్రమాలను ప్రభుత్వమే చేపట్టాలి. ఈ కార్యక్రమాలు అత్యంత వ్యయముతో కూడుకొన్న వ్యవహారము. పారిశ్రామికాభివృద్ధికి, వ్యయసాయాభివృద్ధికి కూడ రవాణా, విద్యుచ్ఛక్తిలాంటి ఆర్థిక అవస్థాపనా కార్యక్రమాలు అత్యవసరము. అలానే విద్య, వైద్యం, నీటి వసతిలాంటి సాంఘిక అవస్థాపనా కార్యక్రమాలపై ప్రభుత్వమే శ్రద్ధ తీసుకొని తద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రయత్నించాలి.

**4. ఋణాలు, సబ్సిడీలు :** అన్ని రంగాల అభివృద్ధికి ప్రభుత్వం తగినంత ఋణాలిచ్చి ప్రజలను ఉత్పత్తి కార్యక్రమాలు చేపట్టేటట్లుగా ప్రేరేపించాలి. అలాగే బలహీన వర్గాలకు వెనుకబడిన వర్గాలకు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రభుత్వం సబ్సిడీలు ఇచ్చి ఆదుకోవాలి.

పైన పేర్కొన్న కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వ వ్యయం అత్యవసరం. ప్రభుత్వ వ్యయం ఆర్థికాభివృద్ధికి అవసరమైనప్పటికీ వీలైనంత వరకు దుబారా, దుర్వినియోగాన్ని తగ్గించి, గరిష్ట సాంఘిక ప్రయోజనాన్నిచ్చే విధంగా వినియోగించుకోవాలి.

## 8.4. సాంఘిక వస్తువుల సిద్ధాంతం :

సాంఘిక వస్తువులనగా మినహాయింపులేకుండా దేశములోని ప్రజలందరు వారి అవసరాలను తీర్చుకునేందులకు వాడుకొనే వస్తువులు. సహజముగ ఈ వస్తువుల ఉత్పత్తిని ప్రభుత్వమే చేపడుతుంది. సామాజిక వస్తువులను రెండు రకాలుగా విభజించవచ్చును.

**1. సామాజిక వస్తువులు** (సేవలు) : సమాజములో ప్రజలంతా దాదాపు సమాన పరిమాణములో వాడుకునే వస్తువులు లేక సేవలు. ఉదా : వీధిలైట్లు, రోడ్లు, పార్కులు, వీధికుళాయిలు మొదలైనవి.

**2. మెరిట్ వస్తువులు (సేవలు) :** ఏ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించవచ్చునో వాటిని మెరిట్ వస్తువులు లేక సేవలు అనవచ్చును. ఉదా : రైళ్ళలో ఎయిర్ కండిషన్ కోచ్‌లు, ఫస్ట్‌క్లాస్ కోచ్‌లు మొదలగునవి.

సామాజిక, సాంఘిక లేక ప్రభుత్వ వస్తువుల గురించి పూర్తి అవగాహనకు కొంత వివరణ అవసరం. అసలైన సాంఘిక వస్తువు అనగా ఒక వ్యక్తి ఒక వస్తువును వినియోగించినప్పుడు వేరొక వ్యక్తికి లభ్యమయ్యే పరిమాణములో ఎటువంటి కోత లేకపోవటం. అందువల్లనే సాంఘిక వస్తువులను పోటీ (Non-rinal) వస్తువులు అంటారు. ఉదా : (1) పబ్లిక్ పార్కును ఎంత మందైనా సందర్శించవచ్చును. సందర్శకులంతా పార్కు అందాన్ని సమానముగా ఆస్వాదించవచ్చు.

2. టెలివిజన్ సిగ్నల్ ఆయా ప్రాంతాలలో నివసించే ప్రజలందరికీ సమానముగా ఉపయోగపడుతుంది.

3. వీధి దీపాలు వీధి ప్రజలందరికీ వెలుగునిస్తాయి.

4. డామ్ నిర్మాణం వలన ఆ ప్రాంతంలో నివసించే ప్రజలందరికీ వరదముంపు నుండి రక్షణ, త్రాగునీటి సౌకర్యం, పొలాల సాగుకు నీరందించటంలాంటి సామాజిక ప్రయోజనాలు చేకూరతాయి. అసలైన సాంఘిక వస్తువులను విభజించటం, నిర్వచించటం చాలా కష్టం. ఆ వస్తువులనుండి వచ్చే ప్రయోజనం అందరికీ సమానమని కూడా చెప్పలేము.

ఉదా : 1. వీధిలైట్ వలన వీధిలోని ప్రజలందరికి సమాన ప్రయోజనం చేకూరక పోవచ్చును.

2. డాం నిర్మాణం అన్ని ప్రాంతాలను సమానంగా వరద ముంపు నుండి రక్షించకపోవచ్చును. అంతేకాక ఒక వస్తువు సాంఘిక వస్తువైనప్పటికీ, ప్రభుత్వమే దానిని విధిగా తయారు చేయవలెననే నియమం కూడా లేదు.

ఉదా : ఎ) టెలివిజన్ సిగ్నల్‌ను ప్రభుత్వమే అందించనవసరం లేదు. బి) ఒక్కో సందర్భంలో ప్రైవేటు వస్తువులను ప్రభుత్వం ఉత్పత్తి చేయవచ్చు. ఉదా : ప్రజలకోసం గృహ నిర్మాణం, ప్రభుత్వమే ఇనుము, ఉక్కులను తయారు చేయటం మొదలగునవి.

ప్రొఫెసర్ మస్ గ్రేవ్ ప్రభుత్వ వస్తువులను సామాజిక వస్తువులు లేదా సాంఘిక వస్తువులని పిలవచ్చనీ, ఆ వస్తువులను విధిగా ప్రభుత్వమే తయారు చేయాలనే అభిప్రాయం వెలిబుచ్చాడు. అంతేగాక ప్రైవేటు వస్తువులను మార్కెట్ తగినంతగా సమకూర్చి వ్యక్తుల కోరికలను సంతృప్తి పరచగలదనీ, సాంఘిక వస్తువులను మాత్రం ప్రభుత్వమే బడ్జెట్ ద్వారా సమకూర్చగలదని మస్ గ్రేవ్ అభిప్రాయ పడినాడు.

మస్ గ్రేవ్ ప్రభుత్వ వస్తువులను ఈ క్రింది విధంగా విభజించినాడు.

ఎ) సాంఘిక కోరికలు లేక వస్తువులు

బి) మెరిట్ కోరికలు లేక వస్తువులు

దాదాపు అన్ని ప్రభుత్వ వస్తువుల వినియోగానికి మినహాయింపులు వుండవు. ప్రభుత్వ వస్తువులను ఈ క్రింది విధంగా కూడ విభజింపవచ్చును.

ఎ) జాతీయ వస్తువులు లేక సేవలు, ఉదా : రక్షణ కార్యక్రమాల ద్వారా దేశం మొత్తాన్ని జాతీయ, అంతర్జాతీయ దాడుల నుండి ప్రజలను, వారి ఆస్తులను సంరక్షించటం.

బి) స్థానిక వస్తువులు. ఉదా : బజారు లైట్లు ఆ ప్రాంతానికే వెలుగునిస్తాయి.

ప్రొఫెసర్ మస్ గ్రేస్ ప్రకారం సమాజంలో అందరి సామాజిక అవసరాలను సమానంగా తీర్చటమే సాంఘిక వస్తువుల కర్తవ్యము. ప్రజలు ఈ సేవలు కోసం ఎలాంటి పన్ను చెల్లించనవసరం లేదు. అలాగే సాంఘిక వస్తువుల ప్రయోజనాల నుండి ఎవరినీ మినమాయించలేము. మార్కెట్‌లో ధర చెల్లించి కొనే వస్తువులు కానందువలన ప్రభుత్వం తన బడ్జెట్‌లో ప్రజలకు కావసిన సాంఘిక వస్తువుల ఉత్పత్తికి తగినంత నిధులు కేటాయించి ప్రజల అవసరాలను తీర్చాలి.

ప్రైవేటు వస్తువులను కొనుగోలు చేయదలచుకున్నప్పుడు వినియోగదారులు ఆ వస్తుధర చెల్లించటానికి సిద్ధపడి వుండవలెను. ఉత్పత్తి దారుడు నిర్ణయించిన ధర చెల్లించే శక్తిని బట్టి వినియోగదారుడు ప్రవేటు వస్తువులను కొనుగోలు చేయటం జరుగుతుంది. ధరలు పెరిగిన సందర్భంలో వినియోగదారులు మార్కెట్ నుండి వస్తువులను కొనుగోలుచేయరు. ధరలు తగ్గినయెడల ఎక్కువ మొత్తంలో ప్రైవేటు వస్తువులు కనబడతాయి.

సాంఘిక వస్తువులు సామాజిక అవసరాలను నెరవేర్చుతాయి. ఆ ప్రయోజనం ఒక ప్రాంతానికి లేదా సంఘం మొత్తానికి వర్తిస్తుంది. కొందరు అధిక ప్రయోజనం, మరికొందరు తక్కువ ప్రయోజనం పొందవచ్చును. అయితే ప్రతి ఒక్కరికి వచ్చే ప్రయోజనం వారు చెల్లించే మూల్యంపై ఆధారపడి వుంటుంది. అయినప్పటికీ ప్రతి వ్యక్తి స్వచ్ఛందంగా ప్రభుత్వానికి నిధులు సమకూర్చాలనే నియమమేమీలేదు. ప్రభుత్వానికి ఎటువంటి మూల్యం చెల్లించినప్పటికి సాంఘిక వస్తువులందించె ప్రయోజనం నుండి ప్రజలు మినహాయింపబడరు. కాబట్టి ప్రభుత్వం విధిగా సాంఘిక వస్తువులు తయారీని చేపట్టవలసిన అవసరం వున్నది.

ఈ సందర్భంగా సాంఘిక వస్తువులను గురించి అవగాహన పెంచుకొనేందులకు ప్రైవేటు వస్తువులను గురించి కూడా తెలిసికొన వలసిన అవసరమున్నది.

**ప్రైవేటు వస్తువులు :** ఏ వ్యక్తయితే ఒక వస్తువును వినియోగిస్తాడో ఆ వ్యక్తి మాత్రమే ఆ వస్తువునుండి సంతృప్తి లేక ప్రయోజనాన్ని పొందగలడు. ఉదాహరణకు ఒక వ్యక్తి ఒక కప్పు కాఫీ తాగితే ఆ వ్యక్తి మాత్రమే సంతృప్తిని పొందగలడు. ఆ వ్యక్తి ఒక కప్పు కాఫీని

సేవించినపుడు వేరొక వ్యక్తికి ఆ కప్పు కాఫీ లభ్యం కాదు. అలానే ఒక వ్యక్తి కారు పార్కింగ్ చేయటానికి కేటాయించబడిన స్థలంలో కారు పార్కుచేసినపుడు ఆ వ్యక్తి మాత్రమే ప్రయోజనం పొందగలడు. ఆ సమయంలో వేరొక వ్యక్తి పార్కు చేయటానికి వీలుకాదు. కాబట్టి ప్రైవేటు వస్తువుల వినియోగంలో వ్యక్తుల మధ్య తీవ్ర పోటీ వుంటుంది. కాబట్టి వాటిని రైవల్ లేక పోటీ వస్తువులు అని పిలవటం జరుగుతుంది.

అంతేకాక ప్రైవేటు వస్తువుల ధర సప్లయి, డిమాండులను బట్టి మార్కెట్‌లో నిర్ణయించబడుతుంది. నిర్ణయించిన ధరను చెల్లించేందుకు సిద్ధంగా వున్న ప్రతి వ్యక్తి ఆ వస్తువును కొనుగోలు చేసుకునేందుకు అవకాశం గలదు. ఆ వస్తువు ధరను చెల్లించటానికి సిద్ధంగా లేనిచో వారికి ఆ వస్తువు లభించదు. అలానే ఆ వస్తువును కొనుగోలు చేయనివారందరూ ఆ వస్తు వినియోగం నుండి మినహాయింపబడతారు. కాబట్టి ప్రైవేట్ వస్తువుల విషయంలో 'మినహాయింపు సూత్రం' కొందరికి వర్తిస్తుంది. ఈ వస్తువినియోగాన్ని విభజించేందుకు కూడా వీలున్నది. వస్తువినియోగ పరిమాణంలో కూడా అనేక హెచ్చు తగ్గులు వుండవచ్చును.

ఉదా : ఒక వ్యక్తి తనకు కావలసిన వస్తువులకు మార్కెట్‌లో నిర్ణయించబడిన ధర చెల్లించటానికి సిద్ధంగా లేనప్పుడు ఆ వస్తువును తగ్గించి కొనుగోలు చేయవచ్చు లేదా అసలు వినియోగమే మానుకోవచ్చు.


**సాంఘిక వస్తువులు - ప్రైవేటు వస్తువులు - కొన్ని ముఖ్య లక్షణాలు :**

**1. పోటీ వస్తువులుండక పోవటం :** ఈ కారణం వలన సాంఘిక వస్తువులు దేశంలో ప్రజలందరికీ ప్రయోజనం కలిగించేందులకు వుపకరిస్తాయి. ప్రైవేటు వస్తువుల వుత్పత్తిలో సంపూర్ణ పోటీ వుంటుంది. అందువలన వస్తు సప్లయి, ధరలమీద ఏ ఒక్కరికీ పూర్తి అధికారం ఉండదు. ఒక వ్యక్తి తన వస్తువు ధర తగ్గించి డిమాండు పెంచుకుంటే వెంటనే మరో ఉత్పత్తిదారుడు కూడా అదే పద్ధతిని అవలంబిస్తాడు. కాబట్టి ఈ ఇద్దరు ఉత్పత్తి దారుల మధ్య పోటీ వాతావరణం ఏర్పడి ఒకరి వస్తువు మరొకరికి పోటీ వస్తువుగా తయారవుతుంది. కాని సాంఘిక వస్తువుల విషయంలో ఇలాంటి పోటీ వుండదు.

**2. సాంఘిక వస్తువుల విషయంలో మినహాయింపులుండవు :** ఈ వస్తువులు అందరికీ అన్ని వేళలా అవసరమవుతాయి. ప్రైవేటు వస్తువులను మాత్రం ప్రజలు తమ బడ్జెట్ మరియు అభిరుచిని బట్టి కొనుగోలు చేసుకుంటారు. కాని, సాంఘిక సేవలగు రక్షణ, వీధిలైట్లు, పబ్లిక్ పార్కుల నుండి ఎవరికి మినహాయింపు వుండదు. అందరూ ఆ వస్తువులనుండి సమాన ప్రయోజనం పొందవచ్చు. ఒకరు ఎక్కువ ప్రయోజనం పొందినప్పటికీ, వేరొకరికి ఆ వస్తువు నుండి వచ్చే ప్రయోజనం తగ్గదు. అదే ప్రైవేటు వస్తువుల విషయంలో అయితే ఒకరు ఒక వస్తువునుండి ప్రయోజనం పొందితే, వేరొకరికి ఆ ప్రయోజనం దక్కదు. అదీకాక ప్రైవేటు వస్తువులు ప్రజలు తమ స్తోమతను బట్టి కొనుగోలు చేస్తారు. కాబట్టి అన్ని వస్తువులు అందరికీ అవసరం వుండకపోవచ్చు. అందువలన ప్రైవేటు వస్తువులకు మినహాయింపులు ఉంటాయి.

**3. సాంఘిక వస్తువులు - ప్రైవేటు వస్తువుల మధ్య పోలిక :** సప్లయి డిమాండు రేఖల ద్వారా ఈ రెండు రకాల వస్తువుల మార్కెట్ పరిస్థితిని విశదీకరించవచ్చు. సాంఘిక వస్తువుల లక్షణాలను పూర్తిగా విశదీకరించటము సాధ్యం కాకపోయినప్పటికీ ఈ రెండు వస్తువుల మధ్య తేడాను తెలుసుకునేందుకు ఈ క్రింది రేఖా చిత్రాల ద్వారా కొంత వరకు ప్రయత్నించవచ్చును.

**ప్రైవేటు మరియు సాంఘిక వస్తువుల డిమాండు**



పైన చూపిన పటం -1లో A,B అనే ఇద్దరు వ్యక్తుల ప్రైవేటు వస్తువుల డిమాండును $D_A$, $D_B$ లుగా వేరు వేరుగా సూచించినాము. వారి డిమాండు ఆయా వస్తువుల ధర వినియోగదారుల ఆదాయాలపై ఆధారపడి వుంటుంది. రెండు వస్తువుల డిమాండును కలిపి $D_A+D_B$ గా సూచించవచ్చు. ప్రైవేటు వస్తువుల సప్లయి రేఖ $D_{A'}+D_{B'}$ జాయింటు డిమాండు రేఖ $D_{A'}+D_{B'}$ ను E అనే బిందువు వద్ద ఖండించుచున్నది. కాబట్టి E ని సమతౌల్య బిందువు అనవచ్చు. ఇక్కడ ప్రైవేటు వస్తువును వినియోగదారుడు OF పరిమాణం, వినియోగదారుడు B OG పరిమాణం కొనుగోలు చేశారు. రెండు పరిమానాలు కలిపి OH (OF+OG) పరిమాణమును OC ధరవద్ద డిమాండు చేశారు. ఇద్దరి వస్తువుల A, B పరిమాణంలోను తేడాలున్నప్పటికీ ఇద్దరూ ఒకేధర (OC)ను చెల్లించారు. కాబట్టి ప్రైవేటు వస్తువులను ఎంత పరిమాణములో కొన్నప్పటికీ ధరలో మాత్రం మార్పు ఉండదు. అందరికీ ఒకే ధర వుంటుంది. కాబట్టి వ్యక్తులు వారి ఆదాయాన్నిబట్టి వేరు వేరు పరిమాణాలలో OC ధరకే విధిగా కొనాలి.

పటం-2లో సామాజిక వస్తువుల డిమాండు సూచింపబడినది. A, B అను ఇద్దరి వ్యక్తుల డిమాండు రేఖలను $D_A$, $D_B$ లుగా సూచించాము. ఇద్దరి జాయింటు డిమాండును (ధరలో తేడాలున్నందున) సూడో డిమాండు రేఖ (Pseudo demand curve) గా వర్ణించవచ్చును. సప్లయి రేఖ SS జాయింట్ డిమాండు రేఖను E అనే బిందువు వద్ద ఖండించింది. కాబట్టి ఈ బిందువును సమతౌల్య బిందువు అనవచ్చు. Y అక్షం మీద A చెల్లించిన ధర OM అని, B చెల్లించిన ధర OL అని తెలియుచున్నది. Y అక్షం పై ఈ రెంటి ధరలను కలిపి (OM+OL) జాయింటు ధర OK గా సూచించవచ్చును. సమతౌల్య పరిస్థితి వద్ద A, B లిద్దరూ ఒకే పరిమాణం (ON) కొనుగోలు చేసినప్పటికీ X అక్షంపై చూపినట్లు), వారి ఆదాయములలోని వ్యత్యాసాలను బట్టి వేరు వేరు ధరలను చెల్లించారు. A చెల్లించిన ధర OM కంటే B చెల్లించిన ధర OL ఎక్కువగా వున్నది. కాబట్టి సామాజిక వస్తువుల ధరలలో తేడాలున్నప్పటికి అందరికీ ఆ వస్తువు ఒకే పరిమాణంలో కావలసి వుంటుందని చెప్పవచ్చును.

ప్రైవేటు వస్తువులు, సాంఘిక వస్తువులకు సమతౌల్య పరిస్థితి E వద్ద ఉపాంత వ్యయము, ఉపాంత ప్రయోజనానికి సమానంగా వుంటుంది. సమతౌల్య పరిస్థితి దాటిన తరువాత రెండు వస్తువులలోను ఉపాంత ప్రయోజనం కంటే వుపాంత వ్యయం ఎక్కువ కాబట్టి అంత లాభసాటిగా వుండదని తెలియుచున్నది. ప్రైవేటు వస్తువుల విషయంలో A,B ల డిమాండు వేరు వేరయినప్పటికీ, ధర మాత్రం (OC) ఒక్కటే. ప్రతి వినియోగదారుడు చెల్లించే ధర ఆ వినియోగదారుని ఉపాంత ప్రయోజనానికి సమానమవుతుంది. అదే విధముగా సాంఘిక వస్తువుల విషయంలో A, B లు వేరు వేరు ధరలు చెల్లించనప్పటికి ఒకే పరిమాణాన్ని (ON) ఇద్దరూ డిమాండు చేశారు. కాబట్టి వ్యక్తుల ఆర్థిక స్థితిగతులలో తేడాలున్నప్పటికీ, సామాజిక వస్తువులు అందరికి ఒకే పరిమాణంలో అవసరం అని తెలియుచున్నది.

**మెరిట్ వస్తువులు (కోరికలు) :** ప్రభుత్వ వస్తువులలో మెరిట్ వస్తువులు కూడా వుంటాయని ప్రొఫెసర్ మస్‌గ్రేవ్ తెలిపినాడు. ఏ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించవచ్చో వాటిని మెరిట్ వస్తువులని, ఏ వస్తువుల వినియోగం అవసరం లేదో వాటిని నాన్ మెరిట్ వస్తువులని పిలవవచ్చు. తక్కువ ధరకే ప్రభుత్వం గృహాలు నిర్మించటం మెరిట్ వస్తువులకు వుదహారణగా పేర్కొనవచ్చును. అలానే మత్తు పానీయాలను సేవించటం ఆరోగ్యానికి హానికరం కాబట్టి వాటిని అవసరం లేని వస్తువులుగా పరిగణించి నాన్-మెరిట్ వస్తువులని పిలుస్తారు. కాబట్టి ప్రభుత్వ విధాన మెప్పుడూ మెరిట్ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించి, నాన్-మెరిట్ వస్తువుల వినియోగాన్ని నివారించేటట్లుగా వుండాలి. ప్రభుత్వ బడ్జెట్‌ల ద్వారా ప్రజలకు అవసరమైన మెరిట్ వస్తువులకు ఎక్కువ నిధులను కేటాయించి వాటి సప్లయిని పెంచాలి. వాటిని అవసరమైన వినియోగదారులు ధరను చెల్లించి కొనుగోలు చేస్తారు. ప్రజలు ఈ వస్తువులను (సేవలను) కొనుగోలు చేసేందుకు, అవసరమైతే ప్రభుత్వం సబ్సిడీలిచ్చి తక్కువ ధరలకు లభ్యమయ్యేటట్లు చేయాలి.

ఉదా : ఎ) తక్కువ ధరకు గృహాలు నిర్మించి ఇవ్వటం.

బి) ఒక్కో సందర్భంలో సాంఘిక వస్తువులను (సేవలను) ప్రభుత్వం ఉచితంగా కూడా ఏర్పాటు చేయవలసి వస్తుంది. ఉదా : ఉచిత విద్య, ప్రకృతి వైరీత్యం సంభవించినపుడు బాధితులకు అవసరమైన సామాజిక వస్తువులను వుచితంగా ఇవ్వటం :

**ప్రభుత్వ (సాంఘిక) వస్తువులు - మెరిట్ వస్తువులకు మధ్య తేడాలు :** ఈ పై రెండు రకాల వస్తువులు ప్రజలకు అవసరమైనప్పటికీ సాంఘిక వస్తువులు మాత్రమే ప్రభుత్వ బడ్జెట్ ద్వారా సమకూర్చబడతాయి. సాంఘిక వస్తువులను ప్రజలంతా ఒకే పరిమాణంలో

వినియోగించుతారు. అయితే మెరిట్ వస్తువుల వినియోగం మాత్రం వినియోగదారుల ప్రాముఖ్యతను బట్టి వుంటుంది. ప్రభుత్వ వస్తువులకు పోటీ వస్తువులండవు. అంతేకాక వాటిని విభజింపలేము. మెరిట్ వస్తువులకు ఈ లక్షణాలేవీ వర్తించవు. సక్రమ పంపిణీ కోసం ప్రభుత్వం మెరిట్ వస్తువులను బడ్జెట్ ద్వారా ప్రజలకు సమకూర్చుతుంది. తద్వారా ప్రజల కనీస అవసరాలకు గృహ, విద్య, వైద్య సౌకర్యాలను సంతృప్తి పరిచే ప్రయత్నం జరుగుతుంది. మెరిట్ వస్తువులు పేదవారికేకాక ధనికులకు కూడా ఒక్కో సందర్భంలో ఇవ్వటం జరుగుతుంది.

ప్రైవేటు వ్యక్తులు అన్ని వస్తువుల వుత్పత్తిని లాభాపేక్షతోనే చేస్తారు. కాబట్టి ప్రభుత్వ వస్తువుల వుత్పత్తిలో వుత్సాహం కబరచరు. అందువలన విధిగా ప్రభుత్వ రంగమే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ద్వారా వస్తు వుత్పత్తిని ప్రోత్సహించి, వస్తువుల కొరతను నివారించాలి. ఈ విధముగా ఆర్థిక సుస్థిరతను తీసుకువచ్చేందుకు కృషి సల్పాలి. పేద ప్రజలకు, ధనికులకు మధ్య వ్యత్యాసాన్ని తొలగించే విధంగా పంపిణీ విధానాన్ని తీర్చిదిద్ది, ప్రజల సామాజిక అవసరాలను నెరవేర్చే బాధ్యతను ప్రభుత్వమే తప్పని సరిగా చేపట్టాలి.

## 8.4.2. సాంఘిక వస్తువుల సాధారణ నమూనా లేక శామ్యూల్సన్ సాంఘిక వస్తువుల నమూనా :

సంఘంలో అందరికీ అవసరమైన సాంఘిక వస్తువుల విషయంలో సమర్థవంతమైన కేటాయింపు గురించి ప్రొ. శామ్యూల్సన్ ఒక నమూనాను వివరించినాడు. ఈ నమూనాను సాంఘిక వస్తువుల సాధారణ నమూనా అని కూడా పిలవవచ్చును.

**సమర్థత అనగా నేమి? :** ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని ఒక వినియోగదారునిగా తీసుకొని 'సమర్థత' అనే పదాన్ని వివరించటం శులభంగా వుంటుంది. రాబిన్‌సన్ క్రూసో లాంటి ఒంటరి వ్యక్తి తనకున్న వనరులన్నింటినీ సర్వేచేసి, అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానంతో వనరులను వస్తువులుగా మార్చుతాడు. అంతేకాక తన వ్యక్తిగత ప్రాముఖ్యత ననుసరించి వస్తువులను వుత్పత్తిచేసి గరిష్ట సంతృప్తిని పొందుతాడు. కాబట్టి వనరులను పూర్తిగా వినియోగించుకొని కనిష్ట వ్యయంతో గరిష్ట ప్రయోజనాన్ని పొందగలడు. అయితే వాస్తవిక ప్రపంచములో ఇలా చేయటం చాలా కష్టతరం. ఆర్థిక వ్యవస్థలో ఏ ఒక్క వినియోగదారుడినో కాకుండా, భిన్న ఆదాయాలు, అభిరుచులు గల అనేకమంది వినియోగదారులను సంతృప్తి పరచాలి. కాబట్టి సమర్థవంతంగా వనరులనుపయోగించటం అనే పదాన్ని జాగ్రత్తగా పరిశీలించి విస్తృతమైన అర్థంతో వాడవలసి వుంటుంది.

**సమర్థత - పారిటో అభిప్రాయం :** ఇటాలియన్ అర్థశాస్త్రవేత్త 'పారిటో సమర్థత' అనే పదానికి చాలా విస్తృతమైన నిర్వచనం ఇచ్చాడు. సమర్థవంతంగా వనరులనుపయోగించటం అనగా ఒకరి పరిస్థితి మెరుగవటానికి వేరొకరికి హానిచేయనటువంటి ఆర్థిక సర్దుబాటు అని అర్థం. అయితే ప్రభుత్వ రంగంలో ఉత్పత్తి పద్ధతులను ఈ విధంగా వినియోగించటం చాలా కష్టం. ఉదా : A.B.C. అనే ముగ్గురు వుత్పత్తి దారులున్నప్పుడు B.C. లకు హాని కలిగించకుండా A తన వుత్పత్తులను మార్చుకోవటం చాలా కష్టతరమవుతుంది. అయితే ఇలా మార్చుకోవటం వలన ఆర్థిక సర్దుబాటు మరింత ప్రయోజనకరంగా, సమర్థవంతంగా చేసుకోవటానికి వీలవుతుంది. కాబట్టి వనరుల వినియోగంలో ఏ విధమైన మార్పయినా B.C. లకు హానికలిగించకుండా, A కు మెరుగైన పరిస్థితినిచ్చేటటువంటిదైతే ఆ సర్దుబాటు సమర్థవంతంగా వున్నదని చెప్పవచ్చును.


ఈ శ్యామ్యూల్సన్ నమూనా ముఖ్యంగా రెండు ప్రమేయాల మీద ఆధారపడి వున్నది. 1) ఒక సాంఘిక వస్తువు (S)ను, ఒక ప్రైవేటు వస్తువు (X) మాత్రమే ఉత్పత్తి చేసి వినియోగించటం. (2) A.B. అనే ఇద్దరు వినియోగదారులను మాత్రమే పరిగణనలోనికి తీసికొనటం.

**సమర్థతా నియమాలు :** ప్రైవేటు వస్తువుల నమూనాలో సూచించిన నియమాలే ఇక్కడ కూడా వర్తిస్తాయి. వివిధ ఉత్పత్తి పద్ధతుల ద్వారా S, X అనే సాంఘిక, ప్రైవేటు వస్తువులను కనిష్ట వ్యయంతో వుత్పత్తి చేసి గరిష్ట వుత్పత్తులను పొందే ప్రయత్నం జరుగుతుంది. అలానే వినియోగదారులు A, B లు తమ ఆదాయాన్ని S, Y వస్తువుల మధ్య సర్దుబాటు చేసుకొనవలసి వుంటుంది. వినియోగ దారుల అభిరుచులు, ఆదాయాలు వేరైనప్పటికీ, సాంఘిక వస్తువులను మాత్రం అందరూ ఒకే పరిమాణంలో వినియోగిస్తారు. అందువలన సాంఘిక, ప్రైవేటు వస్తువుల వినియోగంలో ప్రతిష్ఠాపనోపాంత రేటు (MRS) సమానం కాదు.

అయితే ఉత్పత్తిలో ఉపాంత మార్పిడి రేటు (MRT) ఉత్పత్తి దారులందరికీ సమానమైనప్పటికీ, వినియోగంలో MRS వినియోగదారులందరికీ సమానంగా వుండదు. MRS, MRTలు సమానం కానందువలన, దీని సొల్యూషన్ కోసం చర్యలను చేపట్టవలసి వున్నది.

### సమర్ధవంతమైన సొల్యూషన్లకు కనుగొనుట :
### (FINDING EFFICIENT SOLUTIONS)

పటం -1




పైన సూచించబడిన రేఖాచిత్రాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చును. ఉత్పత్తి అవకాశరేఖ CD ని రేఖా చిత్ర పైభాగములో సూచించినాము. లభ్యమయ్యే వనరులతో X, S వస్తువుల వుత్పత్తి కలయికను ఈ రేఖ సూచించుచున్నది. రేఖా చిత్రమధ్య భాగం X, S వస్తువులను వినియోగదారుడు A ఏవిధంగా వినియోగించుకుంటున్నాడో సూచిస్తున్నది. రేఖా చిత్ర క్రింది భాగం X, S వస్తువులను వినియోగదారుడు B ఏ విధంగా వినియోగించుకుంటున్నాడో సూచిస్తున్నది. సాంఘిక వస్తువు Sను ఇద్దరూ ఒకే పరిమాణంలో

వినియోగించుకుంటారు. కాబట్టి X అక్షంపై A, B లిద్దరి వినియోగం ఒకే బిందువు వద్ద సూచించబడినది. X, (ప్రైవేటు) వస్తువును మాత్రం, A, B లిద్దరూ వేరు వేరు పరిమాణాలలో వినియోగిస్తున్నట్లు Y అక్షంపై సూచించబడినది. A, B లిద్దరూ వినియోగించిన X ప్రైవేటు వస్తువు) పరిమాణం మొత్తం X, వస్తువు వుత్పత్తికి సమానమవుతుంది. రేఖా చిత్ర మధ్య భాగంలో A వినియోగదారుడు G బిందువు వద్ద (S,X) వస్తువులను ఈ క్రింది పరిమాణాలలో వినియోగించాడు.

S వస్తువు పరిమాణం = OF

X వస్తువు పరిమాణం = FG

రేఖా చిత్ర పైభాగం సమర్థవంతమైన వుత్పత్తి కలయికను సూచిస్తుంది.

S వస్తువు వుత్పత్తి పరిమాణం = OF

X వస్తువు వుత్పత్తి పరిమాణం = EF

FG X వస్తు పరిమాణం A చే వినియోగింపబడుతుంది. కాబట్టి B వినియోగానికి మిగిలిన X వస్తు పరిమాణం FH కు సమానమవుతుంది. కాబట్టి B వినియోగించిన X వస్తు పరిమాణము = మొత్తం X వస్తు వుత్పత్తి పరిమాణము - A వినియోగించిన X వస్తు పరిమాణము. FH + FE - FG.

B వినియోగం రేఖా చిత్ర క్రింది భాగాన H బిందువు వద్ద సూచింపబడినది. OF సాంఘిక వస్తు పరిమాణం, మరియు FH ప్రైవేటు వస్తు పరిమాణం వినియోగదారుడు B వినియోగించినట్లు తెలియుచున్నది.

వినియోగదారుడు A శ్రేయస్సును ఒక ప్రత్యేక స్థాయి వద్ద సూచించాలంటే ఈ రేఖా చిత్ర మధ్య భాగంలో ఉదాసీనత వక్రరేఖ $i_{a2}$ ద్వారా సూచించవచ్చును. వినియోగదారుడు (A) $i_{a2}$ రేఖపై G బిందువు వద్ద వున్నప్పుడు, వినియోగదారుడు B క్రింది భాగంలో చూపినట్లు H బిందువు వద్ద వినియోగిస్తాడు. వినియోగదారుడు A ఉదాసీనతా వక్రరేఖ $i_{a2}$ మీద P,T,V బిందువులకు కదిలినపుడు, వినియోగదారుడు B కూడా (క్రింది భాగంలో చూపినట్లు) LZK బిందువులకు తనవినియోగాన్ని తరలిస్తాడు. ఉదాసీనతా వక్రరేఖ $i_{a2}$ మీద వినియోగదారుడు A కు అన్ని బిందువులు సమర్థనీయమైనవని చెప్పవచ్చును. రేఖా చిత్ర క్రింది భాగంలో చూపినట్లు L బిందువు వద్ద B ఉదా సీనతా వక్రరేఖ $i_{b4}$కు లూకస్ ULK స్పర్శరేఖాగా వున్నది. వినియోగదారుడు B కు ఈ ఉదాసీనతా వక్రరేఖ ఉన్నత స్థానంలో వున్నది. గాబట్టి వినియోగదారుడు B LZK బిందువుల వద్ద గరిష్ట శ్రేయస్సును పొందుతాడు.

వినియోగదారుడు A ని $i_{a1}$ ఉదాసీనతా వక్రరేఖ మీద చూపినట్లు P బిందువు వద్ద, వినియోగదారుడు B ని L బిందువు వద్ద వుంచితే మొత్తం వుత్పత్తి A.B. ల మధ్య ఈ క్రింది విధంగా పంపిణి చేయబడుతుంది.

మొత్తం S వస్తువు వుత్పత్తి పరిమాణం = ON


మొత్తం X వస్తువు వుత్పత్తి పరిమాణం = NM

వినియోగదారుడు A పొందే S వస్తువు పరిమాణం = NP

వినియోగదారుడు B పొందే S వస్తు పరిమాణం = NL (NM -NP)

ఇదే పద్ధతి ప్రకారం వినియోగదారుడు A యొక్క ఇతర ప్రయోజన స్థాయిలు రేఖా చిత్ర మధ్య భాగంలో $i_{a1}$, $i_{a3}$ ల మీద సూచించబడినాయి. దీనివలన B స్థానం రేఖా చిత్ర క్రింది భాగంలో లూకస్ ULK మీద నిర్ణయింపబడుతుంది. ఈ విధముగా A, B లకు వివిధ స్థాయిల వద్ద వివిధ సొల్యూషన్లు ఇవ్వబడినాయి. పారిటో సమర్థతా నియమం ప్రకారం ఈ బిందువుల వద్ద వినియోగంలో MRS, ఉత్పత్తిలో MRT కి సమానమవుతున్నది.

అభిలషనీయ ఎన్నిక



పై రేఖా చిత్రం 2లో A, Bల సంక్షేమ స్థాయిలు వివిధ సమర్థవంతమైన సొల్యూషన్ల ప్రయోజన రేఖ మీద సూచింపబడినాయి. UU[1] ప్రయోజన రేఖకు సాంఘిక సంక్షేమ ఉదాసీనతా వక్రరేఖ $i_4$B అనే బిందువు వద్ద స్పర్శరేఖగా వున్నది. కాబట్టి ఈ బిందువును అభిలషనీయ బిందువుగా పేర్కొనవచ్చును. ఈ బిందువు మిగిలిన అన్ని సొల్యూషన్ల కంటే ఉత్తమమైనది, మెరుగైనది అని కూడా చెప్పవచ్చును. B బిందువుకు దిగువ భాగాన సాంఘిక శ్రేయస్సు తక్కువగా వుంటుంది. B బిందువుకు ఎగువభాగాన అభిలషనీయ సొల్యూషన్ను సాధించటం శక్తికి మించినదని చెప్పవచ్చును. B బిందువు వద్ద, S, X వస్తువుల వుత్పత్తి A, B మధ్య సమర్థవంతముగా విభజింపబడుతుంది. A, B లిద్దరూ X వస్తువును ఒకే పరిమాణములో వినియోగిస్తారు. కాబట్టి ప్రత్యేక వివరణ ఇవ్వనవసరం లేదు.

**బడ్జెట్ ద్వారా సాంఘిక వస్తువుల కేటాయింపు :** జనరల్ లేక సాధారణ నమూనాలో సాంఘిక వస్తువుల లక్షణాలు సంక్షేమ అర్థశాస్త్రంతో కలిసి పోయివున్నాయి. అందువలన సొల్యూషన్ను యే విధంగా ఆచరణలో పెట్టవలెననే విషయం గురించి కొద్ది పాటి వివరణ మాత్రమే ఇవ్వబడినది. వాస్తవానికి ఈ సమస్యను నివారించేందులకు సర్వజ్ఞుడైన ప్రణాళికా వేత్తలెవ్వరూ లేరు.


ప్రైవేటు వస్తువుల విషయంలో ఆదాయ పంపిణీ సమర్థవంతమైన సొల్యూషన్ పోటీ ధరల వలన నిర్ణయింపబడతాయి. సాంఘిక వస్తువుల విషయంలో రాజకీయ విధానాల వలన సొల్యూషన్ నిర్ణయింపబడుతుంది. వినియోగదారులు వారి ప్రాముఖ్యతలను ఆదాయ పంపిణీని బట్టే కాకుండా ఓటింగ్ ద్వారా కూడా వ్యక్తం చేస్తారు.

**సమర్థవంతమైన కేటాయింపు :** సాంఘిక వస్తువుల కేటాయింపు బడ్జెట్ ద్వారా నిర్ణయింపబడుతుంది. వినియోగదారుల ఆదాయాలు, ప్రాముఖ్యతలు సాంఘిక వస్తువుల డిమాండును నిర్ణయిస్తాయి. సాంఘిక వస్తువుల వుత్పత్తికయ్యే వ్యయం ప్రజలపై పన్నులు విధించటం ద్వారా వసూలు చేయబడుతుంది.

సాధారణంగా A, B.లు వేరు వేరు పరిమాణాలలో ప్రైవేటు వస్తువు X ను వినియోగించినప్పటికీ ఇద్దరూ ఒకే ధరను చెల్లించవలసి వుంటుంది. అయితే సాంఘిక వస్తువు S ను A, B లిద్దరూ ఒకే పరిమాణములో వినియోగించినప్పటికీ వేరు వేరు ధరలు చెల్లించవలసి వుంటుంది. సాంఘిక వస్తువుల బడ్జెట్ కేటాయింపును ఈ క్రింది రేఖా చిత్రం ద్వారా వివరింపవచ్చును.

ఆర్థిక వ్యవస్థ మొత్తం స్వరూపం :

పటం -3




28

పైన చూపిన రేఖా చిత్రం పై భాగంలో ఉత్పత్తి అవకాశ రేఖ (Production Possibility Line) మీద సాంఘిక వస్తువు S మరియు ప్రైవేటు వస్తువు X లు వేరు వేరు నిష్పత్తులలో ఆర్థిక వ్యవస్థ మొత్తంలో ఎంత మేరకు ఉత్పత్తి చేయబడుతున్నాయో సూచించబడినది.

రేఖా చిత్ర మధ్య భాగంలో వినియోగదారుడు Aని, రేఖా చిత్ర క్రింది భాగంలో వినియోగదారుడు Bని సూచించినాము. A, Bల మధ్య ఉత్పత్తి పంపిణీ చేయబడినపుడు ప్రైవేటు వస్తు వుత్పత్తి OCలో వినియోగదారుడు A పొందేభాగం = OM/OC అలానే వినియోగదారుడు B పొందే ప్రైవేటు వస్తు పరిమాణం = ON/OC.

కాబట్టి OM+ON = OC

బ్రోకెన్ కర్వ్ MV వినియోగదారుడు A తన ఆదాయాన్ని వేరు వేరు ధరల నిష్పత్తుల వద్ద X, S వస్తువుల మధ్య ఏ విధంగా అభిలషనీయ కేటాయింపు చేస్తున్నాడో సూచించుచున్నది. OM/OP ధర నిష్పత్తి వద్ద వినియోగదారుడు A యొక్క ఉదాసీనతా వక్రరేఖ $i_{a2}$ కు ధరల రేఖ MP స్పర్శ రేఖగా వుండి Q బిందువు వద్ద తాకుతున్నది. రేఖా చిత్ర క్రింది భాగంలో బ్రోకెన్ కర్వ్ NW కు వినియోగదారుడు B ధరల లైన్ NU స్పర్శరేఖగా వుండి G బిందువు వద్ద తాకుతున్నది.

MV బ్రోకెన్ కర్వ్ మీద వినియోగదారుడు A స్థానం, NJ బ్రోకన్ కర్వ్‌మీద వినియోగదారుడు B స్థానం వలెనే వుంటుంది. F,G బిందువుల వద్ద A, B లిద్దరిచే సాంఘిక వస్తువు S ఒకే పరిమాణంలో (OH) వినియోగించబడినది. మొత్తము ప్రైవేటు వస్తువు X సప్లయి నుండి A వినియోగించిన ప్రైవేటు వస్తు పరిమాణంను తీసివేయగా మిగిలినది B వినియోగించిన ప్రైవేటు వస్తు పరిమాణంగా చెప్పవచ్చును. NW రేఖ వినియోగదారుడు B వివిధ ధరల నిష్పత్తి వద్ద S, X వస్తువులను ఏ విధంగా వినియోగిస్తున్నాడో తెలియజేస్తుంది. NJ మరియు NW రేఖలు G బిందువు వద్ద ఒక దానినొకటి ఖండించుకుంటున్నాయి. ఈ G బిందువు వినియోగదారుడు B ఏ ధర వద్ద ఎంత పరిమాణం వినియోగిస్తున్నాడో తెలియజేస్తుంది.

అలానే రేఖా చిత్రమధ్య భాగంలో F బిందువు వద్ద వినియోగదారుడు A ఏ ధర వద్ద ఎంత పరిమాణాన్ని వినియోగిస్తున్నాడో తెలుపుతున్నది. A, B లిద్దరూ కలిపి ప్రైవేటు (X), సాంఘిక S వస్తువుల మొత్తం వుత్పత్తిని ఏ విధంగా పంపిణీ చేసుకున్నారో ఉత్పత్తి అవకాశ రేఖ CD మీద E బిందువు వద్ద (రేఖా చిత్ర పైభాగంలో) చూపబడినది.

E బిందువు వద్ద వినియోగదారులు A, B లిద్దరూ S వస్తువును OH పరిమాణంలోనే సమానంగా వినియోగించారు. ప్రైవేటు వస్తువు X ఉత్పత్తి పరిమాణం 01 మాత్రం A, B లిద్దరి మధ్య సమర్థవంతంగా పంపిణీ చేయబడింది.

A వినియోగించిన ప్రైవేటు వస్తు పరిమాణం = OK

B వినియోగించిన ప్రైవేటు వస్తు పరిమాణం = OL

మొత్తం ప్రైవేటు వస్తు ఉత్పత్తి పరిమాణం 01 = OK+OL

**ఓటింగ్ విధాన వ్యాప్తి :** వాస్తవిక ప్రపంచంలో ఓటింగ్ విధానం ద్వారా ప్రభుత్వం సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవటం జరుగుతుంది. అయితే ఆర్థిక వ్యవస్థలో వినియోగదారుల అభిరుచుల వేరు వేరుగా వుంటాయి. కాబట్టి కొంత మంది వినియోగదారులకు ప్రభుత్వం ఇచ్చే ప్రాముఖ్యతలు సంతృప్తి నివ్వక పోవచ్చును. కాబట్టి ప్రజలందరినీ సంతృప్తి పరచేందులకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు పాత విధానాలకంటే మెరుగైన విధానాలను అవలంభించాలి. తదనుగుణంగా ద్రవ్య ఆదాయాన్ని సక్రమంగా పంపిణీ చేయటం, పంపిణీ ప్రాతిపదిక మీద వనరులను సమర్థవంతంగా కేటాయించటం మొదలగు చర్యలను ప్రభుత్వం చేపట్టవలసి వుంటుంది.

## 8.5 సారాంశం :

ప్రభుత్వ వ్యయం దేని మీద ఎంత వ్యయం చేసిందీ తెల్సుకోవాలంటే ప్రభుత్వ వ్యయ విభజన చాలా అవసరం. తద్వారా అవసరం అనుకున్న వాటి మీద అధికవ్యయం, దుర్వినియోగం అనుకున్న వాటిమీద వ్యయం తగ్గించటం వంటి జాగ్రత్తలు తీసుకోవచ్చును. అంతేకాక ప్రభుత్వ వ్యయ ప్రభావం ఆర్థిక వ్యవస్థపై ఎలా వుంటుందో తెలుసుకోవాల్సిన అవసరం చాలా వున్నది. ముఖ్యంగా వుత్పత్తి పంపిణీ, ఆర్థిక సుస్థిరతలపై ప్రభుత్వ వ్యయం అనుకూల ప్రభావాన్ని కల్గించే విధంగా జాగ్రత్తలు తీసుకుంటే ప్రభుత్వ వ్యయం సమర్థవంతంగా వినియోగించవచ్చు. వినియోగదారుల అభిరుచులు, ఆదాయాలు వేరైనప్పటికీ, సాంఘిక వస్తువులను మాత్రం అందరూ ఒకే పరిమాణంలో వినియోగిస్తారు. అందువలన ప్రభుత్వం బడ్జెట్ ద్వారా వనరులు కేటాయించి సాంఘిక వస్తువులను సమర్థవంతంగా తయారు చేయించాలి. వాస్తవిక ప్రపంచంలో ప్రభుత్వం ఓటింగ్ విధానం ద్వారా సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకొని ప్రజల శ్రేయస్సు, తద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడాలి.

## 8.6 ముఖ్య పదాలు

1. వైకల్పిక వ్యయం - ప్రభుత్వం వ్యయం చేయటానికి చేయక వేరుచేయటానికి అవకాశముండుట.
2. ప్రణాళికేతర వ్యయం - ప్రతిఫలం రాకపోయినా సంక్షేమం పెంచేవ్యయం
3. పారిటో సమర్థత - ఒకరి పరిస్థితి మెరుగవటానికి వేరొకరికి హాని చేయనటువంటి ఆర్థిక సర్దుబాటు.
4. మెరిట్ వస్తువులు - ఏ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించవచ్చునో వాటిని మెరిట్ వస్తువులు అంటారు.

## 8.7. స్వయం సమీక్ష ప్రశ్నలు :

1. ప్రభుత్వ వ్యయాన్ని వివిధ ఆర్థిక వేత్తలు ఏ విధంగా విభజించారు. భారత దేశంలో ప్రభుత్వ విభజన గురించి ప్రత్యేకంగా వివరింపుము?
2. ప్రభుత్వ వ్యయ ప్రభావం ఉత్పత్తి, పంపిణి, ఆర్థిక స్థిరత్వంపై ఏ విధంగా ఉంటుందో సమీక్షింపుము.
3. సాంఘిక, ప్రైవేటు వస్తువుల మధ్య పోలికలు, తేడాలను విశదీకరింపుము.
4. శామూల్సన్ సాంఘిక వస్తువుల నమూనాను రేఖా చిత్రం ద్వారా వివరింపుము.

## అభ్యాసాలు :

1) డాల్టన్ ప్రభుత్వ వ్యయ విభజన
2) ప్రభుత్వ వ్యయ ఆర్థిక వర్గీకరణ
3) ప్రణాళికా వ్యయం మరియు ప్రణాళికేతర వ్యయం ప్రభావం
4) ఆర్థిక సుస్థిరతపై ప్రభుత్వ వ్యయ ప్రభావం
5) సాంఘిక వస్తువులు ప్రైవేటు వస్తువులుల మధ్య తేడా
6) మెంట్ వస్తువులు
7) సమర్థత - పారిట్ అభిప్రాయం
8) సమర్థవంతమైన కేటాయింపు
9) ఓటింగ్ విధాన వ్యాప్తి
10) అభిలషనీయ ఎంపిక

## 8.8. చదవవలసిన పుస్తకాలు :


1. Musgrave R.A & Musgrave P.B. : Public Finance in Theory and Practice
2. Dalton. H. : Principles of Public Finance
3. Tripathy R.N. : Fiscal Policy and Economic Development in India
4. Mehatha J.K. : Public Finance
5. Economic Survey : Government of India, Various issues.


డా॥ వై. ఇందిరాకుమారి

పాఠం - 9

# ప్రభుత్వ ఋణం - భారతదేశ ప్రభుత్వ ఋణం

పాఠ్య నిర్మాణ క్రమం


9.0 ఉద్దేశాలు
9.1 పరిచయం
9.2 ప్రభుత్వ ఋణ వర్గీకరణ
9.3 ప్రభుత్వ ఋణ ఆవశ్యకత
9.4 ప్రభుత్వ ఋణాలు పెరగటానికి గల కారణాలు
9.5 ప్రభుత్వ ఋణ ఆధారాలు
9.6 ప్రభుత్వ ఋణ ప్రభావాలు
9.7 ఋణం మరియు పన్నులు
9.8 ప్రభుత్వ ఋణ భారము
9.9 ప్రభుత్వ ఋణ నిర్వహణ - ఋణ విముక్తి
9.10 భారతదేశంలో ప్రభుత్వ ఋణం
9.11 భారతదేశంలో ఋణ వర్గీకరణ
9.12 భారతదేశ ప్రభుత్వ ఋణం- వడ్డీ చెల్లింపులు
9.13 భారతదేశంలో స్వదేశీ మరియు విదేశీ ఋణాల పోకడ
9.14 ముగింపు
9.15 ముఖ్య పదాలు
9.16 స్వీయ అవగాహనకు ప్రశ్నలు
9.17 సంప్రదించవలసిన గ్రంథాలు


## 9.0 ఉద్దేశాలు

ప్రభుత్వ రుణ ఆవశ్యకతను, రుణ వర్గీకరణను, రుణ ప్రభావాన్ని, రుణ విమోచన పద్ధతులును మరియు రుణం పెరుగుదలకు కారణాలను కూలంకుషంగా చర్చించడమే ఈ భాగము యొక్క లక్ష్యం.

## 9.1 పరిచయం :

ఇటీవల కాలంలో ప్రభుత్వ విధులు విశేషంగా పెరుగుటచే ప్రభుత్వ వ్యయం కూడా గణనీయంగా నేడు పెరుగుచున్నది. కాని పెరిగిన వ్యయానికి అనుగుణంగా ప్రభుత్వ ఆదాయ వనరులు పెరగకపోవడంతో ప్రభుత్వ బడ్జెట్‌లో లోటు ఏర్పడటం నేటి ఆధునిక ప్రభుత్వాలలో మనం గమనించవచ్చును. ఈ లోటును పన్నులను విధించుట ద్వారా కాని, ప్రజలనుంచి, ద్రవ్య సంస్థల నుంచి ఋణాలను సేకరించుటద్వారాకాని భర్తీ చేయవచ్చు. కేంద్ర బ్యాంకు, వాణిజ్య బ్యాంకులు, వ్యాపార సంస్థలు, వ్యక్తులు ఇతర దేశాలనుంచి ప్రభుత్వం తీసుకునే రుణాలను ప్రభుత్వ ఋణం అంటారు. సాంప్రదాయ ఆర్థిక శాస్త్రవేత్తలు ప్రభుత్వ ఋణానికి అంత ప్రాముఖ్యతను ఇవ్వలేదు అందుకు కారణం వారు సంతులిత బడ్జెట్‌ను ప్రతిపాదించుటయే అంతేకాక ప్రభుత్వరంగంలో దుబారా ఎక్కువగా ఉంటుందని కూడా వారు భావించారు. అయితే ఆధునిక ఆర్థిక శాస్త్రవేత్తలు సాంప్రదాయ ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయంతో ఏకీభవించరు. ఎందుకంటే

ఆధునిక ప్రభుత్వాలు ప్రజా శ్రేయస్సుకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చుటకే ప్రభుత్వము వ్యయాలతోపాటు ఋణం కూడా ఒక భాగమని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలు ఆర్థికాభివృద్ధితో ప్రముఖ పాత్ర వహించుటచే అనేక సమస్యల పరిష్కారానికి రుణాన్ని విశేషంగా ఉపయోగించుకుంటున్నది. అంటే ప్రభుత్వ వ్యయానికి తగ్గట్టుగా ప్రభుత్వ ఆదాయం లేనట్లు అయితే ప్రభుత్వం తప్పనిసరిగా ఋణం చేయవలసి వస్తున్నది. కావున ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వ ఋణం కీలక పాత్ర వహిస్తున్నది. ప్రభుత్వం చేసే వివిధ ఋణాలను వర్గీకరించే ముందు ప్రభుత్వ ప్రైవేట్ ఋణాల మధ్యగల పోలికలను తేడాలను అర్థం చేసుకోవలసి వుంటుంది.

**9.1.2 ప్రభుత్వ ఋణం - ప్రైవేట్ ఋణం :** ప్రభుత్వ ఋణం, ప్రైవేట్ రుణాల మధ్య కొన్ని పోలికలు, కొన్ని తేడాలు కూడా కలవు. ప్రభుత్వ, ప్రైవేట్ ఋణాలు రెండు కూడా తక్షణ లేదా తాత్కాలిక అవసరాలను తీర్చడానికి ఉద్దేశించబడి ఉంటాయి. ప్రభుత్వ ఋణమైన లేదా ప్రైవేట్ ఋణమైన తాము తీసుకున్న ఋణంపై వడ్డీని చెల్లిస్తాయి.

## భేదాలు :

1. ప్రైవేట్ వ్యక్తులతో పోల్చుకుంటే ప్రభుత్వానికి ఋణ ఆధారాలు విస్తృత పరిధిలో ఉంటాయి. ప్రభుత్వం అంతర్గతంగా, బహిర్గతంగా ఋణాలను చేయగల్గుతుంది. అయితే ప్రైవేట్ వ్యక్తులు సాధారణంగా అంతర్గత ఋణాలపై ఆధారపడవలసి ఉంటుంది.
2. ప్రభుత్వ ఋణం అనేది ప్రభుత్వ కొనుగోలు శక్తిని పెంచదు కాని ప్రైవేట్ రుణం ప్రజలకు అదనపు శక్తిని కల్పిస్తుంది. ప్రభుత్వం ఋణాన్ని తిరిగి చెల్లించేటప్పుడు ప్రభుత్వ ఆదాయంలో ఏవిధమైన తగ్గుదల ఉండదు. కాని ప్రైవేట్ వ్యక్తులు ఋణాన్ని తిరిగి చెల్లించేటపుడు అంతమేరకు తమ వినియోగ వ్యయాన్ని తగ్గించుకోవలసి ఉంటుంది.
3. ప్రభుత్వం ప్రజల నుంచి నిర్బంధంగా రుణాలను వసూలుచేసే అధికారం ఉండగా, ప్రైవేట్ వ్యక్తులకు ఈ అవకాశం లేదు.
4. సహజంగా ప్రభుత్వ రుణాలపై వడ్డీరేటు తక్కువగాను, ప్రైవేట్ వ్యక్తులు తీసుకునేదానిపై వడ్డీరేటు ఎక్కువగాను ఉంటుంది.
5. సమిష్టి లక్ష్యాల కొరకు, సామూహిక కోర్కెలకొరకు, మరియు ప్రజా ఉపయోగ సేవలకు ప్రభుత్వం రుణం చేస్తుంది. అయితే ప్రైవేట్ వ్యక్తులు తమ తమ వ్యక్తిగత అవసరాలను మరియు కోర్కెలను తీర్చుకోవడానికి ఋణం చేస్తారు.
6. ఋణ విముక్తికోసం ప్రభుత్వం అదనపు పన్నులను చెల్లించమని ప్రజలను వత్తిడి చేయవచ్చు. ఋణ చెల్లింపులకోసం అవసరమైతే ప్రభుత్వం అదనపు ద్రవ్యాన్ని కూడా ముద్రించుకొనే అధికారం కలిగి ఉంది. కాని ప్రైవేట్ వ్యక్తులకు ఇలాంటి సదుపాయాలు ఏమి ఉండవు.

## 9.2 ప్రభుత్వ ఋణ వర్గీకరణ :

ప్రభుత్వ ఋణాన్ని ప్రధానంగా ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

**1. అంతర్గత-బహిర్గత రుణాలు :** ఒక దేశంలోపల ప్రభుత్వం చేసే రుణాలను అంతర్గత ఋణాలని, విదేశ ప్రభుత్వాల నుండి అంతర్జాతీయ సంస్థల నుండి సేకరించే రుణాలను బహిర్గత రుణాలని అంటారు. విదేశీ రుణంపై చెల్లించే వడ్డీ ఋణ గ్రహీత దేశం యొక్క నికర ఆదాయాన్ని తగ్గించగా అంతర్గత ఋణ విషయంలో అటువంటి ప్రభావం ఏమీ వుండదు. అందుకుగల కారణం ద్రవ్య వనరులు దేశంలోపల ఒక వర్గం నుంచి మరొక వర్గానికి తరలి వెళ్తాయి. అయితే విదేశీ రుణం అంతాకూడా ఆర్థిక వ్యవస్థపై చెడు ప్రభావాన్ని చూపిస్తుందని చెప్పలేము. ఆ ఋణాన్ని ఉత్పాదక కార్యక్రమాలకు వినియోగిస్తే రుణం తిరిగి చెల్లించడమే కాకుండా అది అదనపు ఆదాయాన్ని సృష్టించడం కూడా చేస్తుంది.

**2. ఉత్పాదక అనుత్పాదక రుణాలు :** ప్రభుత్వానికి ప్రత్యక్షంగా ఆదాయాన్ని సమకూర్చే కార్యక్రమాల కొరకు చేసే రుణాన్ని ఉత్పాదక రుణం అంటారు. ఉదా॥ కి రైల్వేలు, నీటిపారుదల, విద్యుత్‌శక్తి, ఇనుము, ఉక్కు, సిమెంటు వంటి భారీ పరిశ్రమల స్థాపన మొదలగు వాటి కొరకు చేసే రుణాలు ఉత్పాదక రుణాలను చెల్లించుట చాలా సులభం. వీటికి జీవిత కాలంలో వడ్డీని చెల్లించుటయే కాక భవిష్యత్‌లో వ్యక్తుల ఆదాయ స్థాయిని కూడా పెంచుతాయి.

ప్రత్యక్షంగా ఎటువంటి ఆదాయాన్ని సంపాదించలేని ప్రాజెక్టుల కొరకు లేదా కార్యక్రమాల కొరకు చేసే రుణాలను అను ఉత్పాదక రుణాలు అని అంటారు. ఉదా॥కి యుద్ధ సమయంలో, వరదలు, కరువు మొదలగు సమయాలలో చేసే రుణాలను అను ఉత్పాదక రుణాలు అని చెప్పవచ్చును. ఈ విధమైన రుణాలు ఎటువంటి ఆదాయాన్ని సృష్టించకపోగా ప్రభుత్వంపై అదనపు భారాన్ని కల్గిస్తాయి.

**3. విడుదల చేసిన రుణాలు - విడుదల చేయని రుణాలు :** ప్రభుత్వం తాను తీసుకొన్న ఋణాలను భవిష్యత్తులో ఒక నిర్ణీత కాలంలో చెల్లించడానికి అంగీకరిస్తే అటువంటి ఋణాలను విడుదల చేసిన ఋణాలని, అటువంటి హామిలేని ఋణాలను విడుదల చేయని ఋణాలని అంటారు. విడుదలచేసే ఋణాలకు ప్రభుత్వం వడ్డీను అసలు నిర్ణీత కాలంలో చెల్లించాలి. ఈ రుణాలను తిరిగి స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ఋణాలుగా విభజించవచ్చు. స్వల్పకాలిక ఋణాలపై వడ్డీ తక్కువగాను, దీర్ఘకాలిక ఋణాలపై ఎక్కువగాను వుంటుంది. విడుదలచేసే ఋణాలను చెల్లించడానికి ప్రభుత్వం ద్రవ్య వనరులను సమకూర్చుకోవడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. ఇటువంటి ఋణాలను చెల్లించడానికి ప్రభుత్వం అదనంగా పన్నులను విధిస్తుంది.

**4. విధీకృత ఋణం - విధీకృతం కాని ఋణాలు :** కాల వ్యవధిని బట్టి ప్రభుత్వ ఋణాలను విధీకృత ఋణాలు, విధీకృతంకాని ఋణాలని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. ప్రభుత్వం తీసుకొనే దీర్ఘకాలిక ఋణాలను విధీకృత ఋణాలుగా చెప్పవచ్చు. ఈ ఋణాలను చెల్లించడానికి ప్రభుత్వం అవసరమయిన విధులను సమకూర్చుకోవలసి వుంటుంది. నీటి పారుదల ప్రాజెక్టులు భారీ పరిశ్రమల స్థాపన మొదలగు వాటి కొరకు ప్రభుత్వం చేసే ఋణాలను దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. వీటి కాలపరిమితి 20 నుండి 30 సం॥ల వరకు ఉండవచ్చు.

ప్రభుత్వం చేసే స్వల్పకాలిక ఋణాలను విధీకృతంకాని ఋణాలు అని అంటారు. వీటి కాలపరిమితి ఒక సం॥ మాత్రమే వుంటుంది. ట్రెజరి బిల్లులు, పోస్టాఫీసు, సేవింగ్స్, డిపాజిట్‌లు మొ॥వి విధీకృతంకాని ఋణాలకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ ఋణాలనే ఫ్లోటింగ్ డెట్స్ అని కూడా అంటారు.

**5. స్వచ్ఛంద - నిర్బంధ రుణాలు :** ప్రజలు ఎటువంటి నిర్బంధం లేకుండా తమ ఇష్టానుసారంగా ప్రభుత్వం అడిగినప్పుడు ఇచ్చే ఋణాలను స్వచ్ఛంద ఋణాలంటారు. ప్రభుత్వం స్పష్టంగా ఋణాలను సేకరించలేనప్పుడు ప్రజలను ఋణ మధ్యమని ప్రజలను నిర్బంధించి వారి దగ్గరనుండి ఋణాలను సేకరిస్తే అటువంటి ఋణాలను నిర్బంధ ఋణాలంటారు. యుద్ధం వంటి అత్యవసర సమయాలలో మరియు ద్రవ్యోల్బణం ఎక్కువగా వున్నప్పుడు ప్రభుత్వం నిర్బంధ ఋణాలను సేకరిస్తుంది. ద్రవ్యోల్బణ కాలంలో నిర్బంధ ఋణాలను వసూలుచేయడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తి తగ్గి ధరల పెరుగుదల అరికట్టవచ్చు. ఉదాహరణకు మన దేశంలో 1974-75 సం॥లో కేంద్ర ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని నివారించడానికి నిర్బంధ డిపాజిట్ పథకాన్ని (Compulsory Deposit Scheme) ప్రవేశపెట్టింది.

**6. హిక్స్ వర్గీకరణ : (Hicks Classification) :** హిక్స్ ప్రకారం ప్రభుత్వ రుణాలను మూడు రకాలుగా విభజించవచ్చు. 1. నిష్ఫలరుణం, 2. పరోక్ష ఫలితాన్నిచ్చే రుణం. 3. ప్రత్యక్ష ఫలితాలనిచ్చే రుణం. ప్రభుత్వం చేసే రుణం ఎటువంటి ప్రత్యేక ఆదాయాన్ని ప్రయోజనాన్ని ఇవ్వని పథకాలపై ఖర్చుచేస్తే అటువంటి ప్రభుత్వ రుణాలను నిష్ఫల రుణాలని అంటారు. ఉదా॥కు దేశ రక్షణకోసం చేసే రుణం. ప్రభుత్వం చేసే రుణం కేవలం సాంఘీక ప్రయోజనాలకు మాత్రమే వెచ్చించినప్పుడు అటువంటి రుణాన్ని పరోక్ష ఫలితాన్నిచ్చే రుణం అని అంటారు. ఉదా॥కు ఉద్యానవనాలు, గ్రంథాలయాలు మొదలైన వాటి కోసం చేసే రుణాలు. ప్రత్యక్ష ఉత్పాదక కార్యకలాపాలపై ప్రభుత్వం చేసే రుణాన్ని ప్రత్యక్ష ఫలితాన్నిచ్చే రుణంగా చెప్పవచ్చు. ఉదా॥కు ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపనకై చేసే ప్రభుత్వ రుణాలు.

## 9.3 ప్రభుత్వ ఋణం ఆవశ్యకత :

ప్రస్తుత వ్యయ అవసరాలను తీర్చుకోవడానికి ప్రభుత్వానికి ప్రభుత్వ ఆదాయవనరులు చాలనప్పుడు ఋణం చేయవలసిన అవసరం ఏర్పడుతుంది. అంతేకాక ఒక్కొక్కసారి స్వల్పకాలంలో కొన్ని ఊహించని వ్యయాలను ఎదుర్కొనవలసినపుడు పన్నుల ద్వారా ద్రవ్య వనరులను పెంచుకోలేని సమయంలో ఋణం ఒక ముఖ్య సాధనముగా పనిచేస్తుంది. ఆర్థిక మాంద్య రోజులలో ప్రైవేట్ పెట్టుబడికి కొరత ఏర్పడినప్పుడు ప్రజలవద్ద వున్న అనుపయోగపోదును ఋణాల రూపంలో సేకరించి ఖర్చు చేయుట ద్వారా సార్థక డిమాండ్‌ను పెంచి

ఆర్థిక వ్యవస్థలో ఆదాయ వుద్యోగితలను పెంచుతుంది. దీనితోపాటు క్రింది కారణాల వలన కూడా ప్రభుత్వం ఋణం చేయవలసి వస్తుంది.

## 9.4 ప్రభుత్వ ఋణం పెరగటానికిగల కారణాలు :

1. **బడ్జెట్‌లోటును పూరించడం :** రోజు రోజుకి పెరుగుతున్న పరిపాలన నిర్వహణ వ్యయాలు లేక వరదలు, భూకంపాలు, కరువులు, వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎంతో వ్యయం చేయవలసి వుంటుంది. అంటే ఊహించని వ్యయాలను ఎదుర్కొనుటకు ప్రభుత్వ ప్రస్తుత ఆదాయ వనరులు చాలా ఉన్నప్పుడు ప్రభుత్వ లోటును అంతర్గత బహిర్గత ఋణాలను సేకరించుట ద్వారా భర్తీచేస్తుంది. ప్రభుత్వ ఆదాయ వ్యయానికిగల అంతరాన్ని పూడ్చుటయే ప్రభుత్వ ఋణం యొక్క ముఖ్య ఉద్దేశం.

2. **ప్రభుత్వ విధులు పెరుగుదల :** ఇటీవలకాలంలో ప్రభుత్వ విధులు విశేషంగా పెరగటం మూలంగా ప్రభుత్వ వ్యయం కూడా పెరుగుతున్నది. అయితే వ్యయం పెరిగినంత వేగంగా ప్రభుత్వానికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం పెరగడంలేదు. ఇటువంటి స్థితిలో అదనపు పన్నులను విధించుటగాని లేదా పన్ను పెంచడంగాని జరిగినట్లయితే అది ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. అందుచే ఆధునిక ప్రభుత్వాలు పెరుగుతు ప్రభుత్వ వ్యయాన్ని ఎదుర్కొనుటకు తరచు ఋణాలపై ఆధారపడవలసి వస్తుంది.

3. **ఆర్థిక మాంద్యం :** ఆర్థిక మాంద్యాన్ని అధికమించుటకు సార్థక డిమాండ్‌ను పెంచాలి. సార్థక డిమాండ్‌ను పెంచాలంటే ప్రభుత్వం ప్రజాపయోగ కార్యక్రమాలపైన లేదా అవస్థాపన సౌకర్యాలపైన ప్రభుత్వ వ్యయాన్ని పెంచవలసివుంది. అయితే వ్యయాన్ని పెంచడానికి ద్రవ్య వనరులును పెంచుకోవలసి వుంది. కాని ఆర్థిక మాంద్యం రోజులలో ద్రవ్యవనరులకోసం పన్నులును విధిస్తే అది పని, పొదుపు పెట్టుబడి పెట్టి కోర్కెను తగ్గించి తిరిగి సార్థక డిమాండ్‌ను తగ్గిస్తుంది. కాబట్టి ఇటువంటి స్థితిలో ప్రభుత్వ రుణాన్ని ఉపయోగించి పెట్టుబడి కార్యక్రమాలను కొనసాగించినట్లయితే దేశంలో ఆదాయ ఉద్యోగితస్థాయి పెరిగి సార్థక డిమాండ్‌ను పెంచి ఆర్థిక మాంధ్య పరిస్థితులు తొలగిపోవును.

4. **ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం :** ద్రవ్యోల్బణ కాలంలో ధరల పెరుగుదల అధికంగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య పరిమాణం ఎక్కువగా ఉండటం వల్ల వస్తువులకు డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతాయి. ప్రభుత్వం ప్రజలనుంచి రుణాలను సేకరించడం వల్ల ప్రజల దగ్గర ద్రవ్య పరిమాణం తగ్గవచ్చు. ఇందువల్ల ప్రజల కొనుగోలుశక్తి, వస్తువులకు డిమాండ్ తగ్గుతుంది. అందువల్ల ద్రవ్యోల్బణాన్ని ప్రభుత్వ రుణాల ద్వారా అరికట్టవచ్చు. కాని ఆధునిక ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయం ద్రవ్యోల్బణాన్ని అరికట్టడంలో ప్రభుత్వ రుణం కంటే పన్నులు విధానం సమర్థవంతంతో పనిచేస్తుంది.

5. **ప్రణాళికాభివృద్ధికి వనరులు :** ఆర్థికాభివృద్ధిని సాధించడంలో ప్రణాళికలను అమలుపరచే విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలలో పన్ను చెల్లించే శక్తి తక్కువగా ఉండటం వల్ల అధికంగా పన్నులను విధించి తద్వారా ఆర్థిక వనరులు సమకూర్చడం కష్టం. ఈ దేశాలలోని పేదరికాన్ని తొలగించి, పేదరిక విషవలయాలను ఛేదించి, ఆర్థికాభివృద్ధిని సాధించడానికి ప్రణాళికను సక్రమంగా నిర్వహించి అమలు పరచడానికి ఎక్కువ పరిమాణంతో ఆర్థిక వనరులు కావాలి. అందువల్ల ప్రణాళిక బద్ధమైన అభివృద్ధిని సాధించడానికి కావలసిన పెట్టుబడులను సమకూర్చడానికి ప్రభుత్వ రుణాలు ఎంతో అవసరం.

6. **ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ :** ప్రజా సంక్షేమంను పెంపొందించటంతో ప్రభుత్వం కొన్ని ఉత్పాదక కార్యక్రమంలోకి ప్రవేశిస్తుంది. అందులో భాగంగా ఏర్పడిన సంస్థలనే ప్రభుత్వ రంగాల సంస్థలు అని అంటారు. ఈ ప్రభుత్వ రంగ సంస్థలు నిర్మాణ నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వమే చేపట్టవలసి ఉంటుంది. ఎందుకంటే ఇవి ఎక్కువ వ్యయంతోకూడి దీర్ఘకాలం కలిగినవిగా ఉంటాయి. అందుకే ప్రైవేట్ పెట్టుబడిదారులు వీటిని చేపట్టరు. ఇంతటి వ్యయాన్ని కేవలం పన్నుల ద్వారానే మాత్రమే ప్రభుత్వం సమకూర్చుకోలేదు. కాబట్టి ప్రభుత్వం ఋణం చేయవలసి వస్తుంది.

7. **యుద్ధ అవసరాలు :** ప్రతి దేశంలో శాంతి భద్రతలను కాపాడటం విదేశ దాడులనుంచి దేశాన్ని రక్షించడంవంటి పోలీస్ చర్యలను చేపట్టడంవల్ల ప్రభుత్వ వ్యయం ఎంతగానో పెరిగిపోతున్నది. ఇంతటి వ్యయము కేవలం పన్నుల ద్వారానే రాబట్టలేం. ఒకవేళ

పన్నుల ద్వారా రాబట్టినా అది ఆర్థిక వ్యవస్థపై చెడు ప్రభావాన్నికూడా కలిగించవచ్చు. కాబట్టి ప్రభుత్వాలు రుణం చేయవలసి వస్తోంది. ప్రత్యేకించి ఆధునిక ప్రభుత్వాలు ఒక దానిని మరొకటి సహించుకుంటూ తమ తమ రక్షణ వ్యయాలను పెంచుకుంటున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఋణం కూడా పెరుగుతుంది. ఈ ఋణాలు యుద్ధాల అవసరాలకోసం మరియు యుద్ధం తర్వాత ఆర్థిక పునర్నిర్మాణంతో వెచ్చించబడతాయి. ఇవి ఎంతో ఖర్చుతో కూడుకొని వుంటాయి. కాబట్టి ఇంత మొత్తాన్ని ఋణం చేయక తప్పదు.

**8. సాంఘీక అవస్థాపన నిర్మాణం కొరకు రుణం :** ఏ దేశ ఆర్థిక అభివృద్ధి అయినా సాంఘీక అవస్థాపన సౌకర్యాలపై ఆధారపడి ఉంటుంది. ఈ మూలధనం అవస్థాపన సౌకర్యాలు అయిన రవాణా సౌకర్యాలు, రైల్వే నిర్మాణం, ఇంధనం మరియు కమ్యూనికేషన్లు వార్తా పత్రికలు, ఆరోగ్యం, విద్య, విద్యుత్‌శక్తి, మొ॥లగు రూపాలలో ఉంటుంది. ఇంత మొత్తాన్ని వ్యయం, ప్రభుత్వం ఋణాలుచేసి కొనసాగిస్తుంది. ఇవి ప్రజల సంక్షేమాన్ని పెంపొందించడమే కాకుండా ఆర్థికాభివృద్ధిని పెంపొందించుటతోకూడా తోడ్పడతాయి. కాబట్టి ప్రభుత్వం ఋణం చేసి అయిన వీటిని కొనసాగిస్తుంది. కాబట్టి అవస్థాపన నిర్మాణం కోసం రుణం పెరుగటం తప్పనిసరి.

**9. ఉపాధికల్పన :** ప్రభుత్వ ఋణం చేయటంలో అతి ముఖ్యమైన కారణాలలో ఒక కార్ణం ఉపాధికల్పన. నిరుద్యోగ సమస్యను నిర్మూలించడంతో లేదా చక్రీయమైనటువంటి వడుదుడుకులు తొలగించుటలో ఋణం ద్వారా ప్రభుత్వ పాత్రను కొనసాగిస్తుంది. 1930 లో పన్నుల విధానం నిరుద్యోగితను తొలగించుటలో పేద పరికరముగా మాత్రమే తోడ్పడింది. పెద్ద మొత్తాలలో వ్యయం చేయుటను తద్వారా ఉపాధిని కల్పించుటలో ప్రభుత్వ ఋణం అతి ముఖ్యమైన సాధనం.

**10. శాస్త్ర సాంకేతిక ప్రగతి :** ప్రత్యేకించి అభివృద్ధి చెందుతున్న దేశాలలో శాస్త్ర సాంకేతిక ప్రగతి విదేశాలనుంచి దిగుమతి చేసుకోవడం జరుగుతుంది. అల్ప అభివృద్ధి దేశాలతో పురాతన పద్దతులు, తక్కువ ఉత్పాదకం కల్గివుంటాయి. సమస్యను అధిగమించాలంటే పేద దేశాలు కచ్చితంగా ధనిక దేశాలనుంచి ఋణ సహాయాలను పొందుతూ ఉంటాయి.

**11. ప్రకృతి వైపరీత్యాలు :** ప్రకృతి వైపరీత్యాలు అయిన కరువు కాటకాలు, వరదలు, భూకంపాలు, తుఫాను మొ॥గునవి సంభవించినప్పుడు ఏ దేశంలోనైనా రుణం వైపుకు దారి మళ్ళుతుంది. వీటిని తొలగించుటలో భాగంగా ప్రభుత్వం ఋణం చేస్తున్నాయి. భారతదేశంలో ఎన్నో కరువు కాటకాలు సంభవించినపుడు పెద్ద మొత్తంలో ఖర్చు చేయడం గతంలో ఎన్నోసార్లు జరిగింది. ఈ మొత్తాలు చాలా వరకు ఋణం ద్వారానే మాత్రమే పొందగల్గుతాము.

**12. ఆహారధాన్యాల దిగుమతి :** అభివృద్ధి చెందుతున్న దేశాలు అల్ప ఉత్పాదక వ్యవసాయంతో ఒకవైపు అధిక జనాభా వత్తిడితో మరోవైపు బాధపడుతూ ఉంటాయి. ఫలితంగా విస్తారమైన పేదరికం, ఆహార ధాన్యాల కొరత ఈ దేశాలలో ఉంటుంది. ఈ కొరతను తీర్చుకోవడం కోసం అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆహారధాన్యాలను విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటాయి. అంతేకాకుండా వ్యవసాయ కార్యకలాపాలు అన్ని వాతావరణ పరిస్థితులను బట్టి అనిశ్చితమై ఉంటాయి. ఫలితంగా విదేశీ రుణం పెరుగుతుంది.

## 9.5 ప్రభుత్వ ఋణ ఆధారాలు :

ప్రభుత్వ ఋణానికిగల ఆధారాలను సమగ్రంగా రెండు రకాలుగా విభజింపవచ్చును. అవి : **1. స్వదేశీ రుణం, 2. విదేశీ రుణం.**

**1. స్వదేశీ ఋణం :** అంతర్గతంగా ప్రభుత్వ సంస్థలు (కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, మరియు స్థానిక ప్రభుత్వాలు) ఈ క్రింది రూపాలతో ఋణాలను పొందుతాయి.

ఎ) వ్యక్తులు, ప్రైవేట్ కంపెనీల నిర్మితమైన వడ్డీకి విడుదలచేసిన బాండ్లు.

బి) బ్యాంకేతర విత్త సంస్థలు నుంచి పొందే రుణాలు అవి భీమా కంపెనీలు, యూనిట్ ట్రస్ట్, వంటి విత్త కంపెనీలు.

సి) బ్యాంకుల ద్వారా పొందే ఋణాలు.

డి) కేంద్ర బ్యాంకు నుంచి తీసుకున్న ఋణాలు

విభిన్న రూపాలలో లభించేటటువంటి ఋణాలు విభిన్న ప్రభావాలను ఆర్థిక వ్యవస్థపై కల్గిస్తాయి. కాబట్టి ఋణ ఆహార వ్యయం గురించి సమగ్రమైన వివరణ ఉండాలి అప్పుడే జాతీయ ఉద్దేశ్యాల కోసం ఋణాన్ని జాగ్రత్తగా వాడచ్చు. ప్రభుత్వం ప్రజల దగ్గర నుంచి ఋణాలను తీసుకున్నట్లయితే అదివారియొక్క కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది. అది ఆర్థిక వ్యవస్థలో సార్థక డిమాండ్‌ను తగ్గిస్తుంది.

వ్యక్తిగత పొదుపులు ప్రైవేట్ పెట్టుబడినుంచి, ప్రభుత్వ పెట్టుబడికి ఋణంగా చేరుతాయి. కాబట్టి ప్రైవేట్ పెట్టుబడి తగ్గుతుంది. దీనికి ప్రభుత్వ పెట్టుబడి చేరకపోయినట్లయితే అంత మేరకు పెట్టుబడి కొరతలు ఏర్పడతాయి.

వాణిజ్య బ్యాంకులు నుంచి మరియు కేంద్ర బ్యాంకునుంచి పొందే రుణాలు అదనపు కొనుగోలు శక్తి కల్పనలతో ఆర్థిక వ్యవస్థకు తోడవుతాయి. అది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది.

**2. విదేశీ ఋణం :** విదేశాలనుంచి కూడా ప్రభుత్వానికి రుణం లభిస్తుంది. విదేశీ ఋణం నేటి ప్రభుత్వాలకు అత్యంత ఆవశ్యము ఎందుకంటే యుద్ధ వ్యయం, రక్షణ పరికరాల కొనుగోలుకు, ఉత్పాదక వస్తువుల దిగుమతి అంటే యంత్రాల పరికరాలు లేక సాంకేతికత రూపంలో విదేశీరుణాలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉంటాయి. భారత దేశంలో విదేశీ ఋణం ఈ క్రింది విధంగా పొందివుంది.

ఎ) అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు అయిన, అంతర్జాతీయ ద్రవ్య సంస్థ ద్రవ్యనిధి (ఐ.ఎమ్.ఎఫ్) ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ మరియు అంతర్జాతీయ అభివృద్ధి కార్పొరేషన్ స్వల్పకాలిక రుణాలను ఈ సంస్థలు మంచి అంతర్జాతీయ చెల్లింపులు భత్యాలు ఏర్పడిన తాత్కాలిక లోటుకోసం చేస్తుంది. అదే విధంగా అభివృద్ధి ప్రాజెక్టులు కోసం దీర్ఘకాలిక రుణాలను చేస్తుంది.

బి) కొన్ని దేశాలనుంచి అభివృద్ధి కార్యక్రమాల కోసం, అత్యవసర దిగుమతులు రూపంలో కూడా ఋణం చేస్తుంది. భారతదేశం చేస్తున్న విదేశీరుణాలు ఎక్కువగా అమెరికానుంచి (13%), ఇంగ్లండు (7%), జర్మనీ (6%) మరియు జపాన్ (5%) విదేశీ రుణాన్ని పొందుతుంది.

## 9.6 ప్రభుత్వ ఋణ ప్రభావాలు :

ప్రభుత్వ ఋణ ప్రభావం అనేది ఋణ ఉద్దేశం, ఋణ అవసరాలు వడ్డీరేటు మొ॥ అంశాలపై ఆధారపడి వుంటుంది. ప్రభుత్వం తాను తీసుకున్న ఋణాలను తిరిగి చెల్లించడానికి ద్రవ్య వనరులను సమకూర్చుకోవలసి వుంటుంది. ఇందుకుగాను ప్రభుత్వం ప్రజలపై పన్ను విధిస్తుంది. ఈ విధంగా విధించిన పన్నులు ఆర్థిక వ్యవస్థమీద ప్రభావాన్ని కలిగిస్తాయి. కాబట్టి ఋణ విముక్తికోసం ప్రభుత్వం పన్నులను విధించడంవల్ల ఆర్థిక వ్యవస్థపై కలిగే ప్రభావాలను విశ్లేషించడాన్నే ఋణ ప్రభావం అంటారు. ప్రభుత్వ ఋణ ప్రభావాన్ని క్రింది అంశాల ద్వారా అర్థం చేసుకోవచ్చు.

**1. వినియోగంపై ప్రభావం :** ప్రజలు తమ ప్రస్తుత ఆదాయం నుంచి ప్రభుత్వ పత్రికలను కొనుగోలు చేస్తే వాని వినియోగ వ్యయం తగ్గవచ్చు. అయితే కొన్ని సందర్భాలలో ప్రజలు తమ పూర్వపు పొదుపును ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయడానికి వినియోగిస్తే వారి వినియోగ వ్యయం తగ్గుతుందని చెప్పలేము. ఇటువంటి సందర్భాలలో ప్రభుత్వ ఋణంవల్ల వినియోగ వ్యయం పెరగవచ్చు.

**2. ఉత్పత్తిపై ఋణ ప్రభావం :** ప్రభుత్వం తాను చేసిన ఋణాన్ని అవస్థాపన సౌకర్యాలకు పరిశోధన సంస్థల అభివృద్ధి, శిక్షణ మొ॥ వాటి కొరకు వినియోగిస్తే ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. అలాగే ప్రభుత్వ ఋణాన్ని ప్రైవేటు రుణ సంస్థలకు సబ్సిడీలను కల్పించడానికి ఉపయోగించడం వలనకూడా ఉత్పత్తి వ్యయం తగ్గవచ్చు. ప్రభుత్వం తాను తీసుకొనే ఋణాలను అనుత్పాదకత కార్యక్రమాలకు వినియోగిస్తే అటువంటి ఋణాలను తిరిగి చెల్లించడానికి ప్రజలపై అధనపు పన్నులను విధించవలసి వుంటుంది. ఈ చర్య భవిష్యత్తులో వినియోగ వ్యయంపై ప్రభావం చూపుతుంది.

**3. పంపిణీపై ప్రభావం :** సాధారణంగా ప్రభుత్వ సెక్యూరిటీలకు కొనుగోలు చేసేవారు ధనవంతులుగా వుంటారు. కాని ఋణ విముక్తి కోసం ప్రభుత్వం విధించే పన్నుల భారం ధనవంతులతోపాటు పేదవారిపై కూడా వుండి అవి ఆదాయ అసమానతలను పెంచుతుంది. అయితే ప్రభుత్వ ఋణ పత్రాలను కొనుగోలు చేసేవారు, పన్నులను చెల్లించేవారు ఇద్దరు ఒకే వర్గానికి చెందినవారైతే ఆదాయ అసమానతలు పెరగవు. అయితే వాస్తవంలో ఇది సాధ్యంకాదు. ప్రభుత్వ ఋణాన్ని అల్పాదాయ వర్గాలవారి సాంఘిక, ఆర్థిక సంక్షేమం కొరకు ఖర్చు చేస్తే ఆదాయ అసమానతలు కొంతవరకు తగ్గుతుంది.

**4. ప్రైవేట్ రంగంపై ప్రభావం :** ప్రభుత్వం చేసే వ్యయంవలన ఆర్థిక వ్యవస్థలో వస్తువులకు డిమాండ్ పెరుగును. ప్రభుత్వ వ్యయం వలన ప్రజల కొనుగోలు శక్తి పెరిగి ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యచరమని పెంచుతుంది. కాబట్టి ప్రభుత్వం తాను చేసే వ్యయానికి అవసరమయిన ద్రవ్య వనరులను పన్నుల ద్వారా సేకరిస్తే ప్రభుత్వ వినియోగం తగ్గించబడుతుంది. అదే ద్రవ్య వనరులను ఋణం ద్వారా సమకూరిస్తే వినియోగ వ్యయం ఏమాత్రం తగ్గదు. ప్రభుత్వ ఋణాలను ప్రైవేట్ రంగంలో ఉత్పత్తి అయిన వస్తు సేవల కొనుగోలుకు వినియోగిస్తే ఆ రంగంలోని వస్తువులకు డిమాండ్ పెరిగి ఆదాయ ఉద్యోగితల పెరుగుదలకు దారితీస్తుంది.

**5. పెట్టుబడిపై ప్రభావం :** ప్రభుత్వ ఋణం పెట్టుబడిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందనే ఒక అభిప్రాయం కలదు. ప్రభుత్వం, ఆధార మొత్తంలో వాణిజ్య భావాలు కేంద్ర బ్యాంకు మరియు ఇతర బ్యాంకుల నుండి ఋణాలను సేకరిస్తే ప్రైవేట్ రంగంలో పెట్టుబడి పరిమాణం తగ్గవచ్చు. అంతేకాక ప్రభుత్వం ఋణం చెల్లింపులకోసం ఆధిక పరిమాణంలో పన్నులను విధిస్తుందనే భయం వున్నప్పుడు కూడా పెట్టుబడి పరిమాణం తగ్గి ఆర్థిక వ్యవస్థలో అనిశ్చిత పరిస్థితి ఏర్పడును.

ప్రభుత్వ ఋణం పెట్టుబడిపై అనుకూల ప్రభావాన్ని కలిగి వుంటుంది. ప్రభుత్వ ఋణాన్ని అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తే ప్రైవేట్ రంగంలో పెట్టుబడులు పెరిగి ఉత్పత్తి పరిమాణం పెరుగుతుంది.

**6. విదేశీయ ఋణ ప్రభావం :** అభివృద్ధి చెందుతున్న దేశాలలోని ఆర్థికాభివృద్ధి రేటును నియంత్రించడంలో విదేశీ ఋణం కీలక పాత్రను వహిస్తుంది. విదేశీ ఋణాన్ని తిరిగి చెల్లించేటప్పుడు ద్రవ్య వనరులును ఇతర దేశాలకు బదిలీ అవుతుంది. కాబట్టి ఇది ప్రత్యక్ష ద్రవ్య భారాన్ని కలిగిస్తుంది. అయితే ఇది విదేశీ ఋణాన్ని ఉపయోగించే విధానాన్నిబట్టి వుంటుంది. ఈ ఋణాన్ని ఉత్పాదక కార్యక్రమాలకు ఉపయోగిస్తే దేశంలో ఉత్పత్తి పెరుగుతుంది. ఈ ఉత్పాదకత విదేశాలకు చెల్లించే వడ్డీకంటే అధికంగా వుంటే వాస్తవిక ఋణ భారం వుండదని చెప్పవచ్చు. ఫలితంగా విదేశీ ఋణం అనుకూల ప్రభావాన్ని కలిగిస్తుంది.

## 9.7 ఋణం మరియు పన్నులు :

పెరుగుతున్న ప్రభుత్వ వ్యయాన్ని ఎదుర్కొనుటలో ప్రభుత్వానికి రెండు ముఖ్యమైన మార్గాలుంటాయి. అవి 1. పన్నులు, 2. ప్రభుత్వ ఋణం. ఈ రెండింటిలో కాలానుగుణంగా ప్రభుత్వం ఏదో ఒకటికాని లేదా రెండింటిని కలిపికాని అనుసరిస్తుంది. దేనిని అనుసరించాలా అనుటలో ఏదైతే తక్కువ చెడు ప్రభావాన్ని కల్గిస్తుంది. దాన్ని అనుసరిస్తాయి. గర్లే మరియు షా (Gurley and show) భవిషత్తు ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి ఉన్నతసిఖరమైన ప్రభుత్వ ఋణ ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

**ప్రభుత్వ ఋణ సుగుణాలు మరియు పన్నులలో లోపాలు :**

- యుద్ధము మరియు యుద్ధ ప్రభావాల్లో నుంచి ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించుటలో పన్నులకంటే ప్రభుత్వ ఋణం ఎంతో ఉపయోగకరం. ఎందుకంటే ఈ సమస్యల పరిష్కారానికి పన్నుల విధానం ద్వారా రాబడిని రాబట్టుకోవడం, అంటే పెద్ద మొత్తంలోను మరియు అతి త్వరగాను పొందుటకు వీలుకాదు.
- దీర్ఘకాలిక ప్రాజెక్టులు ఆర్థిక అభివృద్ధికి తప్పనిసరి అట్లాంటి ప్రాజెక్టులకు దీర్ఘకాలిక ఋణ విధానమే పన్నుల విధానంకంటే ఋణ విధానమే ఉత్తమమైనది. ఉదా॥కి నీటిపారుదల, సాంఘిక మూలధనం, రైల్వేలు, ఇనుము ఉక్కు కర్మాగారం వంటి ప్రాజెక్టులు ఋణం పొంది మాత్రమే పొందగలం.

పన్నులు మూడు రకాల పరిమితులును కల్గి ఉన్నవి. అవి 1. పన్నులు చాలి చాలని ఆదాయమార్గాలు, 2. పన్నులు పనిచేసే సామర్థ్యం, పొదుపు చేసే సామర్థ్యంపై ప్రతికూల ప్రభావాలను కల్గి ఉంటాయి. 3. ఈ పన్నులు సార్థక డిమాండ్‌ను తగ్గించి వినియోగాన్ని తగ్గిస్తాయి. ఆర్థిక మాంధ్యకాలంలో ఆదాయాలు తక్కువగా ఉండి, డిమాండ్ తక్కువగా ఉండి, పన్నురాబడి తక్కువగా ఉంటుంది. అలాంటి పరిస్థితులలో ప్రభుత్వ ఋణం ఉపయోగపడుతుంది. మరోవైపు అధిక మొత్తంలో ఋణాలు ప్రజాహిత కార్యక్రమాలమీద ప్రభుత్వం ఖర్చు పెట్టవలసి ఉంటుంది. కాబట్టి అది ఆదాయాన్ని, ఉద్యోగితను, పెంపొందించుటలో ఉపయోగపడుతూ ప్రైవేట్ పెట్టుబడుదారులకు ప్రోత్సాహంగా ఉంటుంది.

- ప్రభుత్వ ఋణం యొక్క మరొక ముఖ్యమైన వాదం ఏమిటంటే ఋణం అనేదే ఐచ్ఛికం కాబట్టి ఋణాలు పని పొదుపు పెట్టుబడుటమీద ఏలాంటి ప్రతికూల ప్రభావాలను చూపించవు.

**ప్రభుత్వ ఋణలోపాలు మరియు పన్ను సుగుణాలు :**

- ముఖ్యమైన ప్రభుత్వ ఋణంలో లోపం ఏమిటి అంటే నిర్ణయించుకున్న మొత్తంలో వడ్డీ, అసలు చెల్లించవలసి ఉంటుంది. అట్లాంటి నిర్ణయాత్మకమైన చర్యలు ప్రభుత్వ పన్నులలో వుండవు.
- ప్రభుత్వ ఋణంలో తిరిగి చెల్లింపులు అసలు వడ్డీతో కూడ ధనికుల చేతులలో చేరుతాయి. కావున ధనికుడు ధనికుడుగాను, మరియు ఆర్థిక అసమానతలు లేదా సంపద పంపకాలతో అసమానతలకు ప్రభుత్వ ఋణం తోడ్పడుతుంది. ఇందుకు భిన్నంగా పన్నులు అసమానతలు తగ్గించుటలో ఎంతగానో తోడ్పడతాయి. పురోగామిపన్ను, విలాస వస్తువులమీద పన్నులు ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చును.
- ద్రవ్యోల్బణాన్ని తగ్గించటంతో అధిక ఆర్థిక శక్తిని తగ్గించవలసిన అవసరం ఉంటుంది. ఋణ విధానంకంటే పన్నుల విధానం అత్యంత ఉపయోగకరము అయిన పరికరముగా తోడ్పడుతుంది.

## 9.8. ప్రభుత్వ ఋణ భావము :

ప్రభుత్వ ఋణం భారాన్ని కల్గిస్తుందా? లేదా ప్రయోజనాన్ని కల్గిస్తుందా? అని నిర్ధారించుటలో ఆర్థిక అభివృద్ధితో విదేశీయ ఋణాన్ని, స్వదేశీ ఋణాన్ని విడగొట్టి చూడవలసి ఉంటుంది. వ్యక్తుల విషయంతో భారము అయిన ఋణం ప్రభుత్వ విషయంలో కూడా అట్లాగే ఉంటుందని భావించకూడదని శామ్యూల్‌సన్ కూడా పేర్కొన్నాడు. కీన్స్ తరువాత అర్థ శాస్త్రవేత్తతో స్వదేశీ ఋణాలు ఎలాంటి భావాన్ని కల్గించవని పేర్కొన్నారు.

**స్వదేశీయ ఋణ భారం :** స్వదేశీ ఋణాలు సమాజంపై ఎలాంటి ప్రత్యక్ష ద్రవ్య భారాన్ని కల్గించవు. ఎందుకంటే ఈ ఋణాన్ని వారికోసం వారే ఇచ్చుకుంటారు. (ఒకే దేశస్తులు) ఒక దేశంలోని ప్రజలు, స్వదేశీయ ఋణాలు నిధుల బదలాయింపు అదే సమాజంలో జరుపుతాయి. ప్రభుత్వం అప్పుచేస్తే నిధుల బదలాయింపు ప్రజలనుంచి ప్రభుత్వానికి చేరుతుంది. ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. కనుక అవి తిరిగి వారికే చెల్లుతాయి. ఒకవేళ ప్రభుత్వం ఋణదాతకు వడ్డీ చెల్లించుటతో పన్నులు విధించిన ఆ పన్ను విధించిన వ్యక్తి ఆ ఋణదాత ఒకరే అయితే అది ఏలాంటి భారాన్ని కల్గించదు. కాబట్టి స్వదేశీయ ఋణాలు ఏలాంటి ప్రత్యక్ష ద్రవ్య భారాన్ని కల్గించవని డాల్టన్ పేర్కొన్నాడు. అదే విధంగా ఏ.పి. లెర్నర్ కూడా అంతర్గత ఋణం ఎలాంటి భావాన్ని జాతిమీద చూపదని పేర్కొన్నాడు. అయితే ఋణదాత ఆ ఋణదాతకు వడ్డీ చెల్లించే నిమిత్తము పన్ను భారాన్ని భరించే వ్యక్తి వేరు వేరుగా ఉంటే అప్పుడు భారం ఏర్పడుతుంది.

**విదేశీ ఋణ భారం :** విదేశీ ఋణాలు బహిర్గతముగా పొందడం జరుగుతుంది. విదేశీఋణాలు ద్రవ్య భారాన్ని మరియు వాస్తవిక భారాన్ని జాతిపై కల్గిస్తాయి. ఏ.పి. లెర్నర్ విదేశీయ ఋణాలు దేశానికి బీదతనాన్ని కల్గచేస్తాయని పేర్కొన్నాడు. విదేశీ ఋణాలు చెల్లింపులు జరగాలి అంటే వస్తు సేవల అమ్మకాలు వాటితో జరగాలి. బ్రెజిల్, పోలాండ్, మెక్సికో వంటి చాలా దేశాలు విదేశీయ ఋణాలు చెల్లింపులు భారంగాను, కష్టంగాను 80వ దశబ్దములో ఎదుర్కొన్నాయి. వస్తు సేవల ఎగుమతులు విదేశీ ఋణాల చెల్లింపులకోసం చేయవలసి వుంది. అది జాతి సంక్షేమాన్ని దేశంలో ఉన్న విలువైన సహజ వనరులును దెబ్బతీస్తుంది. కాబట్టి విదేశీ ఋణాలలో అత్యంత జాగ్రత్త ఎంతైనా అవసరం. అయితే అభివృద్ధి చెందుతున్న భారతదేశానికి అవి ఎల్లపుడు ప్రతికూల ప్రభావాన్ని కూడా చూపిస్తాయని చెప్పాడు. ఈలాంటి దేశాలకు విదేశీఋణాలు యంత్ర సామగ్రి పరికరాల రూపంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన రూపంలో సీఘ్రా మూలధన కల్పనలో తప్పనిసరి అవుతుంది. కాబట్టి ఆర్థిక వ్యవస్థ నిర్మాణంతో విదేశీయ ఋణాలు కూడా ప్రముఖపాత్ర పోషిస్తాయి. అయితే తెచ్చుకున్న మొత్తాన్ని ఏ కార్యక్రమం అయితే తెచ్చుకున్నామో దానిమీదనే హెచ్చించగల్గి ఆ కార్యక్రమంలోనుంచి అసలు వడ్డీని తిరిగి చెల్లించినంత మేరకు ఉత్పత్తిని పెంచగల్గినట్లయితే అది ఏమాత్రము భారాన్ని కల్గించదు.

## 9.9 ప్రభుత్వ ఋణ : నిర్వహణ ఋణ విముక్తి :

ప్రభుత్వ ఋణ నిర్వహణ అనేది ప్రభుత్వం ఋణం చేసే పద్ధతులను గురించి, తీసుకొనే ఋణాన్ని తిరిగి చెల్లించే పద్ధతులను గూర్చి అంటే ఋణ విమోచనా పద్ధతులను గూర్చి తెలియజేస్తుంది. ప్రభుత్వం ఋణం చేసే విధానం, ఋణ విమోచనా పద్ధతులు ఆర్థిక స్థిరీకరణ దోహదపడేవిధంగా వుండాలి. అది ద్రవ్యోల్బణ, ప్రతి ద్రవ్యోల్బణ ప్రభావాన్ని నియంత్రించి ప్రభుత్వానికి అవసరమైన విధులను సమకూర్చే విధంగా వుండాలి. ఋణాన్ని ఏ విధంగా సేకరించారనేదానివలన కానీ మంచి ఫలితాలు కాని దుష్ఫలితాలు కాని వుండును. ఋణాన్ని చేసినప్పుడు తాత్కాలికంగా ఆర్థిక వనరులు పెరగవచ్చు కాని తిరిగి చెల్లించేటప్పుడు అసలుతోపాటు వడ్డీని కూడా చెల్లించవలసి వుంటుంది. అందువలన ఋణం భారమగును. కాబట్టి ప్రభుత్వాలు త్వరలో ఋణ చెల్లింపులు చేయవలెను. ఋణాలను తిరిగి చెల్లించుటచే ఋణ విముక్తి ఏలదా ఋణ విమోచన అంటారు. ఋణ విమోచనకు ప్రభుత్వం ప్రధానంగా క్రింది పద్ధతులను అనుసరిస్తుంది. అవి :

**1. రుణ నిరాకరణ** (Repudiation of Debt) : ప్రభుత్వం తాను తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించునని ప్రకటించటాన్నే రుణ నిరాకరణగా పేర్కొనవచ్చు. కొన్నది రుణ విముక్తికి సరియైన మార్గం కాదు. దీని కారణంగా దేశంలోని ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతుంది. రుణ నిరాకరణవల్ల ప్రభుత్వం తన పరపతిని స్వదేశంలోను, విదేశాలలోను కోల్పోతుంది. ఇందువల్ల ప్రభుత్వం కొత్త ఋణాలు చేయడం కష్టమవుతుంది. రుణ నిరాకరణ వాస్తవానికి రుణ విమోచనకాదు. కాబట్టి సాధారణంగా ప్రభుత్వం రుణ నిరాకరణ చేయదు. కొన్నికొన్ని అసాధారణ పరిస్థితిలో కొన్ని ప్రభుత్వాలు ఈ పద్ధతిని అనుసరిస్తాయి. ఉదా॥కు 1917లో సోవియట్ ప్రభుత్వం. 1961-65 సం॥లలో అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు కొన్ని రుణాలను చెల్లించడానికి నిరాకరించాయి. అంతేతప్ప ఇటీవల కాలంలో రుణ నిరాకరణ ప్రపంచం మొత్తం మీద ఏ దేశంలోను జరగలేదు.

**2. వాపసు** : చెల్లించవలసిన సమయము వచ్చిన అప్పుల చెల్లింపుకై ప్రభుత్వం క్రొత్తగా బాండ్లను, సెక్యూరిటీలను జారీ చేయుటనే వాపసు అంటారు. అయితే ఈ పద్ధతి ప్రకారం ఋణ భారం పరిసమాప్తికాదు కేవలం ఆ మొత్తం భారము భవిష్యత్తులోకి సంచితం అవుతుంది.

**3. పరివర్తనం** : ప్రభుత్వం గతంలో తీసుకొన్న పాత రుణాన్ని తిరిగి చెల్లించడానికి మరలా కొత్తగా రుణాన్ని చేసే పద్ధతినే పరివర్తనం అంటారు. అంటే పాత ఋణాల కోసం కొత్తగా ఋణాలను చేస్తుంది. కాబట్టి వాస్తవంగా ఋణ విముక్తి ఈ పద్ధతి ప్రకారం జరగదు. కావున ఋణ భారం తగ్గదు. అయితే పాత ఋణాలు అధిక వడ్డీతో కూడుకొని కొత్త ఋణాలు తక్కువ వడ్డీకి లభిస్తే అంటే తక్కువ వడ్డీ రేటుకు లభిస్తే అలాంటప్పుడు కొత్త ఋణాలు చేస్తే కొంత మేరకు ఋణభారాన్ని తగ్గించుకోవచ్చు.

**4. ఋణ విమోచన నిధి** : ఋణాన్ని తిరిగి చెల్లించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం తన బడ్జెట్‌లో నుంచి కొంత మొత్తాన్ని ఒక నిధి రూపంలో జమ కడుతుంది. ఈ నిధినే ఋణ విమోచనా నిధి అంటారు. ఈ విధంగా ప్రతి సంవత్సరం జమ చేస్తూ వుంటే ఋణం పరిపక్వం చెందేనాటికి ఈ నిధి మొత్తం ఋణానికి సమానం అవుతుంది. ఈ విధమైన ఏర్పాటువల్ల ఋణ చెల్లింపులో ఒక సులభమైన పద్ధతిని అనుసరించినట్లు అవుతుంది. అందుకే చాలామంది ఆర్థిక వేత్తలు ఇది శాస్త్రీయమైనది, సులభమైనది అని ఈ పద్ధతిని సమర్థించారు. అయితే ఇటీవల కాలంలో కొన్ని ప్రభుత్వాలు ఋణ విమోచన నిధిలో కొంత భాగాన్ని దుర్వినియోగం చేయుచు ఆ మొత్తాలను ఇతర కార్యక్రమాలకు ఉపయోగించుచున్నారనే విమర్శ కలదు. ఇంగ్లాండ్‌లో మొట్టమొదటిసారిగా ఋణ విమోచన నిధిని హ్యూ వాల్‌పోల్ (Hugh Walpole) ఏర్పాటుచేస్తే, 1792లో అమెరికాలో అలెగ్జాండర్ హ్యామిల్టన్ (Alexander Hamilton) ఈ నిధిని ఏర్పాటు చేసాడు.

**5. మిగులు బడ్జెట్‌లోనుండి చెల్లించుట** : మిగులు బడ్జెట్‌ను రూపొందించుట ద్వారా కూడా ఋణాలను చెల్లించవచ్చు. కాని ఆధునిక ప్రభుత్వాలకు మిగులు బడ్జెట్ అసాధారణ విషయం. అందుచే ఋణం ఈ పద్ధతి ప్రకారం తిరిగి చెల్లించుట అభివృద్ధి చెందుతున్న దేశాలలాంటి భారత దేశానికి ఎంతో కష్టం.

**6. పొలుసరి చెల్లింపు** : ప్రభుత్వం తన ఋణాన్ని ప్రతి సంవత్సరము సమాన వాయిదాలలో అసలు వడ్డీని కలిపి చెల్లిస్తూ వస్తుంది. దీనివల్ల ఋణ బాధ్యత ప్రతి సంవత్సరం కొంత మేర తగ్గిపోతుంది.

**7. మూలధనం పై పన్ను లేక ప్రత్యేక విధింపు :** ప్రభుత్వం మూలధనం లేదా మూలధనానికి సంబంధించిన ఆస్తులపై లేదా వస్తువులపై ఒకేసారి పెద్ద మొత్తంలో పన్ను విధిస్తే దాన్ని మూలధనం పన్ను లేదా ప్రత్యేక విధింపుగా పిలుస్తారు. కొంత మంది ఆర్థిక శాస్త్ర వేత్తల అభిప్రాయం ప్రకారం ఇది చాలామంచి పద్ధతి అని పేర్కొన్నారు. ఎందుకంటే పన్ను చెల్లించే ధనిక వర్గం వారు యుద్ధ సమయాలలో ధరలను పెంచి అధిక లాభాలను ఆర్జిస్తారు. అందువల్ల వారిపై యుద్ధకాలపు ఋణభారాన్ని వేయుట సమర్థనీయం. తగిన స్థోమత కలిగినవారిపై మాత్రమే విధిస్తారు. కాబట్టి ధనికవర్గం కొనుగోలు శక్తితగ్గి, ద్రవ్యోల్బణం కూడ కొంత మేరకు తగ్గుతుంది. అందుకే డాల్టన్ కూడా ఈ పన్నును ఉత్తమమైనదిగా పేర్కొన్నాడు. అయితే మూలధన పన్ను విధింపుకు వ్యతిరేక వాదనలు కూడా వున్నాయి. వాటి ప్రకారం మూలధనం పన్ను విధింపు పొదుపును నిరుత్సాహపరచి, తద్వారా పరిశ్రమల రంగంలో వ్యతిరేక ప్రభావాలను కూడా కల్గించవచ్చు. మూలధనం విదేశాలకు తరలించబడవచ్చు. అదే విధంగా విదేశాలనుంచి వచ్చే మూలధన ప్రవాహాలు తగ్గవచ్చు. ఫలితంగా దేశ ఆర్థికాభివృద్ధి కుంటుబడుతుంది. మరియు పన్ను నుంచి తప్పించుకొనుటకు ప్రయత్నిస్తారు. ఇది పన్ను సూత్రాలకు విరుద్ధం. ఏదిఏమైనప్పటికి మూలధన పన్ను విధింపు వల్ల ఋణం ఒక్కసారిగా తీరిపోతుంది.

**8. అంతర్జాతీయ వ్యాపారులతో మిగులు :** ఋణ విముక్తి అంతర్గత యీ వ్యాపారంలో మిగులును ఏర్పాటు చేయుటకు మరో మార్గం దాని ప్రకారం ఎగుమతులను పెంచి అదే సమయాలలో దిగుమతులను తగ్గిస్తూ చెల్లింపుల ఖాతాలో మిగులును ఏర్పాటు చేయుట ద్వారా ఆ మొత్తాన్ని ఋణ విముక్తికి లేదా విదేశీ ఋణం చెల్లించుట చేయవచ్చు.

## 9.10 భారత దేశంలో ప్రభుత్వం ఋణం:

భారత దేశంలో శీఘ్రంగా పెరుగుతున్న అభివృద్ధియేతర వ్యయం వల్ల పన్నుల రాబడి, పన్నేతర రాబడి మార్గాల ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంచే రాబడి ఖాతాలో లోటు ఏర్పడింది. ఆ లోటును పూడ్చుటలో ప్రభుత్వ ఋణం తప్పని సరి అయినది. అభివృద్ధి వ్యయంతో పారిశ్రామికాభివృద్ధికి మన దేశంలో స్వదేశీ మరియు విదేశీ ఋణాలు చేయవలసి వస్తుంది.

స్వాతంత్ర్యానికి పూర్వం మన దేశ ఋణాన్ని పరిశీలించినట్లయితే ఈస్టు ఇండియా కంపెనీ చేపట్టిన రాజకీయ యుద్ధాలవల్ల మరియు వారి అణచివేత ధోరణులకు పోలీసు వ్యయం కోసం ఋణం చేసినది. లార్ట్ వెల్లసీ మరియు లార్ట్ డల్హౌసీ (Lord Weleslly and Lord Dalhousie) యుద్ధాలలో నిమగ్నమయ్యారు. 1792, నాటికి ఋణం రు. 70 లక్షలకు చేరుకోగా, ఆ మొత్తం 1856 నాటికి 595 లక్షలకు పెరిగింది. ఆ సంవత్సరం చివరికి సిపాయిల తిరుగుబాటు వల్ల పెరిగిన ఖర్చు మొదలగు వాటి వల్ల ఋణం రు. 695 లక్షలకు చేరుకుంది. ఇలాంటి వ్యయాన్ని స్వాతంత్ర యుద్ధంలో భాగంగా భారతదేశపు ఖాతాలో చేర్చారు. అధికారాన్ని కంపెనీ నుంచి ఇంగ్లాండ్ రాణికి బదలాయించే నాటికి ఈ ఋణం మొత్తం రు. 1000 లక్షలకు పెరిగింది.

బ్రిటిష్ ప్రభుత్వ చేపట్టిన వ్యయాలన్ని అనుత్పాదకమైనవి. వీటి కోసం భారతదేశపు ఖాతాల ఋణం చేసి మన దేశం నుంచి చెల్లింపు చేసేవారు. ఉదా : బర్మా యుద్ధం, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం, చైనా, ఈజిప్టు మొదలగు యుద్ధ వ్యయాలన్నీ భారతదేశపు అప్పులో నుంచి చెల్లించబడ్డాయి. అదే విధంగా టెలిగ్రాఫ్‌లైను ఇండియానుంచి ఇంగ్లాండ్‌కు నిర్మిస్తే ఆ నిర్మాణ వ్యయం అంతా భారతదేశానికి చెందిన అప్పుగా ప్రకటించారు. మరియు బ్రిటీష్ వారికి ఇచ్చే బహుమతుల వ్యయం అంతా కూడా భారతదేశపు ఋణంలో నుంచే జరిగేది. అయితే కొన్ని వ్యయాలను అత్యధిక వ్యయాలుగా చేపట్టి మనదేశ ఋణంలో జమచేసారు. ఉదాహరణకు రైల్వేల నిర్మాణం, నీటి పారుదల ప్రాజెక్టులు మొదలగు వ్యయాలు. ఎక్కువ వడ్డీ రేటుతో విపరీతమైన నిరుపయోగమైన పరిపాలనా వ్యయాలకు భారతదేశ ఋణంగా వెచ్చించబడ్డాయి. ఈ విధంగా ఋణం 1939 సంవత్సరానికి రు. 1,205,76 కోట్లకు చేర్చారు.

స్వాతంత్ర్యానంతరం అంటే 1947 సం॥ పాకిస్తాన్ ప్రత్యేక దేశంగా విడిపోయింది. అయితే నూతన భారత ప్రభుత్వం స్వాతంత్ర్యానికి ముందు వున్నా అప్పు మొత్తాన్ని తనే చెల్లిస్తానని ఒప్పుకొన్నది. అయితే చిన్న మొత్తం రు. 300 కోట్లను మాత్రం పాకిస్తాను భారత దేశానికి చెల్లిస్తానని ప్రకటించింది. అది కూడా 50 వాయిదాలలో 195 నుంచి ప్రారంభించి చెల్లిస్తానని ఒప్పుకొన్నది. అయితే ఇప్పటి చెల్లింపు నిలిచిపోయినది. ఈ ఒప్పందము భారత దేశంలో పన్ను చెల్లింపు దారులకు భారంగా తయారు అయినది. పాకిస్తాన్ చెల్లించవలసిన మొత్తం ఇప్పటికీ భారత దేశం మాత్రమే తన చెల్లింపుల ఖాతాలో చూపుతూనేవుంది. పాకిస్తాన్ మాత్రమే భవిష్యత్తులోనైనా చెల్లిస్తుందనే విధంగా భరించుటలేదు.

## 9.11 భారత దేశంలో ఋణ వర్గీకరణ :

స్వాతంత్ర్యానంతరము భారత ప్రభుత్వ ఋణాన్ని రెండు విధాలుగా వర్గీకరించవచ్చు. అవి 1) స్వదేశీ ఋణాలు 2) విదేశీ ఋణాలు స్వదేశీ ఋణాలు మార్కెట్ ఋణాలు, చిన్న మొత్తాల పొదుపుగా, ప్రావిడెంట్ ఫండ్, ఆర్థిక సంస్థలనుంచి ఒప్పందపు ఋణాలు మరియు రిజర్వు బ్యాంకు నుంచి ఋణాలుగా పేర్కొనవచ్చును. విదేశీ ఋణాలుగా ప్రపంచబ్యాంకు, అంతార్జతీయ ద్రవ్యనిధి, ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి సంస్థల నుంచి మరియు ప్రముఖ దేశాలనుంచి ఋణాలు ఉదా : పశ్చిమ జర్మనీ, జపాన్, రష్యా మరియు అమెరికా వంటి దేశాలనుంచి 1980 వరకు ఋణాలు పొందాయి. భారతదేశ స్వదేశీ మరియు విదేశీ ఋణాలను ఈ క్రింది పట్టికద్వారా వివరించవచ్చు.

పట్టిక - 9.1

స్వదేశీ ఋణం (రు. కోట్లలో)

| సంవత్సరం | మొత్తం స్వదేశీ ఋణం |
|---|---|
| 1950-51 | 2,022,30 |
| 1960-61 | 3,978,00 |
| 1977-78 | 19,025,29 |
| 1980-81 | 29,008,49 |
| 1990-91 | 1,54,003,00 |
| 1995-96 | 3,07,868,06 |
| 1997-98 | 3,88,997,78 |
| 1998-99 | 4,58,842,40 |
| 1999-2000 | 7,14,254,23 |

RBI's Report Currency and Finance

పై పట్టిక పరిశీలించినట్లయితే భారత దేశ స్వదేశీ ఋణం ఏ విధంగా పెరుగుతుందో గ్రహించవచ్చును. 1950-51 సంవత్సరంలో కేవలం 2,022.30 కోట్ల రూపాయలు వుంటే అది ఒక్కసారిగా 1990-91 సంవత్సరము నాటికి 1,54,003,00 కోట్ల రూపాయలకు పెరిగి ఆ తరువాత 1999-2000 సంవత్సరము నాటికి 7,14,254,23 కోట్ల రూపాయలకు పెరిగింది. 1990-91 సంవత్సరంలో స్వదేశీ ఋణం స్థూల దేశీయోత్పత్తిలో కేవలం 8.5%గా వుంటే 1998-99 సంవత్సరము నాటికి 15% నకు పెరగడాన్ని బట్టి భారతదేశ ఆర్థిక వ్యవస్థలో స్వదేశీ ఋణం ఏ విధంగా పెరుగుతూ వస్తూందో గ్రహించవచ్చు.

## విదేశీ ఋణం :

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థికాభివృద్ధి తొలిదశలో విదేశీఋణంపై విశేషంగా ఆధారపడుట జరుగును. పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన మూలధన వస్తువులను, పారిశ్రామిక ముడిపదార్థాలను దిగుమతి చేసుకొవడానికి అవసరమైన విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూర్చడంలో విదేశీఋణం సహాయపడుతుంది. భారత ప్రభుత్వం పెట్టుబడి అంతమని పూడ్చటానికి, చెల్లింపుల ఖాతాలో అంతరాన్ని పూడ్చడానికి విదేశీఋణం విశేషంగా ఉపయోగించుచున్నది. 1950-51 నుండి మనదేశ విదేశీ ఋణంలో వచ్చిన మార్పులను దిగువ పట్టికలో గ్రహించవచ్చు.

పట్టిక - 9.2

| విదేశీ ఋణం<br>సంవత్సరం | (రు. కోట్లలో)<br>మొత్తం విదేశీ ఋణం |
|---|---|
| 1950-51 | 32.03 |
| 1960-61 | 760.96 |
| 1977-78 | 8,984.74 |
| 1980-81 | 11,316,35 |
| 1990-91 | 31,524,97 |
| 1995-96 | 51,248,74 |
| 1996-97 | 54,238,56 |
| 1997-98 | 55,331,97 |
| 1998-99 | 57,254,33 |
| 1999-2000 | 58,437,19 |

RBI's Report Currency and Finance

పై పట్టికను బట్టి భారతదేశంలో విదేశీ ఋణం ఏవిధంగా వృద్ధి చెందుతుందో గ్రహించవచ్చును. 1950-51 కేవలం రు. 32 కోట్లు వుంటే 1990-91 సంవత్సరమునకు 31, 524, 97 కోట్లకు పెరిగి 1999-2000 నాటికి 58, 437,19 కోట్ల రూపాయలకు పెరగడాన్ని బట్టి భారతదేశం విదేశీ ఋణంపై ఏ విధంగా ఆధారపడిందో గ్రహించవచ్చును.

## ఇతర ఋణాలు :

ఎ) చిన్న మొత్తాల పొదుపులలో ముఖ్యమైనవి పోస్టాఫీసు పొదుపు, బ్యాంకు డిపాజిట్‌లు, టైమ్ డిపాజిట్స్, జాతీయ పొదుపు పత్రాలు మరియు 6 సంవత్సరాల కాలపరిమితిగల జాతీయ పొదుపు పత్రాలు మొదలగునవి. మొత్తం చిన్న మొత్తాల పొదుపు 1950-51 లో రు. 336.87 కోట్లు కాగా అవి 1997-98 నాటికి 1,15,006,03 కోట్లకు పెరిగాయి.

బి) ప్రావిడెంట్ ఫండ్ అనగా 1. రాష్ట్రప్రావిడెంట్ ఫండ్ 2. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లు అను రెండు విధాలుగా విభజించవచ్చు. 1950-51 లో మొత్తం రాష్ట్ర మరియు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లు రు. 95.03 కోట్లుండగా అవి 1997-98 నాటికి రు. 40,338,50 కోట్లకు పెరిగాయి.

భారతదేశంలో మొత్తం ఋణం అంటే స్వదేశీ ఋణం మరియు విదేశీ ఋణం 1950-51 వ సంవత్సరంలో కేవలం 2.055.33 కోట్ల రుపాయలు కాగా అది 1990-91 నాటికి 1.85.537.47 కోట్ల రూపాయలకు పెరిగి, 1999.2000 సంవత్సరానికి 7,72,691,42 కోట్ల రూపాయలకు చేరుకొన్నది.

## 9.12 భారత ప్రభుత్వ ఋణం - వడ్డీ చెల్లింపులు

బారతదేశం తాను చేసిన స్వదేశీ, విదేశీ ఋణాల మొత్తలకై చెల్లిస్తున్న వడ్డీ చెల్లింపులు చాల అధికంగా వున్నవి. 1950-51 సంవత్సరంలో కేవలం 32 కోట్ల రూపాయలను వడ్డీగా చెల్లిస్తే, 1997-98 సంవత్సరంనకు 68,000.00 కోట్లు చెల్లించడాన్ని బట్టి భారతదేశం ఎంతోమేకు వడ్డీ భారాన్ని భరిస్తుందో గ్రహించవచ్చు. ప్రణాళికేతర బడ్జెట్‌లో ప్రముఖ అంశమే వడ్డీ చెల్లింపులు. వడ్డీ చెల్లింపులు రెవెన్యూ ఖాతాలో

కేవలం 9% గా 1950-51 సంవత్సరంలో వుంటే అది 1997-98 సంవత్సరం నాటికి 36.9% కి పెరగడాన్ని బట్టి ఎంతమొత్తం బడ్జెట్‌లో భరించుచున్నదో గ్రహించవచ్చును. ఈ విషయాన్ని ఈ క్రింది పట్టికలో చూడవచ్చును.

**పట్టిక 9.3**

| వడ్డీ చెల్లింపులు. సంవత్సరము | (రు.కోట్లలో) వడ్డీచెల్లింపు | రెవెన్యూ ఖాతాలో దాని % |
|---|---|---|
| 1950-51 | 32.40 | 9.00 |
| 1960-61 | 118.80 | 9.84 |
| 1977-78 | 1521.34 | 16.20 |
| 1980-81 | 2,604,00 | 18.00 |
| 1990-91 | 21,471,00 | 29.20 |
| 1997 | 68,000.00 | 36.90 |

Source : Mankar, Sarma

Public Finance, Theory & Practice.

## 9.13 భారతదేశంలో స్వదేశీ మరియు విదేశీ ఋణాల పోకడ

శీఘ్రమూలధన కల్పనకు మరియు అభివృద్ది ప్రాజెక్టులకు పన్ను మరియు పన్నేతర రాబడులు చాలని కారణంగా స్వదేశీ ఋణాలను పెద్ద మొత్తంలో చేయవలసిన అవశ్యకత ఏర్పడింది. ప్రత్యేకించి మార్కెట్ ఋణాలు మరియు చిన్న మొత్తల పొదుపు రూపంలో స్వదేశీఋణం పొందింది. కాబట్టి పెద్ద మొత్తంలోని స్వదేశీ ఋణం ఉత్పాదకము. అయితే ఇటీవల కాలములో ప్రావిడెండ్ ఫండ్ రూపంలో స్వదేశీ ఋణంలో 1990 సం॥ నాటికి 11% గా వుంది. రిజర్వ్‌బ్యాంకు అత్యధిక ఋణాన్ని అందించేదిగా తన స్థానాన్ని అట్లాగే కొనసాగిస్తూ వస్తుంది. భారతదేశ ద్రవ్య మార్కెట్ ఋతుసంబదితము కాబట్టి ప్రభుత్వానికి ఆ విధంగా ఋణం పొందుటకు వీలుకాదు అందుచే రిజర్వ్‌బ్యాంకు సంవత్సరము మొత్తాన్ని ఋణాన్ని పొందే సంస్థగా తన బ్యాంకింగ్ కార్యకలపాలద్వారా ఒక టోకు వ్యాపార సంస్థగా కొనసాగుతుంది. భారతదేశ ఋణరీతి ఉత్పాదక మార్కెను రుపొందించినది. ఉదా॥ ప్రభుత్వ సంస్థలైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టీల్ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటి సంస్థల ఏర్పాటుద్వారా ఉత్పాదక మార్కెట్‌గా వ్యవహరిస్తుంది. తెచ్చుకున్న ఋణాలన్ని సులభమైన వడ్డీరేటుకు మరియు నిబంధనలకు చెందినవి. అయితే స్వదేశీవడ్డీ చెల్లింపులకు గణనీయంగా పెరుగుతు వున్నవి. కాబట్టి భవిష్యత్తు ప్రజనీకానికి ఇది భారంగా పరిణమించగలదు.

శీఘ్ర ఆర్థికాభివృద్ది కొరకు త్వరగా పారిశ్రామికాభివృద్ది సాధించుటకు పంచవర్ష ప్రణాళికలు రుపొందించబడ్డాయి. ఇది భారీ మూలధన వస్తువుల దిగుమతికి కారణం అయినది. అందుచే భారత ప్రభుత్వానికి తన విదేశీ చెల్లింపుల ఖాతాలో లోటును పూడ్చుటకు విదేశీ ఋణాలు తప్పని సరి అయినవి. ఇప్పటికీ కూడా భారతదేశం విదేశీ మూలధన వస్తువుల దిగుమతి మీదనే ఆధారపడి వుంది. అందుకు భిన్నంగా తన ఎగుమతుల ద్వారా జమచేయలేక లోటును ఏదుర్కొంటున్నది. దీనిని పూరించుటలో విదేశీ ఋణం అవశ్యకత మనదేశానికి ఎంత అయినా వుంది. అంతర్జాతీయ అభివృద్ది ఆధారిటి, ఆసియా అభివృద్ది బ్యాంకు, ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి వంటి సంస్థలనుంచి మరియు కొన్ని ముఖ్యమైన దేశాలనుంచి మనదేశం విదేశీ ఋణం పొందుతుంది. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ అభివృద్ది ఆధారిటీ మొదలగు వాటి ద్వారా పొందే ఋణాలు కొన్ని ప్రత్యేక ఉద్దేశాలకోసం వెచ్చిస్తుంది. అవి స్థిర ఋణాలు వాటిని వ్యవసాయం, నీటిపారుదల వంటి అంశాలపై ఖర్చుపెడుతుంది. అదే అంతర్జాతీయ ద్రవ్య నిధినుంచి పొందే ఋణాలను మాత్రము

స్వల్పకాలానికి చెందినదై, విదేశీ చెల్లింపుల ఖాతాలో ఏర్పడ్డ లోటును పూరించుటకు ఉద్దేశించబడి వుంటాయి. అమెరికా ముఖ్యమైన విదేశీ ఋణం మనకు అందించే దేశంగా 4 వ ప్రణాళిక వరకు వుండేది అయితే క్రమంగా తగ్గిస్తూ వచ్చింది. ఇటీవల కాలంలో జపాన్ మనకు ఏక్కువ మొత్తంలో లేదా అత్యధిక విదేశీ ఋణదాత దేశంగా వుంది. రష్యా, ఫ్రాన్స్, మరియు జర్మనీ దేశాలు కుడా మనకు ముఖ్యమైన విదేశ ఋణదాత దేశాలు అదే విధంగా ఇటీవల కాలంలో భారతదేశం ద్రవ్యం లభింపచేసుకొనుటకు అంతర్జాతీయ బాండ్ల మార్కెట్‌లోకి ప్రభుత్వరంగ సంస్థల ద్వారా మరియు ద్రవ్యసంస్థల ద్వారా ప్రవేశించింది. అయితే ప్రస్తుతం భారతదేశం అప్పుల ఊబిలో కూరుకుపోయి వుందని చెప్పక తప్పదు. ఎందుకంటే తాను తెస్తున్న ఋణం మొత్తానికి, ఉత్పదకత కల్పనకు మధ్య ఖాళీ ఎక్కువగా ఉంది. తాను పొందే ఋణం ప్రస్తుతం, వడ్డీ చెల్లింపులకే సరిపోతుంది. కొద్దిపాటి పాత అప్పుతీర్చుటకే నేడు కొత్త ఋణాలు చేయవలసి వస్తుంది. కాబట్టి భారతదేశం అప్పుల ఊబిలో కూరుకుపోయినది.

## 9.14 ముగింపు :

పెరుగుతున్న ప్రభుత్వ వ్యయం భరించుటకు నిధుల సేకరణకు వున్న మార్గాలలో ఒక ప్రధానమార్గం. మనదేశంలో పన్ను వసూలు, ప్రభుత్వరంగ సంస్థల లాభాలు, ఇతరమార్గాలద్వారా వచ్చే ఆదాయం తగినంతగా లేదు. పెరుగుతున్న వ్యయాన్ని ఎదుర్కొనుటకు అదనంగా పన్నులు విదించలేము కారణం, ఇప్పటికే పన్నురేట్లు ఎక్కువగా వున్నవి మరియు పన్ను చెల్లించే శక్తి పెరగడం లేదు. పోనీ ప్రభుత్వరంగసంస్థలు కూడా చాల వరకు నష్టాలను చవిచూస్తున్నవి. కాబట్టి భారత దేశానికి ఋణం తప్పనిసరి. అయితే ఋణం కేవలం ద్రవ్యవవరుగానే కాకుండా ఆర్థికమాంద్యం. ద్రవ్యోల్బణం వంటి అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొని స్థిరకొరతకు తోడ్పడి వుండాలి. భారతదేశంలో ప్రస్తుతం ఋణం విపరీతంగా పెరిగిపోయింది. అయినా విదేశీ ఋణం అయినా పూర్తిగా ఉత్పదక కార్యక్రమాలకు వెచ్చించడం, దారి మళ్ళింపు చేయకుండా చూడటం తక్కువ వడ్డీరేటుకు మరియు సులభ చెల్లింపులతో దీర్ఘకాలానికి చెందినది అయివుండేదిగా వుంటే ఋణ నిర్వహణ సులభమవుతుంది. ఋణ సమస్య ఉత్పన్నం కాదు.

## 9.15 ముఖ్య పదాలు :

| | | |
|---|---|---|
| Public Debt | : | ప్రభుత్వ ఋణం |
| Internal Debt | : | స్వదేశీఋణం |
| External Debt | : | విదేశీ ఋణం |
| Effects of Publi Debt | : | ఋణ ప్రభావాలు |
| Burdan of Public Debt | : | ఋణ భారం |
| Debt Redemption | : | ఋణ విదూచన |
| Conversion | : | పరివర్తనం |
| Sinking Fund | : | ఋణ విమోచన నిది. |
| Repudiation | : | ఋణ నిరాకరణ |
| Capital Levey | : | మూలధన పన్ను |
| Funded Debt | : | నిదీకృత రుణం |
| Un funded debt | : | నిదీకృతంకాని రుణం |
| Floating debt | : | నిదీకృతంకాని రుణం |

Redeemoble debts : విడుదల చేసిన రుణాలు

Irredemoble debts : విడుదల చేయని రుణాలు

Debt Management : ఋణ నిర్వహణ

## 9.16 స్వీయ అవగాహనకు ప్రశ్నలు

ఈ క్రింది ప్రశ్నలకు సమగ్ర సమాదానాలు వ్రాయండి

1. ప్రభుత్వ - ప్రైవేట్ ఋణాల మధ్య విచక్షణ చేసి ప్రభుత్వ ఋణాన్ని వర్గీకరింపుము.
2. ప్రభుత్వ ఋణ అవశ్యకతను తెలిపి ఋణం పెరగడానికి గల కారణాలు తెల్పుము
3. ప్రభుత్వ ఋణ భారాన్ని / ప్రభావాలను విశ్లేషించి ఋణ విమోచనా పద్ధతులను వివరించండి.

ఈ క్రింది ప్రశ్నలకు సంక్షిప్త సమాధానాలు తెల్పుము

4. మూలధనంపై పన్ను
5. ఋణ విమోచనా నిధి
6. భారతదేశంలో ప్రభుత్వ ఋణం స్వదేశీ ఋణం మరియు విదేశీఋణం
7. భారతదేశంలో స్వదేశీ - విదేశీ ఋణాల పోకడ.

## 9.17 సంప్రదించవలసిన గ్రంధాలు

1. B.P. Tyagi : Public Finance
2. K.K. Sharma : Public Finance

ప్రొ. జి. చంద్రశేఖరరావు

పాఠం - 10

# బడ్జెట్

## పాఠ్య నిర్మాణ క్రమం


10.1 బడ్జెట్ పుట్టుక మరియు అర్ధ వివరణ

10.2 బడ్జెట్ ఉద్దేశ్యం

10.3 ప్రభుత్వ బడ్జెట్ సిద్ధాంతాలు

10.4 బడ్జెట్‌ను రూపొందించడం

10.5 వివిధ రకాలైన బడ్జెట్లు

10.6 ఆధునిక బడ్జెట్ వర్గీకరణ

10.7 ఆర్ధిక వ్యవస్థపై బడ్జెట్ ప్రభావం

10.8 ముగింపు

10.9 ముఖ్య పదాలు

10,10 స్వీయ అవగాహనకు - ప్రశ్నలు - అభ్యాసాలు

10.11 చదవవలసిన గ్రంథాలు


## 10.1 బడ్జెట్ పుట్టుక మరియు అర్ధ వివరణ :

పురాతన కాలంలో ప్రభుత్వ కార్యకాలాపాలు తక్కువగా వుండటం మరియు వాటి ప్రాధాన్యత కూడా లేకపోవడంచే ప్రభుత్వ బడ్జెట్ అనేది అంత ప్రాముఖ్యము సంతరించుకోలేదు. కాని ఆధునిక కాలంలో ప్రభుత్వ కార్యకలాపాలు పెరగడం వల్ల సంక్షేమ రాజ్యాలకు ప్రాధాన్యత యివ్వడం వల్ల ప్రభుత్వ భాద్యతలు పెరిగి ప్రభుత్వ బడ్జెట్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. నేడు బడ్జెట్ అనేది ఆర్ధికాభివృద్ధికి ఒక ముఖ్యమైన సాధనంగా మారింది.

బడ్జెట్ అను పదం ఫ్రెంచిపదమైన బగెటీ అను పదం నుండి పుట్టినది బగెటీ అనగా "తోలుసంచి" అని అర్ధం (Chancellor of Exchequer) చాన్సలర్ ఆఫ్ ఎక్చ్‌కర్ తన కోశ ప్రణాళికను "హౌస్ ఆఫ్ కామన్స" (House of Commons) కు ప్రవేశ పెట్టుటకు ఆ వివరణలతో కూడిన కాగితాలు అన్నింటిని తోలుసంచి లో నింపి సభకు అందించేవారు. బడ్జెట్ అను పదం 1773 సం॥ నుండి వాడుకలోనికి వచ్చినది.

నేడు బడ్జెట్ అను పదం ఆదాయ వ్యయాలకు సంబంధించిన ప్రభుత్వ నివేదికయే కాక కేవలం పన్నుల విధానం, వ్యయ విధానం మాత్రమే కాక భవిష్యత్‌కు సబంధించిన కోశ ప్రణాళిక అందుకే "గ్లాడ్ స్టోన్" ఇలా పెర్కోన్నాడు. బడ్జెట్ అనునది కేవలం గణాంకాలు సమాచారమే కాకుండా వెయ్యి కారణాలతో - వ్యక్తిగతమైనటువంటి సౌభాగ్యం, వారి మధ్య సంబంధాలు మరియు ఆర్ధిక వ్యవస్థను - బలోపేతం చేయడంలో ఉపయోగపడుతుంది అని పేర్కొన్నాడు. ఈ మధ్య కాలంలో క్రమమైన ఆర్ధిక ప్రగతిని సాధించడానికి, సామాజిక మార్పును తీసుకురావడానికి అవసరమయిన ప్రత్యక్ష పరోక్ష సాధానాలను తనలో ఇముడ్చుకొని ప్రైవేటురంగ కార్యకలాపాలకు అదుపులను నిర్ణయించుటలో బడ్జెట్ అమూల్యమైన సాధానంగా ఉపయోగపడుచున్నది.

బడ్జెట్ ఆర్ధిక వ్యవస్థ నిజ స్వరూపాన్ని ప్రతిబింబిస్తుంది - కాబట్టి బడ్జెట్ అనేది భవిష్యత్‌కు సంబంధించి సహజంగా ఒక సం॥ రానికి సంబంధించిన అనేక కార్యక్రమాల ప్రణాళికా ఇది వరుసగా 3 సం॥లకు సంబంధించిన వివరణలను తెలియజేస్తుంది. అవి గత సం॥

రానికి సంబంధించిన వాస్తవిక వివరణలు ఈ సం॥ రానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలు, రాబోయే సం॥ రానికి సంబంధించినటువంటి అంచనాలతో కోశ వివరణలను తెలియజేస్తుంది. కోశ సం॥ అనేది అన్ని దేశాలకు ఒకే విధంగా వుండదు. అది భారతదేశంలో అయితే ఏప్రిల్ నుంచి మార్చి వరకు అదే అమెరికాలో అయితే జూలై నుండి జూన్ వరకు వుంటుంది. బడ్జెట్ లో కేటాయింపులు జరిగినప్పటికి అమలులో నిధులకు సంబంధించి కొరతలు వస్తుంటాయి. ఎందుకంటే కొన్ని ముఖ్యమైన కార్యకలాపాలు మధ్యలో చేరుతూ వుంటాయి. కాబట్టి వాటి దృష్ట్యా కొత్త రాబడి వ్యయాలకు సంబంధించిన వివరణలు తయారుచేస్తారు. దానినే అనుబంధక బడ్జెట్ విధానము అంటారు. ఈ కారణం దృష్ట్యా పాత బడ్జెట్ తిరిగి మార్పు పొందుతుంది.

మంచి బడ్జెట్ అనునది ప్రజల మరియు శాసన సభల ఆమోదం పొందగల్గేదిగా దేశ ఆర్థిక విధానానికి ఉపయోగపడేదిగా ఉండాలి. ఈ అంశం దృష్ట్యా ప్రభుత్వ ఆర్థిక విధానాలు విత్తస్థితిని బడ్జెట్‌కు ముందుగా సర్వే చేస్తారు. మరియు మంచి బడ్జెట్ అనునది అనేక కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికగా వాస్తవికతతో అమలుకు వీలు వుండేదిగా కోరికలతో కాకుండా ఆర్థిక పరమైనటువంటి అవధులలో ఉండాలి. మరొక ముఖ్యమైనటువంటి అంశం ఏమిటంటే బడ్జెట్ లో గత సం॥రానికి సంబంధించినటువంటి వివరణలు ఉండటం వల్ల ఎంతవరకు విజయవంతం అయ్యాయో గమనించుటకు మిగిలిపోయిన అంశాలను ఈ సం॥రపు అంశాలతో - జోడించుకొని బడ్జెట్ ప్రణాళికను రూపొందించుకోవచ్చును.

బడ్జెట్ అనునది అనేక దశలలో నిర్ణీతం - అవుతుంది మొదటిగా ప్రభుత్వం అన్ని శాఖలకు సంబంధించి భవిష్యత్ కార్యక్రమాలకు సంబంధించి వివరణను ఇవ్వమని కోరుతుంది - అవి అన్ని అందుకున్న తరువాత వాటినన్నింటిని సమగ్రపరచి స్థూలమైన బడ్జెట్ ప్రణాళికలను తయారుచేస్తుంది. రెండవ దశలో బడ్జెట్‌ను శాసన సభ అనుమతి కోసం ప్రవేశపెడతారు. ఈ దశలో శాసనసభ బడ్జెట్‌లోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమనుకుంటే మార్పులను - చేర్పులను చేసి అనుమతినిస్తుంది. అప్పటినుంచి ప్రభుత్వానికి బడ్జెట్‌ను అమలు చేయటకు అధికారం ఉంటుంది. మూడవ దశలో బడ్జెట్‌ను అమలు చేయడం, రాబడిని పెంచుకోవడం, ప్రభుత్వ వ్యయాన్ని బడ్జెట్ ప్రణాళిక అనుగుణంగా కొనసాగిస్తారు. నాలుగవ దశ (లేదా) చివరి దశలో పనితనాన్ని పరీక్షించడం మొదలుపెడతారు. ఆడిట్ లెక్కలు ద్వారా పార్లమెంటరీ కమిటీలు ద్వారా క్షుణ్ణంగా పర్యవేక్షిస్తారు. ఫలితంగా ఏవైన తప్పుదారి అంశాలను నియంత్రిస్తారు.

## 10.2 బడ్జెట్ ఉద్దేశ్యం :-

బడ్జెట్ యొక్క ఉద్దేశ్యం అనేక - విధాలుగా ఉంటుంది. అయితే అన్ని ఉద్దేశ్యాల యొక్క లక్ష్యం ఆర్థికాభివృద్ధి. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలు వేర్వేరుగా ఉంటాయి. అభివృద్ధి చెందిన దేశాలలో సహజంగా చక్రీయమైన ఒడిదుడుకులు అంటే ద్రవ్యోల్బణము, ప్రతి ద్రవ్యోల్బణము ఏర్పడుతుంటే అభివృద్ధి చెందుతున్న దేశాలలో అధిక వృద్ధిని ఎలా సాధించాలి, ఆర్థిక స్థిరత్వం ఎలా సాధించాలి అనే సమస్యలు ఉంటాయి. ఈ క్రింది చెప్పుకోబోయే అంశాలు బడ్జెట్ యొక్క ఉద్దేశ్యాలుగా చెప్పవచ్చును.

ఏదైనా ఒక లక్ష్యాన్ని సాధించాలంటే ప్రణాళిక అవసరం ప్రభుత్వానికి అనేక లక్ష్యాలు లేదా ఉద్దేశ్యాలు ఉంటాయి. అవన్నీ ఏకకాంలో సాధించుకోలేదు. కాబట్టి ఒక సమగ్రమైన ప్రణాళిక అవసరం. బడ్జెట్ అందుకు బాగా ఉపయోగపడుతుంది మరియు అనేక కార్యక్రమాలు విభిన్న కాలాలకు పూర్తి అవుతూ ఉంటాయి. అందులో ఏ కార్యక్రమం ఖచ్చితంగా ఈ సం॥ రంలో పూర్తి చేయాలి అనేటటువంటి విషయం బడ్జెట్ ద్వారా మాత్రమే వీలు అవుతుంది.

ఎందుకంటే బడ్జెట్ లో సం॥ వారిగా బాధ్యతలు వుంటాయి. మూడవ అంశం ఏమిటంటే ఈ కార్యక్రమాలు అన్ని అమలు చేయడానికి నిధులు అవసరం. బడ్జెట్ లో రాబడికి సంబంధించినటువంటి మార్గాలు అన్ని ఒక వైపున వ్యయానికి సంబంధించినవి మరొక వైపున చూపిస్తారు. నాలుగవ అంశం బడ్జెట్ అత్యంత సామర్థ్యముతో వ్యయాన్ని ఖర్చు చేయడం అదే విధంగా అత్యంత సామర్థ్యంగా రెవెన్యూ వసూళ్ళకు బడ్జెట్ లో వివరణ ఉంటుంది. అదే విధముగా ఐదవ అంశంగా, ప్రభుత్వ వ్యయంలో సామర్థ్యాన్ని భౌతిక పరమైనటువంటి లక్ష్యాలను పొందుపరుస్తారు.

గత కార్యక్రమాలను మరియు అనుభవాన్ని దృష్టిలో పెట్టకొని భవిష్యత్ కార్యక్రమాలను రూపొందిచడం బడ్జెట్ ప్రత్యేకత. అంటే గతంలోని లోటుపాట్లును సవరించుకుంటూ భవిష్యత్‌కు సంబంధించినటువంటి ప్రణాళికలను రూపొందించుకోవడం బడ్జెట్‌లోని ప్రత్యేకత.

చాలా దేశాలలో ప్రత్యేకించి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థికాభివృద్ధికి ప్రత్యేకించి ప్రణాళిక విధానాన్ని అమలు చేయుచున్నాయి. ఈ ప్రణాళిక లక్ష్యాలను పూర్తి చేయుటకు వనరుల ఆవశ్యకత ఉంది. సాంవత్సరిక విధానం నిధుల వివరనను ఇస్తుంది ఈ బడ్జెట్ విధానంలో ప్రజలకు బాధ్యత వహించే శాసన నిర్మాణ శాఖ అన్ని కార్యక్రమాలను చర్చించి వీలుంటుంది. ఆధునిక బడ్జెట్ యొక్క ఉద్దేశ్యం ప్రస్తుత అంశాలను విధానాలను భవిష్యత్ ప్రయోజనాల దృష్ట్యా మరియు వ్యయాల దృష్ట్యా సమీక్షించుకోవడం ఒకవైపున విధులననుసరించి బడ్జెట్ తయారీ మరొక వైపున సమిక్షించుకోవచ్చు అందుకని ఇటీవలి కాలంలో విధులను అనుసరించు విత్తవిధానం ప్రాముఖ్యతను పొందుతుంది.

ప్రభుత్వ బడ్జెట్ విధానం యొక్క ఉద్దేశాలలో పొదుపు, పెట్టుబడి మరియు వినియోగము మొ॥ లగు వాటిలో మార్పులు గ్రహించడం జరుగుతుంది. ఈ ఉద్దేశ సాధనలు బడ్జెట్ లోని ఆర్థిక వర్గీకరణ ఉపయోగపడుతుంది.

అభివృద్ధి చెందుతున్న దశలలో నిరుద్యోగి సమస్య లోటు బడ్జెట్ వంటి సమస్యలతో సతమతం అవుతూవుంటాయి. ఇలాంటి స్థితిలో బడ్జెట్ అత్యంత ఉపయోగకరం. ఉత్పత్తి లక్ష్యాలను పొదుపు లక్ష్యాలను నిర్ధారించుకొని ఉద్యోగ స్థాయిని పెంచి సార్థక డిమాండ్‌ను పెంచుతుంది. చివరిగా బడ్జెట్ యొక్క లక్ష్యం నిధుల ఖర్చులో బాధ్యతను తెలియజేస్తుంది. శాఖల వారిగా వాటి వాటి వ్యయాన్ని నియంత్రించడం ఆ తరువాత శాసనసభ ముందుంచి క్షుణ్ణముగా సమీక్షింప జేస్తుంది. సం॥ రం చివరలో అన్ని శాఖల అధిపతులు వాటి వాటి బడ్జెట్ విధానాలకు సంబంధివచిన విధులను శాసన నిర్మాణ శాఖకు బాధ్యత వహించే విధంగా ఉంటుంది. కాబట్టి బడ్జెట్ అనునది విత్త నియంత్రణలో అంటే రాబడికి సంబంధించి చెల్లింపులకు సంబంధించి ఒక శక్తివంతమైన సాధనముగా ఉపయోగపడుతుంది.

## 10.3 ప్రభుత్వ బడ్జెట్ సిద్ధాంతాలు

ఇవి ముఖ్యముగా 2 రకాలైన సిద్ధాంతములు 1. సాంప్రదాయక సిద్ధాంతం 2. ఆధునిక సిద్ధాంతం

**10.3.1 సాంప్రదాయక సిద్ధాంతం :-** ప్రభుత్వ బడ్జెట్ లో రెండు ముఖ్యమైన సిద్ధాంతములు ఉన్నవి అవి 1. సమతౌల్య బడ్జెట్ విధానం ఇది సాంప్రదాయకమైన సిద్ధాంతంగా 2. నిర్వాహణ బడ్జెట్ విధానం ఇది ఆధునిక సిద్ధాంతంగా పిలవబడుచున్నాయి. సాంప్రదాయక (లేక) సమతౌల్య బడ్జెట్ విధానం ప్రభుత్వ జోక్యం తక్కువగాను మరియు సంపూర్ణోద్యోగిత ఉంటుందని అనే ఊహ మీద ఆదారపడి ఉంది. ఆర్థిక కార్యకలాపాలలో ప్రభుత్వ జోక్యం తక్కువ అని చెప్పడం వల్ల ప్రయివేటు కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారు. అట్లాంటి పరిస్థితులలో బడ్జెట్ అనేది ఎల్లప్పుడు చిన్నదిగాను మరియు సమతౌల్యంగాను ఉంటుంది. ఒకవేళ బడ్జెట్ లో లోటు ఏర్పడితే ఆ లోటును పూడ్చుకోవడానికి రుణాలు చేయవలసి ఉంటుందని వారు పేర్కొన్నారు. ప్రయివేటు రంగంలో ఉన్నా ఉత్పాదక వనరుల మళ్ళింపు అవుతాయని ఆ విధంగా ఈ మళ్ళింపు ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని తగ్గిస్తుందని వారు పేర్కొన్నారు.

సమతౌల్య బడ్జెట్ ను సమర్థిస్తూ లోటు బడ్జెట్‌కు రుణం చేయవలసి ఉంటుందని ఈ రుణానికి వడ్డీ చెల్లించ వలసిఉంటుంది కాబట్టి ప్రభుత్వ ముఖ్యమైన కార్యక్రమాలు కొన్నింటిని చేపట్టలేక పోవచ్చునని వారు పేర్కొన్నారు. ఎందుకంటే నిధులు అనేవి అసలు వడ్డీ రూపంలో ఋణదాతలకు చెల్లించబడతాయి. కాబట్టి రుణం అనేది వ్యయ భారమని వారు పేర్కొన్నారు.

సమతౌల్య బడ్జెట్ సిద్ధాంతం 2 విధాలుగా ఉంటుంది మొదటి విధానం ప్రకారం ప్రస్తుత రాబడులు ప్రస్తుత వ్యయం సమానంగా ఉంటాయి అప్పులు అను అంశం చేరదు. కాబట్టి రాబడులు వ్యయం సమానం కావున అది సమతౌల్య బడ్జెట్ విధానం ఇంకొక విధానంలో సమతౌల్య బడ్జెట్ లో ప్రభుత్వ రాబడులకు తోడు రుణాలు కూడా చేరుతాయి. కాబట్టి బడ్జెట్ ప్రస్తుత బడ్జెట్ మరియు మూలధన బడ్జెట్ అను 2 భాగాలుగా ఉంటుంది. అయితే ఈ రెండు కూడా సమతౌల్యంలోనే ఉంటాయి. ప్రస్తుత వ్యయాలు ప్రస్తుత రాబడులతో పూరించబడితే మూలధన వ్యయాలు అప్పులు చేత పూరించబడతాయి. కాబట్టి మొత్తం మీద బడ్జెట్ సమతౌల్యంలోనే వుంటుంది.

**10.3.2 ఆధునిక సిద్ధాంతం :-** సాంప్రదాయకుల బడ్జెట్ విధానానికి భిన్నంగా ఆధునిక నిర్వహణ బడ్జెట్ విధానం ఆధునిక ఆర్థిక వేత్తలచే ప్రవేశ పెట్టబడినది. ఈ నూతన బడ్జెట్ విధానం ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణ ఉద్యోగిత ఉంటుంది అనే ఊహలను ఒప్పుకోలేదు.

ప్రముఖమైన కీన్స్ సిద్ధాంతం సంపూర్ణ ఉద్యోగిత అనేది ఒక అసాధారణ విషయమని నిరుద్యోగిత అనేది మరియు వ్యవస్థ తనంతట తానే సర్దుబాటు కాదని నిరూపించింది. కాబట్టి ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగ కల్పన లో పూర్తిగా వినియోగించని వనరులు వినియోగించాలని అందుకు బడ్జెట్ విధానం సర్దుబాట్లు చేయుటకు వీలు వుండాలని పేర్కొన్నారు.

కాబట్టి నిరుద్యోగతం తో సతమతం అవుతున్న ఆర్థిక వ్యవస్థకు సంతులిత బడ్జెట్ విధానం ఏ మాత్రం ఉపయోగ పడలేదు.

కీన్స్, హన్‌సన్, డాల్టన్ వంటి ఆర్థిక వేత్తలు సంపూర్ణ ఉద్యోగిత సాధించుట బడ్జెట్ విధానం యొక్క ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. ఈ ఆధునిక బడ్జెట్ విధానం అంటే సడలింపు చేయుటకు వీలువున్నా బడ్జెట్ విధానం ఆర్థిక వ్యవస్థలో వస్తున్నటువంటి వ్యాపార చక్రాలను అదుపు చేయుటలో తప్పనిసరి ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం వంటి సమస్యలు సార్థక డిమాండ్ లోపించినప్పుడు సంభవిస్తాయి. అలాంటి పరిస్థితులలో అదనపు కొనుగోలు శక్తిని ఆర్థిక వ్యవస్థలకు పంపించడం వల్ల ఉత్పత్తి పెరిగి ఉద్యోగాలు పెరిగి ఖర్చు చేసుకుంటుంది. భారతదేశంలో కేంద్ర రాష్ట్ర బడ్జెట్‌లు వాటి వసూళ్ళు చెల్లింపులకు సంబంధించి ఈ మూడు ఖాతాలను వేరువేరుగా నిర్వహిస్తుంది.

పన్నులు, రుణాలు, యితరత్రా ప్రభుత్వ వసూళ్ళు మరియు అన్ని ప్రభుత్వ వ్యయాలు మొదలగునవి అన్ని ఏకీకృత నిధిలో చూపిస్తారు. కొద్ది మొత్తంలో ఆఘంతక నిధిని అసాధారణ పరిస్థితులు ఐన భూకంపాలు, వరదలు, లేదా కరువులు వంటి సమస్యలును ఎదుర్కోడానికి కొంత మొత్తంలో ఏర్పాటు చేస్తారు. భారతదేశంలో సంవత్సరిక బడ్జెట్ నిర్మాణంలో 8 వేర్వేకు విత్త వివరణలు ఉంటాయి. అవి రాబడి వ్యయాలకు సంబంధించి ఆఘంతకనిధికి, ఏకీకృత నిధికి మరియు ప్రభుత్త ఖాతాకు వేర్వేరుగా ఉంటాయి. ప్రతి దాని యందు గతసంవత్సరపు బడ్జెట్ వాస్తవిక అంశాలు. ఈ సంవత్సరపు బడ్జెట్ అంచనాలు మరియు తిరిగి రూపొందించిన అంచనాలు మరియు రాబోవు సంవత్సరపు అంచనాలు ఉంటాయి. అవి అన్ని క్రింది రూపంలో ఉంటాయి. ఊదాహరణకు 2000 సంవత్సరాన్ని పరిధిలోనికి తీసుకున్నాం డిమాండ్ పెరుగుతుంది. ఈ ఉద్దేశ్యాన్ని సాధించడానికి లోటు బడ్జెట్ విధానం ఉపయోగకరం. ఎందుకంటే ఇలాంటి బడ్జెట్ వల్ల అదనపు కొనుగోలు శక్తి సమాజంలో చేర్చబడి మొత్తం వినియోగవ్యయాన్ని పెంచుతుంది. ఇది వ్యాపార వర్గాల వారికి ధరలు, తద్వారా లాభాలు పెరగడానికి తోడ్పడుతుంది. అయితే ఈ పరిస్థితి అదనపు వనరుల వినియోగంతో ఉత్పత్తిని పెంచుతూ ఉపాధిని కల్పిస్తూ పెరిగిన డిమాండ్‌ను తట్టుకోవడానికి ఉపయోగపడుతుంది. ఒక వేళ ఆర్థిక వ్యవస్థ అదనపు కొనుగోలు శక్తి వల్ల ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొంటూ ఉంటే, అంటే ధరలు పెరిగి ఉంటే ఈ అదనపు కొనుగోలు శక్తిని ఆర్థిక వ్యవస్థలో నుంచి తొలిగించడానికి మిగులు బడ్జెట్ విధానం ఉపయోగపడుతుంది. కావున మిగులు బడ్జెట్ విధానం అంటే అధికపన్నులు మరియు తక్కువ పన్ను వ్యయాన్ని కొనసాగించడం. ఈ ప్రక్రియ ద్రవ్యోల్బణం అనే ఆర్థిక జబ్బును తొలిగించుటలో ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించుటలో తోడ్పడుతుంది. కాబట్టి ఆధునిక ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం మార్పులు, చేర్పులకు అనుగుణమైన బడ్జెట్ విధానం ఉత్తమమైనది అని పేర్కొన్నారు. కాబట్టే ఆధునిక సిద్ధాంతాన్ని నిర్వహణ బడ్జెట్ విధానం అని పిలుస్తారు.

పట్టిక - 1

రాబడికి సంబంధించి విత్త వివరణలు - ఏకీకృత నిధి

| వాస్తవాలు 1999-2000 | బడ్జెట్ అంచనాలు 2000-01 | తిరిగి అంచనాలు 2000-01 | ముఖ్యమైన పద్దులలో రాబడులు | బడ్జెట్ అంచనాలు 2000-01 |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| | | | 1. ఆఘంతక నిధి రెవిన్యూ ఖాతాలో రాబడులు<br>a). ఆదాయా వ్యయా మీద పన్నులు<br>b). ఆస్తులు మూలధనం మీద పన్నులు<br>c). వస్తు సేవల మీద పన్నులు | |
| | | | మొత్తం పన్ను రాబడులు | |

| వాస్తవాలు 1999-2000 | బడ్జెట్ అంచనాలు 2000-01 | సరిచేసిన అంచనాలు 2000-01 | ముఖ్యమైన పద్దులు రాబడులు | బడ్జెట్ అంచనాలు 2000-01 |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| | | | B. పన్నేతర రాబుడుల | |
| | | | a) వడ్డీ రాబడులు. లాభాలు మరియు డివిడెండ్లు | |
| | | | b) యితర పన్నేతర రాబడులు | |
| | | | మొత్తం పన్నేతర రాబడులు | |
| | | | c) గ్రాంట్ - ఇన్ - ఎయిడ్ | |
| | | | D. మొత్తం రాబడి వసూళ్ళు | |
| | | | వసూళ్ళు అయిన పద్దులు (మూలధన ఖాతా) | |
| | | | e) ప్రభుత్వ రుణం | |
| | | | f) లోన్లు మరియు అడ్వాన్సులు | |
| | | | g) అంతర రాష్ట్ర పరిష్కారాలు | |
| | | | h) ఆఘంతుక నిధికి బదిలీ | |
| | | | i) మొత్తం మూలధనపు వసూళ్ళు | |
| | | | మొత్తం ఏకీకృత నిధిలో వసూళ్ళు | |

ఆధునిక సాంప్రదాయక ఆర్ధిక వేత్తల మధ్య వ్యత్యాసాన్ని పొదుపు, పెట్టుబడులకు సంబంధించి వారి ఊహాలలో గమనించవచ్చు. సాంప్రదాయక ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయంలో పొదుపు అనేది ఎల్లప్పుడూ పెట్టేబడికి సమానంగా ఉంటుంది. కాబట్టే నిరుద్యోగం వుండదని వారు పేర్కొన్నారు. అయితే ఆధునిక ఆర్ధిక శాస్త్రవేత్తలు పొదుపు అనేది పెట్టుబడిలో సమానంగా ఉండనవసరం లేదు. అని పేర్కొన్నారు. పొదుపు కన్నా పెట్టుబడి తక్కువగా వున్నట్లు అయితే సార్ధిక డిమాండ్ లోపించి నిరుద్యోగితను పెంచుతుంది. ఎందుచేత నంటే ఉత్పత్తి తక్కువ కావడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. అందుకు భిన్నంగా పెట్టుబడి కన్నా పొదుపు తగ్గితే కొనుగోలు శక్తి పెరిగి ధరలు పెరుగుటలో తోడ్పడి ద్రవ్యోల్బణ సమస్య ఉత్పన్నమవుతుంది.

పై సరిస్థితులలో బడ్జెట్ విధానం అనేది మార్పులు చేర్పులకు అవకాశం యివ్వాలని ఆధునిక ఆర్ధిక వేత్తల వాదన కాబట్టి సమతౌల్య బడ్జెట్ విధానం కంటే ఆధునిక బడ్జెట్ విధానమే వ్యవస్థలో వున్న సమస్యలను ఎదుర్కొనుటకు తోడ్పడుతుంది.

**10.4. బడ్జెట్‌ను రూపొందించడం :-** బడ్జెట్‌ను రూపొందించడం అనేది అనేక దేశాలలో అనేక విధాలుగా వుంటుంది. భారత దేశంలో ప్రభుత్వ ఖాతాలు మూడు రూపాలలో సమర్పిస్తారు. అవి :

1 ఏకీకృత నిధి (Consolidated Fund)

2 ఆఘంతక నిధి (Contingency Fund)

3 ప్రభుత్వ ఖాతా (Public Account) - ప్రభుత్వం కొద్దిపాటి తేడాలతో ఈ మూడు నిధుల నుంచి ఖర్చు చేసుకోగలదు. కీకృత నిధిలోంచి ఖర్చు చేయాలి అంటే పార్లమెంట్ లేదా శాసన సభ అనుమతి తప్పనిసరి. అదే ఆఘంతక నిధి ఖర్చుకు సంబంధించి అవసర పరిస్థితులలో ఖర్చు చేసి తరువాత అనుమతిని పొందవచ్చు. అదే విధంగా ప్రభుత్వ ఖాతాలోంచి ఖర్చు జరగాలి అంటే పార్లమెంట్ లేదా శాసనసభ అనుమతి అవసరం లేదు.

ఇవి ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో చిన్న మొత్తాల పొదుపులుగా నిల్వచేయబడతాయి. కాబట్టి ప్రభుత్వం వాటిని క్రింది విధంగా సూచిస్తుంది.

ప్రభుత్వ ఖాతాలలో రాబడులకు సంబంధించి విత్త వివరణ.

భాగము - ఇ

| | | |
|---|---|---|
| | | **ముఖ్యమైన రాబడులు** |
| | | a) చిన్న మొత్తాల పొదుపు. ప్రావిడెంట్ ఫండ్ మొ॥వి |
| | | b) రిజర్వు నిధులు |
| | | c) డిపాజిట్‌లే మరియు అడ్వాన్సులు |
| | | d) తదితర అంశాలు |
| | | e) యితర ఖాతాలు |
| | | f) అప్పగించు అంశాలు |
| | | మొత్తం ప్రభుత్వ ఖాతా |

**భాగము - ఎఫ్**

**ప్రభుత్వ ఖాతాలో చెల్లింపులకు సంబంధించి విత్త వివరణ**

| | | |
|---|---|---|
| | | ముఖ్యమైన చెల్లింపులు |
| | | a) చిన్న మొత్తాల పొదుపు. ప్రావిడెంట్ ఫండ్ |
| | | b) రిజర్వ్ ఫండ్ |
| | | c) యితర దేశాలకు చెందిన ఖాతా |
| | | d) తదితర అంశాలు |
| | | e) అప్పగించు అంశాలు |
| | | f) అంతర్గత ప్రభుత్వ సర్దుబాట్లు |
| | | మొత్తం ప్రభుత్వ ఖాతా |

**భాగము - జి**

**2000 - 01 సంవత్సరానికి రాబడులకు సంబంధించి విత్త వివరణ**

| 1 | 2 | 3 | 4 | 5 |
|---|---|---|---|---|
| | | | ప్రారంభ నిల్వ | |
| | | | ఏకీకృత నిధి | |
| | | | ఆఘంతక నిధి | |
| | | | ప్రభుత్వ ఖాతా | |
| | | | మొత్తం | |

| | | |
|---|---|---|
| | | **భాగము - హెచ్** |
| | | **2000 - 2001 సం॥ మునకు సంబంధించి వ్యయానికి సంబంధించిన విత్త వివరణ** |
| | | ఏకీకృత నిధి |
| | | ఆపంతక నిధి |
| | | ప్రభుత్వ ఖాతా |
| | | ముగింపు నిల్వ |
| | | మొత్తం |

**భాగము - బి**

**ఏకీకృత నిధి క్రింద వ్యయానికి సంబంధించిన విత్త వివరణలు**

| | | |
|---|---|---|
| | | వ్యయంలో ముఖ్యమైన పద్దులు (రెవిన్యూ ఖాతా)<br>a) రాష్ట్ర విభాగాలకు<br>b) కోశ సేవలు<br>c) వడ్డీ చెల్లింపులు<br>d) పరిపాలనా సేవలు<br>e) పించన్లు మరియు తదితర సేవలు<br>f) సాంఘీక మరియు సామాజిక సేవలు<br>g) ఆర్థిక సేవలు<br>h) గ్రాంట్ - ఇన్ - ఎయిడ్<br>మొత్తం వ్యయం రాబడి నుంచి |
| | | వ్యయంలో ముఖ్యమైన పద్దులు (మూలధనం ఖాతా)<br>a) క్యాపిటల్ ఖాతాలో సాదారణ సేవలు<br>b) మూలధనపు ఖాతాలో సాంఘీక మరియు సామాజిక సేవలు<br>c) మూలధనపు ఖాతాలో ఆర్థిక సేవలు<br>d) గ్రాంట్ - ఇన్ - ఉయిడ్<br>e) లోన్లు మరియు అడ్వాన్సులు<br>f) ఆపంతక నిధికి బదలాయింపులు |
| | | రెవిన్యూ ఖాతా నుంచి కాకుండా మొత్తం మూలధన వ్యయం |
| | | ఏకీకృత నిధిలో మొత్తం వ్యయం |

భాగము - సి

ఆఘంతుక నిధిలో రాబడికి సంబంధించిన విత్త వివరణ

| 1 | 2 | 3 | 4 | 5 |
|---|---|---|---|---|
| | | | ముఖ్య రాబడులు | |
| | | | a) ప్రారంభపు నిల్వ | |
| | | | b) ఏకీకృత నిధి కోసం మొత్తం | |
| | | | c) ఆఘంతక నిధికి తిరిగి చెల్లింపు | |
| | | | మొత్తము | |

భాగము - డి

ఆఘంతక నిధిలో చెల్లింపులకు సంబంధించిన విత్త వివరణ

| | | | |
|---|---|---|---|
| | | | ముఖ్యమైన చెల్లింపులు |
| | | | 1) ఆఘుంతక నిధి నుండి అడ్వాన్సు |
| | | | 2) ఏకీకృత నిధికి చెల్లింపు |
| | | | 3) ముగింపు నిల్వ |
| | | | మొత్తం |

**10.5 వివిధ రకాలైన బడ్జెట్లు :-** బడ్జెట్ రూపకల్పన అనే సాధనం ఇటీవలి కాలంలో గొప్ప మార్పులకు అత్యంత అర్థవంతముగా ఆర్థికాభివృద్ధి అనే లక్ష్యంలో ఎంతో ప్రాముఖ్యతను పొందింది. ఆర్థిక వ్యవస్థ రూపకల్పనలో బడ్జెట్లు వివిధ రకాలుగా రూపొందించ బడ్డాయి. కాబట్టి ఇటీవలి కాలంలో అనేక రకాల బడ్జెట్లు అమలులోనికి వచ్చాయి. వాటిలో కొన్ని ముఖ్యమైన వాటిని క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

**10.5.1. శాసన కార్య నిర్వాహక బడ్జెట్లు :-** అమెరికాలో సాంప్రదాయక పద్ధతిలో అమలు అయ్యే బడ్జెట్ విధానమే కార్యనిర్వాహక బడ్జెట్ విధానం. దీనిని వివిధ శాఖలు బడ్జెట్ సహాయంతో ముఖ్య కార్యనిర్వాహకుడు (Chief Executive) - రూపొందిస్తాడు. అది కార్యనిర్వాహక శాఖ తయారు చేసి శాసనసభ నుంచి అనుమతి పొందుతుంది. ఇలాంటి కార్యనిర్వాహక బడ్జెట్ విధానం ఇతర దేశాలలో కూడా అమలులో ఉంది. ఉదాహరణకు ఇంగ్లాండ్‌లో అయితే ప్రధాన మంత్రి ప్రతినిధిగా 'చాన్సలర్ ఆఫ్ ఎక్చకర్' - (Chancellor of Exchequer) సమర్పిస్తాడు ఇలాంటి కార్యనిర్వాహణ భాద్యతను భారతదేశం తదితర దేశాలలో ఆర్థిక మంత్రి నిర్వహిస్తాడు. అయితే శాసన పూరితమైన బడ్జెట్ శాసన నిర్మాణ శాఖలోని కమిటి రూపొందించి శాసనసభకు సమర్పిస్తుంది. పెద్దమొత్తంలో ఒక సంవత్సర కాలంలో ఖర్చు పెట్టాలనుకున్నప్పుడు శాసన నిర్మాణ బడ్జెట్ విధానం ప్రాముఖ్యతను కల్గి ఉంది.

కార్య నిర్వాహణ బడ్జెట్ శాసన నిర్మాణ బడ్జెట్ కన్నా ఉన్నతమైనది ఎందుకంటే కార్యనిర్వాహక వర్గం చివరకు ప్రజలకే బాధ్యత వహించవలసి ఉంటుంది కాబట్టి శాసన నిర్మాణ శాఖ కన్నా కార్యనిర్వాహక శాఖే బాధ్యతాయుతంగా వ్యవహరించవలసి ఉంటుంది. మరియు ఒక వేళ శాసన నిర్మాణ శాఖ బడ్జెట్‌ను రూపొందిస్తే బడ్జెట్ అమలు లక్ష్యాల సాధనకు కార్యనిర్వాహక శాఖ మీదనే ఆదారపడవలసి ఉంది. ఈ వత్తిడి కారణముగా కార్యనిర్వాహణ సామర్ధ్యాన్ని తగ్గవచ్చు, అంతే కాకుండా కార్యనిర్వాహక శాఖ బడ్జెట్ తయారీలో అనుభవాన్ని,

పరిపూర్ణతను, ప్రత్యేకతను కల్గి ఉంటుంది. కనుక ప్రభుత్వ సేవల ఆవశ్యకత దృష్ట్యా బడ్జెట్ తయారీ కార్యనిర్వాహక వర్గమే చేపడుతుంది.

**10.5.2 . మల్టీపుల్ మరియు యూనిఫైడ్ బడ్జెట్లు :-** అనేక ప్రత్యేక విధులను బడ్జెట్ కాలంలో నిర్వహించవలసి ఉంటుంది. అదే విధంగా కాలానుగుణంగా అనేక సలహాలు సంప్రదింపులతో వీటిని రూపొందించవలసి ఉంటుంది. ప్రత్యేకించి అమెరికాలో అయితే ఒక దానికి మించి బడ్జెట్లు రూపొందించడం వల్ల కోశపరమైన నియంత్రణ సమర్ధవంతముగా కార్యక్రమాలను, ప్రత్యేక కార్యక్రమాలను పరీక్షించవచ్చు. కావున కొన్ని ప్రత్యేకమైనటువంటి పరిస్థితులలో అంటే యుద్ధాలు, ఆర్థిక మాంద్య కాలాలలో ప్రభుత్వ రాబడి వ్యయాలను మార్చుటకు వీలు ఉండాలి. అంటే ప్రభుత్వం రెండు రకాల బడ్జెట్ విధానాలను రూపొందించాలి. అందులో సాధారణ బడ్జెట్ సాధారణ విధులను రూపొందించి అమలు చేస్తే అత్యవసర బడ్జెట్ స్వల్పకాలిక విధులను (లేదా) అత్యవసర విధులను రూపొందించి అమలు చేస్తుంది.

అయితే ఇటీవలి కాలంలో రెండురకాల బడ్జెట్ విధానాల కన్నా ఒకే రకమయిన బడ్జెట్ విధానం ఉత్తమమైనది అని వివరించబడుతుంది. ఎందుకంటే రెండురకాల బడ్జెట్లు విధానం ద్వారా విధులను సరిచూచుట, అంచనా వేయుట కష్టం. కాబట్టి ఆధునిక ఆలోచనా విధానము సమైఖ్య బడ్జెట్ విధానానికే మొగ్గు చూపుతున్నది. బడ్జెట్ విధానంలో విధులు కోశపరమైన నియంత్రణకు ప్రణాళిక విధానానికి తోడ్పడతాయి. కాబట్టి సమగ్రమయినటువంటి బడ్జెట్ విధానమే మెరుగు అయినదని చెప్పవచ్చు. ఎందుకంటే అది గత కోశ పరమైన స్థితిని భవిష్యత్‌లో కోశపరమైన ప్రణాళికలను మంచిగా అమలు చేయుటలో నియంత్రించుటలో తోడ్పడుతుంది.

**10.5.3 రెవిన్యూ మరియు కెపిటల్ బడ్జెట్ :-** చాలా దేశాలలో ప్రత్యేకించి అభివృద్ధి చెందుతున్న దేశాలలో బడ్జెట్ రెండు భాగాలుగా రూపొందించబడుతుంది అది రెవిన్యూ మరియు మూలధన బడ్జెట్లు. ఎందుకంటే ఈ దేశాలలో అభివృద్ధి ప్రక్రియ మొదలు కాక ముందే ఎక్కువ మొత్తాలలో ఆర్థిక అవస్థాపన మీద ఖర్చు చేయడం జరుగుతుంది. కాబట్టి మూలధన ఖాతా, రెవిన్యూఖాతాకు మధ్య విభజన ఉంటుంది.

స్వదేశీయముగా పన్నులు మరియు రుణాలు ప్రభుత్వ ఆదాయానికి ముఖ్యమైన ఆధారాలు అయితే మరోవైపు లోన్లు, గ్రాంట్లు ఇతర ప్రభుత్వాల నుంచి మరియు అంతర్జాతీయ సంస్థల నుంచి పొందడం మరియొక బహిర్గత ఆధారం. రెవిన్యూ ఖాతాలలో ప్రస్తుత వ్యయాన్ని స్వదేశీ మరియు విదేశ అప్పులు నుంచి చేయడం జరుగుతుంది. కొన్ని ప్రత్యేకమయిన అభివృద్ధి వ్యయాలు ఉదాహరణకు : రోడ్లు, రైల్వేలు, విద్యుత్‌చ్ఛక్తి, పాఠశాల, ఆసుపత్రి భవనాలకు మరియు సౌకర్య కల్పనకు వంటి ప్రత్యేక పెట్టుబడులకు ప్రత్యేక రాబడుల అవసరం ఈ క్రింది పట్టికలో రెవెన్యూ బడ్జెట్, కెపిటల్ బడ్జెట్ స్వరూప స్వభావాన్ని గమనించవచ్చు.

**పట్టిక - 2. రెవెన్యూ మరియు మూలధన బడ్జెట్లు**

| రెవిన్యూ బడ్జెట్ | | కెపిటల్ బడ్జెట్ | |
|---|---|---|---|
| రాబడి అంశాలు | వ్యయ అంశాలు | రాబడి అంశాలు | వ్యయ అంశాలు |
| a) ఆదాయం మీద పన్ను | a) పరిపాలనా మరియు సాదారణ సేవలు | a) రుణాలు మరియు వసూళ్ళు | a) ప్రజాపన్నులు |
| b) ఆస్తి మీద పన్ను | b) సాంఘీక సేవలు | b) మార్కెట్ రుణాలు | b) విద్యుత్‌చ్ఛక్తి నిర్మాణం కార్యక్రమాలు |
| c) కస్టమ్స్ సుంఖాలు | c) ఆర్థిక సేవలు | c) చిన్న మొత్తాల పాదుపు | c) రోడ్లు, రైల్వేల సిర్మాణం |
| d) కేంద్ర ఎక్సైజ్ సుంఖాలు | d) సామాజిక సేవలు | d) విదేశీ రుణాలు | d) వరద నివారణ పన్నులు |
| e) పన్నేతర రాబడులు | e) రోడ్లు, రైల్వేల నిర్వాహణ మొ॥వి | e) ఇతర రాబడులు | e) నీటి పారుదల కాలువలు మొ॥వి |
| f) యితర రాబడులు మొత్తం రాబడి వసూళ్ళు | f) మొత్తం రెవిన్యూ వ్యయము | f) మొత్తం మూలధన వసూళ్ళు | f) మొత్తం మూలధవ వ్యయాలు. |

పై పట్టికలో రాబడి ఖాతా, మూలధన ఖాతాకి సంబంధించి వర్గీకరణ సమగ్రమైనది. ఇది అభివృద్ధి చెందుతున్న దేశాలకు సమర్ధనీయమైన విధానం ఎందుకంటే బడ్జెట్ విధానంలో విభజన ప్రాధాన్యతలు కాలాల దృష్ట్యా విత్తనీటి మొదలగు అన్ని అంశాలకు ఇది నిదర్శనం.

**10.5.4 ప్రణాళిక - ప్రణాళికేతర బడ్జెట్లు :-** అల్పాభివృద్ధి మరియు అభివృద్ధి చెందుతున్నా చాలా దేశాలలో ఆర్థికాభివృద్ధి కొరకు ప్రణాళికలను అమలు చేస్తారు. ప్రణాళిక ప్రాథమిక లక్ష్యం శీఘ్రమైన అభివృద్ధిని పలు రంగాలలో ఉదాహరణకి, వ్యవసాయం, పారిశ్రామిక శక్తి, రవాణా మొదలగు రంగాలలో సాధించుట మరియు తలసరి ఆదాయాన్ని పెంపొందించుట, నిరుద్యోగం పేదరికాన్ని తొలగించుట ప్రాంతీయ అసమానతలను తొలగించుట ద్వారా సాంఘీక న్యాయాన్ని సాధించుట. భారత దేశం పంచవర్ష ప్రణాళికలను అమలు చేయుచున్నది. బడ్జెటరీ విధానం ద్వారా రాబడి వ్యయవాలను ప్రణాళికలకు కేటాయిస్తారు. రాబడులను ప్రణాళిక పరమైనటువంటి అభివృద్ధి అంశాల మీద వెచ్చిస్తె దానిని ప్రణాళిక బడ్జెట్ అని అట్లాకాక ప్రణాళికేతర అంశాల మీద వెచ్చిస్తె దానిని ప్రణాళికేతర వ్యయాలు చూపించబడతాయి. ప్రణాళికా బడ్జెట్ ఐదు సంవత్సరాల ప్రణాళికా కాలానికి మరియు ప్రతి ఒక్క సంవత్సరానికి సంబంధించబడి విడిగా రూపొందింపబడుతుంది. ఈ విధంగా ప్రణాళిక - ప్రణాళాకేతర బడ్జెట్లను విభజించడం వలన ప్రాముఖ్యత లేని అంశాలు ప్రణాళికేతర అంశాలలోని వ్యయాన్ని గ్రహించి ప్రభుత్వ కార్యకలాపాలను మార్చుకోవచ్చు.

**10.5.5 అభివృద్ధి - అభివృద్ధేతర బడ్జెట్లు :-** బడ్జెట్లో అభివృద్ధి అభివృద్ధేతర అంశాలు కూడా ఉంటాయి. అభివృద్ధి వ్యయాలు అనేవి రెవెన్యూ ఖాతాలో ఉన్నా కెపిటల్ ఖాతాలో వున్నా ఆర్థికాభివృద్ధికి ప్రత్యక్షముగా తోడ్పడతాయి. వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, పరిశ్రమలు మొదలగు వాటి మీద వ్యయాలు అభివృద్ధి వ్యయాలుకు ఉదాహరణ. ఇవి ఒక వేళ రెవెన్యూ బడ్జెట్లో ఉన్నట్లయితే వాటిని రెవెన్యూ అభివృద్ధి వ్యయంగా పిలుస్తారు. అదే విధంగా అభివృద్ధేతర బడ్జెట్ కూడా అనేక అంశాలను కల్గి ఉంటుంది. అవి టాక్స్ వసూళ్ళు, ప్రభుత్వ ఋణాలపై వడ్డీ చెల్లింపులు, పరిపాలన మరియు రక్షణ సేల్ అంశాలు మొ॥వి ఇవి కూడా ఆర్థిక వ్యవస్థను నడుపుటలో ఉపయోగపడి పరోక్షముగా అభివృద్ధికి తోడ్పడతాయి. ఈ విభజన ప్రభుత్వ బడ్జెట్లో కేటాయింపుల విధానానికి కాకుండా ఆర్థికాభివృద్ధికి సంబంధించి అనేక వ్యయాలు మరియు వాటి మధ్య ఉన్న సంబంధాన్ని కూడా వివరించుటలో తోడ్పడతాయి. అభివృద్ధి, అభివృద్ధేతర వ్యయాలలో వృద్ధికి తోడ్పడే వ్యయాలను మనం గ్రహించవచ్చు.

ఈ క్రింది పట్టిక అభివృద్ధి - అభివృద్ధేతర వ్యయాలను సమగ్రంగా వివరిస్తుంది.

**పట్టిక - 3 అభివృద్ధి - అభివృద్ధేతర బడ్జెట్లు**

| అభివృద్ధి వ్యయం | అభివృద్ధేతర వ్యయం |
|---|---|
| 1. రెవెన్యూ ఖాతా | 1. రెవెన్యూ ఖాతా |
| a) విద్యా మరియు పరిశోధన | a) పన్నులు సుంఖాల వసూళ్ళు |
| b) మందులు మరియు ప్రజా ఆరోగ్యం | b) వడ్డీ చెల్లింపులు |
| c) వ్యవసాయ దాని అనుబంధ సేవలు | c) పరిపాలనా సేవలు |
| d) సామాజిక అభివృద్ధి | d) రక్షణ సేవలు |
| e) పరిశ్రమలు | e) స్థానిక ప్రభుత్వాలకు బదలాయింపులు |
| f) రవాణా మరియు కమ్యూనికేషన్లు | f) రక్షణ మరియు స్వదేశీ భద్రత |
| 2. మూల ధనపు ఖాతా | 2. మూల ధనపు ఖాతా |
| a) సాంఘీక పన్నులు | a) శాశ్వత అప్పుల చెల్లింపు |
| b) వ్యవసాయంలో మూలధన ప్రాజెక్టులు | b) రుణాల చెల్లింపు |
| c) విద్యుత్‌చ్ఛక్తి ప్రాజెక్టులు | c) అప్పులు మరియు అడ్వాన్సులు |
| d) రోడ్ల నిర్మాణం | d) పరిపాలన మొదలగునవి |
| e) రైల్వేల నిర్మాణం | |
| **మొత్తం అభివృద్ధి వ్యయం (1+2)** | **మొత్తం అభివృద్ధేతర వ్యయం (1+2)** |

**10.5.6 సంతులిత - అసంతులిత బడ్జెట్లు :-** ప్రభుత్వ బడ్జెట్‌ను సంతులిత - అసంతులిత బడ్జెట్లుగా కూడా విభజించవచ్చు. ప్రభుత్వ రాబడులు ప్రభుత్వ వ్యయాలకు సమానమైతే సంతులిత బడ్జెట్ అని అట్లా సమానం కాకపోయినట్లయితే అసంతులిత బడ్జెట్లని చెప్పవచ్చును. ఈ అసంతులిత బడ్జెట్ మిగులు బడ్జెట్ గాను లోటు బడ్జెట్ గాను ఉండవచ్చు. 'పి.ఇ టేలర్' అనే ఆర్థిక శాస్త్రవేత్త బడ్జెట్లో సంతులిత స్వభావాన్ని గూర్చి ఈ విధంగా పెర్కొన్నాడు.

a) సంతులిత బడ్జెట్లో బడ్జెట్ కాలంలో ఖచ్చితంగా రాబడులకు చెల్లింపులకు సమానం

b) బడ్జెట్ కాలంలో రెవిన్యూ రాబడులు చెల్లింపులు కన్నా ఎక్కువగా ఉన్నట్లయితే ఆ వ్యత్యాసాన్ని మిగులు బడ్జెట్ గా.

c) బడ్జెట్ కాలంలో రెవిన్యూ రాబడులు వ్యయం కన్నా తక్కువగా ఉన్నట్లయితే ఆ వ్యత్యాసాన్ని లోటు బడ్జెట్ అని పేర్కొన్నాడు.

అభివృద్ధి చెందిన దేశాలలో సహజంగా సంతులిత బడ్జెట్టు ఉంటుంది కాబట్టి అచ్చట సంపూర్ణ ఉద్యోగిత ధరల స్థిరీకరణకు వీలు ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ ద్రవ్యోల్బణంతో సతమతం అవుతుంటే మిగులు బడ్జెట్‌ని నిరుద్యోగ సమస్యను ఎదొర్కొనుచుంటే లోటు బడ్జెట్‌ను ప్రవేశపెట్టవచ్చు. అదే అభివృద్ధి చెందుతున్న దేశాలలో అల్పవనరుల వినియోగం ఉంటుంది కాబట్టి వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుటకు అదనపు వ్యయాన్ని సహజంగా చేస్తుంటాయి అంటే చాలా వరకు అవి లోటు బడ్జెట్ విధానాన్ని అమలు చేస్తుంటాయి.

**10.5.7 కన్వెన్షనల్ మరియు క్యాష్ బడ్జెట్‌లు :-** అమెరికాలో మరియొక బడ్జెట్ విభజన కూడా వుంది. అది కన్వెన్షన్ మరియు క్యాష్ బడ్జెట్‌లు. గొప్ప వివరణ తోటి సాంప్రదాయక పద్ధతిలో ప్రభుత్వ రాబడికి సంబంధించి మరియు వ్యయానికి సంబంధించి ఈ విధంగా అంశాలు వారిగా వర్గీకరిస్తే దానిని కన్వెన్షియల్ బడ్జెట్ విధానం అంటారు. రెవెన్యూ మరియు వ్యయాలకు సంబంధించి పథకాలను సంవత్సరాల తరబడి కొనసాగిస్తున్నప్పటికీ అందులో ఎలాంటి మార్పులు చేయకపోవడం కన్వెన్షన్ బడ్జెట్ విధానంలో పద్ధతి ట్రస్ట్ నిధుల నుంచి రాబడులకు సంబంధించి, చెల్లింపులకు సంబంధించి వివరణను వదిలివేసి పన్నులు చెల్లింపులు చేయుట కన్వెన్షల్ బడ్జెట్ విధానంలో పద్ధతి అంటే ఇవి పబ్లిక్ రాబడులు మరియు వ్యయాలు అయినప్పటికీ ఇవి బడ్జెట్ ప్రక్రియలకు చేరవు. కావున కన్వెన్షల్ బడ్జెట్ ప్రభుత్వ కార్యకలాపాలను పూర్తి స్థాయిలో వివరించలేక పోవడం ఒకవైపు విభిన్న ఆర్థిక సంవత్సరాల మధ్య తులనాత్మక - అధ్యయనాన్ని చేయలేకపోవడం మరోవైపు అంటే ఇవి రెండూ కన్వెన్షనల్ బడ్జెట్ విధానంలో లోపాలుగా వుంటాయి. అయితే క్యాష్ బడ్జెట్ విధానంలో ఈ సమస్య వుండదు. అంటే ఇది ఎలాంటి తేడాలను ట్రస్ట్ ఫండ్ మరియు బడ్జెట్ ఫండ్‌ల మధ్య చూపదు. ప్రభుత్వ నిధులు ఖర్చు అయినా బడ్జెట్ - రాబడి ఆధారాలు అయిన ఎలాంటి ప్రభుత్వ నిధు ఖర్చు అయినా బడ్జెట్ వసూళ్ళు గానూ, బడ్జెట్ వ్యయం గానూ చూపిస్తుంది. కావున క్యాష్ బడ్జెట్ విధానం ఖచ్చితమైన విధముగా ప్రభుత్వ పాత్రను తెలియజేస్తుంది.

**10.5.8 ఇక్రిమెంటల్ మరియు జీరోబెసిడ్ బడ్జెట్లు :-** బడ్జెట్‌ను మరింత అర్థవంతముగా ఉంచుటలోనూ, గ్రాంట్లులకు సంబంధించి అదనంగా కోరే పరిస్థితిని అప్పుడప్పుడు పునఃపరిశీలించవలసి వుంటుంది. ఈ పునఃపరిశీలన పాలన మరియు శాసన స్థాయిలలో వుంటుంది. అయితే సహజమయినటువంటి పరిశీలన కేవలము మార్పులు వచ్చునటువంటి అంశాలు మీదనే (లేదా) ప్రత్యేక అంశాలు మీదనే వుంటుందే తప్పా మొత్తం కార్యకలాపాలు మీద వుండదు. గత వ్యయ స్థాయిలను లెక్కలోనికి తీసుకుంటూ కొత్తగా చేరే అంశాలను (లేదా) తీసివేయాల్సిన అంశాలను (పాత బడ్జెట్ నుంచి) మాత్రమే పరిశీలిస్తారు. ఈ విధంగా చేసే బడ్జెట్ విధానాన్ని ఇంక్రిమెంటల్ బడ్జెట్ విధానం అంటారు. అయితే ఇంక్రిమెంటల్ బడ్జెట్ విధానంలో ప్రధాన లోపం ఏమిటంటే ఉద్యోగ స్వామ్యము పెద్దగా మార్పులకు, చేర్పులకు ప్రయత్నం చేయక గత బడ్జెట్ కార్యకలాపాలునే పరీక్షించ కుండా అమలు చేసేస్తారు. ఇంక్రిమెంటల్ బడ్జెట్‌లో వున్నా ఈ లోపాన్ని జీరో ఆధారపు బడ్జెట్ పరిష్కరిస్తుంది.

జీరో బెసిడ్ బడ్జెట్ విధానం మాములు బడ్జెట్ విధానం కంటే పూర్తిగా మార్పును కలిగిన బడ్జెట్. ఎందుకంటే మాములు బడ్జెట్ విధానం అమలులో వున్నా పాత కార్యకలాపాలను అదనపు కార్యకలాపాలకు అవసరమయ్యే వ్యయాలను మాత్రమే పరిశీలిస్తుంది. అయితే అందుకు భిన్నముగా సున్నా ఆధారపు బడ్జెట్ విధానం పాత కార్యకలాపాలు అయినప్పటికి వాటిని కొత్త కార్యకలాపాలుగా భావిస్తూ, వీటిని

కొనసాగించాలా (లేదా) అన్న విషయాన్ని పరిశీలిస్తూ దాని ప్రాముఖ్యతను గురించి ఎప్పటికప్పుడు అధ్యయనం చేసుకుంటూ పోతుంది. మరో మాటలో చెప్పాలి అంటే బడ్జెట్ లో స్వల్పకాలిక లక్ష్యాలతో పాటు దీర్ఘకాలిక లక్ష్యాలతో కూడాన అంశాలు ఉంటాయి. ఈ లక్ష్యాలు అన్నింటిని ప్రాధాన్యతా క్రమంలో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ముందుకు కొనసాగే బడ్జెట్ విధానమే సున్నా ఆధారపు బడ్జెట్ విధానము. అంటే ఆశయాల సాధన సమీక్ష సున్నా ఆధారపు బడ్జెట్ ముఖ్య ఉద్దేశ్యం, సున్నా ఆధారపు బడ్జెట్ విధానాన్ని మొట్టమొదటి సారిగా 1964 వ సం॥లో అమెరికాలో వ్యవసాయ శాఖలో ప్రారంభించారు. అయితే అనుకున్నంత వరకు విజయవంతం కాలేదు అని రుజువు అయినది. భారతదేశంలో ఈ బడ్జెట్ విధానాన్ని ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు అనుబంధ శాఖలకు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలో 1983 వ సం॥లో ప్రవేశపెట్టడం జరిగింది.

7వ పంచవర్ష ప్రణాళికలో కూడా సున్నా ఆధారపు బడ్జెట్ విధానం గూర్చి ప్రస్తావించబడింది. భారత ప్రభుత్వం వ్యవహారికమైన పద్ధతిలో సున్నా ఆధారపు బడ్జెట్ విధానాన్ని జూలై 1986 లో ఆర్థిక శాఖా మంత్రి, ఇతర మంత్రిత్వ శాఖలకు లేఖ రాస్తూ 1887 - 88 బడ్జెట్ నుంచి ప్రారంభించమని కోరడం జరిగింది. ఇదే బడ్జెట్ విధానాన్ని ప్రభుత్వరంగ సంస్థలకు మరియు అనుబంద శాఖలకు కూడా విస్తరించవలయును అని కోరడం జరిగింది. అయితే కొద్ది శాఖలు మాత్రమే ఈ బడ్జెట్ విధానాన్ని పాటించాయి అందులో నిజం అయినటువంటి ఉద్దేశ్యంతో ఈ బడ్జెట్ విధానాన్ని అమలు చేసినటువంటి శాఖ ఒక్కటి మాత్రమే వుంది అది అంతరిక్ష విభాగం. అది కూడా ఇలాంటి సాంప్రదయాన్ని ముందే కలిగియుండటం చేత అటువైపుగా కొనసాగ కలిగింది. అయితే ప్రస్తుతం భారతదేశంలో పెద్దాగా అనుకూలంగా సాగిని విత్తపరిస్థితులలో జీరో బెసిడ్ బడ్జెట్ యొక్క ఆవశ్యకతను ప్రవేశ పెట్టవలసిన సమయం ఆసన్నమయినది. ఈ సమయంలో అన్ని మంత్రిత్వ శాఖలను ఈ బడ్జెట్ విధానమును అమలు చేయుటలో ఆవశ్యకతను గుర్తించమని కోరవచ్చు.

**10.6. ఆధునిక బడ్జెట్ వర్గీకరణ :-** బడ్జెట్ లో అనేక ప్రభుత్వ విధులు, వాటి మీద వ్యయానికి సంబంధించి ప్రణాళికా, పరమైనటువంటి వివరణ వుంటుంది. బడ్జెట్ నిర్మాణంలో అనేక మార్పులు, చేర్పులకు సంబంధించి పరిపూర్ణత చూడాలి అంటే దాన్ని ఖచ్చితంగా విశ్లేషించుకొవలసిన ఆవశ్యకత వుంది. ఆధునిక బడ్జెట్ విధానం ఈ అంశాన్ని గుర్తించి దీనికి సంబంధించిన ప్రయత్నాన్ని అంటే బడ్జెట్‌ను విభిన్న కోణాల్లో విశ్లేషించింది. "ది ఎకనామిక్ కమీషన్ ఫర్ ఆసియా అండ్ ఫార్ ఈస్ట్" అనే కమీషన్ విభజన అనేది బడ్జెటరీ విధానానికి సంబంధించి సమాచారాన్ని ఆ సమాచారం అనేక విధులను మరియు లక్ష్యాలను తెలియజేస్తుంది. కాబట్టి విభిన్న వర్గీకరణలు అవసరం అని పేర్కొన్నది. ఆర్థిక పరమైనటువంటి మరియు విత్తపరమైనటువంటి విశ్లేషణకు బడ్జెట్ వర్గీకరణ అవసరం. ప్రభుత్వ రంగ వ్యవహారాలను అనేక రకాలుగా వర్గీకరించవచ్చు. అవి :

a) వ్యవస్థాపన ను బట్టి b) లక్ష్యాన్ని బట్టి c) విధిని బట్టి

d) వాటి ఆర్థిక లక్ష్యాలను బట్టి e) కార్యక్రమాన్ని బట్టి f) ప్రభుత్వ కొనుగోళ్ళలో మూలాన్ని బట్టి విభజించవచ్చు. అందులో కొన్ని క్రింది విధంగా చెప్పుకోవచ్చు.

**10.6.1 నిర్మాణ సంబంధమైన వర్గీకరణ :-** సాంప్రదాయక పద్దతులలో బడ్జెట్ ప్రవేశపెట్టిన విధానాలలో పరిపాలనా సంబంధమైన లేదా నిర్మాణ సంబంధమైన బడ్జెట్ విధానం ఒకటి. నిర్మాణ సంబంధం అయినటువంటి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే బాధ్యత మంత్రిత్వ శాఖలకు వుంటుంది. ఎందుకంటే ప్రత్యేకమయినీ కేటాయింపులు ఆయా మంత్రి వర్గాలకీ మంత్రిత్వ శాఖలకు చెంది వుంటుంది. పరిపాలనా సంబంధమైన (లేదా) నిర్మాణ సంబంధమైన బడ్జెట్ విధానంలో ముఖ్యమైన ప్రయోజనం ఏమిటంటే రాజకీయ చట్టపరమైన నియంత్రణలను శాఖల వారిగా ప్రభుత్వ వ్యయకేటాయింపులను శాసన నిర్మాణం ద్వారా జరపవచ్చు.

అయితే ఈ వర్గీకరణ వివిధ శాఖల మధ్య సమన్వయం లోపించి అభివృద్ధి కార్యక్రమాల కోసం బడ్జెట్ లోని కేటాయింపులు జరుగుతాయి. అన్న నమ్మకము ఉండదు. కాబట్టి ఇలాంటి వర్గీకరణ కొద్ది కొద్ది బాధ్యతలు ఉండే ప్రభుత్వాలకు సరిపోతుంది. కాబట్టి ఈ ఆధునిక కాలంలో అనేక లక్ష్య వ్యయాలతో కూడిన ప్రభుత్వ విధానాలకు ఈ వర్గీకరణ సరిపోదు. అంతే కాకుండా ఈ వర్గీకరణ శాఖలవారిగా

వ్యయాన్ని గురించి మాట్లాడిందే తప్ప రాబడులను గూర్చి చర్చించలేదు. మరియు స్వతంత్ర్య, పాక్షిక స్వాతంత్ర్యాలతో కొన్ని సంస్థలు బడ్జెట్‌లను రూపొందించుకుంటాయి. వీటన్నిటిని ఈ వర్గీకరణ వదిలివేసినది. మరియు ప్రభుత్వ వ్యయానికి సంబంధించి సామర్థ్యం చర్చించబడలేదు.

**10.6.2** విధులను అనుసరించి వర్గీకరణ :- విధులను అనుసరించి బడ్జెట్ వర్గీకరణ ఉత్తమమైనది. ఎందుకంటే ఇది శాఖల పరంగా కాక అంశాల పరంగా (లేదా) విధుల పరంగా చర్చిస్తుంది. అందుకే అమెరికా వారు అన్నట్టు విధులను అనుసరించు వర్గీకరణ కొన్ని ప్రత్యేక ప్రభుత్వ విధులను గురించి అంటే రక్షణ, ఆరోగ్యం, వైద్య, వ్యవసాయ అభివృద్ధి మొ॥ అంశాలను చర్చిస్తుంది. ప్రభుత్వ విధులు అనేవి ఎక్కువగా ఉండటం. వనరులు - తక్కువగా ఉండటం వల్ల అతిముఖ్యమైనటువంటి అంశాలు లక్ష్యాలతో ప్రభుత్వ కేటాయింపులు జరగాలి. అలాంటి ఉద్దేశ్యానికి విధులను అనుసరించు వర్గీకరణ మంచిది. విధులను అనుసరించ వచ్చు విధానంలో అవసరాలు దృష్టిలో పెట్టుకోని గతాన్ని పరిగణలోనికి తీసుకుంటూ ఖర్చు, రాబడులను అనుసరించి బడ్జెట్‌ను వర్గీకరించుకొనే అవకాశం ఉంటుంది.

**10.6.3** ఉద్దేశ్యాలకు అనుగుణమైన వర్గీకరణ :- లక్ష్యాణుగుణమైన వర్గీకరణ, విధులను అనుసరించు వర్గీకరణను మరింత విపులంగా వివరిస్తుంది. మొత్తాలకు అనుగుణంగా కేటాయించిన వర్గీకరణ ఉద్దేశ్యాలకు అనుగుణమైన వర్గీకరణ ద్వారా చిన్న, చిన్న భాగాలుగాను అనేక అంశాలుగాను వివరిస్తుంది. భారతదేశంలో ముఖ్యమైన శాఖలకు సంబంధించిన వ్యయాన్ని అంటే సాంఘీక సేవలు, ఆర్థిక సేవలు, సాధారణ సేవలు వంటి సేవలను విధులను బట్టి వర్గీకరణ చర్చిస్తే ఆ విధులనే చిన్న చిన్న పద్దుతుల కింద చిన్న చిన్న అంశాల క్రింద ప్రభుత్వ వ్యయాన్ని ప్రత్యేకంగా, ఉద్దేశ్యాలను బట్టి వర్గీకరణ వివరిస్తుంది. ఈ క్రింది వివరణ, సేవలను బట్టి విధులను అనుసరించి ఉద్దేశ్యాలను అనుసరించి వర్గీకరణ చేయవచ్చు.

**విధులను అనుసరించి మరియు ఉద్దేశ్యాలను బట్టి వర్గీకరణ**

విధులను అనుసరించే వర్గీకరణ

1. **పరిపాలన మరియు సాధారణ సేవలు**
   a) రక్షణ
   b) పోలీస్
   c) జైళ్ళు
   d) న్యాయము
   e) సాదారణ పరిపాలన

2. సాంఘీక సేవలు
   a) విద్య
   b) మందులు, ప్రజల ఆరోగ్యం
   c) సాంఘీక భద్రత
   d) రేడియో సమాచార శాఖ

ఉద్దేశ్యాలను అనుసరించే వర్గీకరణ

1. **వ్యవసాయము దాని అనుబంధ సేవలు**
   a)వ్యవసాయం
   b) చిన్న నీటి పారుదల
   c) భూమి, నీరు పరిరక్షణ
   d) ప్రాంతాల అభివృద్ధి
   e) ఆహారం మరియు పోషణ, పశు సంవర్ధక శాఖ
   f) పాడి పరిశ్రమ g) చేపలు

3. ఆర్థిక సేవలు (విధులననుసరించి)

a) వ్యవసాయం, అనుబంధ రంగాలు (ముఖ్యమైన పద్ధతులు)

b) ఇంధనం

c) అడవులు

d) పరిశ్రమలు

e) సముద్రం

f) రవాణా మరియు సమాచారం

4. సామాజిక సేవలు

a) రోడ్లు

b) ప్రజా పన్ను

c) నీటి పారుదల మరియు మురుగునీరు

d) వరద నివారణ

e) పరిశుభ్రత

3) వ్యవసాయం (చిన్న అంశాలు)

a) అధికారులకు చెల్లింపు

b) స్పోర్ట్స్ మరియు స్టేషనరీ

c) ఎస్టాబ్లిష్‌మెంట్ వ్యయాలు

d) నిర్వాహణలు

e) గ్రాంట్లు

పై వర్గీకరణను బట్టి విధులననుసరించి వర్గీరణ అనేది శాఖల యొక్క భాద్యతలను తెలియజేయుటలో ఒక పరికరముగా చెప్పవచ్చును. విధులననసరించు వ్యయాన్ని నియంత్రించుటలో ఉద్దేశ్యాలను గురించి వర్గీకరణ ఎంతైనా వుంది. కాబట్టి పై వివరణలో స్థూలమైనది విధులననుసరించు వర్గీకరణ అయితే వాటిని చిన్న చిన్న పద్దుల క్రింద సూక్ష్మమైనటువంటి బడ్జెట్ ప్రణాళికలను ప్రభుత్వ వ్యయం యొక్క సామర్ధ్యాన్ని వివరించుటలో విధులను గురించి వర్గీకరణ ఉపయోగకరం.

**10.6.4 ఆర్థిక వర్గీకరణ :-** ఆర్థిక వర్గీకరణ ప్రభుత్వ వ్యయాలకు సంబంధించి ఆర్థిక ప్రాధాన్యత దృష్ట్యా వనరుల కేటాయింపును తన యొక్క ప్రభావాన్ని వివరిస్తుంది. ఈ వర్గీకరణ ప్రభుత్వ వ్యయం. యొక్క ప్రత్యేక ఉద్దేశ్యాన్ని తెలుపుతుంది. ఉదాహరణకి ఆరోగ్యం, ఆర్థిక ప్రాధాన్యాతల దృష్ట్యా ప్రభుత్వ వ్యయం క్రింద చర్చిస్తుంది. మూలధన కల్పనలో ప్రత్యేక వనరులలో వ్యయం యొక్క ఉద్దేశ్యాన్ని వివరిస్తుంది. కావున ఆర్థిక వర్గీకరణ స్థూల ఆర్థిక సమాచారాన్ని వివరిస్తూ జాతీయ ఆదాయ లెక్కలకు తోడ్పడుతుంది.

ఆర్థిక వర్గీకరణ ప్రభుత్వ వ్యయాన్ని స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరిస్తుంది. అవి : 1. ప్రస్తుత వ్యయము మరియు మూలధనపు వ్యయం, ప్రస్తుత వ్యయం మూడు తరగతులుగా విభజింపబడి తిరిగి అది 4 చిన్న విభాగాలుగా మారుతుంది. దీనిని ఈ క్రింది పట్టికలో చూడవచ్చు.

**ప్రస్తుత మరియు మూలధన బడ్జెట్లు**

| ప్రస్తుత వ్యయము | మూలధన వ్యయము |
|---|---|
| a) వినియోగ వ్యయము | a) స్థూల మూలధన కల్పన |
| b) బదిలీ చెల్లింపులు | b) మూలధన బదలాయింపులు |
| c) మొత్తం ప్రస్తుత వ్యయం (A+B) | c) షేర్లలో పెట్టుబడులు |
| d) వినియోగ వ్యయం | d) లోన్లు మరియు అడ్వాన్సులు |

1. వేతనాలు మరియు సేవలు
2. వస్తు సేవలు
3. వెలుపలి అమ్మకాలు
4. మొత్తం వినియోగ వ్యయం = (i) + (ii) + (iii)

3) సబ్సిడీలు
4) గ్రహముల చెల్లింపు
మొత్తం బదలాయింపు
(i + ii + iii + iv)

e) రుణ చెల్లింపు
f) మొత్తం మూలధన వ్యయం (a+b+c+d+e)

aa) స్థూల మూలధన కల్పన
1) భవన తదితర నిర్మాణాలు
2) యంత్ర పరికరాలు
3) నికర నిల్వ పెరుగుదల
మొత్తం = i + ii + (iii)

b) మూలధనపు బదలాయింపులు
1) స్థానిక సంస్థలకు మూలధనపు గ్రాంట్లు
2) ఇతర మూలధనపు బదలాయింపులు
మొత్తం మూలధనపు బదలాయింపులు
= i + ii

c) రుణాలు మరియు అడ్వాన్సులు
1) మూలధన కల్పన
2) ప్రస్తుత వ్యయం
మొత్తం = (i + ii)

అదే విధముగా మూలధన వ్యయాన్ని ఐదు తరగతులుగా విభజింపవచ్చు. 1) స్థూల మూలధన కల్పన, షేర్లలో పెట్టుబడి, రుణాలు మరియు అడ్వాన్సులు, మూలధన బదలాయింపులు. మరియు రుణాల చెల్లింపులు అదే విధముగా తిరిగి మూలధన కల్పన మూలధన చెల్లింపులు మరియు రుణాలు అడ్వాన్సులు గాను, ప్రాముఖ్యతను చిన్న చిన్న విభాగాలుగా పట్టికలో గమనించవచ్చును.

**10.6.5 ప్రోగ్రామ్ బడ్జెట్ వర్గీకరణ :-** ఆర్థిక వర్గీకరణ ఉద్దేశ్యాలను మరియు ప్రభుత్వం వనరులు ఉపయోగించుకుంటున్న తీరుకు మధ్య ఉన్న సంబంధాన్ని వివరించుటలో బడ్జెట్‌ను మరింత హేతుబద్ధం చేయుటలో ప్రోగ్రామ్ వర్గీకరణను రెండవ హొవర్ కమిషన్ అమెరికాలో 1952 లో ప్రవేశ పెట్టింది. ఈ వర్గీకరణ వ్యయ నియంత్రణ కన్నా బడ్జెట్ పాత్రకు అధిక ప్రాధాన్యతను యిస్తుంది. ఈ బడ్జెటింగ్ విధానం దీర్ఘకాలిక లక్ష్యాలతో కూడిన కార్యక్రమాల నిర్వహణ మరియు ప్రణాళికలకు అధిక ప్రాధాన్యం యిస్తుంది. ఈ వర్గీకరణలో బడ్జెట్ కొన్ని కార్యక్రమాల నిర్మాణంతో కొన్ని ప్రత్యేక లక్ష్యాలతో ప్రత్యేక ఖర్చు ద్వారా వాటి సాధనకు రూపొందించబడుతుంది. ఒక ప్రత్యేక ఏజెన్సీ ద్వారా వ్యయాలు అన్ని కొన్ని సామూహిక కార్యక్రమాలు ఒక ప్రత్యేక ఉద్దేశ్యం కోసం అమలు చేయబడతాయి. ఉదాహరణకు పేదరిక నిర్మూలన అనేది ఉద్దేశ్యం అయితే దానికి సంబంధించిన వ్యయం పేదరిక నిర్మూలన కార్యక్రమం క్రింద పొందపరచబడుతుంది.

ఈ ప్రోగ్రామ్ బడ్జెట్ కార్యక్రమాన్ని ఈ క్రింది పట్టికలో కూడా గమనించవచ్చు.

**సాధారణ లక్ష్యం : పేదరిక నిర్మూలన**

ప్రత్యేక లక్ష్యం నెం : 1 సంపాదనా శక్తిని పెంచడం

కార్యక్రమాలు

a) ప్రాథమిక, మాధ్యమిక విద్యా కార్యక్రమం

b) నమోదు ప్రోత్సాహక కార్యక్రమం

c) అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమం

d) వయోజన విద్యా కార్యక్రమం

e) వృత్తి విద్యా కార్యక్రమం

f) కార్మికుల కార్యక్రమం

g) నైపుణ్య కల్పనా కార్యక్రమం

h) ఉద్యోగ కల్పనా కార్యక్రమం

ప్రత్యేక లక్ష్య నెం : 2 ఆదాయ నిర్వహణ

కార్యక్రమాలు

a) ఉద్యోగ భీమా కార్యక్రమం

b) సాంఘీక భద్రతా కార్యక్రమం

c) ప్రజా పంపిణీ వ్యవస్థ

d) మద్దతు ధరల కార్యక్రమం

ప్రత్యేక లక్ష్యం నెం : 3 వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు

కార్యక్రమాలు

a) ఉత్పత్తి పరికరాల సప్లయ్

b) నీటి పారుదల అభివృద్ధి కార్యక్రమం

c) వరదల నియంత్రణా కార్యక్రమం

d) భూసంస్కరణల కార్యక్రమం మొ॥వి

పై వివరణను బట్టి ప్రత్యేక లక్ష్యాలతో సాధారణ లక్ష్యాలు కూడా కలిగి ఉంటాయి. ఇలా ప్రోగ్రామ్ బడ్జెట్ విధానములో విపులంగా మరికొన్ని కార్యక్రమాలుగా విభజింపబడతాయి. ఉదాహరణకి నమోదు ప్రోత్సాహక కార్యక్రమం తిరిగి ఉచిత పుస్తకాలు, సప్లయ్, మధ్యాహ్న భోజన పథకం వంటి అనేక చిన్న చిన్న కార్యక్రమాలుగా విభజింపబడుతుంది.

**10.6.6 ఆచరణాత్మక బడ్జెట్ విధానం :-** బడ్జెట్ విధానంలో సాంకేతిక అంశాలతో కార్యక్రమాలు రూపొందించుటనే ఆచరణాత్మక బడ్జెట్ విధానం అంటారు. కొన్ని లక్ష్యాలకు, ఫలితాలకు వ్యయరీతిని ఈ పద్ధతిలో పరిశీలించెదరు. శాఖలు వారిగా వారి వారి వ్యయపు అవసరాలను ఆర్థిక మంత్రిత్వ శాఖకు సమర్పిస్తే ఆ శాఖ ప్రాధాన్యతను ఒనరుల అందుబాటును దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌ను తయారుచేసి మార్పులు చేర్పులతో మంత్రి మండలి ఆమోదానికి పంపిస్తే మంత్రిమండలి సమావేశంలో చర్చించబడి ఆమోదిస్తాయి. యిందులో రాబడి వ్యయాలు సంబంధించే కాక ఆర్థిక విధానానికి సంబంధించి కూడా చర్చించబడి రూపొందించబడతాయి. దీనినే ఆచరణాత్మక బడ్జెట్ విధానం అని అంటారు. అభివృద్ధి చెందుతున్న మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ఈ బడ్జెట్ విధానంలో ఎంతో ప్రాముఖ్యత కలదు. ఎందుకంటే ఈ దేశాలలో ప్రణాళికా లక్ష్యాలు నిర్ణీత కాలంలో సాధించవలసి వుంటుంది. కాబట్టి ఈ వర్గీకరణ పరిపాలనా సామర్థ్యాన్ని ఒనరుల కేటాయింపులను అధికం చేస్తుంది.

## 10.7 ఆర్థిక వ్యవస్థ పై బడ్జెట్ ప్రభావం :-

ఆర్థిక విధాన రూపకల్పనలో అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వ బడ్జెట్ అనేది ఒక ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడుతుంది. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణ ఉద్యోగితా స్థాయిని పొంది ఉండటం వల్ల నిరుపయోగ వనరుల వినియోగ సమస్య ఉండదు. అంటే వనరుల పూర్తి స్థాయిలో వినియోగించబడతాయి. అయితే ఆర్థిక వ్యవస్థలో అప్పుడప్పుడు వ్యాపార చక్రాలు సంభవించే అవకాశం ఉండటం వల్ల ఆర్థిక మాంధ్య (లేదా) నిరుద్యోగ సమస్య మరియు ద్రవ్యోల్బణం (లేదా) అధిక కొనుగోలు శక్తి వంటి సమస్యలు అప్పుడప్పుడు ఏర్పడతాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో సంపూర్ణ ఉద్యోగిత లేకపోవడం చేత ఆర్థిక వృద్ధిని పెంచుకోవడం అనేది ఆర్థిక వ్యవస్థలో ఉన్న సమస్య ప్రభుత్వ బడ్జెట్ ఒక ముఖ్యమైన సాధనము (లేదా) పరికరముగా ఈ పరికరములను ఛేదించుటలో ఉపయోగపడుతుంది. ఈ క్రింద వివరించబోయే విధంగా ప్రభుత్వ బడ్జెట్ అనేది ఆర్థిక వ్యవస్థను ఏ విధంగా ప్రభావితం చేస్తుందో గ్రహించవచ్చు.

**10.7.1** రాబడిని పెంచుకొనే ప్రణాళిక :- ప్రభుత్వానికి తన కోశ పరమైన బాధ్యతలను నిర్వర్తించుటకు అధిక రాబడి అవసరం. ఆధునిక ప్రభుత్వాలు ప్రజాసంక్షేమం కొరకు విస్తృతంగా అనేక కార్యక్రమాలను చేపడుతూ ప్రభుత్వ రంగాన్ని పెంచుతున్నాయి. కాబట్టి ఈ పరిస్థితుల దృష్ట్యా రాబడి మార్గాలకు అన్వేషణ పెరిగినది. బడ్జెట్ లో విత్తప్రణాళిక ఈ విషయాలు అన్నింటిని పొందుపరుస్తుంది. బడ్జెట్ లోని రాబడి ఖాతాలలోని నిధులకు ఆధారము మరియు పరిధులను చూపిస్తూ దేశముయొక్క విత్త కార్య కలాపాలకు మూలము అవుతుంది.

**10.7.2** ఆర్థిక కార్యకలాపాలకు ప్రోత్సాహం :- బడ్జెట్‌లతో పొందుపరిచిన రాబడి మరియు వ్యయ విధానాలు వ్యవసాయ రంగాన్ని మరియు పారిశ్రామిక రంగాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తూ ఆర్థిక కార్యకలాపాలకు ప్రోత్సాహకంగా ఉంటుంది. బడ్జెట్ ద్వారా పన్ను మినహాయింపులు, విచక్షణాత్మక పన్నులు, విధానాలను అవలంభించి వ్యవసాయ పారిశ్రామిక రంగాల అభివృద్ధికి బాటలు వేస్తుంది. ప్రయివేటు పెట్టుబడిదారులను ఆకర్షించుటకు ముఖ్యమైన పరిశ్రమలకు మరియు ప్రాధాన్యత గల పరిశ్రమలకు పన్ను మినహాయింపులను బడ్జెట్ ద్వారా కల్పించబడతాయి. అదే విధముగా వ్యవసాయ కార్యకలాపాలు మరియు ఆర్థిక దిగుబడుల కోసం అధిక మొత్తాల కేటాయింపు, ఉచిత (లేదా) సబ్సిడీలతో వ్యవసాయ పరికరాలను మరియు వ్యవసాయ విస్తరణ సేవలను కల్పించబడతాయి. ఈ విధంగా బడ్జెట్ వ్యవసాయ పారిశ్రామిక అభివృద్ధికి వీలు కల్పిస్తుంది.

**10.7.3** మానవ మూలధన కల్పన :- ఒక దేశ ఆర్థికాభివృద్ధిలో మానవ వనరులు అనేవి నేడు అతి ముఖ్యమైన పాత్ర వహిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో విద్య, ఆరోగ్యం, వంటి మానవ మూలధన కార్యకలాపాల స్థాయి తక్కువగా ఉంటుంది. ఉత్పత్తి ఉత్పాదకతను పెంచుకోవాలి అంటే ప్రజలు ఆరోగ్యవంతులుగాను విద్యావంతులుగాను వుండాలి. ప్రజలను ఈ విధంగా తయారు చేయుటలో బడ్జెట్ మాత్రమే కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఎందుంటే వీటికి సంబంధించిన పెట్టుబడులు అధిక మొత్తాలలో కూడుకుని ఉండటం మరియు దీర్ఘ ఫలనాకాలం కలిగినవి కావడంచేత ప్రయివేట్ రంగంలో నిధులు ఒనగూడవు. కాబట్టి ప్రభుత్వమే తన బడ్జెట్ కేటాయింపుల ద్వారా, సాదారణ మరియు సాంకేతిక విద్య ద్వారా మరియు ఆరోగ్య సదుపాయాల కల్పన ద్వారా ప్రజల ఉత్పాదక శక్తులను పెంపొందిస్తుంది. అంటే మానవ మూలధన కల్పనలో బడ్జెట్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

**10.7.4** అవస్థాపనా నిర్మాణం :- పేద దేశాలలో సరైన అవస్థాపనా నిర్మాణం లేకపోవడమే అల్పాభివృద్ధికి ముఖ్యమైన కారణం. రవాణా సమాచార సౌకర్యాల కొరత, అధిక పరిమాణంలో విద్యుత్ చ్ఛక్తి లభించకపోవడం ప్రాధమిక మరియు ముఖ్యమైన పరిశ్రమల స్థాపన జరగకపోవడం మరియు ఉద్యమ దారులకు కార్మికులకు సరైన శిక్షణ లేకపోవడం ఈ దేశాలలో పారిశ్రామికాభివృద్ధి జరగకపోవడానికి కారణాలు. అదేవిధముగా విస్తారంగా నీటి పారుదల సౌకర్యాలు లేకపోవడం వరదల నిర్మూలనా విధానం, సాంకేతిక పరమైన అభివృద్ధి మరియు పరిశోధనల లేమితనంతో వ్యవసాయ రంగాలలో అధిక ఉత్పత్తికి వీలు కల్గుటలేదు. ఈ సౌకర్యాలను తప్పనిసరిగా ప్రభుత్వమే కల్పించాలి. ఎందుకంటే వీటి సప్లయ్ వ్యయం అధికంగా ఉండుటచే వీటిని ప్రజలు ప్రత్యక్షముగా కల్పించుకోలేదు. కావున ఈ సౌకర్యాలు,

ఉచితంగా ప్రభుత్వ బడ్జెట్ ద్వారా కల్పించబడతాయి. అంటే వ్యవసాయ పారిశ్రామిక అభివృద్ధిని బడ్జెట్ కేటాయింపులు ద్వారా ప్రభావితం చేస్తుంది.

**10.7.5 అధిక ఉపయోగకరమైన ఉత్పత్తికి వనరుల మళ్ళింపు :-** స్వేచ్ఛా మార్కెట్ విధానం, లాభదాయకమయిన ఉత్పత్తులను మాత్రమే చేపడుతుంది. అంటే ప్రయివేట్ పెట్టుబడులు సహజంగా విలాసవంతమైన వస్తువుల ఉత్పత్తికే మళ్ళింపబడతాయి. కావున అత్యంత ఉపయోగకరమైన సామాన్య వినియోగ వస్తువుల ఉత్పత్తికి వనరుల మళ్ళింపు అవసరం. బడ్జెట్ విధానం ద్వారా ప్రభుత్వం ఈ వనరుల మళ్ళింపును సులభంగా చేయగల్గుతుంది. హానికరమైన తక్కువ అవసర వస్తువులపై అధిక పన్నును విధించుట, అవసరమైన వస్తూత్పత్తికి పన్ను మినహాయింపు కల్పించడం ద్వారా వనరుల మళ్ళింపు జరిగి అభిలషణీయమైన వస్తుసేవల ఉత్పత్తి జరుగుతుంది. బడ్జెట్‌లోని వ్యయ విధానంతో గ్రాంట్లు, కల్పన ద్వారా కూడా వనరుల మళ్ళింపును చర్చిస్తుంది.

**10.7.6 వనరుల కేటాయింపు :-** అభివృద్ధి చెందుతున్నా దేశాలలో అభిలషణీయముగా వనరుల కేటాయింపు జరగక ఇబ్బందులను ఎదుర్కొంటూ వుంటాయి. సహజంగా మార్కెట్ ప్రయివేట్ రంగాలలో ఏకస్వామ్యం, ఏకస్వామ్యపోటీ, మరియు పరిమిత స్వామ్య మార్కెట్లతో నిండి ఉంటాయి. ఇట్లాంటి మార్కెట్ విధానాన్ని నిరోధించాలి అంటే సబ్సిడీలను ఇచ్చి ఈ ఉత్పత్తినని కొనసాగించుట (లేదా) మొత్తం ఉత్పత్తి ప్రక్రియను స్వయముగా ప్రభుత్వమే చేపట్టాలి. అప్పుడే సగటు రాబడికి ఉపాంత వ్యయానికి మధ్య ఉన్న అగాధం తగ్గించబడుతుంది. ఈ కారణం చేతనే భారపెట్టులు ప్రజా సంక్షేమంలో ఉపయోగపడి పరిశ్రమలలో రాబడి తగ్గుతున్న ప్రభుత్వ రంగంలోనే స్థాపించవలసి వస్తుంది.

**10.7.7 సంతులిత అభివృద్ధి :-** ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రాంతీయ వ్యత్యాసాలతో సతమతం అవుతూ ఉంటాయి. ప్రయివేట్ పెట్టుబడిదారులు. గరిష్ట లాభార్జన ధ్యేయంతో పరిశ్రమలను పట్టణ ప్రాంతాలలో సహజంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలలో స్థాపిస్తారు. ప్రభుత్వం ఇలాంటి పోకడలలో ఉన్నా వ్యత్యాసాలను ప్రభుత్వరంగం ద్వారా భౌగోళికంగా వెనుకబడిన ప్రాంతాలలో సహజంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలలో స్థాపిస్తారు.

ప్రభుత్వం ఇలాంటి పోకడలలో ఉన్నా వ్యత్యాసాలను ప్రభుత్వ రంగం ద్వారా భౌగోళికంగా వెనుకబడిన ప్రాంతాలలో స్థాపించి నిరోధించగల్గుతుంది. అంతే కాకుండా వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పరచడం, చిన్న గ్రామీణ పరిశ్రమలను స్థాపించడం వీటికి అవసరమైన అవస్థాపనా సౌకర్యాలకల్పనా, అనేక ప్రోత్సాహాలు సబ్సిడీలను ఇచ్చి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తుంది. ఈ విధంగా బడ్జెట్ ద్వారా సంతులిత అభివృద్ధిని సాధిస్తుంది.

**10.7.8 ఆదాయ ఉద్యోగిత :-** అభివృద్ధి చెందుతున్న దేశాలు, అల్పాదాయదేశాలు ప్రజలు పేదరికంలో నివసించడం వల్ల పొదుపు మరియు పెట్టుబడులు తక్కువగా వుంటాయి. ఉత్పత్తి ఉత్పాదకతను పెంచడం వలన మాత్రమే ప్రజల ఆదాయ స్థాయిని పెంచగలం. బడ్జెట్ కేటాయింపులు దీనికి సంబంధించి బాటలు వేస్తాయి. ఎప్పుడు అయితే బడ్జెట్ కేటాయింపు ద్వారా వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుందో వ్యవసాయ రంగంలోని ప్రజల ఆదాయం పెరిగి ప్రజలు లాభాదాయకమైన అదనపు ఉద్యోగ అవకాశాలను కూడా పొందగలవు. చిన్న తరహా పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాలలో స్థాపించడము మరియు వెనుకబడిన ప్రాంతాలలో ప్రభుత్వరంగ పరిశ్రమలను స్థాపించడం వల్ల ప్రజలకు ఉపాధి అవకాశాలు అధికం అవుతాయి. బడ్జెట్‌లో ఉపాధి అవకాశాలు పెంపొందించే పరిశ్రమలకు పన్ను మినహాయింపులు ప్రకటించడం ద్వారా ప్రయివేట్ రంగం ముందుకు వచ్చి ఉత్పత్తి కార్యక్రమాలను చేపట్టి ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. తద్వారా ప్రజల ఆదాయాలు కూడా పెరుగుతాయి.

**10.7.9 పొదుపు మరియు పెట్టుబడి :-** అభివృద్ధి చెందుతున్న దేశాలలో పొదుపు మరియు పెట్టుబడుల స్థాయి తక్కువగా ఉంటుంది. పొదుపు మరియు పెట్టుబడులు వృద్ధి చెందకుండా ఆర్థికాభివృద్ధిని సాధించుట చాలా కష్టం. కావున ఆర్థికాభివృద్ధి దృష్ట్యా ప్రజల పొదుపు అత్యంత అవసరం. తక్కువ ఆదాయం వల్ల పేద ప్రజలు పొదుపు చేయలేరు. ప్రయివేట్ పొదుపు పెట్టుబడుల పొదుపు - పెట్టుబడి

- పన్ను మినహాయింపులు మరియు ఇతర బడ్జెట్ సబ్సిడీ కార్యక్రమాల ద్వారా ప్రభావితం అవుతాయి. ప్రజల యొక్క పని చేసే సామర్థ్యం మరియు కోరికలు పొదుపు మరియు పెట్టుబడుల సామర్థ్యము మానవ మూలధన కల్పన ద్వారా మరియు ఉద్యోగ అవకాశాల కల్పన ద్వారా అధికమవుతాయి. ఇవి అన్నీ కూడా ప్రభుత్వ బడ్జెట్ ద్వారా అంటే బడ్జెట్‌లోని వ్యయ విధానం ద్వారా వనగూడుతాయి.

**10.7.10 పేదరిక నిర్మూలన :-** పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు అభివృద్ధి చెందుతున్న దేశాల బడ్జెట్‌లో ఒక అంతర్భాగం. అన్ని వ్యయ కార్యక్రమాలు ఆ విధంగా రూపొందించబడి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, ఆర్థిక వ్యవస్థలోని పేదరిక నిర్మూలనకు తోడ్పడతాయి. కాబట్టి బడ్జెట్ ద్వారా వనరుల ఖర్చు విద్య మీద, అది సాధారణ విద్య (లేదా) సాంకేతిక విద్య మరియు వృత్తి విద్య లేదా ఆరోగ్య సదుపాయాల కల్పనా మొదలగు వాటిపై వెచ్చించడంలో ముఖ్య ఉద్దేశ్యమే పేదరిక నిర్మూలన. ప్రత్యక్షముగా బడ్జెట్ కార్యక్రమాలు పేదరిక నిర్మూలనకు ఉపాధి కల్పనకు తోడ్పడతాయి. మరియు ఆస్తుల కల్పనలో కూడా తోడ్పడతాయి. ఉదాహరణకు :- సమీకృత గ్రామాణాభివృద్ధి కార్యక్రమం (I.R.D.P) జాతీయ గ్రామీణాభివృద్ధి పథకం (N.R.E.P) జాతీయ భూమి లేని వారి ఉపాధి హామీ పథకం (R.L.E.G.P) జవహర్ రోజ్‌గార్ యోచన, (J.R.Y) ప్రధానమంత్రి రోజ్‌గార్ యోచనా (P.M.R.Y) మొ॥గు కార్యక్రమాలు భారతదేశంలో పేదరిక నిర్మూలనకు రూపొందించబడ్డాయి. ఉద్యోగ భీమా, సాంఘీక భద్రతా, వినియోగ సబ్సిడీ, ప్రజాపంపిణీ వ్యవస్థ. మరియు మద్దతు ధరల విధానం తక్కువ ఆదాయ వర్గాల వారి గృహనిర్మాణం. ప్రాంతాల అభివృద్ధి, ఉత్పత్తి పరికరాల సప్లై నూతన వ్యవసాయ వేతనం మొదలగునవి కూడా పేదరిక నిర్మూలనకు తోడ్పడతాయి.

**10.7.11 లోటు బడ్జెట్ మరియు నిరుద్యోగితా తొలగింపు :-** ఇంతకముందు మనము చెప్పుకున్నట్లు అభివృద్ధి చెందిన దేశాలు అప్పుడప్పుడు ఆర్థికమాంద్య పరిస్థితులలోను (లేదా) వ్యాపార చక్రాలను ఎదుర్కొంటూ ఉంటాయి. కావున సార్థక డిమాండ్ లోపించడం చేత అల్పోద్యోగిత, అల్పాదాయం వంటి సమస్యలు ఏర్పడతాయి. అట్లాంటి పరిస్థితులలో బడ్జెట్ ద్వారా కార్యక్రమాల అమలు ఉపయోగపడుతుంది ఎట్లనగా ఆ కార్యక్రమాల ద్వారా అదనపు కొనుగోలు శక్తి, ఆర్థిక వ్యవస్థలోనికి చొప్పించబడుతుంది. J.M. కీన్స్ చెప్పినట్లుగా ప్రభుత్వ వ్యయం, అది అనుత్పాదక వ్యయం అయినప్పటికీ ఉపాధి కల్పనలో తోడ్పడుతుంది. ఎందుచేతనంటే ఎక్కువ మందిని ఉపాధిలోనికి తీసుకొని అధిక ఉత్పత్తి సమిష్టి డిమాండ్ పెరిగిన కారణముగా ఉపాధి అధికమౌతుంది. బడ్జెట్ అసమతౌల్యాలు పన్ను తొలగింపు మరియు ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా ప్రత్యక్షంగా నూతన ద్రవ్య కల్పన కూడా ఆర్థిక కార్యకలాపాలను విస్తృత పరుస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో లోటు బడ్జెట్ మరియు అదనపు ప్రభుత్వ వ్యయ కార్యక్రమాలు నిరుద్యోగ సమస్యను నిర్మూలిస్తూ ఉపాధి అవకాశములను అధికము చేస్తూ నిరుపయోగకరముగా ఉన్న వనరులను వినియోగంలోనికి తెస్తుంది.

**10.7.12 మిగులు బడ్జెట్ మరియు ద్రవ్యోల్బణ నియంత్రణ :-** ద్రవ్యోల్బణానికి కారణమైన పరిస్థితే అదనపు కొనుగోలు శక్తి అంటే అదనపు కొనుగోలు శక్తి వల్ల ధరలు పెరుగుతాయి. ధరలు తగ్గించాలి అంటే ఈ అదనపు కొనుగోలు శక్తిని ఆర్థిక వ్యవస్థలోంచి తొలిగించాలి. ఇందుకుగాను మిగులు బడ్జెట్ విధానం అత్యంత ఉపయోగకరం. అంటే పన్నులను పెంచుట మరియు ఇతర రాబడి మార్గాల ద్వారా రాబడిని అధికం చేసుకొనే ప్రయత్నం మరియు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడం ద్వారా అదనపు కొనుగోలు శక్తి తగ్గి ద్రవ్యోల్బణాన్ని తగ్గించవచ్చు. అంటే బడ్జెట్ విధానంలో వ్యయ విధానం మరియు పన్నుల విధానం ఇందుకు తోడ్పడుతుంది.

**10.7.13 సంపూర్ణ ఉద్యోగిత మరియు ధరల స్థిరీకరణ :-** బడ్జెట్ యొక్క ముఖ్య ఉద్దేశ్యాలలో మరొక ఉద్దేశ్యం సంపూర్ణ ఉద్యోగితను మరియు ధరల స్థిరీకరణను సాధించుట. ఆర్థిక వ్యవస్థ గతంలో మనం చెప్పుకున్నట్లు ద్రవ్యోల్బణం (లేదా) ప్రతి ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొంటూ ఉంటే అప్పుడు బడ్జెట్ ద్వారా సంపూర్ణ ఉద్యోగితను ధరల స్థిరీకరణను విభిన్న వ్యయాలతో మరియు పన్నుల విధానంతో చేపడుతుంది. అభివృద్ధి చెందిన దేశాలకైతే ఇలాంటి పరిస్థితులలో సంతులిత బడ్జెట్ విధానం సమర్ధనీయం. అదే అభివృద్ధి చెందుతున్నా దేశాలలో అచ్చట వనరులు పూర్తి స్థాయిలో వినియోగించబడకపోవడంచే ప్రభుత్వ వ్యయ కార్యక్రమాలు మరియు పన్ను ప్రోత్సాహకాల ద్వారా సంపూర్ణ ఉద్యోగిత స్థాయిని పొందడానికి ప్రయత్నిస్తాయి.

**10.7.14** అసమానతల తగ్గింపు :- అసమానతల తొలగింపు అనేది బడ్జెట్‌లోని అతిముఖ్యమైన కోశ విధాన లక్ష్యం. ఆదాయ సంపద లోని అసమానతలు ప్రాధమికమైనటువంటి సమస్యగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో వుంటాయి. బడ్జెటరీ విధానంలో పన్నులు - పన్ను కార్యక్రమాలు ఆదాయ అసమానతలను తగ్గించుటలో సుదీర్ఘమైనటువంటి చోటు చేస్తాయి. కాబట్టి ఆదాయ సంపదల మీద పన్ను విధించుటలో అసమానతల తగ్గింపు అనే ఉద్దేశ్యం నిర్దేశింపబడినది. పరోక్ష పన్నులు ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చుతున్నప్పటికీ అవి తిరోగామితత్వాన్ని కలిగి అసమానతలను పెంపొందిస్తాయి. ఇట్లాంటి అసమానతలను తగ్గించడంలో అనేక పేదరిక నిర్మూలనా కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని ఉపయోగిస్తారు. విద్యసేవల సప్లై, ఆరోగ్య వైద్య సదుపాయాలు, వ్యవసాయ ఉత్పాదకాలు సబ్సిడీలు మరియు మార్కెటింగ్ సౌకర్యాలు వంటి సదుపాయాల కల్పనలో ఉన్నా ముఖ్య ఉద్దేశ్యమే పేద, ధనిక పరిస్థితుల మధ్య తారతమ్యాన్ని తగ్గించడమే.

**10.7.15** జాతీయాదాయ గణాంకాల సప్లై :- ఆధునిక ఆర్థిక వర్గీకరణ ప్రకారం బడ్జెట్ ను వర్గీకరించడం వల్ల అనేక ఆర్థిక ప్రాముఖ్యం ఉన్న ంశాలు వెలుగులోనికి వస్తాయి. పొదుపు, వినియోగం, పెట్టుబడి, మూలధన కల్పన, లోన్లు, ప్రస్తుత బదలాయింపులు మొ॥ అనేక అనేక ప్రాముఖ్యము ఉన్న జాతీయాదాయ గణాంకాలను బడ్జెట్ విశదపరుస్తుంది. ఈ గణాంక సమాచారాన్ని బట్టి దేశ ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా పయనిస్తుందో గ్రహించి జాతీయ లక్ష్యాల సాధనకు ఉన్నతమైన మార్గాలు అధిక ఉపయోగకరమైన పద్ధతులను సలహాలను ఇవ్వగలగవచ్చు.

**10.7.16** ఆర్థిక విస్తృత ప్రణాళిక :- ఆర్థికాభివృద్ధి సాధనలో ప్రణాళిక ప్రకారం కొన్ని కార్యక్రమాలను రూపొందించుకొని అమలు చేయడమే బడ్జెట్ విధానం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో దీర్ఘకాలానికి సంబంధించిన లక్ష్యాలు కూడా పొందుపరచబడి వుంటాయి. ఉదా :- పేదరిక నిర్మూలనా అనే ఉద్దేశ్యానికి బడ్జెట్‌లో సహజ లక్ష్యాలతో పాటు ప్రత్యేక లక్ష్యాలతో కూడా ప్రత్యక్షంగాను, పరోక్షంగాను దారిద్ర్య నిర్మూలనకు లక్ష్యాలు పొందుపరచబడి వుంటాయి. ప్రత్యేక లక్ష్యాల సాధనలో అనేక పథకాలు అంటే అధిక ఆదాయ మార్గాలు అన్వేషణ ఆదాయ నిర్వాహణ పథకాలు, సాముహిక అభివృద్ధి కార్యక్రమాలు, వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు మొ॥లగు కార్యక్రమాలు రూపొందించబడి ఏక కాలంలో అమలు చేయడం వల్ల ఆర్థిక లక్ష్యాలు నిర్ణయించుకున్న కాలంలో సాధించబడతాయి.

**10.7.17** ఖర్చు ప్రయోజనాల అధ్యయనం :- ఆధునిక విధులను అనుసరించి విత్తవిధానం యొక్క ముఖ్య ఉద్దేశ్యము ఖర్చు ప్రయోజనాలను గ్రహించుట. కొన్ని ప్రత్యేకమయిన ద్రవ్యపరమయిన, మరియు భౌతిక పరమైనటువంటి లక్ష్యాల సాధనలో నిర్ణీత కాలములో సాధించుట లేదు అని తెలియజేయుట బడ్జెట్ ద్వారా గ్రహించవచ్చు. ఒక వేళ అనుకున్నంత మేరకు లక్ష్యాల సాధనలలో విఫలమైతే అమలుచేసే ఏజన్సీలు తక్షణమే వాటిని అమలు చేయటమో (లేక) తొలగింపు నిర్ణయాలు చేయడమో చేయవచ్చు. కావున బడ్జెట్ అనేది ఒక మంచి గైడ్ లాగా (లేదా) మంచి పుస్తకం లాగా పన్ను చెల్లింపుధరలకు డబ్బు అనేది అత్యంత ఉపయోగకరమైనటువంటి విధానంలో ఖర్చు చేయడం జరుగుతుంది.

**10.7.18** ప్రభుత్వ నిధుల దారి మళ్ళింపు ఉపయోగాలపై నియంత్రణ :- నిర్ణీత కాలములో రాబడి వ్యయాల ప్రణాళికే బడ్జెట్. ఇది ప్రభుత్వ నిధుల ఖర్చులకు సంబంధించి నియంత్రణను కల్గి ఉంది. ప్రజల, శాసన నిర్మాణం బడ్జెట్‌ను చూసి రాబడి వ్యయాల ప్రయత్నాలను గ్రహించి ప్రభుత్వ కార్యకలాపాల మరియు రాబడి అన్వేషణలను నియంత్రణలో ఉంచుతారు. ఇందులో శాసన నిర్మాణ శాఖ కీలకమైన పాత్ర పోషిస్తుంది. అత్యంత సామర్థ్యవంతమయం కాకుండా (లేక) దారి మళ్ళింపు ద్వారా బడ్జెట్ విధానాలు జరుగుతుంటే కార్యనిర్వాహణ శాఖ దీనికి భాధ్యత వహించ వలసి ఉంటుంది. ఇది ఖచ్చితంగా నిర్దేశిత అంశాలపై వ్యయం చేయడంలో ఉపయోగపడుతుంది.

## 10.8 ముగింపు :

పై వివరణను బట్టి సాంప్రదాయక ఆర్థిక శాస్త్రవేత్తలు ప్రభావ శూన్యం గల బడ్జెట్‌ను అనుసరించదగిన బడ్జెట్‌గా ప్రతిపాదించినారు. అయితే "మహా మాంద్యం" తర్వాత ముఖ్యంగా ఆధునిక కాలంలో ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కొరకు ఆర్థిక కార్యకలాపాలను చేపట్టడం

జరిగింది. నేడు ప్రభుత్వాలు తన రాబడి వ్యయాలకు సంబంధించిన వార్షిక నివేదికను అంటే బడ్జెట్‌ను ఒక ముఖ్యమైన సాధనంగా ఎంచుకున్నాయి. ఎందుకంటే ప్రస్తుత భావి తరాల వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని వనరులు ఉపయోగించడంలో బడ్జెట్ విధానం అత్యంత ఉపయోగకరముగా ఉంటుంది. స్థూలంగా కోరదగిన అంశాలను ప్రవేశ పెట్టుటలో, కోరదగిన అంశాలను తగ్గించుటలో బడ్జెట్ విధానం ఉపయోగపడాలి. ఆర్థిక అభివృద్ధికి బడ్జెట్ ఒక ముఖ్యమైన సాధనంగానూ, ప్రతీకగాను ఉంటుంది. అందుకే బడ్జెట్ తయారీ లేని ఆర్థిక వ్యవస్థను చుక్కాని లేని నావ వంటిదిగా పేర్కొనవచ్చును.

## 10.9 ముఖ్య పదాలు :-

Fiscal Poicy - కోశ విధానం

Classical Theory - సాంప్రదాయక సిద్ధాంతం

Modern Theory - ఆధునిక సిద్ధాంతం

Balanced Budget - సమతౌల్య బడ్జెట్

Consolidated Fund - ఏకీకృత నిధి

Contingency Fund - ఆఘంతుక నిధి

Public Account - ప్రభుత్వ ఖాతా

Revenue Account - రెవిన్యూ ఖాతా

Capital Account - మూలధన ఖాతా

Plan Expenditure - ప్రణాళికా వ్యయం

Non - Plan Expenditure - ప్రణాళికేతర వ్యయం

Developmental Expenditure - అభివృద్ధి వ్యయం

Non - Developmental Expenditure - అభివృద్ధేతర వ్యయం

Zero Based Budget - సున్నా ఆధారపు బడ్జెట్

Functional Classification - విధులను అసరించి వర్గీకరణ

Economic Classification - ఆర్థిక వర్గీకరణ

Human Capital - మానవ మూలధనం

Deficit Budget - లోటు బడ్జెట్

I.R.D.P - సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం

(Integrated Rural Development Programme)

N.R.E.P - జాతీయ గ్రామీణ ఉద్యోగితా పథకం

(National Rural Employment Programme)

R.L.E.G.P - గ్రామీణ భూమి లేని వారి ఉద్యోగితా హామీ పథకం

(Rural Landless Employment Guarantee Programme)

J.R.Y - జవహర్ రోజ్‌గార్ యోజన

(Jawahae Rojgar Yojana)

P.M.R.Y - ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన

(Primr Minister Rojgar Yojana)

## 10.10. స్వీయ అవగాహన ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 50 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. బడ్జెట్ అనగానేమి ? బడ్జెట్ యొక్క ఉద్దేశ్యం దాని యందుగల సిద్ధాంతాలు దానిని ఎలా రూపొందిస్తారో తెలపండి ?
2. బడ్జెట్ అనగానేమి ? అందలి రకాలను వివరించండి ?
3. బడ్జెట్ అనగానేమి ? ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావాన్ని చర్చించండి ?

II. ఈ క్రింది ప్రశ్నలకు సంక్షిప్త సమాధానాన్ని వ్రాయండి.

1. బడ్జెట్ ఉద్దేశ్యం
2. రెవెన్యూ మరియు కేపిటల్ బడ్జెట్లు
3. ఆర్థిక వర్గీకరణ
4. ఆచరణాత్మక బడ్జెట్ విధానం
5. సున్నా ఆధారపు బడ్జెట్

## 10.11. చదవవలసిన గ్రంథాలు

1. B.P Thyagi - Public Finance
2. H.L Bhatia - Public Finance
3. R.K Choudhury - Public Finance and Fiscal Policy.

ఆచార్య జి. చంద్రశేఖరరావు

పాఠం - 11

# కోశ విధానము

## పాఠ్య నిర్మాణ క్రమం


11.0 ఉద్దేశాలు

11.1 ఉపోద్ఘాతం

11.2 కోశ విధానం పై వివిధ అభిప్రాయాలు

11.3 అభివృద్ధి చెందిన దేశాలలో కోశ విధాన లక్ష్యాలు

11.4 అభివృద్ధి చెందుతున్న దేశాలలో కోశ విధావాల లక్ష్యాలు

11.5 కోశ సాధనాలు - పనితీరు

11.6 కోశ విధానం ద్వారా ఆర్థిక సుస్థిరత

11.7 ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో కాశ విధానం

11.8 సారాంశం

11.9 ముఖ్య పదాలు

11.10 స్వయం సమీక్ష ప్రశ్నలు

11.11 చదవవలసిన పుస్తకాలు


## 11.0 ఉద్దేశాలు

ఈ పాఠ్యభాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలపట్ల అవగాహన పెరగాలి.

ఎ) కోశ విధానంపై సనాతన, ఆధునిక అర్థ శాస్త్ర వేత్తల అభిప్రాయాలు, కోశ విధాన లక్ష్యాలను వివరింపగలగాలి.

బి) అభివృద్ధి చెందుతున్న దేశంలో కోశ విధాన లక్ష్యాలను సవివరంగా వివరింపగలగాలి.

సి) వివిధ కోశ సాధనాల ద్వారా ఆర్థిక సుస్థిరత ఏ విధంగా సాధించబడుతుందో సవివరంగా విశ్లేషించాలి.

డి) ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో కోశవిధాన పనితీరును సమీక్షింపగలగాలి.

## 11.1 ఉపోద్ఘాతం :

ఈ మధ్య కాలంలో కోశ విధాన సిద్ధాంతాలలో వచ్చినటువంటి విప్లవాత్మక మార్పులు బహుశ అర్థశాస్త్రంలో ఏ ఇతర శాఖలలోనూ వచ్చివుండవు. ఆ విధంగా వచ్చిన సరిక్రొత్త మార్పులు ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలకే పరిమితం కావటం విశేషం. అయితే అభివృద్ధి చెందుతున్న దేశాల కోశవిధానానికి సంబంధించిన సమగ్ర సిద్ధాంతమేదీ ఇంత వరకు రూపొందించక పోవటం శోచనీయం.

ప్రపంచ ఆర్థిక మాంద్యం (1930) ఏర్పడక ముందు కోశ విధానమనే పదము ఎక్కువ వాడుకలోకి రాలేదు. కొన్ని సందర్భాలలో ఆ పదాన్ని వాడినప్పటికీ అది ప్రభుత్వ ఖజానా లేక ట్రెజరీకి సంబంధించినదిగా పరిమిత అర్థంతో వాడబడింది. అంతేకాక కోశవిధానమంటే కేవలం పన్నులకు సంబంధించిన విధానమనే పరిమిత అర్థంతో వాడబడింది. అయితే నేడు కోశ విధానమనగా ప్రభుత్వ పన్నుల, వ్యయ, రుణ విధానాలను గురించి వివరించే విధానమనే విస్తృత అర్థంతో వాడుతున్నాము.

కోశ విధానాల లక్ష్యాలు అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందిన దేశాలలో ఒకేలా వుండవు. దేశ ఆర్థికాభివృద్ధి గురించి చర్చించిటమే అభివృద్ధి చెందుతున్న దేశాలలో కోశ విధాన లక్ష్యంగా వుంటుంది. ఆర్థిక సుస్థిరతను సాధించటం అభివృద్ధి చెందిన దేశాలలో కోశ విధాన లక్ష్యం అని చెప్పవచ్చును.

కోశ విధాన సాధనాలనగా పన్నులు, ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ రుణము, రుణ యాజమాన్యము మొదలగునవి అని చెప్పవచ్చును. ఈ కోశ సాధనాలు దేశ ఆర్థికాభివృద్ధికి, ఆర్థిక సుస్థిరతకు ఏ విధంగా పనిచేస్తాయో చర్చించాల్సిన అవసరం కలదు. ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో కోశవిధానం కీలకపాత్రను నిర్వహించి దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడాల్సి వుంటుంది.

కోశ విధానమనగా ప్రభుత్వం తన వ్యయం, ఆదాయాల ద్వారా సత్ఫలితాలను అనుకున్న విధంగా సాధించి వీలైనంత వరకు జాతీయాదాయము, ఉత్పత్తి, ఉద్యోగితలపై దుష్ప్రభావాలను తప్పించగలిగిన విధానము అని చెప్పవచ్చును.

1930 ఆర్థికమాంద్యానికి పూర్వం సంతులిత బడ్జెట్ విధానాన్ని అవలంబించటం వలన పన్నులు విధించటం ఆదాయం కోసమే అనే దురభిప్రాయం ఉండేది. ఆర్థిక మాంధ్య ప్రభావ ఫలితంగా నిరుద్యోగిత బాగా పెరిగి కోశ విధానంలో అనేక మార్పులు వచ్చాయి. ముఖ్యంగా కీన్స్ తన ఉద్యోగితా సిద్ధాంతంలో కోశ విధానం గురించి విశదీకరించాడు. ఈ గ్రంథంలో కీన్స్ ఆర్థిక మాంధ్యాన్ని నిర్మూలించి, ఆర్థిక వ్యవస్థలో తిరిగి సమతౌల్య పరిస్థితిని నెలకొల్పవలెనంటే ప్రభుత్వ వ్యయ, పన్నుల విధానాలను ప్రణాళికా బద్ధంగా రూపొందించాలని సూచించాడు. ఆ విధానం ఆదాయము, ధరలు, ఉద్యోగితా స్థాయిలలో లాభదాయకమైన మార్పులకు దోహదకారిగా వుండవలెననే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. ద్రవ్య విధానం కంటే కోశ విధాన దృక్పథం విశాలమైనందున కోశ విధానం ద్వారానే ఆర్థిక పరిస్థితిని చక్కబరచగలమనే విశ్వాసం కూడా పెరిగింది.

**కోశ విధాన ప్రాముఖ్యత పెరుగుటకు గల కారణాలు :**

1. ప్రభుత్వ సహాయం లేకుండా ప్రైవేటు రంగంలో ఆర్థిక మాంధ్యాన్ని నివారించటం దుర్లభం.
2. ప్రభుత్వ కోశ విధానం ప్రైవేటు రంగానికి చేదోడు, వాదోడుగా ఉండి ఆర్థిక మాంధ్యాన్ని నివారిస్తుందనే అభిప్రాయం వ్యక్తీకరించబడింది.

## 11.2. కోశ విధానంపై వివిధ అభిప్రాయాలు :

సనాతన ఆర్థిక వేత్తలకు స్వేచ్ఛావాదం పై నమ్మకం ఉన్నందున ప్రతి సప్లయి తన డిమాండును తానే సృష్టించుకుంటుంది. అని జె.బి.సే చెప్పిన మార్కెట్ సిద్ధాంతాన్ని సమర్థించారు. కాబట్టి ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగమనే సమస్య ఉండదని కూడా భావించారు. ఆర్థిక వ్యవస్థలో ఏవైనా సమస్యలు స్వల్పకాలంలో తలెత్తినప్పటికీ దీర్ఘ కాలంలో అన్ని సమస్యలు ప్రభుత్వ ప్రమేయం లేకుండానే వాటంతటవే సర్దుబాటవుతాయని సనాతన ఆర్థిక వేత్తలు భావించారు. పెట్టుబడిదారీ వ్యవస్థపై ఆధారపడటం వలన వ్యక్తులకు పూర్తి స్వేచ్ఛ వుంటుంది. కాబట్టి ఆర్థికపరమైన విషయాలలో ప్రభుత్వ జోక్యం వుండదు. మారుతున్న పరిస్థితులను బట్టి తమ ఆర్థిక నిర్ణయాలను కూడా మార్చుకుంటారు. కాబట్టి ఆర్థిక వ్యవస్థలో ఎల్లప్పుడూ సమతౌల్య పరిస్థితే వుంటుందని భావించినారు.

అందువల్లనే వారు ఏ ప్రభుత్వమైతే అతి తక్కువ వ్యయాన్ని ఖర్చుచేసి, అతి తక్కువ పన్నులు విధిస్తుందో అట్టి ప్రభుత్వం ఉత్తమమైనదని భావించారు. దీనిని 'దృఢవిత్తం' అని సనాతన అర్థశాస్త్ర వేత్తలు పిలిచినారు.

అంతేకాక సాంప్రదాయ ఆర్థిక వేత్తలు సంతులిత బడ్జెట్‌నే ప్రతిపాదించారు. కాబట్టి మిగులు బడ్జెట్ లేక లోటు బడ్జెట్ అవసరం లేదని ప్రభుత్వ రాబడి, వ్యయం ఎల్లప్పుడూ సమానంగా వుంటాయని భావించారు.

**సంతులిత బడ్జెట్ ప్రకారం :**

ఎ) ప్రభుత్వం అతి తక్కువ పన్నులు విధించి, వీలైనంత తక్కువ వ్యయం చేయాలి.

బి) పన్నులు కనిష్ఠంగా ఉండి ఉత్పత్తిపై చెడు పరిణామాలు కలుగజేయకుండా వుండాలి.

సి) ప్రతి ప్రభుత్వ వ్యయం అనుద్పాదకమని సనాతన ఆర్థికవేత్తల నమ్మకం

డి) ఏ ప్రభుత్వమూ అప్పులపై ఆధారపడగూడదని, అప్పులు తిరిగి చెల్లించటం, వడ్డీ కట్టటం వలన ఉత్పత్తిపై దుష్పరిణామాలు కలుగవచ్చునని కూడా నమ్మినారు.

ఇ) సంతులిత బడ్జెట్ నవలంభించినచో ప్రభుత్వ వ్యయం దుబారా అవ్వటమే కాకుండా ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ పరిణామాలు ఏర్పడవచ్చును.

అయితే నేటి పరిస్థితులకు ఈ ధృఢవిత్త సిద్ధాంతం వర్తించదని చెప్పవచ్చును. సనాతన ఆర్థిక వేత్తల సిద్ధాంతాలన్నీ కొన్ని నిర్దుష్ట ప్రమేయాలపై ఆధారపడినాయి. ఆ ప్రమేయాలేవీ నేడు లేనందున ఈ సిద్ధాంతం (1930 నాటికే) వర్తించదని రుజువైనది.

**కోశవిధానంపై ఆధునిక ఆర్థిక వేత్తల అభిప్రాయము :**

దీనినే 'నష్టపూరక విత్తం' అని కీన్స్ పిలవగా, పరిపూరకవిత్తం అని ఎ.పి. లెర్నర్ పిలిచాడు. సనాతన ఆర్థిక వేత్తలతో ఏకీభవించని ఆధునిక అర్థశాస్త్ర వేత్తలు ఈ సరిక్రొత్త విధానాన్ని రూపొందించటం జరిగినది. ముఖ్యంగా 1930 ఆర్థిక మాంధ్యంవలన ప్రభావితులైన వీరు సరిక్రొత్త కోశ విధానం అవసరమని భావించి ఈ పరిపూరక విత్తం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

ఆర్థిక మాంధ్యంగానీ, ద్రవ్యోల్బణంగానీ ఏర్పడినపుడు దానిని తొలగించేందులకు మనం చేపట్టే ఆర్థిక కార్యకలాపాలనే పరిపూరక విత్తం అని పిలుస్తాము. ఈ పరిపూరక విత్తాన్ని రూపొందించిన ఎ.పి. లెర్నర్ "చాంపియన్ ఆఫ్ ఫంక్షనల్ ఫైనాన్సు" గా పిలువబడినాడు.

**ఎ.పి. లెర్నర్ ప్రకారం బడ్జెట్ నిర్వర్తించాల్సిన విధులు :**

ఎ) పన్నుల విధింపు ధ్యేయం కేవలం ప్రభుత్వం ఆదాయం పొందేందులకే కాదు. తద్వారా ప్రజల చేతుల్లో తక్కువ ధనాన్ని వుంచటమే పన్నుల విధింపు యొక్క ధ్యేయం

బి) ప్రభుత్వం రుణాలు సేకరించటం ద్రవ్యాన్ని పెంచుకోవటానికి కాదు. ప్రజల దగ్గర అధిక బాండ్లు, తక్కువ ద్రవ్యం వుండటమే ప్రభుత్వ ధ్యేయం.

సి) అంతర్గత అప్పులు తీసుకోవటం కేవలం పరిపూర్ణ ఉద్యోగిత సాధించటానికే.

డి) ఎ.పి. లెర్నర్ ప్రకారం పన్నులు విధించటం, వ్యయం చేయుటం, రుణాలు తీసుకోవటం, అప్పులివ్వటం, కొనటం, మరియు అమ్మటం మొదలగునవి ప్రభుత్వం చేతిలోగల ఆరు ముఖ్య కోశసాధనాలుగా పేర్కొనవచ్చును.

**రాజా. జె. చెల్లయ్య - కోశవిధానంపై అభిప్రాయం :** ప్రభుత్వ విత్త విధానంలో 'పరిపూరక విత్తం' అనేది ఒక విప్లవమని ప్రభుత్వ విత్తంపై విశేష కృషి చేసిన రాజా. జె. చెల్లయ్య పేర్కొన్నాడు. ప్రభుత్వ వ్యయం ప్రత్యక్ష ప్రయోజనాలు పొందేందులకు కాకుండా, పరోక్షంగా వుద్యోగితా స్థాయిపై దాని వలన ప్రయోజనాలు పొందేందులకు అని కూడా చెల్లయ్య భావించాడు. అదే విధంగా అంచనావేసిన వ్యయాన్ని తట్టుకునేందులకు ప్రభుత్వం రాబడి వసూలు చేయబడదు, అయితే ద్రవ్యోల్బణ సమయంలోవలే సార్థక డిమాండును తగ్గించేందులకు మాత్రమే ప్రభుత్వరాబడి వసూలు చేయబడుతుందని చెల్లయ్య అభిప్రాయం.

**కోశ విధాన లక్ష్యాలు :** ఆయా దేశ పరిస్థితులమ బట్టి ప్రతి దేశం తన కోశ విధానా లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకై కృషి చేస్తుంది. సాధారణంగా కోశ విధాన ముఖ్య ఉద్దేశాలు ఈ క్రింది విధంగా వుంటాయి.

ఎ) ఉత్పత్తి కారకాల ఉత్పాదకతా సామర్థ్యాన్ని పెంపొందించుట.

బి) ఆదాయ, సంపదల మధ్యగల వ్యత్యాసాలను తొలగించుట.

సి) ధరలలో స్థిరత్వాన్ని సాధించటం.

డి) సంపూర్ణ వుద్యోగితా స్థాయిని సాధించుట.

ఈ పై లక్ష్యాలను కూలంకషంగా పరిశీలించినపుడు ఒకదానికొక్కటి పరస్పర విరుద్ధంగా కూడా అనిపించవచ్చును. ఉదాహరణకు ఆదాయ, సంపదల సమాన పంపిణీ లక్ష్యాలు, ఆర్థిక సామర్థ్యం, ఆర్థికాభివృద్ధిని సాధించవలెననే లక్ష్యం పరస్పర విరుద్ధంగా కనిపించవచ్చును. సమాన ఆదాయ, సంపద పంపిణీ జరగాలంటే ధనవంతుల నుండి పేదవారికి ఆదాయాన్ని బదిలీ చేసే పన్నుల విధానం అవసరం. కాని అప్పుడు పన్నుల భారం వలన ధనికుల ఉపాంత పొదుపు శక్తి తగ్గి, పెట్టుబడి రేటు కూడా తగ్గవచ్చును. అందువలన ఆర్థికాభివృద్ధిపై హానికర ప్రభావం కూడా ఉండవచ్చును. కాబట్టి ఈ లక్ష్య సాధనలో వీలైనంత వరకు దుష్పరిణామాలను తగ్గించి, సత్ఫలితాలను పెంపొందించేందులకు ప్రయత్నించాలి.

## 11.3. అభివృద్ధి చెందిన దేశాలలో కోశ విధానాల లక్ష్యాలు :

అభివృద్ధి చెందిన దేశాలలో వెనుకబడిన తనం అనే సమస్య ఉండదు. ఆర్థిక సుస్థిరతనేర్పరచి, ఆర్థికాభివృద్ధిని పోషించటం కోశ విధాన ముఖ్య ఉద్దేశాలు. అభివృద్ధి చెందిన దేశాలలో ఆర్థికమాంద్యం తరచుగా ఏర్పడి ఆర్థిక సుస్థిరతను దెబ్బతీస్తుంది. అభివృద్ధి చెందిన దేశాలలో సార్థక డిమాండును పెంచి, కొనుగోలు శక్తిని పెంచి, తద్వారా ఆర్థిక కార్యకలాపాలన్నింటినీ సమతౌల్య పరిస్థితికి తీసుకువచ్చేందులకు కోశవిధానం పనిచేస్తుంది.

అభివృద్ధి చెందిన దేశాలలో తరచుగా ఏర్పడే వ్యాపార చక్రాల వలన స్వల్పకాలిక ఆర్థిక అస్థిరత ఏర్పడుతుంది. ఈ అస్థిరతను కోశ విధానం ద్వారా తొలగించవచ్చును. ఈ దేశాలలో స్వల్పకాలిక ఆర్థిక అస్థిరతతోపాటు, దీర్ఘ కాలిక ఆర్థిక అస్థిరత కూడా ఏర్పడుతుంది. ఈ దీర్ఘకాలిక ఆర్థిక అస్థిరత గురించి హారడ్, డోమర్‌లు తమ వృద్ధి నమూనాలో విపులంగా వివరించారు. ఆదాయం మూలధనం కన్నా తగ్గినపుడు ఆర్థిక అస్థిరత ఏర్పడుతుందని వారభిప్రాయం. మూలధనం ఆర్థికాభివృద్ధికి అత్యంత కీలకమైనదని చెప్పవచ్చును. మూలధన సంచయనానికి ముఖ్యంగా రెండు లక్షణాలున్నాయి.

ఎ) పెట్టుబడి, ఆదాయం పెంచుట

బి) మూలధన పరిమాణాన్ని పెంచి వుత్పాదక శక్తిని పెంచుట.

వస్తు రూపక లేక వాస్తవిక ఆదాయం మూలధన రానికి సమానంగా ఉండనందున దీర్ఘకాలిక అస్థిరత ఏర్పడుతుంది. అటువంటప్పుడు దీర్ఘకాలిక ఆర్థిక మాంధ్యము లేదా దీర్ఘకాలిక ద్రవ్యోల్బణము ఏర్పడవచ్చును. ఈ అస్థిరతను తొలగించటానికి కోశ విధానము చాలా అవసరము.

ప్రత్యేకించి 1936లో కీన్స్ ఉద్యోగితా సిద్ధాంతం ముద్రించబడినప్పటి నుండీ కోశ విధానం వ్యాపార చక్రాలను నిఘారించే ముఖ్య సాధనంగా వర్ణింపబడింది. అలానే ఆర్థిక కార్యకలాపాలలో ప్రభుత్వ జోక్యం ద్వారా పరిపూర్ణ ఉద్యోగిత కూడా సాధించటానికి కోశవిధానం చాలా అవసరమని పేర్కొనబడింది. అభివృద్ధిచెందిన దేశాలలో సైతం సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాలంటే లోటు ద్రవ్య విధానం ద్వారా భారీగా ప్రభుత్వ వ్యయం పెట్టాల్సి ఉంటుంది.

అభివృద్ధి చెందిన దేశాలలో కూడా ఆర్థిక మాంధ్యం ఏర్పడినపుడు ప్రయివేటు వ్యయం కొరత వచ్చినపుడు లోటు బడ్జెట్ తప్పనిసరి అవుతుంది. అలానే మిగులు బడ్జెట్ ద్వారా ద్రవ్యోల్బణం అరికట్టబడుతుంది.

**ఆర్థిక మాంధ్యం :** ఆర్థిక మాంధ్యం ఏర్పడినపుడు తప్పనిసరిగా పెద్ద మొత్తంలో వ్యయం చేయవలసి వుంటుంది, నిరంతరంగా ద్రవ్యాన్ని ఆర్థిక వ్యవస్థలోకి తెచ్చి తద్వారా వినియోగ వస్తువులకు ప్రయివేటు డిమాండును పెంచాలి. తద్వారా సార్థక డిమాండు కూడా పెరుగుతుంది. అప్పుడు పెట్టుబడి దారులు పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి అదనపు ఉద్యోగావకాశాలను, ఆదాయాలను అభివృద్ధి చెందిన దేశాలలో పెంచాల్సి ఉంటుంది. సార్థక డిమాండు పెరిగి ఆర్థిక వ్యవస్థ ఆర్థిక మాంధ్యం నుండి ఆర్థిక సుస్థిరత స్థానానికి చేరుకుంటుంది.

**ద్రవ్యోల్బణం :** అభివృద్ధి చెందిన దేశాలలో ద్రవ్యోల్బణం ఏర్పడినపుడు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించినంత మాత్రాన ఆర్థిక సుస్థిరత ఏర్పడదు. వ్యయం పెరుగుతున్న ఈ రోజుల్లో ప్రభుత్వం వ్యయాన్ని తగ్గించుకోవటం అనేది ఆచరణలో సాధ్యం కాదు. కాబట్టి వినియోగ

వస్తువుల డిమాండు తగ్గించేందులకు భారీ పన్నులు విధించాల్సి వుంటుంది. పన్నుల రేట్లు తగ్గించటం, ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించటం లాంటి చర్యలు అభివృద్ధి చెందిన దేశాలలో ఏక కాలంలో జరిగినప్పుడే ద్రవ్యోల్బణం నివారింపబడుతుంది.

## 11.4. అభివృద్ధి చెందుతున్న దేశాలలో కోశ విధాన లక్ష్యాలు :

ఆర్థికంగా వెనుకబడిన దేశాలలో కోశ విధానం ఆర్థిక, సాంఘిక విధానాలకు అనుగుణంగా ఉండవలెను. ఈ దేశాలలో వెనుకబాటు తనాన్ని నిర్మూలించి, తలసరి ఆదాయాన్ని, ప్రజల జీవన ప్రమాణాలను పెంచటం, వుద్యోగావకాశాలను పెంపొందించటం, పొదుపు పెట్టుబడి స్థాయిలను పెంచటం, వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులను పెంచటం, ఉద్యోగావకాశాలను పెంపొందించటం మొదలైనవి ముఖ్య లక్షణాలుగా పేర్కొనవచ్చును. దాని కనుగుణంగా ఈ క్రింది లక్ష్యాలతో అభివృద్ధి చెందుతున్న లేదా వెనుకబడిన దేశాలు తమ కోశ విధానాన్ని రూపొందించుకుంటాయి.

ఈ లక్ష్యాలను సాధించాలంటే కోశ విధానం సాధారణంగా అనుసరించే లక్ష్యాలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది.

ఎ) వనరుల కేటాయింపు

బి) సామర్థ్యాన్ని పెంచుట

సి) ఆర్థికాభివృద్ధి

డి) ఆర్థిక స్థిరత్వము

ఇ) అభిలషణీయమైన ఆదాయపంపిణీ మొదలగునవి.

అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల లక్ష్యాలలో అంతగా భేదం లేనప్పటికీ, ఆయా దేశాలలో కోశ విధానం అవలంబించే పద్ధతులు భిన్నంగా ఉంటాయి. ఆర్థికాభివృద్ధి చెందిన దేశాలలో మూలధనము, నైపుణ్యంగల శ్రామికశక్తి, సాంకేతిక పరిజ్ఞానం, పొదుపు, పెట్టుబడి కొరత వుండదు. కానీ అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థికాభివృద్ధికి కావలసిన వనరులు, సాధనాలు అన్నీ కొరతగా ఉంటాయి. అందువలన ప్రభుత్వ కోశ విధానం ఆర్థికాభివృద్ధిని శీఘ్రతరం చేసేందులకు గల అడ్డంకులన్నీ తొలగించే విధంగా ఉండాలి.

వెనుకబడిన దేశాలలో వినియోగం ఎక్కువ, పొదుపు రేటు తక్కువగా ఉంటుంది. అందువలన మూలధన రూపకల్పనను పెంచవలసిన ఆవశ్యకత కూడా ఉన్నది. అందువలన ఈ దేశాలలో పెట్టుబడి రేటు కూడా తక్కువగా వుంటుంది. కాబట్టి జాతీయాదాయాన్ని పెంచవలెనంటే, పెట్టుబడిని పెంచి, ఉత్పత్తిని వృద్ధి చేసే కోశ విధానం అవసరం. దీనికి తోడు తరచుగా తలెత్తే ద్రవ్యోల్బణ పరిస్థితులను కూడా అదుపుచేయాల్సిన ఆవశ్యకత కలదు.

**వెనుకబడిన దేశాలలో కోశ విధాన ప్రత్యేక లక్ష్యాలు :**

ఎ) దీర్ఘకాలిక పేదరికం

బి) దీర్ఘకాలిక నిరుద్యోగం

సి) దీర్ఘకాలిక వెనుకబాటు తనం (ఆర్థిక, సాంఘిక విషయాలలో)

డి) ఆదాయ, సంపదలలో విపరీతమైన వ్యత్యాసాలు

అందువలన వెనుకబడిన దేశాల ప్రభుత్వాలు ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేసేందులకు క్రింది కోశ విధాన సాధనాలను అనుసరించాల్సి ఉంటుంది.

ఎ) పన్నులు

బి) ప్రభుత్వ వ్యయం

సి) ప్రభుత్వ రుణాలు మొదలగునవి.

డి) ప్రభుత్వ వ్యయం

సి) ప్రభుత్వ రుణాలు మొదలగునవి

**ఈ సాధనాల సహాయంతో ముఖ్యంగా**

ఎ) ఉద్యోగాలను, ఉద్యోగావకాశాలను సృష్టించటం

బి) మూలధన రూపకల్పన

సి) సంక్షేమ చర్యలు

డి) ఆర్థిక సుస్థిరత మొదలగునవి

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ క్రింది లక్ష్యాలను సాధించేందులకు తగిన కృషి జరగాల్సి వుంటుంది.

**1) కోశ విధానం ద్వారా వనరుల తరలింపు :** అభివృద్ధి చెందుతున్న దేశాలలో సహజ వనరులు సమృద్ధిగానే ఉంటాయి. అయితే ఆ వనరులను పూర్తిగా వినియోగించకపోవటం, లేక దుర్వినియోగ పరచటం లేదా అసలు వినియోగించకపోవటం జరుగుతుంది. కాబట్టి ప్రభుత్వం ముఖ్యంగా ఈ క్రింది విషయాలపట్ల శ్రద్ధ కనబరచాలి.

ఎ) ముందుగా వనరులు ఎక్కడ ఉన్నాయో (సహజవనరులు, మానవ వనరులు ద్రవ్య వనరులు) గ్రహించాలి.

బి) ఆ వనరులను ప్రభుత్వం ఉమ్మడిగా సమీకరించగలగాలి.

సి) అలా తరలించి, సమీకరించిన వనరులను మూలధన రూపకల్పనకు వినియోగించాలి.

డి) అలా సేకరించిన కోశ మరియు ద్రవ్య వనరులను పెట్టుబడి రంగంలో అవసరమైన మార్గాలలోకి తరలించాలి.

ఇ) ముఖ్యంగా అభివృద్ధికి అవసరమైన ఆర్థిక అవస్థాపనా సదుపాయాలను పెంచి తద్వారా వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధిలకు మార్గాన్ని సుగమనం చేయాలి.

ఉదా : ఎ) రైల్వేల నిర్మాణం

బి) విద్యుచ్ఛక్తికి ప్రాజెక్టులు

సి) కమ్యూనికేషన్ల అభివృద్ధి

డి) నీటి పారుదల

ఇ) రవాణా సదుపాయాలను వృద్ధి చేయటం

ఎఫ్) సాంఘిక అవస్థాపనా సదుపాయాలను కూడా సమానంగా అభివృద్ధి చేసేందులకు తగిన పెట్టుబడి పెట్టాలి.

ఉదా : విద్య, వైద్యం, సురక్షిత త్రాగునీరు మరియు పారిశుద్ధ్యం

జి) కోశ సాధనాలను వినియోగించి నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడం.

హెచ్) ప్రైవేటు రంగంలోనికి కూడా వనరుల తరలింపు జరిగేటట్లు చూడటం.

ఐ) పన్నులు. ప్రభుత్వ రుణాలు, స్వదేశీ పొదుపు, ప్రభుత్వ రంగ సంస్థల నుండి వచ్చే ఆదాయం.

జె) లోటు ద్రవ్య విధానము మొదలగు మార్గాల ద్వారా ప్రభుత్వం తనకు కావలసిన కోశ వనరులను సమకూర్చుకుంటుంది.

**2) మూలధన రూపకల్పన మరియు ఆర్థిక వృద్ధి :** మూలధన రూపకల్పన మరియు ఆర్థిక వృద్ధి కోశ విధానం యొక్క మరో రెండు ముఖ్య ఉద్దేశాలుగా చెప్పవచ్చును. మూలధన వనరుల లభ్యతను బట్టే ఆదేశ అభివృద్ధి నిర్ణయింపబడుతుంది. ముఖ్యంగా ప్రభుత్వ రంగంలో మూలదన రూపకల్పన ద్వారా పెట్టుబడి పెట్టి దేశ అభివృద్ధికి కృషి చేయాలి. నిరుత్సాహంగా ప్రైవేటు రంగంలో కూడా మూలధన రూపకల్పన చేయాల్సిన అవసరం వున్నది. దీర్ఘకాలంలో ప్రతిఫలాలనిచ్చే, భారీ వ్యయంతో కూడుకున్న భారీ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ రంగమే పూనుకోవాలి. ప్రైవేటు రంగంలో సాధారణంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టేందులకు వ్యక్తులు ముందుకు రారు. కాబట్టి ప్రభుత్వం ఈ విధమైన నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ రంగంలోని కీలక పరిశ్రమల అభివృద్ధిపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. ప్రైవేటు రంగంలో కూడా పరిశ్రమల స్థాపన జరిగేటట్లు ప్రభుత్వం కృషిచేసి తద్వారా ఉత్పత్తి, ఉద్యోగితా స్థాయిలను పెంచేందులకు కృషి చేయాలి.

ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందులకు కావలసిన సాంఘిక, ఆర్థిక అవస్థాపనా సదుపాయాలపై కూడా పెద్ద మొత్తంలో వ్యయం చేయాల్సి ఉన్నది.

పరిశోధన మరియు అభివృద్ధిలపట్ల అత్యంత శ్రద్ధ కనబరచాలి. దేశ అభివృద్ధికి అత్యంత అవసరమైన ఈ అంశంపై పెట్టుబడులు పెట్టవలసి ఉంటుంది.

ప్రొఫెసర్ రాగ్నార్ నర్క్స్ భావించినట్లు అభివృద్ధి చెందుతున్న దేశాలలో మూలధన రూపకల్పన ద్వారా ప్రభుత్వ విత్తం క్రొత్త ప్రాధాన్యత సంతరించుకున్నది.

**3) వనరుల పున: కేటాయింపు :** ఆర్థికాభివృద్ధికి అరుదైన వనరులను హేతు బద్ధంగా కేటాయించాల్సి వుంటుంది. అందుకనుగుణంగా వనరులను వినియోగంపై తగ్గించి పెట్టుబడి కార్యక్రమాలకు పెంచాల్సిన అవసరం కలదు. జాతీయాదాయంలో పొదుపు శాతం పెంచాల్సి ఉంటుంది. వివిధ పరిశ్రమల మధ్య వనరులను సమర్థవంతంగా వినియోగించి గరిష్ట ప్రయోజనం పొందేందులకు కృషి చేయాలి.

విలాస వస్తువులపై అధికపన్ను విధించాలి. అయితే మూలధన వస్తువులను తయారు చేసే పరిశ్రమలకు పన్నుల మినహాయింపులు, రాయితీలు ఇవ్వాల్సి ఉంటుంది. అలానే నిత్యావసర వస్తువులపై దిగుమతి సుంకాలు తక్కువగా, విలాస వస్తువులపై అధికంగా విధించాల్సి ఉంటుంది.

**4) సంతులిత ప్రాంతీయాభివృద్ధి :** అభివృద్ధి చెందుతున్న దేశాలలో సాధారణంగా ప్రాంతీయ అసమానతలుంటాయి. కాబట్టి వాటిని తొలగించే విధంగా వనరులు కేటాయించి ప్రాంతీయ సమానతలకు పూనుకోవాలి. ముఖ్యంగా గ్రామీణ రంగంలో ప్రజలు నిరక్షరాస్యత, పేదరికం, నిరుద్యోగం మొదలగు సమస్యలతో బాధపడుతుంటారు. కాబట్టి అన్ని ప్రాంతాలతో పాటు, అన్నివర్గాల వారిని కూడా అభివృద్ధి పరచేవిధంగా కోశ విధానం కృషి చేయాలి.

**5) పారిశ్రామికాభివృద్ధి ఆశక్యకత :** అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రాంతీయ అసమానతలను తొలగించాలంటే పారిశ్రామికాభివృద్ధి అత్యవసరం అని చెప్పవచ్చును. తద్వారా ఆయా ప్రాంతాలలో వుత్పత్తిని, ఉద్యోగావకాశాలను పెంచవచ్చు. ప్రజల జీవన ప్రమాణాలను కూడా పెంచవచ్చును. అలానే పారిశ్రామికాభివృద్ధిని సాధించటమే కాక వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధుల మధ్య సంతులిత వృద్ధి సాధించాల్సి ఉంటుంది.

**6) సామాజిక న్యాయం :** అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆదాయ, సంపదల మధ్యగల అసమానతలను కూడా తొలగించాల్సి వుంటుంది. తద్వారా ఆర్థికాభివృద్ధి ఫలితాలను అందరికీ సమానంగా పంచాలి. సంపద, ఆదాయం కేవలం కొద్దిమంది చేతుల్లోనే పరిమితం కాకుండా ప్రజలందరి మధ్యా సమానంగా పంపిణీ చేసే ప్రయత్నం చేయాలి. ధనిక, పేద తారతమ్యాలను తొలగించి అందరికీ కనీస అవసరాలను తీర్చేందులకు కృషి చేయాలి. సమాజ సంక్షేమ కార్యక్రమాలపై అధికంగా వ్యయం చేయాల్సిన అవసరం వున్నది.

**7) ఉద్యోగాల సృష్టి :** అధిక మూలధనం వ్యయం చేస్తే అధిక వుద్యోగావకాశాలు వెంటనే ఏర్పడవు. కాబట్టి కోశ విధానం ద్వారా తక్షణమే వుద్యోగ అవకాశాలను పెంచి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పేద ప్రజల ఉపాధి కల్పించాలి. మహారాష్ట్ర ప్రభుత్వం 'ఉద్యోగం

గ్యారంటీ పథకం' అప్పటి ప్రధాని శ్రీ వి.పి. సింగ్ ఆధ్వర్యంలో ప్రారంభించి తద్వారా వుత్పాదక వుపాధి సదుపాయాలను మెరుగుపరచింది. తద్వారా వుపాధి సదుపాయాలకు కోశ విధానాన్ని వినియోగించదని తెలియుచున్నది.

చిన్న తరహా పరిశ్రమలకు రాయితీలు, గ్రామీణ, కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇచ్చి తద్వారా ఉపాధి అవకాశాలను పెంచేందులకు కృషి జరుగుతున్నది. ముఖ్యంగా శ్రమ సాంద్రత పద్ధతిననుసరించే పరిశ్రమలను ప్రారంభించి తక్కువ మూలధనాన్ని, ఎక్కువ శ్రమను వినియోగించుకోవాలి.

**8) ఆర్థిక సుస్థిరత :** అభివృద్ధి చెందుతున్న దేశాలలో తరచుగా ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం ఏర్పడి ఆర్థిక అస్థిరతను తెస్తున్నాయి. కాబట్టి వ్యాపార చక్రాలను నివారించి, ఆర్థిక సుస్థిరత, పరిపూర్ణ ఉద్యోగితలను సాధించాల్సిన అవసరం చాలా వున్నది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అసలే అభివృద్ధి అంతంత మాత్రంగా ఉంటుంది. దానికి తోడు అస్థిరత కూడా తోడయితే సమస్యలు మరింత తీవ్రతరమవుతాయి.

**9) జనాభా మరియు వనరుల మధ్య సమన్వయం :** అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పెరుగుతున్న జనాభా దేశ అభివృద్ధికి పెద్ద అవరోధంగా నిలిచింది. అయితే వనరులు మాత్రం కొరతగా వుంటాయి. ఉన్న వనరులను సద్వినియోగ పరచుకోవటం కూడా జరగదు. కాబట్టి పెరుగుతున్న జనాభాను అరికట్టి వనరులన్నీ పూర్తిగా సద్వినియోగపరచుకుని తద్వారా దేశాభివృద్ధి సాధించేందులకు ప్రయత్నం చేయాలి.

**అభివృద్ధి చెందుతున్న దేశాల కోశ విధాన లక్ష్యాలు డాక్టరు చెల్లయ్య అభిప్రాయం :**

ఎ) పెట్టుబడి రేటును పెంచుతూ వివిధ కోశ సాధనాల ద్వారా వాస్తవిక వినియోగాన్ని తనిఖీ చేయాల్సిన అవసరం గలదు.

బి) అత్యవసరమనుకున్న సామాజిక కార్యక్రమాల్లోని పెట్టుబడులు ప్రవహించేటట్లు చేయాలి.

సి) ఆర్థిక ప్రణాళికా ధ్యేయాలననుసరించి ప్రజల కొనుగోలు శక్తిని నియంత్రించటం జరగాలి.

డి) ప్రజల దీర్ఘ కాలిక అవసరాల దృష్ట్యా ఆదాయ, సంపదల పంపిణీని సవరించాలి.

రాజా జె. చెల్లయ్య అభిప్రాయం ప్రకారం పన్నులు, ప్రభుత్వ రుణాలు, లోటు ద్రవ్య విధానాలను వినియోగించి ఈ క్రింది లక్ష్యాలను సాధించటానికి వెనుకబడిన దేశాలు కృషి చేయాలి.

ఎ) వినియోగంపై నియంత్రణలు మరియు వినియోగాన్ని నిగ్రహించుకోవటం.

బి) వినియోగం నుండి పెట్టుబడికి వనరులను వ్యాప్తి చేయటం.

సి) పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించేందులకు కొన్ని ప్రోత్సాహకాలను కల్పించటం

డి) పెట్టుబడి తరహాలో మార్పులు తెచ్చి తద్వారా మూలధన రూప కల్పన చేయాలి.

ఇ) ప్రైవేటు రంగం నుండి దేశ ఖజానాలోకి వనరులను తరలించి తద్వారా ప్రభుత్వ రంగ పెట్టుబడులను ప్రోత్సహించాలి.

ఎఫ్) ఆదాయ, సంపదల మధ్య వ్యత్యాసాలను తొలగించాలి.

## 11.5. కోశ సాధనాలు - పనితీరు

కోశవిధానాన్ని అమలు పరచేందులకు ప్రభుత్వానికి పదునైన విత్త సాధనాలు కూడా అవసరం. వాటిలో ముఖ్యమైనవి.

ఎ) పన్నులు

బి) ప్రభుత్వవ్యయం

సి) ప్రభుత్వ రుణం

డి) రుణ యాజమాన్యం

ఇ) లోటు ద్రవ్య విధానం

**ఎ) పన్నులు :** కోశ సాధనాలలో అతి ముఖ్యమైనవి పన్నులు. పన్నులు ఈ క్రింది రెండు విధాలుగా విభజించవచ్చును.

ఎ) ప్రత్యక్ష పన్నులు

బి) పరోక్ష పన్నులు

ప్రజల ఆదాయాలమీద, సంస్థల ఆదాయాలమీద వ్యక్తిగత ఆదాయ పన్ను, కార్పొరేషన్ పన్నులు చెల్లించబడతాయి. వీటిని ప్రత్యక్ష పన్నులు అంటాము. ధనికుల మీద అధిక భారాన్ని మోపే ఈ పన్నుల వల్ల ఆదాయ, వ్యత్యాసాలు కొంత వరకు తగ్గించాలి. ఈ పన్నుల భారం వేరే వ్యక్తుల మీదకు తరలించే అవకాశం లేదు.

వస్తు సేవల మీద విధించే ఎక్సైజ్ సుంకాలు, కస్టమ్స్ సుంకాలవలన పరోక్షంగా ప్రభుత్వం కొన్ని పన్నులు విధించుచున్నది. సాధారణంగా ఈ పన్నులు ధరలతో కలిసి వుంటాయి. కాబట్టి ఎంత పన్ను చెల్లిస్తున్నామనే విషయం పన్ను చెల్లింపుదారులకు కూడా తెలియదు, వ్యాపారస్తులు, ఉత్పత్తి దారుల మీద విధించబడే ఈ పన్నులు పరోక్షంగా వినియోగదారులమీదకు తరలించబడతాయి.

**పన్నుల ఉద్దేశాలు :**

ఎ) ఆదాయ, వ్యత్యాసాలను తొలగించటం.

బి) విలాస వస్తువులపై అధికపన్ను, నిత్యావసర వస్తువులపై తక్కువ పన్నులు విధింపబడతాయి.

సి) వినియోగాన్ని తగ్గించి పెట్టుబడిని పెంచటం

డి) ప్రభుత్వానికి కావలసిన విత్తాన్ని పన్నుల రూపంలో సమకూర్చుకోవటం

ఇ) సమానత్వం, వ్యాకోచిత, పొదుపు, ప్రయోజనం, పన్ను చెల్లించే శక్తి, చెల్లింపుదారులకు వీలు, సమన్వయం, దేశమంతటా ఒకే పన్ను రేటు మొదలగు నియమాలననుసరించి పన్ను విధింపు జరగాలి.

ఎఫ్) పన్నుల ఎగవేత లేకుండా, అందరూ విధిగా పన్ను చెల్లించాలి.

ద్రవ్యోల్బణ సమయంలో అధిక పన్నులు, ఆర్థిక మాంద్యం వచ్చినపుడు తక్కువ పన్నులు విధించాలి. తద్వారా ఆర్థిక అస్థిరతను నివారించి సుస్థిరతను ఏర్పాటు చేయవచ్చును. ప్రజలచేతిలో పెట్టుబడి పెట్టేందులకు, కనీస అవసరాలను తీర్చేందులకు సరిపడా వనరులుంచే విధంగా పన్నుల విధానాన్ని తీర్చిదిద్దాలి.

**బి) ప్రభుత్వ వ్యయం :** ద్రవ్యోల్బణ సమయంలో ప్రభుత్వ వ్యయాన్ని వీలైనంత వరకు అదుపుచేసి, తద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలి. అయితే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినప్పుడు ప్రజల జీవన ప్రమాణాలు తగ్గకుండా అవసరమైతే ఉద్యోగులకు కరువు భత్యం, నిత్యావసర వస్తువుల దిగుమతులపై మాత్రం ప్రభుత్వం వ్యయం చేయాల్సి వుంటుంది. పేద ప్రజలకు కొద్దిగా సబ్సిడీలివ్వాల్సి వుంటుంది. మొత్తం మీద ద్రవ్యోల్బణ సమయంలో ద్రవ్య సప్లయి ఏమాత్రం పెరగకూడదు. కాబట్టి ప్రభుత్వ వ్యయం కూడా చాలా మితంగా వినియోగించాలి. అభివృద్ధికి కీలకమైన, ముఖ్యమైన కొన్ని విధులను నిర్వర్తించటానికి మాత్రమే ప్రభుత్వ వ్యయాన్ని వినియోగించాల్సి ఉంటుంది.

ఆర్థిక మాంద్యం వచ్చినపుడు మాత్రం ప్రభుత్వ వ్యయాన్ని పెంచి తద్వారా, మందకొడిగా వున్న ఉత్పత్తి, ఉపాధి సదుపాయాలను పెంచాల్సిన అవసరం వున్నది. తద్వారా ప్రజల ఆదాయాలను, కొనుగోలు శక్తిని, సార్థక డిమాండును, ధరలను, లాభాలను పెంచవచ్చు. ప్రభుత్వం సబ్సిడీలిచ్చి, పెట్టుబడిదారులు వుత్పత్తి కార్యక్రమాలను, ప్రజలు స్వయం ఉపాధి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం వున్నది.

అయితే ప్రభుత్వ వ్యయాన్ని వినియోగంపై కాక ఉత్పత్తి కార్యక్రమాలపై వెచ్చిస్తే అధిక ప్రయోజనం దక్కుతుంది. ప్రభుత్వ వ్యయం విపరీతంగా పెరిగితే ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం వున్నది. అందువలన ప్రభుత్వ వ్యయం సమర్థవంతంగా ఉత్పాదక కార్యక్రమాల మీదే వ్యయం చేయాల్సి వుంటుంది.

సి) ప్రభుత్వ రుణం : వ్యక్తుల వలే ప్రభుత్వం కూడా ఒక్కో సందర్భంలో రుణం తీసుకోవలసి వుంటుంది. ఈ రుణాలు రెండు విధాలుగా వుంటాయి.

1) అంతర్గత రుణాలు 2) బహిర్గత రుణాలు

1) అంతర్గత రుణాలు : వ్యక్తుల నుండి, బాంకుల నుండి, ఆర్థిక సంస్థల నుండి, యల్.ఐ.సి.ల నుండి జీవిత భీమా సంస్థల నుండి, రిజర్వు బాంకు నుండి ఈ రుణాలు సేకరించవచ్చును. షరతులు లేకుండా ఈ రుణాలను ప్రభుత్వం స్వీకరించవచ్చును.

2) బహిర్గత రుణాలు : అంతర్జాతీయ బాంకుల నుండి, విదేశాల నుండి పెద్ద మొత్తంలో రుణాలు సేకరించవచ్చును. ఆంక్షలు, షరతులకు లోబడి ఈ రుణాలు తీసుకోవలసి వుంటుంది.

ద్రవ్యోల్బణ సమయంలో ప్రజల దగ్గరున్న అదిక మొత్తాన్ని ప్రభుత్వం చేతిలోకి తెచ్చుకునేందులకు అంతర్గత రుణాలను స్వీకరిస్తుంది. ఆర్థిక మాంధ్యం వచ్చినపుడు విదేశీ రుణాలు, అంతర్జాతీయ రుణాలు కూడా స్వీకరించవచ్చును.

డి) రుణ యాజమాన్యము : ప్రభుత్వ రుణాల రూపంలో అప్పులు తీసుకోవటం, తిరిగి చెల్లించే తీరు ఆర్థిక వ్యవస్థపై ఎటువంటి చెడు ప్రభావాన్ని కలిగించకుండా వుండేటట్లు చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని చెప్పవచ్చును. రుణ వ్యవహారాలన్నీ ద్రవ్యోల్బణ, ఆర్థిక మాంధ్యాలను దేశం నుండి తొలగించి ఆర్థిక సుస్థిరతను ఏర్పాటు చేసేందులకు కృషి చేయటమే రుణ యాజమాన్యం అంటారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కొన్ని నియమాలు పాటించాల్సి వుంటుంది.

**రుణ యాజమాన్య నియమాలు :**

ఎ) ప్రభుత్వ రుణాలపై వడ్డీ రేటు తక్కువగా వుండాలి.

బి) పెట్టుబడి అవసరాలను తీర్చగలగాలి.

సి) స్వల్పకాలిక రుణాలను దీర్ఘకాలిక రుణాలుగా మార్చుట.

డి) ప్రభుత్వ రుణ విధానం, కోశ, ద్రవ్య విధానాలతో సమన్వయ పరచుట.

ఇ) వీలైనంత పరిమితంగా కఠిన షరతులు విధించే విదేశీ రుణాలను తీసుకొనుట.

స్వదేశీ రుణాలను ఆర్థిక మాంధ్యం సమయంలో ప్రభుత్వం తిరిగి చెల్లిస్తే ప్రజల వినియోగ శక్తి, సార్థక డిమాండులను పెంచుకొనవచ్చును. విదేశీ రుణాలను తిరిగి చెల్లించినపుడు ఆ డబ్బు దేశం దాటి వెళుతుంది. కాబట్టి మనదేశ అభివృద్ధికి ఏ విధంగానూ ఉపకరించదు. అదే స్వదేశీరుణాలు తిరిగి చెల్లిస్తే ఆ డబ్బు స్వదేశంలోనే వుంటుంది కాబట్టి ఎటువంటి ఇబ్బందీ వుండదు.

అలానే రుణ భారం భావితరాలకు తరలించటం పట్ల చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి వుంటుంది. ఏమైనప్పటికి రుణ యాజమాన్యం కూడా దేశంలో ఆర్థిక సుస్థిరత ఏర్పరచేందులకు సహకరించాలి. వీలైనంత కనిష్ట రుణంతో గరిష్ట సామాజిక ప్రయోజనం వుండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి.

**ఇ) లోటు** ద్రవ్య విధానం : ప్రభుత్వ ఆదాయ వనరులలో కొరత ఏర్పడినపుడు, ఆ కొరతను నివారించేందులకు ప్రభుత్వం రిజర్వుబాంకు ద్వారా లోటు ద్రవ్య (డెఫిసిట్ ఫైనాన్సింగ్) విధానానికి పూనుకుంటుంది. ప్రభుత్వ వ్యయం ప్రభుత్వ ఆదాయాన్ని మించి వున్నపుడు ప్రభుత్వం లోటు ద్రవ్య విధానాన్ని ఈ క్రింది విధంగా ఉపయోగిస్తుంది.

ఎ) కేంద్ర బాంకునుండి అప్పులు తీసుకొనుట

బి) కేంద్ర (రిజర్వు) బాంకు కూడబెట్టిన కాష్ బాలెన్సెస్‌ను ప్రభుత్వం డ్రా చేయటం.

సి) కేంద్ర బాంకు డబ్బును క్రొత్తగా ముద్రించి ఆర్థిక వ్యవస్థలోకి పంపించటం.

పై పద్దతుల్లో ఏ పద్దతిని అవలంభించయినా క్రొత్త ద్రవ్యాన్ని సృష్టించి తద్వారా ప్రభుత్వం లోటును పూరించుకొనవచ్చును. ఆర్.ఎన్ త్రిపాఠి అభిప్రాయం ప్రకారం ప్రభుత్వ బడ్జెట్‌లో ఆదాయ వ్యయాల మధ్య వ్యత్యాసాన్ని తొలగించేందులకు ప్రభుత్వం ద్రవ్య సప్లయిని పైన పేర్కొన్న మార్గాల ద్వారా పెంచటాన్ని లోటు ద్రవ్య విధానం అంటాము. జె.ఎమ్. కీన్స్ ఆర్థిక మాంధ్యాన్ని నివారించి ఉత్పత్తి, ఉద్యోగావకాశాలను పెంచేందులకు వాడే కోశ సాధనంగా పేర్కొన్నాడు.

యుద్ధ సమయంలో, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ఈ లోటు ద్రవ్య విధానాన్ని మోతాదు మించకుండా వాడాల్సి వుంటుంది. అత్యవసర పరిస్థితులలోనే వాడాల్సిన ఈ సాధనాన్ని లోటు వచ్చినప్పుడెల్లా వాడితే ద్రవ్యోల్బణాన్ని పెంచుతుంది.

లోటు ద్రవ్య విధానం అగ్నివలే మంచి సేవకుడు, అయితే చెడు యజమాని, కాబట్టి అతిగా ద్రవ్యాన్ని ముద్రించి ద్రవ్యోల్బణాన్ని ఆహ్వానించకుండా కొన్ని పరిమితులకు లోబడి ఈ సాధనాన్ని వినియోగించాల్సి వుంటుంది.

## 11.6 కోశ విధానం ద్వారా ఆర్థిక సుస్థిరత :

కీన్స్ సిద్ధాంతం ప్రకారం ఒక వ్యక్తి చేసే వ్యయం వేరొక వ్యక్తికి ఆదాయమవుతుంది. ప్రతి వ్యక్తి తన ఆదాయాన్ని వినియోగ వస్తువుల కొనుగోలుపై గానీ లేక సేవలపై గానీ వ్యయం చేయవచ్చు. లేదా ఉత్పత్తిని పెంచేందులకు పెట్టుబడి వస్తువులపై కూడా వ్యయం చేయవచ్చును. $Y= C+I$

వ్యక్తుల మొత్తం వ్యయము (Y) = వినియోగ వస్తువులు (C) + పెట్టుబడి వస్తువులు (I)

ఆర్థిక సుస్థిరతకు సమిష్టి సప్లయి, సమిష్టి డిమాండులు కూడా సమానంగా వుండాలి. పొదుపు పెట్టుబడులు కూడా సమానంగా వుండాలి. సార్థక డిమాండు ఉంటే పరిపూర్ణ ఉద్యోగితను కూడా సాధించ వచ్చును.

తద్వారా దేశంలో ఆర్థిక సుస్థిరత చోటుచేసుకుంటుంది.

సార్థక డిమాండు (Ed) = జాతీయాదాయం (Y) = జాతీయోత్పత్తి విలువ = మొత్తం వ్యయము = వినియోగ వస్తువులపై వ్యయము + పెట్టుబడి వస్తువులపై వ్యయం.

$E_d = y = C + 1$

ఒక్కో సందర్భంలో ఆదాయాన్ని వినియోగం వస్తువులపై కానీ, పొదుపు (S) పై కానీ వ్యయం చేయవచ్చు.

కాబట్టి

$Y = C + S$ అని కూడా చెప్పవచ్చును.

$Y = C + I$ ................. (1)

$Y = C + S$ .................. (2)


1) మరియు 2) సమీకరణాల నుండి

$\not{C} + I = \not{C} + S$

పెట్టుబడి (1) = పొదుపు (S)

మొదటి దశలో ఆదాయాన్ని వినియోగాన్ని (C) మరియు పెట్టుబడి (I) వస్తువులపై వ్యయం చేయబడుతుంది. రెండవ దశలో ఆదాయం ఇంకా పెరిగినపుడు వినియోగ వస్తువులపై (C) మరియు పొదుపు (S) పై వినియోగించబడుతుందని, చివరకు పొదుపు, పెట్టుబడులు సమానమవుతాయని పై సమీకరణాలు చెబుతున్నాయి. అప్పుడు పరిపూర్ణ ఉద్యోగిత ఏర్పడి, ఆర్థిక సుస్థిరత సాధించబడుతుంది.

**ఆర్థిక అస్థిరత ఏర్పడే పరిస్థితులు :** ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం ఏర్పడినపుడు ఆర్థిక అస్థిరత చోటు చేసుకుంటుంది. కీన్స్ అభిప్రాయం ప్రకారం ఆర్థిక వ్యవస్థ సమతౌల్య పరిస్థితిలో ఉండాలంటే ప్రజలు పొందే ఆదాయం (Y), వినియోగ వస్తువులు (C), పెట్టుబడి వస్తువులపై (I) పై పెట్టే వ్యయంతో సమానమవుతుంది. ఈ పరిస్థితిని క్రింది రేఖా చిత్రం ద్వారా తెలియజేయ వచ్చును.



పై పటంలో X అక్షంపై ఆదాయం, Y అక్షంపై వినియోగ వస్తువులు మరియు పెట్టుబడి వస్తువులు తీసుకొనబడినాయి. C రేఖ వినియోగ వస్తువులపై వ్యయాన్ని C+1 రేఖ వినియోగ పెట్టుబడి వస్తువులపై వ్యయాన్ని తెలుపుతున్నాయి. ఆదాయం 'O' అయినప్పటికీ, వినియోగ వ్యయం తప్పనిసరిగా కొంత వుంటుంది. కాబట్టి వినియోగ రేఖ మూలం నుండి కాక Y అక్షంకు కొంచెం పై భాగం నుండి మొదలవుతుంది. Z రేఖ ఆదాయం క్రమేపీ పెరుగుతున్నట్లు తెలియజేస్తున్నది. కాబట్టి దీనిని ఆదాయరేఖ (Z) అంటాము.

**ఆర్థిక సుస్థిరత :** Z రేఖ C+1 రేఖను A అనే బిందువు వద్ద ఖండించింది. ఇక్కడ Y = C+1

సమిష్టి సప్లయి = సమిష్టి డిమాండు = సార్థక డిమాండు = పరిపూర్ణ వుద్యోగిత

పొదుపు = పెట్టుబడి

కాబట్టి $OY_1$ ఆదాయం వద్ద దేశంలో ఆర్థిక సుస్థిరత వున్నదని చెప్పవచ్చును.

**ఆర్థిక అస్థిరత :**

**ఎ) ద్రవ్యోల్బణం :** OYb ఆదాయం వద్ద C+1 రేఖ ఆదాయరేఖ (Z) కంటే పైవైపున వున్నది. కాబట్టి $E_1 A_1$ మేరకు ఆదాయం కంటే వినియోగ, పెట్టుబడి వస్తువుల పై వ్యయం అధికంగా వున్నవని చెప్పవచ్చును.

C+1 > Z,

పొదుపు తగ్గినందున S<I

సమష్టి సప్లయి < సమిష్టి డిమాండు

అధిక డిమాండువలన సమిష్టి సప్లయి తక్కువగా వుంటుంది. తద్వారా ధరలు కూడా విపరీతంగా పెరిగి ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. అసమతౌల్యం ఏర్పడుతుంది. దీనినే ఆర్థిక అస్థిరత అంటారు.

**బి) ఆర్థిక మాంధ్యం :** Oya ఆదాయం వద్ద C+1 రేఖ కంటే ఆదాయరేఖ (Z) పై వైపున వున్నది. కాబట్టి $E_2 A_2$ మేరకు ఆదాయం వినియోగ పెట్టుబడి వస్తువులు (C+1) పై వ్యయం కంటే అధికంగా వున్నదని తెలియుచున్నది.

C+1 < Z


పొదుపు పెరిగినందున

S>1 అవుతుంది.

సమిష్టి సప్లయి < సమిష్టి డిమాండు.

సార్థక డిమాండు లోపిస్తుంది. పెరిగిన ఆదాయాన్ని వినియోగ, పెట్టుబడి వస్తువులపై వ్యయం చేయకుండా పొదుపుకు ప్రాధాన్యత నివ్వటం అస్థిరతకు దారి తీస్తుంది. ఈ పరిస్థితిలో ఆర్థిక మాంధ్యం చోటు చేసుకుంటుంది. నిరుద్యోగం కూడా ఏర్పడుతుంది. ఆర్థిక కార్య కలాపాలన్నీ మందకొడిగా తయారవుతాయి. కాబట్టి ఈ పరిస్థితిని కూడా ఆర్థిక అస్థిరత అని పిలవవచ్చును.

**కోశ విధానం ద్వారా ఆర్థిక సుస్థిరత సాధించుట :** ఆర్థిక మాంధ్యం ఏర్పడినపుడు, దేశంలో ఆర్థిక సుస్థిరతను ఎలా ఏర్పాటు చేయాలి? అనే అంశంపై కీన్స్ విశేషమైన కృషి చేశాడు. ఆర్థిక వ్యవస్థలో నష్ట పూరక లేక పరిపూరక విత్తం ద్వారా గుణక ప్రభావంతో ఏ విధంగా సమతౌల్య పరిస్థితిని తీసుకురావచ్చో పరిశీలించాల్సిన అవసరం గలదు.




ΔI = ప్రభుత్వ వ్యయ పెరుగుదల

పై పటంలో చూపిన విధంగా C+I రేఖ వినియోగం మరియు పెట్టుబడి వస్తువులపై వ్యయాన్ని తెల్పుతుంది. C+I రేఖకు అదనంగా కొంత పెట్టుబడిని కలిపి C+I+ I రేఖను కూడా గీయాల్సి వుంటుంది. C+I రేఖకు C+I+ I రేఖ సమాన దూరంలో వుండి ఎక్కడ చూసినా ప్రభుత్వ వ్యయంలోని పెరుగుదల సమానమని తెలియజేస్తున్నది.

ఆదాయం $OY_1$ ఉన్నప్పుడు ఆర్థిక వ్యవస్థ సమతౌల్య పరిస్థితిలో వున్నట్లు తెలియుచున్నది. $OY_1$ ఆదాయాలలోనికి లోపు వ్యయం ఆదాయాన్ని మించి ద్రవ్యోల్బణాన్ని సూచిస్తున్నది. $OY_1$ ఆదాయాన్ని మించితే ఆదాయం వ్యయం కంటే అధికంగా వుండి ఆర్థిక మాంద్యాన్ని సూచిస్తున్నది. ఇదే విషయం మొదటి రేఖా చిత్రంలో కూడా సూచించబడింది.

కీన్స్ పరిపూరక లేక నష్ట పూరక విత్త సిద్ధాంతం అభివృద్ధి చెందిన దేశాలలో ఆర్థిక మాంద్యాన్ని నివారించేందులకు మాత్రం చక్కగా వుపకరిస్తుంది. అయితే అభివృద్ధి చెందిన లేక చెందుతున్న దేశాలలో ద్రవ్యోల్బణాన్ని ఏ విధంగా అరికట్టవచ్చనే ప్రశ్నకు సంతృప్తికర సమాధానాన్నివ్వలేదు. కాబట్టి పరిపూరక విత్త సిద్ధాంతం ఆర్థిక అస్థిరతలో మాంధాన్ని మాత్రమే నివారించగలదు. కానీ ద్రవ్యోల్బణ పరిస్థితులలో ఏవిధంగా పనిచేస్తుందో వివరణ ఇవ్వబడలేదు.

అభివృద్ధి చెందిన దేశాలలో తరచుగా ఆదాయం వ్యయాన్ని మించి పెరగటం వలన ఉపాంత వినియోగశక్తి (MPC) తగ్గి, ఉపాంత పొదుపు శక్తి పెరగటం జరుగుతుంది. కాబట్టి కీన్స్ వివరించిన విధంగా ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది.

**ఆర్థిక మాంధ్యాన్ని ఎలా ఎదుర్కొవాలి? :** కీన్స్ ఈ అంశం మీద ఎక్కువ శ్రద్ధ కనబరచాడు. **1930**లలో ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఆర్థిక మాంధ్యం అతని సమకాలిక సమస్య కాబట్టి పూర్తి అవగాహనతో ఆర్థిక మాంధ్యాన్ని ఎదుర్కొనేందులకు కోశసాధనాలు ఏ విధంగా పనిచేయాలో విశదీకరించినాడు. ఆ పరిస్థితులలో ప్రభుత్వం ఆర్థిక మాంధ్యాన్ని నివారించేందులకుగాను అదనపు పెట్టుబడిని ( I) పెట్టి, గుణక ప్రభావంతో ఆదాయాన్ని ఏ విధంగా పెంచి ఆర్థిక సుస్థిరతను ఏర్పాటు చేసుకోవచ్చునో చక్కగా వివరించినాడు.

ఆదాయం వ్యయాన్ని మించినపుడు ఆర్థిక మాంధ్యం మొదలవుతుంది. ప్రభుత్వం తన కోశ సాధనాలతో ఆర్థిక మాంధ్యాన్ని నివారించి సమతౌల్య పరిస్థితిని ఏర్పాటు చేసేందులకు కృషి చేస్తుంది. ప్రభుత్వం తన పెట్టుబడి వ్యయాన్ని ( I ) పెంచి, తద్వారా కొన్ని ప్రజాహిత లేక ప్రజోపయోగ కార్యక్రమాలను చేపడుతుంది. ఈ వ్యయాన్ని లోటు ద్రవ్య విధానం ద్వారా పొందవచ్చును. కాబట్టి ఆదాయం $OY_1$ నుండి $OY_2$ స్థాయికి గుణక ప్రభావం వలన పెరుగుతుంది. గుణక ప్రభావంతో పెరిగిన ఆదాయాన్ని $OY_2$- $OY_1$ గా అనగా $Y_1Y_2$ గా రెండవ రేఖా చిత్రంలో సూచించినాము. పెరిగిన ఈ ఆదాయాన్ని X అక్షానికి సమాంతరంగా AE గా కూడా సూచించవచ్చును. లేదా Y అక్షానికి సమాంతరంగా BE గా కూడా సూచించవచ్చును.

రెండవ రేఖా చిత్రంలో పెట్టుబడి వ్యయాన్ని BD మేరకు పెంచగా, ఆదాయం పెరుగుదల BE గా సూచించబడింది. కాబట్టి BE=AE అని చెప్పవచ్చును.

**అంతే కాక** C+1 రేఖ వాలు ఉపాంత వినియోగశక్తి (MPC) ని సూచిస్తున్నది. ఉదాహరణకు MPC విలువ **75%** అని భావిస్తే $\frac{75}{100} = \frac{3}{4}$ అవుతుంది. కీన్స్ ప్రకారం గుణకం విలువ ఈ క్రింది విధంగా లెక్కించవచ్చును.

$$K = \frac{1}{1 - MPC} = \frac{1}{MPC} = \frac{1}{1 - \frac{3}{4}}$$

$$= \frac{1}{\frac{4-3}{4}} = \frac{1}{\frac{1}{4}} = \frac{1}{1} x \frac{4}{1} = 4$$

K = గుణకం

MPC - ఉపాంత వినియోగశక్తి

MPS - ఉపాంత పొదుపు శక్తి

MPC విలువ ఎక్కువగా వుంటే గుణకం విలువ కూడా ఎక్కువగా వుంటుంది. MPC విలువ తగ్గినపుడు గుణకం విలువ కూడా తగ్గుతుంది. కాబట్టి గుణకం విలువ, MPC రెండూ ధనాత్మక సంబంధం కలిగియున్నాయని తెలియుచున్నది. గుణకం MPC రెండూ రుణాత్మక సంబంధం కలిగియున్నాయని కూడా తెలియుచున్నది. పై ఉదాహరణను బట్టి గుణక సిద్ధాంతం ప్రకారం ఆదాయంలో నాలుగింతలు పెరుగుదల వున్నట్లు తెలియుచున్నది. రేఖా చిత్రంలో కూడా BE విలువ BD కి నాలుగింతలున్నట్లుగా సూచించబడినది.

## 11.7. ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో కోశ విధానం :

1951 ప్రణాళికల ద్వారా దేశ అభివృద్ధి సాధించేందులకు మన దేశంలో అవిరళ కృషి జరుగుతున్నది. సాంఘిక వస్తువుల నందించేందులకు కావలసిన పెట్టుబడిని సమకూర్చేందులకు, జాతీయ ప్రాధాన్యతను బట్టి వనరులను కేటాయించేందులకు, ప్రైవేటు పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించేందులకు, ఆర్థిక సుస్థిరతలను ఏర్పాటు చేసేందులకు కోశ విధానం బహుముఖ పాత్రను నిర్వర్తించాలని ఏడవ ప్రణాళికా కాలంలో ప్లానింగ్ కమీషన్ పేర్కొన్నది.

మన దేశంలో కోశ విధానం ముఖ్యంగా రెండు విధాలుగా దేశ అభివృద్ధిని ప్రభావితం చేస్తున్నది.

ఎ) ఆర్థికాభివృద్ధికి కావలసిన వనరులను తరలించటం

బి) వనరుల కేటాయింపులో సమర్థతను మెరుగుపరచటం

**కోశ విధానం - వనరుల తరలింపు :** పన్నుల రాబడిని పెంచుకోవటంలో మన దేశం అవిరళ కృషి చేస్తున్నది. 1950-51లో ప్రణాళికలు ప్రారంభించినపుడు పన్ను - స్థూల జాతీయోత్పత్తి నిష్పత్తి కేవలం 6.0% మాత్రమే వున్నది. 1991-92 నాటికి ఈ నిష్పత్తి 15.7%కు పెరిగింది. కానీ 2000-01లో 14.6%కు తగ్గింది. తక్కువ తలసరి ఆదాయంగల మనదేశం వంటి దేశాల్లో కూడా పన్నుల రాబడిని గణనీయంగా పెంచగల్గటం కోశ విధాన విజయంగా పేర్కొనవచ్చును. అలానే ఆదాయపన్ను మరియు భూమి రెవిన్యూలు గణనీయంగా పెరిగాయి. మన స్థూల జాతీయోత్పత్తిలో ప్రత్యక్ష పన్నుల ద్వారా వచ్చిన రాబడి 4.1% వరకు వున్నది. అయితే పన్నుల ఎగవేతకూడా భారీగా పెరగటం శోచనీయం. స్థూల జాతీయోత్పత్తిలో నల్లధనం దాదాపు 40% వరకు వున్నట్లు తెలియుచున్నది. వ్యవసాయ ఆదాయాలపై పన్నులు లేకపోవటం వలన మిగులు ఆదాయాన్ని వ్యవసాయ ఆదాయంగా చూపించుకొని చాలా మంది వ్యాపార వేత్తలు, అక్రమార్జనలుగల వుద్యోగులు, వ్యక్తిగత ఆదాయ పన్ను నుండి మినహాయింపు పొందుతున్నారు. ఇంకా స్టాక్ బ్రోకర్లు వివిధ వృత్తుల్లో వున్నవారు, ప్రభుత్వ అధికారులు మరియు రాజకీయ వేత్తలు పన్నుల ఎగవేతకు పూనుకుంటున్నారు. పలుకుబడిగల వ్యక్తులు పన్నుల ఎగవేతకు ప్రయత్నిస్తున్నారు. కాబట్టి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సి వుంటుంది. దీనికిగాను ప్రతి బడ్జెట్‌లోను కొన్ని పథకాలు ప్రత్యేకంగా నల్లధనాన్ని రూపుమాపేందులకు ప్రవేశపెట్టబడుతున్నాయి. ఇంకా పన్నుల విధానంలో మార్పులకు సంబంధించి 1991లో నియమించిన పన్నుల సంస్కరణ కమిటీ రాజా జె. చెల్లయ్య ఆధ్వర్యంలో విలువైన సూచనలు చేసింది. అలానే 2002లో వచ్చిన కేల్కార్ కమిటీ కూడా పన్నుల విధానంలో కొన్ని విప్లవాత్మకమైన మార్పులు ప్రతిపాదించింది.

**పెరుగుతున్న పొదుపు రేటు :** నాల్గవ ప్రణాళికా కాలం నుండి ప్లానింగ్ కమీషన్ ప్రజల పొదుపు రేటును పెంచేందులకు గణనీయమైన కృషి జరుగుతున్నది. 1980లో స్థూల జాతీయోత్పత్తిలో ప్రజల పొదుపు 3.4% మాత్రమే వున్నది. గత కొద్ది సంవత్సరాలుగా ప్రజల పొదుపు రేటు స్థూల జాతీయోత్పత్తిలో బాగా తగ్గింది. 1998-99, 1999-2000 మరియు 2000-01 సంవత్సరాలలో రుణాత్మకంగా వున్నట్లు కూడా తెలియుచున్నది. వ్యయం విపరీతంగా పెరగటం ఆదాయ తరలింపులో ఉన్న బలహీనతల వలన ప్రజల పొదుపురేటు అసంతృప్తి కరంగా వున్నది.

**పెరుగుతున్న నష్టాలు :** కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు నష్టాల బాటలో నడవటం వలన ప్రభుత్వాలకు రావలసిన రాబడి చాలా వరకు తగ్గుతున్నది. ఒక ప్రక్క పెరుగుతున్న వ్యయం, మరో ప్రక్క ఖాయిలాపడిన పరిశ్రమల వల్ల ప్రభుత్వ ఖజానాకు భారాన్ని మోపుతున్నాయి.

**కోశవిధానం మరియు కేటాయింపులలో సమర్థత :** ఒక దేశ ఆర్థికాభివృద్ధికి వనరుల కేటాయింపు చాలా అవసరము. సమర్థవంతమైన, హేతుబద్ధమైన వనరుల కేటాయింపు ద్వారా దేశ ఆర్థికాభివృద్ధిని పెంచవచ్చును. పన్నుల విధానం ఉత్పత్తి కార్యక్రమాలపై రుణాత్మక ప్రభావాన్ని కలుగజేయకుండా చూడాలి. 2000-01లో పరోక్ష పన్నుల శాతం మొత్తం పన్నుల రాబడిలో 72% కు పెరిగింది. ఈ మొత్తం 1990-91లో కేవలం 84% మాత్రమే వున్నది. కాబట్టి ప్రభుత్వానికి రాబడి నందించటంలో పరోక్ష పన్నులు కీలక పాత్రను నిర్వహిస్తున్నాయని తెలియుచున్నది.

**కోశవిధానం - సమానత్వం :** కోశ విధానం ద్వారా మన దేశంలో సమానత్వాన్ని సాధిస్తుందనటంలో చాలా సందేహాలున్నాయి. గత అయిదు దశాబ్దాలు ప్రణాళికా విధానంలో ప్రత్యక్ష పన్నుల వాటా మొత్తం పన్నుల రాబడిలో 40% నుండి 28% వరకు తగ్గింది. వ్యక్తిగత ఆదాయపన్నుల వాటా 21% నుండి 9% కు తగ్గింది. హెచ్.హెచ్. హిన్‌రిచ్‌స్ చాలా అభివృద్ధి చెందుతున్న దేశాలలో మొత్తం పన్నుల రాబడికి ప్రత్యక్ష పన్నుల రాబడి పెరుగుతున్నట్లు పేర్కొన్నాడు. అయితే మన దేశంలో ఇందుకు వ్యతిరేక ధోరణి కన్పిస్తున్నది. ఈ విషయంలో భారతదేశ అనుభవం గురించి రాజా జె. చెల్లయ్య వివరంగా అధ్యయనం చేశాడు. ధనికుల మీద పన్నుల భారాన్ని మోపటం పట్ల ప్రభుత్వం నిర్లిప్తంగా వుందని పేర్కొన్నాడు.

రాజా జె. చెల్లయ్య మరియు ఆర్. ఎన్ లాల్‌లు పరోక్ష పన్నుల భారం మనదేశ ప్రజల కుటుంబ వ్యయం మీద బాగా వున్నదని పేర్కొన్నారు. ఆదాయం పెరిగే కొలది పరోక్షపన్నుల భారం కూడా అధికంగా వుండి పురోగామి పన్ను విధానాన్ని సూచిస్తున్నదని పేర్కొన్నారు.

**1985 - దీర్ఘ కాలిక కోశ విధానము :** 7వ ప్రణాళికతో పాటుగా దీర్ఘ కాలిక కోశ విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. డిసెంబర్, 19, 1985న ఈ దీర్ఘకాలిక కోశ విధానం ప్రకటింపబడింది. ద్రవ్యోల్బణాన్ని కనిష్ట స్థాయికి తేవటమే ముఖ్య ధ్యేయంగా పేర్కొన వచ్చును.

**ప్రభుత్వం ఆశించిన ప్రయోజనాలు :**

ఎ) సంవత్సరిక బడ్జెట్ ఒక నిర్దుష్ట దిశ దశను కల్పించాలి.

బి) ప్రభుత్వం పరిపాలనపై విధించిన భౌతిక నియంత్రణలను క్రమేపీ తగ్గించి సిద్ధాంతపరమైన ద్రవ్య విధానాలకు కావలసిన పరిస్థితులను యేర్పాటు చేయాలి.

సి) మనదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో కోశ విధానం, ద్రవ్య విధానం, పారిశ్రామిక విధానం మరియు వాణిజ్య విధానం కలిపి సమన్వయపరుస్తూ ఆర్థిక విధానాన్ని సమర్థవంతంగా సమన్వయం చేయాలి.

డి) దీర్ఘ కాలిక కోశ విధానం ఏడవ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలు మరియు సంవత్సరిక బడ్జెట్‌లకు మధ్య బ్రిడ్జిగా పని చేయాలని నిర్ణయించబడింది. ఏడువ ప్రణాళికా కాలంలో ప్రణాళికేతర వ్యయం లక్ష్యాన్నిమించి పెరిగిపోయింది. ముఖ్యంగా రక్షణ వ్యయం, వడ్డీ చెల్లింపులు మరియు ఆహారం మరియు ఎరువుల సబ్సిడీలు లక్ష్యాలను మించి విపరీతంగా పెరిగిపోయాయి. స్వదేశీ రుణాలు కూడా లక్ష్యాలను మించి విపరీతంగా పెరిగిపోయాయి. స్వదేశీ రుణాలు కూడా లక్ష్యాలను మించి పెరిగిపోయింది. బడ్జెట్‌ల లోటు కూడా విపరీతంగా పెరిగిపోయింది.

**దీర్ఘకాలిక కోశ విధానం - విమర్శ :** సి.టి. కురియన్, మన సమస్య వనరులే కాదు. వనరులను ప్రభుత్వ రంగంలోకి మరల్చుటం ఇష్టంలేకే ఈ సమస్య తలెత్తిందని భావించాడు. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వనరుల సంక్షోభం లేదు. అయితే సమస్యంతా కోశ సంక్షోభమే అని కురియన్ విమర్శించాడు.

ప్రత్యక్ష పన్నుల విధానాన్ని వ్యవస్థీకరించింది. వివిధ రంగాల మధ్యగల అసమానతలను తొలగించటానికి ఈ దీర్ఘకాలిక కోశ విధానం బాగా వుపయోగపడుతుంది. గతంలో ప్రభుత్వ రంగ సంస్థలు అభివృద్ధి ప్రణాళికలకు సరిపడినంత వనరులను సంపాదించలేక పోయాయి.

**1991 కోశ సంక్షోభం :** 1980ల నుండి అన్ని ముఖ్యమైన కోశ సూచికలు అసమానతలు సూచించాయి. రెవిన్యూ లోటు, స్థూల కోశ లోటు, ప్రాథమిక లోటు క్రమేపీ పెరుగుదల సూచించాయి. ఆదాయ, వ్యయాల మధ్య అంతరం విపరీతంగా పెరిగిపోయింది. ట్రెజరీ బిల్లుల ద్వారా లోటును పూరించుకోవటం జరుగుతున్నది. అంతర్గత రుణాలు, బహిర్గత రుణాలు కూడా బాగా పెరిగాయి. ప్రణాళికేతర వ్యయం విపరీతంగా పెరిగిపోయింది.

**కోశ సర్దుబాటు :** 1991-92 బడ్జెట్‌లో కోశ అసమానతలను తొలగించేందుకు అనేక చర్యలు తీసుకొనబడినాయి. 1990-91 ఫిస్కల్ లోటు స్థూల జాతీయోత్పత్తిలో 6.6% ఉన్నప్పటికీ 1991-92 నాటికి 4.8%కు తగ్గించబడింది. క్రమేపీ తగ్గించేందులకు అనేక చర్యలు చేపట్టబడినాయి. 1998-99లో 5.0%కు 1999-2000లో 5.4%కు, 2000-01లో 5.5%కు పెరిగింది.

**వడ్డీ చెల్లింపులు :** ఈ మొత్తం 1991-92లో రు. 24, 955 కోట్లు వుండగా 1996-97లో రు. 50,478 కోట్లు 2000-01లో రు. 97,432 కోట్లకు పెరిగి ఆందోళన కల్గిస్తున్నది. కాబట్టి రుణాలను తగ్గించేందులకు, అనేక వ్యయ నియంత్రణలు చేపట్టబడినాయి.

**సబ్సిడీ తగ్గింపు :** 1990-91లో సబ్సిడీల మొత్తం రు. 9,581 కోట్లు వున్నప్పటికీ 2000-01కి ఈ మొత్తం రు. 26,480 కోట్లకు పెరిగింది. 1992లో ఎగుమతుల సబ్సిడీ కూడా తగ్గించబడింది. 2000-01 నాటికి ఆహార సబ్సిడీ కూడా తగ్గించబడింది. అయితే ఎరువుల సబ్సిడీ ఓటు బాంకుతో ముడిపడివున్నందున అంతగా తగ్గించలేదు.

**బడ్జెట్ ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలకు సపోర్టు తగ్గించటం :** ప్రభుత్వ రంగ సంస్థలపై ప్రణాళికా పెట్టుబడి పెట్టటం తగ్గించబడింది. నష్టాల్లో వున్న సంస్థలను మూయాలని నిర్ణయింపబడింది.

**నూతన కోశ విధాన అంశాలు :**

ఎ) పన్నుల వ్యవస్థలో, పన్నుల సూత్రాలను సరళీకృతం చేసేందులకు ఒక పద్ధతి ప్రకారం చర్యలు తీసుకోబడినాయి.

బి) ప్రత్యక్ష పన్నులను రేట్లను రీజనబుల్‌గా చేయటం, పన్నుల పరిపాలన, అమలులో కూడా ఇది జాగ్రత్తలు తీసుకొని తద్వారా ఆదాయాన్ని పెంచటం.

సి) స్థిరమైన మరియు పన్నుల రేట్ల విధానంలో సానుకూలమైన మార్పులు చేయటం.

డి) వనరుల కేటాయింపు, పన్నుల ద్వారా సమానత్వం సాధించం అనే అంశాలకు ప్రాధాన్యత నివ్వటం.

ఇ) కోశ సాధనాల యాజమాన్యంలో జాగ్రత్తలు పాటించటం.

ఎఫ్) పన్నుల పరిపాలనలో చెల్లింపు దారులను పీడించే పరిస్థితిపోవాలి.

జి) కోశ, ద్రవ్య విధానాలమధ్య లింకు ఏర్పాటు చేయటం

హెచ్) ప్రభుత్వ వ్యయ నియంత్రణకు సరిక్రొత్త చర్యలు

ఐ) రుణ భారాన్ని తగ్గించే ప్రయత్నం చేయటం

**రాష్ట్రాల్లో కూడా కోశ సంస్కరణలు :** ఆంధ్ర ప్రదేశ్, అస్సాం, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కాశ్మీర్, మధ్య ప్రదేశ్, మణిపూర్, మిజోరమ్, నాగాలాండ్, ఒరిస్సా, పంజాబు, రాజస్థాన్, సిక్కిం, ఉత్తర ప్రదేశ్ మొదలగు రాష్ట్రాలలో కోశ సంస్కరణల పథకాలు విస్తృత స్థాయిలో చేపట్టి తద్వారా రెవిన్యూ బడ్జెట్‌లో లోటును తగ్గించుకునే ప్రయత్నం జరుగుతున్నది.

**కోశ బాధ్యత మరియు బడ్జెట్ మేనేజిమెంట్ (FRBM) బిల్లు :** జనవరి, 2000 సంవత్సరంలో ఈ అంశానికి సంబంధించిన బిల్లు తయారు చేయబడింది. ఈ బిల్లు డిసెంబర్, 2000లో లోక్‌సభలో ప్రవేశపెట్టబడింది. ఈ బిల్లులో కొన్ని కోశ సర్దుబాట్లు, కోశ క్రమ శిక్షణా చర్యలు కూడా తీసుకొనబడినాయి.

**కేంద్ర - రాష్ట్ర -ఆర్థిక సంబంధాలు :** కేంద్ర - రాష్ట్ర సంబంధాలు పటిష్ట పరచేందులకు కొన్ని చర్యలు తీసుకొనబడినాయి. అధిక వ్యయం, తక్కువ ఆదాయంతో రాష్ట్రాలు అనేక ఆర్థిక ఇబ్బందులకుగురై కేంద్ర నుండి నిధులు, అప్పులు పెద్ద మొత్తం డిమాండు చేస్తున్నాయి. రాష్ట్రాలు కూడా ఆర్థిక కోశక్రమశిక్షణ పాటించేందులకు అనేక చర్యలు చేపట్టబడినాయి.

**ప్రణాళికా కాలంలో కోశ విధానం - సమీక్ష :**

ఎ) రెవిన్యూ, మూలధన రాబడులు, రెవిన్యూ, మూలధన ఎకౌంట్లు వ్యయాలు క్రమేపీ పెరుగుతున్నాయి.

బి) రాష్ట్రాలు తమ అభివృద్ధికి కావలసిన వనరులను తామే సమకూర్చుకోలేక పోతున్నాయి.

సి) వ్యవసాయ ఆదాయాలపై పన్ను వసూలు పట్ల రాష్ట్రాలు శ్రద్ధ వహించటల్లేదు.

డి) కేంద్ర బడ్జెట్‌లోటు రిజర్వు బ్యాంకు నుండి రుణాలు తీసుకొని పూరించబడుతున్నది.

ఇ) లోటు ద్రవ్య విధానాన్ని క్రమేపీ తగ్గించే ప్రయత్నం జరుగుతున్నది.

ఎఫ్) రూపాయల రూపంలో రెవిన్యూ రాబడి పెరిగింది కానీ రూపాయి విలువ తగ్గటం వలన వ్యయం క్రమేపీ పెరుగుతున్నది.

జి) వ్యయ దుర్వినియోగం, అవినీతి, నల్లధనం మొదలగు వాటిని రూపుమాపటంలో ప్రభుత్వం వైఫల్యం చెందింది.

**కోశ విధాన పరిమితులు :**

ఎ) వ్యవస్థీకృత సర్దుబాట్లు చేయటంలో కోశ విధానం ఒక్కటే సరిపోదు.

బి) ద్రవ్య ప్రవాహ పంపిణీలో సర్దుబాట్లు చేయలేకపోవటం.

సి) ఆర్థిక అస్థిరతను నివారించటంలో వైఫల్యం.

డి) అభిలషనీయ బడ్జెట్ పరిమాణానికి తగినట్లు కోశ చర్యలు చేపట్టడంలో అనేక ఇబ్బందులు.

ఇ) కోశ విధానం వూహించినట్లు గుణక ప్రభావం అంతగా కన్పించట్లేదు.

ఎఫ్) కఠినకోశ క్రమశిక్షణా చర్యలను సమర్థవంతంగా పాటించాలి.

జి) పన్నుల ఎగవేత, పన్నుల సిద్ధాంతాల్లో లోపాలు, పన్నుల మినహాయింపులలో తగిన జాగ్రత్తలు పాటించాలి. లేకపోతే ప్రభుత్వ పన్నుల రాబడి తగ్గటమే కాక ఆర్థిక అసమానతలు కూడా పెరిగిపోతాయి.

హెచ్) ద్రవ్య విధానం కోశ విధానంతో సమన్వయ పరచి రెండూ కలిసి పని చేయటం ద్వారానే సత్ఫలితాలు సాధించగలం.

## 11.8 సారాంశం :

సనాతన ఆర్థిక వేత్తలు కోశ విధానానికి అంతగా ప్రాముఖ్యత నివ్వకపోయినా, క్రమేపీ ముఖ్యంగా 1930 ప్రపంచ ఆర్థిక మాంద్యం తరువాత కోశ విధాన ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. పన్నులు, ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ రుణం, రుణ యాజమాన్యం, లోటు ద్రవ్య విధానం మొదలగు సాధనాల ద్వారా కోశ విధానం ఆర్థిక సుస్థిరతకు అవిరళ కృషి సల్పుతున్నది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థికాభివృద్ధి, పరిపూర్ణ ఉద్యోగిత, ఆర్థిక సుస్థిరత, ఆదాయ, సంపదల వ్యత్యాసాల తొలగింపు మొదలగు లక్ష్యాలను సాధించేందులకు కోశ విధానం ఎంతగానో సహకరిస్తుంది. కోశ విధానం పని తీరు అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలలో వేరు వేరుగా వుంటుంది. కీన్స్, ఎ.పి. లెర్నర్ మొదలగు మేధావులు పూరక విత్తం ద్వారా కోశ విధానం ఏ విధంగా ఆర్థిక సుస్థిరతకు కృషి చేస్తుందనే విషయాన్ని కూలం కషటంగా చర్చించారు. మన ప్రణాళికా కాలంలో కూడా కోశ విధానం ద్వారా దేశాభివృద్ధికి అవిరళ కృషి జరుగుచున్నది. ముఖ్యంగా 1990ల నుండి కోశ క్రమశిక్షణా చర్యలు సమర్థవంతంగా చేపట్టబడినాయి. కోశ విధానం ద్వారా సత్ఫలితాలు సాధించాలంటే మిగిలిన ఆర్థిక విధానాలు ముఖ్యంగా ద్రవ్య విధానంతో కలిసి సమైక్యంగా పనిచేసిననాడే సాధ్యపడుతుంది.

## 11.9 ముఖ్య పదాలు

| | | | |
|---|---|---|---|
| 1. | ఆర్థిక సుస్థిరత | - | ఆర్థిక వ్యవస్థ సమతౌల్య పరిస్థితిలో వుండటం |
| 2. | గుణకము | - | పెట్టుబడి వలన ఎన్ని రెట్లు ఆదాయం పెరుగుతుందో తెలియజేస్తుంది. |
| 3. | సార్థక డిమాండు | - | సమిష్టి సప్లయి, సమిష్టి డిమాండు సమానంగా ఉన్నపుడు సార్థక డిమాండు ఏర్పడుతుంది. |
| 4. | ఆర్థిక అస్థిరత | - | ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం లాంటి వ్యాపార చక్రలు ఏర్పడి అసమతౌల్య పరిస్థితి ఏర్పడటం. |

## 11.10. స్వయం సమీక్ష ప్రశ్నలు :

1. కోశ విధానంపై సనాతన, ఆధునిక ఆర్థిక వేత్తల అభిప్రాయాలను వివరించి కోశ విధానాల లక్ష్యాలను వివరింపుము.
2. అభివృద్ధి చెందుతున్న దేశాలలో కోశ లక్ష్యాలను, కోశ విధాన తీరును విశదీకరింపుము.
3. ఆర్థిక సుస్థిరతను సాధించేందులకు కోశ విధానం ఏ విధంగా పనిచేస్తుందో సవివరంగా వివరింపుము.
4. ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో కోశ విధాన పనితీరును విమర్శనాత్మకంగా చర్చింపుము.

## అభ్యాసాలు :

1) కోశ విధానంపై సనాతన ఆర్థిక వేత్తల భావనలు
2) కీన్స్ పూరక విత్తం
3) అభివృద్ధి చెందుతున్న దేశాలలో కోశ విధాన లక్ష్యాలు
4) ఆర్థిక సుస్థిరత - కీన్స్ వివరణ
5) లోటు ద్రవ్య విధానం
6) గుణక ప్రభావం
7) 1991లో కోశ సంక్షోభం
8) ఋణ యాజమాన్యం
9) కోశ క్రమ శిక్షణ
10) కోశ విధాన పరిమితులు

## 11.11 చదవవలసిన పుస్తకాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | A. Musgrave & B. Musgrave | : | Public Finance in Theory and Practice |
| 2. | Chelliah R.J. | : | Fiscal Policy in under developed countries |
| 3. | Mishra & Puri | : | Indian Economy |
| 4. | Tripathy R.N. | : | Public Finance in Under Developed Countries |
| 5. | Mishra B. | : | Fiscal Policy in the concept of planning |
| 6. | RBI | : | Report on currency and Finance various issues. |


డా॥ వై. ఇందిరాకుమారి

పాఠం - 12

# ఫెడరల్ విత్త విధాన సూత్రాలు - కేంద్ర రాష్ట్ర ఆర్థిక సంబంధాలు

పాఠ్య నిర్మాణ క్రమం


12.0 ఉద్దేశాలు

12.1 ఉపోద్ఘాతం

12.2 మన రాజ్యాంగంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విధులు, ఆర్థిక వనరుల విభజన

12.3 ఫెడరల్ విత్త విధాన సూత్రాలు

12.4 అభివృద్ధి చెందుతున్న దేశాలకు విత్త విధాన సూత్రాలు వర్తించుట

12.5 భారత దేశంలో విత్త విధాన సూత్రాలు - సమస్యలు-కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తలెత్తిన ఆర్థిక వివాదాలు

12.6 ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వ ఆధిక్యత

12.7 కేంద్ర రాష్ట్ర విత్త సంబంధాలను మెరుగుపరచేందులకు కొన్ని సూచనలు

12.8 సారాంశం

12.9 ముఖ్య పదాలు

12.10 స్వయం సమీక్ష ప్రశ్నలు

12.11 చదవవలసిన పుస్తకాలు


## 1.0 ఉద్దేశాలు

ఈ పాఠ్యభాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది అంశాలను తెలుసుకోగలరు. ఈ పాఠ్యాంశాన్ని చదివిన తరువాత ఈ క్రింది అంశాలపట్ల అవగాహన పెరగాలి.

ఎ) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విధులు - ఆర్థిక వనరుల విభజన ఎలా వున్నదీ విశదీకరించగలగాలి.

బి) ఫెడరల్ విత్త సూత్రాలను వివరించి, అవి ఎంత వరకు అభివృద్ధి చెందుతున్న దేశాలకు, ముఖ్యంగా మన దేశానికి వర్తిస్తాయో చర్చించగలగాలి.

సి) కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తలెత్తిన ఆర్థిక వివాదాలు, ఆర్థిక సంబంధాలు మెరుగు పరచేందులకు చేయవలసిన సూచనలను వివరించగలగాలి.

## 12.1 ఉపోద్ఘాతం :

ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక సంబంధాలు రాజ్యాంగ పరంగా జరిగిన విధుల విభజన, ఆర్థిక వనరుల పంపిణీ మరియు ఫెడరల్ విత్త సూత్రాలపై ఆధారపడి వుంటాయి. ఫెడలర్ లేక సమైఖ్య వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం, దాని ఆధీనంలో రెండు లేక అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు వుంటాయి.

ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా ప్రకారం "కొన్ని శాశ్విత లక్ష్యాల సాధనకై కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో రెండు లేక అంతకంటే ఎక్కువ రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయటమే ఫెడరేషన్" అని పిలుస్తాము. ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విధులు ఆర్థిక వనరులు

ఒక ఒడంబడిక ప్రకారం విభజింపబడతాయి. ఫెడరల్ వ్యవస్థ అమలులోవున్న దేశాలలో రెండు విత్త వ్యవస్థలు వుంటాయి. పన్నులు విధించే అధికారం, వ్యయం చేసే అధికారం ఆయా ప్రభుత్వాలకు వేరు వేరుగా వుంటాయి. కోశ సంబంధమైన విషయాలు వికేంద్రీకృతమై వుంటాయి. అనగా పన్నులు, ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ రుణం, రుణ యాజమాన్యం మొదలగు అంశాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వేరు వేరుగా వుంటాయి.

## 12.2. మన రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విధులు, ఆర్థిక వనరుల విభజన :

**ఎ) విధులు లేదా అధికార విభజన :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వేరు వేరు విత్త విధానాలు వుంటాయి. అలానే కోశ విధానాలు కూడా భిన్నంగా వుంటాయి. ఎవరి విధులను వారు వేరు వేరుగా నిర్వర్తించాలి. కాబట్టి వివాదాలకు ఆస్కారం లేకుండా విధుల విభజన ముందుగా జరగాలి. కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాధాన్యతగల అంశాలను నిర్వర్తించవలసి వుంటుంది. అలానే రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక ప్రాధాన్యత గల అంశాలను నిర్వర్తించవలసి వుంటుంది.

**1. కేంద్ర ప్రభుత్వ విధులు :**

1. రక్షణ
2. విదేశీ వ్యవహారాలు
3. అంతర్జాతీయ వ్యాపారం
4. షిప్పింగ్, అణుశక్తి
5. అంతర్గత సమాచారం
6. తంతి, తపాలా సేవలు
7. రైల్వే టికెట్‌లపై పన్నులు
8. కరెన్సీ ముద్రణ, మొదలగునవి

**2. రాష్ట్ర ప్రభుత్వ విధులు :**

1. శాంతి భద్రతలను కాపాడటం
2. విద్య, వైద్యం
3. ప్రజాహిత కార్యక్రమాలు
4. సాంఘిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడే అంశాలు
5. అంతర్గత న్యాయం
6. నీటి పారుదల
7. రోడ్డు రవాణా
8. విద్యుచ్ఛక్తి మొదలగునవి

ఉమ్మడి జాబితా క్రింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ శ్రద్ధ వహించాల్సి వుంటుంది. ఉదా : విద్య, ప్రజారోగ్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభజన జరిగినప్పటికీ కొన్ని కీలకమైన రాష్ట్ర విధులలో కేంద్రం కూడా జోక్యం చేసుకోవలసి వుంటుంది. అలానే రక్షణ, సమాచారాలకు సంబంధించిన అంశాలను పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికేవదలక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఒక్కో సందర్భంలో జోక్యం చేసుకుంటున్నాయి.

**బి) ఆర్థిక వనరుల విభజన :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలో విధులు నిర్వర్తించేందులకు కొంత ఆర్థిక వనరులు కావాలి. కాబట్టి ఆదాయ పంపిణీ కూడా సక్రమంగా జరగాలి. మన రాజ్యాంగంలో విధులే కాక ఆదాయవనరులు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభజించబడినాయి.

**1) కేంద్ర ప్రభుత్వ పన్నులు :**

ఎ) వ్యవసాయేతర ఆదాయాలపై పన్ను

బి) కార్పొరేషన్ పన్ను

సి) ఎక్సైజ్ సుంకాలు

డి) కస్టమ్స్ సుంకాలు

ఇ) మత్తు పానీయాలు, పదార్థాలపై ఎక్సైజ్ సుంకాలు

ఎఫ్) ఆర్థిక డాక్యుమెంట్లపై స్టాంపు డ్యూటీలు మొదలగునవి.

**2) రాష్ట్ర ప్రభుత్వ పన్నులు :**

ఎ) భూమి

బి) వ్యవసాయ ఆదాయంపై పన్నులు

సి) భూమి, భవనాలపై పన్నులు

డి) వ్యవసాయ భూములపై ఎస్టేట్ డ్యూటీలు

ఇ) మత్తు పదార్థాలు, పానీయాలపై ఎక్సైజ్ సుంకాలు

ఎఫ్) తమ భూభాగంలోకి వచ్చే వస్తువుల మీద పన్నులు

జి) విద్యుశ్ఛక్తి, వినియోగం అమ్మకాలపై పన్నులు

హెచ్) వాహనాలు, జంతువులు, పడవలపై పన్నులు మొదలగునవి.

**3) రాష్ట్రాల పన్నులేతర రాబడి :**

ఎ) రాష్ట్ర ప్రభుత్వం అందించే వస్తు సేవలకు ధరలు

బి) వాణిజ్య సేవలకు ధరలు

సి) ఫీజులు

డి) రిజిస్ట్రేషన్ ఛార్జీలు మొదలగునవి, మరియు

ఇ) కేంద్ర నుండి వచ్చే పన్నుల రాబడిలో వాటా

ఎఫ్) నిధులు

జి) అప్పులు

ఏది ఏమైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సదవగాహన, సమన్వయము వుంటేగానీ ఫెడరల్ వ్యవస్థ తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించలేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏ విషయంలో అవగాహన లోపించినా అనేక వివాదాలు తలెత్తవచ్చును.

ఈ సందర్భంగా జేమ్స్. ఎ. మాక్స్ వెల్ "విధులు వేర్పాటు సిద్ధాంతం, ప్రకారం సహకార సమైఖ్య విధానం అమలు చేయ లేమని" భావించినాడు.

మోర్టన్ గార్టిజన్స్ "పాలరాయిలో రంగులన్నీ కలిసిపోయినట్లు, ఫెడలర్ విధానంలో ప్రభుత్వ విధులు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభజించలేని విధంగా నిక్షిప్తమై వున్నాయి." అని అభిప్రాయ పడినాడు.

విధుల విభజన, నిధుల కేటాయింపులకు మధ్య సమన్వయం లేనందున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అనేక వివాదాలు తలెత్తుతున్నాయి. కాబట్టి ఫెడలర్ వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాబడిని వాటి విధుల నిర్వహణకు సరిపడే విధంగా పంపిణీ చేసినట్లయితే వివాదాలకు ఆస్కారం వుండదు. కాబట్టి మారుతున్న పరిస్థితులకనుగుణంగా సమస్యలను నివారించేందులకు సమర్థవంతమైన సూచనలను, మార్గదర్శకత్వాన్ని తెలిపే విధంగా కొన్ని ఫెడరల్ సూత్రాలు కూడా రూపొందించబడినాయి.

ఫెడరల్ వ్యవస్థలో 'కేంద్రం బలమైన వ్యవస్థ, రాష్ట్రాలు బలహీనమైనవి'గా వుంటాయి. కాబట్టి ఆర్థిక అసమానతలను తొలగించి అన్ని రాష్ట్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలమ అందించాల్సి వుంటుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సంబంధాలు పటిష్టంగా వుండాలంటే కొన్ని ఫెడరల్ సూత్రాలు విధిగా పాటించాల్సిన అవసరం ఎంతైనా వున్నది.

## 12.3. ఫెడరల్ విత్త విధాన సూత్రాలు :

ప్రొఫెసర్ బి.పి. అడాల్కర్ ప్రిన్సిపల్స్ అండ్ ప్రాబ్లమ్స్ ఆఫ్ ఫెడరల్ ఫైనాన్స్ అనే గ్రంథంలో ముఖ్యంగా ఈ క్రింది మూడు సూత్రాలను చర్చించారు.

1) స్వాతంత్ర్యము మరియు బాధ్యత

2) సరిపడినంత వుండటం మరియు వ్యాకోచిత

3) పరిపాలనలో పొదుపు మరియు సామర్థ్యత

**1) స్వాతంత్ర్యము మరియు బాధ్యత :**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ విధులను సక్రమంగా నిర్వర్తించటానికి తగిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలుండాలి. అంతేకాక తమకు కావలసిన విత్త వనరులను సమకూర్చుకోవటంలో కూడా స్వతంత్రత వుండాలి. విత్త విషయాలలో ఏ ప్రభుత్వానికయినా స్వేచ్ఛ లేనపుడు స్వయం ప్రతిపత్తి కూడా లేక ఆయా ప్రభుత్వాలు ఇబ్బందుల నెదుర్కొనవలసి వుంటుంది. పన్నులు విధించుకోవటంలో పూర్తి స్వయం ప్రతిపత్తి రాష్ట్రాలకుండాలి. క్రొత్త పన్నులు విధించుకోవటానికి, లేదా తొలగించుకోవటానికి రాష్ట్రాలకు స్వతంత్రత వున్నది. అలానే పన్నుల రేట్లు పెంచుకోవటానికి, పన్నుల రేట్లు తగ్గించుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛ వుంటుంది. దీనినే 'పన్నుల విధింపులో స్వయం ప్రతిపత్తి' అంటారు.

అలానే రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యయ వ్యవహారాలలో పూర్తి స్వేచ్ఛ కల్పించబడింది. రాష్ట్ర ప్రభుత్వాలు వ్యయం పెంచుకోవటానికి, తగ్గించుకోవటానికి పూర్తి స్వేచ్ఛ వుంటుంది. అలానే వ్యయంతో కూడిన క్రొత్త పథకాలు చేపట్టవచ్చు లేదా అమలులో వున్న పథకాలను విరమించి వ్యయం తగ్గించుకోవచ్చు. ఈ వ్యయ సంబంధిత వ్యవహారాలలో రాష్ట్రాలకు గల స్వేచ్ఛనే వ్యయం చేయటంలో స్వయం ప్రతిపత్తి' అంటారు.

ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ, వ్యయ వ్యవహారాలలో పూర్తి స్వేచ్ఛ ఇవ్వటమే ఫెడరల్ వ్యవస్థ ప్రత్యేకత అని చెప్పవచ్చును. దీనినే 'ఆర్థిక స్వయం ప్రతిపత్తి' అని ఒక్క మాటలో చెప్పవచ్చును. కేంద్ర ప్రభుత్వానికే ఆదాయాన్ని అప్పచెబితే రాష్ట్రాలు అనేక ఆర్థిక ఇబ్బందుల నెదుర్కొనవలసి వుంటుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆదాయ పరిమితిని బట్టే వ్యయం చేయవలెననే సూత్రాన్ని పాటించినట్లయితే కొన్ని ఇబ్బందులు తలెత్తవచ్చు. ఎందుకనగా వివిధ రాష్ట్రాల ఆదాయ వనరులు ఒకేలా వుండాలనే నియమంకానీ, అవకాశం కానీ లేవు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు వనరుల కొరత వుండదు, కాబట్టి తమ విధులను సక్రమంగా నిర్వర్తించగలవు. అయితే వెనుకబడిన రాష్ట్రాలు తమ పరిమిత ఆదాయంతో అనేక విధులను నిర్వర్తించలేక ఇబ్బందుల నెదుర్కొనవలసి వుంటుంది. కాబట్టి ఆయా రాష్ట్రాలు తమ పరిధిలోగల పన్నులను పెంచుకొని, అధిక ఆదాయం కోసం తాపత్రయ పడవలసి వస్తున్నది. స్వేచ్ఛ వుంది కదా అని వివిధ రాష్ట్రాల మధ్య పన్నుల విధింపులో పెద్ద తేడాలుండే విధంగా ఎవరి ఇష్టాను సారం వారు విధించుకోగూడదు.

ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలలో విత్త స్వయం ప్రతిపత్తి సూత్రాన్ని పాటించటం కష్టతరం. కాబట్టి పన్నుల విధింపులో స్వయం ప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వానికి, వ్యయం చేయటంలో స్వయం ప్రతిపత్తిని రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వటం మంచిదని కొందరు మేధావులు అభిప్రాయపడినారు. రెవిన్యూ విధాన సామర్థ్యం పెరగాలంటే పన్నులు విధించే అధికారం కేంద్రానికే వుండటం మంచిదని కొందరభిప్రాయం. ఎందుకంటే కేంద్ర అతిపెద్ద వ్యవస్థ కాబట్టి ఆదాయ వ్యాకోచితను కూడా పెంచుకోగలదు. అయితే ఈ పద్ధతి ఆచరణ యోగ్యం కాదు. ఎందుకంటే రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వ్యయంచేసే సంస్థలుగా మారితే అవి వాటి స్వయం ప్రతిపత్తిని కోల్పోయి 'పరాన్న జీవులు'గా తయారు కావలసి వుంటుంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలకు విత్త వ్యవహారాలలో కూడా స్వయం సమృద్ధి వుండాలి.

**2. సరిపడినంత వుండటం మరియు వ్యాకోచత్వం :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విత్త వనరులు సరిపడినంతగా కలిగివుండి తమ విధులను సరిగా నిర్వర్తించగలగాలి. అంతే విత్త విధాన సూత్రాను సారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధులను నిర్వర్తించటానికి కావలసిన వనరులలో కొరత ఏర్పడకూడదు. అలాకాక రాష్ట్ర ప్రభుత్వాలు తమకు కావలసిన విత్త వనరులకోసం కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడితే ఫెడరల్ సూత్రాన్ని పాటించినట్లవుతుంది. ఎందుకంటే వాస్తవిక అధికార విభజనకు విత్తవనరులు సరిపడినంతగా వుండటం చాలా ముఖ్యం.

ఈ సూత్రంతో పాటు వ్యాకోచత్వం కూడా ప్రాధాన్యతను కల్గియున్నది. మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల కనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు క్రొత్త బాధ్యతలను చేపట్టవలసియున్నది. పెరిగిన అవసరాలను, బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతంగా నెరవేర్చాలంటే తమ ఆదాయ వనరులను విస్తరింపజేయటానికి తగిన అవకాశం వుండాలి. అలానే ఆర్థికపరంగా, రక్షణ పరంగా క్లిష్ట పరిస్థితులు ఏర్పడినపుడు ఫెడరల్ వ్యవస్థలో కావలసినంత వనరులను సేకరించటానికి ఇబ్బందుల నెదుర్కోవలసి వుంటుంది.

అలానే ఆర్థిక మాంధ్యం ఏర్పడినపుడు ఆర్థికవనరులు బాగా తగ్గిపోవచ్చు. ఏది ఏమైనా రాష్ట్రాలు అధిక వనరులు కావాలంటే అధిక పన్నులు, రేట్లు పెంచటం కొత్త పన్నులు విధించుకోవటం చేయవచ్చును. ప్రజలు ఇబ్బందులలో వున్నారని భావిస్తే పన్నులు తగ్గించి, రాబడి తగ్గించుకోవటానికి కూడా రాష్ట్రాలు సంసిద్ధంగా వుండాలి. ఈ విధంగా రాబడి పెంచుకోవటానికి, తగ్గించుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి స్వేచ్ఛ వుంటుంది.

**3. పరిపాలనలో పొదుపు మరియు సమర్థత :**

పన్నుల విధానంలోని లోపాలకు సవరించి వీలైనంత కనిష్ట వ్యయంతో పన్నులను వసూలుచేసి గరిష్ట పన్నులరాబడిని పొందటానికి ప్రయత్నించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధులు నిర్వర్తించేందులకుగాను నిధులకొరత లేకుండా రావలసిన రాబడిని సక్రమంగా వసూలు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనా వ్యవహారాలలో దుబారాను తగ్గించుకొని పొదుపును పాటించటం చాలా అవసరం. పన్నుల రూపంలో ప్రజలనుండి వసూలు చేసిన విలువైన ప్రజాధనాన్ని, ప్రజలకోసమే వినియోగించి గరిష్ట ప్రయోజనాన్ని పొందాలంటే పొదుపు పాటించటం చాలా అవసరం, అప్పులు అవసరం లేకుండా అప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు తమ కాళ్లమీద తాము నిలబడే స్థాయిని చేరుకోగలవు.

రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థతలో తమ వనరులనుపయోగించుకొని, తాము చేపట్టాల్సిన బాధ్యతలను నిర్వర్తించాల్సియున్నది. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు తదుపరిపాలనలో సమర్థతకు అత్యంత ప్రాధాన్యత నివ్వాల్సి వుంటుంది. పన్నుల వసూళ్ళలో ఎగవేతకు తావు లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతంగా పన్నులను వసూలు చేసుకోవాలి. అదే విధంగా వ్యయం చేయటంలో కూడా అవసరాన్ని బట్టి విచక్షణతో నడుచుకోవాల్సి వుంటుంది. రాష్ట్రాలు ఆర్థిక క్రమ శిక్షణ పాటించాల్సిన అవసరం చాలా వున్నది.

ఈపై ఫెడరల్ విత్త విధాన సూత్రాలకు తోడు కేంద్ర రాష్ట్ర ఆర్థిక విషయాలమీద పరిశోధన చేసిన కొందరు మేధావులు మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో వుంచుకొని మరికొన్ని సూత్రాలను కూడా రూపొందించారు. కాబట్టి ఆ క్రొత్త సూత్రాలను కూడా పై మూడు విత్త సూత్రాలతో కలిపి చర్చించటం సమంజసంగా వుంటుంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల పరిస్థితులకు ఈ క్రింది విత్త సూత్రాలు చాలా అవసరం. మన దేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సంబంధాలను మెరుగుపరచుకోవాలంటే వాటి గురించి సవివరంగా చర్చించుకోవాల్సిన అవసరం వున్నది.

**4. సమానత్వం**

రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం సమదృష్టితో చూసి రాష్ట్రాల మధ్య స్పర్థతలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పన్నులు విధించేటప్పుడు, పన్నులు విధించే అధికారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కేటాయించేటప్పుడు, జాగ్రత్తలు తీసుకొని పన్నులు విధించినప్పుడు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల మీద పన్నుల భారం సమానంగా వుండేటట్లు చూడవలెను. అలాకాకపోతే రాష్ట్రాల మధ్య ఆర్థిక

అసమానతలు, పక్షపాతం స్పర్థలు ఏర్పడే అవకాశం కలదు. పన్నుల విధింపు విషయంలో కూడా ఆర్థిక సమానత్వం కోసం పాటుపడాలని ఆడమ్ స్మిత్ తెలిపాడు. ధనికులపై అధికపన్ను, పేదలపై తక్కువ పన్ను విధించటం ద్వారా ఆదాయ వ్యత్యాసాలను తొలగించి ఆర్థిక సమానత్వాన్ని సాధించవచ్చు. అదేమాదిరిగా రాష్ట్రాల మధ్య కూడా ఆర్థిక సమానత్వం తెచ్చేందులకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలి. కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలపై పన్నులు విధించినపుడు పన్నుల చెల్లింపువలన కోల్పోయే వుపాంత త్యాగం అన్ని రాష్ట్రాలలోను సమానంగా వుండేటట్లు చూడవలెను.

**5. సమైఖ్యత మరియు సమన్వయం :**

కేంద్రం అన్ని రాష్ట్రాల అభివృద్ధికి సహాయపడుతూ దేశ సమైఖ్యతకు కృషిచేయాలి. వెనుకబడిన రాష్ట్రాలకు వీలైనంత ఎక్కువ సహాయ సహకారాలనందిస్తూ వాటి అభివృద్ధికి తోడ్పడి వీలైనంతవరకు అన్ని రాష్ట్రాలను సమదృష్టితో చూడాలి పక్షపాతం, కక్షసాధింపు, రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను సమైఖ్య పరచాలి. 'భిన్నత్వంలో ఏకత్వం' సాధించేందులకు కేంద్రం కృషి చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో వేరు వేరు రాజకీయ పార్టీలు అధికారంలో వున్నా ఎటువంటి స్పర్థతలు లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐక్యతతో పనిచేయాల్సి వుంటుంది. రాష్ట్రాలలో వేర్పాటు ధోరణి తలెత్తితే అది దేశమునుగడకే ప్రమాదకరం కాబట్టి కేంద్ర ప్రభుత్వం చాకచక్యంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి వుంటుంది.

పన్నుల విధింపులో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం చాలా అవసరం ఒకే మూలంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు విధించకుండా కేంద్ర, రాష్ట్ర పన్నుల జాబితాను వేరు వేరుగా తయారు చేయాలి. ఉదా : వ్యక్తిగత ఆదాయపన్ను కేంద్రం విధిస్తే, వ్యవసాయ ఆదాయాలపై పన్ను రాష్ట్రాలు విధిస్తున్నాయి. ఈ విధంగా చేయటంవలన ప్రజలపై భారమూ తగ్గుతుంది. పన్నుల విధింపు న్యాయంగా హేతుబద్ధంగా కూడా వుండాలంటే సమన్వయ సూత్రాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా అనుసరించాల్సి యున్నది.

అంతేకాక వార్షిక బడ్జెట్‌లు, మూలధనరూప కల్పన, ఋణ వ్యవహారాలు మొదలగు అంశాలలో కూడా సమన్వయం పాటిస్తే ఎటువంటి వివాదాలకు ఆస్కారం వుండదు. కేవలం ఆదాయపరమైన విషయాలేకాక విధుల నిర్వహణతో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం చాలా అవసరం. ఒకే బాధ్యతను ఇద్దరూ చేపడితే ఏ ఒక్కరూ సమర్థవంతంగా నిర్వర్తించలేరు. కాబట్టి కేంద్రం, రాష్ట్రాలు కూడా తమ విధులను తాము సక్రమంగా నిర్వర్తించి సమైఖ్య విత్త వ్యవస్థను న్యాయం చేకూర్చాలి.

**6. జవాబు దారీ తనం :**

ఫెడరల్ వ్యవస్థ, ప్రజాస్వామ్యము రెండు కూడా పరస్పర సంబంధం కలిగియున్నాయి. కాబట్టి ప్రతి ప్రభుత్వము తన ఆదాయ, వ్యయాలకు సంబంధించిన కార్యక్రమాలు, పన్నుల విధింపు, రేట్లు పెంచటం, తగ్గించటం, అప్పులుకు సంబంధించిన అంశాలు ముందుగా చట్టసభల్లో చర్చించి, అనుమతిపొంది వుండాలి. రాష్ట్ర ప్రభుత్వం తన సొంత శాసనసభ అనుమతి పొంది నిర్ణయాలు తీసుకొనవలసివున్నది. ముఖ్యంగా బడ్జెట్‌లో ఈ విషయాలన్నీ పొందుపరచి, శాసనసభలో చర్చించి ఆమోదముద్ర పొందిన తరువాతే మార్పులు, చేర్పులు చేయవలసి యున్నది. అలాగే కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ అనుమతితోనే కార్యక్రమాలు నిర్వహించాల్సి వున్నది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం లోక్‌సభకు, రాష్ట్ర ప్రభుత్వాలు శాసనసభకు జవాబు దారీగా వుండాలి. పన్నుల రూపంలో ప్రజలనుండి వసూలు చేసిన పన్నులరాబడి ప్రజల సంక్షేమం కోసం, ఆయా ప్రభుత్వాల ఆర్థికాభివృద్ధికే వ్యయం చేయాల్సి వుంటుంది. అందువలన పరోక్షంగా ప్రతి ప్రభుత్వం తన ప్రజలకు కూడా జవాబుదారీగా వుండాలి.

**7. ఒకే రకంగా వుండటం :**

ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల అవసరాలను తీర్చి అభివృద్ధికి దోహదపడాలి. అందుకని కేంద్ర ప్రభుత్వం పన్నుల రేట్లు పెంచవచ్చు, పన్నుల సంఖ్య పెంచవచ్చు. అలానే ఒక్కో సందర్భంలో తగ్గించవచ్చును. అయితే ఏ మార్పయినా దేశమంతటా ఒకేలా అమలు చేయాలి. అలానే కేంద్ర ప్రభుత్వం తన పరిధిలో గల పన్నులు విధించేటప్పుడు అన్ని రాష్ట్రాలలోను ఒకే రేటును వసూలు చేయాలి. ఒక రాష్ట్రంలో ఎక్కువ, మరొక రాష్ట్రంలో తక్కువ అనే వ్యత్యాసాలు పన్నుల రేట్లలో వుండకూడదు. దేశమంతటా ఏకపన్ను విధానాన్ని అవలంబించాలి. ప్రాంతీయ అసమానతలకు అవకాశం ఇవ్వగూడదు.

**8. కోశ సంబంధ వ్యవహారాలలో చొరవ :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎవరి పరిధిలో వారు పెరుగుతున్న వ్యయాన్ని తట్టుకునేందులకు క్రొత్త ఆదాయ మార్గాలను అన్వేషించుకొని రాబడిని పెంచుకునేందులకు చొరవచూపవచ్చు. పెరుగుతున్న బాధ్యతలు, మారుతున్న సాంఘిక, ఆర్థిక పరిస్థితులకనుగుణంగా తమ కోశ విధానాన్ని రూపొందించుకునేందులకు ప్రతి ప్రభుత్వానికి స్వేచ్ఛ వుండాలి. అనగా క్రొత్త పన్నులు విధించుకోవచ్చు. ఉన్న పన్నులు తొలగించవచ్చు. అదేమాదిరిగా పన్నుల రేట్లులో కూడా ఆదాయ అవసరాన్ని బట్టి ఆయా ప్రభుత్వాలు మార్పులు చేసుకోవచ్చు. అలానే ఆయా ప్రభుత్వాలు క్రొత్త పథకాలు ప్రారంభంలో ఉన్న పథకాలలో మార్పులు చేసుకొనవచ్చు. పన్నులు, ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ ఋణం, రుణ యాజమాన్యలకు సంబంధించిన విషయాలలో ఆయా ప్రభుత్వాలకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. ఫెడరల్ వ్యవస్థలో వాస్తవిక దృక్పథంతో ఆలోచించి విధానాలను రూపుదిద్దుకునేందులకు అవకాశం వుండాలి. అలాకాక కఠిన నియమాలపై ఆధారపడి వుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు నెలకొనే అవకాశం వుండదు.

## 12.4. అభివృద్ధి చెందుతున్న దేశాలకు విత్త విధాన సూత్రాలు వర్తించటం :

ప్రతి ప్రభుత్వం తన విధులను నిర్వర్తించటానికి ఆర్థిక వనరులను సమకూర్చుకోవలసి వుంటుంది. విత్తాన్ని సమకూర్చుకొని తన ముఖ్య బాధ్యతలను నిర్వహించుకునే ప్రయత్నంలో ప్రతి ప్రభుత్వం అనేక ఇబ్బందులనెదుర్కొనవలసి వుంటుంది. ఆర్థికంగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలమధ్య ప్రాంతీయ అసమానతలు ఎక్కువగా వుంటాయి. అలాగే జనాభా, భూభాగం, ఆర్థిక, సాంఘిక పరిస్థితులు భిన్నంగా వుంటాయి. ఆ పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వం చాలా జాగ్రత్తగా వ్యవహరించి వెనుకబడిన రాష్ట్రాలకు అధిక ఆర్థిక వనరులు, అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు తక్కువ ఆర్థిక వనరులు కల్పించి, ప్రాంతీయ అసమానతలను తగ్గించాలి. మన ఫెడరల్ వ్యవస్థలో కొన్ని ప్రత్యేకత లక్షణాలున్నాయి.

**1. విధుల కేంద్రీకరణ :** ఫెడరల్ వ్యవస్థలో అత్యంత కీలకమైన భాధ్యతలు జాతీయ ప్రాధాన్యత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే వుంటాయి. అందువలన ముఖ్య విధులనీ కేంద్ర ప్రభుత్వం చేతిలోనే వుంటాయి.

**2. వనరుల కేంద్రీకరణ :** ఫెడరల్ వ్యవస్థలో అధిక రాబడినిచ్చే పన్నులనీ కేంద్ర ప్రభుత్వం చెతిలోనే వుంటాయి. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకునే అధికారం, అవకాశం చాలా ఎక్కువ.

**3. కేంద్ర ప్రభుత్వ ఆధిక్యత :** ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వమే ఉన్నత అధికారిగా వ్యవహరిస్తుంది. 'బలమైన కేంద్రం, బలహీనమైన రాష్ట్రాలు' ఫెడరల్ వ్యవస్థలో అతిముఖ్య లక్షణంగా వుంటుందని చెప్పవచ్చును.

**4. గౌరవం ఇనుమడించటం :** మన రాజ్యాంగం ప్రకారం అధికార విభజన జరిగినప్పటికీ అత్యంత ప్రతిష్ఠాకరమైన గురుతర బాధ్యతలు మాత్రం కేంద్ర ప్రభుత్వం చేతిలోనే వుంటాయి. రక్షణ, విదేశీ వ్యవహారాలు, రైల్వేలు, విదేశీ వాణిజ్యం మొదలగు విషయాలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే వున్నాయి.

**5. సమతూకాన్ని ఏర్పాటు చేయటం :** అభివృద్ధి చెందిన, వెనుకబడిన రాష్ట్రాల మధ్యగల వ్యత్యాసాలను తొలగించి ప్రాంతీయ సమానత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మీదే వుంటుంది.

ఈపై లక్షణాలన్నీ విత్త సూత్రాల్లో పరోక్షంగా చర్చించినవే, అయితే ఇవి మన దేశంలో కొన్ని సమస్యలను సృష్టిస్తున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ వ్యయాల్లో అనేక కోశ, అసమానతులున్నాయి. దీనినే 'వర్టికల్ కోశ అసమానతలు' అంటారు. అలాగే వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ వ్యయాల మధ్య కూడా అనేక కోశ అసమానతలున్నాయి. దీనిని హారిజాంటల్ అసమానతలు' అంటారు. ఈ కోశ అసమానతలను నివారించేందులకు ఈ క్రింది ఆర్థిక సర్దుబాట్లు కూడా చేయబడినాయి.

1. కేంద్ర ప్రభుత్వ పన్నుల రాబడిలో రాష్ట్ర ప్రభుత్వాలకు వాటా
2. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు
3. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పులు.

## 12.5. భారతదేశంలో విత్త విధాన సూత్రాలు - సమస్యలు-కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తలెత్తిన ఆర్థిక వివాదాలు :

**1. రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వనరులు - అవసరాల మధ్య పెరిగిన అంతరం :** రాజ్యాంగపరంగా నిధులు, విధుల విభజన జరిగినప్పటికీ, తరచుగా కొన్ని సమస్యలు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తలెత్తుతున్నాయి. కేంద్ర ఆధీనంలో ఆదాయ వ్యాకోచత్వం గల పన్నులు వున్నాయి. కాబట్టి క్రమేపీ పన్నుల రాబడి పెరుగుతున్నది. 'అధిక ఆర్థిక వనరులు - పరిమిత బాధ్యతల' మధ్య కేంద్ర ప్రభుత్వం తేలిగ్గా సమన్వయం కుదుర్చుకోగలదు. కానీ రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఆదాయ అవ్యాకోచత్వం గల పన్నులు వున్నాయి. అందువలన వ్యయం పెరిగినంత వేగంగా పన్నుల రాబడి పెరగటల్లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక అవసరాలన్నీ చూసుకోవాలి. కాబట్టి బాధ్యతలు రోజా రోజుకూ పెరిగిపోతున్నాయి. 'పరిమిత ఆర్థిక వనరులు - అధిక బాధ్యతలు' మధ్య రాష్ట్ర ప్రభుత్వాలు తరచుగా ఆర్థిక ఇబ్బందుల నెదుర్కోవలసి వస్తున్నది.

కేంద్ర ప్రభుత్వ పన్నులగు వ్యక్తిగత ఆదాయపన్ను, కార్పొరేషన్ పన్ను, ఎక్సైజ్ సుంకాలు, కస్టమ్స్ సుంకాలు అధిక రాబడిని చూకూర్చుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం వ్యవసాయ ఆదాయపన్ను భూమిసిస్తు, భూములు, భవనాల మీద పన్ను, వాహనాల మీద పన్ను మొదలగు పన్నులతో సరిపెట్టుకోవలసి వస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో పన్నుల సంఖ్య కొండవీటి చేంతాడులా పెద్దగా వున్నా పన్నుల రాబడి మాత్రం అంతంత మాత్రంగానే వుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వాలలో పోటీతత్వం, ప్రాంతీయ పార్టీలు ప్రభుత్వాలను ఏర్పాటు చేయటం బాగా పెరిగింది. అందువలన అభివృద్ధి కార్యక్రమాలు కూడా విస్తృతంగా ఒకేసారి చేపట్టి వనరులు సరిపోక అనేక ఇబ్బందులు పడుతున్నాయి. స్థానికంగా రాష్ట్రాలు నిర్వర్తించాల్సిన విధులు కూడా రోజారోజుకు పెరగటం గమనార్హం ఏ సమస్య వచ్చినా ప్రజలు ముందుగా వత్తిడి తెచ్చేది. రాష్ట్రాల మీదే కాబట్టి రాష్ట్రాలు ఏ బాధ్యతనుండి తప్పించుకోలేవు.

**2. రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి :** మన రాజ్యాంగం ద్వారానే బలమైన కేంద్రం - బలహీనమైన రాష్ట్రాలు' ఏర్పాటు అయ్యాయి. 1947లో జరిగిన దేశ విభజన దృష్ట్యా బలమైన కేంద్ర ప్రభుత్వం వున్నప్పుడే రాష్ట్ర ప్రభుత్వాలను సమైఖ్యపరచాలని భావించబడింది. అయితే ఉమ్మడి జాబితాలో ఇప్పటికీ 47 అంశాలు వున్నందువలన రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలలో కేంద్ర ప్రభుత్వ పెత్తనం కొనసాగుతున్నది. శాంతి భద్రతలు రాష్ట్రాల విధయినప్పటికీ కేంద్రం సెంట్రల్ రిజర్వు ఆర్మీ, బోర్డర్ ఆఫ్ సెక్యూరిటీ ఫోర్సు, పారిశ్రామిక రక్షణ దళాలను ప్రవేశపెట్టి కేంద్రం జోక్యం చేసుకోవటం వలన రాష్ట్రాలకు ఆర్థిక, రాజకీయ వ్యవహారాలలో స్వతంత్రతలేకుండా పోయింది. ఈ విషయాన్ని 1979లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం విడుదలచేసిన 'కేంద్ర-రాష్ట్ర సంబంధాల డాక్యుమెంటులో వివరించటం జరగింది.

**3. ఫైనాన్సు కమీషన్ల ప్రాధాన్యత తగ్గించబడటం :** దాదాపు 1/3 వ వంతు కేంద్ర ఆర్థక వనరులు రాష్ట్రాలకు ఫైనాన్సు కమీషన్ల ద్వారానే తరలించబడతాయి. మిగిలిన 2/3 వవంతు ఆర్థిక వనరులు ప్లానింగ్ కమీషన్ ద్వారాగానీ, లేదా కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యక్షంగా గానీ రాష్ట్రాలకు తరలింపబడతాయి. ప్రణాళికల నిమిత్తం అధిక మొత్తంలో కేంద్రం నుండి రాష్ట్రాలకు తరలించే మొత్తానికి ఎటువంటి నిర్దుష్ట సూత్రాలుగానీ, ప్రాతిపదికలు గానీ లేకపోవటం శోచనీయం. అలానే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకిచ్చే నిధులు కూడా ఆర్టికల్ 282 క్రింద రాష్ట్రాలకు ఇష్టానుసారం మంజూరుచేసే స్వేచ్ఛ కల్పించబడింది. దీనికి కూడా ప్రాతిపదికలు, సూత్రాలు అంటూ ఏమీ లేనందువలన, రాష్ట్రాలకిచ్చే నిధులలో తేడాలుంటున్నాయి. కొన్ని రాష్ట్రాలకు సంతృప్తి కలిగినా మరికొన్ని రాష్ట్రాలకు అసంతృప్తే మిగిలింది. అందువలన రాష్ట్రాలు కొంతవరకు తమ స్వయం ప్రతిపత్తిని పరోక్షంగా కోల్పోయారు. ఆర్థిక వనరులధికంగా వున్న రాష్ట్రాలు ఇష్టాను సారం పథకాలు చేపట్టి, అనేక విధాలుగా రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుంటే, కొన్ని రాష్ట్రాలు మాత్రం వనరుల కొరతవలన తమ విధులను కూడా సరిగా నిర్వర్తించలేకపోతున్నాయి.

**4. ప్రాంతీయ అసమానతలను తొలగించటంలో వైఫల్యం :** వివిధ రాష్ట్రాల మధ్యగల కోశ అసమానతలు (హారిజాంటల్) మ ... గించటంలో కేంద్ర ప్రభుత్వం సంతృప్తి కరంగా వ్యవహరించటల్లేదనే విమర్శ తరచూ వినబడుతున్నది. ప్రణాళికల ఆర్థిక సహాయం నిమిత్తం ఇచ్చే మొత్తంలో 70% అప్పులు రూపంలో 30% నిధులు రూపంలో ఇవ్వబడుతుంది. ఈ నిష్పత్తి స్థిరంగా వుండటంపట్ల వెనుకబడిన రాష్ట్రాలు అసంతృప్తితోవున్నాయి. అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు పెద్ద మొత్తం అభివృద్ధి చెందుతున్న వెనుకబడిన రాష్ట్రాలకు భిన్న

మొత్తం ఇస్తున్నది. వెనుకబడిన రాష్ట్రాలపట్ల కేంద్ర ప్రత్యేక శ్రద్ధ కనబరచటల్లేదు. ఉదా : 1969-70లో ధనిక రాష్ట్రాలకు పంజాబు, హర్యానాల, వెనుకబడిన రాష్ట్రాలగు ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, బీహార్ మరియు ఆంధ్ర ప్రదేశ్‌లకంటే అధికమొత్తంలో కేంద్రం నుండి తలసరి నిధులను పొందాయి. అత్యల్పతలసరి ఆదాయం గల బీహార్ అత్యల్ప తలసరిగ్రాంటును పొందటం అనేక విమర్శలకు దారితీసింది.

అలానే అభివృద్ధి చెందిన పారిశ్రామిక రాష్ట్రాలు మొత్తం పన్నుల తరలింపులలో 1/4 వ వంతును ఫైనాన్సు కమీషన్ ద్వారా పొందాయి. అందువలన కేవలం మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు మరియు పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు నాలుగు కలిసి పన్నుల రాబడి తరలింపులలో 1/4వ వంతు ఫైనాన్సు కమీషన్ ద్వారా పొందారు.

అలానే ఫైనాన్సు కమీషన్ రాష్ట్రాల బడ్జెట్ అవసరాలకు గ్రాంట్లు ఇవ్వటానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వటం కూడా కొన్ని విమర్శలకు దారితీసింది. అభివృద్ధి చెందిన రాష్ట్రాలు సైతం బడ్జెట్‌లోటును చవిచూడాల్సి వుంటుంది. ఎక్కువ వ్యయంతో కూడిన జనాకర్షణ పథకాలు చేపట్టి, బడ్జెట్ లోటును పెద్దగా చూపించి, కేంద్రం నుండి పెద్ద మొత్తంలో నిధులను కేవలం రాజకీయ ప్రాబల్యంతో పొందగల్గుతున్నాయి. వెనుకబడిన రాష్ట్రాలు మాత్రం అసంతృప్తితో నిధులు కొరత వలన అభివృద్ధికి దూరంగా వుండాల్సి వస్తున్నది.

**5. సంకీర్ణ ప్రభుత్వంలో కేంద్రం ఏ రాష్ట్రాలకు ప్రాధాన్యత నివ్వాలి? :** కొన్ని రాజకీయ పార్టీలు కలిసి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం వలన క్రొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తనభాగస్వామ్య పార్టీ నడిపే రాష్ట్రాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి, మిగిలిన రాష్ట్రాలను చిన్నచూపు చూడటం జరుగుతున్నదనే విమర్శ తరచూ వినిపిస్తున్నది. ఆయా అనుకూల రాష్ట్రాలకు అన్ని విషయాలలో స్వయం ప్రతిపత్తిని కల్పించి, మిగిలిన రాష్ట్రాలపై ఆంక్షలు విధించటం వలన కేంద్ర ప్రభుత్వం పక్షపాత ధోరణిని అవలంభిస్తున్నదని కొందరు విమర్శిస్తున్నారు. అలానే ఉమ్మడి జాబితాలోని అంశాలనే సాకుచెప్పి రాష్ట్ర వ్యవహారాలలో కేంద్రం జోక్యం చేసుకోవటం తమను అప్రదిష్ట చేయటానికే అని కొన్ని రాష్ట్రాలు భావిస్తున్నాయి. కేంద్ర - రాష్ట్ర ఆర్థిక సంబంధాలలో రాజకీయాలెక్కువగా చోటుచేసుకుంటున్నాయనే విమర్శ సర్వత్రా విన్పిస్తున్నది.

## 12.6. ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వ ఆధిక్యత :

రాష్ట్ర ప్రభుత్వాలు ఎవరికి వారే పూర్తి స్వాతంత్ర్యం, ఆదాయ వ్యవ విషయాలలో స్వయం ప్రతిపత్తి పొందాలని ప్రయత్నిస్తున్నారు. విధులు ఎక్కువ, నిధులు తక్కువ అని రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వాన్ని నిందిస్తూ తమ అభివృద్ధికి కేంద్రం ఆటంకాలు కల్గిస్తున్నాయని భావిస్తున్నాయి. అయితే ఫెడరల్ వ్యవస్థలో 'కేంద్రం తండ్రిలాంటిది, రాష్ట్రాలు మైనర్ పిల్లలు' వంటివి. కాబట్టి అన్ని రాష్ట్రాల అభివృద్ధి సమస్యలను సానుకూలంగా పరిష్కరించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి వున్నది. కాబట్టి కేంద్ర ప్రభుత్వ ఆధిక్యత ఎందుకు కొనసాగాలి? అని కూడా చర్చించుకోవాల్సిన అవసరం కలదు.

### కేంద్ర ప్రభుత్వ ఆధిక్యత-అనుకూల వాదనలు :

**1. చారిత్రాత్మక నేపథ్యం :** ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం విధిగా అన్ని రాష్ట్రాలను సమన్వయపరచే అత్యున్నత వ్యవస్థగా వుండాలి. మన భారతదేశ చరిత్రను గమనిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది. ఈస్టిండియా కంపెనీ భారతదేశానికి వచ్చి, ఆ తరువాత మన దేశాన్ని వలస రాజ్యంగా మార్చింది. మన ప్రాదేశిక ప్రభుత్వాలులోగల అంతర్గత విభేదాలను ఆధారం చేసుకొని బ్రిటీషు వారు మన స్వాతంత్ర్యాన్నే హరించివేశారు. కాబట్టి అన్ని రాష్ట్రాలను సమన్వయ పరచేందులకు, 'భిన్నత్వంలో ఏకత్వం' సాధించేందులకు ఫెడరల్ విత్త విధానం తప్పని సరిగా కొనసాగాల్సిందే. వివిధ మతాలు, భాషలు వున్న మన రాష్ట్ర ప్రభుత్వాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలను ఒక త్రాటిమీద నడిపించే బలమైన వ్యవస్థ మనకు కావాలి.

**2. బలమైన కేంద్ర ప్రభుత్వ ఆవశ్యకత :** పై నేపథ్యంలో మన దేశానికి బలమైన కేంద్ర ప్రభుత్వం అవసరమని విధిగా గుర్తించబడింది. రాష్ట్రాలు వేరు వేరు దృక్పథాలతో, సిద్ధాంతాలతో వ్యవహరిస్తే దేశ సమగ్రతకే ముప్పు వాటిల్ల వచ్చు. కేంద్ర ప్రభుత్వం నియంత్రించపోతే ఏ రాష్ట్రానికారాష్ట్రం విడిపోయి వేరే దేశంగా కూడా ఏర్పడే అవకాశం వున్నది. మన రాష్ట్రాలగు అస్సాం, పంజాబు మరియు జమ్ము,

కాశ్మీరులలో ఈ ధోరణి కన్పిస్తూనే వున్నది. కాబట్టి ఆయా రాష్ట్రాలు విడిపోకుండా, విభేదాలను తొలగించి, అన్ని రాష్ట్రాలను సమన్వయ పరచే కేంద్ర ప్రభుత్వం బలమైనదిగా వుండాలి. లేకపోతే సోవియట్ రష్యా ఏవిధంగా విడిపోయిందో, అదే విధంగా మన ఫెడరల్ వ్యవస్థ కూడా విచ్ఛిన్నమయ్యే ప్రమాదం లేకపోలేదు. కాబట్టి 'బలమైన కేంద్రం' వుంటేనే రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయపరచి దేశంలో ఐక్యత సాధించగలదు. కాబట్టి రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిని ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వ పెత్తనం కొనసాగించక తప్పదు.

**3. రాష్ట్రాల సంకుచిత ధోరణి, స్వార్థం :** కొన్ని రాష్ట్రాలలో కొందరు వ్యాపారస్తులు, పెట్టుబడి దారులు, స్వార్థపరులు పరోక్షంగా పెత్తనం చేస్తుంటారు. అవినీతి రాజ్యమేలుతుంటుంది. నల్లధనం విశృంఖలంగా ప్రవహిస్తుంటుంది. కొందరు స్వార్థపరుల అవినీతి ధోరణి వలన ప్రభుత్వ వ్యయంలో కూడా దుబ్బారా చోటు చేసుకుంటుంది. రాష్ట్ర ప్రభుత్వ నాయకులను వీరు తమ చేతిలో కీలుబొమ్మలుగా మార్చుకొని, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పరోక్షంగా పెత్తనం కొనసాగిస్తారు. గూండాలు, లంచగొండి దారులు, కుంభకోణాలు సృష్టించేవారు, దొంగవ్యాపారస్తులు ప్రభుత్వాలతో సంబంధాలు ఏర్పరచుకొని రాష్ట్రాలను తమ జాగీర్దారులుగా మార్చుకునే అవకాశం ఏర్పడుతుంది. స్థానిక పార్టీలతో సమన్వయం కుదుర్చుకొని పెత్తనం చేస్తారు. తీవ్రవాద కార్యకలాపాలు పెరిగిపోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ నాయకులు వ్యక్తిగత రాజకీయాలు పట్ల, స్వార్థపరత్వం, లాభాపేక్షల పట్ల శ్రద్ధ కనబరచి రాష్ట్రాలలో శాంతిభద్రతలు, ఆర్థికాభివృద్ధి అనే కీలక అంశాలపట్ల శ్రద్ధ కనబరచక పోవచ్చు. ఈ పరిస్థితులలో బలమైన కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలకే నిఘా వహిస్తూ అవసరమనుకుంటే కొన్ని నియంత్రణలు విధించవచ్చు. లేదా పరిస్థితి చేయిదాటిపోతుందనుకుంటే ప్రెసిడెంట్ పరిపాలన కూడా విధించవచ్చు.

**4. ప్రణాళికల్లో పెద్దమొత్తం వ్యయం చేసినా వెనుకబాటుతనం :** 1951 ప్రణాళికల ద్వారా రాష్ట్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంత కృషిచేస్తున్నా కొన్ని రాష్ట్రాలు ఇంకా వెనుకబడే వున్నాయి. బీహార్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా మొదలగు రాష్ట్రాలు ఇంకా అనేక ఆర్థిక సమస్యలతో సతమతవుతూనే వున్నాయి. అనేక దక్షిణాది రాష్ట్రాలలో కూడా పారిశ్రామికాభివృద్ధి అంత వేగంగా జరగటల్లేదు. ఈ పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వాలు కొంత వైఫల్యం చెందాయని చెప్పక తప్పదు. కాబట్టి కేంద్ర ప్రభుత్వ సహాయం వున్నా, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపటల్లేదని తెలియుచున్నది.

**5. అభివృద్ధికి, స్వయం ప్రతిపత్తికి సంబంధం లేకపోవటం :** రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి ఉన్నంత మాత్రాన ఆయా రాష్ట్రాలలో పారిశ్రామికాభివృద్ధి, ఆర్థికాభివృద్ధి జరిగిపోతుందనుకోవటం కేవలం అపోహ మాత్రమే. స్వయం ప్రతిపత్తి ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక క్రమశిక్షణా లోపం వలన ప్రభుత్వ రాబడిపెంచుకోలేక, ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకోలేక అనేక అవస్థలు పడుతున్నాయి. కాబట్టి రాష్ట్రాల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ విధానాల మీదే ఎక్కువగా ఆధారపడి వుంటుంది. దురదృష్టవశాత్తు రాష్ట్రాలు ప్రతి ఆర్థిక సమస్యకూ కేంద్ర ప్రభుత్వమే కారణం అని నిందించటం సమంజసంకాదు.

**6. రాష్ట్రాలకు ఇప్పటికే స్వయం ప్రతిపత్తి :** రాష్ట్ర ప్రభుత్వాలకు ఇప్పటికే అనేక విషయాలలో స్వయం ప్రతిపత్తి కల్పించబడింది. వ్యవసాయం, విద్యుశ్ఛక్తి, నీటిపారుదల, సాంఘిక సంక్షేమం, శాంతి భద్రతలు మొదలగు విషయాలలో గణనీయమైన స్వేచ్ఛను కలిగి, రాష్ట్రాలు వాటి ఇష్టానుసారం విధానాలను రూపొందించుకుంటున్నాయి. పెద్ద మొత్తంలో ప్రభుత్వ వ్యయం చేయబడుతున్నా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు కావలసిన కనీస వస్తు, సేవలను అందించలేకపోతున్నాయి. శాంతి భద్రతలను కాపాడటంలో కూడా అనేక సందర్భాలలో రాష్ట్రాలు విఫలమవుతున్నాయి. అట్టి పరిస్థితులలో కేంద్ర జోక్యం లేకుండా రాష్ట్రాలు, సమస్యలనుండి బయటపడలేరు.

**7. రాష్ట్రాల రాజకీయాలు :** అన్ని రాష్ట్రాలలోనూ ఈ రాజకీయాలు రాష్ట్రాభివృద్ధికి పరోక్షంగా అవరోధం కల్పిస్తున్నాయి. శాశ్విత సమస్యల నివారణ కన్నా రాష్ట్ర ప్రభుత్వాలు తాత్కాలిక ఊరటనిచ్చే జనాకర్షణ పథకాలు చేపట్టి 'ఓటుబాంకు'ను పదిలపరచుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. సబ్సిడీలిచ్చి తాత్కాలిక ఉపశాంతిని కల్గించటం అంటే 'రోగికి రక్తమిచ్చి బ్రతికించటం' చేసినట్లే. శాశ్విత ఉపాధిని కల్పిస్తే

ప్రజలు వాళ్ళ కాళ్ళమీద వారునిలబడగలిగే శక్తిని సంపాదించుకొనగలరు. కాబట్టి రోగం తగ్గి తనంతటతాను రక్త వృద్ధిని చేసుకొనే పరిస్థితికి చేరుకుంటే ఆ రోగి పరిపూర్ణ ఆరోగ్యవంతుడయినట్లే'. ఈ రకమైన పరిస్థితి అన్ని రాష్ట్రాలలోను తీసుకురావాలంటే రాష్ట్రాలే నడుం కట్టాలి. కానీ కేంద్రాన్ని నిందిస్తే ఏమి ప్రయోజనం వుండదు. కాబట్టి రాష్ట్రాలు 'నినాదాలు' మానుకొని 'విధానాలు' మార్చుకుంటే సత్వరం అభివృద్ధి సాధించే అవకాశం వుంటుంది.

పైన పేర్కొన్న వాదనలు కేంద్ర ప్రభుత్వ ఆధిక్యత కొనసాగాల్సిందేనని వక్కాణిస్తున్నాయి. విదేశీదాడులనుండి రాష్ట్ర ప్రభుత్వాల ప్రజల ప్రాణాలను, ఆస్తులను సంరక్షించాలంటే తీవ్రవాద కార్యక్రమాలను నిరోధించాలంటే కేంద్ర ప్రభుత్వం విధిగా తన ఆధిక్యతను కొనసాగించాల్సిందే అయితే ఆర్థిక వనరులు కేంద్రం చేతిలోనే కేంద్రీకృతమై వున్నందువలన రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం నుండి తరలివచ్చే ఆర్థిక వనరుల మీద ఆధారపడకతప్పదు. కేంద్రం కూడా రాజకీయాలతో సంబంధం లేకుండా అన్ని రాష్ట్రాలను సమదృష్టితో చూసి దేశ సమగ్రతకు, అభివృద్ధికి తోడ్పడాలి.

## 12.7. కేంద్ర రాష్ట్ర విత్త సంబంధాలు మెరుగుపరచేందులకు కొన్ని సూచనలు :

1. ఫైనాన్సు కమీషన్ల పరిధిని బాగా విస్తృతపరచాల్సిన అవసరం వున్నది. తద్వారా రాష్ట్రాలకు గల ఆర్థిక ఇబ్బందులను కొంత వరకు తొలగించవచ్చు. రాష్ట్ర బడ్జెట్‌లోలోటు, వెనుకబాటుతనం, అవస్థాపనా సదుపాయాలు మెరుగుపరచుట, ప్రాంతీయ అసమానతలను తొలగించుట, పరిపాలనా స్థాయిని పెంచుట, స్థానిక ప్రభుత్వాలను అభివృద్ధి పరచుట, ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షించుట మొదలగు ప్రాతిపదికల ఆధారంగా రాష్ట్రాలకు నిధులిచ్చి కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలి.

2. పన్నుల రాబడిలో రాష్ట్రాలకు న్యాయబద్ధమైన వాటా ఇవ్వాల్సి వుంటుంది. పన్నుల రాబడిలో రాష్ట్రాలకు న్యాయబద్ధమైన వాటా ఇవ్వాల్సి వుంటుంది. పన్నుల రాబడిలో రాష్ట్రాలకు వాటి ఇచ్చేటప్పుడు కేంద్ర ప్రభుత్వం అనేక ప్రాతిపదికలను ఆధారం చేసుకొని పంపిణీ చేయాలి. రాష్ట్రాల జనాభా, వెనుకబాటు తనం, అత్యధిక తలసరి ఆదాయంగల రాష్ట్రంతో గల అంతరం, పన్నుల వసూలు, అవస్థాపనా సదుపాయాల సూచిక, కోశక్రమ శిక్షణ మొదలగు ప్రాతిపదికలపై కేంద్రం పన్నుల రాబడిలో వాటాను రాష్ట్రాలకు పంచాలి. అయితే ప్రస్తుతం వ్యక్తిగత ఆదాయపన్ను, ఎక్సైజ్ సుంకాలరాబడి ద్వారా వచ్చే మొత్తంలోనే రాష్ట్రాలకు వాటా పంచుతున్నది. అలానే కార్పొరేషన్ పన్ను మరియు కస్టమ్స్ సుంకాల రాబడిలో కూడా రాష్ట్రాలకు వాటా ఇవ్వాల్సి వుంటుంది.

3. రాష్ట్రాల మధ్య అసమానతలను తొలగించేందులకు, ముఖ్యంగా వెనుకబడిన రాష్ట్రాలకు అదనంగా సహాయపడేందులకు కేంద్రం తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకనుగుణంగా పదవ ఫైనాన్సు కమీషన్ పన్నులరాబడి ద్వారా వచ్చిన మొత్తాన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేసేందులకు క్రొత్త ప్రతిపాదనతో ఒక పంపిణీ పథకాన్ని రూపొందించాలి.

4. కేంద్రం సుంకాలలో పన్నుల రాబడిలో వాటా, నిధులు మొదలగు వనరులను రాష్ట్రాలకు అందించకపోవటంవలన రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రణాళికలను, బడ్జెట్‌లను రూపొందించుకొనటంలో ఇబ్బందులు పడవలసివస్తున్నది.

5. కేంద్రం నుండి రాష్ట్ర ప్రభుత్వాలకు పెద్ద మొత్తంలో ఆర్థిక వనరులను తరలించి 'వర్టికల్ కోశ అసమానతలను' తొలగించే ప్రయత్నం చేయాలి. తద్వారా రాష్ట్రాలు నిరంతరం కేంద్రంపై ఆధారపడి బ్రతికే పరాన్న జీవులుగా తయారవ్వవు.

6. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు కేంద్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి రాష్ట్రాలకు తగిన నిధులందించి ఆదుకోవాలి.

7. ఒక్కో సందర్భంలో నిధులిచ్చి ఆ తరువాత 'అవి అప్పులంటూ' రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం ఆందోళనకు గురిచేయకుండా ఒకేమాట మీద నిలవాలి.

8. సకాలంలో కేంద్ర పన్నుల రాబడిలో వాటా, నిధులు రాష్ట్రాలకు ఇవ్వనందున రాష్ట్రాలు 'అన్‌ఆథరైజ్‌డ్ ఓవర్ డ్రాఫ్టుల' పరిస్థితికి చేరి ఖజానా ఖాళీ అయ్యిందనే అప్రదిష్టతో అవహేళనకు గురి కావలసి వస్తున్నది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితులను సానుభూతితో అర్థం చేసుకొని, సకాలంలో, సరిపడినంత వనరులను ఇచ్చిఆదుకోవాలి.

9. కేంద్రం నుండి రావలసిన ఆర్థిక వనరులను తెచ్చుకునేందులకు రాష్ట్రాల మంత్రులు, ముఖ్యమంత్రులు ఢిల్లీ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా కేంద్రం సకాలంలో ఇవ్వాలి. ముఖ్య మంత్రులు సైతం తమ ఆత్మాభిమానానికి దెబ్బతగులుతుందని బాధపడే పరిస్థితిని వారించాలి.

10. కొన్ని రాష్ట్రాలు శాశ్వత ఫైనాన్సు కమీషన్‌ను నియమించాలని డిమాండు చేస్తున్నాయి. ప్రతి అయిదు సంవత్సరాల కొకసారి ఫైనాన్సు కమీషన్ ఏర్పడటం వలన కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాలలో రాజకీయాలు జోక్యం చేసుకునే అవకాశం వున్నదని కొన్ని రాష్ట్రాలు భావిస్తున్నాయి. అందుకే రాజకీయాలకు అతీతంగా శాశ్వత ఫైనాన్సు కమీషన్ నియమించాలనే సూచన కొంతవరకు సమంజసమే. అయితే మారుతున్న ప్రభుత్వ ఆర్థిక విధానాలకు అనుగుణంగా మార్పులు చేసుకునే అవకాశాన్ని, సర్దుబాట్లలో సరళత్వాన్ని కోల్పవలసి వుంటుందని కొందరు మేధావులు భావిస్తున్నారు.

11. ఏడవ ఫైనాన్సు కమీషన్ సూచన మేరకు కేంద్ర ప్రభుత్వం 'రాజకీయేతర ఏజన్సీ' ఒక దానిని ఏర్పాటుచేసి ఫైనాన్సు కమీషన్ సెక్రటేరియట్‌గా వ్యవహరించాలని నిర్దేశించింది. రాజకీయాలతో ముడిపెట్టకుండా అన్ని రాష్ట్రాలకు ఆర్థిక వనరుల తరలింపు జరిగేటట్లు చూడాల్సిన బాధ్యత ఈ ఏజన్సీకి అప్పచెబుతుంది.

12. కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సంబంధాలు మెరుగుపరిచేందులకు అనేక కమిటీలు, కమీషన్లు ఏర్పాటై వాటి రిపోర్టులను కూడా సమర్పించాయి. యమ్.జె.కె. తవరాజ్ కమిటీ, రాజమన్నార్ కమిటీ, పశ్చిమ బెంగాల్ క్యాబినెట్ సమర్పించిన డ్యాక్యుమెంట్లు, రిపోర్టులు అనేక విలువైన సూచనలను కేంద్రానికి ప్రతిపాదించటం జరిగింది.

13. కేంద్ర - రాష్ట్ర ఆర్థిక సంబంధాలు గురించి చర్చించిన కమిటీలలో సర్కారియా కమీషన్‌కు ప్రత్యేక స్థానం వున్నది. 1986లో సమర్పించబడిన ఈ కమిటీ రిపోర్టులో దేశ ఐక్యత, సమగ్రతలను కాపాడవలసిన బాధ్యత కేంద్రంపై వున్నదని వక్కాణించింది. కాబట్టి కేంద్రం నిర్వర్తించాల్సిన విధుల్లో ఎటువంటి మార్పు అవసరం లేదని కూడా సూచించింది. ఉమ్మడి జాబితాలోని కొన్ని విధులను రాష్ట్రాలకు అప్పగించటం ద్వారా రాజ్యాంగంలోని ఏర్పాటును మార్చాల్సిన అవసరం లేదని కూడా సూచించింది. అయితే కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను అన్ని విషయాలలో సంప్రదింపులు జరిపిన తరువాతే నిర్ణయాలు తీసుకోవాలని చెప్పింది.

14) సర్కారియా కమీషన్ ఆర్థిక ప్రతిపాదనలు అత్యంత విలువైనవిగా పేర్కొనవచ్చు. రాష్ట్రాల నుండి వసూలు చేసే కార్పొరేషన్ పన్ను రాబడిలో రాష్ట్రాలకు తప్పకుండా వాటా ఇవ్వాలని పేర్కొన్నది. పన్నుల సంస్కరణలు, వనరుల తరలింపుల గురించి విశ్లేషించి తగిన సూచనలిచ్చేందులకు మేధావుల (నిపుణుల) కమిటీలను నియమించాలని చెప్పింది. ముఖ్యంగా వ్యవసాయాదాయ పన్ను, అప్పులు, నిధుల తీరుతెన్నుల గురించి అధ్యయనాలు జరిపి తగిన మార్పులను వనరుల తరలింపులో సూచించాలని సర్కారియా కమిటీ భావించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వనరుల విభజన గురించి ఫైనాన్సు కమీషన్, ప్లానింగ్ కమీషన్లు తమ పాత్రను సమర్థవంతంగానే నిర్వహిస్తున్నాయి. కాబట్టి ఎటువంటి మార్పులు అవసరం లేదని చెప్పింది. అయితే ఫైనాన్సు కమీషన్ రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి నిర్ణయాలు తీసుకోవాలని చెప్పింది.

15) అయితే సర్కారియా కమీషన్ చేసిన ప్రతిపాదనలన్నింటిని కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ గతకొద్ది సంవత్సరాలుగా భారీ ఆదాయలోటుతో సతమతమవుతున్నందువలన కార్పొరేషన్ పన్ను ద్వారా వచ్చిన రాబడిలో రాష్ట్రాలకు వాటా ఇవ్వలేకపోతున్నది.

10వ ఫైనాన్సు కమీషన్ (1995) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్యగల కోశ అసమానతలును తొలగించాలంటే రాజ్యాంగ సవరణ అవసరమని పేర్కొన్నది. ఈ సూచనను పాటిస్తే కేంద్ర రాష్ట్ర విత్త సంబంధాలు పటిష్ఠమైన వివాదాలకు శాశ్వితంగా స్వస్తి చెప్పవచ్చు.

## 12.8 సారాంశం :

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు పటిష్టంగా వుండాలనే ఉద్దేశ్యంతో మన రాజ్యాంగం ఆయా ప్రభుత్వాల మధ్య విధులు, ఆర్థిక వనరుల పంపిణీ గురించి సవివరంగా పేర్కొన్నది. అంతేకాక ఫెడరల్ విత్త వ్యవస్థలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సంబంధాలు ఎలా వుండాలో తెలియజేసేందులకు కొన్ని మార్గదర్శక సూత్రాలను కూడా బి.పి. అడాల్కర్ లాంటి మేధావులు విశదీకరించారు. అయినప్పటికీ "బలమైన కేంద్రం - బలహీనమైన రాష్ట్రాలు' అని ముద్రపడినందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక వివాదాలు తరచుగా తలెత్తుతున్నాయి. రాష్ట్రాలు పరిమిత వనరులతో, అపరిమిత బాధ్యతలను నిర్వర్తించలేక అనేక విధాలుగా ఇబ్బందుల నెదుర్కొనవలసి వస్తున్నది. రాష్ట్రాలు కూడా 'ఆర్థిక క్రమశిక్షణ'ను అవలంబించి తమ సమస్యలనుండి తామే కొంత వరకు పరిరక్షించుకోవాలి. కేంద్ర ప్రభుత్వం కూడా సానుభూతితో, సామరస్యంతో వ్యవహరించి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడేందులకు తన వంతు కృషి చేయాలి.

## 12.9 ముఖ్య పదాలు

1. వర్టికల్ కోశ అసమానతలు - కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ వ్యయాలమధ్యగల వ్యత్యాసం
2. హారిజాంటల్ కోశ అసమానతలు - వివిధ రాష్ట్రాల ఆదాయ వ్యయాలమధ్యగల వ్యత్యాసం
3. ఆదాయ అవ్యాకోచత్వం - ఆదాయంలో మార్పులేకపోవటం
4. ఆర్థిక (కోశ) క్రమశిక్షణ - ఆదాయ వ్యయాలను హేతుబద్దంగా బేరీజు వేయుటం.

## 12.10 స్వయం సమీక్ష ప్రశ్నలు :

1. మన రాజ్యాంగం బలమైన కేంద్రం - బలహీనమైన రాష్ట్రాలను ఏర్పాటు చేసింది, చర్చింపుము.
2. ఫెడలర్ విత్త విధాన సూత్రాలేవి? అవి మన దేశానికి ఎంత వరకు వర్తిస్తాయి.
3. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్యగల ఆర్థిక వివాదాలకుగల కారణాలేవి? వాటిని పరిష్కరించేందుకుగల మార్గాలను తెలియజేయుము.

## అభ్యాసాలు :

1) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధులు - ఆర్థిక వనరులు
2) రాష్ట్ర ప్రభుత్వ విధులు - ఆర్థిక వనరులు
3) విత్త విధాన సూత్రాలేవి?
4) కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక వివాదాలు
5) ఆర్థిక వివాదాలు - రాజకీయాలకు గల సంబంధం
6) సర్కారియా కమీషన్ ప్రతిపాదనలు

**12.11॥ చదవవలసిన పుస్తకాలు :**


1. O.P. Tiwari - Federalism and Centre- State Relations in India. Deep & Deep publications, New Delhi
2. G. Timmaiah - Federal Fiscal Systems of Australia and India Associated publishing House, New Delhi
3. Alka Guptha - Public Finance and Tax planning Anmol Publications Pvt. Ltd., New Delhi
4. Radhee Shyam - Financial Administration King Books Educational Publications, Delhi.


డా॥ ఎల్. క్రిష్ణవేణి

పాఠం - 13

# ఫైనాన్స్ కమీషన్ల ప్రతిపాదనలు - ఒక సమీక్ష

## పాఠ్య నిర్మాణ క్రమం

13.0 ఉద్దేశాలు
13.1 ఉపోద్ఘాతం
13.2 ఫైనాన్సు కమీషన్ ఏర్పాటు
13.3 ఫైనాన్సు కమీషన్ విధులు
13.4 భారత విత్త వ్యవస్థలో ఫైనాన్సు కమీషన్ పాత్ర
13.5 ఫైనాన్సు కమీషన్ల పై విమర్శలు - సూచనలు
13.6 సారాంశం
13.7 ముఖ్య పదాలు
13.8 స్వయం సమీక్ష ప్రశ్నలు
13.9 చదవవలసిన పుస్తకాలు

## 13.0 ఉద్దేశ్యాలు

ఈ పాఠ్యభాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది అంశాలను తెలుసుకొనగలరు.

1. ఫైనాన్సు కమీషన్ల పుట్టుక - విధుల గురించిన ప్రాథమిక అవగాహన, వివిధ ఫైనాన్సు కమీషన్ల నియామక వివరాలు తెలుసుకోగలగాలి.

2. పన్నుల రాబడిలో వాటా, నిధులు, అప్పుల రూపంలో కేంద్రప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వాలకు తరలింపబడే ఆర్థికవనరులను సమీక్షించగలగాలి

3. మనదేశంలో ఫైనాన్సు కమీషన్ల తీరుతెన్నులపై వచ్చిన విమర్శలను చర్చించి తగిన సూచనలను ఇవ్వగలగాలి.

## 13.1 ఉపోద్ఘాతం

ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిధుల పంపిణీ, నిధుల విభజన ఎలా వుండాలో నిర్ణయించేందులకు ఫైనాన్సు కమీషన్‌ను నియమించాల్సిన అవసరం వున్నదని మన రాజ్యాంగం గుర్తించింది. కేంద్రప్రభుత్వం ఆదాయపన్ను ద్వారా, ఎక్సైజ్ సుంకాల ద్వారా వచ్చే రాబడిలో రాష్ట్రాలకు ఎంతవాటా ఇవ్వాలి? ఏ సిద్ధాంతాల ప్రాతిపదిక మీద రాష్ట్రాలకు నిధులను కేటాయించాలి? రాష్ట్రాలకు ఏఏ పరిస్థితులలో ఎంత మేరకు అప్పులివ్వాలి అని నిర్ణయించాల్సిన బాధ్యతను గుర్తించి ప్రతి అయిదు సంవతవసరాల కొకసారి ఫైనాన్సు కమీషన్‌ను కేంద్రప్రభుత్వం నియమిస్తుంది. ప్రణాళికేతర ఆర్థికవనరుల తరలింపు రాష్ట్రాలకు కేంద్రం నుండి ఏవిధంగా జరగాలో తెలియజేస్తుంది.

## 13.2 ఫైనాన్సు కమీషన్ ఏర్పాటు

మన రాజ్యాంగంలో ఆర్టికల్ 280 క్రింద ఫైనాన్సు కమీషన్‌ను ఏర్పాటు చేయటానికి అవకాశం కల్పించబడింది. ప్రతి అయిదు సంవత్సరాలకొకసారి, ఒక్కోసందర్భంలో ఇంకా అయిదేళ్ళ గడువు పూర్తవకుండానే అవసరాన్ని బట్టి ప్రెసిడెంట్ ఆదేశంతో ఫైనాన్సు కమీషన్

ఏర్పాటు చేయబడుతుంది. ఫైనాన్సు కమిషన్‌లో ఒక చైర్మన్, నలుగురు సభ్యులు వుంటారు. వీరందరూ ప్రెసిడెంట్ చే నియమింపబడతారు. చైర్మన్‌గా నియమించబడే వ్యక్తి ప్రజావ్యవహారాలలో అనుభవం ఘడించిన వ్యక్తి అయివుండాలి. మిగిలిన నలుగురు సభ్యులకు ఈ క్రింది అర్హతలలో ఏదైనా ఒకటి కలిగి యుండాలి.

(i) హైకోర్టు జడ్జిలుగా నియమించటానికి గల అర్హతలు కలిగి వుండాలి.

(ii) విత్త వ్యవహారాలలో మరియు ప్రభుత్వ గణాంకాలలో విశేష అనుభవం కలిగి యుండాలి

(iii) ఆర్థిక వ్యవహారాలలో, పరిపాలనలో అనుభవజ్ఞులై ఉండాలి

(iv) అర్ధశాస్త్రంలో ప్రత్యేక విజ్ఞానాన్ని కల్గినవారై వుండాలి.

## 13.3 ఫైనాన్సు కమీషన్ విధులు:

(i) కేంద్రప్రభుత్వానికి పన్నుల ద్వారా వచ్చేనికర రాబడిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ చేయటం, ఆ రాబడిని వివిధ రాష్ట్రాల మధ్య ఏ విధంగా పంపిణీ చేయాలో ఫైనాన్సు కమిషన్ తెలియజేస్తుంది.

(ii) కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకిచ్చే నిధులను నిర్ణయించే సూత్రాలను నిర్ణయించటం కూడా ఫైనాన్సు కమిషన్ యొక్క బాధ్యతగా చెప్పవచ్చును

(iii) పటిష్ట విత్తానికి సంబంధించిన ఏ అంశమైనా ప్రెసిడెంట్ ఫైనాన్సు కమిషన్‌కు అధ్యయన నిమిత్తం అప్పగించవచ్చు. అవి ఏమనగా:

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీల వాటాఎలా వుండాలి?

కేంద్ర ప్రభుత్వం కల్సాడి డేటెట్ విత్తాన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేసేటప్పుడు ఏ సిద్ధాంతాలమీద పంపిణీ చేయాలి.

(iv) గిరిజనులు నివసించే ప్రాంతాలకు నిధులను పంపిణీచేయటం

(v) ఏ రాష్ట్రానికైనా ప్రత్యేక గ్రాంట్లను కేటాయించటం

## 13.4 భారతవిత్తవ్యవస్థలో ఫైనాన్సు కమిషన్ల పాత్ర

మన విత్తవ్యవస్థలో ఫైనాన్సు కమిషన్ నిర్వహించేపాత్రను సవివరంగా తెలుసుకోవాలంటే ఈ క్రింది అంశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సిన అవసరం వున్నది.

వివిధ ఫైనాన్సు కమిషన్ల నియామకాల వివరాలు

పన్నుల రాబడి పంపిణి

(i) ఆదాయపన్ను రాబడి పంపిణీ

(ii) ఎక్సైజ్ సుంకాల రాబడి పంపిణి

(iii) కేంద్ర పన్నుల రాబడి కూడలిలో రాష్ట్రాల వాటాను నిర్ణయించే నిర్దేశకాలు.

(iv) కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకిచ్చే నిధులు

(v) కేంద్ర ప్రభుత్వం రాష్ట్రలకిచ్చే అప్పులు

### 13.4.1 వివిధ ఫైనాన్సు కమిషన్ల నియామకం-వివరాలు

ఇప్పటి వరకు మనదేశంలో 12 ఫైనాన్సు కమిషన్లు నియమించబడినాయి ప్రస్తుతం 11వ ఫైనాన్సు కమిషన్ ప్రతిపాదనలు అమలు చేయబడుతున్నాయి. ప్రతి ఫైనాన్సు కమిషన్ రాబోయే అయిదు సంవత్సరాల కాలంలో ఏవిధంగా కేంద్రం నుండి రాష్ట్రాలకు పన్నుల

రాబడి, నిధులు పంపిణీ చేయాలో ముందుగానే ప్రతిపాదిస్తుంది. వివిధ నిష్ణాతుల కమిషన్లు లేక కమిటీలు కాలానుగుణంగా కేంద్రరాష్ట్రాలమధ్య ఆర్థికవనరుల పంపిణీకి చేసిన సూచనలను పరిగణనలోనికి తీసుకుని ఫైనాన్సు కమిషన్ తన ప్రతిపాదనలను చేస్తుంది.

(i) వివిధ కమీషన్ల కాలంలో రిపోర్టు సమర్పించబడింది. (ii) ఏ ఏ సంవత్సరాలలో ఈ కమిషన్లను నియమించింది, వివిధ కమిషన్లకాలం (iii) ఏ సంవత్సరంలో కమిషన్ రిపోర్టు సమర్పించబడింది. (iv) ఆయా కమిషన్ల చైర్మన్లు మొదలగు విషయాలకు సంబంధించినవి ఈ క్రింది పట్టికలో పొందుపరచబడినాయి.

పట్టిక - 1 :

**ఫైనాన్సు కమిషన్ల నియామకాల వివరాలు**

| ఫైనాన్సుకమిషన్ | నియామక సంవత్సరం | రిపోర్టు సమర్పించిన సంవత్సరం | చైర్మన్ |
|---|---|---|---|
| మొదటి 1952-57 | నవంబరు, 1951 | డిసెంబరు, 1952 | శ్రీ. కె.సి. నియోగి |
| రెండవ 1957-62 | జూన్, 1956 | సెప్టెంబర్ 1957 | శ్రీకె. సంతానం |
| మూడవ 1962 - 66 | డిసెంబరు 1960 | డిసెంబరు 1961 | శ్రీ ఎ.కె. చందా |
| నాల్గవ 1966 - 69 | మే 1964 | ఆగస్టు, 1965 | డా.పి.వి. రాజమన్నార్ |
| అయిదవ 1969 - 74 | ఫిబ్రవరి 1968 | జూలై 1969 | శ్రీ. మహవీరత్యాగి |
| ఆరవ 1974 - 79 | జూన్, 1972 | జూన్,1973 | శ్రీ.కె. బ్రహ్మానంద రెడ్డి |
| ఏడవ 1979 - 84 | జూన్, 1977 | అక్టోబర్, 1978 | శ్రీ. జె.ఎమ్. షబీర్ |
| ఎనిమిదవ 1984 - 89 | జూన్, 1982 | ఏప్రిల్, 1984 | శ్రీ.వై.బి. చవాన్ |
| తొమ్మిదవ 1989-90 1990-95 | డిసెంబర్ 1989 | మార్చి 1990 | శ్రీ. యన్. కె.పి.సాల్వే |
| పదవ 1995 - 2000 | జూన్, 1992 | నవంబర్, 1993 | శ్రీ.కె.సి. పంత్ |
| పదకొండవ 2000-2005 | జూలై 1998 | జూలై 2000 | శ్రీ.ఎ. యమ్. ఖుస్రో |
| పన్నెండవ 2005-2010 | జూన్,2003 | జూలై 2004 | డా.సి. రంగరాజన్ |

## 13.4.2 పన్నులరాబడి పంపిణీ

కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష పన్నులు, పరోక్ష పన్నులను విధించి వివిధ రాష్ట్రాల నుండి పన్నుల రాబడిని పొందుతుంది. ప్రత్యక్ష పన్నులు వ్యవసాయాదాయాలు తప్ప మిగిలిన అన్నిరకాల ఆదాయాల మీద విధించబడతాయి. ప్రత్యక్ష పన్నులు ఏ వ్యక్తిమీద లేక సంస్థ మీద విధించబడినాయో వారు విధిగా చెల్లించాల్సి వుంటుంది. పరోక్ష పన్నులు వస్తువులమీద విధించబడతాయి ఒకవ్యక్తి మీద పన్ను విధించబడితే, ఆ వ్యక్తి పన్నుభారాన్ని వేరొక వ్యక్తికి తరలించటానికి అవకాశమున్న వాటిని పరోక్ష పన్నులు అంటారు. కేంద్రం విధించే ఈ పన్నులు అన్ని రాష్ట్రాల ప్రజల నుండి వసూలు చేయబడతాయి. కాబట్టి, కేంద్ర ప్రభుత్వం విధిగా తన పన్నుల రాబడిలో రాష్ట్రాలకు కొంత వాటా పంచాల్సి వుంటుంది. అలానే పన్నుల రాబడిని వివిధరాష్ట్రాల మధ్య పంపిణీ చేయటంలో కూడా ఏ విధంగా వాటా నిర్ణయించాలో కూడా ఫైనాన్సు కమీషన్లు ప్రతిపాదిస్తాయి.

(a) **ఆదాయపన్ను రాబడి - పంపిణీ** : వ్యక్తిగత ఆదాయాలపై కేంద్రం పన్ను విధించి, వివిధ రాష్ట్రాలనుండి వసులు చేస్తుంది. ఆపన్నులరాబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మనరాజ్యాంగంలో ఆర్టికల్ 270 సూచించిన విధంగా పంపిణీ జరగాలి. అయితే ఏ ప్రాతిపదిక మీద రాష్ట్రాలకు ఆదాయపన్ను రాబడి పంచాలో ఫైనాన్సు కమీషనే నిర్ధారిస్తుంది. ఫైనాన్సు కమీషన్ ఈ క్రింది అంశాలుపై ఆధారపడి రాష్ట్రాలకు ఆదాయపన్ను రాబడిని పంపిణి చేస్తుంది.

(i) ఆదాయంకున్న మొత్తం రాబడిలో రాష్ట్రాల వాటా ఎంత వుండాలి?

(ii) పన్నుల వాటాను ఏ ప్రాతిపదిక మీద రాష్ట్రాలకు పంపిణీ చేయాలి?

ఈ పై అంశాల ఆధారంగా వివిధ ఫైనాన్సు కమీషన్లు వేరువేరు ప్రతిపాదనలు చేసాయి

(iii) జనాభా మరియు పన్నుల వసూలు ఏ మేరకు చేశాయి అనే ప్రాతి పదిక మీద ఆదాయపన్ను రాబడి పంపిణీ చేయబడుతుంది.

పట్టిక - 2

**ఆదాయపన్నురాబడి పంపిణీ - వివిధ ఫైనాన్సు కమీషన్ల ప్రతిపాదనలు**

| ఫైనాన్సు కమీషన్ | ఆదాయపన్ను రాబడిలో రాష్ట్రాల వాటా% | రాష్ట్రాలకు ఆదాయపన్ను పంపిణీ జనాభా % | పన్ను వసూలు % |
|---|---|---|---|
| మొదటి | 55 | 80 | 20 |
| రెండవ | 60 | 90 | 10 |
| మూడవ | 65 | 80 | 20 |
| నాల్గవ | 75 | 80 | 20 |
| అయిదవ | 75 | 90 | 10 |
| ఆరవ | 80 | 90 | 10 |
| ఏడవ | 85 | 90 | 10 |
| ఎనిమిదవ | 85 | 90 | 10 |
| తొమ్మిదవ | 85 | 90 | 10 |
| పదవ | 77.5 | 95 | 5 |

పైన చూపిన పట్టికలో ఆదాయపన్నురాబడిలో రాష్ట్రాల వాటా క్రమంగా 55%నుండి 85% వరకు పెరిగె, పదవఫైనాన్సు కమిషన్ కాలానికి మాత్రం 77.5% కు తగ్గించబడింది. అసలే బాధ్యతలు పెరిగి ఆర్థిక వనరులు సరిపోక అవస్థపడే రాష్ట్రాలకు ఇది ఇబ్బందిని కలుగ జేస్తుంది.

అలానే జనాభా ప్రాతిపదిక మీద రాష్ట్రాలకు ఆదాయపన్ను రాబడిని పంపిణీ చేయటం మంచి సాంప్రదాయమే. తదనుగుణంగా క్రమేపీ జనాభా ప్రాతిపదికకు ప్రాదాన్యత పెరుగుతున్నట్లు కూడా పట్టికను బట్టి తెలియుచున్నది.

అయితే రాష్ట్రాలు ఆదాయపన్నురాబడిని వసూలు చేయటం అనే విషయాన్ని కూడా ప్రాతిపదికగా తీసుకోవటం జరుగుతున్నది. అయితే ఈ ప్రాతిపదిక ప్రాధాన్యత క్రమేపీ తగ్గటం కొన్ని ధనిక రాష్ట్రాలకు నిరాశను కలుగజేస్తుంది

జనాభా ప్రాతిపదిక వలన అధిక జనాభాగల రాష్ట్రాలు అధికవాటాను పొందుతాయి అయితే ఏ రాష్ట్రాలయితే అధిక మొత్తంలో ఆదాయపన్ను రాబడిని పసూలు చేస్తాయో వారు నిరాశపడకతప్పదు. నిజాయితీగా పన్ను చెల్లించటం వలన, అధికజనాభా ఆదాయస్థాయి పెరిగినందున వారు పెద్దమొత్తంలో చెల్లించగల్గుతున్నారు. అయితే ఆయా రాష్ట్రాలు అబివృద్ధి చెందిన ధనిక రాష్ట్రాలుగా పరిగణించి కేంద్రప్రభుత్వం 'పన్నుల వసూలు' అనే ప్రాతిపదిక ప్రాధాన్యతను తగ్గించింది అధిక పన్నురాబడిని సమకూర్చే రాష్ట్రాల కంటే అధిక జనాభాగల పేద రాష్ట్రాలకు బాగాసహాయపడి, తద్వారా రాష్ట్రాల మధ్య ఆర్థికవ్యత్యాసాలు తొలగించవచ్చని ఫైనాన్సు కమిషన్లు అబిప్రాయపడుతున్నాయి

ఎనిమిదవ ఫైనాన్సు కమిషన్ వివిధ రాష్ట్రాల మధ్య ఆదాయపన్ను రాబడిని పంపిణీ చేయటంలో ఒక క్రొత్తఫార్ములా ను రూపొందించినది. దీని ప్రకారం:

(a) 10% - పన్ను సమకూర్చటమనే ప్రాతిపదికపై

(b) 90% - జనాభాకు సంబంధించిన ఈ క్రింది అంశాల ప్రాతిపదికపై

(i) 25% - జనాభా ప్రాతిపదికపై

(ii) 25% - రాష్ట్రాల తలసరి ఆదాయం రాష్ట్ర జనాభా ప్రాతిపదికపై

(iii) 50% - అత్యధిక తలసరి ఆదాయం (పంజాబు) మరియు ఆయారాష్ట్రాల తలసరి ఆదాయానికి గల అంతరం ఆయా రాష్ట్ర జనాభా

ఈ పై మూడు కారకాల ఫార్ములా ద్వారా వివిధ రాష్ట్రాల మధ్య సమానత్వం తీసుకురావటం సాధ్యపడుతుందని 8వ ఫైనాన్స్ కమీషన్ భావించింది.

తొమ్మిదవ ఫైనాన్సు కమిషన్ పై ఫార్ములాకు ఈ క్రింది అంశాలు కూడా జోడించి ఆదాయపన్నులరాబడి పంపిణీ నిర్ధారించాలి అని ప్రతిపాదించింది.

(i) షెడ్యూలు కులాలు మరియు తెగల జనాభా

(ii) 1981 సెన్సెస్ లెక్కల ప్రకారం వివిధ రాష్ట్రాలలో గల వ్యవసాయ కార్మికుల సంఖ్య

అధిక సంఖ్యలో షెడ్యూలు కులాలు, తెగలు, వ్యవసాయ కార్మికులు గల రాష్ట్రాలు, వారికిగల అదనపు భాద్యతలను నిర్వహిం చేందులకుగాను అధిక మొత్తంలో ఆదాయపన్ను రాబడి వాటాను కేంద్రం నుండి పొందేదులకు అవకాశం ఏర్పడుతుంది.

(b) **ఎక్సైజ్ సుంకాల రాబడి పంపిణీ:** ఆదాయపన్ను రాబడిలాగా, ఎక్సైజ్ సుంకాల పన్నురాబడి కూడా కేంద్ర, రాష్ట్రాల మధ్య పంపిణీ చేయబడతాయి. ఏ ఏ వస్తువులపై వచ్చిన సుంకాల రాబడిని రాష్ట్రాలకు పంచాలో ఫైనాన్సు కమిషన్ నిర్ధారిస్తుంది అన్ని రకాల వస్తువులపై ఎక్సైజ్ సుంకాలు వుండవు. కాబట్టి ఈ విషయాన్ని కమిషన్ ముందుగా నిర్ధారించుకోవాలి.

వివిధ ఫైనాన్సు కమీషన్ల ప్రతిపాదనలననుసరించి మొత్తం ఎక్సైజ్ సుంకాల రాబడిలో రాష్ట్రాలకు ఎంత వాటా పంచాలి? ఎన్ని వస్తువులపై ఎక్సైజ్ సుంకాలు విధించాలి? రాష్ట్రాలకు ఏ ప్రాతిపదిక మీద వాటా ఇవ్వాలి? అనే విషయాలకు సంబంధించిన వివరాలను ఈ క్రింది పట్టిక ద్వారా వివరింపబడినాయి

పట్టిక - 3

**ఎక్సైజ్ సుంకాల రాబడిలో రాష్ట్రాలకు వాటా - వివిధఫైనాన్సు కమీషన్ల ప్రతిపాదనలు**

| ఫైనాన్సు కమీషన్ | రాష్ట్రాలవాటా % | ఎక్సైజ్‌సుంకాల క్రింద వస్తువులు | పంపిణీకి మూలం జనాభా % | పంపిణీకి మూలం వెనుకబాటుతనం % |
|---|---|---|---|---|
| మొదటి | 40 | 3 | 40 | 60 |
| రెండవ | 25 | 8 | 40 | 60 |
| మూడవ | 20 | 35 | 40 | 60 |
| నాలుగవ | 20 | అన్ని వస్తువులు | 80 | 20 |
| అయిదవ | 20 | " | 80 | 20 |
| ఆరవ | 20 | " | 75 | 25 |
| ఏడవ | 40 | " | 25 | 75 |
| ఎనిమిదవ | 45 | " | 25 | 75 |
| తొమ్మిదవ | 45 | " | 25 | 75 |
| పదవ | 47.5 | " | 20 | 80 |

పై పట్టికలో రాష్ట్రాల కిచ్చే ఎక్సైజ్ సుంకాల రాబడి గురించి ఫైనాన్సు కమీషన్లు భిన్నమైన ప్రతిపాదనలు చేశాయి. అయితే క్రమేపీ రాష్ట్రాలకు అధికవాటా కేటాయించటం వలన రాష్ట్రాలు కొంతవరకు వనరుల కొరతను తట్టుకోగలుగుతున్నాయి. అయితే మొదట్లో అన్ని రకాల వస్తువులు ఎక్సైజ్‌సుంకాల పరిధిలోకి రాలేదు. కానీ క్రమేపి నిత్యావసరవస్తువులు, హాయిని గొలిపే వస్తువులు, విలాస వస్తువులు కూడా ఎక్సైజ్ సుంకాల పరిధిలోనికి తేబడినాయి.

మొదటి మూడు ఫైనాన్సు కమీషన్లు రాష్ట్రాలకు వాటాని పంపిణీ చేయటంలో జనాభా ప్రాతిపదికకు 40% వెయిటేజీ ఇచ్చాయి. ఆతరువాత నాలుగు నుండి అయిదవ ఫైనాన్సు కమీషన్ల వరకు 80% నుండి 75% వరకు వెయిటేజి ఇచ్చినా, ఏడవ ఫైనాన్స్ కమీషన్ నుండి జనాభాకు వెయిటేజి 2.5% అంతకేటే తక్కువే ఇవ్వటం జరిగినది.

రాష్ట్రాల వెనుకుబాటుతీనానికి కూడా మొదట్లో 60% వున్నప్పటికీ, నాల్గవ ఫైనాన్స్ కమీషన్ 20%కు వెయిటేజి తగ్గించింది మరలా ఏడవ ఫైనాన్స్ కమీషన్ 75%., ఆపైనా వెయిటేజి పెంచింది. ఏదిఏమయినా ఎక్సైజ్ సుంకాల రాబడి పంపిణీలో వెనుక బాటుతనానికి ప్రాధాన్యత నివ్వటం వలన వెనుకబడిన రాష్ట్రాలకు అభివృద్ధి చెందిన రాష్ట్రాల కంటే ఎక్కువ ప్రయోజనం చేకూరింది.

మొదట్లో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లాంటి ఆధిక జనాభాగల రాష్ట్రాలు బాగా లాభించాయి. కానీ ఏడవ ఫైనాన్సు కమీషన్ ఎక్సైజ్ సుంకాలరాబడిని రాష్ట్రాలకు పంపిణీ చేయటం గురించి క్రొత్త ఫార్ములాను కనిపెట్టింది.

(i) జనాభా

(ii) రాష్ట్రతలసరి ఆదాయంలో పెరుగుదల

(iii) రాష్ట్రంలో పేదవారి శాతం

(iv) వివిధ రాష్ట్రాల మధ్య ఆదాయ సమానత్వ నమూనా

ఎనిమిదవ ఫై.క లోటు నెదుర్కొంటున్న రాష్ట్రాలకు తొమ్మిదవ ఫైనాన్స్ కమీషన్ ఈ క్రింది పద్ధతి ననుసరించి ఎక్సైజ్ సుంకాల రాబడిని పంపిణీ చేసింది.

| ప్రాతిపదిక | శాతం |
|---|---|
| 1. జనాభా | 25% |
| 2. మొత్తం జనాభా (1971) | 12.5% |
| 3. వెనుక బాటు తనం సూచిక | 12.5% |
| 4. తలసరి ఆదాయ దూరం | 33.5% |
| 5. లోటు గల రాష్ట్రాలు | 16.5% |

అత్యధిక తలసరి ఆదాయం గల రాష్ట్రానికి, ఆయా రాష్ట్ర తలసరి ఆదాయానికి గల (వ్యత్యాసం) దూరం

(e) **కేంద్రపన్నుల రాబడి మొత్తంలో రాష్ట్రాల వాటాను నిర్ణయించే ప్రాతిపదిక :** కేంద్ర ప్రభుత్వం పన్నుల ద్వారా, సుంకాల ద్వారా పొందిన రాబడిని మొత్తం నుండి రాష్ట్రాలకు వాటా నిర్ణయించేందులకు పదకొండవ ఫైనాన్స్ కమీషన్ కొన్ని సవరణలు చేస్తూ క్రొత్త ప్రతిపాదనలు చేసింది. ఈ ప్రతిపాదనలు పదవ ఫైనాన్స్ కమీషన్ ప్రతిపాదనల కంటే ఏ విధంగా మార్పులు చేయబడినాయో తెలుసుకోవాలంటే ఈ క్రింది పట్టిక-4 ను పరిశీలించాల్సియున్నది.

పట్టిక - 4

రాష్ట్రాల వాటా నిర్ణయించే ప్రాతిపదికలు వెయిట్లు (శాతం)

| | ప్రాతిపదిక | వెయిట్‌లు | |
|---|---|---|---|
| | | పదవ ఫైనాన్స్ కమీషన్ | పదకొండవ ఫైనాన్స్ కమీషన్ |
| 1. | జనాభా | 20.00 | 10.00 |
| 2. | ఆదాయదూరం | 60.00 | 62.50 |
| 3. | భూభాగం | 5.00 | 7.50 |
| 4. | అవస్థాపనా సూచిక | 5.00 | 7.50 |
| 5. | పన్నుల కృషి | 10.00 | 5.00 |
| 6. | కోశ క్రమశిక్షణ | - | 7.50 |
| | మొత్తం | 100.00 | 100.00 |

## ప్రాతిపదికలలో వచ్చినమార్పులు

(i) జనాభా ప్రాతిపదికకు వెయిటేజి 20% నుండి 10%కు తగ్గించబడింది.

(ii) భూభాగానికి, అవస్థాపనా సూచికలకు 5% నుండి 7.50%కు వెయిటేజి పెంచబడింది.

(iii) పన్నుల కృషికి వెయిటేజి 10% నుండి 5.00%కు తగ్గించబడింది.

(iv) ఆదాయ దూరానికి వెయిటేజి 60.% నుండి 62.5%కు పెంచబడింది

(v) కోశ క్రమశిక్షణకు క్రొత్తగా పదకొండవ ఫైనాన్స్ కమీషన్ వెయిటేజి ఇవ్వటం ప్రారంభించటమే కాక, 7.50% వరకు నిర్ణయించింది రాష్ట్రాల సొంత రెవిన్యూ రాబడికి ఆయారాష్ట్రమొత్తం రెవిన్యూ వ్యయానికి గల నిష్పత్తిలో మెరుగుదలనే కోశ క్రమశిక్షణ అని నిర్వచించవచ్చును. ఇదే విధంగా ప్రతి రాష్ట్రానికోశ క్రమశిక్షణను లెక్కించాల్సి వుంటుంది. ఆయారాష్ట్రాలు రెవిన్యూరాబడిని పెంచుకునేందులకు, రాబడి వ్యయాన్ని తగ్గించుకునేందులకు చేసే కృషిని బట్టి కోశ క్రమశిక్షణ లేదా ఆయ రాష్ట్రాల కోశ ఆరోగ్యాన్ని లెక్కించవచ్చును. పన్నుల

వసూలుకై ఆయా రాష్ట్రాలు చేసే కృషిని బట్టి రెవిన్యూరాబడిలో పెరుగుదల వుంటుంది. ఏమైనప్పటికి కోశబాలన్సు తక్కువగా సూచించిన రాష్ట్రాల కంటే మెరుగైన కోశబ్యాలన్సును సూచించిన రాష్ట్రాలకు అధిక మొత్తంలో పన్నుల రాబడి పంచబడుతుంది.

రాష్ట్రాల కిచ్చే వాటాలో తెచ్చిన మార్పుల గురించి ప్రొ. జయతిఘోష్ తీవ్ర అభ్యంతరాన్ని తెలియజేశారు. ఆమె క్రొత్తఫారుమలాను ప్రవేశపెట్టటం ద్వారా రాష్ట్రాలకు అన్యాయంచేయ బడిందని అపాదించారు. కోశ క్రమశిక్షణకు **7.5%** వెయిటేజి ఇవ్వటం ద్వారా, పన్నుల కృషికి వెయిటేజి 10%నుండి 5%కు తగించటం ద్వారా రాష్ట్రాలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. పన్నుల రాబడిని ప్రాధాన్యత తగ్గిస్తే, ఎక్కువ పారదర్శకత సమానత్వాన్ని పాటించే రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని కూడా అభ్యంతరాన్ని తెలియజేశారు.

## 13.4.3 కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకిచ్చే నిధులు (గ్రాంట్లు)

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్టికల్ 275 ప్రకారం అభివృద్ధి నిమిత్తం నిధులు ఇవ్వటం జరుగుతుంది. ఏ రాష్ట్రానికి ఎంత మేరకు నిధులు ఇవ్వాలి అనే అంశం ఫైనాన్సు కమీషన్ చేసే ప్రతిపాదనలపై ఆధారపడి వుంటుంది. నిధులను పంపిణీ చేయటంలో ఫైనాన్సు కమిషన్ రాష్ట్రాల స్థితిగతులను అధ్యయనం చేసి ఎప్పటికప్పుడు కొన్ని మార్గదర్శక సూత్రాలను తయారుచేస్తుంది. ఈ సిద్ధాంతాల ప్రాతిపదిక మీదే కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తుంది. వివిధ రాష్ట్రాలలోగల షెడ్యూలు తెగల అభివృద్ధి కోసం పథకాలు చేపటేందులకు కూడా కేంద్రప్రభుత్వం కొంత నిధులు ఇస్తుంది. ఈ లక్ష్యంతో అస్సాం, బీహార్, ఒరిస్సా మరియు పశ్చిమ బెంగాల్‌లకు ప్రత్యేక నిధులు ఇవ్వబడుతున్నాయి.

**నిధుల ఆవశ్యకత**

1. రాజ్యాంగ పరంగా జరిగిన అర్థికపంపిణీలో కేంద్రానికి అధిక అదాయవనరులు. రాష్ట్రాలకు తక్కువ ఆదాయ వనరులు అభించాయి. రాష్ట్రాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందులకు ఆర్థికవనరులు లేవు కాబట్టి సహాయ నిమిత్తం కేంద్రం నిధులు ఇస్తుంది.
2. రాజ్యాంగంలో విధుల విభజన ద్వారా రాష్ట్రాలకు క్రొత్తగా సంక్రమించిన బాధ్యతలను చేపట్టేందులకు ఆయ్యేవ్యయాన్ని రాష్ట్రాలు స్వయంగా సమకూర్చుకోలేని పరిస్థితిలో వున్నాయి. కాబట్టి కేంద్రం కొంతనిధులు ఇచ్చి రాష్ట్రాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి.
3. వివిధరాష్ట్రాల ఆదాయాలు, పన్నులరాబడి, వ్యయం, అప్పులు మొదలగునవి భిన్నంగా వుంటాయి. వీటిలో కోశ అసమానతలు అంటారు. అంతేకాక భౌగోళిక, జనాభా పర విషయాలలో అనేక తేడాలుంటాయి. ఈ తేడాలు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అసమానతలను పెంచుతున్నాయి. ఈ సందర్భంలో నిధులిచ్చి కేంద్రం అన్ని రాష్ట్రాల సమాన అభివృద్ధికి తోడ్పడాలి.
4. వెనుకబడిన రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేకంగా నిదులిచ్చి ఆదుకోవాలి.

## నిధుల విభజన

**(A) షరతుల మీద ఇచ్చే నిధులు:**

కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు పంపిణీ చేసేటప్పుడు విధిగా కొన్ని నియమాలు పాటించాల్సి వుంటుంది. రాష్ట్రాలు నిధుల మొత్తాన్ని వాటి యిష్టానుసారం వినియోగించుకునే అవకాశం వుండదు. కేంద్రప్రభుత్వం ఏ కార్యక్రమ నిమిత్తం రుణాలిస్తుందో దాని కోసమే వ్యయంచేయాలి కానీ ఇతర అంశాలపై వ్యయం చేయకూడదు. ఈ నిధుల మొత్తాన్ని వినియోగించుకోవటంలో రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి వుండదు. ఈ నిధులను క్రింది రెండు రకాలుగా విభజించవచ్చును.

1. మాచింగ్ నిధులు

2. నాన్ మాచింగ్ నిధులు

**మాచింగ్ నిధులు :** ఒక పథకం చేపట్టాలంటే రాష్ట్రాలు ముందుగా తమ సొంతవనరులను కొంత మేరకు వ్యయం చేస్తే మిగిలిన మొత్తం కేంద్రం మాచింగ్ గ్రాంటుగా ఇస్తుంది. ఉదా: రాష్ట్ర ప్రభుత్వం ఒక డాము కట్టాలంటే విధిగా 50 శాతం తానే పెట్టుబడి పెట్టాలి. మిగిలిన 50 శాతం నిధులు కేంద్రం సమకూరుస్తుంది.

**నాన్ మాచింగ్ నిధులు:** రాష్ట్రాలు విధిగా కొంత మొత్తం వ్యయం చేయాలనే షరతు లేకుండా కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు నిధులు ఇస్తుంది. నియామలేవీ లేవు కాబట్టి రాష్ట్రాలు నిధుల మొత్తాన్ని వాటి యిష్టానుసారంగా వినియోగించుకునే స్వేచ్ఛ వుంటుంది.

**స్థిరనిదులు - చరనిధులు :** రాష్ట్రాలు ఏదైనా పథకం చేపట్టినపుడు కేంద్రం మొత్తం వ్యయంలో ఒక నిర్ణీత శాతం మాత్రమే గ్రాంటు ఇస్తుంది. వ్యయం అంచనాలకు మించి పెరిగినా కేంద్రం మాత్రం స్థిరమొత్తాన్నే ముందుగా అనుకున్న ప్రకారం ఇస్తుంది.

చరనిధులు అనగా వుత్పత్తి కారకాల ధర పెరిగి వ్యయం పెరిగితే అంత మేరకు కేంద్రం కూడా అదనంగా నిధులు ఇచ్చే అవకాశం వుంటుంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలపై అంతగా ఆర్థిక భారం పడదు.

**(B) షరతులు లేకుండా ఇచ్చే నిధులు :** రాష్ట్రాలకు ఎటువంటి షరతులు లేకుండా కేంద్రం ఒక్కో సందర్భంలో నిధులు ఇవ్వవచ్చును. అప్పుడు ఆయా రాష్ట్రాలు తమ యిష్టాను సారం నిధులను తరలించుకోవచ్చు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ఇబ్బంది వుండదు.

## నిధుల లక్ష్యాలు లేక సిద్ధాంతాలు

**1. బడ్జెటరీ లోటు:** రాష్ట్రాల మధ్యగల ఆర్థిక అంతరాలను తొలగించాలంటే నిధులు చాలా అవసరం. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే రాబడి, వ్యయాల మధ్య అంతరం లేక తేడా వున్నప్పుడు ఈ తరుగు ఏర్పడుతుంది. రాబడి కంటే వ్యయం పెరిగినపుడు ఆయా రాష్ట్రాలు వనరులు సమీకరించుకోవటంలో కొన్ని ఇబ్బందులకు గురికావలసి వుంటుంది.

**ప్రయోజనాల వ్యాప్తి:** ఒక రాష్ట్రం నిధుల సహాయంతో ఏదైనా ఒక కార్యక్రమం చేపబడితే ఆ ప్రయోజనం ఆరాష్ట్రానికే పరిమితం కాక ఇరుగు, పొరుగు రాష్ట్రాలకు కూడా వ్యాప్తి చెందుతుంది. ఉదా. ఆంధ్రప్రదేశ్ ఇనఫర్మేషన్ టెక్నాలిజీ విద్యనభ్యసించిన ఇంజనీర్లు మనరాష్ట్రలకే పరిమితం కాక ఇతర రాష్ట్రాలకు కూడా వెళ్ళి సేవలందిస్తున్నారు.

**మెరుగైన సేవలు :** ప్రతిరాష్ట్రం తన ప్రజలకు కనీసవిద్య, ఆరోగ్యం, సురక్షిత త్రాగునీరు మొదలగు మెరుగైన సదుపాయాలను అందించాలి కాబట్టి అందుకోసం కేంద్రం నిధులిచ్చి ఆదుకుంటుంది.

**కోశ అసమానతలు :** మనదేశంలో ధనిక, పేద రాష్ట్రాలు వున్నాయి. కాబట్టి పేద రాష్ట్రలకు రాబడి తక్కవ వ్యయం ఎక్కవగా వుంటుంది పన్నుల రాబడి కూడా అంతసంతృప్తికరంగా వుండదు. అప్పులు కూడా అధికంగా వుండి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ వుంటాయి. కాబట్టి ఆయారాష్ట్రాలకు కేంద్రం అధిక మొత్తంలో నిధులిచ్చి అభివృద్ధి చెందేందులకు సహాయపడాలి.

**సామాజికభద్రత :** వరదలు, తుఫానులు, కరువు, కాటకాలు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు మొదలరు ప్రకృతి వైపరీత్యాలు వచ్చినపుడు కేంద్రప్రభుత్వం నిధులిచ్చి ఆయాపీడిత రాష్ట్రాలకు సహాయం చేయాలి.

## ప్రాంతీయ అసమానతలు తొలగించటం

ప్రాంతీయ అసమానతలను తొలగించేందులకు కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన రాష్ట్రాలకు అధిక మొత్తంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు తక్కువ మొత్తంలో నిధులిచ్చి ఆర్థిక వ్యత్యాసాలను తొలగించాలి. తద్వారా ప్రాంతీయ అసమానతలను తొలగించేందులకు కూడా కేంద్రం నిధులిచ్చి ఆదుకోవాలి.

**పరిపాలనాస్థాయిని పెంచటం :** పోలీసు, అగ్నిమాపక సేవలు, జైళ్ళు, బాలికల విద్య, ప్రాథమిక స్కూళ్ళలో వసతులు, స్కూళ్ళలో కంప్యూటర్లు, సురక్షిత త్రాగునీటి సదుపాయం కల్పించేందులకు కూడా కేంద్రం నిధులిచ్చి రాష్ట్రాలకు సహాయపడాలి.

**స్థానిక ప్రభుత్వాల అభివృద్ధి :** పంచాయితీలు, మున్సిపాలిటీలు మొదలగు స్థానిక ప్రభుత్వాలకు కేంద్రం నిధులిచ్చి సహాయపడుతున్నది. అట్టడుగు స్థాయిలో అభివృద్ధి జరిగితే దేశఅభివృద్ధి పటిష్ట పడుతుంది. కాబట్టి కేంద్రం స్థానిక ప్రభుత్వాల అభివృద్ధికి సహాయపడటం అత్యవసరం అని పదవఫైనాన్సు కమీషన్ ఈ విషయానికి ప్రాధాన్యత కల్పించటం చాలా సముచిత నిర్ణయంగా పేర్కొన వచ్చును.

### వివిధ ఫైనాన్సు కమీషన్లు - గ్రాంట్లు ప్రతిపాదనలు - సమీక్ష

| ఫైనాన్సు కమీషన్ | గ్రాంట్లు |
|---|---|
| మొదటి | 1951-56 ల మధ్య కాలంలో 7రాష్ట్రాలు లోటు పూడ్చు కొనటం, 8 రాష్ట్రాలలో ప్రాథమిక విద్యను మెరుగుపరచటం |
| రెండవ | రాష్ట్రాల అభివృద్ధి అవసరాలను తీర్చుకోవటం. |
| మూడవ | 1) రెవిన్యూవ్యయాన్ని తట్టుకునేందుకు అన్ని రాష్ట్రాలకు (మహారాష్ట్ర తప్ప) ఇచ్చినగ్రాంట్లు రు 550 కోట్లు.<br>2) కమ్యూనికేషన్ల అభివృద్ధికై రు. 45కోట్లు |
| నాలగవ | 1966-71 ల మాధ్య కాలంలో రు 610 కొట్లు రాష్ట్రాల లోటు పూడ్చుకొవటం కొసం |
| అయిదవ | 1969-7 ల మధ్య కాలంలో రు 638 కొట్లు రాష్ట్రాలలోటు పూడ్చుకొవటం కొసం |
| ఆరవ | 1974-79 లమధ్య కాలంలో 14 రాష్ట్రాలు తమ ప్రణాళికా వ్యయంలో లోటును పూడ్చుకునేందులకు రు 2,510 కోట్లు. |
| ఏడవ | 1980-85ల మాధ్య కాలంలో పేదరాష్ట్రాలలోటును పూడ్చుకొవటం మరియు పరిపాలనాస్థాయిన పెంచుకొవటానికి రు 1600 కోట్లు. |
| ఎనిమిదవ | 1985-90 ల మధ్య కాలంలో రాష్ట్రాల లోటును పూడ్చుకునేందుల కిచ్చిన రు 1,556 కోట్లు. |
| తొమ్మిదవ | 1) 1990 - 95 మధ్యకాలంలో. రెవిన్యూ ఎకౌంట్ లోటును పూడ్చుకునేందులకు రు 15,017కోట్లు.<br>2) ప్రకృతివైపరీత్యాల నుండి ఊరటపొందే నిమిత్తం ఇచ్చే ప్రత్యేక నిదులు రు 603 కొట్లు, (1990-95 మధ్యకాలంలో మొత్తం నిధులు . 3015 కోట్లు).<br>3) భోపాల్ గాస్‌లీక్ బాధితుల పునరావాస నిమిత్తం రు 122 కొట్లు (మధ్యప్రదేశ్‌కు) |
| పదవ | 1) రు 7,580 కోట్లు 1995-2000 లమధ్య కాలంలో రాష్ట్రాల రెవిన్యూలోటు పూడ్చుకొవటంకోసం<br>2) పోలిస్, అగ్ని మాపకసేవలు, జైళ్ళు, బాలికల విద్య, అప్పర్ ప్రైమరీస్కూళ్ళకు అదనపు వసతులు, స్కూళ్ళలో తాగునీటిసదుపాయాల స్థాయిని పెంచేందులకు రు 1,360 కోట్లు<br>3) వైపరీత్యాల ఊరటకై రు 4,730 కోట్లు<br>4) ప్రత్యేక సమస్యల నెదుర్కొంటున్న రాష్ట్రాలకు రు 1250 కోట్లు<br>5) పంచాయితీలు, మున్సిపాలిటీలు మొదలగు స్థానికసంస్థలకు రు 5,380 కొట్లు |

కేంద్రప్రభుత్వం రాష్ట్రాల కిచ్చే నిధులు సరిపడినంత లేకపోవటం, సకాలంలో ఇవ్వకపోవటం ప్రకృతివైపరీత్యాల కాలంలో ప్రత్యేక నిధులివ్వకపోవటం, కొన్ని సమయాలలో జాతీయ విపత్తులుగా పరిగణించక పోవటం, పక్షపాత ధోరణి మొదలగు కారణాల వలన అనేక రాష్ట్రాలు తీవ్ర అసంతృప్తిని తెలియజేస్తున్నాయి. ఏదిఏమైనా వడ్డీ బారం లేకుండా బలహీనమైన రాష్ట్రాలు ఆర్థికంగా పటిష్టమైన కేంద్రప్రభుత్వం నుండి నిధులు ఆశించటం లో ఎటువంటి అత్యాసలేదు. కాబట్టి ఫైనాన్స్ కమీషన్లు కాలానుగుణంగా సిద్ధాంతాలలో మార్పు తెచ్చి రాష్ట్రాలను ఆర్థికంగా అదుకునేందులకు తగిన ప్రతిపాదనలు చేయాలి.

## 13.4.4 కేంద్రప్రభుత్వం రాష్ట్రాల కిచ్చే అప్పులు:

రాష్ట్రాలు తమ సొంతవనరులు, కేంద్రంనుండి వచ్చేపన్నుల రాబడి సరిపోక తరచుగా ఆర్థిక ఇబ్బందుల నెదుర్కొన వలసివస్తున్నది. అంతేకాక స్థానిక అంశాలకుసంబంధంచిన విధులన్ని రాష్ట్రాలే నిర్వర్తించ వలసి వుండటంవలన అధికబాధ్యతలను అల్ప వనరులతో చేపట్ట లేకపోతున్నది. అంతే కాక రాష్ట్రాల ఆదాయవనరులైన అనేకపన్నులు సంఖ్యాపరంగా అనేకంగా ఉన్నప్పటికీ, ఆదాయ అవ్యాకోచతను కలిగియున్నాయి. కాబట్టి రాష్ట్రాలు తరచుగా వనరుల కొరతతో సతమత మవుతున్నయి. అంతేకాక ఈమధ్య కాలంలో ఏర్పడిన ప్రాంతీయపార్టీల రాష్ట్రప్రభుత్వాలు పట్టుదలతో, కృషిచేయాలనే సంకల్పించుకున్నాయి. అంతకు ముందు ప్రభుత్వాలకు భిన్నంగా అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు అధికమొత్తంలో అప్పులు తీసుకోవటం కేంద్ర ప్రభుత్వానికి భారంగా మారుతున్నది. ఈ విషయం రెండవ ఫైనాన్స్ కమీషన్ మొదట్లోనే కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించింది. 1951లో రు 195కొట్లు మేరకు కేంద్రం అప్పులుగా ఇచ్చినప్పటికీ 1955 నాటికి రు 900 కొట్లకు పెరగటం అప్పట్లోనే ఆందోళన కల్గించింది. అందుకనే రెండవ ఫైనాన్స్ కమీషన్ రాష్ట్రాలు ఒకసంవత్సరంలో కేవలం రెండు సార్లే అప్పుతీసుకోవడానికి అర్హతను కలిగియుంటాయని, అవికూడా ఒకటిస్వల్పకాలిక అప్పు, మరోకటి మధ్యకాలిక అప్పులే అయివుడాలని కూడా నియమం పెట్టినది.

నాల్గవ ఫైనాన్స్ కమీషన్ 'రాష్ట్రాల ఋణగ్రస్త సమస్య' గురించి అధ్యయనం చేసేందులకు ఒక ఉన్నత సంస్థను ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించినది. అయితే ఆచరణలోకి రాలేదు. అప్పులతో పాటు వడ్డీ చెల్లింపులు రాష్ట్రాలకు తలకు మించిన భారాన్ని మోపుతున్నాయి.

అయదవ ఫై.క రాష్ట్రాలు విధిగా "కోశ క్రమశిక్షణ" అవలంబించి తమకున్న వనరులతోనే బడ్జెట్‌లు రూపొందించుకొవాలని సూచించింది. రాష్ట్రాలు ఓవర్ డ్రాఫ్టులకెళ్ళవద్దని సిద్ధాంతరీత్యా చెప్పినా ఆచరణలో అసాధ్యంగా మారిందని కూడా ఈ కమిషన్ అభిప్రాయపడింది.

**అయిదవ ఫైనాన్సు కమీషన్ - అప్పలకు సంబంధించిన ఈ క్రింది ప్రతిపాదనలు చేసింది**

1) వేస్ అండ్ మీన్స్ క్రింద తీసుకున్న అడ్వాన్సులు వనరులుగా పరిగణించకూడదు

2) రిజర్వుబ్యాంకు వేస్ & మీన్స్ క్రింద అడ్వాన్సులకు అప్పుడప్పుడు కాలానుగుణంగా పరిమితులు విధించాలి

3) రాష్ట్రాలను అప్పులు తిరిగి చెల్లించాల్సినదిగా రిజర్వుబాంకు హెచ్చరించాలి. అనధికార ఓవర్ డ్రాఫ్టుల నివ్వటానికి రిజర్వుబాంకు స్వస్తి పలకాలి.

4) రాష్ట్రాలు కోశ క్రమశిక్షణను సాధించేందులకు కేంద్రం రాష్ట్రాలకు సహాయపడాలి.

ఆరవ ఫైనాన్స్ కమీషన్ రాష్ట్రాల అప్పులగురించి పూర్తి అధ్యయనం చేసి, 15 నుండి 30 సంవత్సరాల వరకు రాష్ట్రాలు అప్పులు తిరిగి చెల్లించేందులకు అవకాశాన్ని కల్పించి ఊరట కల్పించింది. కొన్ని రకాల అప్పులు పూర్తిగా మాఫీ చేయ బడినాయి

తొమ్మిదవ ఫైనాన్స్ కమీషన్ పై ప్రతిపాదనలను వ్యతిరేకిస్తు రాష్ట్రాలు తగిన జాగ్రత్తలు తీసుకొని అదనంగా అప్పులు చేయకుండా వుండేందులకు కొన్ని నియంత్రణలను పాటించాలని కూడా సూచించింది

పదకొండవ ఫైనాన్స్ కమీషన్ పంజాబు, జమ్ము, కాశ్మీరులు రక్షణపరంగా అధిక వ్యయాన్ని చేయవలసి వచ్చింది. కాబట్టి కొంత ప్రత్యేక ఊరట కల్పించేవిధంగా కొన్ని ప్రతిపాదనలు చేసింది.

## 8.3.5 ఫైనాన్సు కమీషన్‌ల సమస్యలు - కొన్ని సూచనలు

ఫైనాన్సు కమీషన్ల పరిధి

1. ఫైనాన్సు కమీషన్‌ల పరిధిని గణనీయంగా పెంచాల్సిన అవసరం వున్నది. తద్వారా రాష్ట్రాల ఆర్థిక యాజమాన్య కార్యక్రమాలలో కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని నివారించవలసి వుంటుంది. రాష్ట్రాలకు అన్ని విధాలుగా సహరించేందులకు ఫైనాన్సు కమీషన్‌కు అధిక అధికారాలిస్తే ప్రాంతీయ అసమానతలు త్వరగా తొలగించగలుగుతాము.

**2. శాశ్విత ఫైనాన్సు కమీషన్ ఆవశ్యకత**

కొన్ని రాష్ట్రాలు ప్రతి అయిదు సంవత్సరాల కొకసారి మారే ఫైనాన్సు కమీషన్ బదులు శాశ్విత ఫైనాన్సు కమీషన్ నియమించాలని డిమాండు చేస్తున్నాయి. ఇందుకు గల అనుకూల వాదనలు ఈ క్రింద వివరించబడినాయి.

1. రాష్ట్రాలకు ఆర్థిక వనరులను తరలించటంలో కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా వ్యవహరించి కొన్ని రాష్ట్రాలతో ఉదారంగా, కొన్ని రాష్ట్రాలతో కఠినంగా వ్యవహరించే ధోరణికి స్వస్తిపలకవచ్చు.

2. క్రొత్తగా ఫైనాన్సు కమీషన్ ఏర్పడినప్పుడల్లా రాష్ట్రాలనుండి తనకు కావలసిన సమాచారాన్ని సేకరించి, విషయాన్ని అవగాహన చేసుకునేందులకు సభ్యులు తమ అమూల్యమైన సమయాన్ని వృధా చేసుకోవలసి వస్తున్నది.

3. ఆస్ట్రేలియాలో వలే మన దేశంలో కూడా శాశ్విత ఫైనాన్సు కమీషన్‌ను నియమించుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వనరులకు సంబంధించిన వివిధ అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షించి తగిన సలహా, సూచనలివ్వటానికి అవకాశం వుంటుంది.

**ఏడవ ఫైనాన్సు కమీషన్ వ్యతిరేకత :** ఏడవ ఫైనాన్సు కమీషన్ శాశ్విత ఫైనాన్సు కమీషన్ ఏర్పాటును వ్యతిరేకించింది. సభ్యులందరూ కేంద్ర ప్రభుత్వ పూర్తి కాల వుద్యోగులుగా మారవలసి వుంటుందని అభిప్రాయపడింది. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొని ఫైనాన్సు కమీషన్ ల ఏర్పాటులో ప్రస్తుతపద్ధతిని కొన సాగించటమే మెరుగని పేర్కొనబడింది. మేధావులు, అనుభవజ్ఞులను ఎప్పటికప్పుడు సభ్యులుగా జేర్చుకొని, వారి విశేష అనుభవంతో ఇచ్చే సలహా, సూచనలను పాటించటమే సమంజసం అనే అభిప్రాయం పేర్కొనబడింది.

**రాజకీయేతర ఏజన్సీ ఏర్పాటు :** 7వ ఫైనాన్సు కమీషన్ రాజకీయేతర సంస్థ నొకదానిని ఏర్పాటు చేసి దానిని ఫైనాన్సు కమీషన్ సెక్రటేరియట్‌గా వ్యవహరించేటట్లు చేయాలని సూచించింది. కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, సలహాలిచ్చే బాధ్యతను ఈ రాజకీయేతర సంస్థ చేపట్టాలని కూడా సూచించబడినది.

**శాశ్విత ఫైనాన్సు కమీషన్ ఆవశ్యకత - ఎనిమిది, పదవ ఫైనాన్స్ కమీషన్ల సూచన**

ఎనిమిదవ, పదవ ఫైనాన్సు కమీషన్‌లు శాశ్విత ఫైనాన్సు కమీషన్‌ను ఆర్థికమంత్రి వర్గ విభాగంలో ఏర్పాటుచేయాలని సూచించాయి. ఒక సీనియర్ ఆఫీసర్, సాంకేతిక సిబ్బంది మరియు ఇతరసిబ్బందిని నియమించి ఈ క్రింది విధులు నిర్వర్తించాలని పేర్కొనబడింది.

1. ఫైనాన్సు కమీషన్ ప్రతిపాదనల అమలు తీరు తెన్నులు ఎలావున్నాయో గమనించాలి.
2. రాష్ట్రాల ఆదాయవనరులు, ప్రణాళికేతర వ్యయపోకడలు ఎలా వున్నాయో నిశితంగా పరీక్షించాలి. ఫైనాన్సు కమీషన్ అంచనాలకు సాధించిన వాస్తవ ఫలితాలకు గల తేడాను లెక్కించి, ఆ తేడాకు గల కారణాలను కూడా పేర్కొనాలి.
3. పెంచిన నిధులు రాష్ట్రప్రభుత్వాలు ఏ విధంగా వినియోగిస్తున్నాయో సమీక్షించటం జరుగుతుంది.
4. ఇప్పటికే నియమించబడిన పూర్వపు ఫైనాన్సు కమీషన్ల రికార్డులను పదిలపరచాలి.
5. రాబోయే ఫైనాన్సు కమీషన్లకు కావలసిన సమాచారాన్నందించి, భవిష్యత్ ప్రతిపాదనల తయారీకి కృషి జరపాలి.

6. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక వనరులకు సంబంధించి కొన్ని అధ్యయానాలు జరిపి, ఆ వివరాలన్నింటినీ పేపర్లలో ముద్రించాల్సిన అవసరం ఎంతైనా వున్నది.

## వెనుకబడిన రాష్ట్రాలకు అనుకూల ప్రాతిపదిక

వెనుకబడిన రాష్ట్రాలకు అనుకూలంగా పేదరికాన్ని తగ్గించే ప్రాతిపదికలను సూచించటం జరిగినది. తలసరి ఆదాయం, అక్షరాస్యతా స్థాయి, రోడ్డు పొడవు, పరిపాలనా సేవలు, హాస్పిటళ్ళలో పడకలు మొదలగు ప్రాతిపదికలకు ఎక్కువ వెయిటేజి ఇవ్వబడింది.

10వ ఫైనాన్సు కమీషన్ భూభాగం, అవస్థాపనా సదుపాయాలును క్రొత్త ప్రాతిపదికలుగా కేంద్రపన్నుల రాబడి రాష్ట్రాలకు పంపిణీ చేయాలని ప్రతిపాదించటం ఆహ్వానించదగిన పరిణామయం అని చెప్పవచ్చును.

**కేంద్రం నుండి రాష్ట్రాలకు అధిక వనరులు:** కార్పొరేషన్ పన్ను, కస్టమ్స్ పన్నుల ద్వారా వచ్చిన వ్యాకోచ ఆదాయ వనరులను కూడా పన్నులరాబడిలో కలిపి రాష్ట్రాలకు పంపిణీ చేస్తే రాష్ట్రాలకు ఎక్కువగా కేంద్రం నిధులందించే అవకాశం కలదు. ఈ విషయంలో 10వ ఫైనాన్సు కమీషన్ మార్గదర్శక ప్రాతిపదికలను ఏర్పాటు చేసింది. కేంద్రం అన్ని రకాల పన్నుల ద్వారా వచ్చిన రాబడిలో రాష్ట్రాలకు వాటా ఇవ్వటం సముచితంగా వుంటుందని పదవ ఫైనాన్సు కమీషన్ భావించింది. ప్రస్తుతం జరుగుతున్న ఆర్థిక సంస్కరణల దృష్ట్యా కూడా ఈ ప్రతిపాదన రాష్ట్రాలకు న్యాయం చేకూర్చే విధంగా వున్నది.

**రాష్ట్రాల లోటును పూడ్చే అవార్డులు:** ఫైనాన్సు కమీషన్లు కేంద్రం నుండి రాష్ట్రాలకు ఆర్థిక వనరుల తరలింపు గురించి అనేక విలువైన ప్రతిపాదనలు చేస్తున్నప్పటికీ అనేక విమర్శలను కూడా ఎదుర్కొనవలసి వస్తున్నది. ఫైనాన్సు కమీషన్ అవార్డులు కేవలం రాష్ట్రాలకు లోటును పూడ్చే అవార్డులుగానే వుంటున్నాయి. అధిక లోటుగల రాష్ట్రాలకు అధిక మొత్తంలో కేంద్రం నుండి ఆర్థిక వనరులు తరలించి ఆదుకోవాలి. అయితే ఈ మిషతో అభివృద్ధి చెందిన రాష్ట్రాలు కూడా అనేక అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు ఒకేసారి చేపట్టి పెద్ద మొత్తంలో లోటును చూపించి కేంద్రం నుండి అధిక వనరులను రాబట్టుకుంటున్నాయి. అయితే వెనుకబడిన రాష్ట్రాలకు సహజంగానే అధిక బడ్జెటరీలోటు వుంటున్నది, కాబట్టి ఈ ప్రాతిపదిక ద్వారా ధనికపేద రాష్ట్రాల తారతమ్యాలను బట్టి లోటుకు వెయిటేజి ఇస్తే మరింత న్యాయంగా వుంటుంది. రాష్ట్రాలకు కేంద్రం నుండి వచ్చే ప్రణాళికేతర వనరులు గురించి మాత్రమే ఫైనాన్సు కమీషన్ల ప్రతిపాదనలు చేస్తాయి. అయితే కేంద్రం నుండి రాష్ట్రాలకు వచ్చే ప్రణాళికా వనరులు మాత్రం శాశ్వత సంస్థయిన ప్లానింగ్ కమీషన్‌కు అప్పచెప్పబడినాయి.

## 8.3.6 ముగింపు

మన దేశంలో ఇప్పటికి 12 ఫైనాన్సు కమీషన్లు నియమింపబడినాయి. కొన్ని విమర్శలు వున్నప్పటికీ కేంద్ర-రాష్ట్ర సంబంధాలను నిర్దేశించే సంస్థగా ఫైనాన్సు కమీషన్ అవిరళ కృషి చేస్తున్నది. ముఖ్యంగా పన్నులరాబడిలో వాటా, నిధుల కేటాయింపు, అప్పులివ్వటం అనే మూడు మార్గాల ద్వారా కేంద్రానికి రాష్ట్రాలకు, వివిధ రాష్ట్రాల మధ్యగల కోశ అసమానతలను తొలగించేందులకు ఫైనాన్సు కమీషన్లు విలువైన ప్రతిపాదనలు చేస్తున్నాయి. రాష్ట్రాలను అధికంగా వేధించే అనేక ఆర్థిక సమస్యలపై దృష్టి సాధిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితులు సమీక్షించుకుంటూ ఫైనాన్సు కమీషన్లు కేంద్ర ప్రభుత్వానికి తగిన విధంగా సలహాలు, సూచనలు ఇస్తున్నాయి.

## 13.7 ముఖ్య పదాలు

పన్నుల కృషి - పన్నుల వసూళ్ళను సమర్ధవంతంగా, ఎక్కువ మొత్తాన్ని వసూలు చేయటం

ఆర్థిక క్రమశిక్షణ -------

నిధులు ------- కేంద్రం రాష్ట్రాలకిచ్చే మొత్తం, తిరిగి చెల్లించనవసరం లేదు

అప్పులు ------- వడ్డీతో సహా చెల్లించాలి.

## 13.8 స్వీయ అంచనాలకు ప్రశ్నలు / అభ్యాసం

(i) ప్రశ్నలు

1. భారత దేశంలో ఫైనాన్సు కమీషన్ల పాత్రను విశదీకరింపుము.

2. వివిధ ఫైనాన్సు కమీషన్లు చేసిన ప్రతిపాదనలు కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాలను పటిష్టపరుస్తున్నాయి.

3. కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాలలో గల అసమానతలను తొలగించేందులకు ఒక యంత్రాంగంపై ఫైనాన్సు కమీషన్ ఎటువంటి పాత్రను నిర్వహిస్తున్నది? విమర్శనాత్మకంగా చర్చించుము.

(ii) అభ్యాసం.

1 ఫైనాన్సు కమీషన్ విధులు

2 పన్నుల రాబడిలో వాటా రాష్ట్రాలకు పంపిణీ

3 ఆర్టికల్ 275 క్రింద రాష్ట్రాలకిచ్చే నిధులు ఎందుకు వినియోగించాలి.

4 నిధుల కేటాయింపులో రాష్ట్రాల అసంతృప్తికిగల కారణాలు

5. రాష్ట్రాల రుణగ్రస్తత-నివారణ

## 13.9 చదవాల్సిన గ్రంధాలు


| | | |
|---|---|---|
| 1. | Sinha R.K | Centre - State Financial Relations in India.Deep & Deep Publications, New Delhi |
| 2. | Tiwari O.P | Federation and centre - State Relations in India. Deep & Deep Publications, New Delhi |
| 3. | Sarojini M. | Finance Commissions and centre State Financial Rela tions Chug Publications, Allahabad |
| 4. | Sasthry & Reddy | Centre state Financial Relations Centre For Economic And Social Studies Hyderabad & Concept Publishing company, New Delhi. |

Report of the Finance commissions, various issues
Economic Surves, government of India, vaious issues


డా॥ ఎల్. క్రిష్ణవేణి

పాఠం - 14

# కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ, వ్యయాలు

## పాఠ్య నిర్మాణ క్రమం

14.0 ఉద్దేశాలు
14.1 ఉపోద్ఘాతం
14.2 కేంద్రప్రభుత్వం ఆదాయవనరులు
14.3 భారతదేశంలో కేంద్రప్రభుత్వరాబడి
14.4 కేంద్ర ప్రభుత్వ వ్యయము
14.5 భారతదేశంలో కేంద్రపభుత్వ వ్యయం
14.6 రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయవనరులు
14.7 భారతదేశంలో రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయవనరుల
14.8 రాష్ట్ర ప్రభుత్వాల వ్యయం
14.9 భారతదేశంలో రాష్ట్ర ప్రభుత్వాల రెవిన్యూ వ్యయం
14.10 సారాంశం
14.11 ముఖ్య పదాలు
14.12 స్వయం సమీక్ష ప్రశ్నలు
14.13 చదవవలసిన పుస్తకాలు

## 14.0 ఉద్దేశాలు

ఈ పాఠ్యభాగం చదివిన తరువాత ఈ క్రింది అంశాల పట్ల అవగాహన పెరగాలి

1. కేంద్రప్రభుత్వ వివిధ ఆదాయ వనరుల విభజన, మనదేశ ప్రభుత్వ ఆదాయవనరుల తీరుతెన్నులను సమీక్షించగలగాలి
2. కేంద్రప్రభుత్వ వ్యయ విభజన వ్యయం పెరగటానికి గల కారణాలను వివరిస్తూ, భారతదేశ వ్యయపోకడలను విశదీకరించగలగాలి
3. రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయవనరుల గురించి సవివరంగా వివరించి, భారతదేశ రాష్ట్రప్రభుత్వాల ఆదాయవనరులను వివరించగలగాలి.
4. రాష్ట్ర ప్రభుత్వాల వ్యయం పెరగటానికి గల కారణాలు, మనదేశంలో రాష్ట్రాల వ్యయపోకడలను సమీక్షించగలగాలి.

## 14.1 ఉపోద్ఘాతము :

దేశసమైఖ్యత కోసం అహర్నిశలూ శ్రమించే కేంద్రప్రభుత్వానికి ఆర్థిక వనరులు అత్యవసరంగా వుండాలి. జాతీయ ప్రాధాన్యతగల అంశాలన్నీ కేంద్రప్రభుత్వ ఆధీనం లోనే వున్నాయి. అందువలన విధులు నిర్వర్తించేందులకు వీలుగా రాజ్యాంగంలోనే కొన్ని పన్నులు విధించే అధికారం కూడా కేంద్రప్రభుత్వానికి అప్పచెప్పబడింది. ఆదాయాన్ని వివిధ కార్యక్రమాల మీద, పథకాల మీద కేంద్రం వ్యయం చేయాల్సి వుంటుంది. ఆదాయ వ్యయాల మధ్య సమతూకాన్ని పాటిస్తూ కేంద్రప్రభుత్వం తనవిత్త కార్యక్రమాలను నిర్వహించవలసి వుంటుంది.

కేంద్రప్రభుత్వ ఆధీనంలో పనిచేసే రాష్ట్ర ప్రభుత్వాలు సైతం తమ పరిధిలో తాము స్థానిక అంశాలకు సంబంధించిన విధులను చేపట్టాల్సి వుంటుంది. అందుకుగాను రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థికవనరులు అవసరమవుతాయి. అందకే మన రాజ్యాంగంలో రాష్ట్రప్రభుత్వాలు కొన్ని పన్నులు విధించి ఆదాయాన్ని వసూలు చేసుకునే అధికారం కల్పించింది. రాష్ట్రప్రభుత్వ బాధ్యతలను దృష్టిలో వుంచుకొని కేంద్రప్రభుత్వం కూడా కొన్ని ఆర్థికవనరులను రాష్ట్రాలకు ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వవ్యయం కూడా క్రమేపీ పెరిగిపోతున్నది. పరిమితవనరులు, అపరిమిత బాధ్యతలుగల రాష్ట్ర ప్రభుత్వాలు తరచూ నిధుల కొరతను ఎదుర్కొనవలసి వస్తున్నది. ఆదాయ, వ్యయాల మధ్య సమతూకాన్ని పాటించి, ఏ విధంగా రాష్ట్రాలను అభివృద్ధి పరచాలనే విషయంపై రాష్ట్రాలు నిరంతరం ఆలోచనలు చేస్తున్నాయి.

రాబడి సరిపోక కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు లోటు బడ్జెట్‌లు సమర్పించవలసి వస్తున్నది. లోటు పూడ్చుకునే ప్రయత్నంలో దేశీయ, అంతర్జాతీయ అప్పులకు కూడా వెళ్ళవలసి వస్తున్నది. కాబట్టి ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయవనరులు, వ్యయపోకడలు సవివరంగా (వేరువేరుగా) అధ్యయనం చేయాల్సి అవసరం వున్నది. ఈ సందర్భంలో ముందుగా కేంద్రప్రభుత్వ ఆదాయవ్యయాలు, ఆ తరువత రాష్ట్ర ప్రభుత్వ ఆదాయవ్యయాలు ప్రత్యేకించి విశ్లేషించబడినాయి.

## 14.2 కేంద్రప్రభుత్వ ఆదాయవనరులు :

ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ఏటువంటి స్వార్థమూ లేకుండా కేంద్రప్రభుత్వం అత్యంత కీలకమైన, జాతీయ ప్రాధాన్యత గల ఈ క్రింది విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది.

1. ప్రజల ప్రాణాలను, ఆస్తులను దేశీయ, అంతర్జాతీయ దాడులనుండి రక్షించుట.
2. విదేశీ వ్యవహారాలు
3. తంతి తపాలా
4. అంతర్గత సమాచారం మొదలగునవి

కేంద్రప్రభుత్వం తన విధులు నిర్వర్తించటానికి కావలసిన ఆదాయాన్ని వివిధ మార్గాల ద్వారా సమకూర్చుకొనవలసి వుంటుంది. ప్రభుత్వ విత్త శాస్త్రంలో ప్రభుత్వ రాబడి ఒక ప్రదానమైన అంశంగా పేర్కొనవచ్చును. వినియోగానికి రిత్పత్తి ఎంత అవసరమో, అలానే ప్రభుత్వవ్యయానికి ప్రభుత్వ ఆదాయంం కూడా అంతే అవసరమని చెప్పవచ్చును.

ముందుగా ప్రభుత్వ ఆదాయం అనే పదానికి అర్థం ఏమిటో తెలుసుకొనవలసి వుంటుంది. ప్రభుత్వాలకి నిర్ణీత కాలంలో (సాధారణంగా ఒక సంవత్సర కాలంలో) వివిధ మార్గాల ద్వారా వచ్చే అన్నిరకాల ఆదాయాలను కలిపితే ప్రభుత్వ ఆదాయం వస్తుంది. ప్రభుత్వ ఆదాయం ప్రభుత్వ రాబడి అనే పదాలు భిన్న అర్థాలు కలిగియున్నాయని గుర్తించాల్సి వుంటుంది. 'ప్రభుత్వరాబడి' అనే పదం విస్తృత అర్థాన్ని, 'ప్రభుత్వ ఆదాయం' అనేపదం పరిమిత అర్థాన్ని కలిగియున్నాయి.

**ప్రభుత్వ రాబడి :** ప్రభుత్వ రాబడి అనగా మామూలుగా వచ్చే ఆదాయలతోపాటు ప్రభుత్వం తీసుకునే రుణాలు కూడా వుంటాయి. కాబట్టి ప్రభుత్వ రాబడిలో కొంత మొత్తాన్ని భవిష్యత్‌లో వడ్డీతో సహా తిరిగి చెల్లించాల్సి వుంటుంది.

**ప్రభుత్వ ఆదాయం :** ఒక నిర్ణీత కాలంలో అనగా ఒక సంవత్సర కాలంలో ప్రభుత్వానికి వేరు, వేరు మార్గాల ద్వారా వచ్చే ఆదాయాన్నంతా కలిపితే ప్రభుత్వ ఆదాయం వస్తుంది. ఈ ఆదాయంలో తిరిగి చెల్లించే అవసరం కూడా లేదు కాబట్టి ప్రభుత్వం స్వేచ్ఛగా తన అవసరాలను వినియోగించుకోవచ్చును.

**డాల్టన్ విభజన :** ప్రభుత్వ ఆదాయవనరులను డాల్టన్ ఈ క్రింద విధంగా విభజించినారు. వివిధ ఆదాయవనరులన్నప్పటికీ, వాటిలో కొన్నింటికి పన్నుల లక్షణాలు, కొన్ని ధరల లక్షణాలు కలిగి యున్నాయి.

**ఎ) పన్నుల లక్షణాలు ఆదాయవనరులు :**

1. పన్నులు
2. కప్పములు, నష్టపరిహారాలు, యుద్ధం వల్ల కానీ లేదా ఇతరత్రా ఏర్పడేవి.

3. నిర్బంధ రుణాలు
4. న్యాయస్థానాలు, చట్ట ఉల్లంఘనకు గాను ద్రవ్యరూపంలో విధించే పెనాల్టీలు.

**బి) ధరల లక్షణాలు కల్గిన ఆదాయవనరులు :**

1. ప్రభుత్వ ఆస్తుల వలన ప్రభుత్వానికి వచ్చేఆదాయం
   (ప్రభుత్వ భూములపై కౌలు, కంపెనీ షేర్ల పై వచ్చే లాభం)
2. ప్రభుత్వ పరిశ్రమల నుండి లభించే ఆదాయం
3. ప్రభుత్వాధికారులు సేవలకు చెల్లించే ఫీజు
4. స్వచ్ఛంద ప్రభుత్వ రుణాలు

**సి) ఇతర ఆదాయ మార్గాలు :**

1. ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న ఏకస్వామ్యాలైన పరిశ్రమలు
2. ప్రత్యేక విధింపులు
3. నోట్లను ముద్రించటం
4. స్వచ్ఛంద కానుకలు

**టేలర్ విభజన :** ప్రభుత్వ ఆదాయవనరుల గురించి తెలుసుకోవాలంటే టేలర్ విభజన చాలా శాస్త్రీయమైనది. టేలర్ విభజనను అనుసరించి ప్రభుత్వ ఆదాయ వనరులను ఈ క్రింది విధంగా విభజించవచ్చును.

**ఎ. పన్నులు :** ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చటంలో ఇతర వనరులన్నింటికంటే పన్నులు అతి ముఖ్యమైనవి. పన్నులను విధించటంలో ముఖ్యఉద్దేశం. ప్రభుత్వ కార్యకలాపాలకు అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకోవటం మాత్రమే అని బాస్టబుల్ అభిప్రాయపడినాడు. అంతేకాక ఆర్థిక కార్యకలాపాలను నియంత్రించటానికి, క్రయబద్ధం చేయటానికి కూడా ఈ పన్నులను కేవలం ఆదాయవనరులుగా మాత్రమే పరిగణించి సాంఘిక విధానాన్ని అమలు జరిపే సాధనాలుగా పేర్కొనవచ్చు. ముఖ్యంగా ఆర్థిక వ్యత్యాసాలను తొలగించటానికి ఈ పన్నులు ఎంతగానో సహకరిస్తాయి.

లెర్నర్ అభిప్రాయం ప్రకారం పన్నులు జాతీయాదాయాన్ని తగినంత స్థాయిల్ నిలపటానికి మాత్రమే వినియోగించాలి. కానీ ఆదాయం కోసం వినియోగించకూడదు.

**పన్నుల లక్షణాలు :**

1. ప్రభుత్వం పన్ను విధించనపుడు ప్రజలు తప్పనిసరిగా ఆ పన్ను మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాలి.
2. పన్ను చెల్లించటానికి ప్రజలు నిరాకరించే అవకాశంలేదు. పన్ను చెల్లించకపోవటం చట్టరీత్యా నేరం, కాబట్టి పన్ను చెల్లించకపోవటం చట్ట రీత్య నేరం, కాబట్టి పన్ను చెల్లించని వారు ప్రభుత్వం చే శిక్షించబడతారు. అంతేకాక కొన్ని వస్తువుల వినియోగాన్ని తగ్గించాలంటే పన్నుల ద్వారానే సాధ్యపడుతుంది.

   ఉదా : మత్తుపానీయాలు, సిగరెట్లు మొదలగునవి.
3. పన్ను చెల్లింపుదారుడి నుండి వసూలు చేయబడిన పన్ను కేవలం ఆ వ్యక్తి ప్రయోజనం కోసమే వినియోగింపక, సమాజ ప్రయోజనం కొరకు వినియోగించబడుతుంది.
4. పన్ను చెల్లింపు వలన ప్రతివ్యక్తి కొంత త్యాగం చేయవలసి ఉంటుంది.
5. పన్ను చెల్లింపు వలన ఆర్థిక అసమానతలు తగ్గి సమాజ శ్రేయస్సు పెరుగుతుంది.
6. పన్ను చెల్లింపువలన ఆర్థిక అసమానతలు తగ్గి శ్రేయస్సు పెరుగుతుంది.
7. పన్ను చెల్లింపువలన ఆ వ్యక్తి విధిగా ప్రభుత్వం నుండి ప్రయోజనం పొంది తీరాలనే నియమమేమీ లేదు.

8. ప్రభుత్వం అందించే సేవలకు ప్రజలు చెల్లించే మూల్యమే పన్నులు. అయితే అన్ని వేళలలా ఈ విషయం వాస్తవం కాకపోవచ్చును.

9. పన్నులు ఆదాయం మీదే విధించబడతాయి. కాబట్టి చాలా పన్నులు ఆదాయం నుండీ చెల్లించబడతాయి.

**పన్నుల విభజన :**

పన్నులను ముఖ్యంగా ఈ క్రింది విధంగా విభజించవచ్చును.

**1. ప్రత్యక్ష పన్నులు :**

పన్ను యేవ్యక్తి మీద విధించబడుతుందో ఆ వ్యక్తి తప్పనిసరిగా పన్ను చెల్లించవలసి వుంటుది. వేరే వ్యక్తికి ఆ పన్ను భారాన్ని తరలించటానికి అవకాశం వుండదు. ఆదాయవ్యత్యాసాలను తొలగించటానికి ఈ ప్రత్యక్ష పన్నులు విధించబడతాయి.

ఉదా:- వ్యక్తిగత ఆదాయపన్ను, కార్పొరేషన్ పన్ను

**2. పరోక్ష పన్నులు :**

పన్ను ఒక వ్యక్తి మీద విధించనప్పటికీ వేరొక వ్యక్తికి ఆ పన్ను భారం తరలించటానికి లేదా బదలాయించటానికి అవకాశం కలదు. సహజంగా ఈ పరోక్ష పన్నులు వస్తువుల మీద విధించబడతాయి. పరోక్షపన్నుల వలన ధరలు పెరుగాతాయి.
ఉదా: ఎక్సైజ్ సుంకాలు, కస్టమ్స్ సుంకాలు.

**బి. వాణిజ్య ఆదాయాలు :** ప్రభుత్వ వాణిజ్య సంస్థలు ఉత్పత్తి చేసే వస్తు, సేవలను అమ్మగా వచ్చిన ఆదాయాన్నే వాణిజ్య ఆదాయం అంటారు. ఉదా:రైల్వేలు, పోస్టల్ మొదలుగు సేవలకు ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఈ వస్తు, సేవల వలన ఏఏ వ్యక్తులు ప్రయోజనం పొందుతున్నారో గుర్తించటానికి వీలున్నందువలన ప్రయోజనం పొందేవారి ధరలను వసూలు చేయటానికి వీలవుతుంది. అయితే ప్రభుత్వం కొన్ని పరిశ్రమలను, సేవలను నిర్వహించటంలో లాభాపేక్ష వుండదు. ప్రైవేటు వ్యక్తులు లాభాపేక్ష ధ్యేయంగా భావించి పనిచేస్తారు. కాబట్టి ప్రజలకు కావలసిన అన్ని రవాల వస్తుసేవలను ప్రైవేటు రంగం కంటే చౌకగా అందిస్తుంది. అంతేకాక ఆ వస్తుత్పత్తి, పంపిణీలను నియంత్రిచటం కూడా ప్రభుత్వం తన కర్తవ్యంగా భావిస్తుంది. ఈ కర్తవ్య నిర్వహణకయ్యే వ్యయాన్ని ప్రజలే భరించి, ధరల రూపంలో చెల్లించాల్సి వుంటుంది. ప్రైవేటు రంగంలో ఏకస్వామ్య ధోరణులు ప్రబలిపోయినపుడు ప్రభుత్వం విధిగా ప్రవేశించి ఆయావస్తు, సేవలను ప్రజలకు చౌకగా అందించాలి.

ఈ సందర్భంగా పన్నులకు, ధరలకుగల వ్యత్యాసాలను పరిశీలించాల్సి వుంటుంది. పన్నులు ప్రభుత్వం విధించినపుడు ప్రజలు చెల్లించాల్సి వుంటుంది. ధరలు అనగా ప్రభుత్వం అందిచిన వస్తు, సేవలను పొందాలంటే కొంత మూల్యం చెల్లంచాల్సి వుంటుంది. దానినే ధరలు అంటాము.

**సి. పరిపాలనా నిర్వహణ ఆదాయాలు :** ఫీజులు, లైసున్సులు, జరిమానాలు, జప్తుచేయటం, విల్లు వ్రాయకుండా వారసులు లేకుండా మరిణించిన వారి ఆస్తులు (ఎస్టేట్స్) మొదలుగనవి ఈ కోవకు చెందుతాయి. వ్యక్తులు వీటిన్నింటినీ విధిగా చెల్లించనవసరం లేదు. కొందరు ఎక్కువగాను, కొందరు తక్కువగాను చెల్లించవచ్చును. కొందరు వ్యక్తులు వీటిని అసలు చెల్లించే అవసరం రాకపోవచ్చు. ఒక్కోసంరధ్భంలో ప్రత్యక్షంగానీ, పరోక్షంగానీ చెల్లించవచ్చును.

**1. ఫీజులు :** ప్రభుత్వసేవలవలన ప్రయోజన పొందే ప్రతివ్యక్తి ఫీజు చెల్లించాలి. ఆయా వస్తుసేవల తయారీకై ప్రభుత్వం కొంత వ్యయాన్ని ఖర్చు చేయాల్సి వుంటుంది. కాబట్టి దానికి చెల్లించే మూల్యమే ఫీజులు అని చెప్పవచ్చును. ఈ ఫీజు అందరికీ ఒకేలా వుండకపోవచ్చును. పేదవర్గానికి ధనిక వర్గం కంటే తక్కువ ఫీజు నిర్ణయించవచ్చును.

**2. లైసెన్సు ఫీజు :** ఏదైనా ప్రత్యేక సేవ లేక ప్రయోజనం పొందేందులకు గాను ప్రభుత్వం నుండి అనుమతి పొందేందులకు వ్యక్తులు చెల్లించే మొత్తమే ఈ లైసెన్సు ఫీజు అనవచ్చును.

ఉదా: మోటారు వాహనాలు తిప్పుకునేందులకు విధిగా లైసెన్సు ఫీజు కట్టుట, వాహనాలు నడిపేందులకు, కొన్ని వ్యాపారాలు చేసేందులకు వ్యక్తులు విధిగా ప్రభుత్వం నుండి లైసెన్సులు పొందాలి. వాటి నిమిత్తమై ప్రభుత్వానికి ప్రజలు చెల్లించే మొత్తమే లైసెన్సు ఫీజు అని చెప్పవచ్చును.

3. **ప్రత్యేక చెల్లింపులు :** ప్రజలకు కొన్ని ప్రత్యేకమైన సేవలు అందించటం, మెరుగైన సదుపాయాలను కల్పించటం కోసం ప్రభుత్వం ప్రజల నుండి వసూలు చేసే మొత్తమే ఈ ప్రత్యేక చెల్లింపులు. ప్రైవేటు ఆస్తుల విలువలు పెరిగేటట్లు చేయగల పనులు తలపెట్టినపుడు ప్రయోజనం పొందే వారి నుండి వసూలు చేసేవే ప్రత్యేక విధింపులు అని చెప్పవచ్చును.

**ఉదా :-** మురుగు నీటి సదుపాయాల, వీధిలైట్లు, రోడ్ల మొదలగునవి. ఈ ప్రత్యేక చెల్లింపులు దాదాపు పన్నులనే పోలియుంటాయని ఈ క్రింది అంశాల వలన తెలయచున్నది.

1. పన్నులు, ప్రత్యేక చెల్లింపులు వలన వసూలైన మొత్తం ఆదాయరూపంలో ప్రభుత్వానికి చేరుతుంది.
2. సమాజశ్రేయస్సుకే ఈ మొత్తం వినియోగించబడుతుంది.
3. పన్నుల వలే ఈ ప్రత్యేక చెల్లింపులు కూడా తప్పనిసరిగా చెల్లించాలి.
4. జరిమానాలు, అపరాధ రుసుములు

వీటి మూలంగా ప్రభుత్వానికి పెద్దమొత్తంలో ఆదాయం రాకపోవచ్చు. జరిమానా అనగా చట్టాన్ని ఉల్లంఘించిన సందర్భాలలో ప్రజలు ప్రభుత్వానికి చెల్లించే మొత్తం. చట్టరీత్యాగడువు దాటిన సందర్భాలలో ప్రభుత్వానికి ఫీజు చెల్లించాలంటే కొంత మొత్తాన్ని అదనంగా చెలించాల్సి వుంటుంది. దీనినే అపరాధ రుసుము అంటారు.

5. **ఫోర్‌పెట్యూర్స్ :** బెయిల్ మీద వెడుదలైన వ్యక్తులు కోర్టుకు హాజరు కాని పక్షంలో కోర్టులో బాండు రూపంలో పెట్టిన వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

6. **ఎస్టేట్స్ :** ఒక వ్యక్తి విల్లు వ్రాయకుండాగానీ, వారసులెవ్వరూ లేకుండా గానీ మరణించిన సందర్భంలో అతని ఆస్థి మొత్తం ప్రభుత్వంచే స్వాధీన పరచుకోబడుతుంది. వ్యక్తుల ఆస్తులు, పొలాలు, గృహాలు, బాంకు బాలన్సులు, పరిశ్రమలు మొదలగు వాటి రూపంలో వుండవచ్చును.

**డి. కానుకలు మరియు గ్రాంట్లు :** వ్యక్తులుగానీ, ప్రభుత్వేతర సంస్థలు గానీ స్వచ్ఛందంగా కొన్ని ప్రత్యేక ప్రయోజన నిమిత్తం ప్రభుత్వానికిచ్చే వాటినే కానుకలు అందురు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో బాధితులకు సహాయపడే నిమిత్తం ప్రభుత్వానికి కానుకలు, విరాళాలు ఇవ్వవచ్చు. అలానే యుద్ధసమయాలలో అధికవ్యయం అవసరమవుతుంది. కాబట్టి దేశభక్తితో కొందరు ప్రజలు ప్రభుత్వానికి కొన్ని ప్రత్యేక నిధల నిమిత్తం విరాళాలివ్వవచ్చును.

గ్రాంట్లు కూడా స్వచ్ఛందంగా ఇవ్వబడే మొత్తాలే అని చెప్పవచ్చును. అభివృద్ధి చెందిన దేశాలు, అంతర్జాతీయ సంస్థలు వెనుకబడిన దేశాలకు గ్రాంట్లు లేక నిధుల రూపంలో సహాయం చేయవచ్చును. ఈ నిధులు తిరిగి చెల్లించనవసరం లేదు. కాబట్టి ప్రభుత్వం మీద ఎలాంటి భారాన్ని మోపవు. గ్రాంట్లు సహజంగా విదేశీ సహాయం రూపంలో వుంటాయి.

పైన పేర్కొన్న వివిధ మార్గల ద్వారా నేడు ప్రతి ప్రభుత్వం తనకు కావలసిన ఆదాయాన్ని సేకరించి వ్యయాన్ని తట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ విధంగా ప్రభుత్వ వ్యయానికి, ప్రభుత్వ ఆదాయవనరులకు మధ్య సమన్వయం తీసుకురావటానికి ప్రయత్నించటం అన్ని విధాల శ్రేయస్కరం.

## 14.3 భారతదేశంలో కేంద్రప్రభుత్వ రాబడి :

మన కేంద్ర ప్రభుత్వ రాబడిని రెవిన్యూ రాబడి, మూలధనరాబడి అని రెండు రకాలుగా విభజించవచ్చును.

ఎ) రెవన్యూ రాబడి

1) పన్నుల రాబడి
2) పన్నులేతర రాబడి

పన్నుల రాబడి

1. ఆదాయాలపై పన్ను
2. సంపద, మూలధన మార్పిడిలపై పన్నులు
3. వస్తుసేవలపై పన్నులు

2). పన్నులేతర రాబడి

1. కోశ మరియు ఇతర సేవలు
2. వడ్డీ చెల్లింపులు
3. డివిడెండ్లు మరియు లాభాలు

| | కేంద్రప్రభుత్వ రెవిన్యూ ఎకౌంట్ రాబడి (కోట్ల రూపంలో) | | | |
|---|---|---|---|---|
| | 1950-51 | 1980-81 | 2001-02 | 2003-04 |
| పన్నులరాబడి/ | 327 | 9,390 | 1,33,660 | 1,84,170 |
| (నికర) | (88) | (73) | (66) | (73) |
| పన్నులేతర రాబడి | 49 | 3440 | 67,790 | 69,770 |
| | (12) | (27) | (34) | (27) |
| రెవన్యూ రాబడి/ | 406 | 12,380 | 2,01,450 | 2,53,940 |
| మొత్తం | (100) | (100) | (100) | (100) |

బడ్జెట్ అంచనా

పై పట్టికలో వివరించిన విధంగా పన్నుల రాబడి 1950-51లో కేవలం రు. 327 కోట్లు మాత్రమే వున్నప్పటికీ 2001-02 నాటికి రు1,33,660 కోట్లకు పెరిగింది. 2003-04 లో రు1,84,170 కోట్లుగా అంచనా వేయబడింది.

మొత్తం రాబడి లో పన్నులేతర రాబడి కేవలం రు49 కోట్లు మాత్రమే 1950-51లో వున్నప్పటికీ 2001-02లో రు67,770 పెరిగింది. 2003-04 బడ్జెట్ లో రు.69,770 కోట్లకు అంచనా వేయబడింది.

మొత్తం రెవెన్యూ రాబడి రు.406కోట్ల నుండి 2,01,450 కోట్లకు (2001-02) లో పెరిగింది. 2003-04 కు రు.2,53,940 కోట్లు ఆదాయంగా పేర్కొనబడింది.

ప్రత్యక్ష పన్నులు, **పరోక్ష పన్నులు రాబడి** మన కేంద్ర ప్రభుత్వానికి వ్యక్తిగత ఆదాయపన్ను, కార్పొరేషన్ పన్ను, వడ్డీలపై పన్నులు, వ్యయపన్ను, సంపద, మూలధన మార్పిడిలపై పనునలు మొదలగు ప్రత్యక్ష పన్నుల ద్వారా ఆదాయం సమకూరుతున్నది.

ఎక్సయిజ్ సుంకాలు, కస్టమ్స్ సుంకాలు, సేవలపై పన్నులు మొదలగు పరోక్ష పన్నుల ద్వారా కూడా పన్నుల రాబడి సమకూరుతున్నది.

| | ప్రత్యక్ష - పరోక్ష పన్నుల రాబడి (కోట్లరూలలో) | | |
|---|---|---|---|
| | 1950-51 | 1990-91 | 2003-04 |
| ప్రత్యక్ష పన్నులు | 174 | 11,030 | 95,470 |
| | (43) | (16) | (38) |
| పరోక్ష పన్నులు | 227 | 57,470 | 1,55,790 |
| | (57) | (84) | (62) |
| మొత్తం పన్నుల | 401 | 68,500 | 2,51,530 |
| రాబడి | (100) | (100) | (100) |

ప్రత్యక్ష పన్నుల రాబడి 1950-51 లో కేవలం రు174 కోట్లు (43%) మాత్రమే వున్నప్పటికీ 1990-91 లో రు11,030 కోట్లకు (16%కు) పెరిగింది. 2003-04 బడ్జెట్ లో రు 95,470 కోట్లకు అంచనా వేయబడింది.

పరోక్ష పన్ను రాబడి 1950-51 లో రు227 కోట్లు (57%) వుండగా 1990-91 నాటికి రు57,470 కోట్లకు (84%) పెరిగింది. 2003-04 నాటికి రు1,55,790 కోట్లకు బడ్జెట్ అంచనా వేయబడింది.

మొత్త పన్నుల రాబడి రు.401 కోట్లనుండి 1990-91 నాటికి రు.68,500 కోట్లకు పెరిగింది. 2003-04 బడ్జెట్‌లో ఈ మొత్తం రు.2,51,530 కోట్లకు బడ్జెట్ అంచనా వేయబడింది.

**కేంద్రప్రభుత్వ పన్నులేతర రాబడి :** కోశసేవల ద్వారా, వడ్డీలద్వారా, ప్రభుత్వ సంస్థల డివిడేండ్లు లాభాల ద్వారా కూడా కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. ఈ మొత్తం 1950-51 లో కేవలం రు.49 కోట్లు వుండగా 1970-71 నాటికి రు.890 కోట్లకు పెరిగింది. 2003-04 బడ్జెట్ ఈ మొత్తం రు.19,770 కోట్లకు చేరవచ్చని అంచనా వేయబడింది. మొత్తం మీద మన కేంద్ర ప్రభుత్వ రాబడిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి.

**మూలధన రాబడి :** గతంలో ఇచ్చిన అప్పులు తిరిగి చెల్లించగా వచ్చిన మొత్తము అంతర్గత అప్పులు, ప్రభుత్వ రంగసంస్థల నుండి వచ్చే లాభాలు, ప్రభుత్వరంగసంస్థ వాటాల వుపసంహరణ ద్వారా వచ్చిన ధనము మొదలగు అంశాలు మూలధన రాబడి క్రింద చూడబడతాయి.

## 14.4 కేంద్ర ప్రభుత్వ వ్యయము :

కేంద్రప్రభుత్వము జాతీయ ప్రాధాన్యత గల అంశాను చేపట్టవలసిన అవసరం వున్నది. ప్రభుత్వవ్యయం అంటే కేవలం ప్రభుత్వం వ్యయాన్ని ఖర్చుచేయటం కాదు. తద్వారా ప్రజల ఆర్థిక, సామాజిక అవసరాలను తీర్చి, ప్రజల జీవన ప్రయోగాలను, దేశ ఆర్థిక ప్రగతిని ప్రోత్సహించాలి.

సనాతన ఆర్థికవేత్తలు ముఖ్యమైన రక్షణ శాంతి భద్రతలను కాపాడటం, ముఖ్యమైన అవస్థాపనా ఏర్పాటు చేయటం తప్ప ప్రభుత్వానికి బాధ్యతలు లేవని కాబట్టి ప్రభుత్వవ్యయం అంతగా చేయనవసరం లేదని భావించారు.

1930 ఆర్థికమాంద్యం తరువాత కీన్స్ అర్థ శాస్త్రంలో ఒక విప్లవాన్ని తీసుకువచ్చాడు. ఆర్థిక మాంద్యం నుండి బయటపడాలంటే ప్రభుత్వ వ్యయాన్ని పెంచి, నిరుద్యోగాన్ని తొలగించే ప్రయత్నం చేయాలి. తద్వారా ఆర్థికమంద్యం తొలగించి దేశంలో ఆర్థిక సుస్థిరత ఏర్పరచే ప్రయత్నం జరుగుతుంది. ప్రైవేటు రంగంలో దేశభవిష్యత్ కోసం కాక వారి స్వలాభం కోసమే వ్యయం చేయబడుతుంది. అయితే ప్రభుత్వం వ్యయం ద్వారా గరిష్ట సామాజిక ప్రయోజనాన్ని పొందగలము.

**ఆధునిక యుగంలో ప్రభుత్వ వ్యయ లక్షణాలు :**

1. సామాజిక, ఆర్థిక సంక్షేమాన్ని పెంచేందులకు, సమాజంలో అభిలషణీయ వినియోగస్థాయిని సాధించేందులకు ప్రభుత్వ వ్యయం చాలా అవసరం.
2. మార్కెట్ యంత్రాంగంలో గల అవకతవకలను నుతొలగించాలంటే ప్రభుత్వం వ్యయం చాలా అవసరం.
3. వెనుకబడిన ఆర్థికవ్యవస్థలో అవస్థాపనాసదుపాయాలను పెంచేందులకు మూలధన రూపకల్పన చేయాలంటే ప్రభుత్వవ్యయం ద్వారానే సాధ్యపడుతుంది.
4. మెరుగైన ఆదాయపంపిణీ చేసి, తద్వారా ప్రజలకు కావలసిన సేవలందించి దేశ శ్రేయస్సుకు తోడ్పడాలంటే ప్రభుత్వవ్యయం ద్వారానే సాధ్యపడుతుంది.

**ఆర్థికాభివృద్ధి వ్యూహంలో ప్రభుత్వవ్యపాత్ర :**

1. రోడ్లు, రైల్వేలు, నీటి పారుదల, విద్యుశ్చక్తి మొదలుగు ఆర్థిక అవస్థాపనా సదుపాయాలు ఏర్పాటు చేయాలి.
2. సంతులిత ప్రాంతీయాభివృద్ధిని సాధించాలంటే ప్రభుత్వ వ్యయాన్ని అని రంగాలలోను వ్యయం చేయాల్సి వుంటుంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో వ్యయం చేయాల్సి వుంటుంది.

3. వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధులకు ప్రభుత్వ వ్యయం చాలా అవసరం.
4. ఘనులలో గల వనరులనుండి బొగ్గ, చమురులను బయటకు తెచ్చి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలి.
5. గ్రామీణ విద్యుదీకరణ కార్యక్రమాలు చేపట్టాలి. తద్వారా గ్రామీణాభివృద్ధి జరగాలంటే ప్రభుత్వ వ్యయం చాలా అవసరం.

**ఆధునిక యుగంలో ప్రభుత్వవ్యయం పెరుగుటకు గల కారణాలు, తలసరి ఆదాయంలో పెరుగుదల :** తలసరి ఆదాయం పెరిగేకొలదీ ప్రజలు అనేకరకాల వస్తుసేవలను కొరుకుంటారు. కాబట్టి ప్రభుత్వవ్యయాన్ని పెంచవలసిన అవసరం చాలా వున్నది.

**సంక్షేమ రాజ్యం :** నేటి ప్రబుత్వాలు ప్రజా సంక్షేమమే ముఖ్యధ్యేయంగా పెట్టుకున్నాయి. కాబట్టి ప్రభుత్వవ్యయాన్ని పెంచి సగటు మానవుల జీవన ప్రమాణాలను పెంచే ప్రయత్నం చేయాలి. తద్వారా దేశ ఆర్థిక శ్రేయస్సు కూడా పెరుగుతుంది. సనాతన ఆర్థిక వేత్తల ప్రకారం ప్రభుత్వం కొన్ని కీలక విధులను మాత్రమే నిర్వర్తిస్తుంది. నేటి ఆధునిక ప్రభుత్వాలు ప్రజల అవసరాలు తీర్చేందులకు అవిరళకృషి చేస్తున్నాయి.

**యుద్ధ ప్రభావం మరియు రక్షణ ఆవశ్యకత :** ఈ ఆధునిక యుగంలో యుద్ధ ప్రభావాన్ని నివారించేందులకు ప్రభుత్వాలు గణనీయ మొత్తాలను వ్యయం చేస్తున్నాయి. న్యూక్లియర్ బాంబులు, అణుబాంబులను ప్రయోగించే ఈ ఆధునిక యుగంలో ప్రతిదేశం రక్షణపరంగా తాను కూడా శతృదేశాలకు దీటుగా తయారు కావాలి.

**వనరుల తరలింపు మరియు ఆర్థికంగా సహాయపడేశక్తి :** ప్రభుత్వం అనేకరకాలుగా అన్వేషించి వివిధపన్నుల ద్వారా అధిక రాబడి పొంది, ఆ మొత్తాన్ని వినియోగించి దేశ అవసరాలను తీర్చుకోవాలి. పన్నుల ద్వారా అధికరాబడి, ప్రభుత్వ అప్పులు, విదేశీ సహాయం మరియు లోటు ద్రవ్య విధానాలను వినియోగించి ప్రభుత్వం తన వనరులను పెంచుకొని అన్ని రంగాలకు ఆర్థికంగా సహాయపడగల శక్తిని సంపాదించాలి.

**ద్రవ్యోల్బణం :** పెరుగుతున్న ధరల వలన ప్రజలకు జీవన వ్యయం పెరుగుతుంది. జీవన ప్రమాణం మాత్రం తగ్గుతుంది. కాబట్టి ద్రవ్యోల్బణ సమయంలో ఉద్యోగులకు జీతభత్యాలు, పెన్షన్లు పెంచాల్సిన అవసరం వున్నది. వస్తుకొరతను నివారించేందులకు దిగుమతి చేసుకోవటం, ప్రజాపంపిణీ పద్ధతి ద్వారా ప్రజలకు నిత్యావసర వస్తువులను చౌకగా అందించటం లాంటి కార్యక్రమాలను ప్రభుత్వమే చేపట్టాలి. కాబట్టి కొంత వ్యయం ఖర్చవుతుంది.

**సామ్యవాద మరియు ప్రజాస్వామ్యాల పాత్ర :** సామ్యవాత వ్యవస్థలో ప్రభుత్వ బాధ్యతలు అధికంగా వుంటాయి. ప్రజలకు కావలసిన వస్తుసేవలను ప్రభుత్వమే అందించాలి. అలానే ప్రజాస్వామ్యవ్యస్తలో కూడా ప్రజల అవసరాలను చూడాల్సిన గురుతరమైన బాధ్యత ప్రభుత్వమే చేపట్టాల్సి ఉంటుంది.

**పట్టణాభివృద్ధి ప్రభావం :** ఈ ఆధునిక యుగంలో పట్టణాభివృద్ధి అతి వేగంగా జరుగుతున్నది. ఈ పరిస్థితులలో ప్రజా పరిపాలనకు, ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలను కలుగజేసేందులకు ప్రభుత్వం బాగా వ్యయం చేయాల్సి వుంటుంది. పట్టణాలలో రోడ్లు, విద్యుశ్చక్తి, కోర్టులు, జైళ్ళు ఆసుపత్రులు, విద్యాలయాలు, ఆటస్థలాలు మొదలగు సదుపాయాలను ప్రభుత్వమే చేపట్టాల్సి వుంటుంది.

**జనాభా ప్రభావం :** పెరుగుతున్న జనాభా వలన దేశంలో అనేక అవసరాలు పెరుగుతాయి. అందరికీ ఆహారం, త్రాగునీరు, నిలువనీడ, విద్య, ఉద్యోగం మొదలగు అవసరాలను ప్రభుత్వమే తీర్చాలి. అధిక జనసాంద్రత అనేక అవసరాలను పెంచుతుంది. కాబట్టి మన దేశంలో పెరుగుతున్న జనాభాతో పాటు ప్రభుత్వవ్యయం కూడా క్రమేపీ పెరుగుతున్నది.

**రవాణా మరియు కమ్యూనికేషన్ :** వాణిజ్య అభివృద్ధి పెరుగుతున్న జనాభా రవాణా సదుపాయాలను పెంచటానికి గల ముఖ్య కారణాలు. రవాణా లేనిదే వస్తు, సేవల వాణిజ్యం స్తంభించిపోతుంది. ముడిపదార్థాలు ఫ్యాక్టరీకి, వస్తువులను ఫ్యాక్టరీనుండి హోల్‌సేల్ మార్కెట్ కు, అక్కడి నుండి రిటైల్ మార్కెట్‌కు తరలించాలంటే రవాణా సదుపాయాలు, తంతి తపాల సేవలు బాగా అభివృద్ధి పరచాల్సిన అవసరం వున్నది. దానికి ప్రభుత్వవ్యం చాలా అవసరం.

**ప్రణాళికా ప్రభావం :** 1951 నుండి ప్రారంభమైన మన ప్రణాళికా విధానం కూడా చాలా వ్యయం తో కూడుకున్న వ్యవహారం. ముఖ్యగా వెనుకబడిన దేశాలలో ప్రణాళికా వ్యూహం తప్పనిసరిగా చేపట్టాలి. కాబట్టి ప్రభుత్వ వ్యయం విపరీతంగా పెరగవచ్చు.

**ఫంక్షనల్ (పూరిక) విత్తము** : కోశవిధానం ద్వారా వ్యాపార చక్రాలను నివారించే ప్రయత్నం చేస్తాము. ముఖ్యంగా దేశం ఆర్థికమాంద్యంలో ఉన్నప్పుడు ప్రభుత్వ వ్యయాన్ని పెంచి, తద్వారా నిరుద్యోగం తొలగిచటం, ఆర్థిక మాంద్యాన్ని తొలగించి ఆర్థిక సుస్థిరతను ఏర్పాటు చేయటం లాంటి బృహత్తర కార్యక్రమాలు చేపట్టాలి. కాబట్టి దీనికి అవసరమయ్యే వ్యయాన్ని ఫంక్షనల్ లేక పూరక విత్తం అవసరమవుతుంది. ఈ ఆధునిక యుగంలో పటిష్టవిత్తం కంటే పూరక విత్తమునకు అధిక ప్రాధాన్యతగలదు.

## 14.5 భారతదేశంలో కేంద్రప్రభుత్వ వ్యయం :

మనదేశంలో కేంద్రప్రభుత్వ వ్యయం గణనీయంగా పెరుగుతున్నది. మన కేంద్ర ప్రభుత్వ వ్యయాన్ని ఈ క్రింది విధంగా విభజించ వచ్చును.

1. రెవిన్యూ వ్యయం
2. మూలధన వ్యయం

| కేంద్ర ప్రభుత్వ వ్యయం (కోట్ల రూ. లలో) | | | |
|---|---|---|---|
| సంవత్సరం | రెవెన్యూ వ్యయం | మూలధన వ్యయం | మొత్తం వ్యయం |
| 1950-51 | 350 | 180 | 530 |
| 1980-81 | 14,540 | 9,630 | 2,470 |
| 2001-02 | 3,01,610 | 60,840 | 3,62,450 |
| 2003-04 (బడ్జెట్) | 3,66,230 | 72,570 | 4,38,800 |

**రెవిన్యూ వ్యయం** పన్నుల రాబడి, పన్నులేతర రాబడి ద్వారా వచ్చిన ఆదాయం నుండి రెవిన్యూ వ్యయం ఖర్చు చేయబడుతుంది. ఈ మొత్తం 1950-51 లో కేవలం రు.350 కోట్లు మాత్రమే వున్నప్పటికి క్రమేపీ పెరిగి 2003-04 నాటికి రు.3,66,230 కోట్లకు అంచనా వేయబడింది.

**మూలధన వ్యయం** : కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల కిచ్చే ఆర్థిక వనరులు, అప్పులు, కేంద్రప్రభుత్వ సంస్థల అభివృద్ధి, వ్యాప్తికి ఇచ్చే మొత్తం మూలధనవ్యయం కూడా 1950-51 లో కేవలం రు.18 కోట్లు మాత్రమే ఉన్నపటికీ 2003-04 బడ్జెట్ ప్రకారం రు.4,38,800 కోట్ల మేరకు పెరుగుతుందని అంచనా వేయబడింది.

**మొత్తం వ్యయం** : కేవలం రు530 కోట్లు మాత్రమే వున్న మొత్తం వ్యయం 2003-04 బడ్జెట్ ప్రకారం రు4,38,800 కోట్ల మేరకు పెరుగుతుందని అంచనా వేయబడింది.

**1987-88కి ముందు రెవిన్యూ వ్యయ విభజన** : మనదేశంలో 1987-88 కి ముందు రెవిన్యూ వ్యయం ఈక్రింది విధంగా విభజించబడింది.

ఎ. పౌరవ్యయము

బి. రక్షణవ్యయము

సి రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇచ్చే నిధులు 1987-88కి పూర్వం కేంద్ర ప్రభుత్వం ఈ క్రింది విభజన కూడా అనుసరించింది.

**ఎ. అభివృద్ధి వ్యయం :**

- సాంఘిక మరియు కమ్యూనికేషన్ సేవలు
- ఆర్థిక సేవలు
- రాష్ట్రాలకు కేంద్రపాలిత ప్రాంతాలకు నిధులు

బి. రక్షణ వ్యయం :

సైనికులకు జీతభత్యాలు, పెన్షన్లు, ఆయుధాల/యుద్ధసామాగ్రి, ఆయుధసామాగ్రి దిగుమతులపై చేసే వ్యయం.

సి. ఇతర వ్యయం :

పన్నులు/సుంకాలు వసూళ్ళకయ్యేవ్యయం, పరిపాలనా సేవలు, వడ్డీ చెల్లింపులు, పెన్షన్, ఇతర పదవీ విరమణ చెల్లింపులు, రాష్ట్రాలకిచ్చే ఇతర నిధులు.

**కేంద్రప్రభుత్వ వ్యయం -క్రొత్త విభజన**

1987-88 బడ్జెట్ నుండి కేంద్ర ప్రభుత్వ వ్యం ఈ క్రింది విభజన అనుసరిస్తున్నది.

1. ప్రణాళికేతర వ్యయం
2. ప్రణాళికా వ్యయం

ఈ విభజన ప్రకారం కేంద్రప్రభుత్వ వ్యయ వివరాలు ఈ క్రింది పట్టికలో వివరించబడినాయి.

| కేంద్ర ప్రభుత్వ వ్యయం రెవిన్యూ, మూలధన ఎకౌంట్లు (కోట్ల రూ.లలో) | | |
|---|---|---|
| | 1989-90 | 2003-04(బడ్జెట్) |
| ప్రణాళికేతర వ్యయం | 64,500 | 3,17,820 |
| రెవిన్యూ ఎకౌంటు | 52,130 | 2,89,380 |
| మూలధ ఎకౌంటు | 12,370 | 28,440 |
| ప్రణాళిక వ్యయం | 28,400 | 1,20,980 |
| రెవిన్యూ ఎకౌంటు | 12,070 | 76,850 |
| మూలధన ఎకౌంటు | 16,330 | 46,130 |
| మొత్తం వ్యయం | 92,900 | 4,38,800 |

**ప్రణాళికేతర వ్యయం** : కేంద్ర ప్రభుత్వకేతర వ్యయాన్ని రెవిన్యూవ్యయం,మూలధనవ్యయం అని రెండుగా విభజించవచ్చును.

**రెవిన్యూ వ్యయం** : అనగా వడ్డీ చెల్లింపులు, రక్షణ వ్యయం, ముఖ్య సబ్సిడీలు, వడ్డీ మరియు ఇతర సబ్సిడీలుంటాయి. రైతులకు రుణాల మాఫీ, పోస్టల్‌లోటు, పోలీసు పెన్షన్లు, ఇతర సాధారణ సేవలు, సాంఘిక సేవలు, విద్య, ఆరోగ్యం, బ్రాడ్ కాస్టింగ్, ఆర్థిక సేవలు, వ్యవసాయం, పరిశ్రమ, విద్యుశ్చక్తి, రవాణా, సమాచారం మొదలగు వాటిపై చేసే వ్యయం రెవిన్యూ వ్యయం అంటారు.

**మూలధన వ్యయం** : అనగా రక్షణ రంగంలో మూలధనవ్యయం, ప్రభుత్వ రంగసంస్థలకు అప్పులు, రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు అప్పులు, విదేశీ ప్రభుత్వాలకు అప్పులు మొదలగు వాటికై చేసే వ్యయం.

పైపట్టికలో చూపిన విధంగా ప్రణాళికేతర వ్యయం 1989-90లో రు.64,500 కోట్లు (69.43%) నుండి 2003-04 నాటికి రు.3,17,820 కోట్లుకు (72.43%) కు పెరిగింది.

**ప్రణాళిక వ్యయం** : కేంద్రప్రభుత్వ ప్రణాళికా వ్యయం ద్వితీయస్థానాన్ని ఆక్రమించింది. కేంద్రప్రణాళికలలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, నీటి పారుదల, వరద నివారణ, విద్యుశ్చక్తి, పరిశ్రమ మరియు ఘనులు, రవాణా, పర్యావరణం, శాస్త్రీయ, సాంకేతిక, సాంఘిక సేవలు మరియు ఇతరాలపై చేసే వ్యయం అని చెప్పవచ్చును. దీనిలో కూడా రెవిన్యూ వ్యయం, మూలదన వ్యయం అని రెండుగా వుంటాయి.

పై పట్టికలో ప్రణాళికా వ్యయం రు.28,400కోట్లు (30.57%) నుండి 1,20,980 కోట్లకు (27.57%) పెరిగింది. మొత్తం వ్యయం 1989-90 లో రు92,900 కోట్లు మాత్రమే వుండగా 2003-04 బడ్జెట్‌లో రు.4,38,800 కోట్లకు పెరిగింది.

**ప్రభుత్వ వ్యయంలో మార్పులు :**

ఎ. భారతదేశంలో ప్రణాళికకాలంలో ప్రభుత్వవ్యయం విపరీతంగా పెరిగిపోతున్నది.

బి. సంక్షేమ రాజ్యస్థాపనలో వ్యయం పెద్దమొత్తంలో అవసరపడుతుంది.

సి. యుద్ధానంతరం ప్రణాళికాభివృద్ధి ప్రారంభించినందువలన కూడా వ్యయం విపరీతంగా పెరిగిపోతున్నది.

డి. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం ప్రజాసంక్షేమ కార్యక్రమాలను అధికంగా చేపట్టటం వలన కూడా వ్యయం పెరుగుతున్నది.

ఇ. మొత్తం వ్యయంలో అభివృద్ధి వ్యయమే పెద్ద మొత్తంలో వున్నది.

ఎఫ్. మన దేశ రక్షణకు ముప్పువున్నందున రక్షణ వ్యయం విపరీతంగా పెరిగిపోతున్నది. కేంద్ర ప్రభుత్వానికి వ్యయం విపరీతంగా పెరిగిపోతున్నది. ఆదాయం మాత్రం నత్తనడకలా నెమ్మదిగా పెరుగుతున్నది. అందువలన లోటుపూర్తి చేసుకునేందులకు కేంద్రప్రభుత్వం పెద్దమొత్తంలో లోటు ద్రవ్య (డెఫిసిట్ ఫైనాన్సింగ్) విధానాన్ని అనుసరిస్తున్నది. అత్యవసర పరిస్థితులలో మాత్రమే వినియోగించాల్సిన లోటు ద్రవ్య విధానం మోతాదు మించి క్రమంగా పెంచుకుంటూ పోవటం ఆందోళన కల్గించే విషయంగా గ్రహించి అదుపులో వుంచేందులకు ప్రభుత్వం కొన్ని చర్యలు చేపడుతున్నది. దానికి తోడు దేశీయ, అంతర్జాతీయ అప్పులు కూడా పెరిగిపోతున్నాయి. కాబట్టి ఆదాయ, వ్యయాల మధ్య సమతూకం పాటించాల్సిన అవసరం చాలా వున్నది.

## 14.6 రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయవనరులు :

రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్నా రాజ్యాంగపరంగా రాష్ట్రాలకు కూడా కొన్ని విధులు, కొన్ని పన్నులు వసూలు చేసుకునే అధికారం ఇవ్వబడింది. స్థానిక అవసరాలులననుసరించి రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని బాధ్యతలను నిర్వర్తించవలసి వుంటుంది. రాష్ట్ర ప్రభుత్వ పన్నుల జాబితా కూడా రాజ్యాంగంలో సవివరంగా వివరింపంబడింది. పన్నులే కాక పన్నులేతర ఆదాయం కూడా రాష్ట్రాలు పొందుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్యగల ఆర్థిక అంతరాన్ని తొలగించేందులకు కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రణాళికా, ప్రణాళికేతర వనరులు క్రింద పెద్ద మొత్తంలో ఆర్థికవనరులను సమకూర్చుతుంది.

**రాష్ట్ర ప్రభుత్వాల విధులు :**

మన రాజ్యాంగపరంగా స్థానిక ప్రాధాన్యతగల అంశాలన్నీ రాష్ట్రాలకే అప్పగించబడినాయి.

ఎ. పోలీసు, కోర్టులు, జైళ్ళు మొదలగు సంస్థల సహాయంతో రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలి.

బి. రాష్ట్రాల సాంఘిక, ఆర్థికాభివృద్ధులను సాధించటం. విద్య, వైద్యం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, వినోదం మొదలగు సాంఘిక అవసరాలు రాష్ట్రాలే చూడాలి. వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలి. గతంలో కంటే నేడు రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలు బాగా విస్తరించాయి.

సి. స్థానికంగా వచ్చిన సమస్యకైనా ముందుగా స్పందించాల్సింది రాష్ట్ర ప్రభుత్వాలే. కాబట్టి సంక్షేమ రాజ్యంలో, ప్రజాస్వామికవ్యవస్థలో ప్రభుత్వాలు కీలక పాత్రను నిర్వహించి స్థానిక ప్రజల అవసరాలను తీర్చాలి.

డి. రాష్ట్ర ప్రభుత్వ విధుల జోలికి కేంద్రప్రభుత్వం రాదు. అందువలన రాష్ట్రాల బాధ్యతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. స్వతంత్ర్య సంస్థగా రాష్ట్రాలు కీలకపాత్రను నిర్వహించాలని సర్కారియా కమీషన్ కూడా పేర్కొన్నది.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధులను నిర్వర్తించాలంటే ఆర్థికవనరులు కూడా సరిపడినంతగా వుండాలి. కాబట్టి రాష్ట్రాలకు స్థానికంగా కొన్ని పనులు విధించి ఆదాయం పెంచుకునేందులకు వీలుగా రాజ్యాంగంలో కొంత ఏర్పాటు చేయబడింది.

**రాష్ట్ర ప్రభుత్వ ఆదాయవనరులు :**

**I.** రాష్ట్ర ప్రభుత్వ సొంతవనరులు

ఎ. పన్నుల రాబడి

బి. పన్నులేతర రాబడి

**II.** కేంద్రప్రభుత్వం నుండి పొందే ఆర్థికవనరులు

**I. రాష్ట్ర ప్రభుత్వ సొంతవనరులు :**

**పన్నుల రాబడి :** రాష్ట్ర ప్రభుత్వ రాబడిన ఈ క్రింది మూడు విధాలుగా విభజించవచ్చును.

**I. ఆదాయాలపై పన్నులు :**

**వ్యవసాయాదాయ పన్ను :** వ్యవసాయదారుల ఆదాయపంపై పన్ను విధించే అధికారం రాజ్యాంగం రాష్ట్రాలకు కల్పించింది. వ్యవసాయాదాయంపై పన్ను విధించేటప్పుడు తగ్గింపులు కూడా కల్పించబడినాయి. వ్యవసాయాదాయపన్ను వివిధ పన్ను వివిధ స్లాబుల ప్రకారం వివిధ రేట్లలో విధించబడుతుంది. ఈ పన్ను భారం ధనిక వ్యవసాయదారుల మీదే పడుతుంది. మనదేశంలో 1935లో భారతరాజ్యాంగా క్రింద ప్రప్రధమంగా వ్యవసాయాదాయాలపై పన్ను విధించబడింది. రాష్ట్రాలు వ్యయసాయ ఆదాయాలపై పన్ను విధించుకునే అధికారం రాజ్యాంగం కూడా ఇచ్చింది. 1938లో ప్రప్రధమంగా బీహార్ ప్రాదేశిక ప్రభుత్వం వ్యవసాయదాయాలపై పన్నువిధించింది. అప్పటినుండి కమిటీలు, కమిషన్లను ప్రభుత్వం నియయమించి వ్యవసాదాయపన్నులకు సంబంధించి తగిన సలహాలు, సూచలను కూడా సేకరించినది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబు, జమ్ము, కాశ్మీరులలో తప్ప అన్ని రాష్ట్రాలలోను వ్యవసాయాదాయాలపై పన్నులు విధించబడింది. అయితే ప్రత్యేకంగా దీనివలన పన్నుల రాబడి పెరిగే అవకాశం అంతగా లేదు.

**వృత్తిపన్ను:** వృత్తి, ఉద్యోగాలపై స్థానికంగా పన్ను విధించుకునే అధికారం 1869 భారత ప్రభుత్వ చట్టం ద్వారానే ప్రాదేశిక ప్రభుత్వాలకు లభించినది. అయితే రాష్ట్ర ప్రభుత్వం పన్నుల జాబితాలో రాజ్యాంగం లోని ఆర్టికల్ 267 ద్వారా పొందుపరచబడినది. అయితే కొందరు ఈ పన్ను విధింపు గురించి కొన్ని అభ్యంతరాలు చెప్పినా ఆదాయాల మీద విధించే పన్నే కాబట్టిట రాష్ట్ర ప్రభుత్వాలకు విధించే అధికారం వున్నది.

**II. సంపద మరియు మూలధన మార్పిడిలపై పన్నులు :**

**స్టాంపుడ్యూటీలు మరియు రిజిస్ట్రేషన్ ఫీజులు** అనేక చట్టాలు, డాక్యుమెంట్లు మీద స్టాంపు డ్యూటీలు విధించబడతాయి. స్టాంపుడ్యూటీలు చట్టపరమైన అన్నిరకాల డ్యాక్యుమెంట్ల మీద విధించబడతాయి. ఏదైనా ఒప్పందం మీద సంతకం పెట్టేప్పుడు ఆ వ్యక్తి స్టాంపుడ్యూటీలు చెల్లించాల్సి వుంటుంది.

మనదేశంలో స్టాంపుడ్యూటీలు జుడీషయల్, నాన్‌జుడీషియల్ అని రెండు రకాలుగా విడదీయవచ్చును. 1970, కోర్టు ఫీజు చట్టం ప్రకారం కోర్టులలో, గవర్నమెంటు ఆఫీసులల పనులన్న వ్యకుతలు జుడీషియన్ స్టాంపులు చెల్లిస్తారు.

1899 భారతదేశ స్టాంపుడ్యూటీ చట్టం ప్రకారం నాన్-జుడీషయల్ స్టాంపులు చెల్లించాల్సి వుంటుంది. ఈ చట్టం కాలానుగుణంగా కేంద్రప్రభుత్వము మరియు రాష్ట్రప్రభుత్వాలు కూడా అనేక సవరణలు చేసాయి. బిల్స్ ఆఫ్ ఎక్చేంజి, చెక్కులు, క్రెడిట్ లెటర్లు ప్రామిసర్ నోట్లు, రసీదుల మొదలగునవి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే వున్నాయి. అయితే ఈ స్టాంపు డ్యూటీలు వసూలుచేసి వినియోగించుకునే అధికారం మాత్రం రాష్ట్రాలకు ఇవ్వబడింది. స్థిరాస్తుల మార్పిడి జరిగేటప్పుడు కూడా రాష్ట్రాలు స్టాంపుడ్యూటీలు విధించి ఆదాయాన్ని పొందవచ్చు. కొన్ని రకాల స్టాంపు డ్యూటీలు స్థిరంగా వుంటాయి. కొన్ని తాత్కాలిక ప్రాతిపదిక మీద విధించబడతాయి. కాబట్టి రాష్ట్రప్రభుత్వాలకు స్టాంపులు అమ్మటం ద్వారా కూడా ఆదాయం వస్తున్నది.

అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వాల ఆస్తుల రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు (కోర్టులలో, తసీలలో) కూడా కొంత మొత్తం రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో ఆదాయం పొందుతాయి. ఇంకోరకంగా చెప్పాలంటే ఏ ఆస్తి అమ్మకం లేదా కొనుగోలు జరిగేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు ఆస్తుల రిషిస్ట్రేషన్ ఫీజు క్రింద కొంత రాబడిని పొందుతున్నాయి.

**భూమి శిస్తు :** పూర్వకాలం భూమిశిస్తు రూపంలో రాష్ట్రాలకు ఆదాయం లభిస్తూనే వున్నది. కాబట్టి ఈ ఆదాయం అతిపురాతనమైన కాలం నుండి వున్నదిన చెప్పవచ్చును. రాష్ట్ర పన్నులన్నింటిలోకి ఇది అతిపుర్తానమైనదిని చెప్పవచ్చును. ప్రతి వ్యవసాయదారుడు తన భూమిపై విధిగా భూమిశిస్తు చెల్లించాల్సి వుంటుంది. అయితే శిస్తు విధించే తీరు, సిస్తు రేటు అన్ని రాష్ట్రాలలో ఒకేలా వుండాలని లేదు. పంటల తీరు, భూసారం, నీటిపారుదల సదుపాయాలను బట్టి భూమిశిస్తు మారుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు ఎవరి సంస్కరణలు వారు చేపడుతున్నందువలన కూడా రాష్ట్రాల మధ్య భిన్నగా వుంటున్నది. పన్నుల విచారణ సంఘం భూమిశిస్తు గురించి విలువైన ప్రతిపాదనలు చేసింది. అయితే ఎక్కువ రాష్ట్రాలలో రైతులకువచ్చే నికర ఆదాయంపైనే భూమిశిస్తు విధించబడుతుంది. భూమి సప్లయి అవ్యాకోచంగా వుంటుంది. కాబట్టి ఈ మార్గం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందే అవకాశం చాలా తక్కువ.

**పట్టణంలో వ్యవసాయేతర కార్యక్రమాలకై భూమి వినియోగం :** పట్టణాలలో భూమిని భవననిర్మాణం, లేదా పారిశ్రామిక సంస్థను నిర్మించుకుంటే భూమిని పంటలు పండించుకునేందేలకు కానీ వేరే ప్రయోజనం కొరకు వినియోగిస్తున్నారు. కాబట్టి పట్టణాలలో, నగరాలలో ఈ రకమైన పన్ను చెల్లించాలి. పట్టణాభివృద్దికి పెరిగే కొలదీ భూమిని ఇతర ప్రయోజనాలకే ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఈ పన్ను ద్వారా రాష్ట్రాలు ఆదాయాన్ని పొందుతున్నప్పటికీ రాష్ట్రాలలో ఒకేలా లేదు.

**III. వస్తుసేవలపై పన్నులు :**

**సేల్సులాక్సు :** రాష్ట్ర పన్నులలో సేల్స్‌టీక్సు అతిముఖ్యమైనది అందువలన దీనిని రాష్ట్రాల 'కామధేనువు' అంటారు. వస్తుసేవల హోల్‌సేల్ అమ్మకాలు, రిటైల్ అమ్మకాల మీద ఈ సేల్స్‌టాక్సు విధించబడుతుంది. 1935 భారత ప్రభుత్వ చట్టం మొట్టమొదటిసారి ప్రాదేశిక ప్రభుత్వాలు సేల్స్‌టాక్సు విధించే అధికారం రాష్ట్రాలకిచ్చింది. 1950లో న్యూస్‌పేపర్ల తప్ప అన్ని రకాల అమ్మకాలపై సేల్స్‌టాక్సు విధించుకునే అధికారం కల్పించబడింది. అయితే ఇతర రాష్ట్రాలనుండి వచ్చే వస్తువుల మీద సేల్స్‌టాక్సు విధించుకునే అధికారం కూడా 1950లోభారత ప్రభుత్వ చట్టాన్ని సవరణ చేసి రాష్ట్రాల కిచ్చింది.

**సేల్స్‌టాక్సును ఈ క్రింది విధంగా విభజించవచ్చును.**

ఎ. సాధారణ సేల్సుటాక్సు మరియు నిర్ణీతల సేల్సుటాక్సు

బి. బహుళ స్థాయిలలో మరియు ఒకే స్థాయిలో విధించే సేల్సుటాక్సు

**రాష్ట్రాల ఎక్సైజ్ సుంకాలు :** ఎక్సైజ్ సుంకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభజించబడినాయి. ఆదాయ, పరిపాలనా సౌలభ్యాల దృష్ట్యా ఈ విభజన జరిగింది.

ఎ. ఆదాయం కోసం వస్తూత్పత్తి చేసే వారిపైన

బి. ఆరోగ్యానికి హానికరమైన వస్తువుల వినియోగించే వారిపైన ఈ సుంకాలు విధించబడతాయి.

రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ మార్గం ద్వారా బాగా పన్నుల రాబడి వస్తున్నది. ప్రజలు వినియోగించే వివిధ మత్తుపానీయాలపై ఈ సుంకాలు విధించబడతాయి. రాష్ట్రంలోనే తయారు చేయబడిన ఆల్కహాలు(వినియోగదారుల కోసం) మొదలగు మత్తుపానీయాలు మరియు మారక ద్రవ్యాలు, నల్లమందులపై ఈ సుంకాలు విధించబడతాయి. 1924-25 లో పన్నుల విచారణ సంఘం ఈ రకమైన ఎక్సైజ్ సుకాలను "నియంత్రించిన ఎక్సైజ్‌లు" గా పేర్కొన్నది. ప్రజల ఆరోగ్యానికి హాని చేసే మత్తు పానీయాలు, పదార్థాల వినియోగాన్ని తగ్గించటమే ఈ ఎక్సైజ్‌లు ముఖ్యవిధి.

**వాహనాలపై పన్నులు: 1914** భారతదేశ మోటార్ వాహన చట్టం ప్రకారం భారతదేశంలో జాతీయ స్థాయిలో మొట్టమొదటిసారిగా మోటార్ వాహన పన్నువిధించబడింది. మోటారు వాహనాల ట్రాఫిక్కును నియంత్రించటమే ఈ పన్ను విధింపు యొక్క ముఖ్య ఉద్దేశంగా పేర్కొనవచ్చును. వాహనాలు రిజిస్ట్రేషన్ డ్రైవింగ్ లైసెన్సు మొదలగు వాటి ద్వారా కూడా రాష్ట్రాలు రేట్లు మారుస్తూ ఆదాయాన్ని పొందగలుగుతున్నాయి. రాజ్యాంగం ప్రకారం యాంత్రిక శక్తిపై నడిచే ప్రతివాహనంపై మోటారు వాహన పన్ను విధించుకునే అధికారం రాజ్యాంగా కల్పించింది.

**వస్తువుల మరియు ప్రయాణీకులపై పన్నులు :** ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశా నికి తరల్చే వస్తువులు మీద పన్నులు విధించబడతాయి. అలానే బస్‌లల్లో ప్రయాణించే ప్రయాణికులపై కూడా పన్నులు విధించబడతాయి.

**వినోద పన్ను : 1922లో** బెంగాల్‌లో ప్రప్రథమంగా వినోదపన్ను విధించబడింది. **1919, 1935** చట్టాలలో రాష్ట్రాలు వినోదపుపన్ను ద్వారా ఆదాయం పొందే అవకావం కల్పించబడింది. **1950లో** మనరాజ్యాంగం కూడా ఈ హక్కును రాష్ట్రాలకు ధృవపరిచింది. రేస్ కోర్సులు, థియేటర్లు, సినిమాహాల్స్, సర్కాస్ మొదలగు వాటిని సందర్శించేందులకు ప్రవేశ రుసుముతో కలిపి ఈ వినోదపు పన్ను వసూలు చేయబడుతుంది.

**విద్యుత్ సుంకం :** ప్రజలు విద్యుత్ వినియోగంపై చెల్లించే ధరపై కూడా ఈ సుంకాలు విధించబడతాయి.

2. పన్నులేతర రాబడి :

రాష్ట్రాలు పన్నుల ద్వారానే కాక ఈ క్రింది మార్గాల ద్వారా కూడా పొందవచ్చును.

**వడ్డీ చెల్లింపులు :** వాణిజ్య సంస్థలకు, జీవిత భీమా, రైల్వేలే, తంతి, తపాల మొదలగు సంస్థల కిచ్చిన రుణాలవలన పైవడ్డీవలన కూడా రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయం పొందవచ్చును.

**డివిడెండ్లు/లాభాలు :** ప్రభుత్వ రంగసంస్థలపై చేసిన పెట్టుబడువలన రాష్ట్రాలకు రాబడి మరియు లాభాలు కూడా రావచ్చును.

**సాధారణ సేవలు :** పోలిస్, జైళ్ళు, కోర్టులు, స్టేషనరీ, ప్రింటింగ్ ప్రెస్ మొదలగు పరిపాలన సేవల వలను కూడా రాష్ట్ర ప్రభుత్వాలకు రాబడి వస్తుంది.

**సాంఘిక మరియు కమ్యూనిటీ సేవలు :** ప్రజలకు అనేక సాంఘిక మరియు కమ్యూనిటీసేవలు అందిస్తాయి. తద్వారా కొంత ఆదాయాన్ని కూడా పొందుతున్నాయి. ఉదా:- విద్య, వైద్యం, కళలు, సంస్కృతి, కుటుంబ సంక్షేమం, గృహాలు, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం మరియు నీటిసప్లయి మొదలగు సేవలందించి రాష్ట్రాలు కొంత ఆదాయాన్ని కూడా పొందలగుతున్నాయి.

**ఆర్థిక సేవలు :**

- వ్యవసాయం అనుబంధసేవలు
- రవాణా
- పరిశ్రమ
- నీటిపారుదల మొదలగు సేవలందించి తద్వారా రాష్ట్రాలు ఆదాయం సంపాదిస్తున్నాయి.

**II. కేంద్రప్రభుత్వం నుండి రాష్ట్రాలు పొందే ఆర్థిక వనరులు :**

ఎ. కేంద్ర పన్నుల రాబడిలో వాటా

బి. నిధులు లేక గ్రాంట్లు

సి. అప్పులు

**ఎ. కేంద్రపన్నుల రాబడిలో వాటా** కేంద్ర ప్రభుత్వం కొన్ని రకాల పన్నులు, సుంకాలు విధించి వచ్చిన పన్నుల రాబడిలో రాష్ట్రాలకు వాటా ఇస్తుంది. ఉదా: వ్యక్తిగత ఆదాయపన్ను విధించి పన్ను రాబడిలో రాష్ట్ర ప్రభుత్వాలకు వాటా ఇస్తుంది. అలానే ఎక్సైజ్ సుంకాల ద్వారా వచ్చిన రాబడిలో కూడా రాష్ట్ర ప్రభుత్వాలకు వాటా ఇస్తుంది. ఆయాపన్నులరాబడిలో వచ్చే వాటాను నిర్ణయించేందులకు 10వ ఫైనాన్సు కమీషన్ కేంద్రానికి వసూలైన అన్ని రకాల పన్నుల రాబడిని కలిపి రాష్ట్రాలకు వాటా నిర్ణయించాలి. రాష్ట్రాలకు వాటా ఇచ్చేటప్పుడు జనాభా, తలసరి ఆదాయ అంతరం (అత్యున్నత తలసరి ఆదాయంగల రాష్ట్రంతో) భూభాగం, అవస్థానా సదుపాయాల సూచిక, పన్నుల కృషి కోశక్రమ శిక్షణ మొదలగు ప్రాతిపదికల మీద ఇవ్వబడుతుంది. అయితే కార్పొరేషన్ టాక్సు, కస్టమ్స్ సుంకాల ద్వారా వచ్చే రాబడిలో మాత్రం రాష్ట్రాలకు వాటా ఇవ్వట్లేదు.

**బి. నిదులు లేక గ్రాంట్లు :**

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు రెండు రకాల నిధులిస్తుంది.

1. ఫైనాన్సు కమిషన్ సిపార్సులననుసరించి ఇచ్చే స్టాట్యూటరీ నిధులు.

2. ప్లానింగ్ కమిషన్ సిపార్సులననుసరించి ఇచ్చే నాన్‌స్టాట్యూటరీ నిధులు. రాష్ట్రాల అభివృద్ధి నిమిత్తం కేంద్రం నిధులిస్తుంది. రాష్ట్రాల ఆదాయ, వ్యయాల మధ్యవ్యత్యాసం తొలగించేందులకు సాధారణంగా ఇవ్వబడుతాయి. ఈ నిధులు కేంద్రానికి తిరిగి చెల్లించినవసరం లేదు. కాబట్టి రాష్ట్రాలు తమ ఆర్థిక వనరుల కొరతను కూడా నివారించుకోవచ్చును. రాష్ట్రాలలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు వచ్చే అదనను ఖర్చులను తట్టుకునేందులకు కూడా కేంద్రం రాష్ట్రాలకు నిధులిస్తుంది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ, వనరుల మధ్య తేడాను తొలగించేదులకు, ప్రాంతీయ అసమానతలను తొలగించేందుకు ఈ గ్రాంట్లు లేక నిధులు బాగా ఉపకరిస్తున్నాయి.

## 14.7భారతదేశంలో రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయవనరులు

రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ వనరులు రెవిన్యూ ఎకౌంట్ రాబడిని ఈ క్రింద పట్టికలో సూచించినాము

| రెవిన్యూ ఎకౌంట్‌లో రాష్ట్ర ప్రభుత్వాల రాబడి (కోట్లరూ.లలో) | | | |
|---|---|---|---|
| | 1951-52 | 2000-01 | 2002-03 |
| 1. పన్నులరాబడి | 280 | 168,710 | 215,050 |
| 2. పన్నులేతర రాబడి | 130 | 69,240 | 91,890 |
| ఎ. కేంద్రం నుండి నిధులు | 30 | 37,780 | 54,100 |
| బి. రాష్ట్రాల పన్నులేతర రాబడి | 90 | 31,460 | 37,790 |
| మొత్తం రాబడి | 400 | 237,950 | 306,940 |

బడ్జెట్ అంచనాలు

పై పట్టికలో రాష్ట్రాల పన్నుల రాబడి కేంద్ర పన్నుల రాబడితో కలిపి 1951-52లో కేవలం రు. 280 కోట్లు మాత్రమే ఉన్న 2002-'03 రు. 25,050 కోట్ల మేరకు గణనీయంగా పెరిగింది. అయినప్పటికీ కేంద్రం కార్పొరేషన్ పన్ను, కస్టమ్స్ సుంకాల ద్వారా వచ్చే పన్నులలో వాటా రాష్ట్రాలకిస్తే రాష్ట్రాలకు ఇంకా ఎక్కువ ఆదాయం వస్తుంది.

కేంద్రం నుండి గ్రాంట్ల రూపంలో కూడా రాష్ట్రాలకు రు. 30 కోట్లనుండి రు. 54,100 కోట్లకు పెరిగింది. అదేకాలంలో రాష్ట్రాలకు పన్నులేతర సొంతమార్గాల ద్వారా రు. 90కోట్ల నుండి రు. 37,390 కోట్ల మేరకు ఆదాయం పొందగల్గింది.

మొత్తం రాష్ట్రాల రెవిన్యూ రాబడి 1951-52లో రు. 400 కోట్లు మాత్రమే వున్నా 1980-81 నాటికి రు. 16,290 కోట్లకు పెరిగింది. 2000-01 నాటికి రు. 237,150 కోట్లకు, 2002-03 నాటికి రు. 306,940 కోట్ల రుపాయాలకు గణనీయంగా పెరిగింది.

1999-2000 సంవత్సరం వరకు ఆదాయపన్ను, ఎక్సైజ్ సుంకాల ద్వారా వచ్చే రాబడిని కేంద్రం పొంది రాష్ట్రాలకు వాటా ఇచ్చింది. అయితే ఈ పద్ధతికి స్వస్తిపలకి 2000-01 నుండి కేంద్రానికి వచ్చిన రాబడిలో 29.5శాతం రాష్ట్రాలకు ఇవ్వబడుతంది. దీని ప్రకారం 200-01వ సంవత్సరంలో రు. 50,370కోట్లు, 2002-03లో రు. 62,460 కోట్లు మేరకు కేంద్రపన్నుల రాబడినుండి రాష్ట్రాలకు వాటా లభిస్తుంది.

**రాష్ట్ర ప్రభుత్వ ఆదాయవనరుల పోకడలు :**

ఈ విషయానికి సంబంధించిన ముఖ్యాంశాలను ఈ క్రింది విధంగా సమీక్షించవచ్చును.

1. రాష్ట్ర ప్రభుత్వాల రాబడి క్రమేపీ పెరుగుతున్నది. అయితే పెరుగుతున్న జనాభా, ఆర్థిక వనరుల కొరత రాష్ట్రాలను వేధించే సమస్యలుగా తయారయినాయి. 1952-2003 ల మధ్యకాలంలో రాష్ట్రాల పన్నుల రాబడి రు.280 కోట్ల నుండి రు. 215,050 కోట్లకు పెరిగినది.

2. కేంద్రం నుండి వచ్చే పన్నుల రాబడిలో రాష్ట్రాల వాటా 29% కు పెంచబడింది. అయితే ఈ విషయం పట్ల రాష్ట్రాలు అసంతృప్తితోవున్నాయి. రాష్ట్రాలలో 1951లో ప్రత్యక్షపన్నుల ద్వారా 38% మాత్రమే రాబడిని పొందాయి. అయితే 2002-03 నాటికి ఈ వాటా 12% తగ్గిపోయింది. అయితే వస్తువుల మీద విధించే పరోక్షపన్నుల ద్వారా 1951లో 62% మాత్రమే పొందినా, 2002-03 నాటికి 88% మేరకు పొందగల్గినది. కాబట్టి ఆదాయం, సంపదల మీద విధించే ప్రత్యక్ష పన్నుల కన్నా వస్తు, సేవలపై విధించిన పరోక్ష పన్నుల వలన రాష్ట్రాలు అధిక రాబడిని పొందినట్లు తెలియుచున్నది.

3. రాష్ట్రాలు సాధారణ ప్రజానీకం నుండి ఇంకా తనకు కావలసిన వనరులను సమకూర్చుకుంటాయి.

4. ప్రత్యక్షపన్నులను పెంచితే ప్రజలు వ్యతిరేకించవచ్చు, లేదా పన్ను ఎగవేతకు ప్రయత్నించవచ్చు.

5. రాష్ట్రాల పన్నుల రేట్లు పెంచేకొలదీ వచ్చే ఆదాయం తక్కువ. కాబట్టి రాష్ట్రాల పన్నుల విధానాన్ని తిరోగామి పన్నుల విధానం అని చెప్పవచ్చును.

6. సేల్స్‌టుక్సు ద్వారా రాష్ట్రాలకు అత్యధిక ఆదాయం వస్తున్నది.

7. రాష్ట్రాలకు పన్నులేతర రాబడి కూడా గణనీయంగా పెరుగుతున్నది. 1951లో కేవలం రు.120 కోట్లు మాత్రమే వున్నప్పటికీ 2003లో రు.91,800 కోట్ల మేరకు పెరిగింద. రాష్ట్రాల సొంత పన్నులేతర రాబడి ఇదే కాలంలో రు.90కోట్ల నుండి రు.37,790 కోట్లకు పెరిగింది.

   కేంద్రం నుండి గ్రాంట్లు ఇదే కాలంలో రు.30 కోట్ల నుండి రు.54,100 కోట్లమేరకు పెరిగాయి.

## 14.8 రాష్ట్రాల ప్రభవుత్వాల వ్యయం :

రాష్ట్ర ప్రభుత్వాల వ్యయాన్ని ఈ క్రింది రెండు విధాలుగా విభజించవచ్చును.

1. అభివృద్ధి వ్యయము
2. అభివృద్ధేతరవ్యయం

### 1. అభివృద్ధి వ్యయం :

సాంఘిక, ఆర్థికాభివృద్ధికోసం రాష్ట్రాలు పెట్టే వ్యయం రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుంది. విద్య, వైద్యం, ప్రజారోగ్యం, వ్యవసాయం, పశుగణాభివృద్ధి మరియు సహకారం, నీటిపారుదల, విద్యుత్ పథకాలు, గ్రామీణ మరియు సామాజిక అభివృద్ధి, ప్రజాహిత పనులు, పరిశ్రమలు, సప్లయి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ఈ అభివృద్ధి వ్యయంతోనే చేపట్టటం జరుగుతుంది.

### 2. అభివృద్ధేతర వ్యయం :

పైన పేర్కొన్న అంశాలు కాక మిగిలిన అన్నింటమీదే చేసే వ్యయం అభివృద్ధేతర వ్యయంగా పేర్కొనవచ్చును. అభివృద్ధేతర వ్యయంలో ముఖ్యంగా పన్నులు, సుంకావసూలు, పౌరపరిపాలన, ఋణాల చెల్లింపు, వడ్డీల చెల్లింపు, కరువు నివారణ మరియు ఇతర అభివృద్ధేతర వ్యయాలు ఈ కోవకు చెందుతాయి.

**రాష్ట్ర ప్రభుత్వ వ్యయం - ముఖ్య అంశాలు**

ఎ. వ్యవసాయాభివృద్ధి : రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయాభివృద్ధి ముఖ్యవిధిగా చేపట్టాల. కాబట్టి రాష్ట్రాలు వ్యవసాయం విద్య, మొక్కలపెంపకం, నీటిపారుదల, డాముల నిర్మాణం, వ్యవసాయం ప్రయోగశాలలు, వ్యవసాయ పరిశోధన, యంత్రీకరణ మొదలగు అంశాలపై ముఖ్యంగా వ్యయం చేయాల్సి వుంటుంది.

బి. పశుగణాభివృద్ధి : పశుగణాభివృద్ధి పరిస్థితులు మెరుగుపరిచేందులకు, పశువుల ఆసుపత్రుల నిర్మాణం, నిర్వహణ మొదలగు కార్యక్రమాలపై వ్యయంచేయాలి.

**ఇ. నీటిపారుదల పనులు, విద్యుశ్చక్తి పథకాలు :** వ్యవసాయభివృద్ధికి అత్యంత కీలకమైన కార్యక్రమాలు రాష్ట్రాలు చేపట్టాలి. కాలువలు, చెరువుల, బావులు తవ్వటం, రిపేర్లు చేయటం మొదలగు కార్యక్రమాల పట్ల రాష్ట్రాలు శ్రద్ధవహించాలి.

**డి. గ్రామీణ మరియు కమ్యూనిటీ అభివృద్ధి పథకాలు :** రాష్ట్రాలు గ్రామీణాభివృద్ధికి కావలసిన విద్య, వైద్యం, పారిశుద్ధ్యం మొదలగు సదుపాయాలపై వ్యయం చేయాలి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికై కూడా రాష్ట్రాలు వ్యయం చేయాలి.

**ఇ. విద్య:** ప్రాథమిక, సెకండరీ, ఉన్నత, వృత్తి విద్యలనభివృద్ధి చెందించి తద్వారా రాష్ట్రాల అభివృద్ధికి వ్యయం చేస్తూ రాష్ట్రాలు నిరంతరం కృషిచేయాలి. రాష్ట్రాల అక్షరాస్యత కోసం ప్రైవేటు విద్యాలయాలకు గ్రాంట్లు కూడా రాష్ట్రాలు ఆదుకుంటున్నాయి.

**ఎఫ్. వైద్య-ప్రాథమిక ఆరోగ్యం :** వ్యాధుల వలన అనేకమంది శిశువులు, యువకులు, వృద్ధులు కూడా మరణిస్తున్నారు. కాబట్టి వైద్యసదుపాయాలు పెంచి, అంటువ్యాధులు వ్యాపించకుండా వ్యాధి నిరోధక మందులు, ఇంజక్షన్లు ఇచ్చి తద్వారా రాష్ట్రప్రజల ఆరోగ్యపరిస్థితులను మెరుగుపరచే పనులు ఎంతవ్యయంతో కూడినా రాష్ట్రాలే చేపట్టవలసి వుంటుంది.

**ప్రజాహిత పనులు** నిర్మాణం, నిర్వహణ, రిపేర్లు, రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణంపై రాష్ట్రాలు వ్యయం చేయు ప్రణాళికా కాలంలో రాష్ట్రాలు ఈ అంశాలపై చేసే ప్రభుత్వవ్యయం గణనీయంగా పెరుగుతున్నది.

**II. అభివృద్ధేతరవ్యయం :**

**ఎ. పౌరపాలన :** స్వాతంత్ర్యానంతరం అనేక క్రొత్త డిపార్టుమెంట్లు ప్రారంభించబడినాయి. రాష్ట్రాలలో శాంతిభద్రతలు కాపాడటం, పోలీసులు కోర్టు సమర్ధవంతంగా పనిచేయించి ప్రజలకు ప్రభుత్వం మీద నమ్మకం కలిగించేందులకు రాష్ట్రాలు భారీగా వ్యయం చేయాలి.

**బి. పన్నుల వసూలు :** పన్నుల వసూళ్ళకు అనేక డిపార్టుమెంట్లు ఏర్పాటుచేయబడినాయి. అనేకమంది ఉద్యోగులు కూడా నియమించబడతారు. వారందరికి జీతభత్యాలు, పెన్షన్లు, ఇతర అలవెన్సులు కూడా చెల్లించే నిమిత్తం రాష్ట్రాలు పెద్దమొత్తంలో వ్యయం చేయాల్సివుంటుంది.

**సి. అప్పులపై వడ్డీ :** రాష్ట్ర ప్రభుత్వాల తమ అపరిమిత బాధ్యతలను పరిమితవనరులతో తీర్చలేక కేంద్రప్రభుత్వం నుండి, అంతర్జాతీయ బ్యాంకులు అప్పులు తీసుకుంటున్నాయి. ఆ అప్పులపై వడ్డీలు చెల్లించటం కూడా రాష్ట్రాల మీద వ్యయభారం మోపుతుంది.

**ఇతర వ్యయాలు :** రాష్ట్ర ప్రభుత్వాలు ప్రింటింగ్, స్టేషనరీ, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్లు, స్థానిక సంస్థలకు మున్సిపాలిటీలు, జిల్లాబోర్డులు, జిల్లాపరిషిత్‌లు, కార్పొరేషన్లు మొదలగు వాటికై పెద్దమొత్తంలో వ్యయం చూయవలసి వుంటుంది.

## 14.9 భారతదేశంలోరాష్ట్ర ప్రభుత్వాల రెవిన్యూ వ్యయం

**1951-52లో** రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి వ్యయం **50%** అభివృద్ధేతర వ్యయం కూడా **50%** మేరకు వున్నాయి. అయితే **2003-04లో** అభివృద్ధి వ్యయం **54%** కు పెరిగి, అభివృద్ధేతర వ్యయం **46%** కు తగ్గినది.

| రాష్ట్ర ప్రభుత్వాల రెవిన్యూ వ్యయం | | | |
|---|---|---|---|
| | **1951-52** | **1980-81** | **2002-03** |
| అభివృద్ధివ్యయం | 196 | 10,510 | 1,91,070 |
| అభివృద్ధితేర వ్యయం | 196 | 4,090 | 1,57,500 |
| ఇతరాలు | - | 200 | 6,600 |
| మొత్తం వ్యయం | 392 | 14,800 | 3,55,170 |

అభివృద్ధి వ్యయం క్రమేపీ పెరుగుతున్నది. అభివృద్ధేతర వ్యయం కూడా పెరిగినప్పటికీ తక్కువ పెరుగుదలనే సూచించుచున్నది. రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం వ్యయం **1951-52లో** కేవలం రు.**392** కోట్లు మాత్రమే వున్నప్పటికీ, **1980-81** నాటికి రు.**14,800** కోట్లకు పెరిగింది. **2002-03** నాటికి రు.**3,55,170** కోట్లకు గణనీయంగా పెరిగింది.

**రాష్ట్రప్రభుత్వ ఆదాయ వ్యయపోకడలు :** 1950-51 నుండి రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ, వ్యయాలు రెండూ పెరిగిపోతున్నాయి. అయినపపటికీ రాష్ట్రప్రభుత్వాలు పెరుగుతున్న వ్యయాన్ని తట్టుకునేందులకు కేంద్రంపై అతిగా ఆధారపడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు పరిమిత ఆర్థిక వనరులతో అపరిమిత బాధ్యతలు చేపట్టలేక కేంద్రం నుండి నిధులు లేక అప్పులుకోసం ఎదురుచూడవలసివస్తున్నది. రాష్ట్రాలు, పెరుగుతున్న బడ్జెట్‌లోటు, పెరుగుతున్న అప్పులు, పెరుగుతున్న పరిపాలనా వ్యయం, పన్నుల రాబడిలో లోపాలు, నత్తనడకతో నడుస్తున్నా ప్రభుత్వరంగ సంస్థల మొదలగు లోపాలతో సతమతమవుతున్నాయి.

కాబట్టి రాష్ట్రాలు దుబారా నరికడుతూ, ఆదాయాలను పెంచుకొని తద్వారా ఆదాయవ్యయాల మధ్య సమన్వయానికి కృషిచేయాల్సి వుంటుంది. అంతర్జాతీయ అప్పుల జోలికి వీలయినంతవరకు వెళ్ళకుండా ఆర్థిక క్రమశిక్షణ కూడా అవలంబించాల్సి వుంటుంది.

## 14.10 సారాంశం :

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలంటే ఆర్థిక వనరులు సరిపడినంతగా వుండాలి. కానీ ఆర్థిక వనరుల కొరతవలన కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అప్పుల కోసం అర్రులు చాచాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. బడ్జెట్‌లోటు కూడా రెండు ప్రభుత్వాలను వేధించే సమస్యగా పేర్కోనవచ్చును. అయితే రాజ్యాంగపరంగా కేంద్రప్రభుత్వానికి అధిక ఆర్థిక వనరులున్నందువలన రాష్ట్రప్రభుత్వాలకు కేంద్రపన్నుల రాబడిలో వాటా, నిధులు అప్పులు కూడా ఇచ్చి ఆదుకోవాలి కేంద్రప్రభుత్వం ఆర్థికద్రవ్యాన్ని సృష్టించి తన అవసరాలు తీర్చుకుంటున్నది. అప్పులు భారం కూడా పెరిగిపోతున్నది. అలానే రాష్ట్రాలు సైతం అనేక పథకాలను ఒకేసారి చేపట్టి ఆర్థికవనరులు సరిపోక కేంద్రం నుండి, అంతర్జాతీయ బాంకులనుండి అప్పులు తీసుకుంటున్నాయి. 1991లో ప్రారంభించిన నూతన ఆర్థిక విధానం కొన్ని విప్లవాత్మక మార్పులను కూడా సూచించింది. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు వ్యయాన్ని తగ్గించుకునేందులకు సబ్సిడీల కోత, ప్రైవేటీకరణ, ప్రభుత్వరంగసంస్థల అమ్మకం, విదేశీపెట్టుబడులకు ఆహ్వానం మొదలగు చర్యలు ద్వారా ఆర్థిక ఇబ్బందులనధిగమించవచ్చని సరళీకృత ఆర్థిక విధానాలు చెబుతున్నాయి. అన్నింటికంటే ఆర్థిక క్రమశిక్షణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ తప్ప పాటించాల్సిన అవసరం వున్నది.

## 14.11 ముఖ్యపదాలు :

| | | |
|---|---|---|
| ఫోర్‌పెట్యూర్స్ | - | బెయిల్‌మీద విడుదలైనవ్యక్తులు కోర్టుకు హాజరు కాని పక్షంలో ఆస్తి జప్తు చేసుకొనబడుతుంది. |
| ఎస్టేట్స్ | - | విల్లు వ్రాయకుండా, వారసులు లేకుండా మరణించినవారి అస్తిని ప్రభుత్వం జప్తు చేసుకుంటుంది. |
| లోటు ద్రవ్య విధానం | - | రిజర్వుబాంకు ద్వారా క్రొత్తగా ద్రవ్యాన్ని సృష్టించటం |
| ఆర్థిక క్రమశిక్షణ | - | ఆదాయ, వ్యయాలను హేతుబద్ధంగా చేరీజా వేసుకొవటం. |

## 14.12 స్వయం సమీక్ష ప్రశ్నలు

1. కేంద్రప్రభుత్వ ఆదాయవనరులను సవివిరంగా వివరించి, మనదేశంలో ఆదాయ వనరుల పోకడలను విశదీకరింపుము
2. కేంద్రప్రభుత్వ వ్యయం పెరగటానికి కారణాలను వివరించి మనదేశంలో కేంద్రప్రభుత్వవ్యయ విభజనను వివరింపుము.
3. రాష్ట్రప్రభుత్వాల ఆదాయ మార్గాలను విమర్శనాత్మకంగా విశదీకరింపుము.
4. రాష్ట్రప్రభుత్వాల వ్యయపోకడలను తెలయచేస్తూ భారతదేశంలో ప్రత్యేకించి తీరుటెన్నులను విశదీకరింపుము.

### అభ్యాసాలు :

1) పన్నుల లక్షణాలు
2) ప్రత్యక్ష, పరోక్షపన్నులు
3) కానుకలు, గ్రాంట్లు

4) కేంద్రప్రభుత్వ పన్నులేతర రాబడి
5) ఫంక్షనల్ విత్తం
6) రెవిన్యూ వ్యయ & మూలధనవ్యయం
7) ప్రణాళికా వ్యయం & ప్రణాళికేతర వ్యయం
8) వ్యవసాయదాయపన్ను
9) స్టాంపుడ్యూటీ
10) అభివృద్ధి వ్యయం & అభివృద్ధితేర వ్యయం.

## 14.13 చదవవలసిన పుస్తకాలు


1. Dalton.H. Public Finance
2. Taylor.P.E. Economics of Public Finance
3. Musgrave R.A The Theory of Public Finance
4. R.B.I. Annual Report, Various issues
5. R.B.I. Report on Currency & Finance Various issuues
6. Economic Seruey, Government of India Various issues


డా॥ ఎల్. క్రిష్ణవేణి

### పాఠం - 15

# స్థానిక విత్తం

## పాఠ్య నిర్మాణ క్రమం

15.0 ఉద్దేశాలు
15.1 ఉపోద్ఘాతం
15.2 పంచాయితీ రాజ్
15.3 గ్రామపంచాయితీలు
15.4 జిల్లా మరియు స్థానిక బోర్డులు
15.5 స్థానిక సంస్థలు
15.6 మున్సిపాలిటీలు
15.7 మున్సిపల్ కార్పొరేషన్లు
15.8 స్థానిక ప్రభుత్వాల ఆదాయ-వ్యయ పరిస్థితులు సమస్యలు
15.9 స్థానిక సంస్థలు అభివృద్ధిలో కీలకపాత్ర
15.10 స్థానిక సంస్థలు వనరులు పెంచుకోవటానికి కావల్సిన చర్యలు
15.11 సారాంశం
15.12 ముఖ్యపదాలు
15.13 స్వయం సమీక్ష ప్రశ్నలు
15.14 చదవవలసిన పుస్తకాలు

## 15.0 ఈ పాఠ్యభాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది అంశాలను తెలుసుకోగలరు

1. స్థానిక సంస్థలలో పంచాయితీరాజ్, గ్రామపంచాయితీలు, జిల్లా మరియు స్థానిక బోర్డులు, స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు మొదలగు వాటి విధులు, ఆదాయవనరులు చర్చింగలగాలి.
2. స్థానిక ప్రభుత్వాల ఆదాయవ్యయపరిస్థితులు, వాటి సమస్యలు, అభివృద్ధిలో స్థానిక సమస్యలు నిర్వహించే పాత్రను విశదీకరింపగలగాలి. స్థానిక ప్రభుత్వాల ఆదాయవనరులు పెంచుకోవటానికి తీసుకోవలసిన చర్యలను సూచించపగలగాలి.

## 15.1 ఉపోద్ఘాతం :

స్థానిక ప్రభుత్వాల ఆదాయవనరులు, విధులు - వాటికి సంబంధించిన సమస్యల గురించి ప్రభుత్వ విత్తశాస్త్రంలో వివరంగా చర్చించుకోవల్సిన అవసరం చాలా వున్నది. స్థానిక ప్రభుత్వాలు అనగా పంచాయితీ రాజ్‌లు, గ్రామపంచాయితీలు, జిల్లాలేక స్థానిక బోర్డులు, స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు మొదలగునవి. వీటన్నింటి విధులు, విత్తవనరుల గురించి వివరంగా ఈ పాఠ్యాంశంలో వివరింపబడినాయి.

మనదేశంలో ఫెడరల్ (సమాఖ్య) వ్యవస్థ అమలులో వున్నది. అత్యున్నత స్థానంగా కేంద్రప్రభుత్వం, ద్వితీయ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వాలు/కేంద్రపాలిత ప్రాంతాలు మూడవస్థానంలో స్థానిక ప్రభుత్వాలు వున్నాయి. కాబట్టి జాతీయ పరిపాలనా యంత్రాంగంలో స్థానిక ప్రభుత్వ సంస్థలు ముఖ్యమైన అంతర్భాగాలని చెప్పవచ్చును. ఆర్.యన్. భార్గవ చెప్పినట్లు 'స్థానిక సంస్థలు ప్రజాస్వామ్యంలో నాయకులకు మంచి శిక్షణా మైదానాలుగా వర్ణించవచ్చును. ప్రాథమిక విద్య, అంటువ్యాధుల నివారణ, నీటిసప్లయి, వీధిదీపాలు, పార్కులు,

స్థానిక రోడ్లు మొదలగు సామాజిక సేవలనందించటంలో స్థానిక ప్రభుత్వాలు కీలక పాత్రను నిర్వహించాల్సి వున్నదిన కూడా ఆర్.యన్. భార్గవ భావించాడు. ప్రభుత్వపరంగా స్థానిక సంస్థలు అతముఖ్యమైన అంతర్భాగాలని చెప్పవచ్చును. మనదేశంలో వివిధ రాష్ట్రాలలో స్థానిక సంస్థల తీరు ఒకేలా లేదు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోవిధమైన సంస్థలున్నాయి. ఈ స్థానిక ప్రభుత్వాలకు కొన్ని ఆదాయవనరులు కూడా వున్నాయి. ఈ వనరులతో స్థానిక ప్రభుత్వాలు ప్రజల అవసరాలను తీర్చేందులకు కృషిచేయాలి.

పన్నుల విచారణ కమీషన్ ప్రకారం పటిష్టమైన స్థానికవిత్తం సిద్ధాంతంపరంగా పటిష్టమైన స్థానిక పన్నుల విధానంపై పునాది వేయబడుతుంది. నేడు మన దేశంలో ఈ క్రింది స్థానిక ప్రభుత్వాలు తమ విధులను నిర్వర్తిస్తున్నాయి.

- పంచాయితీ రాజ్
- గ్రామపంచాయితీలు
- జిల్లా మరియు స్థానిక బోర్డులు
- స్థానిక సంస్థలు
- మున్సిపాలిటీలు
- మున్సిపల్ కార్పొరేషన్లు

## 15.2 పంచాయిత్ రాజ్

అన్ని రాష్ట్రాలలోను, కేంద్రపాలిత ప్రాంతాలలోను పంచాయితీరాజ్ సంస్థలు ఉన్నాయి. వాటికి కొన్ని బాధ్యతలు కూడా ఉన్నాయి. 1992 డిశంబర్ మన పార్లమెంటు 73వ రాజ్యాంగ సవరణ చేసి దేశమంతటా పంచాయితీ రాజ్ సంస్థలు ఒకే విధంగా ఉండాలని కూడా సూచించింది. దీని ప్రకారం నాగాలాండ్, మేఘాలయ, మిజోరామ్ మరియు కొన్ని ప్రత్యేక ప్రాంతాలలో తప్ప మిగిలిన అన్ని రాష్ట్రాలలో పంచాయితీ సంస్థలు మరింత బలోపేతం కావాలని, సాధికారత సాధించాలని కూడా 1992లో రాజ్యాంగా సవరణ చట్టం తెలియజేస్తున్నది. ఆయాప్రభుత్వాల పరిధిలో ఆర్థికాభివృద్ధి మరియు సామాజిక న్యాయాన్ని సాధించేందులకు తగిన పథకాలు తయారుచేసి అమలు చేసేందులకు తగిన అధికారాలు కూడా ఇవ్వబడినాయి. రాజ్యాంగంలో 11వ షెడ్యూల్ లో పొందుపరచిన అంశాలన్నీ పంచాయితీరాజ్ తన విధులుగా నిర్వర్తించాల్సి వుంటుంది.

73వ సవరణ చట్టం 24, ఏప్రిల్, 1993 నుండి అమలులోకి వచ్చింది. పంచాయితీరాజ్ సంస్థలకు రాజ్యాంగంలో ఉన్నతహోదా, అధికారాలు కల్పించబడినాయి. పంచాయితీరాజ్ సంస్థలు గ్రామీణాభివృద్ధికి జవహర్ రోజ్‌గార్ యోజన, ఇందిరా ఆవాస్‌యోజన, సమగ్ర గ్రామీణాభివృద్ధి మొదలగు పథకాలను అమలుచేయాల్సి వుంటుంది.

73వ రాజ్యాంగ సవరణ ప్రకారం గ్రామస్థాయిలో గ్రామసభలు అనే సంస్థలను ఏర్పాటు చేయాలి. జనాభాను భట్టి షెడ్యూలు కులాలు, తెగల వారికి పంచాయితి,జిల్లాస్థాయిలలో రిజర్వేషన్ కల్పించాలి. ఎన్నికైన ప్రతి సంస్థ అయిదు సంవత్సరాల పాటు అధికారంలో వుండాలి. పంచాయితీలు స్థానిక పన్నులను విధించి, వసూలు చేయవచ్చును. రాష్ట్రాల కన్సాలిడేటెడ్ నిధి నుండి పంచాయితేలకు గ్రాంట్లు కూడా మంజూరు చేయాలి. రాజ్యాంగంలో షెడ్యూలు 11 ప్రకారం, పంచాయితీలు ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం కోసం కొన్ని ప్రణాళికలు, పథకాలు 29 అంశాలలో తయారుచేసుకొని, అమలు చేయటానికి అవకాశం కల్పించబడింది. బీహర్, పాండిచెరి, గోవా, తప్ప మిగిలిన రాష్ట్రాలన్నీ తగినవిధంగా శాసనాలు చేసుకున్నాయి. దీని ఫలితంగా గ్రామస్థాయిలో 2,26,108 పంచాయితీరాజ్‌లు, ఇంటర్మీడియట్ స్థాయిలో 5,736 పంచాయితీరాజ్‌లు, జిల్లాస్థాయిలో 457 పంచాయితీరాజ్‌లు మనదేశంలో ఏర్పాటు చేయబడినాయి.

డిశంబర్ 23, 1997న పంచాయితీరాజ్‌లు షెడ్యూలు 5 ప్రాంతాలను కూడా ఏర్పాటు చేయబడినాయి. అనగా ఆంధ్రప్రదేశ్ బీహర్, హిమాచల్ ప్రదేశ్, మహరాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఒరిస్సా మరియు రాజస్థాన్‌లలో ఈ పంచాయితీ రాజ్‌లు ఏర్పాటు చేయబడినాయి.

అయితే అరుణాచల్ ప్రదేశ్‌లో మాత్రం రాష్ట్ర సామాజిక-రాజకీయ పరిస్థితులననుసరిచి కానీ, షెడ్యూల్ కులాలకు రిజర్వేసన్ కల్పించనవసరం లేదని సవరించిన ఆర్టికల్ 243- M చేబుతున్నది.

పంచాయితీలు / మున్సిపాలిటీలు మొదలగు స్థానిక సంస్థలకు రాష్ట్రాలకన్ సాలిడేటెడ్ నిధినుండి కొంత వనరులను ఇవ్వాలని కూడా ఫైనాన్సు పేర్కొన్నాయి. ఫైనాన్సుకమీషన్ ప్రతిపాదనలననుసరించి స్థానిక సంస్థలకు ఆర్థికవనరులు కొంతమేరకు పెంచబడినాయి.

10వ ఫైనాన్సు కమీషన్, 11వ ఫైనాన్సు కమీషన్ పంచాయితీరాజ్‌లకు ఆర్థికవనరులు సమకూర్చాలని పేర్కొన్నాయి.

పంచాయితీరాజ్ చేపట్టిన పథకాలలో ప్రయోజనం పొందే వారి పేర్లు అమలుచేసే సంస్థలు ప్రకటించాల్సి (బోర్డుపై) వున్నది శ్రామికులు, ఉద్యోగుల సంఖ్య, చేపట్టిన పనులు మొత్తం నిధులు, వినియోగించిన ఉత్పత్తి కారకాలు, పదార్థాలు, పని మొత్తానికి అయిన ఖర్చు పంచాయితీలలో వివరంగా బోర్డులపై వ్రాసి ప్రజలకు పూర్తి సమాచారం అందించాలి. గ్రామపంచాయితీల గణాంకాలు గ్రామసభ సభ్యులు ఆడిట్ చేయాల్సి వుంటుంది. పంచాయితీరాజ్‌లు తమపరిధిలో శిక్షణాకార్యక్రమాలు కూడా చేపట్టవలసి వుంటుంది.

**స్వాతంత్ర్యానంతరం పునరుద్ధరింపబడిన పంచాయితీరాజ్**

స్వాతంత్ర్యానంతరం, భారత ప్రభుత్వం గ్రామపంచాయితీ వ్యవస్థను పునరుద్ధరించింది. మన రాష్ట్రాలు గ్రామపంచాయితీలను ఏర్పాటుచేసి స్థానిక ప్రభుత్వాలుగా బలపడేందులకు కొన్ని విధులు, అధికారాలు కూడా ఇవ్వబడినాయి. అయితే నేడు స్థానిక స్వప్రభుత్వాలు ఏర్పాటు చేయటంలో దేశమంతటా ఒకే పద్ధతి లేదు. వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాల స్థానిక సంస్థలున్నాయి. అలాగే వాటి విధులు కూడా అన్ని రాష్ట్రాలలో ఒకేలాలేవు.

## 15.3 గ్రామపంచాయితీలు

గ్రామాభివృద్ధికి గ్రామపంచాయితీ రకరకాల విధులను నిర్వహించాల్సి వుంటుంది. ఒక రెవిన్యూ గ్రామం ఆధీనం క్రింద ఒక పంచాయితీ పని చేయాల్సి వుంటుంది. ఒక పంచాయితీ క్రింద రెండూ లేక ఎక్కువ గ్రామాల (చిన్న)ను ఒకటిగా కల్పవచ్చును.

**పంచాయితీల విధులు**

గ్రామ పంచాయితీల విధులను ఈ క్రింది రెండు విధాలుగా విభజించవచ్చును.

**1) తప్పని సరిగా చేయవలసి విధులు**

ఎ. నిర్మాణం
బి. మరమ్మత్తులు
సి. శుభ్రపరచటం
డి. రోడ్లు
ఇ. వైద్యసహాయం
ఎఫ్. పరిశుభ్రత
జి. అంటువ్యాధుల నివారణ
హెచ్. జనన, మరణ, వివాహాల రిజిష్ట్రేషన్
ఐ. గ్రామాల్లో బాలబాలికలను ప్రాధమిక విద్యాలయాలు నిర్మాణం
జె. బావుల నిర్మాణం
కె. త్రాగునీటినందించే చెరువులు
ఎల్. శుభ్రపరచుకోవటానికి, స్నానం చేయటానికి నీరందిచే చెరువులు
ఎమ్. ప్రసవాలు మరియు పిల్లల సంరక్షణ
ఎన్. బావులు, చెరువాల రిపేర్లు
ఓ. ఫ్లాట్ ఫారముల ఎత్తు పెంచటం
పి. వరద సమయంలో రక్షణ కల్పించే చర్యలు

**2) అవసరాన్ని బట్టి చేసే పనులు**

ఎ. రోడ్ల ప్రక్కన మొక్కలు నాటటం, సంరక్షించటం

బి. పశువులకు వైద్య సదుపాయం

సి. పశువుల వ్యాధి నివారణ

డి. లైబ్రరీ మరియు రీడింగ్ రూములను ఏర్పాటు చేయటం యాజమాన్య నిర్వహణ

ఇ. సమాజాభివృద్ధి

ఎఫ్. వివిధ వర్గాల మధ్య సామాజిక సంబంధాలు వృద్ధిచేయటం

**గ్రామపంచాయితీల ఆర్థిక వనరులు:**

గ్రామపంచాయితీల ఆర్థిక అవసరాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవసరాలంత తీవ్రంగా వుండవు. స్థానిక విధులను సక్రమంగా నిర్వర్తించాలంటే పంచాయితీలకు కూడా కొంత ఆర్థిక వనరులు అవసరం.

దాదాపు అన్ని రాష్ట్రాలలోను గ్రామపంచాయితీలకు పన్నులు విధించే అధికారాలివ్వబడినాయి. అయితే వివిధ రాష్ట్రాల మధ్య పంచాయితీల ఆర్థిక అధికారాలు వేరు వేరుగా ఉన్నాయి. అయితే పంచాయితీలు తమ అవసరాలకు సరిపడే ఆదాయాన్ని పెంచువునేందులకు, పన్నులు విధించేందులకు అధికారాలు సంపూర్ణంగా వున్నాయి. వ్యక్తుల, ఆస్తులు, వ్యాపారం, జంతువులు అన్నీ ఈ పన్నుల విధింపు పరిధిలోకి వస్తాయి. అయితే పన్నులు అధికారాలు ఎక్కువగా వున్నా వచ్చే ఆదాయం మాత్రం అవ్యాకోచంగానే వుంటుంది.

**పంచాయితీల ఆదాయ వనరులు**

ఎ. ఆస్థి తరలింపులపై సుంకాలు

బి. భూమి సిస్తు

సి. వృత్తి పన్ను

డి. జంతువుల మరియు వాహనాలపై పన్నులు

ఇ. ఫీజులు, జరిమానాలు

ఎఫ్. టోల్ టాక్సులు

జి. సంతలు, ప్రదర్శనశాలలా సందర్శనపై టికెట్లు

హెచ్. చారిత్రాత్మక ప్రదేశాల సందర్శనపై టికెట్లు

ఐ. మతప్రధానమైన ప్రదేశాల సందర్శపై టికెట్లు

జె. సేవల పన్ను

కె. ఆక్ట్రాయ్ పన్ను

ఎల్. థియేటర్ పన్ను

ఎమ్. యాత్ర పన్ను

ఎన్. షాపులపై పన్నులు

ఓ. విశ్రాంతి గృహలిచ్చినందుకు ఫీజులు

పి. డ్రైనేజి ఫీజు

క్యూ. వీధి దీపాల ఫీజు

ఆర్. నీటి పన్ను మొదలగునవి.

కొన్ని ప్రాంతాలలో ఇంకా ఇతర పన్నులు, ఫీజులు కూడా వుండ వచ్చును. గాంధీజీ కలలుగన్నట్లు గ్రామాలను అభివృద్ధికి ప్రతీకలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనావున్నది.

## 15.4 జిల్లా పరిషత్ లేక జిల్లా బోర్డులు

గ్రామీణ ప్రాంతాల్లో జిల్లాబోర్డులు లేక జిల్లా పరిషత్‌లు జిల్లాస్థాయిలో ఏర్పాటు చేయబడతాయి. జిల్లా బోర్డుల ఆధీనంలో కొద్ది గ్రామాలు కలిసి ఒక రెవిన్యూ జిల్లాగా ఏర్పడుతుంది. కొన్ని బోర్డుల విధిలు రాష్ట్రంచే చేపట్టబడతాయి. ఆంధ్ర ప్రదేశ్, బీహార్, మహా రాష్ట్ర, ఒరిస్సా, పంజాబు, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు మరియు కర్నాటక మొదలగు రాష్ట్రాలలో జిల్లా అభివృద్ధి కౌన్సిళ్ళు కూడా జిల్లా పరిషత్‌లలోనే వున్నాయి.

**జిల్లా పరిషత్ బోర్డుల విధులు** వివిధ రాష్ట్రాలలో జిల్లాపరిషత్‌లు లేక జిల్లాబోర్డుల విధులు వేరు వేరుగా వుంటాయి. జిల్లా బోర్డులు పరిషత్‌లు ముఖ్యంగా ఈ క్రింది విధులు నిర్వర్తించాల్సి వుంటుంది.

ఎ. గ్రామ పంచాయితీల విధులపై పర్యవేక్షణ

బి. సెకండరీ, వృత్తి మరియు పారిశ్రామిక విద్యలందిచే స్కూళ్ళు.

సి. అభివృద్ధి పథకాలు అమలుపై ప్రభుత్వానికి సలహాలివ్వటం

డి. పబ్లిక్ రోడ్ల నిర్మాణం, బ్రిడ్జిలనిర్మాణం, మానవులకు మరియు పశువులకు ఆసుపత్రుల నిర్వహణ

ఇ. నీటి సప్లయి చేయటం

ఎఫ్. అస్సాం, బీహార్, ఒరిస్సా మొదలగు రాష్ట్రాలలో పంచాయితీ సమితి బడ్జెట్‌లను అనుమతించటం

జి. జిల్లా ప్రణాళికలను తయారు చేయటం క్షేత్ర సమితి, లేక బ్లాక్ సమితి ప్రణాళికలను సమీక్షించటం మరియు సమన్వయం చేయటం.

**జిల్లా పరిషత్ బోర్డుల ఆదాయవనరులు :**

జిల్లా బోర్డులు లేదా జిల్లా పరిషత్‌లకు పన్నులు విధించే అధికారాలు చాలా పరిమితగానే వున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంటు(నిధుల) నుండే ఎక్కువ భాగం జిల్లాషత్‌లు ఆదాయాన్ని పొందుతాయి.

జిల్లా పరిషత్ లకు ఈ క్రింది మార్గాల ద్వారా ఆదాయాన్ని పొందుతాయి.

ఎ. రాష్ట్ర ప్రభుత్వాల నుండి గ్రాంటులు

బి. భూమిశిస్తు

సి. వృత్తిపన్ను

డి. ఆస్తుల మార్పిడిపై సుంకాలు

ఇ. పరికరాలు మరియు ఫీజులు

ఎఫ్. ఆస్తులపై పన్నులు మరియు మూలధన మార్పిడిలు

జి. సంతలు మరియు ప్రదర్శనశాలల నుండి ఆదాయం

## 15.5 స్థానిక సంస్థలు :

**పార్లమెంటు సభ్యులతో స్థానిక ప్రాంతీయాభివృద్ధి పథకం :** 23, డిసెంబర్, 1993న పార్లమెంటులో సభ్యులు స్థానిక ప్రాంతీయాభివృద్ధి పథకాలు చేపట్టాలని పార్లమెంటు సభ్యుడు జిల్లా ఆఫీసరుకు తన నియోజకవర్గంలో ఒక కోటి రూపాయాల పన్నులు చేపట్టేందులకు తగిన సలహా ఇచ్చి చేయించాలి, రాజ్యసభ సభ్యులు కూడా ఒకటి లేక రెండు జిల్లాలు (ఎక్కడైతే వారు గెలిచారో ఆ ప్రదేశం నుండి) వారి కిష్టమైన రాష్ట్రాలనుండి ఎన్నుకొని ఆయా ప్రాంతాల అభివృద్ధికి కృషిచేయాలి. జిల్లాలకు వసూలైన ఆదాయమొత్తంనుండి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబడతాయి. పథకాలు అమలు చేసే విభాగం, భారత ప్రభుత్వం కేంద్రస్థాయిలో ఆ పథక బాధ్యతను చేపడుతుంది. ప్రారంభంలో గ్రామీణాభివృద్ధి డిపార్టుమెంట్ ఈ పథకాలను అమలుజరిపేది. ఈ పథకం ముఖ్యలక్షణాలను క్రింది విధంగా పేర్కొనవచ్చును.

ఎ. స్థానిక అవసరాలను బట్టి కొన్ని శాశ్వత ఆస్తులను ఏర్పాటు చేసుకునే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను తయారుచేసుకోవాలి.

బి. సాధన, సామాగ్రిని కొనటం లేదా రెవిన్యూ వ్యయం ఈ పథకం క్రింద అనుమతించబడదు.

సి. ఒకటి లేక రెండు సమావేశాలలో చేపట్టిన ఈ పనుల నిర్వహణ పూర్తవ్వాలి.

డి. ఈ పథకాలకు విడుదల చేసిన నిధులు కాలాతీతమైనా మురిగిపోవు.

డిసెంబర్, 1993న గ్రామీణాభివృద్ధి మంత్రివర్గ విభాగం ప్రతి పార్లమెంటు సభ్యునికి రు.5 కోట్లును ఈ పథకం క్రింద 1993-94లో విడుదల చేసింది. ఈ నిధులు రాష్ట్రప్రభుత్వాలకు విడుదల చేయబడినాయి. అయితే పార్లమెంటుకు నామినేట్ చేయబడిన సభ్యులకు ఈ నిధులు 1993-94లో కేటాయించలేదు. 1994-95నుండి నామినేట్ చేయబడిన సభ్యులకుకూడా రు.1 కోటి వరకు (నేరుగా జిల్లాలకే విడుదల) ఇచ్చే అవకాశం కల్పించబడింది. అయితే ఈ యమ్.పి.స్థానిక ప్రాంతీయాభివృద్ధి పథకం క్రింద 1997-98 వరకు రు.2,835.30 కోట్లు విడుదల చేయగా, అందులో కేవలం 56.4% మాత్రమే వ్యయం చేయబడుతుంది.

ప్రాంతీయభివృద్ధికి ఈ పథకం ఎంతగానో తోడ్పడి మంచి ఫలితాలిచ్చింది. ఈ పథకం క్రింద అనేక కార్యక్రమాలు చేపట్టబడినాయి. స్కూల్ భవనాలు, ఆసుపత్రులు గ్రామాల్లో రోడ్లు, చిన్న బ్రిడ్జీలు, వృద్ధులు, అంగవైకల్యం గల వారికి కలిసి వుండేందులకు వసతి కల్పించటం, సాంస్కృతిక క్రీడా కార్యక్రమాలకు భవనాలు, పబ్లిక్ లైబ్రరీలు స్మశానవాటికలు, పబ్లిక్ టాయిలెట్లు, ట్యూబ్ వెల్స్‌ను తవ్వటం మొదలగు కార్యక్రమాలు చేపట్టి సమాజాభివృద్ధికి ఈ పథకం బాగా దోహదపడుతున్నది.

1993-2000 సంవత్సరాల మధయకాలంలో భారతప్రభుత్వం రు5,01,680 లక్షలను యమ్.పి.స్థానిక ప్రాంతీయాభివృద్ధి పథకం క్రింద విడుదల చేసింది. అందులో రు.4,47,636.2 లక్షల మొత్తం కేటాయింపబడింది. మొత్తం విడుదల చేసిన మొత్తంలో కేవలం 89.2% మాత్రమే కేటాయింపు చేయబడింది. అందులో వ్యయం చేయబడి మొత్తం కేవలం రు.3,22,121.1 లక్ష్యాల మేరకు మాత్రమే వున్నది. అనగా ప్రభుత్వం విడుదల చేసిన మొత్తంలో కేవలం 64.2% మాత్రమే వినియోగించబడిందని తెలియుచున్నది.

## 15.6 మున్సిపాలిటీలు :

పట్టణాలలో స్థానిక వ్యవహారాలు చూసేందులకు మున్సిపాలిటీలు వుంటాయి. మున్సిపాలిటీలు ఈ క్రింది విధులు నిర్వర్తిస్తాయి.

ఎ. పారిశుద్ధ్యం మరియు డ్రైనేజి వసతులను పట్టణాలలో విస్తృతంగా ఏర్పాటు చేయటం.

బి. రోడ్ల వీధి దీపాలు ఏర్పాటు చేయటం.

సి. ప్రజలకు నీటి సప్లయిని ఏర్పాటు చేయటం

డి. పార్కులు, ఉద్యానవనాలను నిర్వహించటం

ఇ. హాస్పిటళ్ళు. డిస్పెన్సరీలు, పశువుల ఆసుపత్రుల నిర్వహణ

ఎఫ్. ప్రాథమిక విద్యను ఏర్పాటు చేయటం

జి. సంతలు, ప్రదర్శన శాలలను నిర్వహించటం

**మున్సిపాలిటీల ఆదాయ వనరులు**

ఎ. ఆస్తులపై పన్నులు, భవనాలు మరియు భూముల రేట్లపై పన్నులు, భూములపై పన్నులు

బి. వ్యక్తిగత పన్నులు, వృత్తులపై పన్నులు, వ్యాపారాలు, ఉద్యోగాలు, ఉద్యోగాలకై పిలుపు

సి. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి యాత్రా నిమిత్తాం తరలివెళ్ళే ప్రయాణికులపై పన్నులు

డి. వాహనాలు మరియు జంతువులపై పన్నులు

ఇ. థియేటర్ లేదా ప్రదర్శన పన్ను

ఎఫ్. వస్తువులపై పన్నులు. ఆయాప్రాంత పరిధిలోనికి వచ్చే వస్తువులపై ఆక్ట్రాయ్ పన్ను

జి. నీటిపన్ను

పన్నుల విచారణ సంఘం వివిధ రాష్ట్రాలలో మున్సిపాటిటీల ఆదాయ మొత్తం మరియు వ్యయాలకు సంబంధించిన విశ్లేషణ చేయవలసియున్నది. మున్సిపాలిటీల తమ ప్రజలకు సేవలందించేందులకు కావలిసన వ్యయాన్ని తట్టుకునేందులకు అధికమొత్తంలో ఆదాయవనరులను పెంచుకోవలసి యున్నది. అందునిమిత్తం మున్సిపాలిటీలు నిరంతరం అన్వేషణ చేయాలి. ఆర్థిక వనరుల కొరత వలన మున్సిపాలిటీలు తమ పరిధిలో చేయువలసిన విధులు కూడా నిర్వర్తించలేకపోతున్నాయి. నీటి సప్లయి, పారిశుధ్యం మురిగినీటి పారుదల, ప్రజారోగ్యం, వైద్య సహాయం మరియు రోడ్లు మొదలగు సేవలను ప్రతి పట్టణంలోనూ బాగా విస్తరింపచేయాల్సిన అవసరం వున్నది. అయితే వనరుల కొరత వలన మున్సిపాలిటీలు తమ పరిధిలో తాము చేయవల్సిన సామాజిక విధులను కూడా నిర్వర్తించలేకపోతున్నాయి.

ఈ వనరుల కొరతను సమస్యను నివారించాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపాలిటీలకు పెద్ద మొత్తంలో నిధులు (గ్రాంట్లు) ఇచ్చి సహాయపడాల్సి వుంటుంది. తద్వారా మున్సిపాలిటీలు తమ లోటును పూరించుకొని ప్రజల అవసరాలను తీర్చేందులకు అన్ని విధాల సహాయపడగలవు. అంతేకాక రాష్ట్రాలు తమ సొంత పన్నుల రాబడిలో కూడా మున్సిపాలిటీలకు వాటా ఇస్తే మరింత నాయ్యబద్ధంగా వుంటుంది.

## 15.7 మున్సిపల్ కార్పొరేషన్లు :

మున్సిపల్ కార్పొరేషన్లు పెద్ద పెద్ద పట్టణాలకే పరిమితమైన మున్సిపల్ వ్యవస్థ అని చెప్పవచ్చును. మున్సిపాలిటీల లాగే మున్సిపల్ కార్పొరేషన్లు కూడా విస్తృత స్థాయిలో విధులు నిర్వర్తించాల్సి వుంటుది. మున్సిపల్ కార్పొరేషన్‌ల నిర్మాణం, వ్యవస్థ తీరు వెన్నులు దాదాపుగా రాష్ట్రాలలో మాదిరిగానే వుంటుంది. మున్సిపల్ కార్పొరేషన్‌లు మున్సిపాలిటీలతో పోలిస్తే ఎక్కువ స్వేచ్ఛననుభవిస్తూ, విస్తృతమైన ఆదాయవనరులు కలిగియున్నాయి. పన్నుల విధింపులో విస్తృత అధికారాలను కలిగియుండటమేకాక రాష్ట్రాల నియంత్రణ లేకుండా ఎక్కువ స్వేచ్ఛను కల్గియున్నాయి. ఒక్కొ సందర్భంలో పూర్తి స్వేచ్ఛను కల్గి యున్నాయి. ఒక్కొ సందర్భంలో పూర్తి స్వేచ్ఛను కల్గి యున్నాయి. ముఖ్యంగా నిర్వహణాధికారాలన్నీ మున్సిపల్ కమీషన్ చేతిలోనే వున్నాయి. కాబట్టి అభివృద్ధిలో నిరంతర కృషిచేసే అవకాశం వున్నది.

మనదేశంలో మున్సిపల్ కార్పొరేషన్లు సాధారణంగా కొన్ని ప్రాధమిక, అభివృద్ధి విధులను నిర్వర్తిస్తున్నాయి. పట్టణ ప్రాంతాలలో విస్తృతమైన అవసరాలుంటాయి. అధికజనసాంద్రత, పారిశ్రామికీకరణ వలన వాటి బాధ్యతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి.

**మున్సిపల్ కార్పొరేషన్‌ల విధులు**

ఎ. నీటి సప్లయి & సురక్షిత త్రాగునీటి సప్లయి

బి. మురుగు నీటి పారుదల

సి. రోడ్ల విద్యుదీకరణ

డి. మురికి వాడలను అభివృద్ధి పరచటం

ఇ. పారిశుధ్యం

ఎఫ్. గృహాలు, పట్టణ ప్రణాళికలను తయారుచేయుట

జి) ఆసుపత్రులను వ్యాప్తి చేయటం,

హెచ్) రవాణా సదుపాయాలను మెరుగుపరచటం పెద్ద పట్టణాలలో మున్సిపల్ కార్పొరేషన్ల విధులు దాదపుగా దేశమంతటా ఒకేలా వున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికైన మేయర్లు సమావేశాలకు అధ్యక్షత వహించి ఎప్పటికప్పుడు స్థానిక అవసరాలన్నీ విశ్లేషించి తగు నిర్ణయాలు తీసుకుంటారు. ఐ.ఏ.యస్ కేడర్ అధికారి మున్సిపల్ కమీషనర్‌గా నియమింపబడి రోజువారీ పరిపాలనా కార్యక్రమాలు నిర్వహిస్తుంటాడు. అయితే ప్రజలచే ఎన్నికచేయబడిన కార్పొరేషన్ కౌన్సిలర్లు తమ అవసరాలేవో చర్చించుకొని విధానాలు నిర్ణయిస్తారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్‌లు అచిరకాలంలో గణనీయమైన అభివృద్ధిని సాధించగలిగాయి.

**మున్సిపల్ కార్పొరేషన్‌ల ఆదాయవనరులు**

ఎ. ఆస్తులపై పన్నులు, ఆస్తుల మార్పిడి పై పన్ను మరియు భవనాలపై పన్నులు

బి. వాహనాలు మరియు జంతువులపై పన్నులు

సి. వాణిజ్యంపై పన్నులు, ఉద్యోగంపై పన్ను

డి. థియేటర్ మరియు ప్రదర్శన పన్ను

ఇ. కంపెనీలపై పన్ను

ఎఫ్. పట్టణాలలో అమ్మకానికి తెచ్చిన వస్తువులపై పన్నులు

జి. ప్రకటనలపై పన్నులు

హెచ్. ఆక్ట్రాయ్ మరియు టర్మినల్ పన్ను

ఐ. నీటిపన్ను

పన్నుల ఎంపికలో, సవరణలో కార్పొరేషన్లకు పూర్తి స్వేచ్ఛగలదు. అయితే చట్టంచే నిర్ణయించబడిన గరిష్ట, కనిష్ట రేట్లకు లోబడి మాత్రమే పన్నులరేట్లను నిర్ణయించాల్సి వుంటుంది.

రాష్ట్రాల్లో మున్సిపల్ కార్పొరేషన్లు పన్నులు విధించే అధికారం వున్నా, అన్ని రాష్ట్రాలలోనూ ఈ పన్నుల తీరు తెన్నులు ఒకే విధంగా వుండాలనే నియమం ఏమీ లేదు. పన్నుల విధింపులో వివిధ కార్పొరేషన్ల మధ్య చాలా తేడాలున్నాయని తెలియుచున్నది. అవి ఏమనగా-

ఎ. ముంబాయి మున్సిపల్ కార్పొరేషన్ చట్టం ఆస్థిపన్నుకు కనిష్ట, గరిష్ట రేట్లను నిర్ణయించింది. అయితే మిగిలిన పన్నులకు కనిష్ట స్థాయిని మాత్రమే నిర్ధారించింది.

బి. చెన్నైయి మున్సిపల్ పట్టణ చట్టం కోల్‌కత్తా కార్పొరేషన్‌లు ఆస్తిపన్ను గరిష్ట రేటును మాత్రమే నిర్ధారించాయి. చట్టాల్లో కనిష్ట, గరిష్ట పరిమితులకు లోబడి వివిధ సవరణలు కూడా చేయబడినాయి. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండానే ఈ కార్పొరేషన్లు పన్నులు విధించటానికి, పన్నుల సవరణలు ఇష్టానుసారంగా మార్పులు చేసుకోవటానికి స్వేచ్ఛ వుంటుంది.

**కార్పొరేషన్ల ఆర్థిక పరిస్థితి - ఇబ్బందులు**

కార్పొరేషన్లు మున్సిపల్ సేవలపై చేసే వ్యయం మున్సిపాలటీలు చేసే వ్యయం కన్నా అధికంగా వుంటుంది. కార్పొరేషన్లు పన్నుల ద్వారా పొందిన రాబడి కూడా అధికంగానే వుంటుంది. కాబట్టి కొంతమేరకు తమ విధులను నిర్వర్తించటంలో సఫలీకృతమైనాయి. కానీ అధికంగా పెరుగుతున్న జనాభా, జనసాంద్రత, వేగంగా వృద్ధి చెందుతున్న పరిశ్రమలు వలన కార్పొరేషన్లకు ఆదాయ, వ్యయాలు రెండూ బాగా పెరుగుతున్నట్లు తెలయచేయుచున్నది. పట్టణ ప్రణాళికా విధానం, మురికి వాడల శుభ్రత, గృహాలు, నీటిసప్లయి, మురుగు నీటి పారుదల, కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ మొదలగు ప్రత్యేక సమస్యలకు నిధులు సరిపోక కార్పొరేషన్లు తమ విధులను సరిగా నిర్వర్తించలేకపోతున్నాయి. ముఖ్యంగా కార్పొరేషన్లలో మరికివాడల అభివృద్ధి పట్ల అంతగా శ్రద్ధ చూపట్లలేదనే విమర్శ తరచూ వినిపిస్తున్నది. అధిక జనసాంద్రత గల నగరాలలో రోడ్లు, రవాణా సదుపాయాలు బాగా పెంచి, ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం వున్నది.

## 15.8 స్థానిక ప్రభుత్వాల ఆదాయ - వ్యయ పరిస్థితులు - సమస్యలు

స్థానిక ప్రభుత్వాల విధులు, వాటి ఆదాయ వనరుల గురించి కూలంకషంగా చర్చించిన తరువాత మొత్తం స్థానిక ప్రభుత్వాల ఆర్థిక స్థితిగతులను కూలంకషంగా సమీక్షించాల్సిన అవసరం వున్నది.

స్థానిక సంస్థల ఆదాయలకు ముఖ్యంగా ఈ క్రింది రెండు విభాగాలుగా విభజించవచ్చును.

i. పన్నుల రాబడి

ii. పన్ను తర రాబడి

iii. జిల్లా బోర్డులకు గ్రాంట్లు

**i)** పన్నుల రాబడి స్థానిక సంస్థలకు కొన్ని పనులు కేటాయించినా అన్ని రాష్ట్రాలలోను పన్నుల విధింపు తీరుతెన్నులు, పన్నుల రేట్లు ఒకేలా వుండాలనే నియమం లేదు. అంతేకాక స్థానిక సంస్థలకు అన్ని రకాల పన్నులు విధించే అధికారం లేదు. చాలా సందర్భాలలో పన్నుల రేట్లు అనేక పరిమితులకు లోబడి విధించాల్సి వుంటుంది. ఏదైనా ప్రత్యేక పన్ను విధించాలంటే రాష్ట్ర ప్రభుత్వ అనుమతి పొందాల్సి వుంటుంది. స్థానిక పన్నుల జాబితాలో ఉదహరించిన పన్నులను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చును.

ఎ. ఆస్తులపై పన్నులు

బి. వస్తువులపై, సేవలపై పన్నులు

రాష్ట్రాల పన్నుల జాబితా రాజ్యాంగంలో పేర్కొనబడింది. కానీ స్థానిక సంస్థల పన్నుల గురించి రాజ్యాంగం ఏ విషయమూ చర్చించలేదు. స్థానిక సంస్థలు విధించే పన్నులు రాష్ట్రాల పన్నుల లిస్టులో కూడా వున్నాయి. అయితే ఆయా పన్నులు విధించేకునే అధికారం స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చింది. పన్నుల విచారణా సంఘం స్థానిక సంస్థలకు ప్రత్యేకించి కొన్ని పన్నులు విధించి, ఆదాయం వసూలు చేసుకునే అధికారం కల్పించాలి. అప్పుడు స్థానిక సంస్థలు కొంతమేరకు ఆదాయం పెంచుకునే అవకాశం వుంటుంది. పన్నులు విధించుకోవటంలో స్వేచ్ఛ లేనందువలన స్థానిక సంస్థలకు అంతగా ఆదాయం రావటల్లేదు. ఈ క్రింది పన్నులు ప్రత్యేకించి స్థానిక సంస్థలే విధించుకొని రాబడి పొందే అవకాశం వుండాలని పన్నుల విచారణా సంఘం ప్రతిపాదించింది.

ఎ. భూమి మరియు భవనాలపై పన్నులు

బి. వాహనాలపై పన్నులు

సి. ఆక్ట్రాయి మరియు టర్మినల్ పన్నులు

డి. జంతువులు మరియు పడకలపై పన్నులు

ఇ. ప్రకటనలపై పన్నులు (వార్తపత్రికలలో ప్రకటనల మినహా)

ఎఫ్. వృత్తులు, వ్యాపారాలు, ఉద్యోగులపై పన్నులు.

పన్నుల పంపిణీ రాజ్యాంగపరంగా ఎటువంటి వివరణ లేకపోయినా, రాష్ట్రప్రభుత్వము తమ పన్నుల రాబడిలో స్థానిక సంస్థలకు కొంతవాటా ఇస్తున్నాయి. రాష్ట్రాలే పన్నులు విధించి, రాబడి వసూలు చేసి వచ్చిన మొత్తంలో స్థానిక సంస్థలకు వాటా ఇవ్వటం జరుగుతున్నది. కొన్ని రాష్ట్రప్రభుత్వాలు భూమి శిస్తు ను విధించి వసూలు చేసి వచ్చిన రాబడిలో కొంతమేరకు స్థానిక సంస్థలకు వాటా ఇస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలలో వినోదపు పన్ను ద్వారా వచ్చిన నికరరాబడిలో కొంత వాటా స్థానిక సంస్థలకు ఇవ్వాలి. పన్నుల విచారణా సంఘం పంచాయితీల పరిధిలో వసూలు చేసే భూమిశిస్తులో కనీసం 15శాతం వాటికే ఇవ్వాలని తీర్మానించింది.

**ii) పన్నులేతర రాబడి :**

సాధారణంగా ఈ క్రింది విధంగా స్థానిక సంస్థలకు పన్నులేతర రాబడి వస్తుంది.

ఎ. ఫీజులు

బి. జరిమానాలు మరియు

సి. స్థానిక సంస్థలు చేపట్టిన ప్రభుత్వరంగ సంస్థలు (మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు) కు వచ్చే ఆదాయం.

స్థానిక సంస్థలగు మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు స్థానిక బస్‌సేవలు, ట్రామ్ సేవలు, విద్యుత్ పంపిణా, నీటి సప్లయి మొదలగు వాటి ద్వారా కూడా ఆదాయం పొందుతాయి. అయితే కొన్ని రాష్ట్రాలు ఈ స్థానిక సంస్థలు చేపట్టిన కార్యక్రమాలను తామే నిర్వర్తిస్తామని ఈ బాధ్యతలను చేపట్టటం జరిగగింది. చాలా రాష్ట్రాల్లో విద్యుత్ సప్లయి మరియు రోడ్డు రవాణా స్థానిక సంస్థల పరిధిలో నుండి రాష్ట్రాలు హస్తగతం చేసుకొన్నాయి. అందువలన స్థానిక సంస్థలకు రావలసిన ఆదాయం కూడా తగ్గిపోతున్నది.

ఫీజులు జరిమానాల వలన కొన్ని స్థానిక సంస్థలకు ఎక్కువ ఆదాయం లభిస్తున్నది. అయితే కొన్ని స్థానిక సంస్థలకు మాత్రం నామమాత్రంగానే ఆదాయం లభిస్తున్నది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు విద్యుత్ సప్లయి, రోడ్డు రవాణాలాంటి సేవలను రాష్ట్రాలకు అప్పచెప్పకుండా స్థానికసంస్థలే నిర్వహిస్తే వాటి ఆదాయం కూడా పెరుగుతుందని పన్నుల విచారణ సంఘం అభిప్రాయపడింది.

గ్రామపంచాయితీలకు వేరే కొన్ని మార్గాల ద్వారా పన్నులేతర రాబడి లభిస్తున్నది. ఉదా:- చెరువులు, సరస్సులు, చెట్లు పచ్చికబీళ్ళు మొదలగు వాటి నుండి కూడా ఆదాయాలు పొందుతున్నాయి. బజారులలో, మార్కెట్ స్థలాలలో షాపులు పెట్టుకొని పంచాయితీలకు బాడుగ లేక అద్దె చెల్లించటం జరుగుతుంది. పంచాయితీలు ఎరువుల అమ్మకం, వ్యవసాయ యంత్రాలు, సాధనాలకు అద్దెకివ్వటంచిన్నచిన్న పిండి మరలు నడపటం మొదలగు కార్యక్రమాల ద్వారా ఆదయం పొందవచ్చు. చెరువుల్లో చేపలు వేలం పాట ద్వారా అమ్మటం పచ్చికబీళ్ళను వేలం పాట ద్వారా విక్రయించి కూడా పంచాయితీలు ఆదాయాలు పొందుతున్నాయి.

### iii) జిల్లా బోర్డులకు గ్రాంట్లు :

జిల్లా బోర్డులకు గ్రాంట్లు లేక నిధులు ఇవ్వబడతాయి. అయితే పంచాయితీ లాటి స్థానిక సంస్థలకు మాత్రం ఇవ్వబడవు. జిల్లా పరిషత్‌లకు, జిల్లాబోర్డులకు ఈ గ్రాంట్లు ముఖ్యమైన ఆదాయమార్గంగా పేర్కొనవచ్చును. సాధారణంగా గ్రాంట్లు విద్య, వైద్యం మరియు ప్రజారోగ్యం, రోడ్లు మరియు నీటి సప్లయి మొదలగు ప్రత్యేక కార్యక్రమాల కోసం ఇవ్వబడతాయి.

**గ్రాంట్లు లేక నిధులు - ముఖ్య ఉద్దేశాలు**

రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక బోర్డులకు లేక జిల్లాపరిషత్‌లకు నిధులు ఈ క్రింది కార్యక్రమాల కోసం ఇస్తాయి.

ఎ. ప్రాథమిక విద్య

బి. నీటిసప్లయి, మరియు డ్రైనేజీ పథకాలకు అయ్యే వ్యయంలో కొంత మూలధనం రాష్ట్రాలు నిధుల రూపంలో ఇస్తాయి.

సి. ఉద్యోగులకు కరువుభత్యం

డి. సెకండరీ విద్య, వైద్య సంస్థలు, ప్రజారోగ్య చర్యలు, (మలేరియా నివారణ, టీకాలు వేయటం) మొదలగు కార్యక్రమాలకయ్యే వ్యయంలో కొంత మూలధనం నిధుల రూపంలో ఇస్తాయి.

ఇ. కొంతమంది వుద్యోగులకు జీతాలు (హెల్త్ ఆఫీసర్లు, ఇంజనీర్లు మొదలగువారు)

ఎఫ్. మున్సిపాలిటీ బడ్జెట్‌లలో లోటు పూరించుకునేందులకు కూడా నిధులు ఉపయోగిస్తారు.

అయితే నిధులు కేటాయింపుకు ఎటువంటి రూల్సు గానీ ప్రాతిపదకలుగానీ లేకపోవటం శోభనీయం. రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులను బట్టి సాధారణంగా నిధులు కేటాయింపబడతాయి. ప్రతి సంవత్సరం రాష్ట్రాల ఆదాయం మారుతూ వుంటాయి.. కాబట్టి స్థానిక సంస్థలు తమ బడ్జెట్‌లను తయారుచేసుకోవటంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. స్థానిక సంస్థలు చేపట్టిన పథకాలలో ఒక నిర్ణీతశాతం నిధుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వాల ఇవ్వవచ్చును. లేకుంటే కొంతమొత్తాన్ని కేటాయించవచ్చును. షరతులులేని నిధులు కూడా రాష్ట్రాలు స్థానిక సంస్థలకు ఇవ్వవచ్చును. స్థానిక సంస్థల ఆర్థిక అవసరనాలను తీర్చటంలో గ్రాంట్లు బాగా వుపకరిస్తున్నాయి. స్థానిక సంస్థలకు గ్రాంట్లు ఇవ్వటంలో పన్నులవిచారణా సంఘం ఈ క్రింది ప్రతిపాదలను చేసింది.

**ఎ. సాధారణ అవసరాలకు నిధులు :** పెద్ద మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు తప్ప ప్రతి స్థానిక సంస్థకు కొన్ని సాధారణ అవసరాల నిమిత్తం వినియోగించుకునేందులకు నిధులు ఇవ్వబడతాయి.

**బి. స్థానిక సంస్థలను విభజించి ఇచ్చే నిధులు :** జనాభా, భూభాగం, వనరులు మొదలగు కొన్ని ప్రాతిపదికల మీద స్థానిక సంస్థలను విభజించి నిధులు ఇవ్వబడతాయి. స్థానిక సంస్థల సాధారణ బడ్జెట్ పరిమాణాన్ని బట్టి కూడా నిధులు ఇవ్వబడతాయి.

**సి. సరిపడ విత్తాన్ని ఇచ్చే సిద్ధాంతం మీద నిధులు :** స్థానిక సంస్థలకు సాధారణంగా విత్త వనరుల కొరత వుంటుంది. ఈ సమస్యను తొలగించి ఆయా సంస్థలు తమ విధులను సరిగా నిర్వర్తించాలంటే సరిపడినంత విత్తం వుండాలి. కాబట్టి నిధుల కొరతతో ఇబ్బందిపడే స్థానిక సంస్థలకు నిదులు ఎక్కువగా ఇవ్వబడతాయి.

**డి. నిరంతరం నిధులు కొనసాగాలి :** స్థానికి సంస్థలు అభివృద్ధి సాధించేందులకు ఒక నిర్ణీతకాలం వరకు అనగా మూడు లేక నాలుగు సంవత్సరాల పాటు క్రమం తప్పకుండా నిధులు ఇవ్వాలి. మంచి ఫలితాలు సాధించి స్థానిక సంస్థలు అభ్యుదయ పథంలోకి వెళ్ళేందులకు ఈ నిధులు బాగా ఉపకరిస్తాయి.

**ఇ. కొన్ని సేవలకు ప్రత్యేక నిధులు :** కొన్ని ప్రత్యేకమైన విధులు, సేవలు స్థానిక సంస్థలు చేపట్టేందులకు కొన్ని ప్రత్యేక నిధులు కూడా ఇవ్వబడతాయి. అయితే ఈ నిధులు క్రింద పేర్కొన్న షరతులకు లోబడి ఇవ్వబడతాయి.

1. నిర్ణీత సమర్థతాస్థాయిని కొనసాగించాలి

2. రాష్ట్ర ప్రభుత్వాలు సూచించినట్లు స్థానిక సంస్థలు తాము చేపట్టే పథకాలలో ఒక నిర్ణీత వ్యయాన్ని తామే భరించవలసి వుంటుంది.

ఈ మార్గదర్శక సూత్రాలు పాటించినట్లయితే స్థానిక సంస్థలు నిధుల వలన ప్రయోజనం పొందగలవు. స్థానిక సంస్థలు తమకయ్యే వ్యయాన్ని కూడా తట్టుకొని అభివృద్ధి విధులను చేపట్టగలవు.

## 15.9 స్థానిక సంస్థలు - అభివృద్ధిలో కీలకపాత్ర

ఆధునిక ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ ఆర్థిక కార్యకలాపాలు, జాతీయ పాలనా యంత్రాంగంలో స్థానిక సంస్థలు ఒక అంతర్భాగంగా మారాయి. డాక్టర్ ఆర్.ఎన్. భార్గవ భావించినట్లుగా స్థానిక స్థాయిలో ప్రజాసామ్య నాయకులకు మంచి శిక్షణానుభవాన్ని ఇస్తున్నాయి.

ప్రాథమిక విద్య, అంటువ్యాధులు నివారణ, మురుగునీటి సదుపాయం, నీటి సప్లయి, వీధి దీపాలు, పార్కులు, స్థానిక రోడ్లు మొదలగు సామాజిక అవసరాలను తీర్చటంలో స్థానిక ప్రభుత్వాలు కీలక పాత్రను నిర్వహిస్తున్నాయి.

స్థానిక ప్రభుత్వాలు స్థానిక పన్నుల మీదే ఆధారపడి వాటి విత్త విధానాన్ని కొనసాగిస్తున్నాయి. కాబట్టి చాలా పటిష్టమైన విత్త విధానమని పన్నుల విచారణ కమిటీ పేర్కొన్నది.

స్థానిక సంస్థలు కూడా ఆర్థికవనరుల కోసం రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడతాయి. అయితే రాష్ట్రాలిచ్చే నిధులు స్థానిక సంస్థలు అభివృద్ధికి ఎంతగానో ఉపకరిస్తాయి. అయితే రాష్ట్రాలు వీటికిచ్చే నిధులు మొత్తం రాష్ట్రప్రభుత్వ వనరులపై ఆధారపడి వుంటుంది. కాబట్టి ప్రతి సంవత్సరం ఈ వనరుల మొత్తంలో హెచ్చు, తగ్గులుంటాయి. అందువలన స్థానిక సంస్థలు తమ బడ్జెట్‌లను తయారుచేసుకోవటంలో కొన్ని ఇబ్బందులకు గురి కావలసిన వస్తున్నది. అందుకే స్థానిక సంస్థలు పెరుగుతున్న వ్యయాన్ని తట్టుకునేందులకు భారీగా రుణాలు తీసుకోవలసి వస్తున్నదని ప్రొఫెసర్. గ్యాన్ చంద్ పేర్కొన్నారు.

స్థానిక సంస్థలు విత్తంలో ముఖ్యంగా ఈ క్రింది సమస్యలనేదుర్కొన వలసి వస్తున్నది.

ఎ. స్థానిక ప్రభుత్వాల ఆదాయ అవ్యాకోచత్వం

బి. స్థానిక ప్రభుత్వాలకు సరిపడినంత ఆదాయం లేకపోవటం

సి. స్థానిక ప్రభుత్వాలకు ఆదాయ వనరులలో అసమానతలు

**ఎ. స్థానిక ప్రభుత్వాల ఆదాయ అవ్యాకోచిత్వం :** మన రాజ్యాంగంలో కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వనరుల పంపిణీ గురించి సవివరంగా చర్చించింది. కానీ రాష్ట్రా, స్థానిక సంస్థల మధ్య వనరుల పంపిణీ గురించి చర్చించకపోవటం ఒక వెలితిగా వున్నది. రాజ్యాంగపూర్వంగా ఎటువంటి వ్రాతపూర్వక ఏర్పాటు లేకపోయినందున స్థానిక సంస్థలు పన్నులు విధించటంలో కూడా పూర్తిగా దయాదాక్షిణ్యాలపై ఆధారపడి వుండాల్సి వస్తున్నది. ఏ పన్ను విధించినా స్థానిక ప్రభుత్వాలు ముందుగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలనుండి ముందుగా అనమతి పొందాల్సి వుంటుంది. రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయ వ్యాకోచత్వంగల పన్నులను తన పరిధిలో వుంచుకొని ఆదాయ అవ్యాకోచత్వంగల పన్నులను, వనరులను స్థానిక సంస్థలకివ్వటం జరుగుతుంది. ఉదా: ఇంటి పన్ను, ఆక్ట్రాయ్, వాహన పన్ను మొదలగు పన్నులు.

పెరుగుతున్న జనాభా, ద్రవ్యోల్బణ పరిస్థితుల వలన స్థానిక సంస్థల వ్యయం కూడా విపరీతంగా పెరిగిపోతున్నది. అందువలన స్థానిక సంస్థలు ఆర్థిక సంక్షోభానికి గురయి అధికంగా అప్పులపై ఆధారపడవలసి వస్తున్నది. అవ్యాకోచ ఆదాయవనరుల వలన స్థానిక సంస్థలు తమ విధులను సమర్ధవంతంగా నిర్వర్తించలేకపోతున్నాయి.

**బి. సరిపోని ఆదాయవనరులు :** స్థానిక సంస్థల ఆదాయవనరులు అవ్యాకోచితను కలిగియున్నందువలన సరిపడినంతగా ఆదాయాన్ని పొందలేకపోతున్నాయి. స్వాతంత్ర్యానంతరం స్థానిక సంస్థల కార్యకలాపాలు ఈ క్రింది కారణాల వలన విస్తృతంగా పెరిగాయి.

ఎ. పట్టణాలు మరియు స్థానిక ప్రాంతాల అభివృద్ధి
బి. ప్రజల జీవన ప్రమాణంలో పెరుగుదల
సి. విపరీతంగా పెరుగుతున్న జనాభా

పెరుగుతున్న బాధ్యతలను చేపట్టాలంటే స్థానిక సంస్థలకు నిధుల కొరత వలన సాధ్యం కావటల్లేదు. అల్పాదయం, అధిక వ్యయం వలన స్థానిక సంస్థలు తమనిధులను సరిగ్గా నిర్వర్తించలేకపోతున్నాయి. అల్పాదయానికి గల కారణం స్థానిక సంస్థలు తక్కువ సంఖ్యలో పన్నులు విధించటం, పన్నుల రేట్లు కూడా తక్కువగా వుండటమే అని చెప్పవచ్చును. ఆదాయ, వ్యయాల మధ్య సమతూకాన్ని కుదుర్చుకోలేక స్థానిక సంస్థలు తప్పనిసరిగా నిర్వర్తించాల్సిన విధులను కూడా నిర్వర్తించలేకపోతున్నాయి. నీటి సప్లయి, మురుగు నీటి పారుదల, పారిశుద్యం, ప్రజారోగ్యం, ప్రాథమిక విద్య, స్థానిక రోడ్ల నిర్మాణం మరియు నిర్వహణ మొదలగు ముఖ్య విధులు కూడా చేయలేకపోవటం శోభనీయం. అందువలన స్థానిక ప్రభుత్వాలు రాష్ట్రప్రభుత్వాలిచ్చే నిధుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది.

**సి. స్థానిక ప్రభుత్వ ఆదాయ వనరులలో వ్యత్యాసం :** నేడు ప్రజలకు స్థానిక ప్రభుత్వాలనుండి ఎక్కువ సేవలు ఆశిస్తున్నారు కాబట్టి స్థానిక సంస్థల బాధ్యతలు కూడా క్రమేపి పెరుగుతున్నాయి. కాని ఆదాయ వనరులు మాత్రం పెరుగుట లేదు. స్థానిక సంస్థల పరిధిలో అవ్యాకోచ ఆదాయ వనరులు మాత్రమే వున్నాయి. కాబట్టి నిధుల కొరత స్థానిక ప్రభుత్వాల నిరంతర సమస్యగా మారింది. వ్యత్యాసానికి గల కారణాలు క్రింది విధంగా పేర్కొన వచ్చును.

**1. పన్నుల రేట్లు తక్కువగా వుండటం :** స్థానిక ప్రభుత్వాల పన్నుల రేట్లు తక్కువగా వుండటం వలన ఆర్థికంగా ఆదాయవనరులు పెరిగి శక్తివంతం కాలేకపోతున్నాయి. ప్రజల మీద అదికబారం మోపకూడదనే ఉద్దేశంతో ఉదారంగా వ్యవహరించడం వలన స్థానిక సంస్థలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వలే అధికమొత్తం పన్నుతుల రాబడిని పెంచుకోలేక పోతున్నాయి.

**2. పన్నుల వసూళ్ళలో లోపాలు :** పన్నుల వసూలుకు నియమిమలైన వుద్యోగులు అవలంబించే పక్షపాత పద్ధతి వలన, సోమరితనం వలన స్థానిక సంస్థలు ఆశించినంత మేరకు ఆదాయాన్ని పొందలేపోతున్నాయి. లంచం తీసుకొని పన్నుల రేటు తగ్గివచడం సహజంగా జరుగుతుంది. ఉదా: ఇంటి పన్ను అధికంగా వుందని సొంతదారుడు భావిస్తే పన్ను తగ్గించేందుకు లంచం ఇచ్చి పనిచేయించుకుంటారు. ఇందువలన పన్ను వసూలు చేసే ఉద్యోగి లభిస్తాడు, స్థానిక ప్రభత్వానికి మాత్రం రావలసినంత ఆదాయం రాకనష్టపోవలసివస్తున్నది. అలాగే

విద్యుత్ బిల్లుల విషయంలో కూడా సహజంగా ఇలాంటి లోపాలు దొర్లుతున్నాయి. స్థానిక సంస్థలకు రావలసిన ఆదాయం పన్నుచెల్లింపు దారులు, పన్ను వసూలు చేసే ఉద్యోగులు లాలూచిపడి స్థానిక సంస్థల ఆదాయానికి గండికొడుతున్నారు.అలాగే భుమిసిస్తూ వసూళ్ళు కొన్ని సంవత్సరాల పాటు వసూలు చేయక పోవడం వలన పన్నుల రాబడి స్థానిక సంస్థలకు ఆశించినంత మేరకు రాక అంచనాలు తారుమారవుతున్నాయి.

**3. సాంఘిక సేవల అభివృద్ధి మీద అధికవ్యయం :** ప్రజాస్వామ్యంలో ప్రజలందరి సంక్షేమం కోసం ప్రభుత్వాలు నిరంతరం కృషి చేయాల్సి వుంటుంది. సామ్యవాద రీతి సమాజస్థాపనకోసం ప్రజలందరి న్యాయం చేయాల్సి వుంటున్నది. ప్రజలలో కూడా అక్షరాస్యత పెరిగి స్థానిక సంస్థలను కూడా ప్రశ్నించేస్థాయికి ఎదిగారు. స్థానిక సంస్థలపై విధులు సరిగా నిర్వర్తించమని వత్తిడి తేగల చైతన్యం నేడు మన ప్రజలలో వచ్చింది. ఒక విధంగా ఇది సంతోషింపదగిన పరిణామమే అని చెప్పవచ్చు. నేడు గ్రామాల్లో సైతం ప్రజలు ప్రజాప్రతినిధులను, ఉద్యోగులను అడిగి తమకు కావలసిన సామాజిక అవసరాలను తీర్చవలసిందిగా నిగ్గ దీయగలుగుతున్నారు. ప్రజలలో ఈవిధమైన అవగాహన పెరిగినప్పటి నుండి స్థానిక సంస్థలకు వ్యయభారం కూడా పెరిగిపోతున్నది.

## 15.10 స్థానిక సంస్థల వనరులు పెంచుకోవటానికి తీసుకోవలసిన చర్యలు :

స్థానిక సంస్థలు సమర్థవంతంగా పన్నులు వసూలుచేసి రాబడి పెంచుకొనేందులకు అనేక కమిటీలు నియమించబడినియి. ఆకమిటీలు సిఫార్సు చేసిన కొన్ని ముఖ్యసూచనలు క్రింద పేర్కొనబడినాయి.

ఎ. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు తమ పన్నుల రాబడిలో కొంత వాటా ఇవ్వటం ద్వారా స్థానిక సంస్థలకు అధికంగా హాయపడవచ్చు.న

బి. స్థానిక సంస్థలు మరీ ఉదారంగా వ్యవహరించక తమ పరిధిలో గల పన్నుల రేట్లను పెంచుకొని అధికరాబడి పొందే ప్రయత్నం చేయాలి.

సి. ధనికులపై అధికభారాన్ని మోపి స్థానిక సంస్థలు ఆదాయ వ్యత్యాసాలను కూడా కొంతవరకు తగ్గించవచ్చును.

డి. స్లాబ్ పద్ధతి మీద పన్నులు విధిస్తే స్థానిక సంస్థలకు ఆదాయం కూడా పెరుగుతుంది.

ఇ. స్థానిక సంస్థల ఆదాయాన్ని పెంచుకోవాలంటే పన్నుల వసూలలోగల లోపాలను తొలగించాలి.

ఎఫ్. పన్నుల ఎగవేతకు అవకాశం లేకుండా ఉన్నతాదికారులు కృషి చేసి పూర్తి స్థాయిలో పన్నుల రాబడిని వసూలు చేసేందులకు ప్రయత్నించాలి.

జి. అవినీతి పరులైన ఉద్యోగులను శిక్షించి సమస్యలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సమర్థవంతంగా పన్నులు వసూలు చేసే ఉద్యోగులకు ప్రసంశాపత్రాలిచ్చి ప్రోత్సహించాలి.

హెచ్. స్థానికులే ఉద్యోగులయితే మోహమాట పడి సమర్దవంతంగా పన్నులు వసూలు చేయలేరు. కాబట్టి ఉద్యోగులను జన్మస్థలాలనుండి దూరప్రాంతాలకు బదిలీ చేయాలి.

ఐ. మిగులు వుద్యోగులను తొలగించి, ఉన్న ఉద్యోగులకుశిక్షణ ధృడసంకల్పాన్ని కల్పించి వుద్యోగులు సమర్థవంతంగా తమ విధులు నిర్వర్తించేటట్లు చేయాలి.

జె. రాష్ట్రాలు వాహనాలపై విధించే పన్నులరాబడిని స్థానిక సంస్థలకి వాటా ఇవ్వాలి.

కె. రైలు మార్గం, సముద్రమార్గం, వాయు మార్గాల ద్వారా ప్రయాణించే వస్తువులపై కేంద్ర ప్రభుత్వం పొందే టర్మినల్ పన్నుల రాబడిలో స్థానిక సంస్థలకు వాటా ఇవ్వాలి.

ఎల్. స్థానిక సంస్థల అభివృద్ధిని నిర్ణయించే జనాభా, భూభాగం, వనరులు, సమర్థత, ప్రగతి మొదలగు ప్రాతిపదికల మీదే గ్రాంట్లు ఇస్తే స్థానిక సంస్థల మధ్యగల ఆర్థిక వ్యత్యాసాలు తొలగిపోతాయి.

ఎమ్. రోజురోజుకు పెరుగుతున్న వ్యయాన్ని తట్టుకునేందులకు స్థానిక సంస్థలకు రాష్ట్రాలు అధిక వనరులను సమకూర్చాలి.

ఎన్. స్థానిక సంస్థలు కూడా ధుబారా లేకుండా వనరులను సమర్థవంతముగా వినియోగించుకునే అభిలషనీయ ప్రయోజనాలను పొందే ప్రయత్నం చేయాలి.

ఓ. పన్నుల వసూళ్ళలో, వ్యయం చేయడంలో స్థానిక సంస్థలు రాజకీయాలకు అవకాశం ఇవ్వకుండా అందరనీ సమాన అవకాశాలు కల్పించాలి. ఏ ఒక్క రాజకీయ పార్టీ ప్రాతిపదిక మీద కాక, అన్నిపార్టీలకు సంబంధించిన వ్యక్తులకు సమాన ప్రయోజనాలు కలిగే విధంగా స్థానిక సంస్థలు తమ ఆర్థిక వనరులను వినియోగించుకోవాలి.

పి. పదవ ఫైనాన్సు కమీషన్ పంచాయితీలకు, మున్సిపాలిటీలకు గ్రాంట్లు కేటాయించింది. అయితే రాష్ట్రాలు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన మొత్తాన్ని స్థానిక సంస్థలకు ఇవ్వక ఇతరత్ర వినియోగించుకోవటం వలన స్థానిక సంస్థలకు ఆశించినంత ప్రయోజనం చేకూరలేదు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు నేరుగా అందించాలని కూడా నిర్ణయింపబడింది. ఈ సూచన వలన స్థానిక సంస్థలు బాగా లభించాయి.

క్యూ. స్థానిక సంస్థలు కేవలం పరిపాలనలో వికేంద్రీకరణకు మాత్రమే ఏర్పాటు చేయబడినాయి. కాబట్టి ఆర్థిక అధికారాల వికేంద్రీకరణ కూడా జరగాలని శ్రీ యస్. కె. దేవ్ పేర్కొన్నాడు.

శ్రీ బలవంత్‌రాయ్ మెహతా కమిటీ ప్రకారం స్థానిక సంస్థలు గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు గ్రామీణాభివృద్ధికే అంకితమైనాయి. కాబట్టి ఆయా సంస్థలన్నీ ఒకదానితో ఒకటి లింకు కలిగి యుండాలిని పేర్కొన్నది. బాధ్యతలను కూడా ఆయా సంస్థల మధ్య వికేంద్రకరించాలి.

## 15.11 సారాంశం

1990లో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ప్రణాళికా వికేంద్రీకరణ విధానాన్ని వక్కాణించింది. గ్రామపంచాయితీలు, జిల్లా బోర్డులు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు మొదలగు స్థానిక సంస్థలు అభివృద్ధి వ్యూహంలో కీలక పాత్రను నిర్వహిస్తున్నాయి. ప్రజల తక్షణ అవసరాలు తీర్చటమే కాక పంచవర్ష ప్రణాళికల క్రింద అనేక అభివృద్ధి వ్యూహాలను కూడా చేపట్టాల్సి వుంటుంది.

ఈ సందర్భంగా ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, "నిజమైన ప్రజాస్వామ్య విధానంలో స్థానిక ప్రభుత్వాలు అత్యవసరంగా వుండాలి. ప్రజాస్వామ్యమనగా ఉన్నత ప్రభుత్వం వైపు చూచే అలవాటు వుంది కానీ అట్టడుగు ప్రభుత్వాల గురించి కూడా ఆలోచించుకోవాలి. అట్టడుగు స్థాయినుండి పునాదులు వేయకపోతే ఉన్నత ప్రభుత్వాలు విజయాన్ని సాధించలేవు" అని భావించారు. అయితే స్థానిక ప్రభుత్వాలు ఆర్థికంగా పటిష్టంగా వుండేటట్లు చూడాల్సిన అవసరం ఎంతైనా వున్నది. రాష్ట్రాలు స్థానిక సంస్థలకు నిధులు లేక గ్రాంట్లు ఇవ్వటమేకాక తమ పన్నుల రాబడిలో కూడా స్థానిక సంస్థలకు వాటా ఇవ్వాలి. అంతేకాక పన్నుల రాబడిని పూర్తిగా వసూలు చేసుకోవాలని కూడా నిర్బంధించాలి లేదా ప్రోత్సహించాలి. అలాగే పన్నుల రాబడిని కూడా పెంచుకోవాలి. పన్నుల వసూళ్ళలో గల అవినీతిని, అసమర్థతలను తొలగిస్తే స్థానిక సంస్థలు తమ వనరులను పెంపొందించుకునే అవకాశం వుంటుంది.

## 15.12 ముఖ్యపదాలు

1. యమ్.పి. స్థానిక ప్రాంతీయాభివృద్ధి పథకం - ప్రతి పార్లమెంటు సభ్యునికి రు5 కోట్లు, ప్రతి రాజ్యసభ సభ్యునికి రు1 కోటి వరకు స్థానిక సంస్థల అభివృద్ధి నిమిత్తం గ్రాంటు కేటాయింపబడుతుంది.

2. ఆదాయ అవ్యాకోచిత - పన్నులు పెంచినప్పటికీ ఆదాయం పెరగక పోవటం

## 15.13 స్వయం సమీక్ష ప్రశ్నలు :

1. మనదేశంలో గల వివిధ స్థానిక ప్రభుత్వాలేవి? వాటి విధులు ఆదాయ వనరులను విశదీకరింపుము.
2. స్థానిక ప్రభుత్వాలు ఆదాయ వ్యవరిస్థితులు, వాటి సమస్యల గురించి చర్చింపుము.
3. స్థానిక సంస్థల ఆదాయ వనరులు పెంచుకొవటానికి తీసుకోవాల్సిన చర్యలను వివరింపుము?

## అభ్యాసాలు

1. గ్రామపంచాయితీల ఆదాయవనరులు, విధులు
2. స్థానిక సంస్థల అభివృద్ధి
3. జిల్లాబోర్డులు
4. మున్సిపాలిటీల ఆదాయవ్యయాలు
5. మున్సిపల్ కార్పొరేషన్ల ఆదాయవనరులు
6. స్థానిక సంస్థల సమస్యలు
7. స్థానిక సంస్థలు వనరులు పెంచుకోవటానికి సూచనలు

## 15.14 చదవవలసిన పుస్తకాలు

Mankar & Sarma : Public Finance Theory And Practice
Alka Guptha : Public Finance and Tax Planning

డా॥ ఎల్. క్రిష్ణవేణి

పాఠం - 16

# కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ విధానము

## పాఠ్య నిర్మాణ క్రమం

16.0 1950 - 51 నుండి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ విధానము

16.1. కేంద్ర ప్రభుత్వ ఆదాయ మార్గాలు

16.2. కేంద్ర ప్రభుత్వ - ఆదాయ - వ్యయాలపై పన్నులు

16.3. కేంద్ర ప్రభుత్వ స్థూల పన్ను రాబడి, మరియు నికర పన్ను రాబడి

16.4. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల సంబంధం

16.5. కేంద్ర ప్రభుత్వ పన్నేతర రాబడి

16.6. కేంద్ర ప్రభుత్వ రాబడి పోకడలు

16.7. కేంద్ర ప్రభుత్వ వ్యయము

16.8. కేంద్ర ప్రభుత్వ వ్యయము - నూతన వర్గీకరణ

16.9. మూలధన వ్యయము మరియు మూలధన రాబడి

16.10. కేంద్ర ప్రభుత్వ వ్యయ తీరు తెన్నులు

16.11. ముగింపు

16.12. స్వీయ అవగాహన ప్రశ్నలు

16.13. చదవవలసిన గ్రంథాలు

## ఉద్దేశ్యం :

"మంచి పన్నుల విధానము ఆర్థిక అసమానతలను తగ్గించాలి. మంచి వ్యయ విధానము ఆర్థిక సమానత్వాన్ని పెంచాలి" - REPORT OF THE TAXATION ENQUIRY COMMISSION.

## 16.0 1950 - 51 నుండి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ విధానము :

భారత ప్రభుత్వ బడ్జెట్ ఏ సం॥రానికి సంబంధించినదైనా గత 2 సం॥రముల బడ్జెట్ అంకెల ఆధారముగా ప్రస్తుత సంవత్సరము యొక్క ఆదాయ, వ్యయాలను తెలియజేస్తుంది. ప్రతి బడ్జెట్ 3 రకాలైన దత్తాంశాన్ని తెలియజేస్తుంది.

1. గత సంవత్సరానికి సంబంధించిన వాస్తవ అంకెలు

2. ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ మరియు సవరించిన అంకెలు

3. రాబోవు సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు

ఉదాహరణ : 2003 - 2004 సంవత్సరము యొక్క బడ్జెట్ క్రింది అంశాలను తెలియజేస్తుంది.

1. 2001 - 02వ సంవత్సరానికి చెందిన వాస్తవిక వివరాలు

2. 2002 - 03వ సంవత్సరానికి బడ్జెట్ కు చెందిన సవరించిన వివరాలు

3. 2003 - 04వ సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలు

Table. : 1 1950 - 51 వ సంవత్సరము నుండి భారత ప్రభుత్వం యొక్క, ఆదాయ, వ్యయాలను, 50 సంవత్సరముల కాలములో, ప్రత్యేకించి కొన్ని నిర్దేశించిన సంవత్సరాలలో ఏ విధముగా వున్నది తెలియజేస్తుంది.

## * 1950 - 51 వ సం॥ నుండి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ విధానము :

| | 1950 - 51 Actuals | 1980 - 81 Actuals | 2001 - 02 Actuals | 2003 - 04 Budget |
|---|---|---|---|---|
| రాబడి ఖాతా | 406 | 12, 830 | 2, 01, 450 | 2, 53, 940 |
| రాబడి వ్యయం | 347 | 14, 540 | 3, 01, 610 | 3, 66, 230 |
| రాబడి మిగులు(+) | +59 | - 1, 710 | - 1, 00, 160 | - 1, 12, 290 |
| రాబడి లోటు (-) | | | | |
| మూలధన ఖాతా | | | | |
| రాబడి, | 120 | 8,770 | 1,61,000 | 1,84,860 |
| వ్యయము | 182 | 9,630 | 60, 840 | 72, 570 |
| మిగులు లోటు | -62 | -860 | 1,00,160 | +1, 12, 290 |
| బడ్జెట్ లోటు | -3 | -2, 570 | Nil | Nil |

పై పట్టికను అనుసరించి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ తీరుతెన్నులు ఏ విధముగా వున్నాయో తెలుసుకోవచ్చు.

మూలము : Government of India Budget at a Glanle, 2003 - 2004 and earlies issues..

### 16.0.1 రాబడి ఖాతాలో వసూళ్ళు, వ్యయాలలో అధిక పెరుగుదల :

రాబడి ఖాతాలోని వసూళ్ళు, వ్యయాలు చాలా త్వరగా పెరుగుతున్నాయి. మొదటి ప్రణాళిక ప్రారంభం 1950 - 51 వ సంవత్సరంలో రూ. 406 కోట్లు వున్నా రాబడి వసూళ్ళు 30 సం॥ల కాలములో అనగా 1980 - 81 నాటికి రూ. 12, 830 కోట్లకు పెరిగినది. 1981 - 2002 అనగా 21 సంవత్సరముల కాలములో (రెవిన్యూ) రాబడి వసూళ్ళు రూ. 12, 830 కోట్ల నుండి 201, 450 కోట్లకు పెరిగింది. 2003 - 04 బడ్జెట్ రూ. 253, 940 లో రెవిన్యూ వసూళ్ళ ను అంచనా వేసింది. రెవిన్యూ వసూళ్ళలో అధిక పెరుగుదలకు ఈ క్రింది కారణాలు దోహదపడతాయని ఊహించారు.

1. నూతన పన్నుల విధింపు
2. పన్ను ప్రాతిపదికను విస్తృత పరచడం
3. పన్ను వసూలు పద్ధతులను పటిష్ట పరచడం
4. ద్రవ్యోల్బణ కారణముగా ధరలు, ఆదాయాలు పెరుగుతాయి.

భారతదేశ ప్రభుత్వ వ్యయము రాబడి కన్నా చాలా త్వరగా పెరిగినది ఉదాహరణ : 1950 - 51 నుండి 1980 - 81 అనగా 30 సంవత్సరముల కాలములో ప్రభుత్వ రెవిన్యూ వ్యయం Rs. 14, 540 కోట్ల నుండి 301, 610 కోట్లు అనగా 40 రెట్లు పెరిగినది. 2001 - 02 వ సంవత్సరము నాటికి అనగా 21 సంవత్సరముల కాలములో- Rs. 30, 610 కోట్లు దాటింది.

కేంద్ర ప్రభుత్వ వ్యయంలోని అత్యధిక పెరుగుదలకు కారణాలు :

1. పరిపాలనా యంత్రాంగం విస్తరించడం

2. రక్షణ వ్యయం పెరుగుదల

3. వేతనాలు, ధరల పెరుగుదల వల్ల కరువు భత్యం నిరంతరం పెరుగుతూ ఉండటం

4. ధరల పెరుగుదల

16.0.2 రెవిన్యూ ఖాతాలలో అధిక లోటు :

1970 మధ్య కాలం వరకు కరెంట్ అకౌంట్ రాబడి, వ్యయం కన్నా అధికంగా ఉండి మిగులను కలిగి ఉండేది. దీనిని "Revenue Surplus" (రాబడి మిగులు) అంటారు. ఉదాహరణ : 1950 - 51 సం॥ లో రూ. 59 కోట్లుగా వున్నా రెవిన్యూ మిగులు 1970 - 71 నాటికి రూ. 160 కోట్ల కు పెరిగింది. దీనిని ఆర్థికాభివృద్ధి కొరకు ఉపయోగించారు.

1970 మధ్య కాలం నుండి రెవిన్యూ రాబడి కన్నా చాలా త్వరితంగా పెరిగి రెవిన్యూ ఖాతా (లేదా) కరెంట్ అకౌంట్ లో లోటును కలిగిస్తున్నది. ఉదాహరణ: 1980 - 81 లో రూ. 1, 710 కోట్లు గా వున్నా రెవిన్యూ లోటు 2001 - 02 నాటికి రూ. 100, 160 కోట్లకు పెరిగింది. ఇది 2003 - 04 నాటికి రూ. 112, 280 కోట్లకు దాటి ఉండవచ్చని అంచనా.

భారత దేశములో బడ్జెట్ 2 భాగాలుగా ఉంటుంది
1. రెవిన్యూ ఖాతా
2. మూలధన ఖాతా

రెవిన్యూ బడ్జెట్‌కు పన్నులు, పన్నేతర రాబడులు నుండి ఆదాయం లభిస్తుంది. వీటినుండి వ్యయం చెయ్యబడుతుంది. పన్ను రాబడి ప్రధానముగా 3 రకాలుగా లభిస్తుంది.

1. ఆదాయ, వ్యయాలపై పన్నులు

2. ఆస్తులు, మూలధనం పై పన్నులు & ఆస్తుల మార్పిడిపై పన్నులు

3. వస్తు, సేవలపై పన్నులు

పన్నేతర రాబడి ప్రధానముగా 3 రకాలుగా లభిస్తుంది.

1. కరెన్సీ మరియు నాణెముల ముద్రణ

2. వడ్డీ డివిండెడ్లు

3. ఇతర పన్నేతర రాబడులు

ప్రస్తుత రాబడి నుంచి కరెంట్ వ్యయం చేయబడుతుంది. రాబడి వ్యయం క్రింది అంశాలపై ఉంటుంది.

1. సాధారణ సేవలు : ఉదాహరణ : సాధారణ పరిపాలనా, పోలీస్, న్యాయ వ్యవస్థ, రక్షణ, పన్ను వసూళ్ళు మొ॥వి

2. సాంఘీక మరియు సామాజిక సేవలు : ఉదాహరణ : విద్య, వైద్య, ప్రజా ఆరోగ్య, కార్మిక, ఉపాధి, మొ॥వి

3. ఆర్థిక సేవలు : ఉదాహరణ : వ్యవసాయము, పరిశ్రమలు, రవాణా, వ్యాపారము మొ॥వి

భారత ప్రభుత్వ మూలధన (Budget) ను మూలధన ఖాతా అని కూడా అంటారు. దీనిలో మూలధన రాబడి మరియు మూలధన వ్యయము ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ మూలధన రాబడి క్రింది అంశాల నుండి లభిస్తుంది.

1. రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలు మరియు ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చిన రుణాలను వసూలు చెయ్యడం.

2. మార్కెట్ నికర రుణాలు (Gross borrowings from the Market less repayments of public debt)

3. చిన్న పొదుపుల నికర వసూళ్ళు

4. ఇతర మూలధన రాబడులు ఉదాహరణ : ప్రావిడెంట్ ఫండ్, ప్రత్యేక డిపాజిట్లు మొ॥వి

కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయము క్రింది అంశాలపై వుంటుంది.

1. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రణాళికలను అమలు చేయడానికి

2. ఆర్థికాభివృద్ధి

3. సాంఘీక సామాజిక అభివృద్ధి

4. రక్షణ రంగంలో సామాజిక వ్యయము

రెవిన్యూ ఖాతాలలో లోటు మనదేశం రాబడిని మించి చేస్తున్నదనే విషయాన్ని తెలియజేస్తుంది. ఈ లోటును అప్పుతీసుకోవడం ద్వారా పూడ్చవలసి ఉంటుంది. ఇది భారత దేశం యొక్క దీన స్థితిని తెలియజేస్తున్నది.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లోటు (లేదా) మిగులును క్రింది పట్టిక ద్వారా విశ్లేషించవచ్చును.

Table - 2 (1950 - 51 నుండి కేంద్ర బడ్జెట్ లోటు - మిగులు Rs. Crores)

| సంవత్సరము | రాబడి ఖాతా మిగులు (+) లోటు (-) | మూలధన ఖాతా మిగులు (+) లోటు (-) | మొత్తం బడ్జెట్ మిగులు (+) లోటు (-) |
|---|---|---|---|
| 1950 - 51 | +59 | -162 | -3 |
| 1960 - 61 | +50 | +70 | +120 |
| 1970 - 71 | +160 | -450 | -290 |
| 1980 - 81 | -1,710 | -860 | -2,570 |
| 1990 - 91 | - 18,560 | - 7,210 | -11,350 |
| 2001 - 02 | -1,00,160 | +1,00,160 | Nil |
| 2003 - 04 | -1,12,290 | +1,12,290 | Nil |

**16.0.3 మూలధన రాబడి మరియు మూలధన వ్యయము : (DISBURSEMENTS)**

కేంద్ర బడ్జెట్ గడిచిన 50 సం॥లలో కేంద్ర బడ్జెట్ రాబడి ఖాతాలోని మార్పులను ఈ క్రింది విధముగా గమనించవచ్చు.

1. 1970 వరకూ వ్యయం కన్నా రాబడి ఎక్కువగా వుండి మిగులను సూచించింది.

2. 1970 తరువాత రాబడి కన్నా వ్యయం ఎక్కువగా వుండి లోటును సూచించింది.

3. స్థూలంగా గడిచిన 40 సం॥లలో రాబడి ఖాతా లోటు అధికంగా పెరగడాన్ని తెలుపుతున్నది.

పై పరిస్థితికి భిన్నముగా 1950 - 51 నుండి కేంద్రబడ్జెట్ మూలధన ఖాతా గమనించదగ్గ మార్పులు జరగలేదు. 1990 లో మాత్రమే మూలధన ఖాతా భారీ లోటును సూచించింది. వాస్తవంగా, మూలధన మిగులు, రాబడి లోటు సమానమై నికర మార్పు శూన్యమయింది.

బడ్జెట్ సంప్రదాయాన్ని వదిలి, లోటు బడ్జెట్ సంప్రదాయాన్ని అనుసరించింది. దీని కొరకు క్రింది చర్యలను చేపట్టింది.

మూలధన ఖాతాలోని మిగులు రెవిన్యూ ఖాతాలోని లోటు సమానమయ్యేటట్లు చూడడం ద్వారా మొత్తం బడ్జెట్‌లో లోటు లేకుండా చూడటం.

రుణాలు, చిన్న పొదుపు మొత్తాలు మరియు ఆర్థిక సంస్థల నుండి అప్పులు తీసుకోవడం ద్వారా ఆర్థిక శాఖ మూలధన ఖాతాలో మిగులును సాధించవచ్చు.

Table - 2 నుంచి 2000 - 01 సంవత్సరములో రెవిన్యూ ఖాతా లోటు, మూలధన ఖాతా మిగులు సమానమై (100, 160 crores) బడ్జెట్ నికర లోటు శూన్యమైంది. అదే విధముగా 2003 - 04 సం॥ లో కూడా రెవిన్యూ ఖాతా లోటు, మూలధన ఖాతా మిగులు సమానమై రూ. (112, 290 కోట్లు) బడ్జెట్ నికర లోటు శూన్యమయింది.

అయితే పై విధానం శాశ్వత పరిష్కారాన్ని చూపదు. అంతే కాకుండా అప్పులు ఋణాలు, చిన్న పొదుపు మొత్తాలు ద్వారా మిగులును సాధించడం అభివృద్ధిని ప్రోత్సహించదు.

## 16.1. కేంద్ర ప్రభుత్వ ఆదాయ మార్గాలు :

కేంద్ర ప్రభుత్వం 2 రకాల బడ్జెట్‌లను రూపొందిస్తుంది.

1. రెవిన్యూ బడ్జెట్ : రెవిన్యూ ఖాతాలోని ఆదాయ వ్యయాలను ఇది తెలియజేస్తుంది.

2. మూలధన బడ్జెట్ : మూలధన ఖాతాలోని ఆదాయ, వ్యయాలను ఇది తెలియజేస్తుంది.

రెవిన్యూ ఖాతాలకు లభించే ఆదాయాలను 2 రకాలుగా వర్గీకరించవచ్చు.

1. పన్ను రాబడి

2. పన్నేతర రాబడి

1. పన్ను రాబడి : ఇది 3 రకాలుగా లభిస్తుంది.

1. ఆదాయాలపై పన్నులు

2. అస్తులపై పన్నులు మరియు మూలధన మార్పిడి పై పన్నులు

3. వస్తువులు, సేవలపై పన్నులు

16.1.2 పన్నేతర రాబడి : ఇది 3 రకాలుగా లభిస్తున్నది

1. కోశపరమైన మరియు ఇతర సేవలు

2. వడ్డీలు

3. డివిడెండ్లు, లాభాలు

TABLE - 3

రెవిన్యూ ఖాతాలో కేంద్ర ప్రభుత్వం ఆదాయ మార్గాలు (Rs. Crores)

| | 1950 - 51 Actuals | 980 - 81 Actuals | 2001 - 02 Actuals | 2003 - 04 Budget |
|---|---|---|---|---|
| పన్ను రాబడి(నికర) | 357<br>(88) | 9,390<br>(73) | 1,33,660<br>(66) | 1,84,170<br>(73) |
| పన్నేతర రాబడి | 49<br>(12) | 3,440<br>(27) | 67,790<br>(34) | 69,770<br>(27) |
| రెవిన్యూ ఆదాయాలు | 406<br>(100) | 12,830<br>(100) | 2,01,450<br>(100) | 2,53,940<br>(100) |

Source : Table's 1 - 10 "Budget at a Glance" (GOI) 2003 - 04 and other previous issues.

Table - 3 ననుసరించి కేంద్ర ప్రభుత్వ ఆదాయం చాలా త్వరగా పెరుగుతున్నది అని తెలుస్తున్నది. దీనికి కారణం

1. పన్నులు పెరగడం.

పన్ను రేట్లు పెరగడం కొంత కారణమైతే ద్రవ్యోల్బణం కారణంగా ధరలు పెరుగుతూ వుండటం మరి కొంత కారణం.

1950 - 51 లో రూ. 400 కోట్లుగా వున్నా కేంద్ర ప్రభుత్వ ఆదాయం 1980 - 81 నాటికి రూ. 12, 830 కోట్లకు 2001 - 02 నాటికి రూ. 2, 01, 450 కోట్లకు పెరిగింది. 2002 - 03 నాటికి రూ. 2, 53, 940 కోట్లకు చేరవచ్చు. 1981 - 2004 మధ్య కాలంలో పన్ను రాబడి 20 రెట్లుపెరిగింది.

అయితే 1950 - 51 లో మొత్తం రాబడిలో 88.1 వున్నా పన్నురాబడి 73% నికి తగ్గింది 2003 - 04 లో కూడా 73% వుండవచ్చని అంచనా వెయడం జరిగింది. ఇదే కాలానికి పన్నేతర రాబడి 12% నుండి 27% నికి పెరిగింది.

## 16.2. కేంద్ర ప్రభుత్వ ఆదాయ - వ్యయాలపై పన్నులు :

ఆదాయ పన్నులు 2 రకాలు

1. వ్యక్తిగత ఆదాయ పన్ను

2. కార్పొరేట్ పన్ను (పరిశ్రమల లాభాలపై పన్ను)

**16.2.1 వ్యక్తిగత ఆదాయ పన్ను :** వ్యక్తిగత ఆదాయ పన్నును కేంద్ర ప్రభుత్వం విధిస్తుంది. రాబడిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకుంటాయి. దీనిని ప్రజలందరి పైనా విధించరు. ఆర్థికంగా కొంత స్థాయికి చేరిన వారిపైనే ఈ పన్నును విధించడం జరుగుతుంది.

ఇది "పన్ను చెల్లింపు సామర్థ్యం" అనే సూత్రం పై ఆధారపడి విధించబడుతుంది. ఎక్కువ ఆదాయం గల వారు ప్రభుత్వానికి ఎక్కువ పన్ను చెల్లించాలి" అనే మూల సూత్రంతో దీనిని విధిస్తారు. సాలీనా రూ. 50,000/- కన్నా తక్కువ ఆదాయం గలవారు దీనిని చెల్లించనవసరం లేదు పన్ను చెల్లింపునకు ఆదాయ పరిమితి 1995 - 96 బడ్జెట్ లో రూ. 40,000 వుండగా దీనిని 1998 - 99 బడ్జెట్ లో రూ. 50,000 కు పెంచారు. క్రింది పన్ను రేట్లు ప్రస్తుతం అమలులో వున్నాయి.

| ఆదాయ స్థాయి | పన్నురేటు (%) |
|---|---|
| 1. రూ. 50,000 వరకు | Nil |
| 2. రూ. 50,000 - 60,000 | 10 |
| 3. రూ. 60,000 - 1,50,000 | 20 |
| 4. రూ. 1,50,000 కంటే ఎక్కువ | 30 |

ఆదాయ పన్నురేటు స్థిరమైనది కాదు. ఇది పురోగామి పన్నుల విధానంపై ఆధారపడి విధించబడుతుంది. అనగా ఆదాయం పెరిగే కొలది పన్ను రేటు కూడా పెరుగుతుంది. ప్రస్తుతం ఇది 10% నుండి 30% స్థాయిలో విధించబడుతుంది. అత్యధిక పన్నురేటు 30% 1999 - 2000 బడ్జెట్లో రూ. 60,000 లు అంతకన్నా ఆదాయం గల వారికి పన్నుపై 10% సర్ చార్జిని విధించింది. 2000 - 01 (Budget) బడ్జెట్ రూ. 1,50,000 ఆదాయం మించిన వారి పన్నుపై సర్ చార్జిని 15% నికి పెంచింది 1975 కి పూర్వం ఆదాయం పన్ను 97.25% గా ఉండేది.

కానీ గత 20 సం॥లలో పన్ను రేట్లను గణనీయంగా తగ్గించారు. దీనికి కారణం అధిక పన్నులను చెల్లించలేక ప్రజలు పన్ను ఎగవేతకు పూనుకొనేవారు. తక్కువ పన్ను రేట్ల వల్ల చాలా లాభాలున్నాయని అధికారులు గుర్తించారు.

1. పన్ను ఎగవేతను తగ్గిస్తుంది

2. పొదుపును ప్రోత్సహిస్తుంది

3. అభివృద్ధిని పెంపొందిస్తుంది

4. ప్రజలు యిష్ట పూర్వకముగా పన్నులు చెల్లిస్తారు

పై కారణాల వల్ల 1997 - 98 లో బడ్జెట్ ఆదాయ పన్నును గణనీయంగా తగ్గించింది. ఆదాయం పన్ను చట్టం పన్ను చెల్లింపునకు ఆదాయంలో నుండి కొన్ని మినహాయింపులను అనుమతించింది. సాలినా నికర ఆదాయాన్ని లెక్కించడానికి మొత్తం ఆదాయంలో నుండి ఈ మినహాయింపులను తీసివేయాలి. సాధారణముగా ప్రామాణిక తగ్గింపు స్థిరంగా అనగా రూ. 15,000 ఉండేది.

కాని వేతన కార్మికులకు ఊరట కలిగించుట కొరకు 1998 - 99 బడ్జెట్‌లో రూ. 1 లక్ష ఆదాయం గల వేతన కార్మికులకు ప్రామాణిక తగ్గింపును రూ. 25,000 కు పెంచారు. ఇతరులకు దీనిని రూ. 20, 000 కు పెంచారు. పొదుపును ప్రోత్సహించడం కొరకు ఆదాయపు పన్ను చట్టం కొన్ని పొదుపులపై పన్నును మినహాయించింది.

1. బాంకు వడ్డీలు
2. డివిడెండ్లు
3. OTI నుండి లభించిన ఆదాయం

ఈ పొదుపులు రూ. 13,000 వరకూ పన్ను మినహాయింపును గతంలో యిచ్చింది. ఇప్పటికీ కొన్ని పొదుపులపై పన్ను రాయితీలను ఇస్తున్నది.

1. జీవిత భీమా (LIC)
2. ప్రావిడెంట్ ఫండ్

1990 - 91 నుండి 20% పొదుపునకు గరిష్ఠంగా రూ. 12,000 కు లోబడి, పన్ను రాయితీ ఇవ్వబడింది. కళాకారులు, రచయితలు మొ॥ వారికి దీనిని రూ॥ 14,000 గా నిర్ణయించింది. తరువాత దీనిని రూ. 16,000 కు పెంచింది.

భారత దేశంలో ఆదాయ వసూళ్ళకు సంబంధించి ఆదాయపు పన్ను అధిక వసూళ్ళను సమకూరుస్తున్నది. పారిశ్రామికీకరణ వేగవంతం కావడంతో ప్రజల ఆదాయాలు పెరిగాయి. ఫలితముగా ఆదాయపు పన్ను వససూళ్ళు కూడా పెరిగాయి.

Table - 4 ఆదాయపు పన్నుకు సంబంధించి 2 విషయాలను స్పష్టీకరిస్తున్నది.

1. వ్యక్తిగత పన్నుల నుండి వసూలవుతున్న ఆదాయ పరిమాణం క్రమంగా పెరుగుతున్నది. ప్రత్యేకించి ఇది 1970 - 71 నుండి స్పష్టంగా కనబడుతుంది.

2. ఆదాయ పన్ను రాబడిని ఆర్థిక సంఘాల సూచనలను అనుసరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకుంటాయి. ఉదాహరణ : 10 వ ఆర్థిక సంఘం సూచనలను అనుసరించి ఆదాయపు పన్ను రాబడి నుండి 77.5% రాష్ట్రాలకు లభించాయి. 11 వ ఆర్థిక సంఘం సూచనలను అనుసరించి పై ఆనవాయితీ మారింది. 2003 - 04 బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం రూ. 44,070 కోట్లను ఆదాయ పన్ను ద్వారా సమకూర్చవలెనని ప్రతిపాదించిరి.

**16.2.4 ఆదాయ, వ్యయ పన్నుల నుండి కేంద్ర ప్రభుత్వ రాబడి : (Rs. Crores)**

| అంశములు<br>Actual | 1950 - 51<br>Actual | 1980 - 81<br>Actual | 2001 - 02 | 2003 - 04<br>Budget |
|---|---|---|---|---|
| 1. వ్యక్తిగత ఆదాయపు | 140 | 1, 510 | 32,000 | 44,070 |
| పన్ను రాష్ట్రాల వాటా (-) | 50 | 1, 000 | | |
| ఆదాయపు పన్ను నుండి నికర రాబడి | 90 | 510 | 32,000 | 44,070 |
| 2. కార్పొరేట్ పన్నులు | 40 | 1,310 | 36,610 | 51,500 |
| 3. ఇతర పన్నులు (ఆదాయ వ్యయాలపై) | - | 90 | 450 | - |
| నికర ఆదాయము | 130 | 1,910 | 69,060 | 95,570 |

NOTE : 1. 2001 -02 Figures are provisional
2. Other Taxes on income and expenditure

Relate to interest tax alone in 1980 - 81 and both
Interest tax and expenditure tax is 2001 - 02. These taxes are not levied now.

**16.2.5 కార్పోరేట్ పన్ను :** కార్పోరేట్ పన్ను కంపెనీల ఆదాయాలపై విధించబడుతుంది. పెద్ద, చిన్న కంపెనీల లాభాలపై కేంద్ర ప్రభుత్వం దీనిని విధిస్తున్నది 1998 - 99 లో కార్పోరేట్ పన్ను రేట్లు క్రింది విధముగా వున్నాయి (గతంలో మాదిరిగానే)

* స్వదేశీ కంపెనీలు - 35% (నికర లాభంలో)

* విదేశీ కంపెనీలు - 48% (నికర లాభంలో)

గతంలో ఈ పన్ను చాలా అధికంగా ఉండేది 1990 - 91 నుండి క్రమంగా తగ్గుచున్నది. దీనికి కారణం :

1. వసూళ్ళను పెంచడం (లేక) పన్ను ఎగవేతను తగ్గించడం

2. అభివృద్ధి ప్రక్రియను ప్రోత్సహించడం

3. గుణక ప్రభావాలను లాభదాయకంగా మలచడం

4. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం

మౌళిక పన్నుతో పాటు విధింపబడుతుంది. 15% సర్ చార్జిని 1996 - 97 & 1997 - 98 బడ్జెట్‌లలో రెండు దఫాలుగా తొలగించినారు. అయితే 1999 - 2000 బడ్జెట్ తిరిగి 10% సర్ చార్జిని విధించింది. 1996 - 97 కు పూర్వం కంపెనీలు తమ లాభాలలో నుండి అర్హత గల మినహాయింపులు పోను మిగిలిన - లాభాలపై పన్ను చెల్లించాలి. ఆ సందర్భముగా కంపెనీలు Book Profits నుండి మినహాయింపులు తీసివేస్తూ మిగిలిన ఆదాయం (taxatile income) కన్నా తక్కువగా వుండటం వల్ల పన్ను చెల్లించడం లేదు. అందువల్ల Book Porfits పై మినహాయింపు లేకుండా 12% కార్పోరేట్ పన్నును కట్టే విధముగా 1996 - 97 నుండి MAT పద్ధతిని ప్రవేశపెట్టారు. ఇంధనం, అవస్థాపన, ఎగుమతి ప్రాతిపదిక గల కంపెనీలకు మినహాయింపును యిచ్చింది.

* కార్పోరేట్ పన్ను విధానంలో వచ్చిన ఇతర మార్పులు :

1. విదేశీ కంపెనీలకు చెల్లించే రాయల్టీ మరియు సాంకేతిక సేవలకు చెల్లించే ఫీజులపై పన్నును 30% నుండి 20% నికి తగ్గించారు

2. కంపెనీల పై MAT ను సవరించారు

3. వాటాదారుల డివిడెండ్లపై పన్నును తొలగించారు.

4. పంపిణీ చేసిన కంపెనీ లాభాలపై 10% పన్నును విధించారు. దీనివల్ల కంపెనీలు లాభాల పంపిణీని తగ్గించి, ఆ మొత్తాన్ని తిరిగి పెట్టుబడి పెట్టడం ద్వారా నూతన పెట్టుబడులకు అవకాశం కల్పించబడుతుంది.

గతంలో పెట్టుబడులను పెంచడం కొరకు వ్యాపార, పారిశ్రామిక రంగాలకు అనేక మినహాయింపులను, రాయితీలను ప్రకటించింది. కానీ ఈ రాయితీలను కంపెనీలు పన్ను ఎగవేతకు ఎక్కువగా ఉపయోగించుకున్నాయి. అందువలన 1990 - 91 నుండి ఎగుమతుల వలన లభించిన ఆదాయము, నూతన సంస్థల రాబడికి మాత్రం మినహాయింపులు ఇచ్చి మిగిలిన వాటికి రాయితీలను, మినహాయింపులను తొలగించారు.

ఆర్థిక ప్రణాళికల అమలు, సత్వర పారిశ్రామికీకరణ వలన కార్పోరేట్ పన్ను ఆదాయం క్రమంగా పెరుగుతున్నది. 1950 - 51 లో కార్పోరేట్ పన్ను వలన లభించే ఆదాయం రూ. 40 కోట్లు కాగా ఇది 2003 - 04 నాటికి రూ. 51, 500 కోట్లుకు పెరిగింది. పారిశ్రామికీకరణ వేగవంతంగా జరిగిందనడానికి ఇది నిదర్శనము.

**16.2.6 వడ్డీ పై పన్ను :** (Interest Tax Act) : 1974 లో Interest Tax Act వాణిజ్య బ్యాంకులు స్వదేశంలో ఇచ్చిన రుణాలపై పన్ను విధింపును ప్రవేశపెట్టింది. ఈ పన్ను ద్వారా 1974 - 75 లో 11 కోట్ల రూ. ఆదాయం లభించగా, 1977 - 78 నాటికి అది 115 కోట్లకు

పెరిగింది. 1985 లో కేంద్ర ప్రభుత్వం దీనిని తొలిగించింది. అయితే ద్రవ్యోల్బణ నివారణ చర్యల్లో ఒక భాగంగా దీనిని తిరిగి ప్రవేశ పెట్టింది.

పరిమితి సంస్థలైన వాణిజ్య బ్యాంకులు, ప్రభుత్వ ఆర్థిక సంస్థలు, పరపతి కంపెనీలు (Financial institution's) ల వడ్డీ నుండి లభించే నికర ఆదాయంపై పన్నును విధించింది. 1999 - 2000 ఆర్థిక సంవత్సరంలో ఈ పన్ను ద్వారా రూ. 1000 కోట్ల రాబడి లభించింది. 2000 - 2001 బడ్జెట్ లో బ్యాంకులు, విత్త సంస్థలు చెల్లించే 2% వడ్డీ పన్ను ను తొలగించింది.

**16.2.7 వ్యయం పై పన్ను (Expenditure Tax) :** టి.టి. కృష్ణమాచారి ఆద్వర్యంలో నియమించిన Taxitation Enquiry Committee వ్యయం పై పన్ను విధింపును సూచించింది. అయితే ఇది పూర్తిగా విఫలం కావడం వల్ల దీనిని తొలగించారు. 1987 Expenditure Tax Act ను అనుసరించి Nov. 1987 నుండి ప్రభుత్వం మళ్ళీ Expenditure Tax ను విధిస్తున్నది. దీనిని అనుసరించి Hotels క్రింది విధముగా పన్ను చెల్లించాలి.

ఉదాహరణ : ఒక వ్యక్తికి, ఒక రోజుకు నివాసం ఉండటానికి రూ. 400 గాని అంతకన్నా ఎక్కువకుగాని బాడుగకు ఇచ్చేటటువంటి Hotels వాటి వ్యయంపై పన్ను చెల్లించాలి- Expenditure tax rate ను తరువాత 10% నుండి 20% కి పెంచినారు. అదునాతన సౌకర్యాలను Ex : Air Conditioning etc... కల్పించే Rrstaureuts వ్యయంపై పన్ను విధిస్తారు. ఈ విధముగా వ్యయంపై పన్నును వివిధ రకాలుగా విభజించారు.

Table - 4 లో కేంద్ర ప్రభుత్వానికి ఆదాయంపై పన్ను వ్యయంపై పన్ను ద్వారా లభించే రాబడిని తెలియజేస్తున్నది.

ఆదాయం పన్నునుండి లభించే ఆదాయం 1950 - 51 లో రూ. 130 కోట్లనుండి 1980 - 81 లో 1,910 కోట్లకు క్రమంగా పెరిగింది. 2003 - 04 బడ్జెట్ నాటికి ఇది రూ. 95, 570 కోట్లకు పెరిగింది.

**16.2.8 ఆస్తి పన్ను మరియు మూలధన మార్పిడి పై పన్ను :** కేంద్ర ప్రభుత్వం ఆస్తిపై మూలధన మార్పిడిపై కొన్ని పన్నులను విధించింది. వీటిలో సంపద పన్ను (WEALTH TAX) ముఖ్యమైనది. అయితే వీటి నుండి లభించే రాబడి చాలా అల్పంగా ఉంటుంది. 1950 - 51 లో Rs. 4 crores, 1990 - 91 Rs. 240 Crores 2003 - 04 లో Rs. 170 కోట్లు మాత్రమే లభించింది. (Table - 5 లో చూడవచ్చును)

**16.2.9 ఎస్టేట్ డ్యూటీ :** ఒక వ్యక్తికి వారసత్వంగా లభించిన ఎస్టేట్‌పై ఎస్టేట్ డ్యూటీ విధింపబడుతుంది. దీనిని కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి రాష్ట్రాలకు పంచుతుంది.

వారసత్వంగా లభించిన ఎస్టేట్ విలువననుసరించి ఎస్టేట్ డ్యూటీ 4% నుండి 40% వరకు విధించబడుతుంది. ఇది పురోగామి లక్షణాన్ని కలిగి వుండి, అధిక సంపదగల వారిపై పన్ను భారం అధికంగా పడుతుంది. ఆర్థిక వికేంద్రీకరణ లక్ష్యంగా దీనిని విధించారు. కానీ దీని ద్వారా లభించిన రాబడి మాత్రం చాలా నిరాశాజనకంగా ఉంది. పన్ను ఎగవేతయే దీనికి కారణం. కేంద్ర ప్రభుత్వం దీని ద్వారా సుమారు రూ. 15 కోట్లు వసూలు చేసి, పూర్తి మొత్తాన్ని రాష్ట్రాలకు చెల్లించింది. దీని నిర్వహణకు అయ్యే వ్యయం అధికంగా ఉండి, దీని ద్వారా లభించే ఆదాయం చాలా తక్కువగా ఉండటంలో 1985 March లో ఆర్థిక మంత్రిగా వున్న V. P.Singh దీనిని తొలగించారు (Abolished)

ప్రభుత్వ కోశాగారానికి తగినంత ఆదాయాన్ని సమకూర్చలేని పన్నును విధించడం అభిలషణీయం కాదని V.P. Singh భావించారు.

**16.2.10 (THE GIFT TAX) కానుకపై పన్ను :** 1958, ఏప్రిల్ లో సంపద పన్ను, మరియు వ్యయంపై పన్నుకు అనుబంధంగా ప్రభుత్వం Gift - tax ను ప్రవేశ పెట్టింది. ఈ మూడు పన్నులలో పన్ను ఎగవేతను అరికట్టడానికి Gift - tax అవసరమయ్యేను. గత సంవత్సరములో ఇచ్చిన కానుకలపై (Gifts) ప్రస్తుత సంవత్సరములో Gift - tax విధించబడుతుంది. అయితే దీనిలో 2 లోపాలు వున్నాయి.

1. దాతపై పన్ను విధించడం

2. అధిక పురోగామి లక్షణాన్ని కలిగి ఉండటం

ఇవి అధికంగా పన్ను ఎగవేతకు కారణాలయినాయి. 1990 - 91 బడ్జెట్ Gift tax లో చెప్పుకోదగిన మార్పులు చేసింది.

1. పన్ను doner మీద కాక donee మీద విధించబడుతుంది

2. పన్ను మినహాయింపు పరిమితిని పెంచినారు

3. పన్ను రేటును తగ్గించినారు

కాని ప్రభుత్వం వీటిని అమలుపరచలేక పోయింది. కేంద్ర పన్నుల జాబితాలో Gift - tax చాలా కాలం కొనసాగి, సాలీనా రూ. 10 కోట్లు ఆదాయాన్ని మాత్రమే సమకూర్చింది. 1998 - 99 బడ్జెట్ లో Mr. యస్వంత్ సిన్హా, దీని నుండి లభించే రాబడి చాలా నిరాశాజనకంగా వున్నదని దీనిని తొలగించినారు. భవిష్యత్‌లో కానుక గ్రహీతల (donee) ఆదాయంలో భాగంగా కానుకలను పరిగణిస్తారు.

Table - 5

ఆస్థి మరియు మూలధన మార్పిడిపై కేంద్ర ప్రభుత్వ పన్నులు (Rs. crores)

| | 1950 - 51 వాస్తవాలు | 1980 - 81 వాస్తవాలు | 2001 - 02 వాస్తవాలు | 2003 - 04 బడ్జెట్ |
|---|---|---|---|---|
| 1. Wealth tax సంపద పన్ను | - | 67 | 145 | 145 |
| 2. గిఫ్ట్ టాక్స్ | - | 7 | Nil | Nil |
| 3. ఇతర పన్నులు | 4 | 14 | 25 | 25 |
| TOTAL | 4 | 88 | 170 | 170 |

These included not revenue from estate - duty for the year (1980 - 81) and land revenue and stamps and registration fees of the union territories. From 1993 - 94 Budget onwords other taxes include only land Revenue and sfamps and Registration fees of the Union Territories.

16.2.11 **(Wealth tax) సంపద పన్ను :** ఒక వ్యక్తి హిందూ అవిభక్త కుటుంబం, కంపెనీలు సంపాదించిన సంపదపై ఈ పన్ను విధించబడుతుంది. సంపద కలిగిన వారందరిపై ఈ పన్ను విధింపబడుతుంది అని అర్థం కాదు. Rs. 2.5 lakhs కన్నా తక్కువ ఆస్తిపై ఈ పన్ను విధించరు. గతంలో ఇది 15% వరకు విధింపబడేది. తరువాత ఆదాయపు పన్ను రేటు అధికంగా పెరుగుతూ ఉండటంతో ధనికులు ఆస్థి పన్నును ఎగవేయడం ప్రారంభించారు. ప్రస్తుతం ఇది కేవలం 0.5% నుండి 2% మధ్యలోనే విధింపబడుతుంది.

1992 - 93 బడ్జెట్ లో Dr. Man Mohan Singh బడ్జెట్ లో ఉత్పాదక సంస్థలపై దీనిని తొలగించి, కేవలం ఉత్పాదక ఆస్తులపై మాత్రమే దీనిని విధించారు. ఉదాహరణ : అతిథి గృహాలు, నివాసగృహాలు, నగల షాపులు మొ॥వి.

1993 April నుండి రూ. 15 లక్షలు దాటిన ఆస్థిపై కేవలం 1% పన్ను విధించారు. ఈ మార్పుల కారణముగా ఈ పన్నునుండి లభించిన ఆదాయం చాలా తగ్గింది. 2003 - 04 బడ్జెట్ దీనినుండి రూ 145 కోట్లు వసూలు చెయ్యాలని తలచింది. చాలా కాలముగా సంపద పన్ను వసూలు కేవలం రూ. 145 కోట్లకే పరిమితం అయింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ పన్నులను గూర్చి అంతగా పట్టించుకోకపోవడాన్ని ఇది తెలియజేస్తుంది. ఆర్థిక అసమానతలను తగ్గించవలననే ఉద్దేశ్యంతో సంపద, సంపద మార్పిడి పన్నులను విధించారు. కానీ ఈ ఉద్దేశ్యం నెరవేరలేదు. దీనికి కారణం

1. ప్రారంభంలో అధిక పన్ను రేట్లు ఉండటం

2. రక రకాల పన్ను మినహాయింపులు కాలానుగతంగా ప్రకటించడం

3. ప్రత్యక్ష పన్నుల పరిపాలనా వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండటం

4. సంపద పన్ను, గిఫ్ట్ టాక్స్ ఎగవేతకు ఎక్కువగా ఆస్కారం ఉండటం

ఎగవేతకు అవకాశం ఉండే పన్నులను, అత్యల్ప రాబడిని సమ కూర్చే పన్నులను కొనసాగించడంలో అర్థం లేదు. వీటిని చాలా కాలం క్రిందటే తొలగించవలసి ఉంది. కాని, కమ్యూనిస్టు పార్టీల ఒత్తిడికి ప్రతి ఆర్థిక మంత్రి తలొగ్గవలసి వచ్చింది. ధనవంతులపై అధిక పన్నులను విధిస్తున్నామన్న అభిప్రాయాన్ని ప్రజలలో కలిగించడానికి కూడా ప్రభుత్వం వీటిని తొలగించలేదు. ఇప్పటి వరకు దీనిని తొలగించే ధైర్యం కేంద్రంలో ఏ ఆర్థిక మంత్రికి లేకపోయింది.

16.2.12 వస్తువులు, సేవలపై పన్నులు : (Taxes on Commodities & Services)

కేంద్ర ప్రభుత్వానికి పన్నుల ద్వారా లభించే రాబడిలో అధిక మొత్తం వీటి ద్వారానే - అభిస్తున్నది. కేంద్ర (excise duties & customs duties) ప్రభుత్వానికి ముఖ్యమైన పన్నులు.

Table - 6

వస్తువులపై పన్నుల ద్వారా లభించే రాబడి ( Rs. Crores)

| | Items అంశములు వాస్తవిక | 1950 - 51 వాస్తవిక | 1980 - 81 వాస్తవిక | 2001 - 2002 బడ్జెట్ | 2003 - 2004 |
|---|---|---|---|---|---|
| 1. | కేంద్ర ఎక్సైజ్ సుంకం | 70 | 6,500 | 68,530 | 96,790 |
| | రాష్ట్రాల వాటా మినహాయింపు | - | 2,780 | - | - |
| | ఎక్సైజ్ సుంకంనుండి లభించిన నికర రాబడి | 70 | 3,720 | 68,530 | 96,790 |
| 2. | కస్టమ్స్ డ్యూటీ | 160 | 3,410 | 47,540 | 49,350 |
| 3. | సేవా పన్ను | - | - | 2,610 | 8,000 |
| 4. | ఇతర పన్నులు (వస్తువులపై) | - | 310 | 1,590 | 1,650 |
| | వస్తువులపై పన్నుల ద్వారా లభించిన మొత్తం రాబడి | 230 | 7,440 | 1,20,270 | 1,55,790 |

Other Commodity taxes Relate to a) sales tax, state excise duties, taxes on vehicles ete., of Union Territories; These Taxes Contributed an insignificant amount of Rs. 4. crores in 1950 - 51 and hence was Omitted in that year for purpose of calculation but they are expected to contribute Rs. 310 crores in 1999 - 2000 & b) proceeds of foreign exchange Conservation (Travel) Tax, Foreign Travel Tax & Inland Air Travel Tax.

16.2.13 కేంద్ర ఎక్సైజ్ సుంకం : (Central Excise Duties) - స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం ఆర్థికాభివృద్ధి కొరకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవలసి వచ్చింది. దీనికి ఎక్సైజ్ డ్యూటీ మంచి మూలంగా కనబడింది. స్వదేశంలో తయారైన వస్తువులపై కేంద్రం దీనిని విధిస్తుంది. కొన్ని వస్తువులపై రాష్ట్ర ప్రభుత్వాలు excise duty ని విధిస్తాయి. ఉదాహరణ : లిక్కర్ మరియు డ్రగ్స్ కేంద్రం విధించే Customs Duties నుండి వీటిని మినహాయిస్తారు. ప్రారంభంలో పంచదార, ప్రత్తి, మిల్లు వస్త్రాలు, పొగాకు, అగ్గి పెట్టె, సిమెంట్ extra....

అధిక రాబడిని సమకూర్చాయి. ఆధునిక కాలంలో ఈ పన్ను పరిధిలోనికి అనేక వస్తువులను తీసుకురావడం జరిగింది. ఇంతకు ముందున్న వస్తువులపై పన్ను రేటును పెంచారు. ఈ పన్ను నుండి లభించే స్థూల ఆదాయం 1950 - 51 లో రూ. 70 Crores వుండగా, 1980 - 81 నాటికి ఇది 6, 500 కోట్లకు పెరిగింది. 2003 - 04 బడ్జెట్ అంచనాల్లో దీనిని రూ. 96, 790 కోట్లకు పెంచారు.

ఆర్థిక సంఘం సూచించిన సలమానుసరించి కేంద్ర ప్రభుత్వం excise duty ని నిర్ణయిస్తుంది. ఉదాహరణ : 10 వ ఆర్థిక సంఘం ఎక్సైజ్ డ్యూటీనుండి లభించిన ఆదాయంలో 47.5% న్ని రాష్ట్రాలకు బదలాయించింది. కానీ, 11 వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు వాటాకు సంబంధించి ఎటువంటి సూచలను ఇవ్వలేదు.

**16.2.14 సర్వీస్ టాక్స్ (సేవా పన్ను) :** ప్రస్తుతం కేంద్రప్రభుత్వం టెలిఫోన్, ఇన్సూరెన్స్, మధ్యవర్తులు (Brokerage) మొదలగు వాటి పై సర్వీస్ టాక్స్‌ను విధిస్తున్నది. ప్రతీ సంవత్సరము అదనముగా కొన్ని సేవలను దీని పరిధిలోనికి తీసుకు వస్తున్నది. ప్రభుత్వానికి అతి వేగముగా రాబడిని పెంచే పన్ను ఇది 1994 - 95 లో రూ. 407 కోట్లు (పన్ను వసూలు ప్రారంభించిన మొదటి సంవత్సరం) ఉండగా 2001 - 02 నాటికి ఇది రూ. 2,610 కోట్లకు పెరిగింది. 2003 - 04 బడ్జెట్ దీనిని రూ. 8,000 కోట్లుగా అంచనా వేసింది.

**16.2.15 కస్టమ్స్ సుంకం :** భారతదేశపు దిగుమతులపై దీనిని విధిస్తారు. (దిగుమతులపై దిగుమతి సుంకం, ఎగుమతులపై ఎగుమతి సుంకం) ఎగుమతి సుంకాల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో పోటీని మనవాళ్ళు ఎదుర్కొనలేక పోతున్నందున ప్రభుత్వం ఎగుమతి సుంకాలను తొలగించింది.

దిగుమతి సుంకాలు దేశంలో ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుతాయి. ఇనుము, ఉక్కు, రసాయనాలు, డ్రగ్స్ మందులు, ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులు మొ॥వి వాటి దిగుమతులు పెరిగినందున ప్రభుత్వానికి దిగుమతి సుంకాలనుండి లభించిన ఆదాయం బాగా పెరిగింది. 1980 - 81 లో కేంద్రప్రభుత్వం రూ. 3, 410 కోట్లను Customs duties ద్వారా వసూలు చేసింది. 2003 - 04 బడ్జెట్ నాటికి దీనిని రూ. 49, 350 కోట్లు పెంచవలెనని భావించింది.

1950 - 51 లో Excise duties కన్నా Customs dutiesకి అధిక ప్రాధాన్యత ఉండేది కాలక్రమేణా customs duties ప్రాధాన్యత తగ్గింది. గత కొద్ది సంవత్సరాలుగా ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని క్రమంగా తగ్గిస్తూ వస్తున్నది. అయినప్పటికి భారత దేశపు పన్నుల వ్యవస్థలో Customs duty కి ప్రధాన పాత్ర వున్నది. ప్రభుత్వ రాబడికి కేంద్ర excise సుంకం, కార్పొరేట్ పన్నుల తరువాత, తృతీయ స్థానం కస్టమ్స్ డ్యూటీస్‌కే లభిస్తుంది.

## 16.3. కేంద్ర ప్రభుత్వ స్థూల పన్ను రాబడి మరియు నికర పన్ను రాబడి :

**(Gross tax Revenue & net Tax Revenue of the Central Government.)**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆదాయపు పన్ను మరియు ఎక్సైజ్ డ్యూటీస్ రాబడికి సంబంధించి 11 వ ఆర్థిక సంఘం నిర్దిష్టమైన సూచనలేమి చెయ్యలేదు. అయితే కేంద్ర ప్రభుత్వ పన్ను రాబడి వసూళ్ళలో 28% న్ని రాష్ట్రాలకు కేటాయించాలి. పంచదార, textiles మరియు పొగాకుపై అమ్మకం పన్నును విధించి, వసూలు చెయ్యని రాష్ట్రాలకు కేంద్రం 1.5% పన్ను రాబడిని పంపిణీ చేయ్యాలి. కేంద్రానికి పన్నులు, సుంకాలనుండి లభించే రాబడి లో మొత్తం 29.5% రాష్ట్రాలకు లభిస్తుంది. (2000 నుండి 2005 వరకు) 2003 - 2004 నాటికి కేంద్రప్రభుత్వ నికర రాబడి క్రింది విధంగా ఉంటుంది.

| | |
|---|---|
| 1. ఆదాయము, వ్యయంపై పన్ను | 95, 570 (రూ. కోట్లలో) |
| 2. సంపద పై పన్ను | 170 |
| 3. వస్తు సేవలపై పన్ను | 1,55,790 |
| 4. స్థూల పన్ను రాబడి | 2,51,530 |
| 5. అన్ని పన్నులనుండి రాష్ట్రాల వాటా | 63,760 |
| 6. NCCF (National Calamity Contingency fund) కు బదిలీ చేసిన మొత్తము | 3, 600 |
| 7. నికర పన్ను రాబడి | 1, 84, 170 |

**16.4.1** ప్రత్యక్ష, పరోక్ష పన్నుల సంబంధం (Magnitude) : కేంద్రప్రభుత్వం విధించే అన్ని పన్నులను పోల్చి అధ్యయనం చేయవచ్చు Table - 5 1951 - 91 మధ్య ప్రత్యక్ష పన్నులనుండి లభించే ఆదాయం 36% నుండి 16% నికి తగ్గిందని తెలుపుచున్నది. Table - 7 ననుసరించి పరోక్ష పన్నులనుండి లభించే ఆదాయం 64% నుండి 84% నికి పెరిగిందని తెలుపుతున్నది. 1991 నుండి మళ్ళీ ప్రత్యక్ష పన్నుల ప్రాధాన్యత పెరుగుతున్నది. 2003 - 04 లో ప్రత్యక్ష, పరోక్ష పన్నుల మధ్య నిష్పత్తి 39:61 గా నిర్ణయింపబడింది. పన్ను వ్యవస్థలో (Commodity tax) వస్తువులపై పన్ను ప్రాధాన్యత ప్రభుత్వానికి ప్రత్యక్ష పన్నుల విధింపు కన్నా పరోక్ష పన్నుల విధింపు సులభమని తెలియజేస్తున్నది.

ఫలితంగా పేద, మధ్య తరగతి ప్రజలపైననే పన్ను భారం అధికంగా పడుచున్నది.

Table - 7

ప్రత్యక్ష, పరోక్ష పన్నుల మధ్య పోలిక

| పన్నులు | 1950 - 51 | 1990 - 91 | 2003 - 2004 |
|---|---|---|---|
| ప్రత్యక్ష పన్నులు | 174 (43) | 11, 030 (16) | 95, 740 (38) |
| పరోక్ష పన్నులు | 227 (57) | 57, 470 (84) | 1, 55, 790 (62) |
| మొత్తం పన్ను రాబడి | 401 (100) | 68, 500 (100) | 2, 51, 530 (100) |

Note : Figures in brackets are percentages of Total - tax revenue

## 16.5. కేంద్ర ప్రభుత్వ పన్నేతర రాబడి :

కేంద్రానికి ఆదాయ పన్ను, సంపద పన్ను, వస్తువులపై పన్ను మొదలైన పన్నుల ద్వారానే గాక ఇతర మార్గాల నుండి కూడా రాబడి లభిస్తుంది. దీనిని స్థూలంగా పన్నేతర రాబడి అంటారు. ఉదాహరణ : కోశ పరమైన సేవల నుండి వడ్డీలు, డివిడెండ్లు, ప్రభుత్వ రంగ సంస్థల లాభాలు, సాధారణ సేవలు మొ॥వి 1950 - 51 లో పన్నేతర రాబడి రూ. 49 కోట్లు కాగా ఇది 1970 - 71 లో రూ. 890 కోట్లకు పెరిగింది. 2003 - 04 బడ్జెట్ దీనిని రూ. 19, 770 కోట్లుగా అంచనా వేసింది. ఈ మధ్య కాలంలో పన్నేతర రాబడి ఏ విధంగా పెరిగిందో Table - 8 తెలియజేస్తుంది.

Table - 8

పన్నేతర రాబడి విశ్లేషణ

Rs. Crores

| | 1970 - 71 Actual | 2003 - 2004 Budget |
|---|---|---|
| 1. వడ్డీ వసూళ్ళు | 590 | 39, 160 |
| 2. డివిడెండ్లు మరియు లాభాలు | 120 | 17, 860 |
| 3. కోశ మరియు ఇతర సేవలు | 180 | 12, 750 |
| మొత్తం | 890 | 69, 770 |

సాధారణ, ఆర్థిక మరియు సాంఘీక సేవలు, కరెన్సీ, నాణెముల ముద్రణ, విదేశీ గ్రాంట్లు, కేంద్ర పాలిత ప్రాంతాల పన్నేతర రాబడి, మొ॥వి కలుస్తాయి.

These include General, economic and social services currency, Coinage & mint and also external Grants, non - tax revenue of union Territories, extra....

కేంద్రానికి కోశ సంబంధ సేవల ద్వారా లభించే రాబడి 2 విధాలుగా ఉంటుంది.

1. కరెన్సీ, నాణెములు మరియు ముద్రణ
2. Indian Security Press, Nasik, Hyderabad Extra...

సామాజిక సేవలు, ఆర్థిక సేవలు, Grants - In - aid and Contributions సాధారణ సేవలుగా పరిగణింపబడతాయి. వడ్డీల నుండి రాబడి - రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలకు రైల్వేలు, తపాలా, ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చిన ఋణాలపైవడ్డీలు కలుస్తాయి. RBI జాతీయ బ్యాంకులు, LIC, ప్రభుత్వ రంగ సంస్థల లాభాలు, డివిడెండ్లు అవుతాయి.

## 16.6. కేంద్ర ప్రభుత్వ రాబడి పోకడలు :

(Trends of Revenue of the Central Government)

కేంద్ర ప్రభుత్వ రాబడి పెరుగుచున్నది. జాతీయ ఆదాయము, తలసరి ఆదాయము పెరుగుచున్నందున ప్రభుత్వ రాబడి మార్గాలు కూడా పెరుగుతున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు ప్రభుత్వ రాబడి పెరుగుదల తక్కువగా వుండేది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ప్రభుత్వ వ్యయం బాగా పెరిగింది. ఫలితంగా ప్రభుత్వ రాబడి కూడా పెరిగింది. పాత పన్ను రేట్లను కూడా పెంచారు. నూతన పన్నులను విధించినారు. ఈ విధానం 2 వ ప్రపంచ యుద్ధం తరువాత కూడా కొనసాగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి.

రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల ఉమ్మడి రాబడిలో కేంద్ర ప్రభుత్వ వాటా పెరుగుతున్నది. 1953 - 54 లో మొత్తం రాబడిలో (అన్ని ప్రభుత్వాల) కేంద్ర ప్రభుత్వం వాటా 48%. 2000 - 01 నాటికి ఇది 64% కు పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వాల రాబడి కన్నా కేంద్ర ప్రభుత్వం రాబడి పెరగడమే దీనికి కారణం అంతే కాకుండా కేంద్రం విధించే ఆదాయ పన్ను, కార్పొరేట్ పన్ను, Excise duty మరియు కస్టమ్స్ డ్యూటీలు అధిక ఉత్పాదకతను సరళత్వాన్ని కలిగి ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వ పన్ను విధానంలో చెప్పుకోదగిన మార్పులు జరుగుతున్నప్పటికి వస్తువులపై (Commodities) విధింపబడే పన్నులు ప్రధాన పాత్రను పోషిస్తూనే వున్నాయి. వస్తువులపై పన్నులు ....................................

పరోక్ష పన్నులు మొత్తం రాబడిలో 62% ఆక్రమిస్తున్నాయి. ఈ మధ్యకాలం వరకు ఇది 84% గా వుండేది. 2003 - 04 లో ప్రత్యక్ష పన్నులు ఆదాయపు పన్ను ఆస్తి పన్ను మొత్తం రాబడిలో 38% సమకూరుస్తున్నాయి. పై విశ్లేషణను బట్టి కేంద్ర ప్రభుత్వం విధించే పన్నుల భారం పేద వర్గ ప్రజలు మధ్యతరగతి ప్రజలు అధికంగా భారం పడుతున్నదని తెలుస్తున్నది. ఇది ప్రభుత్వం ప్రకటించిన విధానానికి పూర్తిగా వ్యతిరేకము. ధనికులపై పన్నులు అధికంగా విధింపబడతాయని పేదవారిపై చాలా తక్కువగా విధించబడతాయని కేంద్రం ప్రకటించిన దానికి వాస్తవంలో వ్యతిరేకంగా జరుగుతున్నది.

వ్యక్తిగత ఆదాయపు పన్ను Customs duties, excise duties వరుసగా ప్రభుత్వానికి అధికంగా ఆదాయాన్ని సమకూర్చేవి. కానీ ప్రస్తుతం ప్రధమ స్థానం కేంద్ర excise సుంకాలది కాగా ద్వితీయం customs duties, తరువాత స్థానం వ్యక్తిగత పన్నులదిగా వున్నది.

ప్రస్తుతం పన్నేతర రాబడి కూడా పెరుగుతున్నది. 1950 - 51 లో ఇది రూ. 50 కోట్లు కాగా 2003 - 04 నాటికి రూ. 69, 170 కోట్లకు పెరుగుతుంది. 1950-51లో ఇది 12% కాగా ప్రస్తుతం ఇది 27% కు పెరిగింది. పన్నేతర రాబడిలో 60% కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు యిచ్చిన ఋణాలపై వడ్డీల ద్వారా లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు లాభాలను గాని ఆర్జించినట్లు అయితే ఇది కూడా ప్రభుత్వానికి అధిక రాబడి మార్గం అవుతుంది.

## 16.7. కేంద్ర ప్రభుత్వ వ్యయము :

Table - 9 కేంద్ర ప్రభుత్వ రాబడి వ్యయాన్ని (Revenue Expenditure) (For Selected years) తెలియజేస్తుంది.

Table - 9

కేంద్ర ప్రభుత్వ వ్యయము

| సంవత్సరం | రాబడి వ్యయం | మూలధన వ్యయం | మొత్తం వ్యయం |
|---|---|---|---|
| 1950 - 51 | 350 | 180 | 530 |
| 1980 - 81 | 14, 540 | 9, 630 | 24, 170 |
| 2001 - 02 | 3, 01, 610 | 60, 840 | 3, 62, 450 |
| 2003 - 04 | 3, 66, 230 | 72, 570 | 4, 38, 800 |

కేంద్ర ప్రభుత్వ రాబడి వ్యయంలో అత్యధికమైన పెరుగుదలను గమనించవచ్చు. ఇది పన్ను రాబడి, పన్నేతర రాబడినుంచే లభించిన ఆదాయంనుంచే ఖర్చు చేసారు.

1987 - 88 కి పూర్వం కేంద్ర ప్రభుత్వ రాబడి వ్యయాన్ని స్థూలంగా 3 రకాలుగా విభజించారు.

1. పరిపాలక వ్యయము (సాధారణ సేవలు, సాంఘిక సేవలు, సామాజిక సేవలు)
2. రక్షణ వ్యయము
3. రాష్ట్రాలకు కేంద్ర పాలిత ప్రదేశాలకు కేంద్రం యిచ్చే Grants- in-aid

ఆదే సమయంలో కేంద్ర ప్రభుత్వ వ్యయం 3 రకాలుగా వర్గీకరించబడింది.

1. అభివృద్ధి వ్యయం (Development of expenditure)
2. రక్షణ వ్యయం

3. ఇతర వ్యయాలు

కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి కొరకు, ఆర్థిక, సాంఘిక, సామాజిక సేవలపై చేసే వ్యయము రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలకు అభివృద్ధి కొరకు యిచ్చే grants - in - aid చేసే వ్యయాన్ని అభివృద్ధి వ్యయంగా పరిగణిస్తారు. రక్షణ శాఖపై చేసే వ్యయాన్ని పదవీ విరమణ చేసిన సైనికులకు చెల్లించే పెన్షన్ కలిపి "రక్షణ వ్యయం" గా పరిగణిస్తారు. పన్నులు, డ్యూటీలు (Duties) వసూలు కొరకు, పరిపాలన సేవలపై, వడ్డీ చెల్లింపులకు, పెన్షన్ మరియు పదవీ విరమణ కాలంలో వ్యక్తులకు చెల్లించవలసిన (Retirement - benefits) మొత్తములకు రాష్ట్రాలకు యిచ్చే గ్రాంట్లు ఇతర వ్యయాలుగా పరిగణించబడతాయి. రక్షణ వ్యయము, ఇతర వ్యయము (non - development - expenditure) అనుత్పాదత వ్యయాలు అవుతాయి.

## 16.8. కేంద్ర ప్రభుత్వ వ్యయము - నూతన వర్గీకరణ :

1987 - 88 Budget నుంచే కేంద్ర ప్రభుత్వం నూతన వర్గీకరణ అనుసరించింది. దీనిని అనుసరించి కేంద్ర ప్రభుత్వ వ్యయం 2 రకాలుగా విభజించబడుతుంది.

1. ప్రణాళిక వ్యయం
2. ప్రణాళికేతర వ్యయము

Table - 10

కేంద్ర ప్రభుత్వ మొత్తం వ్యయము (రాబడి మరియు మూలధన ఖాతాలు)

| | 1989 - 90 (Actual) | 2003 - 04 (Budget) |
|---|---|---|
| 1. ప్రణాళికేతర వ్యయము | 64, 500 | 3, 17, 820 |
| రాబడి ఖాతా | 52, 130 | 2, 89, 380 |
| మూలధన ఖాతా | 12, 370 | 28, 440 |
| 2. ప్రణాళిక వ్యయము | 28, 400 | 1, 20, 980 |
| రాబడి ఖాతా | 12, 070 | 76, 850 |
| మూలధన ఖాతా | 16, 330 | 44, 130 |
| మొత్తం వ్యయం | 92, 900 | 4, 38, 800 |

**16.8.2 ప్రణాళికేతర వ్యయం :** దీనిని 2 రకాలుగా విభజించవచ్చు.

1. రాబడి వ్యయము (Revenue exp.)
2. మూలధన వ్యయము (capital exp.)

**16.8.3** ప్రణాళికేతర రాబడి వ్యయం : వడ్డీ చెల్లింపులు, రక్షణ రాబడి వ్యయం ప్రధాన సబ్సిడీలు (ఆహారం, ఎరువులు మరియు ఎగుమతి ప్రోత్సాహకాలు - export promotion). వడ్డీ మరియు ఇతర సబ్సిడీలు, వ్యవసాయదారులకు రుణాల మాఫీ, తపాలా లోటు, పోలీస్, పెన్షన్లు, ఇతర సాధారణ సేవలు రాష్ట్రాలు (organs of state). పన్ను వసూలు, extermal affairs (విదేశీ వ్యవహారాలు) మొ॥వి. ఆర్థిక సేవలు (వ్యవసాయం పరిశ్రమలు, విద్యుత్ (power) రవాణా, సమాచార సైన్సు మరియు సాంకేతిక విజ్ఞానం మొ॥వి). రాష్ట్రాలకు కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇచ్చే గ్రాంట్లు, విదేశీ ప్రభుత్వాలకు చెల్లించే గ్రాంట్లు మొ॥వి రాబడి వ్యయంగా పరిగణించబడతాయి.

16.8.4 ప్రణాళికేతర మూలదన వ్యయము : (cap. non plan exp.) రక్షణ మూలధన వ్యయము ప్రభుత్వ రంగ సంస్థలకు యిచ్చే రుణాలు, రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రదేశాలకు చెల్లించే రుణాలు విదేశీ ప్రభుత్వాలకు చెల్లించే రుణాలు ప్రణాళికేతర మూలధన వ్యయంగా పరిగణించబడతాయి.

Table - 10 ననుసరించి రాబడి, మూలధన ఖాతాలలో ప్రణాళికేతర వ్యయం 1989 - 90 లో రూ. 64, 500 కోట్ల నుంచి 2003 - 04 (Budget) నాటికి రూ. 317, 820 కోట్లకు అనగా 5 రెట్లు పెరిగింది.

16.8.5 ప్రణాళికా వ్యయము (Plan expenditure) : కేంద్ర ప్రభుత్వ రెండవ అతి పెద్ద వ్యయం ప్రణాళిక వ్యయం దీనిలో క్రింది అంశాలు వుంటాయి.

a) కేంద్ర ప్రణాళికలు : వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి irrigation వరదల నియంత్రణ, శక్తి (energy), పరిశ్రమలు మరియు minerals, రవాణా, సమాచార, Science & technology మరియు పర్యావరణ, సాంఘిక సేవలు మరియు ఇతరములు.

b) రాష్ట్రాల కేంద్ర పాలిత ప్రదేశాల ప్రణాళికల అమలుకు కేంద్ర ప్రభుత్వ సహాయం Table - 10 ని అనుసరించి ప్రణాళిక వ్యయము, 1989 - 90 లో రూ. 28, 400 కోట్లు కాగా 2003 - 04 (Budget) నాటికి రూ. 120, 980 కోట్లకు అనగా 4 రెట్లు పెరిగింది.

## 16.9. మూలధన వ్యయము మరియు మూలధన రాబడి :

(Capital Expenditure and capital Receipts)

మూలధన రాబడి నుండి లభించిన ఆదాయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రణాళికేతర వ్యయాలపై ఖర్చు చేస్తుంది.

కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం క్రింది అంశాలను కలిగి వుంటుంది.

a) రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ప్రణాళిక లక్ష్యాలను సాధించటానికి యిచ్చే (loans)) ఋణాలు, మరియు విదేశీ ప్రభుత్వాలకిచ్చే ఋణాలు

b) ఆర్థికాభివృద్ధి

c) సాంఘిక మరియు సామాజిక అభివృద్ధి

d) రక్షణ

e) సాధారణ సేవలు

కేంద్ర ప్రభుత్వ మూలధన రాబడి క్రింది అంశాల నుండి లభిస్తుంది.

a) రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాలు మరియు ప్రభుత్వ రంగ సంస్థలకిచ్చిన ఋణాలు (loans) నికర వసూళ్ళు

b) మార్కెట్ నికర వసూళ్ళు borrowings) (i.e gross borrowings less repayments)

c) నికర చిన్న పొదుపు మొత్తాలు (Gross small savings less states share)

d) ప్రావిడెంట్ ఫండ్ ప్రత్యేక డిపాజిట్లు మొ॥వి.

## 16.10. కేంద్ర ప్రభుత్వ వ్యయ తీరుతెన్నులు (పోకడలు) :

(Trends in Expenditure of the central Government). అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రభుత్వ వ్యయాలు కొన్ని ప్రత్యేకమైన పోకడలను కలిగి వుంటాయి. భారత దేశ ప్రభుత్వ వ్యయంలో కూడా ఈ పోకడలు ప్రస్ఫుటమవుతున్నాయి. భారత ప్రభుత్వ వ్యయం విపరీతంగా పెరుగుతున్నది. ప్రత్యేకించి ప్రణాళిక కాలంలో ఈ పెరుగుదల అధికంగా వున్నది. రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం భారత దేశంలో ప్రణాళికలు లేవు. సంక్షేమ రాజ్యాన్ని స్థాపించవలెనన్న లక్ష్యమూ లేదు. కనుక ప్రణాళిక కాలానికి ముందు ప్రభుత్వ వ్యయం తక్కువగా వుండేది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో యుద్ధ అవసరాల కొరకు ప్రభుత్వ వ్యయం పెంచబడింది. యుద్ధానంతరం ప్రణాళికల

అమలు ప్రారంభం అయింది. సంక్షేమ రాజ్యానికి ప్రాధాన్యత పెరిగింది. రాష్ట్రాలు, కేంద్రం కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చాయి. ఫలితంగా కేంద్రం రాష్ట్రాలు స్థాయిలో కూడా ప్రభుత్వ వ్యయం విపరీతంగా పెరిగింది. ప్రభుత్వ వ్యయం పరిధి కూడా పెరిగింది. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ ప్రభుత్వం కేవలం రక్షణ, పరిపాలనపై మాత్రమే వ్యయం చేసేది. కనుక ప్రభుత్వ వ్యయాలు అధిక భాగాన్ని వీటిపై హెచ్చించబడేది. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం ఆర్థిక కార్యకలాపాలలో అధికంగా జోక్యం చేసుకుంటున్నది. ఫలితంగా మొత్తం వ్యయంలో అభివృద్ధి వ్యయం (Development expenditure) భాగం పెరిగింది.

భారతదేశ రక్షణకు ముప్పు పొంచివుందన్న వుద్దేశంతో రక్షణ వ్యయాన్ని పెంచింది.

1. Table - 9 అనుసరించి ప్రభుత్వ వ్యయంలో మొదటి పెద్ద మార్పు రాబడి వ్యయం పెరుగుతూవుండటం. 1950 - 51 లో రూ. 350 కోట్లు వున్న ప్రభుత్వ రాబడి వ్యయం 2003 - 04 (budget) నాటికి రూ. 366, 230 కోట్లకు పెరిగింది. దీనికి కారణాలు:

a) రక్షణ వ్యయం పెరుగుదల

b) పరిపాలక వ్యవస్థ, వ్యయం పెరగటం

c) ప్రజాస్వామ్య వ్యవస్థల నిర్వహణ వ్యయం పెరుగుట

d) విదేశాలకు సహాయం

e) విద్య, వైద్య మొదలగు సాంఘిక సేవలలో ప్రభుత్వ జోక్యం పెరగటం

f) ధరల పెరుగుదల

2) మొత్తం వ్యయంలో అనుత్పాదత వ్యయం (non - Dev. Expenditure) భాగం పెరుగుతూనే వున్నది. రక్షణ వ్యయం, రుణాల చెల్లింపులు మరియు పరిపాలన వ్యయాలు విపరీతంగా పెరుగుతుండటమే దీనికి ప్రధాన కారణం.

3) ఆధునిక కాలంలో ప్రణాళికేతర వ్యయం (non - plan Expenditure) కూడా చాలా త్వరగా పెరుగుతూ వున్నది. 1980 సం॥ కాలంలో ప్రణాళికేతర వ్యయం సాలీనా రూ. 5, 000 కోట్లు కాగా 1990 నాటికి ఇది సాలీనా రూ. 10,000 కోట్ల నుండి రూ. 12, 000 కోట్లకు కు పెరిగింది. ప్రణాళికేతర వ్యయంలో 70% వరకు వడ్డీ చెల్లింపులు, రక్షణ వ్యయం సబ్సిడీలు మరియు సాధారణ సేవలు ఆక్రమిస్తున్నాయి.

వీటి పెరుగుదలను అదుపులో వుంచ అవకాశం లేకపోవడం బాధకరమైన విషయం. ఉదాహరణ :

a) ప్రభుత్వ రుణం నిరంతరం పెరుగుతూ వుండటం వల్ల కాలం గడిచే కొలది ప్రభుత్వం చెల్లించవలసిన వడ్డీ పెరుగుతున్నది. 1986 - 87 లో రూ. 9, 250 కోట్లు గా వున్న వడ్డీ చెల్లింపులు 1990 - 91 లో ఇది 21, 500 కోట్లకు, 2003 - 04 (budget) లో రూ. 123, 220 కోట్లకు పెరిగింది.

b) హిందూ మహాసముద్రంలోను కాశ్మీర్‌లోను వుద్రిక్తత ఎక్కువ అయినందున రక్షణ వ్యయం అత్యధికంగా పెరిగింది. రక్షణ శాఖలో అధునాతన ఆయుధాలను వుపయోగించడం వలన కూడా రక్షణ వ్యయం పెరిగింది. 1991 - 2004 మధ్య రాబడి ఖాతాలో రక్షణ వ్యయం రూ. 10, 870 కోట్లు నుండి రూ. 44, 350 కోట్లకు పెరిగింది.

c) ఆహారం, ఎరువులు, ఎగుమతులును ప్రోత్సహించటానికి ఇచ్చే సబ్సిడీలు కేంద్ర ప్రభుత్వ వ్యయంలో ముఖ్యమైన భాగమయినాయి. సబ్సిడీలను తొలగిస్తామని ప్రభుత్వం ప్రకటించిన ప్రతి సం॥ సబ్సిడీలు పెరుగుతూనే వున్నాయి. వడ్డీలు మరియు ఇతర సబ్సిడీలను మైనర్ సబ్సిడీలుగా పరిగణిస్తారు. 1985 - 86 లో రూ. 4, 900 కోట్లగా వున్న మొత్తం సబ్సిడీలు 1990 - 91 నాటికి రూ. 12, 160 కోట్లకు, 2003 - 04 (Budget) నాటికి రూ. 49, 900 కోట్లకు పెరిగింది.

d) సాధారణ సేవలపై కూడా కేంద్ర ప్రభుత్వ వ్యయం పెరుగుతున్నది. ఉదాహరణ : రాష్ట్ర శాఖలపై వ్యయం, పోలీస్, వేతన పెంపుదల, పెన్షన్ పెరుగుదల కరువు భత్యం పెరుగుదల మొ॥వి. ప్రతి సం॥ పెరుగుతున్నందువలన ప్రభుత వ్యయం పెరుగుతున్నది. అయితే పరిపాలన కొరకు చేసే వ్యయం విపరీతంగా (tremendous) పెరగడం గమనించదగ్గ విషయం. ఈ క్రింది Table ను పరిశీలిస్తే ఆ విషయం అర్థం అవుతుంది.

Table - 11

ప్రణాళికేతర రాబడి వ్యయం

| | 1985 - 86 (Actual) | 1990 - 91 (Actual) | 2003 - 04 (Budget) |
|---|---|---|---|
| 1. వడ్డీ చెల్లింపులు | 7, 500 | 21, 500 | 1, 23, 220 |
| 2. రక్షణ | 7, 000 | 10, 870 | 44, 350 |
| 3. మొత్తం సబ్సిడీలు | 4, 900 | 12, 160 | 49, 900 |
| 4. సాధారణ సేవలు | 2, 060 | 6, 850 | 34, 750 |
| మొత్తం | 24, 460 | 51, 380 | 2, 52, 220 |

ఇంతకు ముందు పేర్కొన్నట్లు ప్రణాళికేతర వ్యయంలో పైన పేర్కొన్న 4 అంశాలే 70% న్ని ఆక్రమిస్తున్నాయి. దీనిని సమర్ధవంతంగా నియంత్రించకపోయినట్లు అయితే కేంద్రం లోటును భర్తీ చేసుకొను రుణాలను పెంచుకుంటూపోతాయి. చివరకు అప్పుల ఊబిలో (debt trap) కూరుకుపోతుంది.

4) 1950 - 51 నుండి ప్రభుత్వం ఆర్ధికాభివృద్ధికి, సంక్షేమ రాజ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నప్పటికి, గత కొద్ది సంవత్సరాల క్రితం వరకు? ప్రభుత్వ వ్యయం అత్యధిక భాగాన్ని ఆక్రమించిన ఒకే ఒక రంగం : రక్షణ రంగం

**ఉదాహరణ :** 1950 - 51 లో రూ. 160 కోట్లు గా వున్న రక్షణ వ్యయం 2003 - 04 (Budget) నాటికి రూ. 65, 300 కోట్లకు పెరిగింది. ఎట్టకేలకు 1950 - 51 సం॥ లో మొత్తం వ్యయంలో 47% గా వున్న రక్షణ వ్యయాన్ని 2003 - 04 బడ్జెట్ నాటికి 12% నికి తగ్గించారు.

5) ప్రస్తుతం ప్రభుత్వ వ్యయంలో అత్యధికంగా వున్న ఏకైక అంశం వడ్డీ చెల్లింపులు, రూ. 1, 23, 220 కోట్లు ప్రభుత్వం అధికంగా అప్పులు చేయడమే దీనికి ప్రధాన కారణం. 1950 - 51 లో మొత్తం రాబడి వ్యయంలో 11% గా వున్న వడ్డీ చెల్లింపులు 1985 - 86 నాటికి 23% నికి 2003 - 04 నాటికి 34% నికి పెరిగాయి. అప్పులకు సంబంధించి అంశాలన్ని అనుత్పాదక వ్యయం క్రిందకు వచ్చినా, ఆర్ధికాభివృద్ధిపై వీటి ప్రభావాన్ని పరిగణనలోనికి తీసుకోవలసి వుంటుంది. 1950 - 51 నుండి ఆర్థిక ప్రణాళికల అమలు ప్రారంభం అయినప్పటినుండి ప్రభుత్వం స్వదేశీ, విదేశాల నుండి ప్రణాళికల అమలు కొరకు వపరీతముగా రుణాలు చేస్తున్నది. గత 10 సంవత్సరాల కాలం వరకు ఇది కొనసాగింది. అప్పటినుండి ప్రస్తుత రాబడి వ్యయం కొరకు కూడా అప్పులు చెయ్యవలసిన పరిస్థితి ఏర్పడింది. 1950 - 55 లో రూ. 2, 860 కోట్లుగా వున్నా ప్రభుత్వ అప్పులు 2004 March చివరికి రూ. 15, 12, 470 కోట్లకు పెరిగింది. ఈ అప్పుల సద్వినియోగం కూడా కావడం లేదనేది వాస్తవం.

## 16.11. ముగింపు :

1950 - 51 నుండి కేంద్ర ప్రభుత్వ వ్యయం ప్రధానంగా 2 అంశాల చేత ప్రభావితం అవుతున్నది.

1. దేశ ఆర్ధికాభివృద్ధి త్వరితగతిన జరిగేందుకు కృషి చెయ్యడం.
2. విదేశీ దాడులనుండి దేశాన్ని కాపాడుకోవడం కొరకు నిత్యం సన్నద్ధంగా ఉండటం

అయితే, అభివృద్ధి, రక్షణ విభిన్న మార్గాలు ఒకేసారి రెండింటికీ నిధులు సమకూర్చడం సాధ్యం కాదు. భారత దేశం పరిమితమైన వనరులను చాలా వరకు రక్షణ అవసరాలకు తరలించినందున అభివృద్ధి కుంటు పడింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు, సాధారణ పరిపాలక వ్యయ భారంలో బాధపడుచున్నది.

## 16.12. స్వీయ అవగాహన ప్రశ్నలు :

1. భారత ప్రభుత్వ బడ్జెట్ పోకడలను వివరింపుము ?
2. భారత దేశ ఆదాయ మార్గాలను విశ్లేషించుము ?
3. భారత ప్రభుత్వ వ్యయ పెరుగుదలకు గల కారణములను వ్రాయుము ?
4. కేంద్ర ప్రభుత్వ వ్యయ పెరుగుదల ధోరణులను వివరింపుము ?
5. కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పన్నుల విధానమును వ్రాయుము ?
6. పరోక్ష పన్నులు భారత ప్రభుత్వ ఆదాయంలో ముఖ్యమైనవి - వివరింపుము ?
7. భారత దేశం ఋణాల ఊబిలో చిక్కుకుపోవడానికి కారణాలను వ్రాయుము ?
8. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ విధానము సంక్షేమ రాజ్య స్థాపనకు దోహదకారి అవుతున్నది దీనితో నీవు అంగీకరింతువా ?

## 16.13. చదవవలసిన గ్రంథాలు :


1. B. P. TYAGI : Public Finance
2. K. K. Sharma : Public Finance
3. RBI, Report on Currency & Finance 2000 - 01 (Vol. I & II)
4. Ministry of Finance - Speeh of Jaswant Singh, Minister of Finance Presenting Central Government Budget for 2003 - 04 Part A & B, 28th Feb, 2003.
5. RBI (2003), State Finance A study of Budgets of (2002 - 03)
6. Government of India, Memorandum explaining the Provisions in the Finance (No : 2) Bill, 2003.
7. Government of India, Budget at a Glance in India.
8. Mimistry of Finance (2002), Report of the task Force on Indirect Taxes, Ministry of Finance (2002), Report of the task Force on Indirect taxes.


ఆచార్య జి. చంద్రశేఖరరావు

**(DEC 03)**

M.A. DEGREE EXAMINATION, MAY 2011.

First Year

Economics

Paper III — GOVERNMENT FINANCE

Time : Three hours        **Maximum : 100 marks**

Answer any FIVE of the **following.**

1. Discuss the nature and scope of public finance.

   ప్రభుత్వ విత్తము స్వభావము, పరిధిలను చర్చించుము.

2. What are the failures of government in economic development?

   ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వ వైఫల్యాలు ఏమి?

3. Discuss the significance of public sector in a mixed economy.

   మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగము యొక్క ప్రాముఖ్యతను చర్చించుము.

4. Explain the impact of taxes on the economy.

   ఆర్థిక వ్యవస్థ మీద పన్నుల ప్రభావాన్ని వివరించుము.

5. Classify public expenditure and state its effects on wealth.

ప్రభుత్వ వ్యయాన్ని వర్గీకరించి, దాని ప్రభావాన్ని సంపద మీద తెలుపుము.

6. Describe the relationship between public debt and economic development.

ప్రభుత్వ ఋణము మరియు ఆర్థికాభివృద్ధిల మధ్య సంబంధాన్ని వివరించుము.

7. Explain the instruments employed in the budgetary policy.

బడ్జెట్ విధానములో వినియోగించే సాధనాలను వివరించుము.

8. Critically evaluate the fiscal policy in a developing economy.

అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో కోశ విధానాన్ని విమర్శనాత్మకంగా మదింపుచేయండి.

9. Bring out the working of finance commissions in India.

భారతదేశములో విత్త సంఘాల పనితీరును తెలుపుము.

10. State the finances of local bodies.

స్థానిక సంస్థల విత్త పటిష్టతను తెలుపుము.

---

(DEC 03)

M.A. (Previous) DEGREE EXAMINATION,
DECEMBER 2010.

First Year

Economics

Paper III — GOVERNMENT FINANCE

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE of the following.

All questions carry equal marks.

1. Discuss the canons of taxation.

పన్ను నియమాలను చర్చించుము.

2. Analyze the importance of Public Choice in Democratic Governments.

ప్రజాస్వామ్య ప్రభుత్వంలో "పబ్లిక్ చాయిస్" యొక్క ప్రాముఖ్యతను వివరించుము.

3. What are the characteristics of good tax system?

మంచి పన్ను విధానం యొక్క లక్షణాలను వివరించుము.

4. Describe the Wagner's law of increasing the state activities.

వాగ్నర్ సిద్ధాంతపైన పెరుగుచున్న రాష్ట్ర కార్యక్రమాలను తెల్పుము.

5. What are the financial resources divided between Centre and State in federal structure?

సమాఖ్య నిర్మాణంలో కేంద్ర-రాష్ట్రాల మధ్య విత్తవనరుల విభజన లెవ్వి?

6. What are the reasons for increase in state expenditure in recent times?

ఈమధ్య కాలంలో రాష్ట్ర వ్యయం పెరుగుటకు గల కారణాలను వివరింపుము.

7. What are the objectives of fiscal policy in a developing country?

అభివృద్ధి చెందుతున్న దేశాలలో కోశ విధాన ధ్యేయాలను చర్చించుము.

8. Define Public Debt. Analyze the reasons to increase the public debt.

ప్రభుత్వ ఋణంను నిర్వచించి, దాని పెరుగుదలకు గల కారణాలను విశదీకరింపుము.

9. What are the problems of Local Governments? Suggest measures to improve financial resources.

స్థానిక సంస్థల సమస్యలను వివరించి, విత్త వనరులను అభివృద్ధి పరచుటకు తగిన సలహాలను సూచించుము.

10. Review the recommendations of latest finance commission of India.

ఇటీవల ఫైనాన్స్ కమిషన్ యొక్క సిఫార్సులను సమీక్షించుము.

**(DEC 03)**

M.A. (Previous) DEGREE EXAMINATION, JUNE 2010.

First Year

Economics

Paper III — GOVERNMENT FINANCE

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE of the following.

All questions carry equal marks.

1. What is Public Finance? Explain its importance to the Modern World.

   ప్రభుత్వ విత్తం అనగా నేమి? ఆధునిక ప్రపంచంలో దీని ప్రాముఖ్యతను తెల్పుము.

2. Explain the principle of Maximum Social Advantage. What are its limitations?

   గరిష్ఠ సాంఘిక ప్రయోజన సూత్రమును తెల్పి, దాని పరిమితులను వ్రాయుము.

3. **Explain Adam Smith's Canons of Taxation. What additions have been made to these canons in recent years?**

   ఆడమ్‌స్మిత్ తెల్పిన పన్ను సూత్రమును వ్రాసి, ఇటీవల కాలంలో జరిగిన మార్పులు వ్రాయుము.

4. What are the effects of Public Expenditure on Productive and Distribution of Wealth?

   సంపద, ఉత్పత్తి పంపిణీలపై ప్రభుత్వ వ్యయ ప్రభావాలను తెల్పుము.

5. Should public expenditure be at its minimum or maximum?

ప్రభుత్వ వ్యయం కనిష్ఠంగా వుండాలా? లేదా గరిష్ఠంగా వుండాలా?

6. What do you understand by Federal Finance? Briefly point out guiding principles of Federal Finance.

ఫెడరల్ విత్తం అనగా నేమి? ఫెడరల్ విత్తానికి మార్గ దర్శకాలెవ్వి?

7. Discuss the effectiveness of Fiscal Policy for Economic Stability under different situations.

వివిధ పరిస్థితులలో ఆర్థిక స్థిరీకరణకు కోశవిధాన పాత్రను చర్చించుము.

8. Discuss the present Budgetary Policy of Central and State Governments. What are its consequence?

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత బడ్జెట్ విధానమును తెల్పి దాని పర్యవసానాలను తెల్పుము?

9. Explain critically the Central and State Financial Relations in India.

భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాలను విమర్శనాత్మకంగా వ్రాయుము.

10. Write a note on zero based budget.

సున్నా ఆధార బడ్జెట్‌పై వ్యాఖ్యానము చేయుము.

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - **522 510.**

| Course | Year | Paper No. &Title |
|---|---|---|
| M.A. Economics | 1st Year | Paper - III: Government Finance |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)